# తెలుగు సాహిత్యం - చారిత్రక విమర్శ


పరిశోధన

**వెంకట రామయ్య గంపా**

పర్యవేక్షణ

**ఆచార్య జి. అరుణ కుమారి**


**తెలుగులో పిహెచ్.డి. పట్టా కోసం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖకు**

**సమర్పించిన సిద్ధాంత గ్రంథం**


**2011**

# Telugu Sāhityaṃ - Cāritraka Vimarśa

*A Thesis Submitted in Partial Fulfilment of the Requirements for the Award of the Degree of*

**DOCTOR OF PHILOSOPHY**
**IN**
**TELUGU**

**By**
**VENKATA RAMAIAH GAMPA**

**Research Supervisor**
**Prof. G. ARUNA KUMARI**

**Department of Telugu**
**University of Hyderabad**
**Hyderabad**
**2011**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500046

Date:

# CERTIFICATE

This is to certify that I VENKATA RAMAIAH GAMPA have carried out this research embodied in the present thesis for the full period prescribed under Ph.D. ordinance of the University of Hyderabad. My topic of the Ph.D. Programme is

**Telugu Sāhityaṃ - Cāritraka Vimarśa.**

I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the award of any research degree of any University or Institution.

Venkata Ramaiah Gampa
Regd.No. 05HTPH04

Prof. G. Aruna Kumari
Research Supervisor

Head
Department of Telugu

Dean
School of Humanities
University of Hyderabad

# కృతజ్ఞతలు

అమ్మకు...

తెలుగు ప్రాంతానికి దూరంగా ఉండటం వల్ల పరిశోధనకు అవసరమైన తెలుగు పుస్తకాలు లభించక నా పరిశోధన ఏమవుతుందో, ఎటుపోతుందో అనుకుంటున్న సమయంలో నా పరిశోధనను ఒక క్రమపద్ధతిలోకి తీసుకొచ్చి, అవసరమైన పుస్తకాలనిచ్చి, పరిశోధన పూర్తి కావడానికి కారకులైన గురువులు ఆచార్య జి. అరుణ కుమారిగారికి...

తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య నడుపల్లి శ్రీరామరాజుగారికి, పరిశోధనకు సలహాలు ఇచ్చి, పరిశోధనా మార్గాన్ని చూపిన గురువులు ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల గారికి, పాఠాలు చెప్పడంతో పాటు విమర్శ మీద ఆసక్తి ఏర్పడటానికి కారకులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారికి, పరిశోధనకు విలువైన సలహాలు, సూచనలు చేసిన ఆచార్య పరిమి రామనరసింహంగారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య రామకృష్ణశాస్త్రిగారికి, ఆచార్య చేకూరి రామారావుగారికి, ఆచార్య యస్వీ రామారావుగారికి...

జీవితపాఠాలు నేర్పిన గురువులు డా॥పిల్లలమర్రి రాములుగారికి...

ఇతర అధ్యాపకులు డా॥ దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా॥పమ్మి పవన్ కుమార్ గారికి, డా॥ డి. విజయలక్ష్మిగారికి, డా॥భుజంగరెడ్డిగారికి, డా॥ అద్దంకి శ్రీనివాస్ గారికి, డా॥ విజయ కుమారి గారికి...

జీవితానికి ఒక మార్గం చూపిన గురువులు గంగాధర్ గారికి, ఆచార్య సంపత్ కుమార్ టాండన్ గారికి, ఆచార్య దీపక్ పెంటాల్ గారికి, ఆచార్య పర్వతనేని సుబ్బారావుగారికి, ఆచార్య భక్తవత్సల రెడ్డిగారికి, ఆచార్య శమంతకమణి గారికి, ఆచార్య నందితాబసుగారికీ, ఆచార్య ప్రకాష్ పట్నాయక్ గారికి...

ఆచార్య పగడాల చంద్రశేఖర్‌గారికి, డా॥ అమితవ చక్రవర్తిగారికి...

ఈ పరిశోధన పూర్తికావడానికి అవసరమైన పుస్తకాలను ఇచ్చి, పరిశోధన పూర్తికావడానికి కారకులు ఆచార్య సుశీల గారికి...

పుల్లయ్య సార్‌కు, శ్రీనన్నకు, సత్యనారాయణ రాజు గారికి...

పరిశోధనకు అవసరమైన పుస్తకాలను చూసుకోవడానికి అనుమతినిచ్చిన ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ గ్రంథాలయం వారికి, తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయంవారికి, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రంథాలయ సిబ్బంది గాజుల వెంకటనాగయ్యగారికి, ఢిల్లీ విశ్వవిద్యాలయ గ్రంథాలయం వారికి...

పలు పుస్తకాలను ఇచ్చి పరిశోధనకు సహాయపడిన డా. వి. నారాయణప్పగారికి, డా. పత్తిపాక మోహన్ గారికి, మిత్రులు శివామాంకు, డా. భూక్యా తిరుపతికి, కాంతి కిరణ్‌కు, భిక్షపతి, S.రెడ్డి, మహేందర్, మోహనన్న, LRK, రాజీవ్, రేవతికి, ఉమాకు, సత్యశ్రీకి...

పరిశోధనా కాలంలో ఉపకార వేతనాన్ని ఇచ్చిన యు.జి.సి. వారికి...

మాన్యశ్రీకి, వెంకటగణేష్‌కుమార్, మన్విత, రాజారాం, రామలక్ష్మి, లక్ష్మిదేవి, బావకు...

ఈ పుస్తకాన్ని టైపు చేసిన స్నేహితురాలు శిరీషకు...

తెలుగుశాఖ అధ్యాపకేతర సిబ్బంది శ్రీ విష్ణువర్ధన్ రెడ్డిగారికి, శ్రీ పరమేశ్వర్‌గారికి, శ్రీ శ్రీధరన్ గారికి, శ్రీ కిషన్ గారికి...

పరిశోధన పూర్తికావడానికి సహకరించిన వారందరికి పేరుపేరునా...

**కృతజ్ఞతలు**

**వెంకట రామయ్య**

# ముందుమాట

పరిశోధనకు సంబంధించిన విషయాలను ముందుమాటలో చెప్పడం అనేది సహజం. కాబట్టి ఇక్కడ నేను కూడా నా పరిశోధనా విషయాన్ని చెప్పదలుచుకున్నాను. సాహిత్యంలో కూడా కొందరి పరిచయాలు కొన్ని సాహిత్యాభిరుచులు ఏర్పడటానికి కారణమవుతాయి. అలా సాహిత్యంలో గురువులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య యస్వీ రామారావు గారు చెప్పిన పాఠాలు విమర్శ మీద ఆసక్తిని పెంచాయి. దీంతో పరిశోధన చేస్తే విమర్శ మీదనే చేయాలనే బలమైన కోరిక కలిగింది. నా ఆసక్తిని పర్యవేక్షక గురువులు ఆచార్య అరుణకుమారి గారికి చెప్పి, తగిన పరిశోధనాంశం కోసం చాలా రోజులు  చర్చించాను. చర్చల్లో నాకు చరిత్ర మీద ఉన్న అవగాహన, ఆసక్తిని వారు గమనించారు. అప్పటికే  ఆచార్య అరుణ కుమారిగారు చరిత్రను బోధించి ఉన్నారు. దీంతో చరిత్రకు, సాహిత్యానికి సంబంధించిన విషయం మీద పరిశోధన చేయమని సలహా ఇచ్చారు. కానీ ఈ అంశం పరిశోధనా పరిమితిని మించిపోతుందేమోననే సందేహం ఉండనే ఉంది. ఈ అంశం గురించి ఆచార్య కె.కె. రంగనాథాచార్యులగారితో ప్రస్తావించాను. వారి సలహాలు, సూచనలు తీసుకొని, వారు రచించిన/సంపాదకత్వం వహించిన పుస్తకాలను చదివాను. ఆ పుస్తకాలు తక్కిన ఆలంకారిక విమర్శకు భిన్నంగా ఉన్నాయి. పలు విధాలుగా ఆలోచించి చివరికి *'తెలుగు సాహిత్యం-చారిత్రక విమర్శ'* అనే అంశాన్ని తీసుకొన్నాను.  మొదట ఈ అంశానికి సంబంధించి ఒక కాలానికి మాత్రమే పరిమితం చేసుకోవాలనుకున్నాను. కానీ, ఇప్పటివరకు చారిత్రక విమర్శ మీద ఎక్కువ పరిశోధనలు జరగనేలేదు. కాబట్టి చారిత్రక విమర్శను పరిచయం చేయటంతో పాటు తెలుగు సాహిత్యం మొత్తాన్ని మరొక కొత్త కోణం నుంచి ఆలోచించి పరిశీలించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనిపించింది. ఆ ఉద్దేశంతోనే *'తెలుగు సాహిత్యం- చారిత్రక విమర్శ'* అనే ఈ పరిశోధనాంశాన్ని ఎన్నుకొన్నాను. అలా గురువులు ఆచార్య అరుణ కుమారిగారికి నాకు మధ్య జరిగిన

చర్చల ఫలితమే ఈ పరిశోధనాంశం.

ఇక పరిశోధనకు సంబంధించిన వివరాలను, పరిశోధనా పరిధిని మొదటి అధ్యాయం ప్రారంభంలో చెప్పడం వలన ఇక్కడ తిరిగి చెప్పదలుచుకోలేదు. అయితే పరిశోధనాంశంలో ముఖ్య విషయం అధ్యాయాల విభజన. ఈ విభజనలో కవి రచించిన రచనా కాలాన్ని బట్టికాక రచనా వస్తువును బట్టి అధ్యాయాల్ని విభజించాను. దీని వల్ల కొన్ని చిక్కులున్నప్పటికీ పరిశోధనా సౌలభ్యం కోసం ఇలా చేయక తప్పలేదు. అందువల్ల కొన్నిచోట్ల కొందరు కవులు పునరావృతమైనారు. వారి రచనలు కూడా కాలక్రమానుగుణంగా లేవు. ఉదాహరణకు భారత రచన చారిత్రక నేపథ్యాన్ని వివరించేటపుడు తిక్కన గురించి చర్చించాను. అట్లే మరొక అధ్యాయంలో వైష్ణవసాహిత్యంలో కూడా నిర్వచనోత్తర రామాయణాన్ని గురించిన చర్చ వచ్చింది. ఆ సందర్భంలో తిక్కన గురించి మరోసారి చర్చించవలసి వచ్చింది. కాలక్రమం ప్రకారం నిర్వచనోత్తర రామాయణం ముందువచ్చి, ఆంధ్రమహాభారతం తర్వాత రావాలి. ఇది సాహిత్య చరిత్ర పరంగా సరైంది. కాని ఇక్కడ అధ్యాయాల విభజనలో నా పరిశోధనా సౌలభ్యం కోసం మార్పులు చేసుకొన్నాను. ఒక అధ్యాయంలో తిక్కన భారతాన్ని చర్చించి మరో అధ్యాయంలో నిర్వచనోత్తర రామాయణాన్ని చర్చించాను. దీనికి కారణం ఆంధ్ర మహాభారతాన్ని చర్చించేటప్పుడు కవిత్రయం రచించిన భారతాన్ని ఒక చోట చేర్చి విశ్లేషించాను. కాబట్టి అక్కడ నన్నయ భారతాన్ని గురించి చెప్పిన తర్వాత కొనసాగింపుగా తిక్కన గురించి, అతను రచించిన ఆంధ్రమహాభారతాన్ని గురించిన చర్చ వచ్చింది. ఇదే విధానాన్ని ఎఱ్రనకు పాటించాను. కవుల పేరు పునరావృతమైనప్పటికీ రచనా కాలానికి, వారి రచనా వస్తువుకు గల చారిత్రక నేపథ్యం మారుతూ ఉంటుంది. తర్వాత అధ్యాయాల విభజన కూడా అలాగే కొనసాగింది. భారత వస్తువును తీసికొని నన్నయ ప్రారంభించిన తర్వాత వెలువడిన సాహిత్య వస్తువు శైవ సాహిత్యం. తరువాత ప్రారంభమైంది వైష్ణవేతివృత్తాలు. ఇక్కడ కేవలం అధ్యాయ విభజన సౌలభ్యం కోసం మాత్రమే ఇలా చేశాను. అదే విధంగా ఆధునిక సాహిత్య ఉద్యమాలు కూడా ఉద్యమ నేపథ్య తీరును/విధానాన్ని బట్టి అధ్యాయ విభజన చేశాను.

కాలక్రమానుగుణంగా ఏర్పడిన సాహిత్య ఉద్యమాలను నా అధ్యయన సౌలభ్యం కోసం రెండు విధాలుగా విభజించాను. అవి ఒకటి పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించి స్థానిక పరిస్థితులకు అనుకూలంగా మారిన ఉద్యమ సాహిత్యం కాగా, కేవలం దేశీయ పరిస్థితుల ప్రభావంతో సాహిత్య ఉద్యమాలుగా రూపొందిన సాహిత్యం మరొకటి.

ఇక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు వచ్చాయి. స్థూలంగా చూస్తే దండకాలు, శతకాలు, వీధినాటకాలు, సంస్కృత నాటక పరివర్తనాలు, ద్విపదలు, మంజరీ ద్విపదలు, వీరకథాకావ్యాలు, శృంగార కథాకావ్యాలు మొదలైనవి కనిపిస్తున్నాయి. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే కొన్ని సమాన లక్షణాలున్న సాహిత్య రచనలూ ఉన్నాయి. వాటిని సందేశాత్మకం, సమాజహితం, మతపరమైనవిగా విభజించుకోవచ్చు. సాహిత్యాన్ని ఎక్కువగా ప్రభావితం చేసిన అంశం మతం. అధికశాతం కవులు ఏదో ఒక మతానికి సంబంధించిన ఇతివృత్తాన్ని స్వీకరించి రచనలు చేశారు. మతప్రచారమే తమ ధ్యేయంగా రచనలు చేసినవారూ ఉన్నారు. కాబట్టి, మతాన్ని వేరు చేసి తెలుగు సాహిత్యాన్ని పరిశీలించడం అంటే -నేలవిడిచి సాము చేసినట్లవుతుంది. కాబట్టే నా పరిశోధనలో మొదటి మూడు అధ్యాయాల పేర్లు మతపరంగా కనిపిస్తాయి. అంటే ఆంధ్ర మహాభారత (అద్వైత), శైవ, వైష్ణవ అధ్యాయాల పేర్లు మతపరమైనవిగా కనిపిస్తాయి. ఆంధ్రమహాభారతం చారిత్రక విమర్శ అనే అధ్యాయం అద్వైత మతంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఎక్కువ భాగం రచనలు మత ప్రభావానికి లోనయ్యాయి. కాబట్టి ఈ ఆధ్యాయాల్లో ఆయా విషయాలను పరిశీలించాను.

ఇక అధ్యాయాల పరంగా చూస్తే సిద్ధాంత గ్రంథాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించాను. **మొదటి అధ్యాయం విమర్శ - చారిత్రక విమర్శ - పరిచయం.** ఇందులో విమర్శకు సంబంధించిన పరిచయాన్ని, పలు విమర్శనా పద్ధతులను విశదం చేశాను. ఇంకా చారిత్రక విమర్శ, దాని లక్షణాలు, చారిత్రక విమర్శకుడి బాధ్యతలు, ఆ విమర్శ

ప్రయోజనం మొదలైనవాటిని గురించి చెప్పాను. అలాగే చారిత్రక విమర్శకు ఇతర విమర్శనా పద్ధతులతో ఉన్న సంబంధాన్ని కూడా పేర్కొన్నాను.

**రెండో అధ్యాయం ఆంధ్రమహాభారతం - చారిత్రక విమర్శ.** ఈ అధ్యాయంలో కవిత్రయం గురించి వివరించి, వారు ఆయా కాలాల్లో ఆంధ్రమహాభారతం రచించడానికి దోహదం చేసిన పరిస్థితులను వివరించాను. ఇందులో కవిత్రయ ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి ప్రేరేపించిన కారణాలు కొన్ని ఆ రచనలోనే కనిపిస్తాయి. అయితే సాహిత్యానికి వెలుపల కూడా వివిధ కారణాలు కనిపిస్తున్నాయి. వాటన్నింటినీ ఇక్కడ విశ్లేషించాను. తరువాత నన్నయ, తిక్కన, ఎర్రనలు భారతాన్ని రచించే సమయంలో కనిపించే పలు సామ్యాలను వివరించాను. ఈ సామ్యాలను, రచనల నేపథ్యాన్ని అంతటినీ కూడా సాహిత్య ఆధారాలతోపాటు సాహిత్యేతర ఆధారాలతో కూడా విశ్లేషించాను.

**శైవసాహిత్యం-చారిత్రక విమర్శ** అనే **మూడో అధ్యాయం**లో శైవపరమైన అంశాలను పరిశీలించాను. ఇందులో బసవేశ్వరుడు వీరశైవ మతం స్థాపించడానికి గల సాహిత్యపరమైన కారణాలతో పాటు సాహిత్యేతర ఆధారాలతో వీరశైవ మత స్థాపన గురించి చర్చించాను. ఇందులో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు... మొదలైన శైవకవుల రచనలు, వారు ఆయా కాలాల్లో, ఆయా రచనలను ఆ విధంగా రచించడానికి ప్రేరేపించిన సామాజిక పరిస్థితులను వివరించాను.

**వైష్ణవ సాహిత్యం - చారిత్రక విమర్శ** అనే **నాల్గో అధ్యాయం**లో వైష్ణవమత సంబంధమైన రచనలను మూడు విభాగాలుగా విభజించాను. (1) భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసిన కవులు. (2) ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవమత పరమైన రచనలు చేసిన కవులు. (3) వైష్ణవ మత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు అని మూడు విభాగాలుగా విభజించాను. ఆయా భాగాలలో ఆయా

సంబంధిత రచనలు చేసిన కవులను చారిత్రక విమర్శనా పద్ధతిలో పరిశీలించాను

**ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ** అనే **ఐదో అధ్యాయం**లో పాశ్చాత్య ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి స్థానిక నేపథ్యం ఏర్పరుచుకొన్న ఉద్యమాలను గురించిన చర్చ ఉంటుంది. అంటే పాశ్చాత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించి ఇక్కడి పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకొని సాహిత్య ఉద్యమాలుగా మారిన భావకవిత్వోద్యమం, అభ్యుదయ సాహిత్యోద్యమం, దిగంబర కవిత్వోద్యమం, స్త్రీవాద సాహిత్యోద్యమం, ప్రపంచీకరణ సాహిత్యోద్యమాల నేపథ్యాన్ని గురించి వివరించాను.

**ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రాచ్య ప్రభావం- చారిత్రక విమర్శ** అనే **ఆరో అధ్యాయం**లో కేవలం దేశీయ పరిస్థితుల ప్రభావంతో సాహిత్య ఉద్యమాలుగా మారినవాటిని  ఇక్కడ వివరించాను. ఇందులో విప్లవసాహిత్యం, దళితవాద సాహిత్యం, ప్రాంతీయవాద సాహిత్యం, మైనారిటీవాద సాహిత్య ఉద్యమాలను గురించి విశ్లేషించాను.

**తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు అనే ఏడో అధ్యాయం**లో ఇప్పటి వరకు వచ్చిన చారిత్రక విమర్శ గ్రంథాలను, వ్యాసాలను సమీక్షించాను. ఇందులో చారిత్రక విమర్శనా గ్రంథాలతోపాటు, సాంఘిక విమర్శనా గ్రంథాలను కూడా పేర్కొన్నాను. వీటితో పాటు కొన్ని గ్రంథాల్లో వచ్చిన చారిత్రక విమర్శనా వ్యాసాలను కూడా పరిశీలించాను.

సింహావలోకనంలో ఇంకా ఈ విమర్శనా విధానంతో సాహిత్యంలో జరగవలసిన పరిశోధన గురించి తెలిపాను. దీంతో పాటు ఈ సిద్ధాంత గ్రంథ సారాంశాన్ని పేర్కొన్నాను.

# విషయ సూచిక


కృతజ్ఞతలు I

ముందుమాట III

**1. విమర్శ-చారిత్రక విమర్శ- పరిచయం 1-37**

1.1. పరిశోధన ఆవశ్యకత 1

1.2. పరిశోధనా పరిమితి 3

1.3. విమర్శ-పరిచయం 6

1.4. విమర్శ ప్రయోజనం 12

1.4.1. రచయితకుగల ప్రయోజనం 14

1.4.2. పాఠకుడికిగల ప్రయోజనం 15

1.4.3. విమర్శకుడికి గల ప్రయోజనం 15

1.5. విమర్శ పద్ధతులు 16

1.5.1. గ్రంథ పరిష్కార విమర్శ 18

1.5.2. కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ 19

1.5.3. సాంఘిక విమర్శ 19

1.5.4. మనోవైజ్ఞానిక విమర్శ లేదా మనో విశ్లేషణాత్మక విమర్శ లేదా మనస్తత్వ విమర్శ 20

1.5.5. మార్క్సిస్ట్ విమర్శ 20

1.5.6. చారిత్రక విమర్శ 22

1.5.6.1. చారిత్రక విమర్శ-ప్రారంభం 24

1.5.6.2. చారిత్రక విమర్శకుడి బాధ్యతలు 26

1.5.6.3. చారిత్రక విమర్శలో విమర్శకుడి
ముందున్న సమస్యలు 27

1.5.6.3.1. ప్రామాణికమైన లేదా వాస్తవికతను
తెలియచేసే దస్తావేజులు 27

1.5.6.3.2. రచయితను అర్థం చేసుకోవడం 28

1.5.6.3.3. నిర్ణయాంశం 29

1.5.6.3.4. అలిఖిత వాఙ్మయం 29

1.5.6.3.5. సంప్రదాయం 29

1.5.6.3.6. పూర్వవాదం 30

1.5.6.4. చారిత్రక విమర్శ ప్రయోజనం 31

1.5.6.5. చారిత్రక విమర్శ పరిణామం - తక్కిన విమర్శలతోటి సంబంధం 32

1.5.6.5.1. చారిత్రక విమర్శకు గ్రంథ పరిష్కార
విమర్శతోగల సంబంధం 32

1.5.6.5.2. చారిత్రక విమర్శకు సాంఘిక విమర్శతోగల సంబంధం 33

1.5.6.5.3. చారిత్రక విమర్శతో కవిజీవిత కావ్య సమన్వయ
విమర్శకుగల సంబంధం 35

1.5.6.5.4. చారిత్రక విమర్శకు మనోవైజ్ఞానిక
విమర్శతోగల సంబంధం 35

1.5.6.5.5. చారిత్రక విమర్శకు మార్క్సిస్టు
విమర్శకు మధ్యగల సంబంధం 36

**2. ఆంధ్రమహాభారతం-చారిత్రక విమర్శ 38-76**

2.1. ప్రాఙ్నన్నయ కవులు 38

2.1.1. పంపకవి 39

2.1.2. గజాంకుశ 39

2.1.3. వడింద్ర చూడామణి 40

2.1.4. మల్లియ రేచన 40

2.1.5. సర్వదేవరాయ 40

2.2. ఆంధ్రమహాభారతము-నన్నయ 41

2.2.1. ఆంధ్ర మహాభారత రచనకు గల కారణాలు 41

2.2.1.1. రాజరాజుకు గల భారత శ్రవణాసక్తి 42

2.2.1.2. ఇతర ప్రాంతీయభాషల్లోని భారత రచనా ప్రభావం 44

2.2.1.3. ఇతర ప్రాంతీయ రాజుల సాహిత్య పోషణ ప్రభావం 45

2.2.1.4. వైదికమతవ్యాప్తి 47

2.2.1.5. నన్నయ భారత రచనా సంకల్పం 52

2.3. ఆంధ్రమహాభారత పునఃప్రారంభం-తిక్కన 56

2.3.1. తిక్కన వ్యక్తిగత కారణాలు 58

2.3.2. రాజకీయ పరిస్థితులు 60

2.3.3. మత పరిస్థితులు 62

2.3.4. హరిహరనాథతత్త్వము-ఆంధ్రమహాభారత రచన 65

2.4. ఎర్రన- అరణ్య పర్వశేషం 70

2.5. ఆంధ్రమహాభారతరచన: నన్నయ-తిక్కన-ఎర్రనల మధ్యగల చారిత్రక సామ్యాలు 74

**3. శైవరచనలు-చారిత్రకవిమర్శ 77-117**

3.1.శైవ/వీరశైవ సాహిత్యం 88

3.1.1. కుమార సంభవము-నన్నెచోడుడు 89

3.1.1.1. జాను తెనుగు 93

3.1.2. శివతత్త్వసారము-మల్లికార్జున పండితుడు 95

3.1.3. బసవపురాణము, పండితారాధ్య చరిత్రము-

పాల్కురికి సోమనాథుడు 97

3.1.4. తదనంతర సాహిత్యం పై శైవ(సోమనాథుడి)మతప్రభావం 102

3.1.4.1. సర్వేశ్వర శతకము- యథావాక్కుల అన్నమయ్య 103

3.1.4.2. సిద్ధేశ్వర చరిత్ర- కాసె సర్వప్ప 105

3.1.4.3. నవచోళ చరిత్ర-పోశెట్టి లింగన కవి 105

3.1.4.4. నవనాథ చరిత్ర-గౌరన 107

3.1.4.5. శ్రీనాథుడు 109

3.1.4.5.1. భీమేశ్వర పురాణము 110

3.1.4.5.2. కాశీఖండం 111

3.1.4.5.3. శివరాత్రి మాహాత్మ్యం 112

3.1.4.6. శ్రీకాళహస్తి మాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర

శతకము- ధూర్జటి 113

3.1.4.7. ఇతర గ్రంథాలు 115

**4. వైష్ణవ రచనలు -చారిత్రక విమర్శ 118-172**

4.1. భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసిన కవులు 126

4.1.1. ఉత్తర హరివంశం-నాచన సోమనాథుడు 127

4.1.2. ఆంధ్రమహాభాగవతం-పోతన 128

4.1.3. మొల్ల రామాయణము-మొల్ల 133

4.2. ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవ సంబంధమైన

రచనలు చేసినకవులు 136

4.2.1. నిర్వచనోత్తర రామాయణము-తిక్కన 136

4.2.2. హరివంశము-ఎర్రన 141

4.2.3. భాస్కర రామాయణము 145

4.2.4. జైమిని భారతము-పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి 147

4.2.5. పారిజాతాపహరణము-నంది తిమ్మన 150

4.2.5. పాండురంగ మాహాత్మ్యము- తెనాలి రామకృష్ణ కవి 153

4.3. వైష్ణవమత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు 156

4.3.1. అన్నమయ్య కీర్తనలు-కృతులు 157

4.3.2. రంగనాథ రామాయణము- గోనబుద్ధారెడ్డి 161

4.3.3. ఆముక్తమాల్యద-శ్రీకృష్ణదేవరాయలు 164

4.3.4. వాల్మీకి చరిత్రము-రఘునాథ భూపాలుడు 169

4.4. ఇతర వైష్ణవరచనలు 171

**5. ఆధునిక తెలుగుసాహిత్యోద్యమాలు-పాశ్చాత్య ప్రభావం-**

**చారిత్రక విమర్శ 173-221**

5.1. భావకవిత్వోద్యమం 173

5.2. అభ్యుదయ సాహిత్యోద్యమం 181

5.3. దిగంబర కవిత్వం 192

5.4. స్త్రీవాద సాహిత్యం 200

5.5. ప్రపంచీకరణ సాహిత్యం 211

**6. ఆధునిక తెలుగుసాహిత్యోద్యమాలు-ప్రాచ్య ప్రభావం-**

**చారిత్రక విమర్శ 222-251**

6.1. విప్లవసాహిత్యోద్యమం 222

6.2. దళితవాద సాహిత్యం 231

6.3. మైనారిటీవాద సాహిత్యం 239
6.3.1. రాజకీయకారణాలు 241
6.3.2. ఆర్థిక పరిస్థితులు 243
6.3.3. సాంఘిక పరిస్థితులు 243
6.3.4. సాంస్కృతిక పరిస్థితులు 244
6.4. ప్రాంతీయవాద సాహిత్యం 245
6.4.1. తెలంగాణ ప్రాంతీయవాదం 246

**7. తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు 252-316**
7.1. ఆంధ్రమహాభారత గ్రంథాలు 252
7.1.1. ఆంధ్రవాఙ్మయారంభ దశ 253
7.1.2. ఆంధ్ర భారత కవితా విమర్శనము 258
7.2. శైవ సాహిత్య రచనలపై వచ్చిన
చారిత్రక విమర్శనా గ్రంథ్యాలు 262
7.2.1. నన్నెచోడదేవ కుమార సంభవ పరిశీలనము 262
7.2.2. నవనాథచరిత్ర - కావ్యానుశీలనము 265
7.3. వైష్ణవ సాహిత్య రచనలపై వచ్చిన
చారిత్రక విమర్శనా గ్రంథాలు 269
7.3.1. ఆంధ్ర భాగవత విమర్శ 269
7.3.2. శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము 272
7.3.3. పాండురంగ మాహాత్మ్యము-రచనా సౌందర్యం 274
7.3.4. విజయ విలాసానుశీలనము 277
7.4. శైవవైష్ణవేతర రచనలపై వచ్చిన
చారిత్రక విమర్శనా గ్రంథాలు 281
7.4.1. వేమన 281

7.4.2. ప్రజాకవి వేమన 284
7.5. ఆధునిక సాహిత్య రచనలపై వచ్చిన
చారిత్రక విమర్శనా గ్రంథాలు 288
7.5.1. వేయిపడగలు - విశ్లేషణాత్మక విమర్శ 288
7.5.2. చివరకు మిగిలేది: నవల మానసిక సామాజిక
జీవనప్రవంతి నవలా విమర్శ 292
7.6. సాంఘిక విమర్శనా గ్రంథాలు 295
7.6.1. శివకవుల రచనలు సమాజం 295
7.6.2. రాయలనాటి రసికత 299
7.6.3. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం 301
7.7. సాహిత్య వ్యాసాల్లో కనిపించే చారిత్రక విమర్శ 303
7.7.1. పాల్కురికి సోమన - నిబద్ధత - నిమగ్నత 304
7.7.2. ఉభయ కవి తిక్కన గారి సమన్విత సాహిత్య వ్యక్తిత్వం 305
7.7.3. ప్రబంధాలు- సామాజిక, మత రాజకీయ భూమిక 306
7.7.4. నిరసన కవి ధూర్జటి 307
7.7.5. అచ్చ తెలుగు కావ్యాల అవతరణ చారిత్రక భూమిక 308
7.7.6. దక్షిణ దేశీయాంధ్ర సాహిత్యం -
చారిత్రక, సామాజిక నేపథ్యం 309
7.7.7. పదమూడవ శతాబ్దంలో తెలుగు
సాహిత్యమూ-చారిత్రకత 311
7.7.8. శ్రీనాథ సాహిత్యం- ఆర్థిక తాత్విక భూమిక 311
7.7.9. ప్రబంధ సాహిత్యాన్ని సృష్టించిన సమాజ స్వరూపం 313
7.7.10. పదిహేనవ శతాబ్ది తెలుగు సాహిత్యం రాజకీయ భూమిక 313
7.7.11. 17, 18 శతాబ్దాల సాహిత్యం-సామాజిక రాజకీయ భూమిక 314

7.8. సాహిత్య చరిత్రల్లో కనిపించే చారిత్రక విమర్శ 315

**సింహావలోకనం** **317 - 325**

**ఉపయుక్త గ్రంథాలు** **326 - 338**

# మొదటి అధ్యాయం

## విమర్శ - చారిత్రక విమర్శ - పరిచయం

# 1. విమర్శ -చారిత్రక విమర్శ - పరిచయం

విశ్వవిద్యాలయాల్లో విమర్శ మీద ఇప్పటికే చాలా పరిశోధనలు జరిగాయి. అయినప్పటికీ చేయవలసిన కృషి ఇంకా మిగిలే ఉంది. సాహిత్య విమర్శలో కూడా వివిధ రకాల విమర్శనా పద్ధతులను ఉపయోగించి పరిశోధన చేసినప్పటికీ, కొన్ని విమర్శనా పద్ధతుల ద్వారా సాహిత్యాన్ని పరిశీలించినట్లు ఎక్కడా కనిపించదు. ముఖ్యంగా ఆంగ్ల సాహిత్య విమర్శలోని పలు పద్ధతులు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. కానీ ఇప్పటికీ విమర్శకులు స్పృశించని విమర్శనా పద్ధతులు చాలా ఉన్నాయి. అలా ఉన్న విమర్శనా పద్ధతుల్లో చారిత్రక విమర్శనా పద్ధతి కూడా ఒకటి. ఈ సిద్ధాంత గ్రంథంలో ఈ చారిత్రక విమర్శనా పద్ధతిని ఉపయోగించి తెలుగు సాహిత్యాన్ని పరిశీలించటానికి ప్రయత్నం చేశాను. అందుకోసం నా పరిశోధనకు తీసుకొన్న అంశం పేరు *'తెలుగు సాహిత్యం- చారిత్రక విమర్శ'*.

## 1.1. పరిశోధనావశ్యకత

ఇప్పటివరకు తెలుగులో ఆలంకారిక విమర్శ, మార్క్సిస్టు విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ మొదలైన విమర్శనా పద్ధతుల ద్వారా పలువురు పరిశోధకులు సాహిత్యాన్ని పరిశీలించారు. వచ్చిన గ్రంథాల్లో ఎక్కువభాగం ఆలంకారిక విమర్శనా పద్ధతికి చెందినవే. ప్రాచ్య, పాశ్చాత్య విమర్శనా పద్ధతులను పరిశీలిస్తే దాదాపు నలభైకి పైగానే విమర్శనా పద్ధతులున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పలు పాశ్చాత్య సాహిత్య విమర్శనా పద్ధతులు వ్యాప్తిలో ఉన్నాయి. వారు ఆ పద్ధతులన్నింటినీ ఉపయోగించి విమర్శ చేసినట్లు కనిపిస్తోంది. కాని తెలుగులో మనం ఉపయోగిస్తున్న విమర్శనా పద్ధతులు చాలా తక్కువనే చెప్పాల్సి ఉంటుంది. చాలా మంది ప్రముఖ తెలుగు విమర్శకులకు కూడా ఈ విమర్శనా పద్ధతుల గురించి అవగావహన ఉన్నట్లు కనిపించదు. అలాగని అన్ని విమర్శనా పద్ధతులను గురించి విమర్శకులు తెలుసుకోవాలనే నియమం లేదు.

కాని అన్ని విమర్శనా పద్ధతులను తెలుసుకొని, ఆ పద్ధతుల ద్వారా సాహిత్యాన్ని పరిశీలించడం వలన సాహిత్యపు తీరును సంపూర్ణంగా తెలుసుకోవటానికి అవకాశం కలుగుతుంది.

ప్రస్తుతం ఇప్పటి వరకు వచ్చిన సాహిత్య విమర్శలో ఎక్కువగా ఒకటి రెండు పద్ధతులను మాత్రమే ఉపయోగించారు. ముఖ్యంగా ఒక సాహిత్య రచనను తీసుకొని అందులో ఉండే గుణదోషాలను, అలంకారాలను, భాషాశైలిని విశ్లేషిస్తూ విమర్శ చేశారు. ఈ విధానం వలన ఆ రచన ఔన్నత్యాన్ని లేదా దోషాన్ని తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. సహజంగా సాహిత్యపరమైన అంశాల్లో ముఖ్యంగా మూడు అంశాలు ఉంటాయి. అవి 1. రచన 2. రచయిత 3. పాఠకుడు. ఒక రచన వెలువడిందంటే అందుకు కారణం రచయిత/కవి. రచయిత మూలంగానే రచన పాఠకుడికి చేరుతుంది. పాఠకుడు ఒక రచనను చదివి ఆనందించినా లేదా ఆ రచనను తిరస్కరించినా ఆ గుణదోషాలు రచనతో పాటు పరోక్షంగా రచయితను కూడా తాకుతాయి. కాబట్టి ఆ రచనను విమర్శించదలుచుకున్నప్పుడు ఆ రచనను రచించిన రచయితను కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. కాని మనకు ఉన్న విమర్శనా పద్ధతుల ద్వారా రచయితను గురించి వివరించిన గ్రంథాలు చాలా తక్కువనే చెప్పాలి. పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన విమర్శనా పద్ధతుల ద్వారా రచనను, రచయితను, ఆ రచన వెలువడటానికి గల కారణాలను తెలుసుకొని, ఆ రచనను అవగాహన చేసుకొనే వెసులుబాటు కలిగింది. అలా రచయితను, రచనను, దాన్ని రచించడానికిగల కారణాలను విశ్లేషించే పద్ధతి చారిత్రక విమర్శనా పద్ధతి.

సాధారణంగా సాహిత్యం ద్వారా రకాలైన అంశాలను అర్థం చేసుకొని, వాటిని అధ్యయనం చేయటం జరుగుతున్నది. కాని చారిత్రక విమర్శలో సాహిత్యేతర అంశాల ద్వారా సాహిత్యాన్ని అధ్యయనం చేయటం జరుగుతుంది. ముఖ్యంగా చరిత్ర ఆధారంగా చేసుకొని సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అనేది చారిత్రక విమర్శలో

ముఖ్యమైన అంశం. సహజంగా చరిత్ర రచనకు సాహిత్యంతో పాటు, నాణేలు, శాసనాలు మొదలైనవి ఆధారం అనేది అందరికి తెలిసిన విషయం. కాబట్టి సాహిత్యాన్ని చరిత్ర ఆధారం చేసుకొని పరిశీలించడం వలన రచనలో ఉన్న సమాజాన్ని, ఆ రచనను రచించిన రచయితను బాగా అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ప్రస్తుతం ఈ పరిశోధనా గ్రంథంలో సాహిత్యాన్ని సాహిత్యేతర అంశాల ఆధారంగా పరిశీలించడం జరిగింది. దీని వలన రచనతో పాటు రచయితను గురించి, రచనలో కనిపించే సమాజం గురించి అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన విమర్శలో రచనకు సంబంధించిన విమర్శ ప్రధానంగా ఉండటంతో ఒక విధంగా రచయితను అప్రధానం చేసినట్లయింది. దానితో పాటు ముఖ్యంగా చరిత్ర ఆధారంగా సాహిత్యాన్ని అధ్యయనం చేయటం చారిత్రక విమర్శ ముఖ్య లక్షణం. కాబట్టి, చరిత్ర ఆధారంగా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించడం వలన సాహిత్యాన్ని విభిన్న పద్ధతిలో అధ్యయనం చేయటానికి అవకాశం కలుగుతుంది. ఆయా కాలంలో వచ్చిన మార్పుల ఫలితంగా సాహిత్యంలో వచ్చిన మార్పులు, రచయిత సమాజంలో పోషించిన పాత్ర మొదలైన విషయాలన్నీ తెలుసుకోవడానికి వీలవుతుంది.

ముఖ్యంగా ఇప్పటి వరకు, నా అవగాహన మేరకు చారిత్రక విమర్శనా పద్ధతికి సంబంధించి కొన్ని వ్యాసాలు మాత్రమే వచ్చాయి. పరిశోధన జరిగినట్లు కనిపించదు. ఈ విమర్శనా పద్ధతిలో పరిశోధన చేయటం వలన సాహిత్యాన్ని మరొక కోణంలో చూడటానికి అవకాశం కలుగుతుందనే అభిప్రాయంతో ఈ అంశం మీద పరిశోధన చేయటానికి నిశ్చయించుకొన్నాను.

## 1.2. పరిశోధనా పరిమితి

పరిశోధనకు సంబంధించిన పరిమితులను కూడా ఇక్కడ పేర్కొదలిచాను. సాధారణంగా చారిత్రక విమర్శలో రచనను విమర్శించేటప్పుడు రచయిత గురించి, రచనలో కనిపించే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులను వివరించడం జరుగుతుంది. కాని ఇక్కడ ఈ పరిశోధనా గ్రంథంలో కొన్ని పరిమితులు విధించుకున్నాను. ఇందులో సాహిత్యంలో కనిపించే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులను వివరించదలుచుకోలేదు. అందుకు గల కారణం ప్రాచీన తెలుగు సాహిత్యంలోనూ, ఆధునిక తెలుగు సాహిత్యంలోనూ కనిపించే సమాజాన్ని వివరిస్తూ పలువురు గ్రంథాలను రచించారు. ఉదాహరణకు నండూరి వేంకట సత్యరామారావు రచించిన 'ఆంధ్ర సాహిత్యము-సాంఘిక జీవన ప్రతిఫలనము', నడుపల్లి శ్రీరామరాజు రచించిన 'శివకవుల రచనలు-సమాజం', కె.కె. రంగనాథాచార్యులు సంపాదకత్వంలో వచ్చిన 'తెలుగు సాహిత్యం మరోచూపు', డి. చంద్రశేఖర్ రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం' మొదలైన గ్రంథాల్లో ఆయా కాలంలో వచ్చిన, సాహిత్యంలో ప్రతిఫలించిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులను వివరించారు. ఇంకా పలు గ్రంథాల్లో ఈ అంశాలను వివరించి ఉన్నారు. కానీ, ఆ రచనలకు సంబంధించిన కవులను/ రచయితలను గురించికానీ, ఆ రచన వెలువడటానికి గల కారణాలనుగానీ వివరించ లేదు. ప్రస్తుతం చారిత్రక విమర్శలో సాహిత్యంలో ప్రతిఫలించే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులను వివరించడం వలన ఆ అంశాలనే తిరిగి చెప్పడం అవుతుంది. కాబట్టి ఆ అంశాలను ఇక్కడ వివరించదలుచుకోలేదు. కేవలం ఆ రచనల రచయిత/కవులను గురించి, ఆ రచయితలు/కవులు రచించడానికి గల కారణాల గురించి మాత్రమే వివరించాను. ఈ విషయం ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని వివరించేటపుడు కనిపిస్తుంది.

మరొక అంశం ఆయా రచనల గురించి, రచయితల గురించి వివరించేందుకు సాహిత్య రచనల్లోని అవతారికలను మాత్రమే పరిశోధనకు స్వీకరించాను. దీనికి గల కారణాలు రెండు. మొదటి కారణం ఇంతకు ముందే పేర్కొన్నట్లు ఇక్కడ రచనలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులను వివరించటం లేదు. కాబట్టి ఇక్కడ పూర్తి రచనను స్వీకరించలేదు. మరొక కారణం ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఎక్కువ భాగం రచనలు సంస్కృత రచనల్లోని వస్తువును తీసికొని తెలుగులో రచించడం జరిగింది. దీని వలన ఎక్కువ భాగం తెలుగు రచనల ఇతివృత్తం సంస్కృత రచనలను బట్టి కొనసాగింది. కాబట్టి, ఈ ఇతివృత్తాన్ని అనుసరించి తెలుగు రచనల్లో కనిపించే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులను అంచనా వేయవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో రచనలో కనిపించే ఈ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులు సంస్కృత రచనను అనుసరించి ఉంటాయి. కాబట్టి నాటి రచయిత రచించిన సమాజం అంతా కూడా నాటి సమకాలీనమైందని భావించడం కొంత కష్టమైన విషయం. కానీ కావ్య అవతారికలకు ఈ సమస్య ఉండదు. ప్రతి రచనకు అవతారిక తప్పనిసరిగా ఉంటుంది. ఆ అవతారికలో కవి/రచయిత తమకు సంబంధించిన సమాచారాన్ని, అంటే కృతి కర్త పేరు, వంశం, కృతి భర్త పేరు, అతని వంశాన్ని వివరించడం జరిగింది. మరికొన్ని రచనల్లో ఆ రచన చేయటానికి గల కారణాలను కూడా కవులు పేర్కొన్నారు. కాబట్టి రచన వెలువడటానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఈ అవతారికలు ఎంతగానో ఉపయోగపడతాయి. కొన్ని సందర్భాల్లో ఈ సమాచారం కొన్నిటికి లేకపోవచ్చు. ఇక ప్రాచీన తెలుగు సాహిత్యంలో వచ్చిన రచనలనన్నిటినీ పరిశీలించడం సాధ్యం కాదు. కాబట్టి నా పరిశోధనలో వివిధ అధ్యాయాలకు అవసరమైన రచనలను మాత్రమే పరిశీలించాను.

ఇక ఆధునిక సాహిత్యాన్ని చర్చించేటపుడు ఈ పద్ధతిని మార్చి రాయవలసి వచ్చింది. అది ఏమిటంటే ప్రాచీన తెలుగు సాహిత్యంలో కవులు/రచయితలకు సంబంధించిన అంశాలను వివరించినట్లు ఆధునిక సాహిత్యాన్ని గురించి వివరించలేదు. అంటే కవుల/రచయితలకు సంబంధించిన సమాచారాన్ని ఇక్కడ చర్చించలేదు. దానికి

గల కారణం ఆధునిక కాలంలో కవుల/రచయితల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు రచనలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కానీ ప్రముఖ కవులు/రచయితలు ఆధునిక కాలంలో వచ్చిన వివిధ ఉద్యమాలతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధాన్ని కలిగి ఉన్నారు. అందువలన ఆధునిక కాలంలో వచ్చిన ఉద్యమాల నేపథ్యాన్ని మాత్రమే పేర్కొన్నాను. అందుకు మరొక కారణం కూడా ఉంది. ఇప్పటి వరకు వచ్చిన ఉద్యమాల నేపథ్యాన్ని గురించి క్లుప్తంగా వివరించడం వలన అన్ని ఉద్యమాలను అవగాహన చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయంతో ఇక్కడ వివరించాను.

ఒక్క మాటలో పరిశోధనా పరిమితిని చెప్పాలంటే 'తెలుగు సాహిత్యం-చారిత్రక విమర్శ' అనే ఈ సిద్ధాంత గ్రంథంలో ఉద్యమ రూపంగా కనిపించిన సాహిత్యం యొక్క చారిత్రక నేపథ్యాన్ని వివరించదలుచుకున్నాను. అందుకోసం ఉద్యమ ధోరణిలో కొనసాగిన వస్తువు ఉన్న రచనలను తీసుకొన్నాను. ఈ పద్ధతిని ప్రాచీన సాహిత్యానికి పరిమితం చేసుకొన్నాను. ఇక ఆధునిక సాహిత్యానికి వచ్చేటప్పటికీ ఆయా సాహిత్య ధోరణులు ప్రారంభం కావటానికి గల చారిత్రక నేపథ్యాన్ని మాత్రమే తీసుకొన్నాను. అందువలన ఈ గ్రంథంలో 'సాహిత్యపరమైన చర్చ తక్కువ ఉండి, రచయితకు సంబంధించిన చర్చ, ఆ రచన ఆ కాలంలో అలా వెలువడటానికి గల కారణాలకు సంబంధించిన చర్చ ఎక్కువగా కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యానికి వచ్చేటప్పటికీ ఆయా సాహిత్య ఉద్యమాల నేపథ్యాన్ని వివరించాను.

## 1.3. విమర్శ-పరిచయం

కవిత్వం, కథ, నాటకం, నవల మొదలైన సాహిత్య ప్రక్రియల మాదిరిగా విమర్శ కూడా ఒక రకమైన ప్రక్రియ. కవిత్వం, కథ, నాటకం, నవల, మొదలైన సాహిత్య ప్రక్రియలు స్వతంత్రమైనవి. కాని విమర్శ మిగిలిన ప్రక్రియల మాదిరి స్వతంత్ర ప్రక్రియ కాదు. ఏదో ఒక సాహిత్య రచనను ఆధారం చేసుకోకపోతే విమర్శకు అస్థిత్వం లేదనే

విషయం సత్యం. అలాగని ఇతర సాహిత్య ప్రక్రియల కంటే కూడా ఏమాత్రం తక్కువ రకమైన సాహిత్య ప్రక్రియ కాదు. తక్కిన ప్రక్రియలతో సమానమైన స్థానం ఉంది. ఇంకా చెప్పాలంటే తక్కిన సాహిత్య ప్రక్రియలతో పోల్చితే విమర్శనా ప్రక్రియకు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. తక్కిన ప్రక్రియల విలువను నిర్ధారించేది, వాటికి వ్యాప్తి కలిగించేది, వాటికి సాహిత్యంలో ఒక స్థానాన్ని చేకూర్చేది విమర్శ. మరొక విధంగా చెప్పాలంటే సృజనాత్మక సాహిత్యంలోని విలువను నిర్ణయించడానికీ, సాహిత్యాంశాలను దర్శించడానికీ, అంచనా వేయడానికీ ఉపయోగించే ప్రక్రియ విమర్శ. సాహిత్యంలో విమర్శ, విమర్శలో సాహిత్యం పరస్పరం సంబంధాన్ని కలిగి ఉంటాయి. పాశ్చాత్య సాహిత్య సంపర్కంవల్ల విమర్శ తెలుగులో ఒక ప్రక్రియగా కొనసాగుతున్నదనే విషయం తెలిసిందే.

'విమర్శ లేక విమర్శనం అనేది 'వి' అనే ఉపసర్గతో కూడిన 'మృశ్' అనే ధాతువునుండి ఏర్పడింది. ఆ ధాతువుకు పరామర్శించుట, ఆలోచించుట, పరీక్షించుట, చర్చించుట మొదలైన అర్థాలున్నాయి.

విమర్శకు సమానార్థకమైన 'CRITICISM' అనే ఆంగ్ల పదం గుణదోష విచారణ మొనర్చుట అనే అర్థంగల 'KRITEIN' అను గ్రీకు పదం నుండి ఏర్పడింది.

విమర్శ గురించి, విమర్శకు సంబంధించిన వివిధ పద్ధతుల గురించి ఇప్పటికే ప్రాచ్య, పాశ్చాత్య విమర్శలో తగినంత చర్చ జరిగింది. వాటిలోని ముఖ్యమైన అంశాలను క్లుప్తంగా వివరిస్తాను.

'విమర్శ' అనే పదానికి తెలుగు అకాడమి వారి తెలుగు-తెలుగు నిఘంటువులో 'పరిశీలన, పర్యాలోచనం, సమీక్ష, విచారణ, హేతువాదం, పరస్పర విరుద్ధమైన తీర్పు, సందేహం, ఎటూతోచని స్థితి' అనే అర్థాలున్నాయి. విమర్శించు అనే క్రియాపదానికి 'తప్పొప్పులు చర్చించు, తప్పుపట్టు, ఆక్షేపించు, పరామర్శచేయు, పరిశీలించు, ఆలోచించు, పరిశోధించు, పరికించు' అనే అర్థాలను పేర్కొన్నారు.

సూర్యనారాయాంధ్ర నిఘంటువులో 'విమర్శము, పర్యాలోచము, సమీక్షణము, పరిశీలనము, హేతువాదము, యుక్తాయుక్తముగా వాదించుట, సందేహము' అనే అర్థాలనిచ్చారు.

బ్రౌణ్య నిఘంటువులో CRITICISM అనే పదానికి 'విమర్శ, తప్పొప్పులు పరిశీలనము చేయడము, అక్షేపణము, ఖండనము' అనే అర్థాలను పేర్కొన్నారు.

THE AMERICAN HERITAGE DICTIONARY లో CRITICISM అనే పదానికి

"1. The act of criticizing, especially adversely.

2. A critical comment or judgment.

3. a. The art, skill, or profession of making discriminating judgments and evaluations, especially of literary or other artistic works.

b. A review or article expressing such judgment and evaluation.

4. Detailed investigation of the origin and history of literary documents, such as the Bible." (Joseph, P. Pickett (Ed.): The American Heritage Dictionary, P.289) అని పేర్కొన్నారు.

విమర్శను గురించి ప్రాచ్య, పాశ్చాత్యులు వివిధ రకాలుగా వివరించారు. "ఒక వస్తువుయొక్క స్వరూపమును బాగుగా పరిశీలించి దాని మంచి చెడులను వివరించుటయే విమర్శనము" (రామారావు, యస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, పుట.1.) ఇక్కడ వస్తువు అన్నప్పుడు సాహిత్య వస్తువుతో పాటు పదార్థ సంబంధమైన వస్తువుగా కూడా పేర్కొనడానికి అవకాశం ఉంది. అంటే ఇక్కడ విమర్శ అనేది సాహిత్యేతర అంశాలకు కూడా వర్తిస్తుంది. కాని కొన్ని సందర్భాల్లో సాహిత్యేతర అంశాలకు, సాహిత్యపరమైన అంశాలకు విమర్శ తీరులో భేదం ఉండవచ్చు.

“విమర్శయనగా ఒకరుచేసిన పనియందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట” (లక్ష్మీకాంతం, పింగళి: సాహిత్య శిల్పసమీక్ష, పుట. 314.) ఇక్కడ కూడా పైన పేర్కొన్న అంశాన్నే తిరిగి చెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ పని అనేదానికి గల అర్థాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లయితే సాహిత్య ‘విమర్శ’ను స్పష్టంగా తెలుసుకోవడానికి వీలుండేది.

“విమర్శనమనగా నేదైనా గ్రంథమునుగాని, కళారూపమును గాని లేస్సగా బరిశీలించి, దానిని గూర్చి మననము చేసి చర్చాపరస్పరముగా నందలి బాగోగులను బ్రదర్శించుటయని గ్రహింపవచ్చును.” (వెంకటావధాని, దివాకర్ల: సాహిత్య సోపానాలు, పుట.1.) వీరు పేర్కొన్న అభిప్రాయం కూడా పైన పేర్కొన్న యస్వీరామారావు గారి నిర్వచనానికి దగ్గరగా ఉంది. అయితే ఇక్కడ ఈ బాగోగుల పరిశీలన అనేది గ్రంథాలకు, కళలకు రెండింటికి అని విమర్శకుడు పేర్కొన్నారు.

“శివుడి సంకల్పం శక్తి సంయోగంతో సృష్టి రూపొందడాన్నే విమర్శ అంటారు. శివుడు ప్రకాశ స్వరూపుడు. శక్తి విమర్శ స్వరూపిణి. ప్రకాశాన్ని విస్తరింపచేసి దర్శింపచేసేది విమర్శ” (రమాపతి రావు, అక్కిరాజు (సంపా.): నేటి తెలుగు సాహిత్య విమర్శ, పుట. 3.) ఇక్కడ పేర్కొన్న ఈ నిర్వచనం ఆధ్యాత్మికానికి దగ్గరగా ఉండి సాహిత్య విమర్శను గురించి సూటిగా చెప్పినట్లనిపించడం లేదు.

“ఒక గ్రంథమును గైకొని, అందలి లోపములను, ఔచిత్యానౌచిత్యములను, భావగంభీరతను, అలంకార రచనా పాటవమును, ధ్వని విశేషములను, శయ్యాసౌభాగ్యమును, వస్తునిర్మాణ సౌష్టవమును, పాత్రపోషణ, రషపోషణ, సన్నివేశ కల్పనాదులను, వేయేల ఆ గ్రంథమునకు సంబంధించిన సర్వ విషయాలను కూలంకషముగా చర్చించి వాఙ్మయమున నా గ్రంథమునకు గల స్థానమును నిరూపించుటయే విమర్శ యనబడును.” (వెంకటరామనరసింహం, కాకర్ల: సాహిత్య దర్శనము, పుట.16.) సాహిత్య రచనను అన్ని విధాలుగా చర్చించడాన్ని విమర్శగా ఈ నిర్వచనం పేర్కొంటుంది.

"ఒక రచన చదివి చాలా బాగుంది అని అన్నా, ఆ రచనలోని కొన్ని భాగాలను చదివి చాలా బాగుంది అని అన్నా, ఆ రచన మనకు తెలిసినట్లు కాదు. రచన మనకు బాగుంది అని అనిపించినప్పుడు అందులోని 'బాగు' ఏమిటి? అది అందులో ఎక్కడ వుంది? దాన్ని విడదీసి చూపడనికి వీలుగా వుందా? లేదా పాలలో వెన్నలాగ అది ఆ రచన మొత్తంగా వ్యాపించి దాని జీవంగా వుందా? దాన్ని మాటల్లో చెప్పడానికి వీలుందా? ఆ చెప్పడం మామూలు మాటల్లోనా? విశిష్టమాటల్లోనా? విశిష్టమాటల్లొ చెప్పడం వల్ల కలిగే అధిక ప్రయోజనం ఏమిటి? మొదలైనవి మనకు తెలియాలి. స్థూలంగా చెప్పాలంటే విమర్శ అంటే ఈ ప్రశ్నలకు సమాధానమే" (వీరభద్రయ్య, ముదిగొండ: విమర్శ మౌలిక లక్షణాలు, పుట.1.). ఈ నిర్వచనం విమర్శకు సంబంధించిన అన్ని విషయాలను పేర్కొంటుంది. విమర్శ అంటే ఏమిటో నిర్వచిస్తూనే విమర్శ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా తెలుపుతుంది. విమర్శ గురించి సమగ్రంగా ఈ నిర్వచనం తెలుపుతుందని పేర్కొనవచ్చు.

స్థూలంగా చెప్పాలంటే 'ఒక సాహిత్య రచనలోని సాహిత్యాంశాలతో పాటు సాహిత్యేతర అంశాలను కూడా వివరించి, విశ్లేషించి విలువ కట్టడాన్ని సాహిత్య విమర్శ'గా పేర్కొనవచ్చు.

"సాహిత్యమంటే వస్తుసన్నివేశానికి తగినట్లు శబ్ద సంపదను అమర్చి భాషాపరికరంతో భావానికి ఆకృతి తీర్చిదిద్దడం అని అనుకుంటే ఆ అమరిక, ఆ ఆకృతి ఎలా వున్నాయో వాటి బాగోగులను పరిశీలించడమే విమర్శ అవుతుంది" (జోగారావు, యస్వీ: సాహిత్యవల్లి, పుట.78.)

## పాశ్చాత్య నిర్వచనాలు

Cuddon "criticism' అనే పదానికి "The art or science of literary criticism is devoted to the comparison and analysis to the interpretation and evaluation of works of literature" అని పేర్కొన్నారు. ( Cuddon,John Anthony:

A Dictionary of literary terms, P.196.)

మరో విమర్శకుడు ఈ క్రింది విధంగా నిర్వచించాడు. "criticism or more specifically literary criticism is the overall term for studies concerned with defining, classification, analyzing, interpreting and evalution of works of literaure" ( Abrams, MH: A glossary of literary terms, P. 49-50.)

పై రెండు నిర్వచనాలను పరిశీలిస్తే రెండింటిలో కూడా సామాన్య విషయం ఒకటి అర్థమవుతుంది. అది సాహిత్యం అనేది సాహిత్యానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించించేది అని రెండు నిర్వచనాలు తెలుపుతున్నాయి.

"Literary criticism is a distinctive activity of the civilized mind."(Eliot, T.S: Selected prose of T.S. Eliot,P.7.) ఇక్కడ సాహిత్యమనేది కేవలం నాగరిక ఆలోచనా విధానం అని పేర్కొనడం వలన ఒక సందేహం వస్తుంది. నాగరికం అనేది కాలవాచినా? కాదా? అనే సందేహం వస్తుంది. సాహిత్యం ఉన్న చోట ఏదో ఒక రూపంలో విమర్శ కూడా ఉంటుంది. రెండూ ఉన్న సమాజాన్ని నాగరిక సమాజంగా పేర్కొనవలసి వస్తుంది.

"Criticism is at once a science and an art. As a science it involves examination of particular works, observation of their faults and excellences and (in so far as a may be) the induction of general principles. As an art it engages in the production of stimulating works" (Shipley T.T(Ed): A Dictionary of world literature, p.81 )

"Criticism as I understood is the Endeavour to discriminate between experiences and to evaluate them" (Richards. I.A: principles of literary criticism, p.1.)

పై నిర్వచనాలు చెప్పే విధానం వేరుగా ఉన్నప్పటికీ చివరికి అన్ని విమర్శల సారాంశం మాత్రం సాహిత్యాన్ని పలు కోణాల నుంచి విశ్లేషించి, విడమర్చి, అందులోని లోతుపాతులను, మంచి చెడ్డలను చెప్పేదే విమర్శ అనే భావం వ్యక్తమవుతుంది.

## 1.4. విమర్శ ప్రయోజనం

విమర్శ వలన కలిగే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్న కలుగుతుంది. సమాధానంగా విమర్శ ప్రయోజనంపై పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

“పండిన వృక్షమునకే రాతి దెబ్బలన్నట్లు పుస్తకములు వ్రాయువారికే విమర్శనములను రాళ్ళు తాకును. అయిననవి మొదల కొంత నొప్పి కలిగించినను గ్రంథకర్తను కాలక్రమమున గట్టివానింగావించుటయేకాక యాతనికి మహోన్నతులంజేసి విమర్శనముల గురికందనివానిగా జేయును” (వీరేశలింగం పంతులు, కందుకూరి: స్వీయచరిత్రము, పుట.168.) అని కందుకూరి వీరేశలింగం పంతులుగారు అభిప్రాయ పడ్డారు. దీని ద్వారా కవి/రచయితకు ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్న మాటను కవి/రచయితలందరు అంగీకరిస్తారు.

“నిజమునకు విమర్శ అనునది కావ్యమును శ్రద్ధగా చదివి ఆకలింప చేసుకొన్న వారికి మాత్రమే ఉద్దేశింపబడినది. వానికే అది ప్రయోజనకారి. అతడు కావ్య పఠన వేళ తనకు కలిగిన అనుభవాలను ఆ విమర్శతో పోల్చి చూసుకొని విమర్శకునకును, తనకును ఏకవాక్యత కలిగినప్పుడు సంతోషించుచూ, కలగనప్పుడు తన అభిప్రాయమును గూర్చి పునఃపరిశీలన చేసికొనును. ఈ విధముగా అతని సారస్వత మననాభ్యాసము బలపడుచుండును. ఇది గాక సద్విమర్శ వలన వచన వాఙ్మయము చాలా వృద్ధి చెందును. లోకములో ఏ ఇతర విషయములనో పురస్కరించుకొని వ్రాసెడి వచనములకంటే, కవులను, వారి కావ్యములను పురస్కరించుకొని చేసెడి వచన రచన యించుమించు కావ్య వాఙ్మయము వంటిదగును. అందుచే కావ్య విమర్శ సార్థకమే.” (లక్ష్మీకాంతం, పింగలి: సాహిత్య శిల్ప సమీక్ష, పుట.325-326.)

"ఉత్తమమైన విమర్శ పఠితలకు విజ్ఞాన వికాసములు చేకూర్చుటయే కాక వారియందు నూత్న చైతన్యము రేకెత్తించును. మహా కవులు తమ కావ్యముల ద్వారా మానవ జీవితపరమార్థమును జూర లొసంగ విమర్శకులు తమ విమర్శల ద్వారా సారస్వత పరమార్థమును జూరయిచ్చుచుందురు. ఉత్తమ విమర్శకులు పఠితల యవగాహన శక్తికి కలిగించు దోహదము పలు విధములుగా నుండును. వారు వారికి క్రొత్త భావములందింతురు. వారిలోనస్పష్టములు, సంశయాస్పదములను తొలగించి దృఢపరుతురు. వారొకవేల పెడదారినిబట్టుచో సన్మార్గమును జూపుదురు. వారికి మూల గ్రంథమును నూత్న దృక్పథముతో పఠించి యానందించు నవకాశమొసంగెదరు". (వెంకటావధాని, దివాకర్ల: సాహిత్య సోపానాలు, పుట.5.)

"విమర్శ ఎవరికోసం? రచయిత కోసమా? లేదు విమర్శకునికోసమేనా? అంటే అసలు విమర్శ ఎందుకోసం? ఈ ప్రశ్నలకు సమాధానంలో విమర్శ ప్రయోజనం దీని ప్రత్యేకతలు తేలుతాయి.

-- జ్ఞానం కావాలన్నవాడికోసం విమర్శ

--పాఠకుల ఆలోచనకు ప్రేరకం విమర్శ

--పాఠకుల ఆలోచనలకు మిత్రం విమర్శ

--రచయితకు భవిష్యన్మార్గం చూపేది విమర్శ

--అతనికి కూడా గుప్తంగా ఉండేదాన్ని విడమరిచేది విమర్శ

--పాఠకులకు కలిగే అనిర్వచనీయ అనుభూతిని వాగ్రూపంలో స్పష్టపరుచునది విమర్శ

--అందరిలోనూ సాహిత్యాభిలాషను కాపాడేది, పోషించేది, పెంచేది విమర్శ." (వీరభద్రయ్య, ముదిగొండ: విమర్శ మౌలిక లక్షణాలు, పుట.16.)

"ఉత్తమ సాహిత్యం పెంపొందడానికి, రచయితలు తమ రచనల్ని తీర్చిదిద్దుకోవటానికి సద్విమర్శ చాలా తోడ్పడుతుంది. అలాగే మంచి సాహిత్యం పాఠకుల పఠనాసక్తిని పెంచుతుంది. మంచి విమర్శ పఠనాసక్తిని పెంచడానికి దోహదం చేయగలదు." (సంజీవమ్మ, పి: సాహిత్య విమర్శ, పుట.174.)

“సాహిత్యం లేకుంటే సాహిత్య విమర్శ రాదు. మంచి సాహిత్య విమర్శ లేకుంటే మంచి సాహిత్యమూ రాదు.” (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి: వల్లంపాటి సాహిత్య వ్యాసాలు, పుట.2) విమర్శ ప్రయోజనాన్ని గూర్చి టి.యస్. ఇలియట్ ఇలా పేర్కొన్నాడు. “ Criticism must always profess an end in view, which roughly speaking, appears to be the elucidation of works of art and the correction the taste" (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి: వల్లంపాటి సాహిత్య వ్యాసాలు, పుట.3 లో ఉదాహృతం)

"The object of the criticism is to describe the work and to persuade the reader that the description is valid" (Philip, Hobs Baum: Essentials Of Literary criticism, P. 12)

ఈ నిర్వచనాలన్ని కూడా కవి/రచయితకు, పాఠకునికి ప్రయోజనం అని చెబుతూనే సాహిత్య విమర్శ తప్పనిసరిగా అవసరం అని అందరు అంగీకరించారు. పై అభిప్రాయాలను పరిశీలించినట్లైతే విమర్శ వలన పలువురికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలుస్తుంది. విమర్శ వలన రచయిత, పాఠకుడితో పాటు విమర్శకుడికి కూడా ప్రయోజనం కలదు.

### 1.4.1. రచయితకు గల ప్రయోజనం

రచయిత తాను రాసిన రచనను కేవలం తనకోసం కాకుండా తన భావాలను, అభిప్రాయాలను సమాజానికి తెలపడానికి రచన చేస్తాడు. రచయిత రచనలోని వస్తు, రూప, శిల్పగతమైన తప్పులు/ పొరపాట్లు ఏమైనా ఉంటే విమర్శకుడు వాటిని ఎత్తి చూపుతాడు. తద్వార రచయిత ఆ తరువాత రచనల్లో తప్పులు/ పొరపాట్లు పునరావృత్తం కాకుండా జాగ్రత్త పడతాడు. కందుకూరి వీరేశలింగం పంతులు గారి మాటల్లోని అంతరార్థం అదే. ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు చెప్పిన మాటలో ఒక అంశం ‘రచయితకు/కవికి కూడా తెలియని నిగూఢ అర్థాన్ని విమర్శకుడు

పేర్కొంటాడు' అని తెలపడం వలన కొన్ని సందర్భాల్లో రచయిత/కవి గుర్తించని విషయాలను కూడా విమర్శకుడు తెలుపుతాడని భావం. కాబట్టి ఇది రచయితను/కవిని మరింత ఉత్తమ రచయిత/కవిగా చేస్తుందనడంలో సందేహం లేదు.

### 1.4.2. పాఠకుడికి గల ప్రయోజనం

రచయిత రాసిన రచనలోని అన్ని అంశాలు అందరికి అర్థం కావు. రచయితకు కలిగిన భావాలు గ్రంథస్థమైనప్పుడు ఆ గ్రంథంలోని రచయిత భావాలను పాఠకులకు అందించే బాధ్యత విమర్శకుడిది. విమర్శ వలన ఆ గ్రంథంలోని నిజానిజాలు, లోటుపాట్లు, తప్పొప్పులు గ్రంథ రచయితతో పాటు పాఠకునికి కూడా చేరతాయి. తద్వారా పాఠకుడు గ్రంథాన్ని చదివి మరింతగా గ్రంథాన్ని అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. ఏ గ్రంథం ఉత్తమమైంది? ఏది కాదు? అని పాఠకుడికి తొందరగా అర్థమవుతుంది. విమర్శకుడు అందించే విమర్శ పాఠకుడికి మరింత జ్ఞానం సంపాదించుకోవడానికి అవసరమవుతుంది. అంతే కాకుండా రచయిత రాసిన ప్రతి రచన ఉత్తమమైంది కాదు. వాటిని వెలికి తీసి ఉత్తమమైన సాహిత్యాభిరుచిని పాఠకుడికి కలిగిస్తుంది విమర్శ.

### 1.4.3. విమర్శకుడికి గల ప్రయోజనం

రచయిత రాసిన గ్రంథంపై విమర్శకుడు విమర్శ వెలువరిస్తాడు. అయితే విమర్శకుడు కొన్ని సందర్భాల్లో రచనను తప్పుగా దర్శించవచ్చు. రచయిత దర్శించిన దానికి వ్యతిరేకంగా విమర్శకుడు తప్పుగా అర్థం చేసుకోవచ్చు. వేరొక విమర్శకుడు పూర్వ విమర్శలోని లోపాలను విడమరచి చెప్పవచ్చు. అటువంటి సందర్భాలలో పూర్వ విమర్శకుడు తన తరువాత వచ్చిన విమర్శలను చదివి తన విమర్శలోని లోపాలను సరిదిద్దుకొని ఉత్తమ విమర్శకుడిగా రూపొందడమే కాకుండా ఉత్తమ విమర్శను పాఠకుడికి, రచయితకు అందివ్వగలుగుతాడు.

పై విషయాల సారాంశాన్ని ఈ విధంగా చెప్పవచ్చు. విమర్శ ప్రయోజనంలో ముగ్గురి పాత్ర కనిపిస్తుంది. విమర్శ వలన సాధారణ పాఠకుడు మరింతగా గ్రంథాన్ని అర్థం చేసుకొంటాడు. ఒక దశ తరువాత తాను కూడా విమర్శకుడుగా విమర్శ చేయగలడు. విమర్శకుడు పలు రకాల రచనలను పరిశీలించడం వలన తాను ఉత్తమ విమర్శకుడుగా తయారు కాగలడు. ఇక అందరి కంటే ప్రయోజనకారి గ్రంథ రచయిత. విమర్శ వలన తన రచనలోని లోపాలను సరి చేసుకొని మరింత ఉత్తమ రచయితగా పరిణతి సాధించవచ్చు.

## 1.5. విమర్శ పద్ధతులు

సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి నేడు అనేక రకాలైన ప్రాచీన, ఆధునిక విమర్శనా పద్ధతులు ఉన్నాయి. అందులో కొన్ని ప్రాచుర్యం పొందినవి కాగా కొన్ని కేవలం ఒక పద్ధతిగా మాత్రమే మిగిలి పోయాయి. అయినప్పటికి ఎన్ని విధాలైన విమర్శనా విధానాలు ఉన్నాయో తెలుసుకోవడం అవసరం.

1. గ్రాంథిక విమర్శ
2. నైతిక విమర్శ
3. వివరణాత్మక విమర్శ
4. అభినందనాత్మక విమర్శ
5. తులనాత్మక విమర్శ
6. నిర్ణయాత్మక విమర్శ
7. ఆలంకారిక విమర్శ
8. సాంప్రదాయక విమర్శ.
9. పునర్నవ సాంప్రదాయక విమర్శ
10. ప్రక్రియా విమర్శ

11. కాల్పనిక విమర్శ

12. సాంకేతిక విమర్శ

13. ఔపదేశిక విమర్శ

14. సౌందర్య దృక్పథ విమర్శ

15. ప్రమోద కాముక విమర్శ

16. ప్రకృతివాదవిమర్శ

17. సిద్ధాంత విచార విమర్శ(సూత్ర విమర్శ)

18. మౌలిక పరిణామ దృక్పథ విమర్శ

19. న్యూ క్రిటిసిజం (నవ్య విమర్శ)

20. సముద్దేశ నిర్ణయ విమర్శ

21. విశదీకరణ విమర్శ

22. తర్క సహ విమర్శ

23. మౌలిక విమర్శ

24. వర్ణనాత్మక విమర్శ

25. ప్రాదేశిక విమర్శ

26. శైలీ శాస్త్ర విమర్శ

27. నిర్మాణవాద విమర్శ

28. వినిర్మాణ వాద విమర్శ

29. స్త్రీవాద విమర్శ

30. దళితవాద విమర్శ

31. ముస్లిం వాద విమర్శ

32. ప్రాంతీయవాద విమర్శ

33. అభిరుచి విమర్శ

34. ప్రతీక వాదవిమర్శ

35. గ్రంథ పరిష్కార విమర్శ

36. సామాజిక విమర్శ

37. మనస్తత్త్వ శాస్త్ర విమర్శ

38. కవి జీవిత విమర్శ

39. మార్క్సిస్ట్ విమర్శ

40. చారిత్రక విమర్శ

పైవిమర్శనా పద్ధతులు వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రాచీన విమర్శనా పద్ధతులని, ఆధునిక విమర్శనా పద్ధతులని రెండు విధాలుగా విభజించవచ్చు. ఆధునిక విమర్శ పద్ధతులను తిరిగి సాహిత్య సంబంధమైన విమర్శనా పద్ధతులు, సాహిత్యేతర విమర్శనా పద్ధతులని విభజించవచ్చు. సాహిత్య సంబంధమైన విమర్శనా పద్ధతులను వస్తుగత విమర్శనా పద్ధతులు, శిల్పగత విమర్శనా పద్ధతులు, వస్తు శిల్పగత విమర్శనా పద్ధతులుగా విభజించవచ్చు.

ఇందులో కొన్ని విమర్శనా పద్ధతులతో చారిత్రక విమర్శకు సన్నిహిత సంబంధం ఉంది. ఈ అంశాన్ని తరువాత చర్చించాను. చారిత్రక విమర్శతో సంబంధం ఉన్న విమర్శనా పద్ధతులను మాత్రం ఇక్కడ నామమాత్రంగా పేర్కొదలిచాను.

## 1.5.1. గ్రంథ పరిష్కార విమర్శ

దీనిని ఇంగ్లీషులో Bibliographical criticism, Textual criticism, Exegetical criticism అనీ అంటారు. ఇది కేవలం సాంకేతికమైనది. ఈ పద్ధతిలో విమర్శకుడు కావ్యాలలోని కళాత్మకతను గురించి కాక రచయిత రచనకు గల మూలాలను, ఆకరాలను అన్వేషించడం, కాలనిర్ణయం చేయడం మొదలైనవి చేస్తాడు. "గ్రంథ పాఠాల నిర్ణయం, మార్పులను, చేర్పులను, కూర్పులను, ప్రక్షిప్తాలను, గ్రంథ పాఠాలను, వ్రాత దోషాలను, చివరకు ముద్రారాక్షసాలను గురించి పాఠ పరిష్కర్తలు యిందులో పరిశ్రమ చేయాల్సి వుంటుంది" (సుబ్రహ్మణ్యం, జి,వి: ఆంధ్ర సాహిత్య విమర్శ పై

ఆంగ్ల ప్రభావం, పుట.144.) అని ఈ విమర్శనా పద్ధతి స్వభావాన్ని వివేచించారు. దీంట్లో విమర్శకుడికి ప్రధానంగా కావాల్సింది లిపి జ్ఞానం. ఒక గ్రంథంపై విమర్శ చేయవలసినప్పుడు పరిష్కృత ప్రతి అవసరమేర్పడుతుంది.

ఈ విమర్శనా పద్ధతిలో కావ్య వస్తువుగానీ, కావ్యగత శిల్పాన్ని గానీ వివరించరు. విమర్శ చేయడానికి ఇది ప్రాథమిక ఆధారంగా ఉపయోగపడుతుంది. అందువలన గ్రంథపరిష్కార విమర్శ ఒక సాహిత్య విమర్శ అని పేర్కొనడానికి అవకాశం లేకుండావుంది. గ్రంథం మీద విమర్శ చేసే విమర్శకులకు ఆధారంగా నిలిచి సహకరించడమే గ్రంథ పరిష్కార విమర్శ ప్రధాన లక్ష్యం.

### 1.5.2. కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ

ఈ విమర్శను ఆంగ్లంలో "Biographical Criticism" అని అంటారు. కవిజీవితానికీ, కవి రచించిన కావ్య రచనకు మధ్య వున్న సంబంధాన్ని పరిశీలించే విధానాన్ని కవిజీవిత కావ్య సమన్వయ విమర్శగా పేర్కొంటున్నారు. ఇందులో "కవుల జీవిత ఘట్టాలూ, వారి మానసిక స్థితులూ, వారి తాత్త్విక భావనలూ, వారి రచనలో ఎలా ప్రతిబింబించాయని కానీ, వారి వ్యక్తిత్వాలు కృతులనెలా రూపొందింపజేశాయని కానీ వివేచించే విమర్శనా పద్ధతి యిది." (పైదే, పుట.145.) దీనినే "కవిజీవిత చరిత్రాత్మక సాహిత్య విమర్శగాను కొందరు సూచిస్తున్నారు". (లక్ష్మణచక్రవర్తి, సిహెచ్., వారిజారాణి,పి., విజయకుమారి,జి. (సంపా): ఆధునిక సాహిత్య విమర్శ రీతులు, పుట.74.)

### 1.5.3. సాంఘిక విమర్శ

ఈ విమర్శను ఆంగ్లంలో 'Sociological Criticism' అని అంటారు. సమాజానికి, సాహిత్యానికి గల పరస్పర సంబంధాన్ని వివరిస్తుందీ విమర్శ. ఈ విమర్శ సాంఘిక

విషయాలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది. రచయిత తన సమాజంలోని అనేక విషయాలను తన రచనలో ప్రతిబింబింపచేస్తాడని, సమకాలీన దేశ, కాల పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని రచనలు చేస్తుంటాడని, వాటిని వివరించేది సామాజిక విమర్శ అని విమర్శకుల అభిప్రాయం.

## 1.5.4. మనోవైజ్ఞానిక విమర్శ లేదా మనో విశ్లేషణాత్మక విమర్శ లేదా మనస్తత్వ విమర్శ

దీనిని ఆంగ్లంలో Psycho analytical Criticism అంటారు. మనోవైజ్ఞానిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను తీసుకొని వాటిని సాహిత్యానికి అన్వయించి చూసేది మనోవైజ్ఞానిక విమర్శ. మనిషి అనుభవాన్నీ, ప్రవర్తననూ, భావజాలాన్ని శాస్త్రీయంగా పరిశీలించేది మనోవిజ్ఞానశాస్త్రం. సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్ అనే మానసిక తత్త్వవేత్తల తత్త్వ విశ్లేషణ సిద్ధాంతాలను సాహిత్యానికి అన్వయించి అనుశీలన చేయడం ఈ విమర్శలోని ప్రధానాంశం.

"మనోవిశ్లేషణాత్మక విమర్శ అనేది రెండు విధాలుగా జరుగుతుంది. 1. పాత్రల ప్రవర్తనలోని వైచిత్రిని సైకో ఎనాలసిస్ సిద్ధాంత నేపథ్యంలో విశ్లేషించి వివరించడం. 2. రచయిత సృష్టించిన పాత్రల నేపథ్యంలోనుంచి, అతను జీవించిన కాలంనాటి పరిస్థితుల నేపథ్యంలోంచి, రచయిత అంతరంగ ప్రవృత్తిని అంచనా వేయడం." (పైదే, పుట - 159)

## 1.5.5. మార్క్సిస్ట్ విమర్శ

కారల్‌మార్క్స్ సిద్ధాంతాన్ని, ఆలోచనలను మార్క్సిజం అని అంటారు. మార్క్స్ సిద్ధాంతాలు మార్క్సిస్టు విమర్శకు మూలాధారాలు. మార్క్సిస్ట్ విమర్శను 'గతితార్కిక చారిత్రక భౌతిక వాదవిమర్శ' అని కూడా పేర్కొంటారు. మార్క్స్ సిద్ధాంతాలకు భౌతిక వాదం మూలం. మార్క్స్ భౌతికవాద దృక్పథాన్ని మానవ సమాజ చరిత్రకు, సమాజ పురోగమనానికి అన్వయించి రెండు సిద్ధాంతాలు ప్రతిపాదించాడు.

1. గతి తార్కిక భౌతిక వాదం

2. చారిత్రక వాదం

**1. గతి తార్కిక భౌతిక వాదం:** "గతితార్కిక భౌతికవాదం మార్క్సిస్టు, లెనినిస్టు ప్రాపంచిక దృక్పథం. ప్రకృతి యొక్క దృగ్గోచర విషయాలను పరిశీలించే పద్ధతి, వాటిని అధ్యయనం చేసి అర్థమొనర్చుకునే పద్ధతీ గతితార్కికం. ప్రకృతి దృగ్గోచర విషయాలను భాష్యీకరించు పద్ధతీ, ఆ దృగ్గోచర విషయాలను గురించి భావించుటా, దాని సిద్ధాంతమూ భౌతికం. అందుచే దీనిని గతితార్కిక భౌతిక వాదం అని అంటారు". (మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక పరిచయం: పుట.48.)

**2. చారిత్రక వాదం:** "చారిత్రక భౌతికవాదమనగా గతి తార్కిక భౌతిక వాద సూత్రాలను సామాజిక జీవిత అధ్యయనానికి విస్తరింపచేయుట. సామాజిక జీవిత దృగ్విషయాలకూ, సమాజాన్నీ, సమాజ చరిత్రనూ అధ్యయనం చేయడానికి గతి తార్కిక భౌతికవాద సూత్రాలను అనువర్తింపచేయుటయే చారిత్రక భౌతికవాదం " అని స్టాలిన్ బోల్షివిక్ పార్టీ చరిత్రలో పేర్కొన్నాడు (పైదే)

"మార్క్సిస్ట్ విమర్శ సాహిత్యాన్ని భౌతిక వాద దృక్పథంతో పరిశీలిస్తుంది. కళ కళకొరకు కాదని, సామాజిక ప్రయోజనం కొరకని వాదించును. సామాజిక ప్రేరణ లేకుండా కళావిర్భావం ఏ సాహిత్యము ఉద్భవించదని, సమాజముతో సంబంధములేని సాహిత్యోద్యమములు, రచనలు సామాజిక వాస్తవికతనుండి పారిపోవుటకు చేయు ప్రయత్నములని భావించును. మార్క్సిస్టు విమర్శ చారిత్రక నేపథ్యం ఆధారంగా రచన యొక్క వస్తు రూపములను పరిశీలించును. గొప్ప రచనలో ఈ రెండును సమిలితమై యుండుననియు, సామాజిక సత్యము నుండి ఆవిర్భవించిన సాహిత్యము మరల సామాజిక సత్యమును ప్రభావితము చేయునని ఈ విమర్శకుల అభిప్రాయము" (రామారావు, యస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, పుట.192.)

### 1.5.6. చారిత్రక విమర్శ

పాశ్చాత్య విమర్శకులు సాహిత్యావగాహన కొరకు వివిధ రకాల పద్ధతులను అన్వేషించారు. ఆధునిక విమర్శకులు చారిత్రక పరిణామానికీ, సాహిత్య వికాసానికి దగ్గర సంబంధం ఉంటుందని గుర్తించారు. అందువలన విమర్శకులు సాహిత్య అధ్యయనం ద్వారా తెలుసుకోగలిగిన సామాజిక చారిత్రక జ్ఞాన సంపద ఎంతైనా ఉంటుదని పేర్కొంటున్నారు. సాహిత్యానికున్న ఈ సదవకాశాన్ని వినియోగించు కోవడానికి చారిత్రక విమర్శ పద్ధతిని వినియోగించుకుంటున్నారు.

చారిత్రక విమర్శ అనే పదం ఆంగ్లంలోని HISTORICAL CRITICISM అనే పదానికి సమానార్థకంగా వాడుతున్నారు. మొదట ఈ చారిత్రక విమర్శ అనే పదం చరిత్రను సరైన పద్ధతిలో ఉపయోగించుకోవటానికి వాడారు. తరువాత ఇది సాహిత్య విమర్శకు ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ పదాన్ని సాహిత్య విమర్శలో ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిన విమర్శకుడు 'టెయిన్'(TAINE) అని చెబుతారు. ఈ చారిత్రక విమర్శ అనే పదానికి సాహిత్య విమర్శలో ఒక ప్రత్యేక అర్థంలో వాడారు. 'ప్రజలకు సంబంధించిన ఆలోచనలను, జ్ఞానాన్ని సాహిత్యం ద్వారా తెలుసుకోవడానికి ఉపయోగించే జ్ఞాన సంపద' అనే అర్థంలో చారిత్రక విమర్శ అనే పదాన్ని వాడారు. టెయిన్ చారిత్రక విమర్శలో సాహిత్యాన్ని చరిత్రకు సంబంధించిన పత్రాలు(Documents)గా భావించాడు. టెయిన్ తరువాత చారిత్రక విమర్శ గురించి, చారిత్రక విమర్శ అంటే ఏమిటి అనే దానిని గురించి కొంత చర్చ కూడా జరిగింది. "Historical criticism is a criticism that tries to read past works of literature in the way in which they were read when they were new. (Jackson, J.R.de.J: Historical Criticism and Meaning of the Text, p. 3.) అని పాశ్చాత్య విమర్శకుడు పేర్కొన్నారు.

చారిత్రక విమర్శను తెలుగులో కూడా నిర్వచించారు. "ఒక యుగంలో ఒక ప్రక్రియలో వెలసిన కావ్యం యొక్క విలువను నిర్ధారించటానికి ఆ ప్రక్రియ యొక్క చారిత్రక జ్ఞానం అవసరం. ప్రక్రియ యొక్క పుట్టుపూర్వోత్తరాలు, వికాసదశ మొదలైన వాటి యొక్క చారిత్రక పరిజ్ఞానం లేనిదే సాహిత్యపు విలువలు నిగ్గుతేల్చడం సాధ్యం కాదని భావించే విమర్శనా విధానం చారిత్రక విమర్శ". (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, 1980 మార్చి, పుట - 115)

రచనను ఒక చారిత్రక అవశేషంగా భావించి దాన్ని ఆధారం చేసుకొని ఆ రచన చిత్రించే కాలంలో ప్రజల జీవితానికి సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకొనే ప్రయత్నం చేయడం ఈ పద్ధతికి ధ్యేయంగా చెప్పబడింది. రచయిత వ్యక్తిగత జీవితం, అతని సామాజిక, రాజకీయ విశ్వాసాలు, రచన చేయబడ్డకాలం, రచన చిత్రిస్తున్న కాలం, ఆనాటి సామాజిక పరిస్థితులు మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని రచనను అధ్యయనం చేయటానికి చారిత్రక విమర్శకులు ప్రయత్నించారు. ఈ అంశాలను పరిశీలించినపుడు మాత్రమే రచన యొక్క సంపూర్ణమైన అర్థం తెలుస్తుందని భావించారు. ఒక విధంగా చెప్పాలంటే గతంలో ఉన్న అసత్యాలను పోగొట్టి సత్యం వైపు దృష్టి మరల్చడానికి చేసే పద్ధతి చారిత్రక విమర్శానా పద్ధతి. మనకు ఉన్న ఆకరాల సహాయంతో మరుగున పడిన సత్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగించే విమర్శనా పద్ధతి చారిత్రక విమర్శ అని చెప్పవచ్చు.

క్లుప్తంగా చెప్పాలంటే 'ఒక సాహిత్య రచనను చారిత్రక దృష్టితో పరిశీలించటాన్ని స్థూలంగా చారిత్రక విమర్శ' అనవచ్చు. ఒక సాహిత్య రచనను ఆ రచయిత వ్యక్తిగత కల్పనాశక్తికి నిదర్శనంగా గాక, సమాజ సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక వ్యాపారానికి నిదర్శనంగా నిరూపించడం ఇందులో ప్రధానం. ఈ పద్ధతి ద్వారా చారిత్రక నేపథ్యంతో సాహిత్యాన్ని విశ్లేషించడం జరుగుతుంది. వివిధ సందర్భాల్లో ఆ సాహిత్యం

అలా ఉండటానికి గల కారణమేమిటన్న దృక్పథంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయటం జరుగుతుంది.

ఈ చారిత్రక విమర్శనా పద్ధతి పలు విధాలుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉన్నటువంటిది. ముఖ్యంగా ఈ విమర్శనా పద్ధతి చరిత్ర గ్రంథాల మీద ఆధారపడి చేసేటటువంటిది. సహజంగా చరిత్రకు మూడు ముఖ్యమైన ఆధారాలు పేర్కొంటారు. అవి 1. లిఖితమైన ఆధారాలు 2. అలిఖితమైన ఆధారాలు 3. సంప్రదాయ విధానాలు. ఈ మూడు కూడా చారిత్రక విమర్శనా పద్ధతికి పరోక్షంగా సహాయపడతాయి. ఈ ఆధారాలు ఊహా ప్రతిపాదనకు, ముందుస్తూ వచ్చిన వాదనకు సంబంధించిన చర్చ చేయటానికి ఉపయోగపడతాయి.

### 1.5.6.1. చారిత్రక విమర్శ-ప్రారంభం

చారిత్రక విమర్శన పద్ధతి 1725లో ప్రారంభమైనట్లుగా భావించవచ్చు. "In the year 1975 the Neapolitan philosopher vico published LA SCIENZA NUOVA, a revolutionary work on the philosophy of history, in which he asserted for the first time that the social world was certainly the work of man, and attempted that is, so far as I know, the first social interpretation of a work of literature'' (handy j William & Max West Brook (Ed.): The Historical Interpritation of literature, P. 319) అని ఎడ్మండ్ విల్సన్ (Edmund Wilson) అనే విమర్శకుడు పేర్కొన్నారు. వికో అనే విమర్శకుడు హోమర్ రచనలను తీసుకొని చారిత్రక విమర్శనా దృక్పథంతో విశ్లేషించాడని, ఆ రచనే చారిత్రక విమర్శ ప్రారంభం కావడానికి మూలం అని పేర్కొంటారు. తరువాత కాలంలో ముఖ్యంగా 18వ శతాబ్దం చివరి భాగంలో గొప్ప ప్రచారం జరిగింది. డా.జాన్సన్ షేక్ స్పియర్ రచనలను తీసుకొని వికో పద్ధతిని అనుసరించి పరిశీలించాడు. తరువాత అదే 18వశతాబ్దం చివరలో

హెర్డర్ (HERDER) అనే విమర్శకుడు IDEAS ON THE PHILOSOPHY OF HISTORY అనే గ్రంథంలో కవిత్వం వివిధ రూపాలలో కనిపించటానికి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల ఆచార వ్యవహారాలు, భాష, ఆయా భౌగోళిక పరిస్థితులు కారణమని గుర్తించాడు. తరువాత 1822-23 సంవత్సరాలలో ప్రముఖ తత్వవేత్త హెగెల్ చరిత్రతత్వం గూర్చి చేసిన ఉపన్యాసాలలో జాతీయ సాహిత్యాలన్నీ ఆయా సమాజాల వ్యక్తీకరణలేనని సూత్రీకరించాడు.

చారిత్రక విమర్శకు బాగా గుర్తింపు తెచ్చినవారు ఫ్రెంచ్ విమర్శకుడైన హెచ్. ఏ. టెయిన్ (HIPPOLITE ADOLPH TAINE (1828-1893)). TAINE తో పాటు HISTORIAN CRITICS SCHOOLగా ప్రసిద్ధి చెందిన MICHELET, RENAN, SAINT-BEUVE కూడా చారిత్రక మూలాలతో రచనలు చేయడానికి ప్రయత్నించారు. మొట్ట మొదటి సారిగా చారిత్రక విమర్శ సూత్రాలను సూత్రీకరించి, వాటిని సాహిత్యానికి అన్వయించినవాడు టెయిన్. అయితే టెయిన్ చారిత్రక మూలాలతో సిద్ధాంతంగా తన గ్రంధాన్ని 1863 లో HISTORY OF ENGLISH LITERATURE అన్న గ్రంథానికి రాసిన పరిచయంలో సాహిత్యం జాతి (RACE), యుగవాతావరణం (MILIEU), క్షణం (THE MOMENT) అన్న మూడు అంశాల ఆధారంగా ఏర్పడుతుందని స్పష్టంగా సిద్ధాంతీకరించాడు.

జాతి, యుగవాతావరణం, క్షణం అన్నవి రచయితను తీర్చిదిద్దే అంశాలు. వీటిని వడలి మందేశ్వరరావు గారు క్రింది విధంగా పేర్కొన్నారు. "ఒకానొక కావ్యాన్ని వ్రాసే కవి ఒక జాతికి చెంది వుండటం వల్ల ఆ జాతి లక్షణాలు అతనిలో ప్రతిఫలిస్తాయి. తర్వాత ఆతడు ఆజాతికి, దేశానికి సంబంధించిన సాంస్కృతిక, నాగరికతా వాతావరణంలో పెరుగుతుంటాడు. వాని ప్రభావం రచనల మీద పడుతుంది. ఈ రెండు గాక కావ్య రచనా క్షణం ఒకటి వుంటుంది. ఇక్కడ 'క్షణం' అంటే కావ్య రచనా కాలమందు రచయితను పురికొల్పే అంశం. 'క్షణం' అన్నది యుగసంబంధి. ఒక్కొక్క యుగం మనిషి ప్రవర్తనొక విధంగా మలుస్తుంది" (మందేశ్వర రావు, వడలి: పాశ్చాత్య

సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు, పుట.172-173.)

### 1.5.6.2. చారిత్రక విమర్శకుడి బాధ్యతలు

సాహిత్యం గతం యొక్క సృష్టి అన్నది చారిత్రక విమర్శకుడి విశ్వాసం. రచనాకాలపు వెలుగులో సాహిత్యాన్ని విశ్లేషించడం తన బాధ్యతగా చారిత్రక విమర్శకుడు భావిస్తాడు. గతకాలపు వ్యక్తులు ఏరకంగా ఆలోచించారో, అనుభూతి చెందారో అప్పటి చారిత్రక నేపథ్యంలో ఆయా సాహిత్య రచనల వివరించడం చారిత్రక విమర్శకుడి ధర్మం. సాహిత్య రచనను విమర్శించడమే కాకుండా ఆ రచనకు సంబంధించిన గతతత్వపు ప్రత్యేకతను వివరించడం చారిత్రక విమర్శకుడి ధర్మం.

చారిత్రక విమర్శకుడు సాహిత్య రచనను ఆ రచయిత వ్యక్తిగత కల్పనా శక్తికి నిదర్శనంగా గాక, సమాజ సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక వ్యాపారానికి నిదర్శనంగా నిరూపించటం చారిత్రక విమర్శలో ప్రధానం కాబట్టి అలా నిరూపించినవాడే నిజమైన చారిత్రక విమర్శకుడు. చారిత్రక విమర్శకుడు తన విమర్శలో తెలియ జేయవలసిన అంశాలను విమర్శకులు వివరించారు.

1. గ్రంథం యొక్క పూర్తిపాఠాన్ని సంపాదించి, రచయిత స్థల కాలాదులను నిర్ణయించాలి. అంటే చారిత్రక విమర్శకుడు గ్రంథ పరిష్కర్త పాత్రనుకూడా నిర్వహించాలి.

2. రచయిత రచన చేయటానికి గల పరిస్థితులను సంపూర్ణంగా వివరించాలి.

3. ఆ యుగంలో ఆ రచన సృజింపబడటానికి కారణభూతమైన తాత్విక ఆలోచనను వివరించాలి.

4. ఆ గ్రంథం మీద ఇతర రచనల ప్రభావం ఉంటే చారిత్రక నేపథ్యంతో వివరించాలి.

5. రచన వెలువడిన కాలాన్ని తెలపాలి.

6. రచయిత మేధోపరమైన విశ్వాసాలను, నమ్మకాలను పేర్కొనాలి.

7. ఆ గ్రంథం ఆధారంగా లేదా ఇతర గ్రంథాల ఆధారంగా రచయిత యొక్క జీవిత చరిత్రను తెలపాలి.

### 1.5.6.3. చారిత్రక విమర్శలో విమర్శకుడి ముందున్న సమస్యలు

చారిత్రక విమర్శకుడికి బాధ్యతతో పాటు కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇవి అన్నీ కూడా చారిత్రక విమర్శకుడు చేయవలసిన ప్రధానమైన పనులు.

కొన్ని సందర్భాల్లో కొన్ని విమర్శనా పద్ధతుల ద్వారా విమర్శకుడు రచనకు సరైన న్యాయం చేయలేనపుడు చారిత్రక విమర్శనా పద్ధతిని ఉయోగించిడం అనేది జరుగుతూ ఉంటుంది. ఈ సమయంలో విమర్శకుడు రచయితకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సరిగా అంచనా వేస్తాడు. అందుకు అవసరమైన చారిత్రక సమాచారాన్ని విమర్శకుడు సేకరించాలి. వీటితోపాటు చారిత్రక విమర్శకు సంబంధించిన ఆధార పత్రాలు, దస్తావేజుల పరిశీలన కూడా చారిత్రక విమర్శకుడి బాధ్యత. చారిత్రక విమర్శ సంబంధించిన ఆధార పత్రాలు లిఖిత దస్తావేజులు. లిఖిత దస్తావేజుల్లో రెండు రకాలైన దస్తావేజులు కనిపిస్తాయి. అవి ఒకటి సమూహంగా కనిపించేవికాగా రెండవది వ్యక్తిగతమైనవి. సమూహానికి చెందినవైనా లేదా వ్యక్తిగమైన దస్తావేజులు రెండూ కూడా కొన్ని ముఖ్యమైన విషయాలను వ్యక్తం చేస్తాయి. అవి.

### 1.5.6.3.1. ప్రామాణికమైన లేదా వాస్తవికతను తెలియచేసే దస్తావేజులు

సహజంగా ఈ దస్తావేజులు కవి/రచయిత కాలానికి దగ్గరగా ఉండి నాటి పరిస్థితులను వివరించేవిగా కనిపిస్తే అది కొంత వరకు రచయితను తెలుసుకోవడానికి ఉపకరించే సాధనమవుతుంది. కాని ఇది కొంత వరకు మాత్రమే సరియైన సమాచారాన్ని ఇచ్చేదిగా చెప్పవచ్చు. కొన్ని సందర్భాల్లో ఈ దస్తావేజుల్లో రచయిత/కవిని గురించి ఊహించింది సరైందిగా కాకపోవచ్చు. అటువంటి సమయంలో చారిత్రక విమర్శకుడు రచయిత/కవిని గురించి తప్పుగా ఊహించడానికి అవకాశం ఉంది. కాని దొరికిన ఈ

సమాచారాన్ని బట్టి రచయిత కాలాన్ని సరిగా అంచనా వేయడానికి అవకాశం ఉంది. ముఖ్యంగా ఇది తాళపత్ర గ్రంథాలు, రాగిరేకుల మీద రాసిన సమాచారంగా లభిస్తుంది. కొన్ని సందర్భాల్లో రచయితలు/కవులు రాసిన సొంత దస్తూరితో కూడినవి కూడా ఉంటాయి. మరికొన్ని పలువురు తిరిగిరాసినట్లుగా కూడా కనిపిస్తాయి. ఏది అసలు ఏది నకిలీ అనేది తెలుసుకోవడం కూడా కష్టమవుతుంది. మరికొన్ని సందర్భాల్లో నకలుకు మరికొన్ని నకలు పత్రాలు కూడా లభిస్తాయి. అటువంటి సందర్భాలలో నకలుకు మరికొన్ని నకలు పత్రాలు రాయటం అనేది సహజం కాబట్టి లభించిన ప్రతి పత్రాన్ని సేకరించి, వాటిని ఒకదానితో మరొకటి తులనాత్మకంగా పరిశీలించాలి. తద్వారా వాటి కాలాన్ని అంచనావేయటానికి వీలవుతుంది. అలాంటి వాటిలో సమాన లక్షణాలున్న వాటిని ఒక కుటుంబానికి చెందినవిగా పేర్కొనవచ్చు. అంటే వాటిలో మూలం ఏదో తెలుసుకోవడానికి వీలవుతుంది. చివరికి రచయిత/కవికి సంబంధించిన ప్రాథమిక జ్ఞానాన్ని తెలుసుకోవడానికి వీలవుతుంది.

### 1.5.6.3.2. రచయితను అర్థం చేసుకోవడం

విమర్శకుడు తప్పక తెలుసుకోవలసిన అంశం రచయిత ఏ సందర్భంలో ఆ రచన చేశాడు లేదా ఆ గ్రంథం యొక్క పారమార్థికత ఏమిటి? అని తెలుసుకోవడం. దీనిని రచయిత ధ్వన్యాత్మకంగా ఎక్కడ చెప్పాడో గ్రహించడం అవసరం. ఇది తెలుసుకోవడం అంత సులభం కాదు. చాలా కష్టమైన విషయంగా విమర్శకులు భావిస్తారు. కొన్ని సందర్భాల్లో రచయిత/కవి రచించిన గ్రంథంలోని విషయాలు నాటి పరిస్థితులకు భిన్నంగా కనిపిస్తాయి. వీటికి తోడు నాటి రాజకీయ, మతపరమైన అంశాలను అర్థం చేసుకొని వాటిపై రచయిత/కవికి ఉన్న అభిప్రాయాలను అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ఆ యుగానికి సంబంధించిన ఇతర సాహిత్యాన్ని, రచయిత/కవి ఉన్న పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఈ విషయాలన్నీ కూడా విమర్శకుడు రచయితను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సాధారణ విషయాలుగా గ్రహించాలి.

### 1.5.6.3.3. నిర్ణయాంశం

ఇంతకు ముందు చర్చించిన అంశాల ప్రకారం విమర్శకుడు రచయితకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు రూపొందించుకుంటాడు. అవి రచయితకు సంబంధించిన సమాచారం సరైనదా! కాదా! రచయితను గురించి, కాలాన్ని గురించి పేర్కొన్న అభిప్రాయాలు సరైనవిగా భావించవచ్చా! లేదా! అని నిర్ణయించుకుంటాడు. లభించిన ఆధారాల మీద విమర్శకుడు ఒక సరైన నిర్ణయానికి రావడం అనేది ముఖ్యమైన విషయం. అయితే ఇక్కడ విమర్శకుడు లభించిన ఆధారాలు తనకు అనుకూలంగా ఉన్నా లేదా తన అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఉన్నా వాటిని లభించిన పద్ధతిలోనే విశ్లేషించాలి. ఎటువంటి రాగద్వేషాలకు లోనుకాకుడదు. అలా లభించిన సరైన సమాచారం చారిత్రక విమర్శకు బాగా ఉపయోగపడుతుంది.

### 1.5.6.3.4. అలిఖిత వాఙ్మయం

చరిత్రకు అన్నీ కూడా ముఖ్యమైన ఆధారాలే. ఏదీ కూడా తీసివేసేది కాదు. ముఖ్యంగా వస్తు రూపేణా లభించిచేవి, కట్టడాలు, ఆయుధాలు, నాణాలు, ఇంట్లో ఉపయోగించిన సామాగ్రి మొదలైనవి అన్నీ కూడా చరిత్రకు ముఖ్యమైన ఆధారాలుగానే భావిస్తారు. ఇవి కూడా చరిత్రకు ఉపయోగపడినప్పుడు ఈ అంశాల ఆధారంగా నాటి సాహిత్యంలో వర్ణింపబడిన అంశాలను పోల్చిచూడటం కూడా చారిత్రక విమర్శలో కనిపిస్తుంది. ముఖ్యంగా చరిత్రలో లభించే ఈ అలిఖిత ఆధారాలను తీసుకొని సాహిత్యంలో అవి లభిస్తున్నాయా? లేదా? అని నిర్ధారించుకోవచ్చు.

### 1.5.6.3.5. సంప్రదాయం

చారిత్రక విమర్శకుడు సాహిత్య చరిత్రలో వస్తున్న సంప్రదాయాన్ని కూడా పరిశీలించాలి. సహజంగా కొన్ని సందర్భాల్లో కవులు ఆనాడు కొనసాగుతున్న సాహిత్య

సంప్రదాయాన్ని అనుసరించడం అనేది జరిగితుంది. కొన్ని సందర్భాల్లో ఈ సంప్రదాయం కవులు రచిస్తున్న భాషలో కాకుండా వేరొక భాషలో కొనసాగుతున్న సాహిత్య సంప్రదాయాన్ని అనుసరించడం జరుగుతుంది. మరికొన్ని సందర్భాలలో కవి కొనసాగుతున్న సాహిత్య సంప్రదాయాన్ని కాదని మరొక కొత్త సంప్రదాయాన్ని అనుసరించడం కూడా జరుగుతుంది. చారిత్రక విమర్శకుడు ఈ విషయాలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాలి.

### 1.5.6.3.6. పూర్వవాదం

కొన్ని సందర్భాల్లో పూర్వవాదాన్ని పరిశీలించడం కూడా కొనసాగుతుంటుంది. ప్రస్తుతం కాలంలో విమర్శకుడు సాహిత్య రచనను పరిశీలిస్తున్నప్పుడు గతంలో ఉన్న ఆధారాల పరంగా సాహిత్య చరిత్రను లేదా రచనను పరిశీలించినప్పుడు అక్కడ కొన్ని తప్పుడు ధోరణులు ఉన్నాయనే సందేహం కలుగుతూ ఉంటుంది. చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చరిత్రకారులు, సాహిత్య చరిత్ర కర్తలు ధృవపరిచారు కూడా. ఇక్కడ రెండు సమస్యలు ఎదురవుతాయి. ఒకటి రచయిత తన దృక్పథంతో రచనను రచించినప్పుడు ఆ రచనను విమర్శకుడు మరొక దృక్పథంతో విశ్లేషించడం, రచయిత తను చెప్పదలుచుకున్న అభిప్రాయాన్ని విమర్శకుడు మరొక అర్థంలో వ్యాఖ్యానించటం, కొన్ని సందర్భాల్లో ఒక విమర్శకుడు ఇచ్చిన ఆధారాన్ని అనుసరించి అదే అభిప్రాయాన్ని పలువురు విమర్శకులు కొనసాగించటం జరుగుతూ ఉంటుంది. ఇటువంటి విషయాలలో చారిత్రక విమర్శకుడు సరైన ఆధారాల కోసం వెతికి అవసరమైతే పూర్వ వాదాన్ని ఖండించి సరైన ధోరణిలో పరిశోధన చేయటానికి కూడా సిద్ధపడాలి. దీని వలన చారిత్రక విమర్శకుడు సరైన అధారాల ద్వారా రచయితను, రచనను పరిశీలించగలుగుతాడు. ఈ పూర్వవాదాన్ని పరిశీలించడం అనేది చారిత్రక విమర్శలో విమర్శకుడి ముఖ్యమైన బాధ్యత. పూర్వవాదాన్ని పరిశీలించటం అనేది చారిత్రక విమర్శలో  ఒక భాగం కూడా.

చారిత్రక విమర్శలో కొన్ని రచయిత/కవికి సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయి. అంటే ఈ సమస్యలు రచయిత/కవుల ద్వారా వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రచయిత/కవి తన రచనలో సమాజాన్ని చిత్రించడంలో విఫలమవుతాడు. దానికి గల కారణం కవి తన రచనను సమాజానికి కాక ఒక ప్రత్యేక మనస్తత్వంతో ఫలితాన్ని ఆశించి రచించడం.

మరికొన్ని సందర్భాలలో కొన్ని రచనలు ఒక మంచి సాహిత్య రచనగానూ, చరిత్రను తెలిపే గ్రంథంగానూ కనిపిస్తాయి. ఇటువంటి రచనలను చారిత్రక విమర్శకుడు చారిత్రక విమర్శనా దృష్టితో పరిశీలించడం సులభమవుతుంది. అలా కాకుండా ఇందుకు భిన్నంగా ఉన్న రచన అంటే అటు సాహిత్య పరంగానూ, చారిత్రకపరంగానూ దూరంగా రచించిన రచనలను అర్థం చేసుకొని వాటిని చారిత్రక విమర్శకుడు జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంటుంది.

### 1.5.6.4. చారిత్రకవిమర్శ ప్రయోజనం

ప్రతి విమర్శనా పద్ధతిలో కూడా కొన్ని ప్రత్యేక ప్రయోజనాలుంటాయి. ప్రాచ్య విమర్శనా ప్రయోజనం వలన రచనలోని గుణ దోషాలు తెలుసుకొని అందులోని పరమార్థాన్ని గ్రహించి ఆనంద పడ్డట్టుగా చారిత్రక విమర్శ ద్వారా కూడా కొన్ని ప్రత్యేక ప్రయోజనాలున్నాయి.

"చారిత్రక విమర్శ ప్రధాన ప్రయోజనం అసూయాదులచేత ఏర్పడే అభిప్రాయాలను తెగనరికి ఏ రచనను విమర్శిస్తున్నా నిర్మమతతో కూడిన వీలివ్వడం" (వీరభద్రయ్య, ముదిగొండ: విమర్శ మౌలిక లక్షణాలు, పుట.93.).

"చారిత్రకవిమర్శనాపద్ధతి చాలా ఆకర్షణీయమైనది. దాని వలన కొన్ని ప్రత్యేక ప్రయోజనములు కలవు. అంతర్దృష్టి, సారస్వత వివేచనము లోపించిన కవుల రచనలలోని యనేకాంశములను తెలివితేటలతో సుస్పష్టముగా తెలుసు కొనుటకీపద్ధతి

నుపయోగించును" (పురుషోత్తం, బొడ్డుపల్లి: కాలిదాస కవిత, పుట.34.).

ఈ చారిత్రక విమర్శనా పద్ధతిలో ఎక్కువగా చారిత్రక పరమైన అంశాలను ఉపయోగించుకోవడం జరుగుతుంది. సహజంగా రచనను విమర్శకులు పలువురు పలు విధాలుగా వ్యాఖ్యానించడానికి వీలవుతుంది. అలా విమర్శించడానికి కేవలం రచన ఒక్కటే కారణం కావడం వలన ఎవరికి వీలయినట్లు వారు వ్యాఖ్యానించడానికి వీలవుతుంది. అలా కాకుండా చారిత్రక విమర్శలో పలు ఆధారాలు సాహిత్యానికి వెలుపల చరిత్ర ద్వారా దొరుకుతాయి. కాబట్టి వాటి ద్వారా రచనను విమర్శించాలి. దీన వలన విమర్శకుడు సరైన విమర్శను చేయటానికి వీలవుతుంది.

ఈ విమర్శనా పద్ధతి ద్వారా రచయితకు/కవికి, పాఠకునికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా రచన ద్వారా కవి/రచయితకు పేరు వచ్చినప్పటికీ ఆ రచనలో ఉన్న అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యత ఆ రచన వెలువడటానికి కారణాలను గురించి తెలుసుకోడానికి ఇవ్వరు. ఈ విమర్శనా పద్ధతి ద్వారా పాఠకుడు రచన వెలువడటానికి గల కారణాలను తెలుసుకోగలుగుతాడు. తద్వారా రచన ఉద్దేశాన్ని తెలుసుకోవడానికి వీలవుతుంది.

### 1.5.6.5. చారిత్రక విమర్శ పరిణామం - తక్కిన విమర్శలతోటి సంబంధం

చారిత్రక విమర్శకు మిగిలిన విమర్శనాపద్ధతులైన గ్రంథ పరిష్కార విమర్శ, సాంఘిక విమర్శ, కవిజీవిత విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ, మార్క్సిస్ట్ విమర్శలతో సంబంధం ఉంది. చారిత్రక విమర్శ పరిణామ క్రమంలో వివిధ విమర్శ విధానాలతో కలిసింది. వాటిని గూర్చి క్లుప్తంగా వివరిస్తాను.

#### 1.5.6.5.1. చారిత్రక విమర్శకు గ్రంథ పరిష్కార విమర్శతో గల సంబంధం

చారిత్రక విమర్శకుడు గ్రంథం యొక్క పూర్తి పాఠాన్ని సంపాదించి రచయిత స్థల కాలాలను నిర్ణయించాలి. అంటే చారిత్రక విమర్శకుడికి గ్రంథ పరిష్కరణ కూడా

చేయాలని పేర్కొన్నారు. ఇది ప్రాచీన కాలానికి ముఖ్యంగా పేర్కోదగినటువంటిది. ఇది కూడా ఒక దశ వరకు మాత్రమే అవసరం. అంటే ఒక సారి ఒక రచన లభించిన తరువాత ఆ రచనను పండితులు పరిష్కరించిన తరువాత ఇక తిరిగి ఆ గ్రంథాన్ని పరిష్కరించ వలసిన అవసరం రాకపోవచ్చు. ఇక ఆధునిక కాలంలో చారిత్రక విమర్శకుడు గ్రంథ పరిష్కరణకు సంబంధించి చేయవలసిన పని ఏమి లేదని చెప్పవచ్చు. అందుకు గల కారణం ఇప్పటికే ప్రాచీన కావ్యాలన్నీ కూడా ప్రచురితం కావడం, ఆధునిక కాలంలో వచ్చే గ్రంథాలకు ముద్రణ సౌకర్యాలుండడంతో గ్రంథపరిష్కరణకు సంబంధించిన పని తక్కువని చెప్పవచ్చు.

## 1.5.6.5.2. చారిత్రక విమర్శకు సాంఘిక విమర్శతో గల సంబంధం

చారిత్రక విమర్శ, సాంఘిక విమర్శకు మధ్య గల సంబంధం గురించి విమర్శకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. చారిత్రక విమర్శ కాలక్రమంలో సాంఘిక విమర్శలో భాగంగా కలిసి పోయిందని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు పేర్కొన్నారు.

కాని ఇది సమంజసం అనిపించదు. అందుకు గల కారణం చారిత్రక విమర్శలో సాంఘిక సంబంధ విషయాలు కూడా ఒక భాగంగా ఉంటాయి. చారిత్రక విమర్శ ప్రధాన దృష్టి సాహిత్యానికి సమాజంతో గల సంబంధాన్ని వివరించడం, ఆ సాహిత్యంలో ప్రతిఫలించే సామాజిక అంశాలను వివరించడం. సామాజిక అంశాలలోనే వ్యక్తుల జీవిత విధానాలు కూడా వస్తాయి.

ఆచార్య యస్వీ రామారావు గారు సాంఘిక విమర్శనే చారిత్రక విమర్శగా పేర్కొన్నారు. "సమాజమునకు సాహిత్యమునకు గల పరస్పర సంబంధమును వివరించునది సాంఘిక విమర్శ (Socialogical Criticism) రచయిత జీవితము, దేశ కాలములు, నాటి సాంఘిక విశ్వాసములు, మత, రాజకీయ పరిస్థితులు మున్నగు విషయములను కేంద్రముగా నిడుకొని కావ్య వివేచనకు కడుంగుట ఈ విమర్శ లక్షము.

దీనికే చారిత్రక విమర్శ అనియు వ్యవహారముగలదు" (రామారావు, యస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, పుట. 191.). వీటితో పాటు మరొక ముఖ్య విషయం ఏమిటంటే సాంఘిక విమర్శ ప్రారంభించినవాడు 'టెయిన్' అని పేర్కొంటున్నారు. "ఫ్రాన్సు దేశీయుడైన టెయిన్ సాంఘిక విమర్శకు ఆచార్యుడుగా పరిగణింపబడుతున్నాడు." (పైదే)

కానీ చారిత్రక విమర్శ పితామహుడిగా కూడా టెయిన్ పేర్కొనబడుతున్నాడు. "For Hippolyte Taine, generally recognized as the father of the historical method." (Handy, j. William: (Ed) , Twentieth century criticism The Major Statement, p. 304.)

పై అశాలను పరిశీలించినట్లయితే కొన్ని విషయాలు అవగతమవుతాయి. పాశ్చాత్య దేశాలలో సాంఘిక విమర్శను, చారిత్రక విమర్శను వేరు వేరుగా పేర్కొంటున్నారు. అందుకు గల కారణం తరువాత వచ్చిన మార్క్సిస్ట్ విమర్శ కావచ్చు. టెయిన్ ప్రతిపాదించిన చారిత్రక విమర్శలోని ముఖ్యాంశాలైన జాతి, యుగ వాతావరణం, వికాసదశ అనే అంశాలకు మార్క్స్ ఆర్థిక అంశాన్ని జోడించడంతో అది (మార్క్సిజం) మార్క్సిస్ట్ విమర్శగా తరువాత ప్రసిద్ధి చెందింది. చారిత్రకవిమర్శలో చారిత్రక దృక్పథం ఉండటం, మార్క్సిస్ట్ విమర్శలో చారిత్రకభౌతిక వాద దృక్పథం ఉండటం వలన పాఠకులకు గల గందరగోళాన్ని తొలగించడానికి, చారిత్రక విమర్శలో కనిపించే సాంఘిక విషయాలను దృష్టిలో వుంచుకొని చారిత్రక విమర్శను సాంఘిక విమర్శగా పేర్కొన్నారు. "The Historical Interpretation of the Literature" added to the Triple Thinkers in 1948. "Wilson term is Historical criticism" but this involves the possibility of several confusions. A great deal of valuable historical investigation into the back ground of literature is not really critical or interpretive (it may, for instance, aim to establish a date of

composition): and social milieu, investigated may not be sufficiently of the past to merit clearly the adjective "historical." (Scott, s. Wilbur: Five Approaches of literary Criticism, P.123.)

కావునా సాంఘిక విమర్శను చారిత్రక విమర్శలో భాగంగా గ్రహించవచ్చు. ప్రస్తుతం ఈ పరిశోధనా వ్యాసంలో నేను సాంఘిక విమర్శను చారిత్రక విమర్శలో భాగంగా గ్రహిస్తున్నాను.

### 1.5.6.5.3. చారిత్రక విమర్శతో కవిజీవిత కావ్య సమన్వయ విమర్శకు గల సంబంధం

చారిత్రక విమర్శ ప్రారంభమైనదే కవిజీవిత విమర్శ విధానం నుంచి. "కవి జీవిత విమర్శకు బాసటగా నిలుచునది చారిత్రక విమర్శ. కవి కాల నిర్ణయము, జన్మ స్థల చర్చ, గ్రంథముల పౌర్యపర్యము మొదలగు అంశముల నిర్ధారణకిది దోహదము చేయును." (రామారావు, యస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, పుట.10)

చారిత్రక విమర్శలో ముఖ్యమైన అంశం గ్రంథాల ఆధారంగా రచయిత జీవిత చరిత్రను వెలుగులోకి తీసుకు రావాడం. కావున చారిత్రక విమర్శ కవిజీవిత విమర్శ విధానాన్ని కూడా అవలంభిస్తుంది. కవిజీవిత విమర్శను "కవిజీవిత చారిత్రాత్మక విమర్శ గాను కొందరు సూచిస్తున్నారని" (లక్ష్మణచక్రవర్తి, సిహెచ్, వారిజారాణి,పి, విజయకుమారి,జి. (సంపా). ఆధునిక విమర్శ రీతులు, పుట.74.) పేర్కొనడంలో కవిజీవిత విమర్శకు, చారిత్రక విమర్శకు మధ్య గల సంబంధం వ్యక్తమవుతుంది.

### 1.5.6.5.4. చారిత్రక విమర్శకు మనోవైజ్ఞానిక విమర్శతో గల సంబంధం

చారిత్రక విమర్శకు మనోవైజ్ఞానిక విమర్శతో సంబంధం ఏర్పడటానికి గల కారణం కవిజీవిత విమర్శకు మనోవైజ్ఞానిక విమర్శకు మధ్య గల సంబంధం. రచయిత

సృష్టించిన పాత్రల నేపథ్యంలోనుంచి, అతను జీవించిన కాలంనాటి పరిస్థితుల నేపథ్యంలోంచి, రచయిత అంతరంగ ప్రవృత్తిని అంచనా వేయడం అనేది మనోవైజ్ఞానిక విమర్శలో ప్రధానమైన పద్ధతి. మనోవైజ్ఞానిక విమర్శలో కూడా గ్రంథ రచన ద్వారా రచయితకు సంబంధించిన అంశాలను తెలుసుకునే ప్రయత్నం జరుగుతుంది.

పై అంశాలను పరిశీలించినట్లయితే చారిత్రక విమర్శ, కవి జీవిత విమర్శ, మనో వైజ్ఞానిక విమర్శ మూడింటిలోనూ సమానమైన అంశం రచయిత రచన ద్వారా రచయితకు సంబంధించిన అంశాలను తెలుసుకోవడం. ఈ సహజ లక్షణం చారిత్రక విమర్శ, కవి జీవిత విమర్శ, మనో వైజ్ఞానిక విమర్శల మధ్య సంబంధం ఏర్పడటానికి గల కారణం.

### 1.5.6.5.5. చారిత్రక విమర్శకు మార్క్సిస్టు విమర్శకు మధ్యగల సంబంధం

చారిత్రక విమర్శలో ప్రధానాంశం రచనను చారిత్రక నేపథ్యంతో విశ్లేషించడం, మార్క్సిస్టు విమర్శ ప్రధాన సూత్రాలలో చారిత్రక భౌతిక వాదం కూడా ఒకటి. చారిత్రక విమర్శకు మూలకారకుడైన టెయిన్ ప్రతిపాదించిన అంశాలు, జాతి, యుగవాతావరణం, వికాసదశ అనేవి ముఖ్యమైనవి. అయితే తరువాత కాలంలో వీటికి ఆర్థిక శక్తిని జోడించడంవల్ల మార్క్సిజంగా అభివృద్ధి చెందింది. "కొందరు మార్క్సిస్టు విమర్శను సాంఘిక విమర్శలో ఒక భాగంగా పరిగణింతురు. కాని మార్క్సిస్టు విమర్శకు వలే నిశ్చితమైన తత్వ ప్రతిపాదన, దృష్టికోణము సాంఘిక విమర్శకు లేవు." (రామారావు, యస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, పుట.192)

అయితే చారిత్రక విమర్శ, మార్క్సిస్టు విమర్శ రెండు కూడా చారిత్రక దృష్టితో విమర్శ కావించినప్పటికి చారిత్రక విమర్శను మార్క్సిస్టు విమర్శనుంచి వేరు చేసి చెప్పవచ్చు.

మార్క్సిస్టు విమర్శకు వర్గ దృక్పథం ప్రధానమైన అంశం. కాని చారిత్రక విమర్శకు వర్గ దృక్పథం ఉండదు. మార్క్సిస్టు విమర్శ గత రచనలలోని అంశాలతో

భవిష్యత్ ను కూడా వివరించడానికి ప్రయత్నిస్తుంది. చారిత్రక విమర్శ గత విషయాలను తప్ప భవిష్యత్ విషయాలను పేర్కోదు.

పై అంశాల అధారంగా చారిత్రక విమర్శ తక్కిన విమర్శలతో సంబంధం ఉన్నప్పటికీ విమర్శనా విధానం వలన పలు కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశం కల్పిస్తుందని చెప్పవచ్చు. దీనికి తోడు పలు విమర్శనా పద్ధతుల ద్వారా, పలు విమర్శకులు చేయవలసిన పని చారిత్రక విమర్శకుడు ఒక్కడే చేయవలసి ఉంటుంది. కాబట్టి చారిత్రక విమర్శకుడు తక్కిన విమర్శనా పద్ధతులతో పరిచయం కలిగి ఉంటాడు. కాబట్టి రచనను సమగ్రంగా వివరించడానికి అవకాశం ఉంటుంది.

# రెండవ అధ్యాయం

## ఆంధ్ర మహాభారతం - చారిత్రక విమర్శ

# 2. ఆంధ్ర మహాభారతం - చారిత్రక విమర్శ

నన్నయకు ముందు రచనలు ఉన్నాయా? లేవా? అనే ప్రశ్నకు సంబంధించి ఇప్పటికే పలువురు పరిశోధనలు చేశారు. నన్నయ కంటే పూర్వం ఉన్న సాహిత్య స్థితిని గురించి ఇప్పటికే కొంత చర్చ జరిగింది కాబట్టి వాటిని గురించి కొంత క్లుప్తంగా ఇక్కడ పేర్కొనడం సముచితం. తెలుగులో నన్నయ కంటే పూర్వం కొందరు కవులు ఉన్నట్లు కొన్ని ఆధారాలున్నప్పటికీ, వారికి సంబంధించిన రచనలు మాత్రం లేవు. లభిస్తున్న మొదటి రచన నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం. కాబట్టి, నన్నయను ఆది కవిగా కీర్తిస్తున్నారు. అయితే నన్నయ కంటే పూర్వం కొందరు కవులు ఉన్నట్లు కొన్ని ఆధారాలు ఉన్నాయి. ఆ కవుల రచనలు లభించికపోయినప్పటికీ వారి పేర్లను పేర్కొనడం సముచితం అని వారిని పరిచయం చేస్తున్నాను. అయితే నన్నయకు పూర్వం సాహిత్య చరిత్రలో ఉన్న కవులందరు కూడా జైన మతాన్ని అవలంభించిన వారు. కాబట్టి, వీరిని జైన మత కవులు అని కూడా పేర్కొనవచ్చు.

## 2.1. ప్రాఙ్నన్నయ కవులు

తెలుగు సాహిత్యంలో జైన మతానికి సంబంధించిన రచనలు కనిపించక పోయనప్పటికీ కవుల పేర్లు మాత్రం కనిపిస్తాయి. అందుకు గల కారణం ఆంధ్ర దేశంలో ప్రాచీన కాలం నుంచి జైన మతం కొనసాగడమే. కాని తక్కిన దక్షిణ భారత దేశ సాహిత్య చరిత్రను పరిశీలిస్తే మొదట జైన మత రచనలు ప్రారంభమై, తరువాత వైదిక మత సాహిత్యం ప్రారంభమైనట్లు తెలుస్తుంది. ముఖ్యంగా కన్నడ, తెలుగు భాషలకు సన్నిహిత సంబంధం ఉన్నట్లు సాహిత్య చరిత్ర ద్వారా, చరిత్ర ద్వారా తెలుస్తుంది. కన్నడలో మొదట జైనమతానికి సంబంధించిన రచనలు వెలువడిన తరువాత వైదిక మతానికి సంబంధించిన రచనలు వెలువడ్డాయి. తెలుగులో కూడా ఈ సంప్రదాయం ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ కన్నడలో కనిపించినట్లుగా సాహిత్య రచనలు మాత్రం

కనిపించవు. ఆ కవుల పేర్లను ఇక్కడ పరిచయం చేస్తున్నాను. వీరందరు కూడా జైన మతాన్ని అవలంభించిన వారు. నన్నయ కంటే పూర్వం వారని పరిశోధకులు పేర్కొన్నారు.

### 2.1.1. పంపకవి

పంపకవికి ఉన్న మరొక పేరు పద్మకవి. ఇతడు వేంగీ ప్రాంతంలోని వాడని పరిశోధకులు నిర్ణయించారు. ఇతడు జైన మతస్తుడు. ఇతడు జినేంద్ర పురాణం అనే జైన గ్రంథం కూడా రచించినట్లు తెలుస్తుంది. ఈ రచన ద్వారా జినేంద్ర ముని తన గురువుగా పంప కవి భావించాడని తెలుస్తుంది. ఈ పంప కవి పూర్వీకులు మొదట వేంగీలో ఉండి అక్కడ మత పరిస్థితులు అనుకూలంగా లేనందువల్ల తెలంగాణా ప్రాంతంలోని సబ్బినాడుకు వలస పోయారు. అక్కడ నుండి కర్ణాటకకు వలస పోయి అక్కడ కన్నడంలో మహాభారత రచన చేసినట్లు ఆధారాలున్నట్లు తెలుస్తున్నాయి.

### 2.1.2. గజాంకుశ

మడికి సింగన తన 'సకలనీతి సమ్మతము' అనే గ్రంథంలో గజాంకుశ అనే వారి రచనను కూడా పేర్కొన్నాడు. ఈ గ్రంథ ప్రథమాశ్వాసంలో "...విదుర ధృతరాష్ట్ర బలభద్ర కామాందక గజాంకుశ నీతిసార నీతిభూషణ క్షేమేంద్ర భోజరాజ విభూషణ పురుషార్థసార..." (సింగన, మడికి: సకలనీతిసమ్మతము, పుట.2) అని పేర్కొని ఉన్నాడు. ఇతడు పదవ శతాబ్దానికి చెందిన వాడుగా చరిత్రకారులు భావిస్తున్నారు. గజాంకుశ అనేది పేరు కాదు, బిరుదు అని తెలుస్తుంది. "Gajamkusa was not a name. it was a title. His name was Narayana. He was the Pradhani (Chief Minister) of the Rastrakuta king Krishna III (939-965A.D)" (Krishna murthy, salva: A History of Telugu Literature, P. 192) ఇతడు కంచన ముదువోలు అనే గ్రామానికి చెందినవాడు. ఇతని తండ్రి ధామపార్య అని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

ఇతడు కవి కావడమేగాక రాజవిద్యలలో నేర్పరి.

### 2.1.3. వడింద్ర చూడామణి

మల్లియ రేచన కవిజనాశ్రయం ప్రకారం వడింద్ర చూడామని అతని గురువు. మల్లియ రేచన కూడా ఒక జైనుడు కాబట్టి వడింద్ర చూడామని జైనుడై ఉంటాడు. ఈ వడింద్ర చూడామనిని గురించి అప్పకవి తన రచనల్లో కూడా పేర్కొన్నట్లు ఉంది.

### 2.1.4. మల్లియ రేచన

ఇతనికి సంబంధించిన కాలాన్ని గురించి కూడా చర్చ జరిగింది. కవిజనాశ్రయం మొదట 1917లో వేములవాడ భీమకవి కర్తగా ఆంధ్ర సాహిత్య పరిషత్ కాకినాడ వారు ముద్రించారు. దీనికి సంపాదకులు జయంతి రామయ్య పంతులుగారు. ఇదే గ్రంథాన్ని తరువాత వావిళ్ళ వారు నిడదవోలు వెంకటరావు గారి సంపాదకత్వంలో వెలువరించారు. దీని కర్త మల్లియ రేచనగా పేర్కొన్నారు. ఈ వివాదానికి కారణం అప్పకవి చర్చ అని ఒక అభిప్రాయం ఉంది. ఇతడు జైనుడు కావడం వల్ల ఇతని రచనను పక్కన పెట్టారని ఒక అపవాదం కూడా ఉంది. కవిజనాశ్రయము మల్లియ రేచనదే అని పరిశోధకులు అంగీకరించారు. ఇతడు జైనుడైన వైశ్యకులస్తుడు. ఇతని గురువు వడింద్ర చూడామని. ఇతడు భీమనకు పెద్ద కుమారుడు. ఇతడు జైనుడైన జనవల్లభుడికి సమకాలికుడుని పేర్కొంటారు. జనవల్లభుడు పంపడికి సోదరుడవుతాడు. పంపడు అరికేసరి (క్రీ.శ. 930-950) ఆస్థానంలో ఉన్నట్లు చరిత్ర ద్వారా అవగతమవుతుంది.

### 2.1.5. సర్వదేవరాయ

పొన్నకవికి గల మరొక పేరు సర్వదేవరాయలు అని, ఇతడు తెలుగులో కొన్ని పద్యాలు కూడా రచించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు.

వీరందరూ కూడా జైనులు. వీరు కూడా జైన మతానికి సంబంధించిన రచనలు చేసి ఉంటారని పరిశోధకులు అభిప్రాయపడినప్పటికీ, వీరి రచనలు మాత్రం లభించలేదు. వీరి రచనలు లభించక పోవటానికి పలు కారణాలు ఉన్నప్పటికీ మతం కూడా ఒక కారణం అని భావించవచ్చు. పూర్తిగా సాహిత్య రూపంలో కనిపించిన రచన మాత్రం నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతమే. కాబట్టి ఆంధ్ర మహాభారత రచన గురించి, ఆంధ్ర మహాభారతం వెలువడటానికి గల కారణాలను గురించి చారిత్రక విమర్శనా పద్ధతి ద్వారా వివరించడం జరిగింది.

## 2.2. ఆంధ్ర మహాభారతము - నన్నయ

తెలుగులో మొదటి రచనగా భావించబడుతున్న భారతం నన్నయ రచించడానికి గల వివిధ కారణాలను చారిత్రక విమర్శనా దృక్పథంతో చెప్పదలుచుకున్నాను.

తెలుగు సాహిత్యం ప్రాచీన కవులు అనగానే మొదట స్ఫురించే పేరు నన్నయ. నన్నయను తెలుగు సాహితీవేత్తలందరూ ఆదికవిగా కీర్తిస్తూ ప్రత్యేక స్థానం ఇచ్చి గౌరవించారు. కాబట్టి చారిత్రక విమర్శను కూడా నన్నయ రచనతోనే ప్రారంభించాలి.

### 2.2.1. ఆంధ్ర మహాభారత రచనకు గల కారణాలు

ఆంధ్రమహాభారత రచనకు గల కారణాలను గురించి తెలుగు సాహిత్యంలో చాలా చర్చ జరిగింది. పలువురు పరిశోధకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇక భారత రచనను, రచనా కాలాన్ని పరిశీలిస్తే అనేక ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతాయి. నన్నయ ఆంధ్రమహాభారత రచన జరగడానికి కారకులు రాజరాజనరేంద్రుడు అని సాహితీవేత్తలందరూ చెప్పే విషయం. రాజరాజు జన్మించిన సంవత్సరంపై పరిశోధకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ రాజరాజ నరేంద్రుడు క్రీ.శ.1019 నుండి క్రీ.శ.1061 వరకు పాలించాడని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈ మధ్య కాలంలో పలుమార్లు తన అధికారాన్ని కోల్పోయి

తిరిగి హస్తగతం చేసుకొన్నాడు. రాజరాజనరేంద్రుడు తన కాలంలో ఉన్న భారత రచనను చూసి, అటువంటి భారత రచన ఆంధ్రదేశంలో జరగాలని కోరుకోవడం, నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించాలనే సంకల్పం, నాడు నెలకొని ఉన్న రాజకీయ, మత పరిస్థితులు మొదలగు విషయాలు అన్నీ కూడా ఆంధ్రమహాభారత రచన వెలువడడానికి గల కారణాలుగా తెలుస్తాయి. ఆ కారణాలన్నిటినీ ఇక్కడ పేర్కొనడం జరిగింది.

### 2.2.1.1. రాజరాజుకు గల భారత శ్రవణాసక్తి

రాజరాజునరేంద్రునికి గల భారత శ్రవణాసక్తే తెలుగులో ఆంధ్రమహాభారత రచన అవతరించడానికి ప్రధాన కారణం అనేది ఆంధ్రమహాభారతంలోని అవతారికను బట్టి తెలుస్తుంది. ఆంధ్రభారత రచనకు పూనుకోవడానికి మూలకారకుడు రాజరాజ నరేంద్రుడని ఆంధ్రమహాభారత అవతారికలో నన్నయ పేర్కొన్నట్లు కనిపిస్తుంది. కవులు తమ సొంతంగా రచన చేస్తున్నప్పటికీ పాలకుల ఆదరణ పొందడం అనేది చాలా ముఖ్యమైన అంశమని విమర్శకుల, చరిత్రకారుల అభిప్రాయం. అందులో భాగంగానే రాజరాజనరేంద్రుడు నన్నయను భారత రచన తెలుగులో రచింపుమని అడిగిన తరువాత నన్నయ భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. ఈ అంశం ఆంధ్రమహాభారతావతారికలో కనిపిస్తుంది.

"విమలమతిం బురాణములు వింటి ననేకము లర్థధర్మశా
స్త్రములు తెఱం గెఱింగితి నుదాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు సూచితి జగత్పరిపూజ్యములైన యీశ్వరా
గమములయందు నిల్పితి బ్రకాశముగా హృదయంబు భక్తితోన్

అయినను నాకు ననవరతంబును శ్రీమహాభారతంబు నందుల యభిప్రాయంబు పెద్దయై యుండు." (నన్నయ: ఆంధ్రమహాభారతము, ఆది,1-10,11) అని తనకు

ఆంధ్రమహాభారతం మీద గల ఇష్టాన్ని తెలియచేశాడు. అంతేకాకుండా తనకు అభిమానమైన విషయాలను తెలియజేస్తూ, అందులో ఆంధ్రమహాభారత శ్రవణం అనేది అతి ముఖ్యమైందిగా పేర్కొన్నాడు.

"ఇవి యేనున్ సతతంబు నాయెడ గరంబిష్టంబు లై యుండు బా
యవు భూదేవకులాభితర్పణ మహీయః ప్రీతియున్ భారత
శ్రవణాసక్తియు బార్వతీపతిపదాబ్జధ్యాన పూజామహో
త్సవమున్ సంతతదాన శీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్." (పైదే, 1-12.)

అని పేర్కొన్నాడు. దీనిని బట్టి రాజరాజుకు ఆంధ్రమహాభారతం మీద ఉన్న ఇష్టం తెలుస్తుంది. దానికి గల మరొక కారణం రాజరాజు తాను చంద్రవంశస్తుడుగా భావించి తన వంశానికి చెందిన వారి చరిత్రను వినాలనే కుతూహలం కూడా.

"హిమకరు దొట్టి పూరు భరతేశ కురుప్రభుపాండు భూపతుల్
క్రమమున వంశకర్తలనగా మహి నొప్పిన యస్మిదీయవం
శమున బ్రసిద్ధులై విమల సద్గుణశోభితులై పాండవో
త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్" (పైదే, 1-14.)

ఈ కారణంతోనే రాజరాజు నన్నయను భారతాన్ని రచించుమని ప్రేరేపించాడు. ఇవన్నీ కూడా భారతావతారికలో కనిపించే విషయాలు. అంటే ఇవన్నీ కూడా సాహిత్యంలో కనిపించే విషయాలు. వీటితో పాటు సాహిత్యేతర అంశాలను కూడా పరిశీలిస్తే మరికొన్ని విషయాలు కూడా అవగతమౌతాయి. ఆంధ్రమహాభారతాన్ని వినాలనే ఆసక్తి ఏర్పడటానికి గల కారణాలు మరికొన్ని ఉన్నాయి. ఇవి రచనలో కనిపించవు. వాటిని కూడా పరిశీలించవలసి ఉంది. రాజరాజు కుటుంబంలో నెలకొని ఉన్న పరిస్థితులు రాజరాజనరేంద్రుడికి భారతంపట్ల అభిమానం కలగడానికి కారణం అని తెలుస్తోంది. రాజరాజనరేంద్రుడు చాళుక్యరాజైన విమలాదిత్యుని కుమారుడు. తల్లి కుందమాంబ. రాజరాజు తండ్రివైపు వారు కొందరు జైనమతాన్ని అనుసరించినప్పటికీ వీరిలో అధికులు బ్రాహ్మణ భక్తులుగా ఉన్నారని, వైదిక మతాన్ని అనుసరించారని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

“చాళుక్యులు మొదటి నుండి బ్రాహ్మణ భక్తులుగా నుండిరి. వీరి శాసనములలో పరమమహేశ్వరులమనియు వీరు చెప్పుకొనిరి. ఈ పరమ బ్రాహ్మణ బిరుదము పూర్వ చాలుక్య నృపాలురగు విష్ణువర్ధన, విజయాదిత్య, శక్తివర్మ, విమలాదిత్య, రాజరాజులకు గలదు.” (రామబ్రహ్మం, బేతవోలు., సూర్య భాస్కరరావు, గొల్లకోట(సంపా.): నన్నయ భారతి (ప్రథమ సంపుటం), పుట.59.) చాలాకాలం నుంచి కూడా చాళుక్యులకు మహాభారతం వినాలనే ఆసక్తి ఉండేదని, ఆ ఆసక్తే రాజరాజ నరేంద్రుడికి మహాభారతాన్ని తెలుగులో వినాలనేలా చేసిందని విమర్శకులు పేర్కొన్నారు. “చాళుక్యుల కుటుంబమున మహాభారత గ్రంథాదరణమును, పాండిత్యమును వాతాపినగరమున వారు రాజ్యాధికార మేర్పరుచుకొనినప్పటి నుండియు ననుశ్రుతముగా వచ్చుచుండెను. రాజరాజ నరేంద్రుని కాలమున నాతని తల్లివంక వారగు చోళరాజులు భారత గ్రంథమును తామేర్పరిచిన వేదపాఠశాలలో బటనీయముగా జేసిరి”(పైదే, పుట.339.) కుటుంబపరంగా వచ్చిన ఆసక్తి రాజరాజుకు ఉండటం ఒక కారణమైతే, ఆంధ్ర మహాభారతం అవతరించడానికి మరికొన్ని కారణాలను కూడా విమర్శకులు విశ్లేషించారు.

### 2.2.1.2. ఇతర ప్రాంతీయభాషల్లోని భారత రచనా ప్రభావం

తెలుగులో ఆంధ్రమహాభారత రచనకంటే పూర్వమే ఇతర ప్రాంతీయ భాషల్లో మహాభారత రచన జరిగింది. వాటి ప్రభావం కూడా రాజరాజు, నన్నయలపై ఉందని చెప్పవచ్చు. అప్పటికే దక్షిణ దేశ భాషల్లో కూడా మహాభారతం రచించబడింది. కొన్ని ఉత్తర ప్రాంతీయ భాషల్లో కూడా మహాభారతాన్ని ప్రారంభించినట్లు తెలుస్తుంది. “ఉత్తరమున గాశ్మీర మహాకవియు బహుగ్రంథ ప్రణేతయునైన క్షేమేంద్రుడు కొంచెమించు మించుగా నాకాలముననే (క్రీ.శ. 1050) మహాభారతమును భారతమంజరి యనుపేర సంగ్రహీకరించియుండెను. క్రీ.శ. 11వ శతాబ్ది యారంభముననందే జావాద్వీపపు బండితులు సంస్కృత భారతమును దమ భాషలోని కనువదించుకొన్నట్లు

తెలియుచున్నది.” (వెంకటావధాని, దివాకర్ల: ఆంధ్రవాఙ్మయారంభదశ; పుట.1003.) అప్పటికే తమిళ కన్నడభాషల్లో కూడా మహాభారత రచనలు జరిగాయి. కన్నడ భాషలో వేంగీ ప్రాంతం నుంచి కన్నడ దేశానికి వలస పోయిన వాడుగా భావించబడుతున్న పంపమహాకవి క్రీ.శ. 941 లో భారతాన్ని 'విక్రమార్జున విజయ' మనే పేరుతో రచించి అరికేసరి అనే రాజుకు అంకితమిచ్చాడు. ఇది పాండవులలో అర్జునునికి ప్రాధాన్యమిచ్చి రచించబడింది. పంపకవి జైనమతాభిమాని అని అందువలన మహాభారతంలోని వర్ణనలన్నీ జైనమత సంప్రదాయానుగుణంగానే కనిపిస్తున్నాయని ఇప్పటికే విమర్శకులు వివరించి ఉన్నారు.

మరో కన్నడ కవి రన్న 'సాహసభీమ విజయ' మనే పేరుతో మహాభారతాన్ని రచించి పశ్చిమ చాళుక్య చక్రవర్తి అయిన సత్యాశ్రయునికి (క్రీ.శ. 997- 1008) అంకితమిచ్చాడు. ఇది పాండవులలో భీమునికి అధిక ప్రాధాన్యమిచ్చి రచించబడింది. రన్న కూడా పంపకవి మాదిరిగానే జైనమతస్తుడు.

### 2.2.1.3. ఇతర ప్రాంతీయ రాజుల సాహిత్య పోషణ ప్రభావం

ఇతరులు చేసినవి గొప్పగా అనిపిస్తే వాటిని అనుసరించడం అనేది మానవ నైజం. ఇక్కడ రాజరాజు విషయంలో కూడా ఇదే జరిగిందని భావించవచ్చు. రాజరాజుకు ముందున్న రాజులు కొందరు, సమకాలికులు కొందరు కవులను ఆదరించడం జరిగింది. బహుశ రాజరాజు వీటిని పరిశీలించాడు. ముఖ్యంగా రాజరాజు చోళులతో సన్నిహిత మైత్రిని అవలంభించినవాడు. కొన్ని సందర్భాల్లో వారిని అనుసరించినట్లు కూడా చరిత్ర ద్వారా తెలుస్తుంది. ముఖ్యంగా చోళుల కాలంలో వైదిక మతంతో పాటు భారతం కూడా వ్యాప్తిలో ఉన్నట్లు ఇంతకు పూర్వం పేర్కొనడం జరిగింది.

ఇక కన్నడ భాషలో భారత రచనను ప్రోత్సహించిన వారు కూడా చాళుక్య వంశస్థులే. వీరిని వేములవాడ చాళుక్యులనీ, పశ్చిమ చాళుక్యులనీ అంటారు. వీరి కాలంలోనే పంపకవి వంటి వారు రచనలు చేశారు. నారాయణభట్టును గురించి నన్నయభట్టు కూడా పేర్కొని ఉండటాన్ని భట్టి అతడు కూడా మహాపండితుడు, కవి అయివుంటాడు. వీరితో పాటు మాలవ దేశంలో ఉన్న సాహిత్యం, రాజులు చూపిన ప్రభావం మరొక ఎత్తు. మాలవాధీశ చక్రవర్తి భోజరాజు భారతీయ సాహిత్య చరిత్రలో పేర్కోదగినవాడు. రాజరాజుకు మాలవాధీశులతో కూడా పరిచయం ఉందని కొందరు విమర్శకులు పేర్కొంటున్నారు.

"వేంగీ చాళుక్యులకును మాలవాధీశులైన పరమారులకును జిరకాలము నుండి మైత్రి యుండినట్లు కనిపించుచున్నది. మాలవాధీశులలో వాకృతి ముంజరాజు తరువాత నాతని తమ్ముడైన సింధురాజును అతని తరువాత దత్పూనుడైన భోజరాజును సింహాసనము నధిష్ఠించి సమర్థతతో బాలించి యుండిరి. వారు ముప్వురును బండిత పోషకులు కావ్యాలాప వినోదములందాసక్తి కలవారు. వారిలో భోజుడు పలువురు విద్వాంసులను గవులను బోషించుటయే కాక స్వయముగా బండితుడు" (వెంకటావధాని, దివాకర్ల: ఆంధ్రవాఙ్మయారంభదశ, పుట.1020.) భోజుడు క్రీ.శ.1010 నుండి 1063 వరకు మాలవరాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు రాజరాజుకు సమకాలికుడు. ఇతని ఆస్థానంలోనే సంస్కృతప్రతులు లభించాయని, రాజరాజుకు, భోజుడికి మధ్యగల సన్నిహితం వల్ల నన్నయ వాటినే తన ఆంధ్ర మహాభారత సమయంలో చూశాడని కూడా ఒక అభిప్రాయం కలదు. "సంస్కృత భాషాభిమానియు ఆ భాషయందు మహాకవియునైన యామహారాజు కొలువున రామాయణ భారతాధి గ్రంథముల ప్రతులు వ్రాయింపబడి సురక్షిచితములై యుండుననుటలో వింతలేదు. వేంగీచాళుక్యులకును, భోజనకును మైత్రి యవిచ్ఛిన్నముగా గొనసాగి యుండుటచే నన్నయ సంస్కృత భారతమునకు సంబంధించిన కొన్ని ప్రతులను అందును ఉత్తర వర్ణమునకు జెందినవారిని మాలవ రాజుల యాస్థానము నుండి తెప్పించుకొని

యుండునని యూహించుటకవకాశము  కలుగుచున్నది.”(పైదే, పుట.1020.) దీనిని బట్టి నన్నయ భారత రచనలో మాలవ రాజ్యం నుంచి కూడా సహాయం లభించడంతో పాటు భారత రచన చేయటానికి కావలసిన మానసిక ధైర్యం కూడా లభించి ఉంటుందని భావించవచ్చు.

### 2.2.1.4. వైదికమతవ్యాప్తి

తెలుగు సాహిత్య చరిత్రలో మతం పాత్ర చాలా ముఖ్యమైంది.  సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అంశాల్లో మతం అతి ప్రధానమైంది. తెలుగు సాహిత్యానికి మతానికి మధ్య గల సంబంధం తెలుసుకుంటేనే తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శను పూర్తిగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఆంధ్రమహాభారతం అవతరించడానికి గల ప్రధాన కారణం మతమని పేర్కొనే విమర్శకుల సంఖ్య ఎక్కువగానే కనిపిస్తుంది. కాబట్టి తెలుగులో భారత రచనా జరిగే కాలం నాటికి ఉన్న మత పరిస్థితులను క్లుప్తంగా తెలుసుకోవడం అవసరం.

క్రీస్తుపూర్వం నుంచి ఆంధ్ర దేశాన బౌద్ధ, జైనమతాలున్నట్లు, ఆంధ్ర దేశాన్ని పాలించిన రాజవంశాలు బౌద్ధ, జైన మతాభిమానులుగా ఉన్నట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆంధ్ర దేశాన్ని పాలించిన మొదటి రాజవంశంగా పరిగణింప బడుతున్నటువంటి రాజవంశీయులు శాతవాహనులు. వీరు జైన, బౌద్ధ, బ్రాహ్మణ మతాలతోపాటు స్థానిక మతాలను కూడా అవలంబించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఇక్ష్వాకు రాజవంశం పరిపాలించిన కాలంలో ఇక్ష్వాకులు జైన, బౌద్ధాభిమానులు.

ఇక్ష్వాకువంశ రాజుల తర్వాత ఆంధ్రదేశాన్ని పరిపాలించిన ఆంధ్ర రాజులు బౌద్ధ, జైనాలతో పాటు వైదిక మతం కూడా పూర్తిగా వ్యాప్తిలోకి వచ్చింది. కాని ఈ మతాల మధ్య ఎటువంటి విరోధాలు లేకుండా దేనికది అభివృద్ధి చెందడానికి ప్రయత్నించాయి.

అయితే క్రమంగా తదనంతరం వచ్చిన రాజ వంశాలు ఏదో ఒక మతాన్ని మాత్రమే అవలంభించడంతో పాటు దాన్నే ప్రోత్సహించడం జరుగుతూ వచ్చింది. పల్లవరాజ వంశపు కాలంనాడు కొందరు శైవమతాన్ని అవలంబించగా మరికొందరు రాజులు వైష్ణవాన్ని అవలంబించారు. దీనితో వైదిక మతం బాగా ప్రోత్సహించబడింది.

శాలంకాయనుల కాలం నాడు వైదిక మతంతో పాటు బౌద్ధం కూడా ఆదరించబడింది. కాని చాళుక్యుల కాలంనాటికి పరిస్థితి మారిపోయింది. చాళుక్యుల కాలంనాడు బౌద్ధం క్షీణించి వైదిక మతప్రాబల్యం పెరిగిపోయింది. అయితే జైన మతం కూడా వ్యాప్తిలో ఉండేది. వైదిక మత ప్రాబల్యం పెరిగే కొద్ది వైదిక కర్మలకు, వాటికి సంబంధించిన గ్రంథాలనేకం బయల్దేరాయి. శైవ, వైష్ణవాలయాల స్థాపన జరిగింది. పురాణాలమీద ఆదరం పెరిగింది. వీటితోపాటు పంచమవేదంగా భావింపబడే భారతం మీద జనులకు గౌరవం పెరిగింది. పైదంతా కూడా సంక్షిప్తంగా భారతం అవతరించే నాటికున్న మత పరిస్థితి.

ఇక సాహిత్యంపై మత ప్రభావం చూస్తే అప్పటికే కొన్ని ప్రాంతాలలో ప్రాంతీయ భాషా సాహిత్యాలలో మత పరమైన రచనలు రచించడం ప్రారంభమైంది. 'క్రీ.శ. పదవ శతాబ్దంలో కన్నడలో పంప అనే కవి జైనుల ప్రథమ తీర్థంకరుడైన వృషభదేవుని చరిత్రను ఆదిపురాణంగాను, మహాభారత కథను జైనమతానుగుణంగానూ మార్చి విక్రమార్జునవిజయంగానూ రచించాడని' తెలుస్తుంది. ఒక మతపురాణం, మతకావ్యం రాసే సంప్రదాయం కన్నడ సాహిత్యంలో ప్రారంభమైంది. అదే విధంగా తెలుగులో కూడా సాహిత్య రచనా ప్రారంభం కూడా మతప్రభావంతోనే ప్రారంభమైందని చెప్పాలి. తెలుగులో మొదటి గ్రంథంగా పరిగణింపబడుతున్న ఆంధ్రమహాభారతం వైదికమత పునరుద్ధరణకోసం రచించబడిందని, ఆ రచన వెలువడటానికి నాడు నెలకొని ఉన్న మతపరిస్థితులే ప్రధానకారణమని నన్నయ ఆంధ్ర మహాభారత రచన గురించి అందరూ ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనిని బట్టి

నాడు నెలకొని ఉన్న మతపరిస్థితులను అంచనా వేస్తూ వివిధ రకాలైన అంశాలను విమర్శకులు పరిశోధకులు తమ రచనల్లో పేర్కొన్నారు. అవి “ఆంధ్రభారత రచనముం బ్రేరేపించిన నిగూడ కారణమింకొకటి కలదు. అదియే ముఖ్యముగ మనము గమనింపదగినది. పదకొండవశతాబ్దములో వైదిక మతమును పునరుద్ధరించుటకు చేయబడిన యత్నములలో సారస్వత సహాయము బాగుగా గుర్తింపబడెను”. (రామబ్రహ్మం, బేతవోలు., సూర్యభాస్కరరావు, గొల్లకోట (సంపా.): నన్నయ భారతి (ప్రథమ సంపుటం), పుట.200.) “గుణకర్మలను కాలదన్ని కేవలము పుట్టకను ఆధారము చేసుకొన్నందు వలన నిర్వీర్యమైన వర్ణవ్యవస్థ, దానిపై నిర్మింపబడిన వైదిక సంప్రదాయములు ప్రజాదారణము గోల్పోవు సమయమున బౌద్ధమావిర్భవించినది. కాలగమనమున తిరిగి అందేర్పడిన కలహముల కారణమున జైనము విజృంభించినది. దక్షిణ భారతమునకది పరాయిదానివలే కన్పించుట వలన యిచ్చట వైదిక సంప్రదాయములకు వ్యతిరేకముగా శాక్తికేయము, వీరశైవములలో తిరుగుబాటు ధోరణులు తలెత్తినవి. ఆంధ్రదేశమప్పుడు పైమతముల సంఘర్షణలకు రంగభూమియైనది. అట్టి సమయమున వైదిక మార్గాయులైన చాలుక్య ప్రభువులు మిగిలిన మతములను అణచబూనిరి. వైదిక సంప్రదాయ ప్రచారణమునకై ఉత్తమ సాహిత్యమును సృష్టించవలసినదిగా తమ ఆస్థానకవులగు నన్నయాదులను ప్రోత్సహించిరి.” (పైదే, పుట.49-50.) మరొక కారణం మత గ్రంథాలను స్థానిక భాషలలో బోధించాలనుకోవడం. “ఆ కాలమున జైనమతాచార్యులు ప్రాకృతభాషలో ప్రజలకు మతమును బోధించు చుండిరి. అన్యమతమన్య భాషయందు భోధించినచో మతవ్యాప్తి కొనసాగుటెట్లు? ఈ మతప్రచారమునరికట్టి, ప్రతిఘటించు మార్గము రాజరాజు గ్రహించెను. స్వమతమును స్వభాషయందే బోధింపవలెను. రాజరాజు అభిమతము భారతాంధ్రీకరణ మూలముననే యగును.” (పైదే, పుట.61.) పైన పేర్కొన్న అంశాల్లోని సారాంశం మాత్రం అంతా కలిపి చెప్పేది ఒకటే. అది ఆంధ్రమహాభారత రచనను ప్రేరేపించిన అంశం మతం.

మతవ్యాప్తి కోసం సాహిత్యాన్ని అస్త్రంగా వాడడం అనేది నాడు తక్కిన మతాలవాళ్ళు అవలంబించేవారు. అదే విధానాన్ని రాజరాజు కూడా ఉపయోగించాలనుకున్నాడు. అందుకోసం నన్నయను భారత రచనకు ప్రోత్సాహించాడు. ఇంకా ఆంధ్రమహాభారత రచనా కాలం నాటి మతపరిస్థితులు వ్యాసమహాభారత రచనా కాలంనాటి పరిస్థితులకు దగ్గరగా ఉన్నాయని విమర్శకులు పేర్కొన్నారు. "వ్యాసుడు జయ కావ్యాన్ని వ్రాసినప్పుడు, ఆయన శిష్యులు దాన్ని మహాభారతంగా విస్తరింపచేసినప్పుడు ఎటువంటి మత సామాజిక పరిస్థితులు ఆయా కాలంలో వాటికి ప్రేరక శక్తులుగా పనిచేశాయో, తెలుగులో కవిత్రయం మహాభారతాన్ని రచించటానికి కూడా ఆనాటి మత సామాజిక మత పరిస్థితులు అట్లా కారణమయ్యాయి." (సుబ్రహ్మణ్యం, జి.వి(సంపా): కవిత్రయ శ్రీ మదాంధ్ర మహాభారతము, ఆది పర్వము, పీఠిక, పుట.XXVIII.) వ్యాస మహాభారతకాలం నాటి మత పరిస్థితులు కూడా తెలుసుకోవడం అవసరం. "క్రీ.పూ. 3వశతాబ్దానికి ముందే భారతదేశంలో ప్రవర్థిల్లి ఉన్న వేద సంస్కృతి మ్లేచ్ఛుల దండయాత్రలతో క్రొత్త సమస్యలనెదొర్కొన్నది. ప్రకృతి ఆరాధన, యజ్ఞయాగాది క్రతువులు క్రమంగా సన్నగిల్లటంతో వాటిని గురించిన అనేక ప్రశ్నలు ప్రజలలో రేకెత్తాయి. ఇంద్ర, వరుణాగ్ని, సూర్యుల వంటి స్థానంలో విష్ణు, రుద్ర, దేవీ మూర్తులు వెలసి వారి వారి శాఖలను విస్తరింపజేయటం మొదలు పెట్టాయి. ఆ తరువాత జైన, బౌద్ధ మతాలు దేశమంతా వ్యాపించాయి. మహారాజులు, చక్రవర్తులు, వైదిక ధర్మం వదలి జైన బౌద్ధాలను స్వీకరించి వాటి ప్రచారానికి తోడ్పడ్డారు. దానితో వర్ణాశ్రమ ధర్మాలు, యజ్ఞయాగాది కర్మ విధానాలు శిథిలమై పోసాగాయి. వేదధర్మాన్ని ఆశ్రయించిన వ్యవస్థలు బాగా సడలిపోవడంతో బాగా దెబ్బతిన్నది గార్హస్థ్యాశ్రమ ధర్మం. జైన బౌద్ధాల వలన సమాజంలో సన్యాసినులకు గౌరవం పెరిగింది. అది ఆశ్రమ ధర్మంగాక మత ధర్మంగా పరిణమించింది. పరిణచిత్త సంస్కారం లేకుండా సన్యాసాన్ని స్వీకరించిన వారు దానికి న్యాయం చేయలేక పోగా, వ్యవస్థకు కీడు చేయవచ్చును. వేదధర్మంలో సమాజ వ్యవస్థకు గార్హాస్థ ధర్మమే పునాదిగా పేర్కొనటం ప్రసిద్ధం. జైన

బౌద్ధాల వలన దెబ్బతిన్న కుటుంబ వ్యవస్థను వేదధర్మాన్ని పునరుద్ధరించు కోవలసిన అవసరం ఏర్పడింది. ఈ సామాజిక ధర్మ పునరుద్ధరణ ఉద్యమంలో భాగంగా వేదవ్యాస మహర్షి రచించిన జయ కావ్యాన్ని ఆయన శిష్యులు బలమైన వాఙ్మయ సాధనంగా వాడుకొన్నారు" (పైదే, పుట.XXV.) నాడు వ్యాస మహాభారతం సమాజం ధర్మపునరుద్ధరణ కోసం వ్యాసుని శిష్యులు సాధనంగా వాడుకొంటే 11వ శతాబ్దంలో నన్నయ వైదిక మత పునరుద్ధరణ కోసం ఆంధ్రమహాభారత రచనకు పూనుకొన్నాడు.

అంతే కాకుండా రాజరాజు తల్లిదండ్రులు వేరు వేరు మతాలను అవలంబించారు. ఇది రాజరాజుకు మతపరంగా కొంత ఇబ్బంది కలిగించే అంశం అయినప్పటికి తక్కిన అంశాలు అతన్ని వైదిక మతావలంబకుడిగా మారడానికి దోహదం చేశాయి. వాటిలో తల్లివైపువారు వైదికమతం అలంబించడం ఒక కారణమయితే, మరొక కారణం నన్నయతో గల సంబంధం. వాటితో పాటు అతనికి తెలుగునేల, భాషపైన ఉన్న అభిమానం, నాటి రాజకీయ పరిస్థితులకు అతడనుసరించవలసిన విధానాలు మొదలగు అంశాలు కూడా ముఖ్యమైనవే.

తల్లిదండ్రుల మత విషయానికొస్తే "తండ్రియైన విమలాదిత్యుడు జైనమతము నవలింబించినను, తల్లి కుందమాంబ జైనమతమున చేరక తన పుట్టింటివారి మతమైన స్మార్తశైవమందే యుండెను. ఇది రాజరాజు జైనమతమునవలింబించుటకు అవకాశము లేకుండా చేసెను." (రామబ్రహ్మం, బేతవోలు., సూర్యభాస్కరరావు, గొల్లకోట (సంపా.): నన్నయ భారతి (ప్రథమ సంపుటం), పుట.231.) అంతేకాక అతని పూర్వీకులు కూడా వైదికమతాన్ని అవలంబించడం కూడా అతను వైదికమతాన్ని అనుసరించడానికి కారణం అని ఇంతకు పూర్వమే పేర్కొనడం జరిగింది. ఇక రాజరాజు తండ్రిద్వారా చాళుక్యవంశంలో మరొక సంఘటన జరిగింది. అది రాజరాజు తండ్రి విమలాదిత్యుడు మతం మార్చుకోవడం. రాజరాజు తండ్రి ఇతర చాళుక్య రాజులందరి లాగానే వైదిక

మతం అవలంబించినప్పటికీ చివరి రోజులలో జైనాచార్యుల బోధనల వల్ల జైనుడిగా మారిపోవడం జరిగింది. బహుశ ఇది రాజారాజుకు మతపరంగా మరింత దృఢంగా ఉండేలా చేసింది. అందువలన వైదిక మతాన్ని సామాన్య జనులకు కూడా బోధించడానికి, వైదికమతంపై ఆదరాభిమానాలు పెంపొందించాలనే ప్రయత్నం కూడా రాజరాజు మదిలో మెదిలి ఉంటుంది. సంస్కృత భారతం సామాన్యులకు అర్థం కాదు. కాబట్టి దేశభాష అయిన తెలుగులో రచించి జనుల అభిమానం సంపాదించడానికి ప్రయత్నించాడు. దీనిని బట్టి నాడు ఆంధ్రమహాభారత రచనకు మతం కూడా ప్రధాన కారణమని పేర్కొనవచ్చు.

### 2.2.1.5. నన్నయ భారత రచనా సంకల్పం

భారతాంధ్రీకరణ వెలువడటానికి ఒకరకమైన కారణం నన్నయ వైదికమత విధానం అని కొందరు పరిశోధకులు భావించారు. నన్నయ వైదికమతావలంబకుడని, తనకు ఎప్పటికైనా కూడా మహాభారతాన్ని తెలుగులో రచించాలని ఒక కోరిక ఉన్నట్లు కొందరి పరిశోధనా వ్యాసాలవల్ల తెలుస్తుంది. నన్నయను గురించి పరిశోధకుడు తెలిపిన మాటలివి. "కన్నడభాష అతనికి బాగుగా దెలియును. ఆ కన్నడభారతమునతడు చదివియుండెను. ఆతడు మైసూరు ప్రాంతమున బాల్యమందు వేదపాఠశాలలో విద్యాభ్యాసము గావించెను. ఆ సమయమున నా ప్రాంతము వాడేయయిన నారాయణభట్టు అనునతడు నన్నయ కిష్టుడైన సహాధ్యాయుడుగా నుండెను. ఆ సమయమున వారిరువురు పంప మహాకవి కన్నడములో వ్రాసియుండిన భారతమును చదివియుండిరి. అంధ్రభాషలో గూడానట్టి గ్రంథముండవలయునను ఆలోచన నన్నయ కానాడే యేర్పడెను. ఆ సంకల్పమాతని హృదయములో గాఢముగా నెలకొనెను." (పైదే, పుట.234.)

ఇక్కడ నన్నయకు మొదటి నుంచి కూడా మహాభారతాన్ని రచించాలని ఒక సంకల్పం ఉన్నట్లు, అందుకనుగుణంగా ఆ రచనా సమయం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తుంది. అందుకోసం అతడు రాజరాజనరేంద్రుని తన లక్ష్యానికి అనుగుణంగా మలుచుకున్నట్లు అభిప్రాయపడుతున్నారు. "రాజరాజు విద్యాభ్యాసము నన్నపార్యుని పర్యవేక్షణ క్రిందనే జరిగినదని ధైర్యముగా జెప్పవచ్చును. ఆ బాలునకు దగిన విద్యాభ్యాసమును జేయించుటయేకాక అతడు తన తండ్రి మార్గమునసరించి జైనమతావలంభనముగాక, వైదిక మతాభిమానిగా జేసెను. ఇంతేకాక నన్నయ రాజరాజును తన ఆశయమునకు ఆలోచనకు అనుగుణముగా నుండునట్లు తీర్చిదిద్దపరుచుకొని యుండెనని చెప్పవచ్చును". (పైదే, పుట.249) ఇక్కడ నన్నయ గురువు స్థానంలో ఉన్నట్లు, రాజరాజు శిష్యుని స్థానంలో ఉన్నట్లు తెలుస్తుంది. అంటే గురువుగా ఉన్న నన్నయ శిష్యుడిగా ఉన్న రాజరాజును తనకు అనుకూలంగా మార్చుకొన్నాడు. నన్నయకు రాజరాజ పూర్వికులతో ప్రాచీనకాలం నుండి కూడా సంబంధాలున్నట్లు ఆంధ్రమహాభారత అవతారిక వలన తెలుస్తున్నట్లు కొందరు విమర్శకులు వ్యాఖ్యానించారు.

"తన కులబ్రాహ్మణు ననురక్తు నవిరత జపహోమ తత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతు
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గల గోత్రజాతు సద్వినుతావదాత చరితు
లోకజ్ఞు నుభయభాషా కావ్యరచనాభి శోభితు సత్ప్రతిభాభి యోగ్యు

నిత్యసత్యవచనుమత్యామరాధిపా
చార్యు సుజను నన్నపార్యుజూచి
పరమ ధర్మ విదుడు వరచళుక్యాన్వయా
భరణుడిట్టు లనియె గరుణతోడ." (నన్నయ: ఆంధ్రమహాభారతము, ఆది పర్వం.1-9.)

పై పద్యంలో కులబ్రాహ్మణుడు అనే దానిని వ్యాఖ్యాతలు వివరిస్తూ నన్నయ రాజరాజ నరేంద్రుడికి కులబ్రాహ్మణుడని తెలిపారు. అంటే వంశపారంపర్యంగా నియమింపబడే

పురుహితుడనే మంత్రి అని వ్యాఖ్యానించారు. ఒక విధంగా చూసినప్పుడు నన్నయ కంటే రాజరాజు వయసులో చిన్నవాడు అనేది కొందరి పండితుల అభిప్రాయం. అంతే కాకుండా నన్నయ దగ్గర రాజరాజు చదువుకున్నాడని కూడా పేర్కొన్నారు. అంటే ఇక్కడ రాజరాజుకు నన్నయకు మధ్య వున్న సంబంధం గురుశిష్య సంబంధంగా చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. "రాజరాజనరేంద్రుడు క్రీ.శ.1011వ సంవత్సరము నుండి 1022 వరకు తన తెలుగు రాజధానియందేయుండి, నన్నయగారి పర్యవేక్షణ క్రింద విద్యాబుద్ధులు నేర్చెనని దృఢముగా చెప్పవచ్చును మరియు నమ్మవచ్చును". (రామబ్రహ్మం, బేతవోలు., సూర్యభాస్కరరావు, గొల్లకోట (సంపా.): నన్నయ భారతి (ప్రథమ సంపుటం) పుట.249.) ఇంకా "10, 11సంవత్సరకాలములలో రాజరాజ నరేంద్రుడు తన రాజధాని యందే యుండి నన్నయగారి పర్యవేక్షణ క్రింద విద్యాభ్యాసము గావించి తెలుగు రాజుగా రూపొందెననుట నిక్కము". (పైదే, పుట.256.)

కాబట్టి నన్నయ తన బ్రాహ్మణ మతానికి అనుగుణంగా రాజరాజును మలుచుకున్నారని చెప్పవచ్చు. కొందరు నన్నయ, రాజరాజు సమవయస్కులని పేర్కొన్నారు. కాని వీరిరువురు సమ వయస్కులనటం సమంజసంగా కనిపించదు. నన్నయ రాజరాజుకు గురువు స్థానంలో ఉన్నట్లుగానే కనిపిస్తుంది.

పైన వివరించిన సమాచారం నన్నయ ఆంధ్రమహాభారతంలో కనిపించదు. కేవలం చరిత్రకారుల చారిత్రక పరిశోధనల్లో మాత్రమే కనిపిస్తుంది. నన్నయ రచనలో ఎక్కడ కూడా తన జీవిత సంబంధమైన విషయాలు ప్రస్థావించలేదు. తన రాజు అయిన రాజరాజనరేంద్రుడి గురించి మాత్రమే వుంది.

ఒక కవి/రచయిత తన రచనను ఇతరులు ఆదరించినప్పుడే ఆ రచనకు సార్థకత అని భావిస్తాడు. అందులోనూ అధికారంలో ఉన్నవాళ్ళు ఆదరించాలని, తన రచనలు వారు గుర్తిస్తే ఇంకా ఎక్కువగా ఆనందపడతాడు. అధికారంలో ఉన్నవాళ్ళు కూడా తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా సాహితీపరులను, కళాకారులను ఆదరించడమో లేక అభిమానించడమో జరుగుతూ ఉంటుంది. అదేవిధంగా నన్నయకు

ఆంధ్రమహాభారతాన్ని రచించాలని ఉన్నప్పటికి తన కాలంనాటి రాజు అయిన రాజరాజు గుర్తింపు కొరకు వేచి ఉన్నాడేమోననే సందేహం కూడా వస్తుంది.

నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రాజరాజు రాజ్యంలో స్థిరపడిన తరువాతనే రచించాడనేది పలువురి విమర్శకుల అభిప్రాయం. దానికి గల కారణం రాజరాజు తండ్రి మరణించిన వెంటనే రాజ్యంలో పరిస్థితులు అన్ని మారిపోయాయి. చాలాకాలం వరకు రాజరాజు తన పట్టాభిషేకం చేసుకోలేక పోయాడు. అందుకు గల కారణం రాజరాజుకు తన సవతి తమ్ముడికి జరిగిన వారసత్వ యుద్ధం అనేది అందరు చెప్పే విషయం కాగా మరొకటి పశ్చిమ చాళుక్యులతో గల వైరం. పశ్చిమ చాళుక్యులకు, రాజరాజుకు మధ్య నిరంతరం సంఘర్షణలు జరిగినట్లు తెలుస్తుంది. ఆ సంఘర్షణలు కూడా ఆంధ్రమహాభారత రచన ప్రారంభం కావడానికి మరొక కారణం. ఈ సంఘర్షణల సమయంలో నన్నయ రాయబారిపాత్ర పోషించి, రాజరాజుకు రాజ్యంలో స్థిరత్వాన్ని ప్రసాదించి, ఆంధ్రమహాభారతాన్ని ప్రారంభించాడని కొందరు విమర్శకులు తెలిపారు. అంటే ఇక్కడ నన్నయ రాజరాజు రాయబారిగా పశ్చిమ చాళుక్యుల దగ్గరకు వెళ్ళి అక్కడ పశ్చిమ చాళుక్యులతో సంధి గురించి చర్చించాడని పేర్కొంటారు. ఆ సంధి విజయవంతమైంది. దానికి కారణం నన్నయ సహాధ్యాయుడైన నారాయణభట్టు. నారాయణభట్టు పశ్చిమ చాళుక్యుల మంత్రిగా పనిచేసినట్లు, ఆ నారాయణభట్టే పశ్చిమ చాళుక్యరాజును రాజరాజుతో సంధికి ఒప్పించినట్లు విమర్శకులు చెబుతున్నారు. "రాజరాజునకు త్రైలోక్యమల్లరదేవునకు కొప్పం యుద్ధము జరిగిన తర్వాత నారాయణభట్టు సంధి కుదిర్చి రాజరాజనరేంద్రుని యాస్థానమును జేరి యతని మన్నలనంది యుండవచ్చును. ఈ సంధి ప్రయత్నములలో రాజరాజనరేంద్రుడు నన్నయ భట్టు వలన నతని సహాధ్యాయియైన నారాయయణభట్టు సహాయమును సంపాదించి యుండవచ్చును. రెండవ కొప్పం యుద్ధము తరువాత రాజేంద్రదేవుడు పారిపోయెను. రాజరాజునకు సంధి తప్ప గత్యంతరం లేదు. అప్పుడు నన్నయభట్టు తన సహాధ్యాయి కావున నతని మూలమున నీ సంధి కుదిర్చియుండును. అందుచేతనే

నారాయణ భట్టు కూతురు కుపమ తండ్రిని ప్రత్యక్షముగ దక్షారామమున 'త్రైలోక్యమల్లర దేవుని' ప్రధానిగా బేర్కొన గలిగెను." (రామకృష్ణమాచార్య, నండూరి: కవిత్రయము, పుట.31-32.) అని పేర్కొన్నది కాబట్టి ఇక్కడ నారాయణభట్టు, నన్నయభట్టుల స్నేహం ఫలితంగా రాజరాజుకు, పశ్చిమచాళుక్యరాజు సంధి కుదిరింది. "నన్నయ రాయభారము జయప్రద మగుటకు గారణము 'వాణస్థరామరవంశ విభూషణుండు నారాయణభట్టు' వాణస వంశస్థులు కర్ణాట రాజాస్థానమున ప్రధానులు. చక్రవర్తి త్రైలోక్యమల్లదేవుని ప్రధాని సహాధ్యాయుడునైన నారాయణభట్టు సాహాయ్యమున నన్నయ రాజరాజ నరేంద్రుని రాయబారియై త్రైలోక్యమల్లదేవుని యాస్థానమును జేరియుభయ రాజ్యములకు సంధి యొనర్చెను. ఆగర్భ వైరులగు రాజులకు నడుమ కుదిర్చిన సంధియది." (పైదే, పుట.33.) ఈ సంధి కుదిరిన అనంతరం రాజరాజు తనరాజ్యాన్ని స్థిరపరుచుకున్న తరువాత, రాజరాజు కోరిక మేరకు అనిగాని లేదా నన్నయభట్టు ఆశయం మేరకుగాని ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి పూనుకొన్నాడని పేర్కొనవచ్చు. కాని ఈ సంధి చాలాకాలం కొనసాగినట్లుగా కనిపించదు. దానికి గల కారణం రాజరాజుకు, పశ్చిమచాళుక్యులకు మధ్య మరల సంఘర్షణలు జరిగనట్లు ఉంది.

## 2.3. ఆంధ్రమహాభారత పునఃప్రారంభం-తిక్కన

నన్నయ అనంతరం భారత రచన తిరిగి పునఃప్రారంభం కావడానికి దాదాపు 200 సంవత్సరాలకాలం పట్టినట్లు సాహిత్య చరిత్ర ద్వారా అవగతమవుతున్నది. అందుకు పరిశోధకులు వివిధ కారణాలను పేర్కొన్నారు.

1. చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని తరువాత అతనిలాగా అంత శ్రద్ధతో ఆంధ్రమహాభారతాన్ని పూరించడానికి ఎవరు ముందుకు రాకపోవడం.

2. రాజరాజు తరువాత కొద్దికాలంలోనే వేంగి దేశంలో సారస్వతాభివృద్ధికి కావలసిన రాజపోషణగానీ, శాంతిగానీ, స్థిరప్రభుత్వంగానీ లేకపోవడం.

3. పన్నెండవ శతాబ్దంలో వేంగీ దేశంతోపాటు తక్కిన ప్రాంతాలు కూడా మతకలహాలకు గురియ్యాయి.

4. చాళుక్యుల అధికార బలం సన్నగిల్లడంతోపాటు వారికి వారిదేశంపై ఆదరం తగ్గిపోయింది. దీనితో అన్య మతాలు దేశంలోకి ప్రవేశించి మతఘర్షణలు పెరగడానికి అవకాశం ఏర్పడింది. చాళుక్య రాజుల బలహీనతవల్ల చిన్నచిన్న మండలాధికారులు దేశాన్ని ఆక్రమించుకోవడానికి చేసే ప్రయత్నాల వల్ల దేశంలో అశాంతి ఏర్పడి 11 వ శతాబ్ది మధ్య భాగం నుండి 12వ శతాబ్దం చివరి వరకు దేశ పరిస్థితి సారస్వతాభివృద్ధికి అనుకూలంగా లేకుండాపోయింది.

5. నన్నయ తరువాత శైవ కవులైన నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు శైవమతానికి చెందిన వారు కావడంతో వీరు వైదిక మతంపైగానీ ఆ మత వ్యాప్తికిగానీ దూరంగా ఉన్నారు. దీనితో వైదిక మత వ్యాప్తికి ప్రారంభించబడిన భారతాంధ్రీకరణంపై ఆదరణ లేకపోయి ఉంటుంది.

6. ఆ తరువాత కూడా వైష్ణవ మతాభిమానం పెరగటం వలన రామాయణ రచనలు ప్రారంభమయ్యాయి.

7. తిక్కనకు పూర్వం నన్నయ్యకు తరువాత అధర్వుడనే కవి భారత రచనకు పూనుకొన్నాడని, అతడు భారతాన్ని నన్నయ్య రచించిన మొదటి మూడు పర్వాలు కాకుండా తరువాత విరాట, ఉద్యోగ, భీష్మ పర్వాలు రచించినట్లుగా కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇతడు రచించిన భారతంగానీ, అతని సమాచారం మాత్రం ఏమీ లభించదు. కానీ ఈ అధర్వుడు మాత్రం జైనుడై ఉంటాడని కొందరు పరిశోధకులు ఊహించారు.

8. నన్నయ్య తరువాత రెండు వందల సంవత్సరాల వరకు ఆంధ్రమహా భారతాన్ని ఎవ్వరు రచించక పోవడానికి మరొక కారణాన్ని విమర్శకులు పేర్కొన్నారు. ఈ కారణం ప్రకారం నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం ప్రచారంలో లేకుండా ఉండటం.

నన్నయ కాలం నాడు భారత రచనకు పలు అంశాలు కారణాలుకాగా, తిక్కన భారత రచన కాలం నాటికి తిరిగి మతపరమైన అంశం ప్రధానమైనదిగా కనిపిస్తుంది.

తిక్కన భారత రచనకు ఆనాడు నెలకొన్న మతపరిస్థితులే ప్రధానకారణంగా పలువురు పరిశోధకులు పేర్కొన్నారు. "తిక్కన్ననాటికాంధ్ర దేశమున బరిస్థితులు మారినవి. చార్వాకాది మతములకు వ్యాప్తిలేకున్నను, జైనమతమింకను విజృంభించియే యున్నది. పాలకుల యభిమానమాధారముగా నొకప్పుడు వైదికమతమును, నొకప్పుడు జైనమతమును బ్రాబల్యము వహించియుండినవి. ఇదిగాక పాల్కురికి సోమనాథాదుల రచనలవల్లను, బండితత్రయము వారికాంధ్రదేశమున నుండిన పలుకుబడివల్లను, వీరశైవము బ్రబలి సంఘమున మత కలహములకు హేతువైనది. బ్రాహ్మణ మతమవలంబులగువారియందే శైవవైష్ణవ మతములు స్థిరపడి క్రొత్త తెగలను సృష్టించినవి. సంఘమునకు మార్గదర్శకులు కావలసిన కవులయందును మతవిషయక విభేదము లేర్పడినవి. ఇట్టి క్లిష్ట పరిస్థితులనుండి సంఘమును రక్షించునుద్దేశముతో దిక్కన భారతమును బూర్తిచేయ సంకల్పించినాడు" (లక్ష్మీనారాయనరావు, భూపతి: భారతము - తిక్కన రచన, పుట.14.).

## 2.3.1. తిక్కన వ్యక్తిగత కారణాలు

తిక్కన మనుమసిద్ధి దగ్గర మంత్రిగానూ, సైన్యాధిపతిగానూ ఉన్నాడని సాహిత్య రచనల ద్వారా పలువురు పరిశోధకులు నిరూపించారు. తిక్కన తాత మంత్రిభాస్కరుడు రాజాస్థానంలో ఉన్నతోద్యోగంలో ఉండి ప్రసిద్ధి చెందినవాడని సాహిత్య రచనల ద్వారా తెలుస్తుంది. "వీరి నివాస స్థలము కృష్ణమండలములోని వెలటూరను గ్రామము. ఉద్యోగ ధర్మమున మంత్రిభాస్కరుని కాలములో గుంటూరున నుండుటంజేసి గుంటూరువారని పేరు వచ్చినదే కాని వీరియింటిపేరు కొట్టరువు వారు." (తిక్కన: నిర్వచనోత్తర రామాయణము, పీఠిక, పుట.3.) ప్రాచీన కవులకు సంబంధించికానీ, వారి రచనలకు సంబంధించికానీ చర్చించేటప్పుడు మత ప్రస్థావన అనేది సహజంగానే వస్తుంది. కాబట్టి తిక్కన మత ప్రస్థావన కూడా పేర్కొనడం అనేది సహజం. తిక్కన శివభక్తిపరాయనుడని అతని రచనల ద్వారా అవగతమవుతుంది. తిక్కన మొదటి రచన నిర్వచనోత్తర

రామాయణంలో

“అమలోదాత్తమనీష నే నుభయ కావ్యప్రౌఢిబాటించుశి
ల్పమునం బారగుడం గళావిదుడ నాపస్తంబసూత్రుండగౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమల ధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుడ దిక్కాంకుండ సన్మాన్యుడన్” (తిక్కన: నిర్వచనోత్తర రామాయణము, 1-13.) అనే పద్యాన్ని పేర్కొని ఉండటం వలన తిక్కన శివభక్తి పరాయనుడని తెలుస్తుంది. తిక్కన నియోగి బ్రాహ్మణుడని, గౌతమ గోత్రజుడని, కొమ్మమాంబకు మంత్రిభాస్కరునికి పౌత్రుడని, కొమ్మనకు నన్నమకు పుత్రుడని, మహేశ్వర భక్తుడని విమర్శకులు పేర్కొన్నారు. ఇది అంతాకూడా తిక్కన కుటుంబం మరియు వ్యక్తిగతానికి సంబంధించిన సమాచారం. వీటితోపాటు తిక్కన రాజాస్థానంలో ఉన్న విషయం కూడా తిక్కన రచనల ద్వారా తెలిసే విషయం.

తిక్కన మనుమసిద్ధిరాజు దగ్గరమంత్రిగా ఉన్నవాడు. రాయబారి పాత్రపోషించి తన రాజుకు రాజ్యాన్ని సంపాదించిపెట్టినవాడు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలలోకి వెళ్ళడం అవసరం లేకపోయినా నామ మాత్రంగానైనా పేర్కొనడం అవసరం. మనుమసిద్ధి తండ్రి తిక్కభూపాలుడు. తిక్కభూపాలుని పాలనాకాలంలో రాజ్యం సుస్థిరంగా లేదు. ఇతర రాజ్యాలనుంచి ప్రమాదం పొంచివున్నటువంటి పరిస్థితి. దానికి గల కారణం రాజ్యాల మధ్యగల సంఘర్షణలు. తిక్కభూపతి వెలనాటి చోడరాజైన పృథ్వీశ్వరుడిని యుద్ధంలో ఓడించి చంపాడు. పృథ్వీశ్వరుని అనంతరం అతని కొడుకు కుళోత్తుంగ రాజేంద్రచోళుడు రాజయ్యాడు. తరువాత కొంతకాలానికి తిక్కభూపాలుడి అనంతరం అతని కుమారుడైన మనుమసిద్ధి రాజయ్యాడు. రాజ్యాభారాన్ని వహించిన మనుమసిద్ధి స్థిరంగా రాజ్యాన్ని పాలించలేక పోయాడు. సామంతురాజ్యాల స్పర్థలు, దాయాదుల కుట్రల వల్ల అతడు రాజ్యాన్ని కోల్పోవలసిన పరిస్థితి వచ్చింది. మనుమసిద్ధి దాయాదులైన అక్కన బయ్యన అనే వారు మనుమసిద్ధిపై కుట్రచేసి తిరగబడ్డారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న కుళోత్తుంగ రాజేంద్రచోళుడు అక్కన

బయ్యనలకు పరోక్షంగా సహాయపడ్డాడు. దీనితో మనుమసిద్ధి పదవిని కోల్పోయాడు. మంత్రి అయిన తిక్కన మనుమసిద్ధికి రాజ్యాన్ని తిరిగి సంపాదించిపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అందుకుగాను తన శిష్యులను తీసుకొని కాకతీగణపతి దేవచక్రవర్తిని దర్శించటానికి ఓరుగల్లు బయలు దేరాడు. అప్పటికే గణపతిదేవుడు తిక్కన పాండిత్య కవితా ప్రతిభ గురించి విని ఉన్నాడు. గణపతిదేవుడు తిక్కనను సగౌరవంగా ఆహ్వానించాడు. అక్కడ తిక్కన తన పాండిత్య ప్రతిభ చేత బౌద్ధులను, జైనులను వివిధ వాదాలలో ఓడించాడు. దీనితో తిక్కన తన సాహితీ ప్రతిభ ద్వారా కాకతీయ గణపతి మెప్పుపొందాడు. అనంతరం కాకతీయ గణపతి దేవుడు తన సైన్యాలను పంపి అక్కన బయ్యనలను యుద్ధంలో ఓడించి నెల్లూరు రాజ్యాన్ని తిరిగి మనుమసిద్ధికి అప్పగించాడు. మనుమసిద్ధి కాకతీయ గణపతిదేవునికి సామంతరాజుగా మారాడు. ఆ సమయంలోనే మనుమసిద్ధి కోరిక మేరకు నిర్వచనోత్తర రామాయణాన్ని రచించాడు. ఈ సంఘటనలు జరిగే సమయానికి తిక్కన యవ్వనప్రాయుడై ఉంటాడని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. తరువాత జరిగిన అనేక పరిణామాలు తిక్కన ఆలోచనలో మార్పులు రావడానికి కారణమయ్యాయి. ఆ మార్పులే హరిహరనాథ తత్వాన్ని ప్రతిపాదించేవిగా, అద్వైతిగా మారి ఆంధ్రమహాభారత రచన చేయడానికి కారణాలయ్యాయి.

### 2.3.2. రాజకీయ పరిస్థితులు

నాడు మనుమసిద్ధి కాకతీయుల సహాయంతో రాజ్యాన్ని సంపాదించినప్పటికీ స్వతంత్రంగా రాజ్యాపాలన చేయలేకపోయాడు. దాయాదులనుండి నిరంతరం సమస్యలు ఎదురయ్యాయి. వాటిని పరిష్కరించుకోవడానికి మిత్రరాజ్యాల సహాయం కోసం ఎదురుచూడవలసి వచ్చింది. వివిధ రాజ్యాలతో జరిగిన యుద్ధాలలో తన కుటుంబసభ్యులను సైతం కోల్పోయాడు. "మనుమసిద్ధిరాజు దాయాధివర్గమునుండి కలిగెడు బాధలను దప్పించుకొనుటకై కాకతీయ సైన్యాధిపతులకు వశ్యుడై మెలగవలసి

వచ్చెను. కడపట గొల్లరాజులతో బసులమేపు బీళ్లకై తగువులుపడి యుద్ధములలో మనుమసిద్ధియును, తన పెద్దతండ్రి కుమారుడు ఖడ్గతిక్కనయు మరణము చెందుటను గాంచెను. వృద్ధుడైన పెదతండ్రి సిద్ధనామాత్యుడు గూడా స్వర్గస్తుడయ్యెను. మనుమసిద్ధి రాజ్యమును గాకతీయ సైన్యాధిపతు లాక్రమించుకొని పరిపాలింపసాగిరి. దేశస్థితి యంతయును మారిపోయెను. జనులలో శైవ వైష్ణవ మతభేదములు ముదిరి పక్షములేర్పడి తగువులు ప్రారంభమయ్యెను.'' (వీరభద్రరావు, చిలకూరి: తిక్కన సోమయాజి, పుట.90-91.) దీనితో దేశంలో రాజ్యాల మధ్య యుద్ధాలతో అన్నిచోట్లా అశాంతి నెలకొంది. పక్క రాష్ట్రాలలో కూడా ఇటువంటి పరిస్థితే నెలకొని ఉంది. ''దక్షిణ హిందూస్థానమున మహారాష్ట్ర, కర్ణాటక, ద్రావిడాంధ్ర కళింగులు సుస్థిరమైన యేక సామ్రాజ్యమును నెలకొలుప వలయునన్న సంకల్పముతో దమతమ యావచ్ఛక్తులను వినియోగించి దక్షిణాపదము నంతయు భయంకరమైన యుద్ధరంగముగా జేసికొని వీరాధివీరులై పోరాడుతున్న రాజకీయ వాతావరణము''(వీరభద్రరావు, చిలకూరి: ఆంధ్రుల చరిత్రము పార్ట్ -2, పుట.1.) నెలకొనింది. దీనితో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కాకతీయ సామ్రాజ్యానికి దగ్గర ఉన్న రాజ్యాలలో మతపరమైన యుద్ధాలు తలెత్తాయి. రాజ్యాధికారం కోసం జరిగిన యుద్ధాల కంటే మతం వల్ల కలిగిన యుద్ధాల వల్ల ప్రజలు కూడా యుద్ధంలో పాల్గొని అనేక విధాలుగా బాధపడ్డారు. ఈ సంఘటనలు ఓరుగల్లుపై కూడా ప్రభావం చూపాయి. ఇలా మతపరంగా జరిగినటువంటి యుద్ధంలో పేర్కొనదగినటువంటిది బిజ్జలుడికి బసవేశ్వరుడికి జరిగిన ఘర్షణ ప్రధానమైంది. బిజ్జలుడు కల్యాణపురాధీశ్వరుడైన రాజు. ఇతని రాజ్యం చాళుక్యులు అంతరించిన తరువాత అవతరించింది. అనంతరం బిజ్జలుడు బసవేశ్వరుడిని మంత్రిగానూ, సైన్యాధ్యక్షుడిగానూ నియమించాడు. బసవేశ్వరుడు తన అధికార బలం ద్వారా వీరశైవాన్ని వ్యాప్తి చేశాడు. ఇది నచ్చని బిజ్జలుడు బసవేశ్వరున్ని శిక్షించడానికి ప్రయత్నించాడు. ఇది చివరికి బసవేశ్వరుడికి, బిజ్జలుడికి సంఘర్షణ ప్రారంభమైంది. ఈ సంఘర్షణను బిజ్జలుడికి బసవేశ్వరుడికి మధ్య జరిగిన సంఘర్షణగా కంటే మతపరంగా జరిగిన సంఘర్షణగానే చరిత్రకారులు పేర్కొన్నారు. ఈ ఘర్షణలో ''పౌరజనంబులు

జైనులును వీరశైవులు నిరుకక్షలంజేరి ద్వంద్వ యుద్ధము చేయగడింగిరి. ఇట్లు మనుష్యులు మనుష్యులతోడను, అశ్వికులాశ్వికులతోడను, గజాధిరూఢులు గజాధిరూఢులతోను, రథికులరథికులతోను, బాలురు బాలురతోను ఘోరముగా బోరాడిరి". (పైదే, పుట.24.) దీనితో ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన రాజు కూడా మత యుద్ధంలో పాల్గొన్నాడు. శాంతి భద్రతలు ఆశించవలసిన ప్రజలు కూడా యుద్ధంలో పాల్గొన్నట్లు కనిపిస్తుంది.

## 2.3.3. మత పరిస్థితులు

నన్నయ భారత రచన చేసే సమయానికి తిక్కన భారత రచన చేసే సమయానికి మత పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. చాళుక్యుల కాలంలో అక్కడక్కడ కొందరు బౌద్ధులు ఉన్నప్పటికీ బౌద్ధమతం క్షీణించినదని చెప్పవచ్చు. కాని జైనమతం మాత్రం అక్కడక్కడ సంఘంలో ఉండేది. వీరశైవం ప్రాబల్యంలోకి రావటం వలన జైనమతం క్రమక్రమంగా క్షీణించడం ప్రారంభించింది. వర్తకులు రాజకీయోద్యోగులు వీరశైవ మతాన్ని అవలంబించటంచేత ఆ మతము వ్యాపించసాగింది. కొన్ని చోట్ల కొందరు బ్రాహ్మణులు జైనవిగ్రహాల స్థానంలో వైదికమత విగ్రహాలు ప్రతిష్ఠించడం కూడా జరుగుతుండేది. ఒక విధంగా చెప్పాలంటే ఈ కాలలో దేశంలో మత పరిస్థితి క్రమంగా మారిపోవడం ప్రారంభమైంది.

ఆనాడు మతపరిస్థితులు కూడా సమాజంపై, సాహిత్యంపై ప్రభావం చూపాయి. అప్పటికే శైవం సమాజంలో స్థిరపడినట్లు తెలుస్తుంది. దీనితో పాటు రామానుజులవారి ప్రభావం వలన వైష్ణవం కూడా వ్యాప్తిలో ఉంది. అన్నికిటికంటే ముఖ్యమైంది సమాజంలో జైన, బౌద్ధమతాల ప్రభావం. నాడు జైనం ఇంకా ప్రజల మధ్య ఉన్నట్లే తెలుస్తుంది. "ఏకశిలానగర సామ్రాజ్యములో జైన బౌద్ధములు, వైదిక మతముతో పాటు ప్రక్కప్రక్కనే ప్రబలియుండినవి. కానీ, కొన్ని చోట్ల మైలార వీరులను వీరశైవ గణము

విజృంభించి, బౌద్ధ జైనులపైబడి గారీయబెట్టుచుండుటచే మతకలహములురేగి దేవుని పేర రక్త వసంతోత్సవములు సాగించిరి." (కోదండరామిరెడ్డి, మరుపూరు: తిక్కన భారతము కర్ణపర్వము, పుట.64.) చరిత్ర పుస్తకాలన్నింటిలోనూ పన్నెండు, పదమూడవ శతాబ్దాలలో మతపరమైన సంఘర్షణలు జరిగినట్లు పేర్కొన్నారు. దానికి గల కారణం అన్ని వర్గాలలో మతావేశం ప్రబలడమే. కొందరు రాజ్యాధికారంలో రాజులు సామాన్యంగా శైవమతాభిమానులుగా ఉంటే, సామంత రాజులు, సైన్యాధిపతులు, ఉన్నత రాజకీయోద్యోగులు జైనమతాన్ని అవలంబిస్తూ జైనమతాచార్యులను పోషించడం జరిగింది. దీనితో జైనమతం కూడా జనసామాన్యుల మతమై తగిన స్థానాన్ని సంపాదించగలిగింది. సామాన్య ప్రజలలో తమ జైనమతానికి ఉన్న ఆదరణతో పలువురు సామంతరాజులు తమ సైన్యాధిపతుల సహాయంతో సామ్రాజ్యాధిపతులపై తిరగబడి సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన శైవ, వైష్ణవ బ్రాహ్మణ మతాచార్యులు అనేకులు దక్షిణ భారతదేశంలో తమ తమ మత సామ్రాజ్యాలను రక్షించుకోవటానికి పూనుకొని మతబోధనలు చేయటం ప్రారంభించారు. ఇటు జైనుల మతబోధకుల వలన, అటు శైవ, వైష్ణవ బ్రాహ్మణుల మత బోధనల వలన పలువురు సామాన్యులు కూడా సంస్కర్తలుగా తయారయ్యారు. వీరందరి మత బోధనలతో సమాజంలోని వాతావరణం అల్లకల్లోలం అయింది. దీనితో పన్నెండవ శతాబ్ది స్థితి ప్రజలకు మానసిక ప్రశాంతత లేకుండా చేసింది. కొన్ని సందర్భాలలో తీవ్ర మత యుద్ధాలు జరిగాయి. "దక్షిణ హిందుస్థానమున మున్నెన్నడును గనివిని యెరుంగునట్టి మతద్వేషము సంప్రాప్తమయ్యెను." (వీరభద్రరావు, చిలకూరి: ఆంధ్రుల చరిత్రము పార్ట్ -2, పుట.18.)

అయితే చరిత్రలో క్రీ.పూ. కూడా ఇటువంటి మత యుద్ధం జరిగి ఇటువంటి మత పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తుంది. అశోకుడు పాలించిన కాలంలో కూడా మత యుద్ధం జరిగినట్లు తెలుస్తుంది. క్రీ.పూ. 321వ సంవత్సరంలో చంద్రగుప్తుడు అలెగ్జాండర్ కంటే

పూర్వం ఉన్న రాజులను ఎదిరించి ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలను ఆక్రమించుకొని స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి దానికి పాటలీపుత్రం రాజధానిగా చేశాడు. అతని తరువాత అతని మనుమడైన అశోకుడు క్రీ.పూ.272-231వ సంవత్సరం వరకు పరిపాలించాడు. అశోకుడి తరువాత తన సామ్రాజ్యాన్ని ఉత్తర భారతదేశంలో మాత్రమేగాక దక్షిణ భారతదేశంలోని చాలా భాగాలను తన ఆధీనంలోకి తెచ్చుకొన్నాడు. దీనితో అనేక మంది రాజులు బౌద్ధమతంలో చేరి దానిని వ్యాపింప చేశారు. కాని ఇది తరువాత కాలంలో బౌద్ధులకు, హిందువులకు నిరంతర కలహాలను కలుగజేసింది. తరువాత పల్లవుల కాలంలో కూడా ఇటువంటి పరిస్థితే తలెత్తింది. "పల్లవులు భరద్వాజులు పరమబ్రాహ్మణ్యులునని శాసనముల వలన దెలియుచున్నది. వీరిలో గొందరు శైవమతాభిమానులును, మరికొందరు వైష్ణవమతాభిమానులుగను గూడా గనబడుచున్నారు. మహేంద్రవర్మయను నాతడు మొదట జైనుడైయుండి శైవులను బాధించియు, తరువాత శైవమతమునందభిమానము కలుగుటచే జైనులందరను హింసించి వారి నివాసములను నిర్మూలించినట్లు గనబడుచున్నది." (రామకృష్ణయ్య, కోరాడ: ఆంధ్రభారత కవితావిమర్శనము, పుట.81.)

ఇటువంటి పరిణామాలే తిరిగి మరొక్క సారి 12వ శతాబ్దంలో జైనులకు, శైవులకు, వైష్ణవ మతస్తులకు జరిగాయి. కొన్ని సందర్భాలలో శైవ, వైష్ణవులకు మధ్య మాత్రమే జరిగాయి. శైవ, వైష్ణవమతస్తుల మధ్య జరిగిన గొడవలను, వారి సమస్యలను పరిష్కరించడం కోసం పలువురు ప్రయత్నించారు. సహజంగా రాజ్యం కోసం వివిధ దేశాల మధ్య జరిగేవి లేదా కొన్ని సందర్భాలలో ఒకే దేశంలో, ఒకే కుటుంబంలో అధికారం కోసం జరిగేవి. కాని మతపరమైన విషయాలు ఒకే దేశంలో జరుగుతూ అందరి మధ్య సమస్యలు తలెత్తి, అందరిని ఇబ్బందులకు గురిచేస్తూ ఉండేవి.

### 2.3.4. హరిహరనాథతత్త్వము-ఆంధ్రమహాభారత రచన

పై అంశాలను పరిశీలించినట్లయితే వివిధ మతాలమధ్య గల సంఘర్షణను అవగతం చేసుకోవచ్చు. ఆంధ్ర దేశంలో జైన, శైవవైష్ణవ మతాల మధ్య జరిగిన యుద్ధం కంటే, శైవ, వైష్ణవాల మధ్య జరిగిన సంఘర్షణలు సమాజంపై ఎక్కువ ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా ఆంధ్రదేశంలో కూడా శైవమత ప్రచారాన్ని మల్లికార్జున పండితుడు, పండితారాధ్యుడు మొదలైనవారు ప్రచారం చేశారు. వారి వలన శైవం వీరశైవంగా రూపుచెందింది. అదే విధంగా రామానుజులవారి ప్రవేశంతో వైష్ణవం వీరవైష్ణవంగా పరిణమించింది. దీనితో వీరవైష్ణవ, వీరశైవాల మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ మతపరమైన ఘర్షణలనుండి ప్రజలను సక్రమ ఆలోచనలవైపు మళ్ళించడానికి తిక్కన హరిహరనాథ తత్త్వాన్ని ప్రతిపాదించాడని విమర్శకుల భావన. "శివకేశవులా పరమాత్మయొక్క భిన్నమూర్తులు అను జ్ఞానమును ప్రజలకు గలిగించుటకై తిక్కన హరిహరమూర్తి నిష్టదేవతగా స్తుతించి తన భారత మాదేవునికి కంకితమొనర్చినాడు. ఇతని యుదారాశయమున ఫలించి సంఘమున శివకేశవ భేదములడగినవి". (రామకృష్ణయ్య, కోరాడ: ఆంధ్ర భారత కవితావిమర్శనము, పుట.14.) ఈ వీరశైవ, వీరవైష్ణవ మతాల రెండింటిలో మతపరంగా వీరత్వముంది. అంటే ఆయా భక్తులు సాత్వికంగా గాక వీరకృత్యాలతో భక్తిని ప్రదర్శించేవారు. దీనివలన సంఘంలో, మతవిషయంలో, భక్తిప్రపత్తులలో అంతరాయాలు కలిగి, ఆధ్యాత్మిక జీవితానికి భంగం కలిగే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని తొలగించి ఇద్దరి మధ్య భేదాలను తొలగించి హరిహరతత్త్వము ప్రారంభమైంది. దీనివలన హరిగాని, హరుడుగాని ఒకరికంటే మరొకరు ఎక్కువకాదని, ఇద్దరు ఒకే మూర్తియొక్క రెండు స్వరూపాలని అతనిలో శివవిష్ణు స్వరూపాల గుణాలు సంపూర్ణంగా ఉండటంతో అతడు హరిహరమూర్తిగా భావించబడి, అర్చింపదగిన వాడయ్యాడు. ఆంధ్రదేశంలోనూ, తెలుగు సాహిత్యంలోనూ ఈ సంప్రదాయం బాగా వ్యాప్తిలోకి వచ్చింది మాత్రం తిక్కనగారి ద్వారానే. కాని ఈ హరిహరనాథతత్త్వం

ఎప్పుడు ప్రారంభమైంది అనే విషయంలో పరిశోధకుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. కొందరు ఈ సంప్రదాయాన్ని ప్రాచీన సాహిత్యంలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. "హరిహరనాథతత్త్వము తిక్కనగారు కల్పించినదికాదు. వ్యాసుని భారతమునగల అనేక తత్వములలో ఒక తత్వముగనున్నది. మరియు విష్ణుని అష్టోత్తర శతనామావళిలో 'హరిహరరూపైక మూర్తయేనమః' అన్న పేర్కొనబడినది." (లక్ష్మీకాంతం, పింగళి: ఆంధ్ర సాహిత్య చరిత్ర, పుట.212.)

ఇక ఈ సంప్రదాయం ఆంధ్ర దేశంలో ఎప్పుడు ప్రారంభమైంది అనే విషయం గురించి కూడా కొంత చర్చ జరిగింది. క్రీ.శ. 6వశతాబ్దానికే ఆంధ్రదేశంలో హరిహరనాథతత్త్వం ఉన్నదనీ, అది క్రీ.శ. 8వ శతాబ్దానికి వ్యాప్తిలోకి వచ్చినట్లు తెలుస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. "బాదామి గుహలలో కూడా హరిహరమూర్తులు చెక్కబడివున్నవి. పశ్చిమ చాళుక్యరాజులు పృథ్వీవల్లభ బిరుదాంకితుడు మంగలేశ్వరుడు క్రీ.శ. 578లో చెక్కించి పూజించిన మూర్తులివి. ఇవి భైరవునికోన దేవాలయములకంటే ముందుపుట్టినవి. ఇచట హరిహరనాథ విగ్రహములు రెండు కలవు. 1. ఇరుప్రక్కల దేవులుగల హరిహరనాథుడు 2. ఒంటరిగానున్న హరిహరనాథుడు. క్షుద్రమత వైషమ్యములతో తోడివారి నెత్తురుచిందించుట 'సర్వమున్నతుని దివ్యకళా మహిమంచు' చాటు వైదిక మతమునకు గిట్టలేదు. అందువలన శివ కేశవులను ఒకటి చేసి పూజించు సామరస్య మతప్రకారము ఆంధ్రదేశమున 8వ శతాబ్దమునాటికే పుట్టి ప్రబలినది. పల్లవరాజు నరసింహుడు, నెల్లూరు ఉదయగిరిసీమలో సీతారామపురమునకు ఈశాన్యమున 7,8 మైళ్ళలోనున్న భైరవుని కోనయందు, బౌద్ధ వాస్తు శిల్పమువనుసరించి, ఏడు శివలింగాలయములను గట్టి కాశిరాతి కొండలో మలిపించాడు. ఈ గుహాలయముల వరసకు ఎదురుగా ఒక సెలయేటి వడ్డున ఒక పెద్ద నిడుచు చట్రాతి గేడిపాటున (నిలువుపక్కన) హరిహరనాథుని అర్థమూర్తి చెక్కబడియున్నది. ఈ పవిత్ర శాంతిమగ్నవాతావరణములో

హరిహరనాథోపాసనము ననవేసి దిక్కులకు తీగలల్లినది.'' (కోదండరామిరెడ్డి, మరుపూరు: తిక్కన భారతము కర్ణపర్వము, పుట.71.) కాని ఈ హరిహరనాథ తత్త్వము ఆకాలానికే ఉన్నప్పటికీ ఎక్కడ కూడా తగిన అధారాలు సంపూర్ణంగా లభించినట్లు కనిపించవు. మొదటగా సంపూర్ణంగా హరిహరుని గురించిన ప్రస్థావన కేవలం సాహిత్యంలోనే స్పష్టంగా కనిపిస్తుంది. సాహిత్యంలో మొదటి సారిగా మల్లికార్జున పండితుడు చర్చించినట్లుగా కనిపిస్తుంది. "మల్లికార్జున పండితుని కాలమునకిది ప్రచారములో నుండుటచేత నాతడే హరిహరారాధనను ఇతరమతములతో పాటు ఖండించియున్నాడు. అతడు స్పష్టముగా హరిహరులొకటిగారనియు, హరిహరుడను మూర్తియున్నను ఆతనికి దేవాలయము లేదనియు అది కల్పితమనియు ప్రమాణ పూర్వకముగా నిరూపించినాడు.'' (వైదేహి, అల్లాడి: ఆంధ్రుల సాంఘిక ఆర్థిక చరిత్ర, పుట.224.) బహుశ ఈ విధంగా మల్లికార్జున పండితుడి చేత చర్చించబడిన హరిహరారాధన తిరిగి పదమూడవ శతాబ్దిలో తిక్కన పునఃప్రారంభించినట్లు భావించవచ్చు. తన ఆంధ్రమహాభారత రచన ద్వారా పునరుజ్జీవింప జేశాడు. ఈ హరిహరనాథతత్త్వం సామాజికంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకురాక పోయినప్పటికీ సమాజంలో మాత్రం ఉంది అని భావించవచ్చు.

ఇక సామాజికంగా, మత పరంగా ఉన్న ఈ పరిస్థితులతో పాటు వ్యక్తిగతంగా తిక్కన చవిచూసిన అనుభవాలు కూడా ఆంధ్రమహాభారతం వెలువడటానికి మరొక కారణం. అంటే తిక్కన వ్యక్తిగత కారణాలు కూడా ఆంధ్ర మహాభారత రచనకు దోహదపడ్డాయి. తిక్కన మనుమసిద్ధి రాజ్యం కోల్పోయినప్పుడు కాకతీయరాజుతో చర్చించి, అతని సహాయంతో తిరిగి రాజ్యాన్ని మనుమసిద్ధికి అప్పగించాడు. కాని తిక్కన చివరి రోజులలో తిరిగి సమస్యలు ప్రారంభమయ్యాయి. పసువులమంద మేపుకోసం కట్టవలసిన పన్నుల గొడవలో కాటమరాజుకు మనుమసిద్ధికి యుద్ధం జరిగింది. ముఖ్యంగా తనకు ఆశ్రయమిచ్చిన రాజు మనుమసిద్ధి, తన బంధుమిత్రులు

కూడా మరణించారు. వీరుడుగా ప్రసిద్ధిగాంచిన ఖడ్గతిక్కన, తిక్కనకు పెదనాన్న కొడుకు. సిద్ధనామాత్యుడు తిక్కనకు పెదతండ్రి. సిద్ధనామాత్యునికి ఏడుమంది కొడుకులు. అందరు కూడా రాజకొలువుల్లో ఉన్నవారే. ముఖ్యంగా మనుమసిద్ధి యుద్ధంలో మరణించడంతో కాకతీయ రాజులు ఇచ్చిన అగ్రహారాల మీద ఆధారపడి బ్రతకవలసి వచ్చింది. అప్పటి వరకు అనుభవించిన రాజభోగాలు కాస్త తగ్గిపోయాయి. వీటన్నిటికితోడు వయస్సు మీద పడింది. జరిగిన ఈ సంఘటనల వలన, వయస్సుపెరగటం వలన వైరాగ్యబుద్ధి పెరిగింది. పదవుల మీద ఆసక్తి విడచి ధర్మానురక్తి కలిగింది. దీనితో తన జీవితాన్ని లోకహితార్థం వినియోగించడానికి సిద్ధపడ్డాడు.

అప్పటికే ప్రజల మధ్య చెలరేగిన గొడవలు కూడా తిక్కనను కలచివేశాయి. ప్రజలకు మంచి మార్గోపదేశం చేసే ఆలోచనకు పూనుకున్నాడు. అప్పటికే ప్రజలకు సమస్త ధర్మాలను బోధించేదిగా, పంచమవేదంగా పరిగణించబడే మహాభారతం సంస్కృత భాష నుంచి తెలుగులో రచించే ప్రయత్నం జరిగి ఉంది. కాని సంపూర్ణంగా జరగకపోవటం వలన అప్పటికి సంస్కృత భారతం మాత్రమే చెలామణిలో ఉంది. ఆంధ్రులకు భారత ధర్మాలను ఆంధ్రభాషలో తెలుపవలసిన ఆవశ్యకత గుర్తించాడు. ధర్మబద్ధమైన సాంప్రదాయాలను ఆంధ్రులకు సులభంగా అందించే మార్గం భారతం ద్వారా సాధ్యపడుతుందని భావించాడు. దీనినే తిక్కన సోమయాజి విరాటపర్వంలో మొదట కృతి నిర్మాణ ప్రస్తావనలో వివరించాడు. అదే విషయం విరాటపర్వం అవతారికలో కనిపిస్తుంది. కృష్ణద్వైపాయనుడు లోకహితార్థం భారతం రచించాడని అవతారికలో పేర్కొన్నాడు.

"విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుడు సంయమిప్రకర సంభావ్యాను భావుండుగృ
ష్ణద్వైపాయనుడర్తి లోకహిత నిష్టంబూని కావించెధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్" (తిక్కన:

ఆంధ్రమహాభారతము, విరాటపర్వము, 1-3.). కాబట్టి తిక్కన కూడా లోకహితార్థం భారత రచన తెలుగులో చేయటానికి పూనుకొన్నాడు.

నిర్వచనోత్తర రామాయణం రచించేనాటికి తిక్కన వైదికమార్గాన్ని అవలంబిస్తున్నప్పటికీ శివభక్తిపరాయనుడై ఉన్నాడు. కాని మారిన పరిస్థితులను అప్పటికే చూసి ఉన్నాడు. శైవ, వైష్ణవులమధ్య ఘర్షణలతో బాధపడి ఉన్నాడు. వీటిన్నిటికి పరిష్కారంగా, లోకహితం కోసం భారత రచన చేయటానికి పూనుకున్నాడు. అటువంటి లోకహితం జరగాలంటే శివుభక్తులతో పాటు విష్ణుభక్తులు కూడా కలిసిరావాలి, సంఘర్షణలు వీడాలి. అందుకోసం శివకేశవల మధ్య అభేద భావంతో, అద్వైతమత ధర్మాన్ని స్థాపించాలనుకున్నాడు. తత్ఫలితంగానే హరిహరనాథతత్వాన్ని ప్రతిపాదించి ఆంధ్రమహాభారతాన్ని ప్రారంభించాడు. అందుకే అవతారిక ప్రారంభమే

“శ్రీయన గౌరినా బరగు చెల్వకుజిత్తము పల్లవింప భ

ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణురూ

పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక

ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్” (తిక్కన: ఆంధ్ర మహా భారతము, విరాటపర్వము,1-1.)

ఈ విధంగా హరిహరనాథతత్త్వంతో ఆంధ్ర మహాభారతాన్ని ప్రారంభించిన తిక్కన నన్నయ రచన తర్వాత ఆగిపోయిన భాగాన్ని రచించకుండా వదలివేసి, విరాటపర్వంతో ప్రారంభించడానికి గల కారణాలను గురించిన చర్చ ఇప్పటికే జరిగింది. కొన్ని కారణాలను కూడా ఇంతకు పూర్వమే పేర్కొనడం జరిగింది. విరాటపర్వంతో ప్రారంభమై చివరిదాకా తిక్కన కొనసాగించాడు. కాని అరణ్య పర్వశేషభాగం మాత్రం అలాగే మిగిలిపోయింది.

## 2.4. ఎర్రన- అరణ్య పర్వశేషం

ఇక సాహిత్య చరిత్రలో మరొక పెద్ద చర్చ ఆంధ్రమహాభారత అరణ్యపర్వ శేషంపై జరిగింది. ఏ సమయంలో, ఏ సందర్భంలో ఎందుకు ఆంధ్రమహాభారతం అరణ్యపర్వం మధ్యలో ఆగిపోయిందో కాని సాహితీవేత్తలు, విమర్శకులు, పరిశోధకులు ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానించారు. కొందరు అరణ్య పర్వం మొత్తం కూడా నన్నయ రాశాడని ఏకారణం వల్లనో అందులో కొంత భాగం శిథిలమైపోయిందని పేర్కొన్నారు. మరికొందరు నన్నయ అరణ్య పర్వం మధ్యలోనే ఆగిపోయిందని అందుకు పలు రకాల కారణాలను విశ్లేషించారు. మరికొందరు అరణ్య పర్వంలోని శేష భాగం తిక్కనే రచించాడని వాదించారు. కాని చివరికి పరిశోధకుల్లో అధిక సంఖ్యాకులు ఎర్రన అరణ్య పర్వం రాశాడని పేర్కొన్నారు. ఇది చివరికి తుది నిర్ణయమై నడుస్తూ ఉంది.

ఎర్రన ఆంధ్ర మహాభారతాన్ని రచించినప్పుడు ఉన్న పరిస్థితులు ఏమిటి? ఆంధ్రమహాభారతాన్ని ఎర్రన ఎందుకోసం పూరించి ఉంటాడు? ఎర్రన మొదట ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి గల కారణాలు ఏమిటి? మొదలగు విషయాలు తెలుసుకోవడం అవసరం. ఎర్రనకు సంబంధించిన సమాచారాన్ని ఇదివరకే పరిశోధకులు పేర్కొన్నప్పటికీ అవసర రిత్యా ఇక్కడ మళ్ళీ పేర్కొంటున్నాను. ఎర్రన జన్మస్థలం పాకనాటిలోని గుడ్లూరని, తండ్రిపేరు సూరన అని, తల్లి పేరు పోతమ అని పండితులు నిశ్చయించారు. ఎర్రన తల్లిదండ్రులు జీవనాధారం కోసం చదలవాడకు వచ్చారు. అక్కడ ఎర్రన ప్రతిభను, పాండిత్యాన్ని గ్రహించి మల్లరథినాథుడు లేక మల్లారెడ్డి, తన అన్న అయిన వేమారెడ్డి దగ్గరకు తీసుకెళ్ళాడు. వేమారెడ్డి అద్దంకి రాజధానిగా రాజ్యాన్ని పాలించిన రెడ్డిరాజుల్లో ఒకడు. ఎర్రన రామాయణాన్ని, హరివంశ గ్రంథాలను వేమారెడ్డికే అంకితమిచ్చాడు.

ఎర్రన రచనల కాల క్రమం ఏది అనే విషయంలో కూడా పండితుల మధ్య పలు రకాల చర్చలు జరిగాయి. వాటిని ప్రస్తుతం ఇక్కడ ప్రస్తావించకుండా విమర్శకుల రచనల ఆధారంగా ఈ క్రింది విధంగా పేర్కొంటున్నాను. ఎర్రన రచనల క్రమం రామాయణము, హరివంశము, అరణ్య పర్వశేషము, నృసింహ పురాణము. ఇందులో ప్రస్తుతం అరణ్య పర్వశేషం గురించి చర్చిస్తున్నాను. అంటే అరణ్య పర్వం రాయటానికి గల కారణాలను ఇందులో చెప్పదలుచుకున్నాను.

ఎర్రన కాలానికి సంబంధించిన చర్చ కూడా ఎక్కువగానే జరిగింది. దాదాపు 13వ శతాబ్దం చివరి నుంచి 14వ శతాబ్దం వరకు అంటే దాదాపు క్రీ.శ. 1280 ప్రాంతం నుంచి క్రీ.శ.1375 వరకు ఎర్రన కాలం అని చర్చ జరిగింది. చివరకు అధిక సంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం "ఎఱ్ఱాప్రెగడ క్రీ.శ.1280లో జన్మించి క్రీ.శ.1364 దాకా జీవించి ఉంటాడని చెప్పవచ్చు" (రామచంద్ర, వి: ఎర్రాప్రెగడ, పుట.13.) అని పేర్కొనడం జరిగింది. అయితే ఎర్రన అరణ్య పర్వశేషం మీద పరిశోధన చేసిన ఓగేటి అచ్యుత రామశాస్త్రి ఎర్రన కాలాన్ని గూర్చి పేర్కొంటూ "ఎఱ్ఱన కాలము క్రీ.శ. 1300 నుండి 1375 వఱకు" అని పేర్కొన్నాడు.

ఇక ఎర్రన మొదటి రచనలు అంత సమస్యతో కూడుకున్నవి కావు. అంటే రామాయణ, హరివంశాలు వేమారెడ్డి కోరిక మేరకు రచించాడు. అందువలన అప్పటి పరిస్థితులకు అతడు స్పందించి తన రాజు కోరిక మేరకు రామాయణ, హరివంశాలను రచించాడు. కాని అరణ్య పర్వ శేషాన్ని, నృసింహ పురాణాన్ని రచించింది మాత్రం వయసు మీద పడిన తరువాతనే అని భావించవచ్చు. ముఖ్యంగా ఇది వేమారెడ్డి మరణానంతరం అరణ్య పర్వశేషం, నృసింహ పురాణం రెండింటిని రచించి ఉంటాడని భావించవచ్చు. దానికి గల కారణం మొదటి రెండు రచనలు రామాయణ, హరివంశ గ్రంథాలు వేమారెడ్డికి అంకితమివ్వగా, అరణ్య పర్వశేషం రాజరాజ నరేంద్రుడికి, నృసింహపురాణం అహోబిల నృసింహస్వామికి అంకితమిచ్చాడు.

ఒక విధంగా ఎర్రన ఆంధ్రుల చరిత్రలో మిక్కిలి విషాదం పొందిన కాలాన్ని, తిరిగి మరల మహోన్నతి పొందిన కాలాన్ని చూశాడు. మొదట వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి ఎర్రనను ఆదరించాడు. తరువాత తన అన్న అయిన వేమారెడ్డికి అర్పించాడు. ఈ విషయం

"నాతమ్ముండు ఘనుండు మల్లరధినీనాధుండు నిన్నాతత
శ్రీతోడన్ సముపేతు జేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మొలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింక నేను దనియన్ గావ్యామృతాస్వాదనన్" (ఎర్రన: హరివంశము, 1-39.) అనే పద్యం ద్వారా తెలుస్తుంది. అలా వేమారెడ్డి ఆస్థానానికి చేరిన ఎర్రన మొదట రెడ్డిరాజ్యం స్థాపించిన సమయంలో కొంత ఇబ్బందికర పరిస్థితులను చూసినప్పటికీ, స్వయంగా సేనాపతి అయిన వేమారెడ్డి తన తమ్ముడు, కొడుకుల సహకారంతో రాజ్యాన్ని విస్తరించి సుస్థిరతను చేకూర్చాడు. అప్పటి వరకు ముస్లిం దండయాత్రలతో ఇబ్బంది పడిన ప్రజలకు వేమారెడ్డి పరిపాలన కొంత ఉపశమనాన్ని కలిగించింది. సిరిసంపదలతో విస్తరించే స్థితి నెలకొంది. ఆ సమయంలో ఎర్రన కూడా ఆ సిరిసంపదలను చవిచూశాడు. ఆనందమయ జీవితాన్ని గడిపాడు. జీవితమంతా సవ్యంగానే సాగింది. అప్పటికే మతపరంగా రెడ్డి రాజులు హిందూ మతోద్ధారణకు కంకణం కట్టుకొన్నారు. కాబట్టి హిందూ మతోద్ధారణకు ఎర్రన హరివంశాన్ని కూడా రచించాడు. కాని 1353లో వేమారెడ్డి మరణించాడు. అప్పటి వరకు అన్ని విధాలుగా స్థానాన్ని ఇచ్చి, కవిగా గుర్తించిన వేమారెడ్డి మరణం ఎర్రన మనస్సును కూడా మార్చింది. ఎర్రన మీద ప్రత్యేక అభిమానంతో కూడిన పక్షపాతం వహించినటువంటివాడు వేమారెడ్డి. వేమారెడ్డి పక్షపాతానికి కారణం ఎర్రన ప్రతిభ. సకల భాషా కవితా విశారుదుడు ఎర్రన. కాబట్టి, ఆ ప్రతిభే ఎర్రనను వేమారెడ్డి ఆదరాభిమానాలకు కారణమైంది.

అప్పటి వరకు తనను ఆదరించిన వేమారెడ్డి లేకపోవడం మానసికంగా ఎర్రనను బాధించింది. వేమారెడ్డి తరువాత అతని కొడుకు అనపోతారెడ్డి రాజ్యాన్ని స్వీకరించాడు.

అనపోతారెడ్డి ఎఱ్రనను ఆదరించినప్పటికీ వేమారెడ్డి చూపిన గౌరవాభిమానాలను పొందలేకపోయాడని చెప్పవచ్చు. అనపోతారెడ్డి తరువాత అతని కుమారుడు బాలడవ్వటం వలన అనపోతారెడ్డి తమ్ముడు అనవేమారెడ్డి రాజ్యభారాన్ని స్వీకరించాడు. కాని అతడు జీవించినంతకాలం యుద్ధాలను ఎదుర్కోవలసి వచ్చింది. "ఇతడు బ్రతికియున్నంతకాలము రాచకొండ, దేవరకొండ దుర్గములకధిపతులై రాచకొండ రాజ్యమును బరిపాలనము సేయుచుండెడి అనపోతనాయుడు, మాధవనాయుడు బలవద్విరోధులై యీతని రాజ్యమాక్రమించు కొనవలయునని దండయాత్రలు సలిపి యనవేమ భూపాలునితోడ ఘోర యుద్ధములు చేసి పరాజితులగుచు వచ్చిరి" (వీరభద్రరావు, చిలకూరి: ఆంధ్రుల చరిత్రము-3, పుట.171-172.). ఇటువంటి పరిస్థితులలో వీరికి కేవలం రాజ్య రక్షణ తప్ప ఇతర వ్యాపకాన్ని చూసే ధ్యాసలేకపోయింది. ఈ పరిస్థితులలో ఎఱ్రన రాజాస్థానం నుంచి తన సొంత గ్రామానికి వెళ్ళాడని భావించవచ్చు. "అరణ్య పర్వ శేష రచన నాటికి గుడ్లూరును చేరినాడు. రామాయణ హరివంశ రచనల కాలమున నద్దంకి సమీపమున చదలవాడ యందుండెననియు, ననంతరము నీలకంఠేశ్వరి స్థానమగు గుడ్లూరులో తన చివరి దినములు గడిపెననియు విశ్వసింపవచ్చును." (గోదావరీబాయి, సంధ్యావందనం: ఎఱ్రయ తీర్చిన హరివంశము, పుట.19.)

అప్పటికే మహాభారతం రచన గురించి విని ఉన్నాడు. అన్నిటికంటే ముఖ్యమైనది వేమారెడ్డి విన్నపం. అప్పటికే వేమారెడ్డి కోరిక మేరకు ఎఱ్రన హరివంశాన్ని రచించి ఉన్నాడు. సంస్కృతంలో హరివంశం అంటే భారతంతో కూడుకున్నదిగా భావిస్తారు. తెలుగులో కూడా ఆ పని జరగాలి. "ప్రోలయ వేముడు హరివంశాన్ని ఆంధ్రీకరించుమని యెఱ్రాప్రెగ్గడను కోరడంలో తెలుగులో హరివంశ సహితంగా భారతం సమగ్రంగా అవతరించాలన్నదే ప్రధానాశయం" (రామచంద్ర, వి: ఎఱ్రాప్రెగడ, పుట.18.). ఈ విషయం గ్రహించినప్పటికీ అప్పటికి కేవలం హరివంశం మాత్రమే రచించాడు. కాబట్టి ఇప్పుడు మహాభారతాన్ని పూర్తి చేయవలసిన సమయంగా

భావించాడు. దానికి కారణం తనను ఆదరించి, గౌరవించిన వేమారెడ్డి కోరికను పూర్తిచేయటం కూడా ఒకటి. హరివంశంతో పాటు ఎఱ్ఱన భారతాన్ని పూర్తి చేయకపోవటానికి మరికొన్ని కారణాలు కూడా కనిపిస్తాయి. అప్పటికే ఎఱ్ఱన వేమారెడ్డి ఆస్థాన కవిగా ఉన్నాడు. తన కోరికను మన్నించి రచించిన గ్రంథాలను అతడికే అంకితమిచ్చాడు. ఒక వేళ అతడు అరణ్య పర్వాన్ని రచిస్తే ఎవరికి అంకితమివ్వాలనే సందేహం వచ్చి ఉంటుంది. అందుకు వేమారెడ్డికి విషయాన్ని ప్రత్యక్షంగా చెప్పలేని పరిస్థితి. ఎఱ్ఱన మహాభారత అరణ్య పర్వాన్ని రచిస్తే అది స్వార్థరహితంగా చేయాలి. అందుకు కారణం అప్పటికే అది నన్నయ చేత రచింపబడి ఉంది. ఏ కారణంగానైన తను రచిస్తే ఆ భాగం పూర్తవుతుంది. అందుకే ఎఱ్ఱన మహాభారతాన్ని స్వార్థ రహితంగా రచించడానికి పూనుకొన్నాడు. అరణ్య పర్వ శేషభాగాన్నంతా కూడా నన్నయ రచించినట్లుగానే రచించాలనుకున్నాడు. ఆ కారణంతోనే ఆంధ్ర మహాభారతాన్ని నిస్వార్థంతో రచించి అరణ్యపర్వ శేషాన్ని పూరించాడు. తన రాజు యొక్క ఆశయం, తన మనస్సులోని కోరికను నెరవేర్చుకొని ఆంధ్రమహాభారత రచనలో భాగస్వామి అయ్యాడు.

## 2.5. ఆంధ్రమహాభారతరచన: నన్నయ-తిక్కన- ఎఱ్ఱనల మధ్య గల చారిత్రక సామ్యాలు

ఆంధ్రమహాభారతాన్ని, రచించిన కవులను పరిశీలిస్తే కొన్ని ఆసక్తికరమైన విషయాలు అవగతమవుతాయి. ముఖ్యంగా చారిత్రక లక్షణాలన్నీ కూడా దగ్గరగా ఉన్నట్లుగానే కనిపిస్తాయి. నన్నయ తన రాజుగా భావించిన రాజరాజనరేంద్రుడు అతి తక్కువ కాలం మాత్రమే స్థిరంగా రాజ్యాన్ని పాలించాడు. తక్కిన కాలమంతా కూడా పలు రకాలైన ఇబ్బందులకు గురయ్యాడు. తిక్కన రాజు మనుమసిద్ధి కూడా రాజ్యపరంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. ఇదే పరిస్థితి ఎఱ్ఱన రాజైన వేమారెడ్డిది. వేమారెడ్డి ఒక సైనికుడిగా ఉండి అందివచ్చిన అవకాశాన్ని

ఉపయోగించుకొని రాజైనాడు.

ఇక నన్నయ కాలం నాడు కేవలం వైదిక మత పరిరక్షణ కోసం నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి పూనుకొన్నాడు. అప్పటికే విజృంభిస్తున్న జైనమతాన్ని నిలువరించడానికి నన్నయ ప్రయత్నించాడు. ఫలితంగా నన్నయ వైదికమతం వైపు మొగ్గు చూపి వైదికమత పరిరక్షణకు మహాభారతాన్ని రచించడానికి పూనుకొన్నాడు. తిక్కన నాటికి కూడా అదే రకమైన మతపరిస్థితి ఉంది. అయితే ఇక్కడ వైదికమతంలోని రెండు శాఖలుగా భావించబడే శైవ, వైష్ణవాల మధ్య సంఘర్షణలు తలెత్తాయి. వాటిని పరిరక్షించడం కోసం హరిహరాద్వైతాన్ని ప్రారంభించాడు. ఎర్రన కాలం నాటికి కూడా ఇటువంటి మతపరమైన సమస్యే నెలకొని ఉంది. వేమారెడ్డి రాజ్యానికి వచ్చేనాటికి ఆంధ్రప్రజలంతా కూడా ముస్లింల దండయాత్రలకు గురయ్యారు. ప్రజలలో హిందూమతం పట్ల గౌరవభావం సన్నగిల్లే పరిస్థితిలో హరివంశాన్ని రచించాడు. హరివంశం మహాభారతానికి దగ్గరగా ఉంటుంది. అందువలన మహాభారత రచన అంటే హరికి సంబంధించిన రచన. హరికి సంబంధించిన రచన అంటే వైదికమతం లేక హిందూమతానికి సంబంధించిన రచన. కాబట్టి హిందూ మత పరిరక్షణకు చర్య మహాభారతాన్ని పూర్తిచేసినట్లు భావించవచ్చు.

నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించాలని ఎప్పటినుంచో అనుకొని ఉన్నప్పటికీ అది వృద్ధాప్యంలో మాత్రమే సాధ్యపడింది. వయసులో ఉన్నప్పటి ఉత్సాహం కొంత ఉపశమించి ఉంటుంది. ఒక రకంగా వృద్ధాప్యాన్ని మనిషి జీవితంలో ఆలోచనా పరంగా స్థిమితంగా ఆలోచించే వయసుగా కూడా భావించవచ్చు. పరిపూర్ణమైన జ్ఞానంతో నన్నయ ఆంధ్రమహాభారతాన్ని ప్రారంభించాడు. తిక్కన కూడా ఇటువంటి పరిస్థితిలోనే రచించాడు. వయసులో ఉన్నప్పుడు నిర్వచనోత్తర రామాయణాన్ని రచించాడు. తన వయసు మీద పడిన తరువాతనే ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి పూనుకొన్నాడు. ఎర్రన కూడా తను వయసులో ఉన్నప్పుడు రామాయణ, హరివంశ రచనలు చేసినప్పటికీ వయోవృద్ధుడైన తరువాతనే

అరణ్య పర్వ శేషం రచించాడు. వయస్సు వలన ఆలోచనా విధానంలో స్థిరత్వం ఏర్పడింది. ఫలితంగా ఉత్తమ ఆంధ్రమహాభారత రచన వెలువడింది. సంస్కృత భారతాన్ని ఆధారంగా చేసుకొని ఆంధ్రమహాభారతాన్ని రచించినప్పటికీ ఎక్కడా కూడా అనువాద రచనగా కనిపించకపోవడానికి బహుశ ఈ కారణం కూడా ఒకటని భావించవచ్చు. యాదృశ్చికంగా అయినా ఒక విషయం గమనించవచ్చు. నన్నయకు ఆంధ్రమహాభారతాన్ని రచించాలని కోరిక ఉన్నప్పటికీ పలు రకాలైన ఆటంకాల వలన అది నన్నయ వయోవృద్ధుడైన తరువాత రచించాడు. రాజరాజ నరేంద్రుడికి కూడా ఆంధ్రమహాభారతాన్ని వినాలనే కోరిక, రచింప చేయాలనే కోరిక ఉన్నప్పటికీ అది తన చివరి సమయంలో మాత్రమే సాధ్యపడింది. తిక్కనకు కూడా వయసులో ఉన్నప్పుడు ఆంధ్రమహాభారతం అసంపూర్ణంగా ఉండటం తెలిసే ఉంటుంది. తిక్కన రాజైన మనుమసిద్ధికి కూడా ఆంధ్రమహాభారతం అసంపూర్ణంగా ఉన్న విషయం తెలిసినప్పటికీ ఆ విషయాన్ని అడగలేదు. ఎఱ్రన విషయంలో కూడా ఇలాగే జరిగింది. వేమారెడ్డి కూడా అరణ్యపర్వం రచన మిగిలి ఉండటం తెలిసినప్పటికీ అది పూరించమని ఎఱ్రనను అడగలేదు. బహుశ విధి అనేది ముగ్గురు కవులకు పరిపూర్ణ ఆలోచన కలిగిన తరువాతనే రచించేలా చేసింది. ఫలితంగా ఆంధ్రమహాభారతానికి పరిపూర్ణత్వం కలిగేలా చేసింది. అందువల్లనే తక్కిన ప్రాంతీయ భాషల్లో భారత రచనల కంటే ఆంధ్రమహాభారతం ఒకింత పైమెట్టులో ఉందని విమర్శకులందరు పేర్కొన్నారు.

ఆంధ్రమహాభారతం వెలువడే ముందు ఆయా కాలాల్లో కొన్ని విపత్కర పరిస్థితులు చోటు చేసుకొన్నాయి. కొన్ని సందర్భాలలో కవులకు కూడా ఇబ్బదులు ఎదురయ్యాయి. ఈ విధంగా అనేక సమస్యలు ఎదుర్కొన్న తరువాతనే నన్నయ ఆంధ్రమహాభారతాన్ని ప్రారంభించాడు. తిక్కన కూడా అవసాన దశలో క్లిష్టపరిస్థితులను చవిచూసిన అనంతరం ఆంధ్రమహాభారతాన్ని పునఃప్రారంభించాడు. ఎఱ్రన కూడా చివరి దశలో ఆటుపోట్లు ఎదుర్కొన్న తరువాత అరణ్య పర్వం పూర్తి చేశాడు.

# మూడవ అధ్యాయం

# శైవ రచనలు -చారిత్రక విమర్శ

# 3. శైవ రచనలు - చారిత్రక విమర్శ

అన్ని కాలాల్లోను సాహిత్య రచనకు వివిధ రకాలైన ప్రేరకాలున్నాయి. అందులో ఇతరుల ద్వారా జరిగే ప్రేరకం/ ప్రోత్సాహంతో రచనలు చేయడం ఒక విధానం కాగా రెండవది  సమాజంలోని పరిస్థితులకు స్పందించి రచయిత తనకు తానుగా రచనలు చేయడం. ఇతరుల ప్రోత్సాహంతో రచనలు చేసే రచయితలు/కవులు కొందరు ఆర్థికపరమైన లేదా మరేదైనా ఫలితాన్ని ఆశిస్తారు. కాని సమాజంలోని పరిస్థితులకు స్పందించి రచనలు చేసేవారు ఎటువంటి ఆర్థికపరమైన పలితాలను ఆశించక, సమాజంలోని మార్పును ఆశిస్తారు. సమాజంలో మార్పును ఆశించి రచనలు చేసినవారు సాహిత్య చరిత్రలో చాలామంది కవులు/రచయితలు ఉన్నారు. వారిలో మొదటగా పేర్కొనదగినవారు శివకవులు. వీరు సమాజంలోని మార్పును ఆశించి రచనలు చేశారు. కాని శివకవులు ఆశించిన మార్పు మతపరమైనది. ఇతర మతాలవ్యాప్తిలాగా శైవమతాన్ని ప్రజలలో వ్యాపించేలా ప్రయత్నించిన వారు కొందరుకాగా, ఇతరమతాలను దూషిస్తూ కేవలం శైవమతాన్ని మాత్రమే ప్రజలలో వ్యాపించేలా ప్రయత్నించిన వారు మరికొందరు.

సాహితీ విమర్శకులు శివకవులను రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గంవారు శైవమత ప్రచారం కోసం రచనలు చేసినవారు కాగా రెండవ వర్గంవారు కేవలం శివునికి సంబంధించిన రచనలు చేసినవారు. ఈ శివునికి సంబంధించిన రచనల్లో శివునిపై భక్తి మాత్రమే కనిపిస్తుంది తప్ప మతప్రచారం కనిపించదు. ఈ శైవమత వ్యాప్తి కోసం జరిగిన సంఘటనలను, కాలాన్ని, ఆకాలంలో వచ్చిన రచనలను, రచయితలను/కవులను చారిత్రక దృష్టితో పరిశీలిస్తే పలు విషయాలు అవగతమవుతాయి. ఈసాహిత్య రచనలను పరిశీలించేముందు ఆ రచనలు వెలువడేనాటికి, అప్పటి సమాజంలో ఉన్న పరిస్థితులను తెలుసుకోవడం అవసరం.

సహజంగా ఆంధ్రదేశ చరిత్ర గురించి ప్రస్తావన వచ్చినప్పుడు చారిత్రక ఆధారాల పరంగా శాతవాహనులను ప్రాచీన ఆంధ్రరాజులుగా చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆ శాతవాహన కాలం నుంచి కూడ ఆంధ్రదేశంలో అనేక విధాలైన పరిణామాలు మారుతూ వచ్చాయి. ఈ పరిణామాలల్లో మతం పాత్ర చాలా ముఖ్యమైందని ఇంతకు ముందే చెప్పడం జరిగింది. శాతవాహన కాలంనాటికి ఉత్తర భారతదేశంలో ప్రారంభమైన వైదిక, జైన, బౌద్ధమతాలు ఇక్కడి (ఆంధ్ర) స్థానిక ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఇక్కడి ప్రజల ఆచారాలతో సమన్వయం పొందాయి. పరస్పర సహకార సమన్వయంతో కొంతవరకు విజయం సాధించాయని చరిత్ర ద్వారా తెలుస్తోంది. కాని అదే కాలంలో, ఆ పరిస్థితుల్లో వివిధ మతాల మధ్య అప్పుడప్పుడు సంఘర్షణలూ జరిగినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది.

అయితే శాతవాహనుల కాలంనాటికి  వైదిక మతంలోనే విభజన జరిగినట్లు తెలుస్తుంది. ఈ విధానాన్ని తరువాత రాజులు అనుసరించారు. "శాతవాహన యుగానికే వైదికమతం పౌరాణిక మతంగా పరివర్తన చెందసాగింది. పౌరాణిక మతానికి శివ లేక విష్ణు ఆరాధన, దానధర్మాలు, తీర్థాటన ముఖ్యమైనవి. ఈ యుగానికి పౌరాణిక మతశాఖలయిన శైవ, వైష్ణవాలు జనాదరణ పొందినాయి. ఇవి శాతవాహన యుగంలోనే ప్రారంభమయినాయి. వైష్ణవం కంటే ఆంధ్రదేశంలో శైవమే ప్రాచుర్యం వహించినట్లు కన్పిస్తుంది. ఇక్ష్వాకులు శైవులు; మహేశ్వరుడు బృహత్ఫలాయనుల ఇష్టదైవం; శాలంకాయనులు వృషభలాంఛనులు. విష్ణుకుండులలో ఇంద్రభట్టారక, విక్రమేంద్రవర్మలు పరమ మహేశ్వరులు. తూర్పుగంగులు గోకర్ణ మహేశ్వరుని ఆరాధించినారు. శైవంతో ఇంచుమించు సమంగా వైష్ణవం ప్రచారమయింది" (హనుమంతరావు, బి.యస్.యల్: ఆంధ్రుల చరిత్ర, పుట.132.)

ఆంధ్రదేశ చరిత్రలో చాళుక్యరాజులు దాదాపు 500 సంవత్సరాల కాలంపాటు ఆంధ్రదేశాన్ని పాలించి పలు రకాలైన మార్పులకు కారణమయ్యారు. ఈ రాజుల

కాలంలో జైనమతం ఉన్నప్పటికీ, వీరు వైదికమతంవైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. "చాళుక్యరాజులు శైవులు. అందుచేత వారి రాజ్యమందు శైవమత వ్యాప్తియు, బ్రాహ్మణాధిక్యతయును ఎక్కువయ్యెను." (ప్రతాపరెడ్డి, సురవరం: ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుట.1.) 500 సంవత్సరాల కాలం పాటు పరిపాలించిన రాజవంశంలోని వారందరు ఒకే (వైదిక) మతాన్ని అనుసరించారని చెప్పడం అనే అభిప్రాయం కేవలం సాధారణీకరణ కోసమే. అన్ని కాలాలలో అందరు ఏకభిప్రాయంతో ఉండరనే విషయం సహజం. అందువలన ఈ "చాళుక్యరాజులలో పలువురు హిందూమతాన్ని అభిమానించినా, వారిరాణులు జైనులను ఆదరించినట్లు చరిత్ర తెలియజేస్తుంది" (బలరామమూర్తి, ఏటుకూరి: ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, పుట.82.) అని బలరామమూర్తిగారి అభిప్రాయంతో ఏకీభవించవచ్చు. ఇంకా చాళుక్యుల కాలం "నాటి మత పరిస్థితి చాలా గందరగోళంగా ఉండేది. బౌద్ధమతం పూర్తిగా నశించింది. హిందూ, జైనమతాలు మాత్రమే వ్యవహారంలో ఉన్నాయి. హిందూమతంలో కూడా శైవసంప్రదాయం విశేషంగా వ్యాపించసాగింది. చాళుక్యరాజులందరూ జైనమతాన్నో, శైవమతాన్నో ఆదరించారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, పిఠాపురం అను అయిదు ప్రాంతాలు పంచరామాలు అను పేరుతో శైవమత కేంద్రాలుగా ఉండేవి. వీనిలో ద్రాక్షారామం తప్ప మిగతావన్నీ ప్రారంభదశలో బౌద్ధమత కేంద్రాలు. చాళుక్యుల కాలంనాటికి ఇవి శైవమత కేంద్రాలైనవి" (బలరామమూర్తి, ఏటుకూరి: ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, పుట.89-90.) అని వీరు పేర్కొనడాన్ని బట్టి ప్రజల మధ్య మతపరమైన మార్పులు జరిగాయని భావించవచ్చు. ఒక మత కేంద్రం మరొక మతానికి కేంద్రంగా మారడం అనేది సులభంగా జరిగేది కాదు. ఇక్కడ ఆయా మతానుయాయులకు, ఇతర మతాలకు మధ్య ఘర్షణలు కూడా చోటు చేసుకొన్నాయి. వైదిక మతంలోనే ఘర్షణలు జరిగినట్లు పూర్వపు అధ్యాయంలోనే పేర్కొనడం జరిగింది.

జైనమతం కూడా విశేషాధరణలో ఉన్నట్లు తెలుస్తుంది. "బెజవాడ, రామతీర్థం (విశాఖ), హనుమకొండ (తెలంగాణా), దానవులపాడు (కడప), ధర్మవరం (ఒంగోలు)

ప్రధానమయిన జైనకేంద్రాలు. జైనమతానికి కేంద్రంగా ఉండేది సర్వలోకాశ్రయ జినాలయము. కటకాభరణ జినాలయము మొదలైన ఇక్కడ నిర్మించబడ్డవి. చాళుక్య రాణులలో ఒకరైన బెజ్జమహాదేవి పేర బెజవాడ నిర్మించబడ్డది. సర్వలోకాశ్రయ జైనపీఠానికి, సమస్త భువనాశ్రాయ శైవపీఠానికి నిరంతర ఘర్షనలు సాగి అప్పుడప్పుడు దారుణ రక్తపాతాలు జరుగుతూ వుండేవి. ఆంధ్రదేశమంతటా ఇలాగే వుండేది. మత విభేదాల ఫలితంగా నిరంతర కలహాలు దేశమంతా వ్యాపించసాగినవి'' (పైదే, పుట.90.) అని వీరు పేర్కొన్నారు. అయితే చాళుక్య రాజులలో పలువురు మతోద్రేకానికి పాల్పడక సామాన్య శైవమతాన్ని అవలంబించారని చెప్పవచ్చు. చాళుక్య రాజాశ్రితుడగు నన్నయ కేవలం బ్రాహ్మణమతాభివృద్ధికి కృషి చేసిట్లుగా పేర్కొనవచ్చు.

పై అంశాలను గమనించినట్లయితే శాతవాహన యుగం నుంచి చాళుక్య యుగం వరకు కూడా వైదికమతం తన ఉనికిని కాపాడుకుంటూనే వస్తున్నది. బౌద్ధమతం క్షీణించిన తరువాత వైదిక, జైనమతాలు ప్రజలను ప్రభావితం చేసినట్లు తెలుస్తుంది. అయితే వైదిక మతంలో శైవ వైష్ణవమతాలు రెండు కూడా ప్రజలమధ్య కొనసాగాయి, కానీ వైష్ణవమతం కంటే శైవమతం ఎక్కువ ఆదరణకు నోచుకున్నది.

ఆంధ్రదేశానికి పొరుగు ప్రాంతాలైన తమిళనాడు, కర్ణాటకల్లో కూడా మతపరమైన మార్పులు కొనసాగుతుండేవి. కొన్ని సందర్భాల్లో ఒక రాష్ట్రంలో జరిగిన సంఘటనలు/ పరిణామాలు పొరుగు రాష్ట్రంపై ప్రభావం చూపేవి. ముఖ్యంగా ఆంధ్రదేశానికి తమిళదేశానికి, ఆంధ్రదేశానికి కన్నడదేశానికి మధ్య చాలా సన్నిహితమైన సంబంధాలున్నట్లు చరిత్రవలన తెలుస్తున్నది. ''తెలగలు, తెలగాణులు, తెల్గు నాయకులు బ్రధానముగా నెల్లూరు, నిజాము రాష్ట్రములలో గొంత దత్త మండలము నాక్రమించి యుండినవారగుటచే, మహారాష్ట్ర కన్నడ దేశముల నంటియున్న పశ్చిమ దక్షణాంధ్ర భాగమే తెలుగుసీమ. మొదటి నుండియు గర్నాటకులును దెలుగు వారును నేక కుటుంబమువలే వసించియుండుటచే కర్నాటకపదము కేవల రాజకీయ వ్యవస్థలచే

జన్మించినదగుటచే విజయనగర సామ్రాజ్యమున నిర్వురకు నవిచ్ఛిన్న బాంధవ్యముండుటచే వీరి జాతీయతను గురించిన వాదములనావశ్యకము. సరిహద్దులలో గన్నడాంధ్రములు రెండును సమముగా గృహ భాషలు గలవారెందరో గలరు. కన్నడ వాఙ్మయ వైదుష్యము గలవారు గలరు" (వెంకట నారాయణ రావు, కె: ఆంధ్రవాఙ్మయ సంగ్రహము, పుట.6.) దీనిని బట్టి రాజకీయ సౌలభ్యం కోసం కర్ణాటక, ఆంధ్ర దేశం అని పిలిచినప్పటికీ సాంస్కృతికంగా, రాజకీయంగా, సాహిత్య పరంగా కూడా కర్ణాటక, ఆంధ్రదేశానికి చాలా దగ్గరి సంబంధం ఉందని తెలుస్తుంది.

ఇక ఆంధ్రదేశానికి తమిళదేశానికి మధ్య ఉన్న సంబంధం కూడా ప్రాచీనమైనదే. రాజకీయ పరంగా, సాంస్కృతిక పరంగా కూడా చాలా దగ్గరి సంబంధాలున్నాయి. ముఖ్యంగా ఈ మైత్రి చోళుల కాలం నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాట చోళులు అతి ప్రాచీనులైన ప్రజలు. ఈ చోళుల ద్రావిడ శైవమతాన్ని మొదటి నుంచి అనుసరిస్తున్నారు. ఇక తమిళాంధ్ర చోళులిద్దరూ కరికాలచోళుని తమ వంశకర్తగా పేర్కొంటారు. ఒకే చోట నుంచి బయలు దేరిన చోళులు కొందరు తమిళదేశంలోను, మరికొందరు ఆంధ్రదేశంలోను నివాసం ఏర్పరుచుకున్నారు. తెలుగు చోళుల మొదటి నివాస స్థలం రాయలసీమ అని పేర్కొంటారు. అక్కడి నుండి వీరు కృష్ణానదిని దాటి తెలంగాణలోని నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల వరకు వ్యాపించారు. నెల్లూరుని పరిపాలించిన తెలుగు చోళులకు తమిళ చోళులకు బాంధవ్యం ఉన్నట్లు కూడా చరిత్ర ద్వారా తెలుస్తుంది.

ఇక వలసలు అనేవి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళడం అనేది సాధారణ విషయం. ముఖ్యంగా కన్నడ ప్రజలు అనేకులు వచ్చి ఆంధ్రదేశంలో స్థిరపడ్డారు. యుద్ధాలు ఘోరంగా జరుగుతున్న సమయంలో కూడా అనేక కుటుంబాలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలిపోవటం ఉండేది. కన్నడ ప్రాంతం నుండి వచ్చిన కుటుంబాలు ఎక్కువగా తెలంగాణా, గుంటూరు జిల్లా కొండవీడు ప్రాంతాలలో

స్థిర పడ్డాయి.

ఒక ప్రాంతంలో సమస్యలు, అలజడులు, యుద్ధాలు మొదలైనవి జరిగినప్పుడు ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసలు పోవడం అనేది ఆనాటి సమాజంలో సాధారణ విషయంగా ఉండేది. దక్షణ భారతదేశంలో వివిధ రాజ్యాలలో జరిగే సంఘటనలు కొన్ని సమీప ప్రాంతాలపై ప్రభావం చూపేవి. దీనితో ప్రజలు వలసలు వెళ్ళడం జరుగుతుండేది. "తమిళదేశంలో ఆళ్వారుల ధాటికి నిలువలేక జైనులు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో చాళుక్యుల ప్రాపున స్థావరాలేర్పరుచుకున్నారు. బహుశా అందుచేతనే చోళులు తమ దాడులలో జైన కేంద్రాలను ధ్వంసం చేసినారు. తూర్పుచాళుక్యుల పోషణలో బ్రాహ్మణ మతం విజృంభించినందున కర్మరాష్ట్రం వేంగి మొదలైన ప్రాంతాలనుండి జైనులు పశ్చిమాంధ్రసీమలకు, కర్ణాటకానికి వలస వెళ్ళినారు." (హనుమంతరావు, బి.యస్.యల్: ఆంధ్రుల చరిత్ర, పుట.186.)

ముఖ్యంగా మతాలమధ్య ఘర్షణలు చెలరేగినపుడు రాజులు అవలంబించిన మతాన్నే ప్రజలు అవలంభించేవారు. కొందరు రాజులు పరమత సహానాన్ని కలిగివున్నట్లు తెలుస్తుంది. మరికొందరు ఇతరమతాల వారిని ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రజలు మతపరమైన ఇబ్బందులకు గురైనప్పుడు తాము అవలంబించే మతం ఉన్నచోట్లకు వలసలు వెళ్ళడం కూడా జరుగింది. "పదియవ శతాబ్ది మధ్యభాగమున నుండిన పంపకవి కుటుంబవారు వేంగిమండలమునందలి వెంగియను చక్కని పట్టణమునకు సమీపమందలి విక్రమపురాగ్రహారమున నివసించెడివారు. ఈతని తండ్రి యభిరామ దేవరాయలు. ఈతడు జైనమతమును స్వీకరించినవాడగుటచే నీ వెంగిమండలమున బహుశ నిలువనీడలేక కన్నడదేశమునకు వలసపోయినట్లు కనబడుచున్నది. కావున పంపయ తండ్రిమతమునే పరిగ్రహించినవాడైనను బ్రాహ్మణ మతద్వేషికాడు. కావుననే వ్యాసభారతమును గ్రహించి విక్రమార్జున విజయమను పేర కన్నడమున రచించినాడు." (రామకృష్ణయ్య, కోరాడ: ఆంధ్రభారత కవితావిమర్శనము, పుట.84-85.)

"పల్లవరాజు నందివర్మ తొండంతొట్టం శాసనం నుండి తొమ్మిదో శతాబ్దంలో కర్మరాష్ట్రం(వేంగి) నుండి బ్రాహ్మణులు అసంఖ్యాకంగా తమిళదేశానికి వలసబోయినట్లు తెలుస్తున్నది. వీరందరు వేదపండితులు, కర్మవిదులు- ఒకవైపు జైనమత ప్రాబల్యం, మరొకవైపు భక్తిమతాలు విజృంభించి దేవాలయ సంస్కృతి పెరగడంవల్ల వైదికకర్మలకు ఆదరణ తగ్గడంతో వీరు దక్షిణ దేశానికి వలసవెళ్ళి భూములు, గ్రామాలు సంపాదించి స్థిరపడివుంటారు. అదేవిధంగా తొమ్మిది పది శతాబ్దాల్లో వేంగీ కల్లోలితమయినందున విద్యావంతులు సమర్థులునైనవారికి అవకాశాలు సన్నగిల్లడంతో వారందరు కళ్యాణి చాళుక్య రాజ్యానికి వలసబోయినారు. కర్మరాష్ట్రం నుండి ఆ విధంగా వెళ్ళినవారిలో వీరశైవ మతస్థాపకుడైన బసవేశ్వరుని కుటుంబం ఒకటి." (హనుమంతరావు, బి.యస్.యల్: ఆంధ్రుల చరిత్ర, పుట.186.)

"ప్రాచీనాంధ్ర వాఙ్మయము లేకపోయినను, ఆంధ్రులు మాత్రము చాలా కాలము నుండి కవులుగా నుండిరనుట, వారు కన్నడమునకొనర్చిన మహోపకృతిని దలంచినచో స్ఫురించుచున్నది. ఆంధ్రులగు పూజ్యపాదుడు, ఆది పంపకవి, నాగార్జునుడు, మోళిగయ్య, భీమకవి, మొదలగువారైదవ శతాబ్దము నుండియు కర్ణాటకమున కావ్యములను, లక్షణ గ్రంథములను నిర్మించుచువచ్చిరి. స్వభాషనే విస్మరించి వీరు కన్నడులైపోయిరనుట సహజముగా గన్పట్టదు." (వెంకటనారాయణరావు, కె: ఆంధ్రవాఙ్మయ సంగ్రహము, పుట.28.)

పైఅంశాలను గమనించినట్లయితే రెండు విషయాలు అవగతమవుతాయి. అవి.
1.దాదాపు ఆంధ్రదేశాన్ని పాలించిన రాజులందరు కూడా వైదిక మతాన్ని కొద్దో గొప్పో ఆదరించడం, వైదికమతంవైపు మొగ్గు చూపడం. ఆ వైదికమతంలోనే శైవమతాన్ని రాజకుటుంబాలు అనుసరించడం.
2. దక్షిణభారతదేశంలోని ప్రజలు వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్ళడం, రాకపోకలు కొనసాగించడం. దీని వలన ఒకప్రాంతంలో జరిగే సంఘటనలు పరిసర ప్రాంతాలపై

ప్రభావం చూపడం. ప్రజల రాకపోకల వలన భాషా, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో మార్పులు రావడం అనేది జరుగుతుండేది.

ఇలా ఆంధ్రదేశంలో శైవమతానుకూలమైన పరిస్థితులలో, ఇతర ప్రాంతాలలో జరిగిన ప్రభావంతో తెలుగులో శైవ సాహిత్యం ప్రారంభమైంది. పైన పేర్కొన్నట్లు శాతవాహన కాలం నుంచి చాళుక్య యుగం వరకు శైవమతం ప్రజలమధ్య/ రాజులమధ్య ఉండటం, కన్నడదేశంలో జరిగిన సంఘటనలు కలిపి ఆంధ్రదేశంలో శైవసాహిత్యం ప్రారంభం కావడానికి కారణాలుగా కనిపిస్తాయి. ఈ సాహిత్యపు లక్షణాలు నన్నెచోడుని రచనలో కనిపించినప్పటికీ మల్లికార్జున పండితుడి కాలం నుండి వెలువడిన సాహిత్యాన్ని మాత్రమే శైవసాహిత్యంగా పరిగణిస్తారు. సోమనాథుడి కాలం నుంచి ఇది వీరశైవ సాహిత్యంగా పరిగణింపబడింది. తరువాత పలుమార్పులకులోనై శైవ సాహిత్యంగా మార్పు చెందింది.

ఈశైవ/వీరశైవ సాహిత్యం తెలుగులో వెలువడటానికి కారణం వీరశైవమతం. ఈ వీరశైవమతం కన్నడదేశంలో ప్రారంభమై ఆంధ్రదేశంలో ప్రవేశించింది. ఈ మతాన్ని ప్రారంభించినవారు బసవయ్య లేక బసవేశ్వరుడు. ఇతడు కన్నడ దేశంలోని కళ్యాణి నగరాన్ని పరిపాలించిన కాలచూరి వంశస్తుడైన బిజ్జలుని వద్ద కోశాధికారిగా పనిచేశాడు. బసవేశ్వరుడు వీరశైవమతం ప్రారంభించడానికి గలకారణాలను, ఆనాటి కాలంలో నెలకొనివున్న పరిస్థితులను తెలుసుకోవడం కొంతవరకు అవసరం.

శైవమతం కొద్దిమార్పులతో దేశమంతట వ్యాపించి 11వశతాబ్దము చివరకు వృద్ధి చెందింది. ఈ మతం కన్నడదేశంలో కూడా ఒక ముఖ్యమైన మతంగా మారింది. 12వశతాబ్దంలో జైనమతానికి, వైష్ణవమతానికి ప్రాధాన్యం అధికమై శైవమతానికి బలం తగ్గిపోయింది. ఇటువంటి సందర్భాల్లో కొందరు శైవమతాన్ని ప్రజలమధ్యకు తీసుకువెళ్ళే ప్రయత్నాలు చేశారు. వీరు జైనమతాన్ని ప్రతిఘటించి శైవమత వ్యాప్తికి కృషిచేశారు. వారిలో మొదటివాడు ఏకంతరామయ్య. ఇతడు బ్రాహ్మణ దంపతులకు

జన్మించి, చిన్నవయసు నుంచే శైవమత ప్రచారం చేశారని చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఇంకా విరూపరసు, వీరగొగ్గిదేవుడు మొదలైనవారు శైవమత వ్యాప్తికోసం పాటుపడ్డారని చరిత్ర వలన తెలుస్తోంది. వీరిలో వీరగొగ్గి దేవుడు ధారవాడ మండలంలోని ఒక ప్రాంతానికి అధిపతని, జైనుల ప్రతిఘటించి శివాధిక్యతను స్థాపించడానికై తన జీవితాన్ని అర్పించిన మహావ్యక్తిగా శైవులు భావిస్తారు.

సమాజంలో ఇటువంటి పరిస్థితులు నెలకొన్న సమయంలో బసవేశ్వరుడు పుట్టాడు. బసవేశ్వరుడి తల్లిదండ్రులు శైవబ్రాహ్మణులు. సాహిత్య రచనలలో బసవేశ్వరుడి పుట్టుకకు సంబంధించి అనేక రకాల అభిప్రాయాలున్నాయి. కాని చారిత్రక ఆధారాల ప్రకారం ఇతడు క్రీ.శ. 1105వ సంవత్సరంలో జన్మించినట్లు చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. “కర్ణాటక దేశములోని బీజాపూరు జిల్లాలోని హింగులేశ్వర అగ్రహారమునకు సమీపమున బాగెవాడి యను గ్రామము కలదు. ఈ గ్రామమే బసవేశ్వరుడి జన్మస్థలమయి సాహిత్య గ్రంథములద్వారా శాసనములద్వారా నిరూపితమయినది” (కోటయ్య, నూతికట్టు: బసవేశ్వర చరిత్రము, పుట.22-23.) ఈ అభిప్రాయాన్ని అంగీకరించడం సమంజసంగా ఉంటుంది.

బసవేశ్వరుడు బాల్యం గురించి ఉపనయనం గురించి, జీవన విధానం గురించి కూడా పరిశోధకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. “ఉపనయనమును తిరస్కరించి, తల్లిదండ్రులతో వివరించి బసవేశ్వరుడు తన సహోదరియగు నాగాంబను తోడ్కొని స్వస్థానమగు బాగెవాడిని వదలి వెళ్ళిపోయినట్లు బసవపురాణమందున్నది. శ్రీ పి.బి.దేశాయిగారి గ్రంథములో ఉపనయానానంతరము కొలది కాలమునకే బసవన్న తల్లిదండ్రులు పరమపదించినట్లును, ఆతడు ముత్తవ్వ పోషణములో కొంతకాలమచ్చటనే యుండినట్లును జెప్పబడినది. తన భగవదన్వేషణకు దోహదము కలిగించని కారణముచే నాతడంత యజ్ఞోపవీతమును, బ్రాహ్మణమతమును, బాగెవాడిపురమును వదలి, జ్ఞాన సముపార్జనార్థము కూడలి సంగమేశ్వర స్థానమునకు

పయనమై వెళ్ళెను. ఆ దినములలో సంగమేశ్వరాలయమునకు దేశదేశముల నుండి జంగమస్వాములేతెంచి తత్త్వవిచారములు, మతపరమైన గోష్ఠులు గావించుచుండిరి. పరమేశ్వర పరాధీనచిత్తుడగు బసవేశ్వరునికి బ్రహ్మవిద్య గరచుటకు సంగమేశ్వర స్థానమాదర్శ స్థానముగా సర్వవిధముల తగియుండెను. ఇచ్చోట బసవేశ్వరుడు క్రీ.శ.1121 నుండి 1132 వరకు ద్వాదశవత్సరము లుండినట్లు చరిత్రకారులు నిర్ణయించిరి." (పైదే, పుట.22-23.)

బసవేశ్వరుడు శైవమత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించడం, అప్పటికే శైవమత వ్యాప్తికి కొందరు కృషి చేసి ఉండటం గమనించినట్లయితే, బసవేశ్వరుడికి సంగమేశ్వరాలయంలో జంగమలతో జరిగిన మతపరమైన చర్చలు శైవమతవ్యాప్తికై మరింత పట్టుదల పెంచినట్లుగా కనిపిస్తుంది. ఆ మతవ్యాప్తికి అతడు వీరశైవ మతాన్ని అవలంబించినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

"బసవయ్యకు పూర్వం చాలా కాలం నుండి తెలుగు, కన్నడ, తమిళ దేశాలలో శైవమతం వుంది. అయితే వారు కులవ్యవస్థను పాటిస్తూ వచ్చారు. కులవ్యవస్థను రద్దుచేసి, సమానత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నించడమే బసవయ్య ప్రత్యేకత." (బలరామమూర్తి, ఏటుకూరి: ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, పుట.106.) "ఇట్టి పరిస్థితులలో 12వ శతాబ్దపు మధ్య భాగమున కర్ణాటక దేశమునందు గొప్ప మతాచార్యుడైన బసవేశ్వరుడుద్భవించాడు. అతడు శైవమత శైథిల్యము నరికట్టెను. ఆమతములో నూతన చైతన్యమును, శక్తిని ప్రవేశపెట్టెను. ఈ విధముగా పునరుద్ధరణ జరిగిన శైవమతమును వీరశైవమని, లింగాయతని పేర్కొందురు." (రత్నమోహిని,వి: తెలుగుసాహిత్యము శైవమత ప్రభావము-1, పుట-26) కానీ బసవేశ్వరుడు స్థాపించిన శైవమతానికి వీరశైవమతం అని పేర్కొంటున్నప్పటికి, ఈ వీరశైవం బసవేశ్వరునికంటే ముందునుంచి ఉన్నట్లు తెలుస్తుంది.

"వీరశైవము ఈనాటిది కాదు. దీనిని ప్రాచీనకాలమునందే ఐదుగురు మహానుభావులు, స్థాపించియున్నారు. వారు రేవణారాధ్యులు, మరుళారాధ్యులు, ఏకోరామాధ్యులు, పండితారాధ్యులు, విశ్వారాధ్యులు. వీరుస్థాపించిన మతమునే బసవేశ్వరుడు పునరుద్ధరణము చేసి ప్రచారమునకు తెచ్చెనని వీరశైవమతానుయాయుల విశ్వాసము." (పైదే, పుట.28.) సహజంగా కొందరు బసవేశ్వరుడు వీరశైవమతాన్ని ప్రారంభించాడని చెబుతారు. దానికి కారణం పదకొండవ శతాబ్దానికి పూర్వం వీరశైవ మతాన్ని గురించి, ఆమతాన్ని అవలంబించిన వారిని గురించి ప్రామాణిక గ్రంథాలు లభించకపోవటం వలన బసవేశ్వరుడే వీరశైవమత సంస్థాపకుడని పేర్కొంటున్నారు. బసవేశ్వరుని జననకాలం నాటికే దేశంలో వీరశైవ మఠాలు, జంగమయ్యలు ఉన్నారు. వీరశైవ గ్రంథాలలో కూడా బసవేశ్వరుడు వీరశైవమత స్థాపకుడని చెప్పలేదు. కావునా బసవేశ్వరునికి పూర్వం వీరశైవం పరిమితంగా ఉన్నట్లు, దానికి తగిన సంస్కరణలను జోడించి బసవేశ్వరుడు వ్యాప్తిలోకి తీసుకొచ్చినట్లు తెలుస్తుంది.

"అల్లమ ప్రభుదేవర బసవేశ్వరునకు, శివశరణులకు తలమానికమైయుండెను. అతడు వీరశైవ సిద్ధాంత సారమును ప్రచారము చేసి చరణమార్గమునకు గురువయ్యెను. అప్పటికి దక్షణాపథములో వైదికమైన 'ఆరాధ్య శైవము' ఆగమోక్తమైన 'పాశుపతము' ప్రచారమునందుండెను. శివశరణులు వాని సారము గ్రహించి 'వీరశైవ'మను పేరుతో ఒక స్వతంత్ర మార్గమును ప్రచారమునకు తెచ్చిరి. సాధారణముగా 'శరుణల' ప్రధాన లక్ష్యము అన్యమత విధ్వంసముగానీ, వీరశైవ ప్రచారముగానీ కాదు. సర్వమానవ ప్రేమ, నైతిక వర్తనము, శివభక్తి, సమానభావము కలిగియుండు క్రొత్త సామాజిక వ్యవస్థను ఏర్పరుచుట అయియుండెను. అల్లమ ప్రభుడీ కార్యమును ఆదర్శవంతముగా కొనసాగించెను."(దక్షిణ భారత సాహిత్యములు: పుట.85.)

బసవేశ్వరునుకి సంబంధించి చారిత్రకంగా తెలిసే మరొక విషయం ఉంది. అది బిజ్జలుని మరణానంతరం బసవేశ్వరుడు బిజ్జలుని రాజ్యం వదిలి సంగమేశ్వరునిలో

లింగైక్యం చెందినట్లు గ్రంథాలలో ఉంది. కాని బసవేశ్వరుడు లింగైక్యం కాలేదని అతడు తరువాత బిజ్జలుని కుమారుడి చేత హత్య చేయబడ్డాడని కొన్ని ఆధారాలు కలవని చరిత్రకారులు తెలిపారు ఈ విషయాన్ని వివరిస్తూ "బసవేశ్వరుడు 1168లో బిజ్జలుని కుమారినిచే జంపబడియెను" (మల్లికార్జున పండితుడు: శివతత్వసారము, పుట.16.) అని కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు శివతత్వసారపీఠికలో పేర్కొన్నారు.

"పారిపోవుచున్న బసవేశ్వరుని బిజ్జలుని కుమారుడు వెంటాడగా 1168 సంవత్సరములో నతడు బావిలోనురికి చచ్చెనని కొందరును, సంగమేశ్వర క్షేత్రమున శివునిలో నైక్యమొందెనని కొందరును చెప్పుదురు." (రామకృష్ణశాస్త్రి, శిష్టా: వీరశైవాంధ్రవాఙ్మయము, పుట.16.) బసవేశ్వరుడు మాత్రం కర్ణాటకలోనూ, తరువాత ఆంధ్రదేశంలోనూ వీరశైవ మత వ్యాప్తికి కారకుడయ్యాడు. ఇతడు చేసిన కృషివల్ల తెలుగులో శైవ సాహిత్యం అనేది కొత్త పద్ధతులను ఆవిర్భవించింది.

## 3.1. శైవ/వీరశైవసాహిత్యం

ఇంతకుపూర్వం పేర్కొన్నట్లు ఆంధ్రదేశంలో శాతవాహనుల కాలం నుంచి కూడా శైవమతానికి ఆదరణవున్నట్లు చరిత్రద్వారా అవగతమవుతుంది. కానీ ప్రజలలో ఇంకా జైన, హిందూ మతాలు వ్యాప్తిలో ఉన్నాయి. జైనమత వ్యాప్తిని నిరోధించటానికి వైదికమత పునరుద్ధరణకు ఆంధ్రమహాభారత రచన జరిగింది. కానీ వైదికమతంలోనే రెండు భాగాలుగా విడిపోయిన శైవ, వైష్ణవమత వ్యాప్తి కూడా ఎక్కువగా ఉంది. ఆశైవ మతాభిమానంతో సాహిత్య రచనలు ప్రారంభమయ్యాయి. ఇటువంటి సమయంలోనే మల్లికార్జున పండితుడు శైవమత ప్రచారం ప్రారంభించాడు. పాల్కురికి సోమనాథుడి కాలానికి బసవేశ్వర, మల్లికార్జున పండితుల ప్రభావంతో వీరశైవమతంగా ఆంధ్రదేశంలో వ్యాపించింది. నన్నెచోడుడు, మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు మొదలైన కవుల మధ్య కాలపరంగా కొంత వ్యత్యాసం ఉండటం వలన ఆయా కాలాలకు అనుగుణంగా సాహిత్యంలోను, సాహిత్య రచయితల మధ్య కూడా కొన్ని మార్పులు

చోటు చేసుకొన్నాయి.

మొదట ప్రారంభించిన శైవ సాహిత్యం వీరశైవ సాహిత్యంగా పరిణమించినప్పుడున్న కాలపరిస్థితులు పూర్తిగా భిన్నం. శైవసాహిత్యం వీరశైవ సాహిత్యంగా పరిణామం చెందినపుడు మతపరిస్థితులలో విపరీత ధోరణి వచ్చింది. కాని క్రమంగా అది పరిణామం చెంది వీరశైవం సాధారణ శైవంగా మారిపోయింది. ఆయా మార్పులకనుగుణంగా వచ్చిన సాహిత్యాన్ని ఇక్కడ పేర్కొంటున్నాను.

## 3.1.1. కుమారసంభవము-నన్నెచోడుడు

తెలుగు సాహిత్య చరిత్రలో నన్నెచోడ కవి గురించి జరిగినంత చర్చ బహుశ మరేకవిపైన జరగలేదేమో! కుమారసంభవము కర్తృత్వంపైన, నన్నెచోడుని కాలంపైన పలువురు పరిశోధకులు చర్చించి ఉన్నారు. ప్రస్తుతం నన్నెచోడుని కుమారసంభవ కర్తృత్వం గురించిన చర్చ ఇక్కడ అప్రస్తుతం అని భావించి ఆ చర్చను వదిలివేస్తున్నాను. పలువురు చరిత్రకారుల/సాహిత్యచరిత్ర రచనలను బట్టి నన్నెచోడుడు ఒక రాజవంశానికి చెందినవాడు అని తెలుస్తోంది. అంటే నన్నెచోడుడు ఒక రాజకవిగా గుర్తించారు. ఇతడు నన్నయ తిక్కనల నడిమి కాలానికి చెందినవాడుగా పండితులు నిర్ణయించారు. ఇక ఇతడు పాలించిన ప్రదేశం ఏది? అనే విషయంలో కూడా చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు పరిశోధకులు ఇతడు కావేరీ తీరాన ఉన్న 'నొరయూరు' అనే పట్టణాన్ని రాజధానిగా చేసుకొని చోళ మండలాన్ని పరిపాలించాడని పేర్కొంటారు. మరికొందరు పాకనాడును పరిపాలించారంటారు. కుమారసంభవంలోని పద్యం ద్వారా అతడు సూర్యవంశస్తుడని, రాజని మాత్రం తెలుస్తుంది.

"కుతలంబు నడుకొన గొలకొండగా నిల్చి
శరనిధి గ్రొచ్చిరి సగర సుతులు;

మిన్నులపై బాఱుచున్నయే ఱిలదెచ్చి

వారాశి నించె భగీరథుండు;

గోత్రాచలము లెత్తికొని వచ్చి కడచన్న

రత్నాకరము గట్టె రాఘవుండు;

జలధి మహీసతి మొలనూలుగా జుట్టి

పాలించె గలి గరికాలచోడు.

వరుస నిట్లు సూర్య వంశాధిపతు లంబు

నిధియు మేర గాగ నిఖిల జగము

నేలిచనిరి వారి కెనవచ్చు సుశ్లోక

ధనుడ నన్నెచోడ జనవిభుండ." (నన్నెచోడుడు: కుమార సంభవము, 1-52.) కుమార సంభవంలోని ఇతని రాతల ద్వారా ఇతడు సూర్యవంశ క్షత్రియుడు. ఇతని తండ్రి పాకనాడులోని చోడబల్లికి అధిపతి. తల్లి శ్రీసతి. వీరిది కాశ్యప గోత్రం. వీరి పూర్వీలు ఒరయూరికి అధిపతులు. ఇతని గురువు విప్రముని పుంగవుడైన జంగమ మల్లికార్జునుడు.

అదే విధంగా కొందరు నన్నెచోడుని కుమారసంభవాన్ని శైవసాహిత్యంలో ఒక భాగంగా చూడగా మరికొందరు ఇతని గ్రంథాన్ని సాధారణ సాహిత్యంగానే పరిగణించారు. మరికొందరు పరిశోధకులు ఏది శైవసాహిత్య రచన అనే అభిప్రాయానికి కొన్ని లక్షణాలను పేర్కొన్నారు. "ఏకావ్యమునకైనను ఇతివృత్తము శరీరమువంటిది. ఇతివృత్త నిర్మాణమునందు కవి కావ్యస్వరూపమును ఆవిష్కరించును. దాని తరువాతనే కావ్యమునకు ప్రాణప్రదమైన ధ్వనిని దానియందు నిక్షిప్తము చేయును. ఇట్లు చూడగా కావ్యవస్తువును మనము పరిశీలించితిమేని కవి తన ధ్యేయముగా నున్న కావ్యస్వరూపమును కొంత వరకు గ్రహించవచ్చును. నన్నెచోడుడు స్వయముగా శైవసంప్రదాయమునందు అభిమానము కలవాడు. కావ్యప్రారంభముననే ఆద్యుడైన

మహాదేవుడు తనకు అభిమతములిచ్చుగాక యని నమస్కార పూర్వక ప్రార్థనము చేసియున్నాడు. ఆతర్వాత రెండవ పద్యములో, మూడవ పద్యములో 'అంబికాధవుడు పరమేశ్వరుడు' స్తుతింపబడినాడు. ఈ పద్యములు చూడగా ఈ కవికి మహేశ్వరునియందు ఎంత ప్రీతియో స్పష్టమగును." (రత్నమోహిని,వి: తెలుగు సాహిత్యము శైవమత ప్రభావము-1, పుట.61.)

ప్రారంభమైన మొదటి పద్యం నుంచి మొదలుకొని పదిహేనవ పద్యం వరకు కవి త్రిమూర్తులను, ఇతరదేవతలను, గురువును స్తుతించాడు. ఈ పద్యాలన్నీటిలో మహేశ్వరుడే స్తుతింపబడినాడు. ఇలా చేయటంలో కవి కావ్యము శివపరమైనదని వ్యంగంగా సూచించినట్లే అయిందని కూడా కొందరు భావించారు.

"కాలముఖ శైవవ్రత సంప్రదాయానుసారి యగు జంగమ మల్లికార్జును డీతని గురువు. ఆ గురువునకు బరమశివునితో నభేదమును బాటించునంతటిది ఈతని గురుభక్తి" (నన్నెచోడుడు: కుమారసంభవము, (పీఠిక) పుట-XXXIII) అని జొన్నలగడ్డ మృత్యుంజయరావు తెలిపారు. గురుభక్తి అనేది కూడా శైవ సాహిత్యంలో ఒక ప్రధాన లక్షణంగా పేర్కొంటారు. అయితే నన్నెచోడుడు శైవకవి మాత్రమేగానీ వీరశైవుడుకాడని పండితుల అభిప్రాయం. ఇంతకు పూర్వం పేర్కొన్నట్లు శైవమత ప్రభావం సమాజంలో ఉంది. ఆ శైవమత ప్రభావంతోనే కుమార సంభవం రచన చేసినట్లు పేర్కొనవచ్చు. అంటే నన్నెచోడుని కాలం నాటికి బసవేశ్వరుడు చెప్పిన వీరశైవం లేకపోయినప్పటికీ శైవసంప్రదాయం లోకంలో వ్యాపించే ఉందని చెప్పవచ్చు. కాబట్టి ఇతడు శైవమతం చేత ప్రభావితుడై కుమార సంభవ రచనకు పూనుకొన్నాడని చెప్పవచ్చు. నన్నెచోడుడు కూడా శైవమత కవులలాగానే తన కవితా గురువు కృపచేత చెప్పానని పేర్కొన్నాడు. "తన కవిత గురు కరుణచే లభించినదని భావించి యాతనికి గృతిజెప్పి పుణ్యమును సంపాదింపదలంచినాడు. అంతేకాదు ఆతని భావమున గురువగు మల్లికార్జునుడు

నీశ్వరుడునొక్కడే. వానికిద్దరకు నభేదమును బాటించియే యాతడు కుమార సంభవ రచనము సాగించినాడు.'' (రాజేశ్వరశర్మ, అమరేశం: నన్నెచోడుని కవిత్వము, పుట.25.) అయినప్పటికీ ఇతడు వీరశైవులలాగా మతప్రచారం కోసం రచన చేసినట్లు కనిపించదు. కనీసం సమాజంలో ఒక ప్రత్యేకమైన మార్పు ఆశించి రచన చేసినట్లు కూడా చెప్పలేం. దానికి గల కారణం నన్నెచోడుడు శివుడికి, గురువైన మల్లికార్జునుడికి అభేదం చెప్పినప్పటికీ, అది కేవలం గురువుమీద, శివుడి మీద ఉన్న భక్తిగా చెప్పవచ్చు. గురువే శివుడిగా భావించడం అనేది శైవసంప్రదాయంలో ఉన్నప్పటికీ నన్నెచోడుడు తన గ్రంథాన్ని ఎందుకోసం రాసింది పేర్కొన్నాడు. కాబట్టి తన కుమార సంభవ రచనను మతప్రచారార్థం రాసినట్లు చెప్పలేం. నన్నెచోడుడు కుమార సంభవాన్ని రాయడానికి గల కారణం తన గ్రంథావతారికలో చెప్పాడు.

''పూని మహాగ్రహార వరపుత్రసమున్నతి దేవతాల యో
ద్యాన తటాక సత్కృతి నిధానము లాశశితారకంబు సు
స్థానములై మహింబరగ జంగమమల్లయపేర సప్త సం
తానములొప్ప నిల్పెదు ముదంబున దత్ప్రభునాజ్ఞ పెంపునన్.

జంగమ మల్లికార్జును నిసర్గ కవిస్తవనీయ సూక్తియు
క్తిం గొనియాడి తత్కరుణ గేనములే కనురక్తయైన భా
షాంగన దక్కనేలిన మహత్త్వము లోకమునం బ్రసిద్ధిగా
భంగిగ విస్తరించెద బ్రబంధము సద్రసబంధురంబుగాన్

గురువున కిష్టదైవమునకుం, బతికిం గృతిచెప్పి పుణ్యమున్
వరమును, దేజముం బడయవచ్చు జంగంబుల; నిశ్చయంబు; మ
ద్గురువును, నిష్టదైవమును, గూర్చు నిజేశుడు దాన; నాకు గా
కొరునకు నిట్లు సేకుఱునె యెక్కట లాభము లెన్నియన్నియున్'' (నన్నెచోడుడు: కుమార సంభవము, 1-46, 48, 50.)

పై పద్యాలను గమనించినట్లయితే నన్నెచోడుని గ్రంథరచనా ఉద్ధేశము కొంత తెలుస్తుంది. తన కృతిని తన గురువగు జంగమ మల్లికార్జున యోగికి అంకితం చేసి కృతార్థుడవటానికి లోకంలో కవిగా తాను ప్రసిద్ధి చెందటానికి కావ్య రచన చేసినట్లు నన్నెచోడిని పద్యాల వలన తెలుస్తుంది. కాబట్టి ఈ గ్రంథం మత ప్రచారార్థం రాయబడినటువంటి గ్రంథంగా గాకుండా కవిత్వం మీద నన్నెచోడునికి సహజంగా గల ఇష్టంతో రాయబడిన కావ్యమని పేర్కొనవచ్చు.

నన్నెచోడుడు తన కుమారసంభవము రచన ద్వారా తెలుగులో కొన్ని కొత్త అంశాలను పరిచయం చేశాడు. అయితే ఆ అంశాలలో కొన్ని తెలుగు సాహిత్యానికి మాత్రం నూతనంగా కనిపించినప్పటికి ఆ అంశాలు ఇతర భాషా సాహిత్యాలలో ఉన్నాయి. ఆ భాషా సాహిత్యాలను అనుసరించి నన్నెచోడుడు తెలుగులో క్రింద పేర్కొన్న అంశాలను తెలుగు సాహిత్యానికి పరిచయం చేశాడని భావించవచ్చు.

### 3.1.1.1. జాను తెనుగు

తెలుగులో జానుతెనుగు అనే పదాన్ని తెలుగు సాహిత్యంలో తొలిసారి పేర్కొన్నవాడు నన్నెచోడుడు. ఈ పదాన్ని నన్నెచోడుడు ఏ అర్థంలో ప్రయోగించాడో అనే విషయంలో పండితుల మధ్య ఏకాభిప్రాయం లేదు. పలువురు పండితులు పలు రకాలైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. “నన్నెచోడుని యభిప్రాయమున జానుతెనుగనగా సంస్కృత మిశ్రతమయినను, గద్యపద్యోక్తులతో గూడినదియయి నను భావ సారళ్యముగల రచనయని చెప్పవచ్చును (పైదే, పుట.XXVI.)" అని జొన్నలగడ్డ మృత్యుంజయరావు పేర్కొన్నారు.

ఈ జాను తెనుగు అనేది తెలుగులో మొదటగా పేర్కొనప్పటికీ, ఇది కన్నడ సాహిత్యంలో ఇంతకు పూర్వమే ఉన్నట్లు కన్నడ రచనల ద్వారా తెలుస్తుంది. దీనిని బట్టి

'జానుతెనుగు' కన్నడ ప్రభావం వలన తెలుగులో ప్రయోగించబడిందని పేర్కొనవచ్చు. "కన్నడ సారస్వతమున నాగవర్మ, గుణవర్మలనువారు 'జాణ్ నుడి'కి బ్రసిద్ధులు. కన్నడ కవులలో నొకరిద్దరీపదమును వాడియుండిరే కాని వారయినను దాని స్వరూపమిట్టిదని తెలిపినట్లగపడదు. కన్నడ కవులను జూచి తొలుత నన్నెచోడుడును, నాపిదప బాలకురికి సోమనాధుడును 'జాణ్ణుడి'కి బ్రత్యాయముగా దెలుగున 'జానుతెనుగు' అనుపదమును వాడి తాము జానుతెనుగున కవిత్వము చెప్పుదుమని తమ కావ్యావతారికలలో బ్రతిజ్ఞలు చేసియుండిరి. కన్నడ కవులు ప్రయోగించిన 'జాణ్ణుడి'యను పదము సంస్కృత ప్రాధాన్యములేని జాతీయమయిన కన్నడ భాషాప్రయోగమును దెలుపునని యూహింపవచ్చును. కనుక 'జాణ్ణుడి'నభిమానించిన యాకవులు కన్నడకవితయందు దేశీప్రాధాన్యము నభిలషించువారుగా దలపదగును". (కోదండరామయ్య, తిమ్మావజ్ఝల: పాల్కురికి సోమనాథుడు- వీరశైవసిద్ధాంతము-I, పుట.268.)

నన్నెచోడుడు ఎక్కువ కన్నడసాహిత్యం చేత ప్రభావితుడయినట్లు తెలుస్తుంది. నన్నిచోడునికి కన్నడ కవిత మార్గదర్శకమై ఉంటుంది. కన్నడ ఛందోవైచిత్రి, శృంగార రచనా విధానం ఆకర్షించింది. అందువలన నన్నెచోడునిలో మతావేశం కనిపించలేదు. ముఖ్యంగా నన్నచోడుడు కన్నడ గ్రంథాలను అధ్యయనం చేసిననవాడని పలువురు విమర్శకులు అభిప్రాయపడ్డారు. సహజంగా నాటి కవులు తెలుగు సంస్కృత భాషలతోపాటు తక్కిన ప్రాంతీయ భాషలు కూడా తెలిసినవారని ఊహించవచ్చు. నాటి తెలుగు ప్రాంతానికి పొరుగున ఉన్న భాషలు తమిళ, కన్నడ భాషలు. తమిళ భాష కంటే కన్నడ భాషతో పరిచయం ఉండటం ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి నన్నెచోడుడు కన్నడ భాషను అభ్యసించడం వలన ఆ భాషా, సాహిత్యాలలో ఉన్న కొత్త అంశాలను అనుసరించాడు.

### 3.1.2. శివతత్త్వసారము - మల్లికార్జున పండితుడు

కాలానుగుణ వర్గీకరణ ప్రకారం వీరశైవకవులలో మల్లికార్జున పండితుడే మొదటివాడు. ఇది పండిత పరిశోధకులందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన విషయం. శైవమతాన్ని ఒక ఉద్యమ రూపంగా మొదట ప్రారంభించిన వాడిగా మల్లికార్జున పండితుని పరిగణిస్తారు. మల్లికార్జున పండితునికి పూర్వం ఆంధ్రదేశంలో స్వల్పంగా క్రింది వర్ణాలలో మినహాయించి వీరశైవం జనాదరణ పొందలేదు. బసవేశ్వరుని సమకాలీకుడైన మల్లికార్జున పండితారాధ్యుడు ప్రత్యేకమైన శైవమతాన్ని ప్రచారం చేసి, ఆ మతాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళడానికి ప్రయత్నించాడు. మల్లికార్జున పండితుడు క్రీ.శ. 1100- 1160 మధ్యకాలంవాడని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఇతని రచన శివతత్త్వసారము. ఈ ఒక్కటి మాత్రమే లభ్యమవుతున్న రచన. ఇతడికి మల్లికార్జునుడు అని పేరు పెట్టడానికి గల కారణం గురించి చిలకూరి వీరభద్రరావు ఇలా పేర్కొన్నారు. "శ్రీశైల మల్లికార్జున దేవుని సేవించి వచ్చిన తరువాత బుట్టినవాడగుటచేత జననీజనకులీతనికి మల్లికార్జునుడను పేరుబెట్టిరి. భీమేశ్వరమునుకు సమీపముననున్న కోటిపల్లి నివాసుడైన ఆరాధ్యదేవర ఈతని గురువుగా నుండెను. ఈ మల్లికార్జునుడారాధ్యదేవర యొద్దనుండి శైవదీక్ష వహించి శైవమత రహస్యములను జక్కగా దెలుసుకొని వానిని నొక్కక్క దానినే యాచరణమునం బెట్టుచుండెను" (వీరభద్రరావు, చిలకూరి: కాకతీయాంధ్ర రాజయుగ చరిత్రము, పుట.314.) అని పేర్కొన్నారు.

మల్లికార్జున పండితునికి సంబంధించిన సమాచారాన్ని పరిశీలిస్తే, అతడు 'సనాతనాచారాలను తు.చ. తప్పకుండా పాటించే శైవ బ్రాహ్మణుల ఇంట జన్మించాడు. ఆ ఆచారాలను అన్ని విధాలుగా పాటిస్తూ, జీవన విధానాన్ని శైవమతానుగుణంగా మార్చుకున్నవాడు. ఈ విధానాలు క్రమంగా అతడు వీరశైవ పద్ధతులు అనుసరించే వరకు తీసుకెళ్ళాయి. మల్లికార్జున పండితుడు వీరశైవుడుగా మారడానికి మరొక కారణం

ఉంది. తాను నివశించే భీమేశ్వరానికి దగ్గర్లోనే కోటిపల్లి అనే మరో గ్రామం ఉంది. ఆ ఊరులో ఉండే ఒక శైవ గురువు దగ్గర మల్లికార్జున పండితుడు దీక్షపొందాడు. శైవమత రహస్యాలన్నింటినీ ఆగురువునుంచే గ్రహించాడు. ఆ పద్ధతులను క్రమశిక్షణతో పాటించాడు. మల్లికార్జున పండితుడు వీరశైవుడుగా మారడానికి మరొక కారణం కూడా కలదు. అదేమిటంటే మల్లికార్జున పండితారాధ్యుడు బసవేశ్వరునికి సమకాలికుడు. ప్రత్యక్షంగా బసవేశ్వరుడు కన్నడ దేశాన ఉద్యమిస్తున్న విషయాలను చూడకపోయిప్పటికీ సమగ్రంగా విన్నవాడు. ఆ ఉద్యమంచేత ప్రభావితుడైనవాడు. ఆ ప్రభావంతో ఆంధ్రదేశాన మత ప్రచారం చేసి, గ్రంథాలను రచించి, వీరశైవమతానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. అతని శైవమత ప్రచారంలో తాను నేర్చుకొన్న విద్యలతో, పాండిత్యంతో అవసరమైతే అన్యమతస్తుల వాదనలను నిర్ద్వంధంగానే కాక అతి తీవ్రంగా కూడా ఖండించాడానికి వెనుకాడేవాడు కాడని పరిశోధకుల అభిప్రాయం.

ఆకాలంలో జైనం, బౌద్ధం మొదలైన వేదబాహ్యమైన మతాలు వ్యాప్తిలో ఉన్నాయి. అవి ప్రజలను తమ మతం వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. మల్లికార్జున పండితుడు ఆ మతాలను ఖండించి శైవమతాన్ని ప్రచారం చేయుటం తన జీవిత ప్రయోజనంగా భావించాడని చెప్పవచ్చు. ఈ విషయాల వలన మల్లికార్జునుడు చిన్నప్పటి నుంచి కూడా శైవమతంపై ఆసక్తి పెంచుకొన్నాడని, అందుకు అణుగుణంగానే అతడు గురువు దగ్గర చేరి శైవమత సంబంధమైన జ్ఞానాన్ని సంపాదించుకున్నట్లు తెలుస్తుంది.

ఇతను కూడా బసవేశ్వరుడి లాగా శైవ మతప్రచారం తన జీవితాశయంగా పేర్కొన్నట్లు అతని రచన ద్వారా వ్యక్తమవుతుంది. ఇతడికి బసవేశ్వరుడు సమకాలికుడయినప్పటికి అతడిని మాత్రం కలవలేదని రచనలు, చరిత్ర ద్వారా తెలుస్తుంది. బసవేశ్వరుడు, మల్లికార్జునుడు ఇరువురు వేరువేరు ప్రాంతాలకు చెందినప్పటికి ఇరువురి లక్ష్యం మత ప్రచారం చేయడం అని మాత్రం తెలుస్తుంది.

ఇరువురు కూడా మతప్రచారానికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు. కాని బసవేశ్వరుడి లాగా రాజాశ్రయాన్ని పొందినట్లు లేదు. ఇరువురు భావాజాలం మతపరంగా ఉండటంతో మల్లికార్జునుడు బసవేశ్వరుడిని కలవాలనుకున్నట్లు, కాని అది వీలుపడనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే శివతత్త్వసారాన్నీ రచించినట్లు భావించవచ్చు.

### 3.1.3. బసవపురాణము, పండితారాధ్య చరిత్రము-పాల్కురికి సోమనాథుడు

శైవ/వీరశైవసాహిత్యాన్ని ఒక ఉద్యమంగా ప్రచారం చేసిన పాల్కురికి సోమనాథుడి కాలవిషయంలో కూడా పరిశోధకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. సాధారణంగా కవి జీవిత విశేషాలను అతని గ్రంథంలో ఉన్న (సాహిత్య) సమాచారం ఆధారంగా నిర్ణయించడం ఒక ముఖ్యమైన పద్ధతి. కాని ఇతడి రచనల్లోని విషయాలు చరిత్రకు అన్వయం కాకపోవడంతో ఇతడి వ్యక్తిగత జీవితం గురించి పండితుల మధ్య అనేక చర్చలు జరిగాయి. "12వశతాబ్ది ఉత్తరభాగం, 13వశతాబ్దపు పూర్వభాగాన్ని సోమనాథుడి జీవతకాలంగా పండితులు/పరిశోధకులు పేర్కొన్నారు" (నన్నెచోడుడు: కుమారసంభవము, పీఠిక, పుట.XXVI.) అని మృత్యుంజయరావు అభిప్రాయపడ్డారు. "ఇతని కాలము క్రీ.శ. 1190 నుండి క్రీ.శ.1260-70 ప్రాంతము వరకు నుండునని నిర్ణయించితిని" (వెంకటరావు, యన్: తెనుగు కవుల చరిత్ర, పుట.346.) అని నిడదవోలు వెంకటరావుగారు తెలిపారు.

ఇక పాల్కురికి సోమనాథుడి జన్మస్థలం గురించి కూడా చాలా చర్చజరిగింది. చివరికి అతడి నివాసస్థలం నేటి తెలంగాణాలోని వరంగల్లు జిల్లా, జనగామ తాలుకాలోని పాలకుర్తి కావచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి గల కారణాన్ని కూడా పేర్కొన్నారు. సాధారణంగా గ్రామనామం గృహనామంగా మారడం అనేది చాలా మంది విషయంలో కనిపిస్తుంది. దీని ననుసరించి పాల్కురికి సోమనాథుడు పాల్కురికి అనే గ్రామంలో

జన్మించాడని విమర్శకులు పేర్కొన్నారు. అనేక అంశాలను పరిశీలించిన తరువాత పాల్కూరికి సోమనాథుడి స్వగ్రామం పాల్కురికి అని చెప్పవచ్చు. "కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవ చక్రవర్తి ఓరుగల్లు రాజధానిగా పాలిస్తూ ఉండే రోజుల్లో రాజధానిగా పండ్రెండు కోసుల దూరంలో ఉన్న పాల్కురికి గ్రామంలో సోమనాథుడు జన్మించాడని అక్షరాలా చిరునామాను లెక్కగట్టి చెప్పారు" (ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం, పుట-203, (రెండవ సంపుటం))"

సోమనాథుడు మొదట సాధారణ శైవుడని తరువాత కాలంలో అతడు వీరశైవుడుగా మారాడని, అతని మొదటి సాహిత్య రచనలో, తన పూర్వపుకవులైన నన్నయను అనుసరిచాడని కొందరి పరిశోధకుల అభిప్రాయం. "బసవపురాణంలో తన తల్లిదండ్రులను స్మరించడం వల్ల ఆ కావ్య రచనా కాలానికి సోమనాథునికి పూర్తిగా వీరశైవం ఆవహించలేదని ఊహించాలి. పైపెచ్చు అప్పటికి తన తల్లిదండ్రులు జీవించి వుండవచ్చు. అందుకే వారిని స్మరించి తన కృతజ్ఞత తెలియజేసి వుండవచ్చు. సోమనాధుడు తొలుత నన్నయ భట్టారకుని మార్గముననుసరించి కవితా రచన కావించినట్లుగ ననుభవ సారమునుబట్టి తెలియుచున్నది." (వెంకటరావు, యన్: తెనుగు కవుల చరిత్ర, పుట.351.)

పాల్కురికి సోమనాథుని కాలంనాటి సమకాలీన పరిస్థితులను పరిశీలించినట్లయితే మరికొన్ని విషయాలు అవగతమవుతాయి. పన్నెండవ శతాబ్దంనాటి సాంఘిక చరిత్రను పరిశీలిస్తే ఆనాటి మతప్రచారంలో బసవవేశ్వరుని భక్తి, ఆవేశం పూర్తిగా ప్రవేశించింది. దీనికి ప్రభావితమైన వారెందరో బ్రాహ్మణులు తమ బ్రాహ్మణ్యాన్ని పరిత్యజించి శైవత్వాన్ని తీసుకున్నట్లు తెలుస్తుంది. వీరివంశమే అనంతర కాలంలో జంగములుగా వ్యవహరించబడ్డారు. పాల్కురికి సోమనాథుడి కాలం కాకతీయులకు సమకాలీనమైంది. కాకతీయులలో కొందరు ప్రారంభంలో జైనమతాన్ని అనుసరించినవారు. వీరశైవమతం ఆంధ్రదేశంలో వ్యాప్తి చెందక పూర్వం

ప్రజాసామాన్యంలో ఎక్కువమంది జైనమతాన్ని అవలంబిస్తున్నట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. తెలంగాణాలో జైనమత వ్యాప్తి ఎక్కువగానే ఉండేది. కాకతీయులు కూడా కర్ణాటక ప్రాంతం వారితో సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. క్రీ.శ. 1115-1158 సంవత్సరాల మధ్య పరిపాలించిన కాకతీయ రెండవ ప్రోలరాజు బిజ్జలునికి సమకాలికుడు. రెండవ ప్రోలరాజుకు బిజ్జలుడికి మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. కొన్ని సందర్భాల్లో బిజ్జలునుకి సహాయపడ్డాడు. ఒకసారి బిజ్జలుడికి సహాయంగా తన సైన్యాలను పంపి కళ్యాణి నగరాన్ని పశ్చిమ చాళుక్య రాజుల నుండి స్వాధీనం చేసుకోవడంలో ప్రోలరాజు సహాయపడ్డాడు. ప్రోలరాజు కాలంలోనే వీరశైవమతం ప్రారంభమైంది. ఇతని స్నేహితుడైన బిజ్జలుడు, అతని కోశాధిపతియైన బసవవేశ్వరుడు జైన, శైవమత పక్షాలను ఆదరించి, పరస్పరం సంఘర్షణలకు దిగడం వలన కన్నడ రాజధాని కళ్యాణినగరం రణరంగంగా మారిన విషయం ప్రోలరాజు గమనించాడు. అప్పుడప్పుడే కుదుటపడుతున్న కాకతీయుల రాజ్యం మతద్వేషాలతో నాశనం కాకుండా కాపాడాలంటే అప్పుడే వ్యాప్తి చెందుతున్న వీరశైవ మతోద్యమానికి తల ఒగ్గటం మంచిదని భావించాడు. అంతవరకు ఆదరిస్తున్న జైనమతాన్ని వదలి తానుకూడా శైవమతాన్ని స్వీకరించాడు. దీనితో ప్రోలరాజు కాలం నాటికి వీరశైవమతం ఆంధ్రదేశంలో, ముఖ్యంగా ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో ప్రవేశించింది. ఇటువంటి పరిస్థితుల మధ్య పాల్కురికి సోమనాథుడు ఉండటమే కాక బసవేశ్వరుడి వీరశైవ సిద్ధాంతాలకు ప్రభావితుడయినవాడు. శైవమతాన్ని వీరశైవమతంగా ప్రచారంచేశాడు.

వీరశైవ మతప్రచారమే సోమనాథుడు తన ఆశయంగా భావించాడు. ఆ వీరశైవమత ప్రచారానికి అతను కూడా సాహిత్యాన్ని సాధనంగా చేసుకున్నాడు. ఏ మతమయిన ప్రజలలో ఎక్కువ వ్యాప్తి కావాలన్నా ప్రచారం పొందవలెనన్నా, ఆ మత ధర్మాలు వారి భాషలోనే బోధించాలి. హిందూ మతధర్మాలు ప్రాచీన కాలం నుండి సంస్కృతభాషలోనే ఉన్నాయి. సంస్కృతభాష కొన్ని వర్ణాలకు వారికి మాత్రమే తెలిసివుండటం వలన, తక్కువ వర్ణాలవారిగా భావించేవారికి హిందూమత

ధర్మగ్రంథాలు చదవటానికిగానీ, ఆ మత ధర్మాలను తెలుసుకోవడానికిగానీ అవకాశం లేకపోయింది. అందువలన ఆకాలంలో అనేక మంది ప్రజలు హిందూ మతంను వదలి బౌద్ధ, జైనాది మతాలను స్వీకరించారు.

ఒక కొత్త మతం ప్రారంభించినప్పుడు ఎటువంటి విధానాలు అవలంభించాలో చరిత్రలో ఇంతకు పూర్వం జరిగిన విషయాలను అవగతం చేసుకొన్నాడు. గతంలో బుద్ధభగవానుడు బౌద్ధమత ప్రచారానికి తన మత ధర్మాలను నాటి ప్రజల భాష అయిన ప్రాకృత భాషలో బోధించాడు. బౌద్ధమత గ్రంథాలన్ని ప్రాకృతభాషలోనే రచింపబడ్డాయి. ఈ విషయాన్ని తెలుసుకొన్న పాల్కురికి సోమనాథుడు శైవమతం ప్రజలలో బాగా వ్యాపింపచేయాలంటే అది సంస్కృతంలోనో, సంస్కృత సమాస భూయిష్టమయిన మార్గపద్ధతిలోనో కాకుండా ప్రజలకు అతి సన్నిహితమయిన భాషలో సాహిత్యం రచించాలని పూనుకున్నాడు. ఆ తెలుగు భాషే పాల్కూరికి సోమనాథుడు పేర్కొన్న జానుతెనుగు. ఈ జానుతెనుగు భాషలో తన రచనలన్ని సాగాయి. ప్రచారానికి గేయాలు పనికి వచ్చినంతగా ఇతర ఛందో ప్రక్రియలు పనికిరావని తలచాడు. అందుచేత అతడు తన కావ్యాలను గానానుకూలమయిన దేశీయ ఛందస్సు ద్విపదలో రచించాడు. గద్యలు, రగడలు, ఉదాహరణలు కూడా కొంత గేయధర్మాన్ని కలిగి ఉండటంచేత మత ప్రచారానికి బాగా ఉపయోగకరం అనే ఉద్దేశంతో ఆ ప్రక్రియలో కూడా రచనలు చేశాడు.

ఇతివృత్తం విషయంలో కూడా మార్పును కోరుకున్నాడు. అంతకు ముందు వచ్చిన రచనలు ఇతిహాస పౌరాణికమైన ఇతివృత్తంతో కూడుకున్నవి. ఒకవేళ పౌరాణిక యితివృత్తం గ్రహించినట్లయితే వాస్తవికతకు దూరంగా ఉంటుందని, తనకంటే ముందు శైవమతానికి గొప్ప సేవ చేసి, ఆ మతాన్ని వ్యాప్తి చేయటానికి ప్రయత్నించిన మహనీయుల చరిత్రల రచించినట్లయితే శైవమత ప్రచారానికి మరింత అభివృద్ధి జరుగుతుందని భావించి దేశీయ ఇతివృత్తాన్ని గ్రహించి రచనలు చేశాడు. తద్వారా తనమత మత ప్రచారాశయాన్ని కొనసాగించాడు.

సోమనాథుడి “స్తోత్రరచనలు శైవమతావలంబకులయిన పామరులకును, సిద్ధాంత గ్రంథములు పండితులకును మాత్రమే యుపయోగపడగా శైవేతరులయినవారికి శైవమతమునందభినివేశము, నభిమానము గల్పించుటకును, శైవులకు గూడా మతధర్మముల రూపమున గాక కథావ్యాజమున శైవమతధర్మముల దెలిపి వానియందితోధికముగా నాస్థకలిగించుటకును సోమనాథుడు బసవపురాణము, పండితారాధ్య చరిత్రము అను ద్విపద కావ్యములను రచించి వానిలో బెక్కురు పురాతన నూతన భక్తుల చరిత్రములనభివర్ణించి సమకాలమునందలి శైవులకును, శైవేతరులకును శైవమతమునందు గొంత యాదరాభిమానములు కలుగుటకు దోడ్పడినదాయెను.” (కోదండరామయ్య, తిమ్మావఝ్ఝల: పాల్కురికి సోమనాథుడు- వీరశైవసిద్ధంతము-II, పుట.8.)

సోమనాథుడు అవలింభించిన ఈ విధానం కూడా కన్నడ దేశంలో ఇంతకు పూర్వం ఉన్నటువంటిదే. కన్నడ దేశంలో బసవేశ్వరుడు మొదలైన వీరశైవులు తమ మత ప్రచారం కోసం రగడలు వంటి దేశీ ఛందస్సును ఉపయోగించి రచనలు చేశారు. సోమనాథుడు కూడా ఇదే విధానాన్ని కొనసాగించాడు. ఇక ఇతివృత్తం విషయంలో కూడా సోమనాథుడు కొత్త పంథాను అవలంబించాడు. దక్షిణ భారతదేశంలో శైవమత వ్యాప్తికి కృషిచేసినవారిలో ముఖ్యమైనవారు బసవేశ్వరుడు మరియు మల్లికార్జున పండితుడు. వీరి గురించి ప్రజలు కూడా విని వున్నారు. అందువలన పాల్కురికి సోమనాథుడు బసవేశ్వరుని చరిత్రను బసవపురాణంగానూ, పండితుని చరిత్రను పండితారాధ్య చరిత్రగానూ దేశీ ఛందస్సు ద్విపదలో రచించాడు.

ఇక అతడు రచించిన బసవపురాణము రచనా నిర్మాణం కూడా ఇంతకు పూర్వం కన్నడ రచయితలు అనుసరించినది. దక్షిణ భారత సాహిత్యాలలో పురాణ పద్ధతి అనేది

మొదట మత సంబంధమైన రచనా పద్ధతికి ఉపయోగించినట్లు జి.వి. సుబ్రహ్మణ్యం గారు పురాణ వాఙ్మయం అనే గ్రంథంలో వివరించారు. పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం కూడా జైనపురాణ సంప్రదాయాన్ని అనుసరించి వ్రాయబడినట్లు, జైన పురాణంలాగానే దీనికి సోమనాథుడు బసవపురాణం అని పేరు పెట్టినట్లు జి.వి.సుబ్రహ్మణ్యం గారు తెలిపారు. "అతని రచనలపై కన్నడ దేశమున వెలసిన వీరశైవ వచన గీతములే కాక, కన్నడ సాహిత్యమున వ్యాప్తిగాంచిన జైన పురాణ నిర్మాణ ప్రక్రియయు బలమైన ప్రభావము వేసినది. అందువలననే బసవపురాణ నిర్మాణము పై జైనపురాణ ప్రభావము కానవచ్చును. వీరశైవులకు ప్రత్యక్ష ప్రత్యర్థులు జైనులు. జనాదరణ పాత్రములైన జైనపురాణ నిర్మాణ శిల్పములనెరిగి సోమనాథుడు ప్రథమ వీరశైవ పురాణము నిర్మించి ప్రజాహృదయములను చూరగొన యత్నించినాడనుటలో ఆశ్చర్యము లేదు." (సుబ్రహ్మణ్యం, జి.వి: పురాణ వాఙ్మయము, పుట.22.) దీనిని బట్టి సోమనాథుడు అప్పటికే కన్నడ సాహిత్యంలో ఉన్నవాటిని, ప్రజలలోకి చొచ్చుకుపోవడానికి ఆస్కారమున్న వాటిని తనకు అనుకూలంగా మార్చుకొని తెలుగులో రచనలు చేశాడని చెప్పవచ్చు.

### 3.1.4. తదనంతర సాహిత్యంపై శైవ (సోమనాథుడి) మతప్రభావం

సోమనాథుడి అనంతరం తెలుగులో పలువురు కవులు శైవ సంబంధమైన రచనలు చేశారు. వీరిలో వీరశైవమతాన్ని కొనసాగించినవారు కొందరుకాగా, మరికొందరు కేవలం శివుని మీద భక్తితో రచనలు చేశారు. అసలు ఏవి శివకవుల రచనలు, శివకవిరీతులు అనే ప్రశ్నకు సమధానంగా "శివకవి రీతులనగా శివభక్తుల కథలను, వర్తమాన వృత్తాంతములను కావ్యవస్తువుగా గైకొనుట; దేశీయ ఛందస్సులలో రచనచేయుట; ఛందోవ్యాకరణ నియమములను కొంత సడలించుకొని, వీరి పరిధిని విస్తృతము చేయుట; నాటి జన వ్యవహారమునకు సమీపముగానుండు భాషా నిబంధనము కావించుట. దీనినే ప్రాచీన శివకవులు జాను తెనుగని వ్యవహరించినట్టు

కన్పించును." (రత్నమోహిని,వి: తెలుగు సాహిత్యము శైవమతప్రభావము-2. పుట.7-8.) పై అంశాన్ని అంగీరించవచ్చు. దాదాపు శివకవులు అందరు పైన వివరించిన లక్షణాలతో వారి రచనలు చేశారు.

## 3.1.4.1. సర్వేశ్వర శతకము - యథావాక్కుల అన్నమయ్య

పాల్కురికి సోమనాథుడి ప్రభావం తరువాత కవులపై వారి సాహిత్యంపై ప్రసరించిందని చెప్పవచ్చు. ఈ శైవసాహిత్యానికి ప్రభావితులై రచనలు చేసినవారు పలువురు కలరు. ఇంతకు ముందు చెప్పినట్లు శైవమతాన్ని ప్రచారం చేయడానికి వచ్చిన రచనలు కొన్ని ఉండగా, మరికొన్ని కేవలం శివుడికి సంబంధించిన రచనలు ఉన్నాయి.

శివకవియుగంలోని కవులలో పేర్కొనదగినవాడు యథావాక్కుల అన్నమయ్య. యథావాక్కుల అన్నమయ్య ఆత్రేయ గోత్రానికి చెందిన బ్రాహ్మణుడని అతడి రచనల ఆధారంగా పండితులు వివరించారు. ఇతడు పదమూడవ శతాబ్దికి చెందినవాడుగా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇతడు రచించిన రచన సర్వేశ్వర శతకము. "ఈతని కృతి సర్వేశ్వర శతకము క్రీ.శ.1242లో రచితమగుటచే నుపలబ్దములగు ప్రాచీన శివకవుల కృతులలో నిదియు నొకటియని చెప్పనగును. భాషయందును, భావములందును, కావ్యవస్తువునందును నీ కృతి శివకవి కృతియనియు, నితడు శివకవియే యనియు నిరూపించనగును." (వెంకటరావు, యన్: తెనుగు కవుల చరిత్ర, పుట.350.)

ఇతడి రచన ఒక్క సర్వేశ్వరశతకం మాత్రమే లభిస్తుంది. ఇతరచనలు ఏమి చేసినట్టు ఎక్కడ ఆధారాలు లేవని పండితులందరి అభిప్రాయం. ఈ రచనలో కుడా శివభక్తిని గురించి రచించిన అంశాలు మాత్రమే కనిపిస్తాయి. సర్వేశ్వరశతకంలో

లభిస్తున్న పద్యం ఆధారంగా ఇతడి జీవిత కాలానికి సంబంధించి సమాచారాన్ని నిడదవోలు వెంకటరావు గారు తమ తెనుగుకవుల చరిత్రలో ఈ క్రింది విధంగా వివరించారు.

"శాకాబ్దంబులు వార్ధిషట్కపురజిత్సంఖ్యం బ్రవర్తింప సు
శ్లోకానందకరంబుగా మహిమతో శోభిల్ల సర్వేశ్వర
ప్రాకామ్యస్తవ మొప్పజెప్పెశుభకృత్ప్రవ్యక్త వర్షంబునన్
శ్రీకంఠార్పితమై వసుధరపయింజెన్నొంద సర్వేశ్వరా" (అన్నమయ్య, యథావాక్కుల: సర్వేశ్వర శతకము, 130. పుట-75) "గ్రంథరచనాకాలము 'శాకాబ్దంబులు వార్ధిషట్కపురజిత్సంఖ్యం బ్రవర్తింప' శుభకృత్తు వర్షమని కవి పద్యరూపమున దెలిపియుండుట చేతను నిది ప్రమాణముగ గొనవచ్చును. వార్ధి(4) షట్క(6) పురజిత్(11) అనగా1164 . ఇవి శాకాబ్దములు; అనినా శాలివాహన శకాబ్దములు. దీనికి 78 చేర్చిన (1164+78) క్రీ.శ. 1242 గా నేర్పడుచున్నది. కావున నితడా కాలమునున్న వాడనుటకు సునిశ్చితమే." (వెంకటరావు, యన్;తెనుగు కవుల చరిత్ర, పుట.351.)

ఇంకా తెనుగు కవుల చరిత్రలో వీరు పేర్కొన్న అంశాలు చూడగా వీరు పల్నాటిసీమకు చెందినవారయియి ఉండవచ్చు. దానికి కారణం అతని వంశస్తులు తరువాత ఆ ప్రాంతంలో ఉన్నారు. ఇక సర్వేశ్వర శతకం భాషలోనూ, కవితా వస్తువులోనూ శివకవుల కృతులను అనుసరించే ఉంది. ఇతనిపై పన్నెండు, పదమూడవ శతాబ్దాలలో ఆంధ్రదేశంలో వెలసిన వీరశైవమతం కూడా కనిపిస్తుంది. ఇతడికి సంబంధించిన సమాచారం పూర్తిగా లభించలేదు. ఇతడు గోదావరీ ప్రాంతానికి చెందిన వాడని తరువాత శ్రీశైలంను దర్శించి అక్కడే స్థిరపడ్డాడని ఒక కథ ప్రచారంలో వుందని పండితులు పేర్కొంటున్నారు. కావునా ఇతడు వీరశైవ మత ప్రభావంతో రచన చేసినట్లు భావించాలి.

### 3.1.4.2. సిద్ధేశ్వర చరిత్ర - కాసే సర్వప్ప

సిద్ధేశ్వర చరిత్ర రచన గ్రంథకర్త కాసే సర్వప్ప. సిద్ధేశ్వరుడంటే ఈశ్వర స్వరూపుడైన మహేశ్వరుడే. సిద్ధేశ్వర చరిత్ర అనే పేరును బట్టి ఇది శివుని కథా విశేషాలను రాశాడేమో అనిపిస్తుంది. కాని ఈ కావ్యం ఆంధ్రదేశంలోని ఓరుగల్లు రాజధానిగా చేసుకొని మూడు శతాబ్దాల కాలం పరిపాలించిన కాకతీయుల చరిత్రను గురించి వివరిస్తుంది.

ఇతరకవులలాగానే "కాసే సర్వప్ప కూడా తన వంశజులగు తండ్రితాతలను ఇందు ప్రశంసించినాడు. అవతారికలో శివస్తుతి చేసినాడు. శివభక్తుడనుటకు శైవమతావలంబి యనుటకిది తార్కానము. శివస్తుతి (ఇష్టదేవతాస్తుతి)యైన పిమ్మట సంప్రదాయానుసారముగా విఘ్నేశ్వరుని స్తుతించెను. కాసే సర్వప్ప శివకవుల మార్గమునకు చెందినవాడు. కాని ఈతడు వీరశైవుడవుతాడు. వేదమతమున కనుగునమైన సాధారణ శైవమతమునే పాటించినాడు. అయినను కవిత్వరీతులందు శైవకవుల పదములను పెట్టినవాడు." (రత్నమోహిని,వి: తెలుగు సాహిత్యము శైవమతప్రభావము-2, పుట.7-8.) విమర్శకులు ఇతడు వీరశైవుడని నిరూపించారు.

### 3.1.4.3. నవచోళ చరిత్ర - పోశెట్టి లింగన కవి

ఇతడు రచించిన రచన నవచోళ చరిత్ర. ఇది ద్విపదలో రచింపబడినది. ఇతడు పదహైదవ శతాబ్దం చివరి కాలానికి చెందిన వాడని పండితుల అభిప్రాయం. ఈ కవి తన కులగోత్రాలనుకానీ, తల్లిదండ్రుల పేర్లనుగానీ గ్రంథంలో ఎక్కడా చెప్పలేదు. తల్లిదండ్రులను గురించి తెలుపుతూ " నావంశమెట్లనిన క్షితిని'మాతా హిమగిరి సుతా' యనగా - నతిశయ రీతి పితా రుద్ర' యనగా బాంధవుల్ శైవులు భక్తులౌననగా...' (లింగన, పోశెట్టి, నవచోళ చరిత్ర, పుట-3) అని పేర్కొన్నాడు. ఇతడు పార్వతిని తల్లిగా, రుద్రుడిని తండ్రిగా పేర్కొనడం అనేది వీరశైవసంప్రదాయమని పండితులు తెలిపారు.

కాబట్టి ఇతడు కూడా వీరశైవ సంప్రదాయానికి చెందినవాడుగా పేర్కొనవచ్చు. ఈ రచన కూడా వీరశైవమత ప్రభావంతో వచ్చిందని తెలుసుకోవచ్చు.

అయితే ఇతని ఇంటిపేరు మాత్రం పోశెట్టి అని తెలుస్తోంది. పోశెట్టి అనే ఇంటిపేరు కుమ్మర కులంలో ఉందని, కనుక ఇతడు కుమ్మరి వంశీయుడని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు గ్రంథపీఠికలో రాశారు. ఇతడు కుమ్మరి వంశస్తుడని తెలపడానికి ఆదినారాయణ శాస్త్రిగారు పలు అంశాలు పేర్కొన్నాడు. "లింగకవి, కులగోత్రముల కతీతమగు వీరశైవ కుటుంబంవాడైనను ఇంటిపేరగు పోశెట్టి యను పదము 'ఇతడు ఆంధ్రదేశము నందలి కుమ్మరుల వంశములకు జెందిన వాడని' సూచించుచున్నది. శెట్టిపదమిప్పటికిని కుమ్మరులలో అనాచారముగా వాడబడుచు వచ్చుచున్నది. ఇందుకు ఈ గ్రంథారంభమున భక్తగణస్తుతిని జేయుచు పురాతనులను ఆదియుగములకు జెందినవారునగు నందీశ్వరుని భృంగీశ్వరుని పేర్కొన్న తరువాత వీరశైవులలో మిక్కిలి ప్రసిద్ధిని గడించినవారు - అన్ని విధముల రెండవ ఈశ్వరమూర్తులని పేర్కొన దగినవారు -అగు -బసవేశ్వరుడు పండితారాధ్యుడు మున్నుగు వారలెందరో యున్నను తొలుదొల్త భక్తగణస్తుతిని కుమ్మర గుండయ్యతో ఆరంభించుచున్నాడు.

'శ్రీనందినాథుని శ్రీభృంగినాథు
మానకంజారు కుమ్మరిగుండ విభుని
శంకరదాసయ్య శమనారిమరళు ఇత్యా'

దానివలన లింగకవి కుమ్మరికులమునందు జనించిన వాడనియును, శంకరదాసుని వంశమునందు జన్మించిన వాడనియును తేలుచున్నది" (లింగన, పోశెట్టి: నవచోళచరిత్ర, పీఠిక, పుట. 6.) అని ఆదినారాయణ శాస్త్రి గారు పేర్కొన్నాడు

పోశెట్టి లింగన కవి గార్లపాటి లక్ష్మినారయణ కవికి శిష్యుడు. చకిలాల లింగప్పకు మిత్రుడు. ఈ గ్రంథం పోశెట్టి లింగన సొంత రచన కాదు. చకిలాల లింగప్ప కన్నడంలో

రచించిన గ్రంథాన్ని తెలుగు భాషలో ద్విపదలో రచించమని కోరగా, నవచోళ చరిత్రను రచించినట్లు గ్రంథంలో చెప్పుకొన్నాడు. బగిరాముపల్లి అనే దివ్య క్షేత్రంలో వెలసిన మృత్యుంజయేశ్వరుడికి అంకితం చేశాడు.

### 3.1.4.4. నవనాథ చరిత్ర - గౌరన

శైవంలో వివిధ శాఖలు ఉన్నాయి. అవి భారతదేశంలో వివిధ పేర్లతో వివిధ పద్ధతుల్లో ఆచరించబడుతున్నాయి. అదే విధంగా వివిధ కాలాల్లో దక్షిణ భారతదేశంలో శైవమత శాఖలున్నాయని చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఆ శాఖల్లో నాథ సంప్రదాయం కూడా ఒకటి. ఈ నాథసంప్రదాయం ఆంధ్రదేశంలో వ్యాప్తిలో లేదని, కాని కొన్ని ప్రదేశాల్లో ఈ మతానుయాయులు ఉన్నట్ల కొందరు పరిశోధకులు పేర్కొన్నారు. "నాథసంప్రదాయం అనేది ఒకశైవం. రుద్రాక్ష, విభూతి, త్రిశూల ధారణం చేత శివరాత్రి చైత్రోత్సవాలు శివాంకితంగా చేయటం చేత గోరక్షకుడు భైరవాంశగా కీర్తితుడు కావటం చేత, గోరక్షకుని గురువు మత్స్యేంద్రనాథుని ద్వారా ఈ సంప్రదాయం శైవమైనదని కథనం. ఈనాథ సంప్రదాయంలో ఆది నాథుడు శివుడు" (గౌరన: నవనాథ చరిత్ర, (పీఠిక) పుట.X.) అని కోరాడ రామకృష్ణయ్యగారు పేర్కొన్నారు.

ఇలా నాథసంప్రదాయాన్ని అనుసరించి వచ్చిన రచన గౌరన రచించిన నవనాథ చరిత్ర. ఈ రచన కూడా ద్విపదలో రచించబడింది. ఇక గౌరన వ్యక్తిగత విషయానికి వస్తే ఇతడు మంత్రి గౌతమ గోత్రజుడు. అయ్యల మంత్రికి పోచాంబల పుత్రుడు. ఇతడు పదిహేనవ శతాబ్దానికి చెందినవాడుగా చరిత్రకారులు పేర్కొన్నారు. ఇతడు కూడా శైవ సంప్రదాయాన్ని అనుసరించిన కవి అని పరిశోధకులందరు అంగీకరించిన విశయం. కాని ఇతడు శైవ శాఖలో ఒక భాగంగా భావింపబడుతున్న నాథ సంప్రదాయాన్ని గ్రహించి నాథుల చరిత్రని గ్రంథంగా రచించాడని పండితులు పేర్కొంటున్నారు. ఇక గ్రంథాన్ని రచించమని సలహానిచ్చిన శాంత భిక్షావృత్తి శ్రీశైల మఠాదిపతి అని, శ్రీనాథుడిని కూడా

రచనకు ప్రోత్సహించగా శ్రీనాథుడు శివరాత్రిమాహాత్మ్యం రచించాడని పరిశోధకులు పేర్కొనివున్నారు. ఈ గ్రంథం ద్విపదలో రావడానికి మరొక కారణం ఆనాడు శైవ సాహిత్య రచనలు ద్విపదలో వచ్చివుండటం. గౌరన కూడా ఆపద్ధతినే అనుసరించాడని భావించవచ్చు.

"భిక్షావృత్తిరాయడు అవిరళ యోగ విద్యాధికులైన నవనాథుల పుణ్య చరితమును శ్రీగిరి కవి పద ప్రబంధముల జెప్పిన దానిని ద్విపద కావ్యముగా జెప్పింప వలయునని తలంచి సరస సాహిత్య లక్షణ వివేకమంతుడును, భ్రమరాంబికా వరప్రాప్త విచిత్ర విమల సాహిత్య ప్రవీణాధికుండునగు గౌరనాహ్వాయుని బిలిపించి 'మధురమై వెలయు నవనాథ చరితంబు ద్విపద కావ్యంబుగా జేసి కమలజ విష్ణు సేవ్యమానుడగు శ్రీశైలపతికి నంకితంబొనరింపు'మని చెప్పి కర్పూరతాంబూలంబు లొసగి గౌరవించెను" (పైదే, పుట.14.) దీనిని బట్టి నవనాథుల పుణ్య చరిత్ర శ్రీగిరికవి పద్యప్రబంధాల ద్వారా ఇంతకు పూర్వమే ప్రసిద్ధమై ఉన్నట్లు కనిపిస్తుంది. దానిని అనుసరించి గౌరన నవనాథ చరిత్రను ద్విపదలో రచించాడు. అయితే తెలుగులో నాథ సంప్రదాయం మీద వచ్చిన మొదటి గ్రంథం గౌరన రచించినదేనని పరిశోధకులు తెలిపారు. నాథ"సంప్రదాయమును గురించి సంస్కృత హిందీ తదితర భాషలలో ఎన్నియో గ్రంథములు వెలువడినను అవి కేవలము సిద్ధాంతపరమైనవి. ఇట్టి పరిస్థితులలో నవనాథుల చరిత్రమును ఆంధ్రభాషలో కావ్యబద్ధము చేసిన ప్రథమాంధ్ర కవి గౌరన అని చెప్పవచ్చును. తన కావ్యమునకు శ్రీగిరి రచించిన గ్రంథము మాతృకయని అతడు చెప్పినను అది ఇంతవరకు లభ్యముకాలేదు. నవనాథులను గురించి తొలిసారిగా పరిచయము చేసిన కీర్తి గౌరనకే దక్కినది." (ఓబిరెడ్డి, కె: నవనాథచరిత్ర కావ్యానుశీలనము, పుట.32.) ఇక నాథ సంప్రదాయం ద్వారా శ్రీశైల మల్లికార్జునుడు నాటినుండి నేటివరకు శైవులచే ఆదినాథుడుగా పూజింపబడ్డాడంటే ఒకనొక కాలంలో అక్కడ నాథ సంప్రదాయ కేంద్రం ఉండి ఉంటుంది. ఒక వేళ నాథ సంప్రదాయం పూర్తిగా లేకపోయినా శ్రీశైలంలో నాథ

సంప్రదాయానికి చెందిన వారు కలుస్తున్నట్లు తెలుస్తుంది. దానికిగల కారణం ముక్తిశాంత భిక్షావృత్తి రాయడు అనే మఠాధిపతి. ముక్తిశాంత భిక్షావృత్తి రాయడు శ్రీశైల మఠాధిపతిగా ఉన్న కాలంలో భారతదేశంలోని పలు ప్రాంతాల నుండి యోగులు, సిద్ధులు మొదలైనవారు శ్రీశైలానికి వచ్చేవారు. దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలానికి చైనా, టిబెట్, నేపాల్, ఆఫ్గనిస్తాన్ మొదలైన ప్రదేశాలనుండి యాత్రికులు వచ్చేవారు. నవనాథ చరిత్రకారుడు గౌరనకు వారితో సంబంధం ఏర్పడి ఉంటుంది. వారు అందించిన సమాచారాన్ని అనుసరించి అతడు ఈ ద్విపద కావ్యాన్ని రచించినట్లు పరిశోధకుల రచనల ద్వారా అవగతమవుతుంది. కాబట్టి నాథ సంప్రదాయం శ్రీశైలంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉన్నట్లు తెలుస్తుంది. ఇంకా ఈ నాథసంప్రదాయం 12వ శతాబ్దిలో కర్ణాటక దేశంలో వ్యాపించి ఉంది. అక్కడ వ్యాపించిన నాథ సంప్రదాయం ప్రకారం శివుడే ఆదినాథుడుగా భావించారు. నాథ సంప్రదాయానికి ప్రభావితుడైన గౌరన ద్విపదలో నవనాథ చరిత్రను రచించాడు.

### 3.1.4.5. శ్రీనాథుడు

శ్రీనాథుడిని ఈశ్వరార్చన కళాశీలుడని పేర్కొంటారు. ఈ పేరే అతడు శివ భక్తుడని తెలియజేస్తుంది. అయితే శ్రీనాథుడు వీరశైవుడు కాడు. శైవుడు మాత్రమే. అందుకే కొన్ని చోట్ల విష్ణువును కూడా స్తుతించాడని పేర్కొంటారు. శ్రీనాథుడి రచనల్లో భీమేశ్వరపురాణము, కాశీఖండము, హరవిలాసము, శివరాత్రి మాహాత్మ్యము రచనలు శివభక్తికి సంబంధించిన రచనలుగా పేర్కొనవచ్చు. ఈ రచననల్లో ప్రతిదానికి కూడా ఒక నేపథ్యం ఉన్నట్లు కనిపిస్తుంది. శ్రీనాథుడి కాలంనాటి రెడ్డిరాజులు, ఆకాలంలో వున్న పరిస్థితులు కూడా ఆరచనలు వెలువడడానికి కారణాలని భావించవచ్చు. దాదాపు రెడ్డిరాజులందరు కూడా శైవమతాన్నే అనుసరించారు. శ్రీనాథుడు కూడా శైవ మతాన్ని అవలంభించినవాడు. శ్రీనాథుని పూర్వికులు కూడా శైవమతాన్ని అవలంభించి ఉండవచ్చని పరిశోధకులు తెలిపారు. “ఎప్పుడో వారి కుటుంబం వారు వీరశైవులో,

పరమ శైవులో అయివుంటారు. ఈ విషయం పండితారాధ్య చరిత్ర రచనను బట్టేకాక ఈ క్రింది పద్యంలో పండితారాధ్యునిపై కనపరచిన భక్తి బట్టి కూడా చెప్పవచ్చు.

'భావమున దలతు ముద్గురు
భావిత లోకుని మదీశు బరమేశమున్
శైవమత గర్వ నిర్వహ
ణావిష్కృత కీర్తి పండితారాధ్యవరున్' (శ్రీనాథుడు: శివరాత్రి మాహాత్మ్యము, 1-11)

కాని ఆయన తాతల నాటికే పరమశైవత్వం అడుగంటినట్లుంది. తాత పేరు కమలనాభుడు కాబట్టి. అందుకే "తన అభిమాన దైవం శివుడైనా స్వయంగా ఈశ్వరార్చన కళాశీలుడైనా అద్వైతి గానే శృంగారనైషధ, హరవిలాసాల కావ్యాదిలో విష్ణుస్తుతిని చేసినాడు." (సుజాతా రెడ్డి, ముదిగంటి: శ్రీనాథుని కవితాసౌందర్యం, పుట. 2.) ఇక శ్రీనాథుని రచనల్లో శైవ సంబంధమైనవి అయిన భీమేశ్వర పురాణము, కాశీఖండము, శివరాత్రి మాహాత్మ్యము రచనలు వెలువడటానికి గల కారణాలను పరిశీలిస్తే వాటి రచనల నేపథ్యం అర్థమవుతుంది.

## 3.1.4.5.1. భీమేశ్వర పురాణము

ఈ రచనను శ్రీనాథుడు బెండంపూడి అనే మంత్రి ప్రోత్సాహంతో రచించి అతనికే అంకితమిచ్చాడు. ఈ రచనకు వెలువడటానికి కారణం దాక్షారామ భీమేశ్వరుడి మీద బెండంపూడి అన్నయమాత్యునికి ఉన్న భక్తి. బెండంపూడి అన్నయామాత్యుడు దాక్షారామ భీమేశ్వర స్వామివారి వరప్రసాదం వల్ల జన్మించాడని పేర్కొంటారు. అందువల్లనే అన్నయమాత్యుడు దాక్షారామ భీమేశ్వర ఆలయ గోపుర మంటపాన్ని నిర్మించాడని చెబుతారు. దీని వలన అన్నయామాత్యుడు దాక్షారామ భీమేశ్వరుడి భక్తుడని పేర్కొనవచ్చు.

సహజంగానే శ్రీనాథుడు తన కృతులను ఇతరులకు అంకితం ఇవ్వడం అనే స్వభావం కలిగినవాడు. పైగా శ్రీనాథుడు ఈశ్వరభక్తుడు. ఇటువంటి సందర్భంలో బెండంపూడి అన్నయామాత్యుడు తనకు భీమేశ్వరుడి మీద ఉన్న భక్తితో రచనచేయమని విన్నవించినట్లు, తద్వారా శ్రీనాథుడు భీమేశ్వరపురాణ రచనకు పూనుకొన్నట్లు భావించవచ్చు. పైగా "బెండపూడి అన్నయామాత్యుడు శ్రీనాథునికి బంధువు కూడాను. ఈ అనుబంధమున బెండంపూడి అన్నయామాత్యుడు దాక్షారామ భీమేశ్వర మాహాత్మ్య ప్రతిపాదికమైన గ్రంథ నిర్మాణము సంకల్పించుట సహజము. భాంధవుడైన శ్రీనాథుని భారము వహింపుమనుట భావ్యము." (శ్రీరామమూర్తి, కొర్లపాటి: శ్రీనాథుడు, పుట.426.) ఇలా అన్నయామాత్యుడి అభ్యర్థన మేరకు భీమేశ్వర పురాణం వెలువడిందని పేర్కొనవచ్చు.

### 3.1.4.5.2. కాశీఖండం

ఈ కాశీఖండ రచన 1409వ సంవత్సరంలో శ్రీనాథుడు తన ప్రభువగు పెదకోమటి వేమారెడ్డితో కలసి కాశీక్షేత్రాన్ని దర్శించాడని, అక్కడ ఆ కాశీ పుణ్యక్షేత్ర సమగ్ర సందర్శనం వలన సంతోషించి, భక్తితో కాశీఖండ రచనకు పూను కున్నాడని పండితులు చెబుతారు. "శ్రీనాథుడు తాను పెదకోమటి వేమారెడ్డి తిలకించిన కాశీక్షేత్ర విశేషములను రచించిన కాశీఖండాన్ని రచించినాడని తెలిసి 'ఈ విషయమును కర్ణాకర్ణిగ నాదరించిన అల్లాడ వేమారెడ్డి తన తమ్ముడగు వీరభద్రారెడ్డికి ఆ కావ్యము నంకితమొనర్చుమని అనురాగ పునస్సారముగా ఆనతిచ్చినాడు. ఆయానతిని సమాదరించినవాడు కవి సార్వభౌముడు 'త్రిలోక్య విజయ' సభామంటపమున కాశీఖండ కృతి సమర్పణ మహోత్సవము సర్వాంగ సుందరముగ సహృదయంగమముగ సంపన్నమైనది." (జయకృష్ణ బాపూజి, జంధ్యాల: శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము, పుట.24.)

### 3.1.4.5.3. శివరాత్రి మాహాత్మ్యము

శ్రీనాథుని యాత్ర వలన వెలువడిన మరొక రచన శివరాత్రి మాహాత్మ్యము. కోమటి వేమారెడ్డి తన జీవితకాలంలో పలుసార్లు శ్రీశైల యాత్ర చేశాడు. శ్రీనాథుడు కూడా కోమటి వేమారెడ్డితో కలిసి శ్రీశైలానికి వెళ్ళాడు. ఆ సమయంలో అక్కడున్న మఠాధిపతి భిక్షావృత్తితో పరిచయం ఏర్పడింది. కొంత కాలం తరువాత అంటే క్రీ.శ. 1450 ప్రాంతంలో తనని ఆదరించే రాజులు లేక దేశాటనం చేస్తూ శ్రీశైలం చేరుకున్నాడు. అప్పటికే తన కవితనే జీవనాధారంగా జీవించిన శ్రీనాథుడు అక్కడ ఉన్న మఠాధిపతి కోరిక మేరకు శివరాత్రి మాహాత్మ్యాన్ని రచించాడు. ఈ గ్రంథాన్ని ఆ మఠాధిపతికే అంకితమిచ్చాడు

వీటితో పాటు రెడ్డి రాజులు ముఖ్యంగా శ్రీనాథుడిని ఆదరించిన పెదకోమటి వేమారెడ్డి దానదయా ధర్మగుణాలతో పాటు దైవభక్తి అధికంగా కలవాడని చెబుతారు. ఇతడు కొండవీటి సామ్రాజ్యాధిపతి కాక పూర్వమే కంచి దాక్షారామ క్షేత్రాలను, కొండవీటి సామ్రాజ్యాధిపతి అయిన తరువాత శ్రీశైలాన్ని సందర్శించాడని, అంతేగాకుండా సింహాచలం, శ్రీకూర్మం, పురుశోత్తమం, కాశీలల్లో ధర్మకార్యాలు చేసినట్లు సంతాన సాగర శాసనంలో ఉందని కొర్లపాటి శ్రీరామమూర్తిగారు శ్రీనాథుడు అనే గ్రంథంలో పేర్కొన్నారు. పెదకోమటి వేమారెడ్డితో పాటు శ్రీనాథుడు శ్రీశైలాది కాశీపర్యంతం తీర్థయాత్ర చేసినట్లు భావించచవచ్చు. ఈ పర్యటనల మూలంగా అక్కడ ఉన్న మఠాధిపతి కోరిక మేరకు శ్రీనాథుడు ఈ గ్రంథాన్ని రచించాడు.

శ్రీనాథుడు శైవమతాన్ని అనుసరించనప్పటికీ అతడు కూడా కొన్ని చోట్ల వీరశైవ సంబంధమైన రచనా పద్ధతిని పాటించాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు. శివభక్తి మహిమను నిరూపించే రచనా విధానాన్ని పాటించాడు. తన అభిమాన దైవం శివుడు కావడమే కాకుండా తాను రచించిన గ్రంథాలను కూడా ఈశ్వరార్చకులకే

అంకితమిచ్చాడు. దీనిని భట్టి శ్రీనాథుడు తను రచించిన రచనలలో ముఖ్యంగా శైవ పరమైన వస్తువు ఉన్న రచనలు ఇతరుల కోరిక మేరకు రచించినట్లు భావించవచ్చు.

### 3.1.4.6. శ్రీకాళహస్తిమాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకము- ధూర్జటి

ఆంధ్రభోజుడుగా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండి కూడా తన శివభక్తిని విడవక శివునికి సంబంధించిన రచనలు చేసిన కవి ధూర్జటి. ధూర్జటి అనే పేరు ధూర్జటి ఇంటిపేరని, వ్యక్తి పేరు కాదని పరిశోధకుల రచనల ద్వారా తెలుస్తుంది. మహాకవి ధూర్జటిని గురించిన వ్యక్తిగత సమాచారం ఎక్కడకూడా కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు. కాని ఇతడి వంశీకుడుగా పేర్కొనబడినటువంటి కుమార ధూర్జటి రచనల్లో ధూర్జటికి సంబంధించిన సమాచారం కనిపిస్తుంది. ఈ కుమార ధూర్జటినే వేంకటాచార్యుడు అని పిలుస్తారు. ఇతడు రచించిన 'కృష్ణరాయ విజయము' గ్రంథం ఆధారంగా ధూర్జటి ఆపస్తంబ సూత్రుడని, భరద్వాజ గోత్రుడని పాకనాటికి చెందిన వాడని పరిశోధకులు తెలిపారు. ఇతడు శ్రీకృష్ణదేవరాయల అష్ఠానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకడని అందరు అంగీకరించారు. ఇతడు రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకం రెండు కూడా శివపరమైన రచనలయినప్పటికీ ఇతడు వీరశైవుడు కాడని కొందరి విమర్శకుల అభిప్రాయం. "ధూర్జటి రచనలు రెండును శివపరములే యగుటచే నితడు వీరశైవుడని తోచును గాని సోమనాథుని వంటి వీరశైవుడు కాక శివారాధన పరుడైన అద్వైతి యనుట నిస్సంశయము" (ధూర్జటి: శ్రీకాళహస్తిమాహాత్మ్యము, పీఠిక, పుట.14.) అని వేదుల లక్ష్మీనారాయణ శాస్త్రి అభిప్రాయపడ్డారు. కాని ఇతడు శైవసాహిత్య సంప్రదాయాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. ధూర్జటి తన రచనలలో ఎక్కడ కూడా తల్లిదండ్రుల పేర్లను ప్రస్తావించక పోవడం వలన ఇతడు శైవ సంప్రదాయాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. తరువాత రచనలు చేసిన ధూర్జటి వంశీకులు తన తల్లిదండ్రులు గురించి పేర్కొన్నట్లు విమర్శకులు తెలిపారు. కృతిని శివుడికే అంకితమిచ్చాడు.

"వాగార్థంబులు శ్రోతృవక్తలు జగద్వంద్యుండు నద్వైతవి

ద్యాగోష్ఠిన్ వివరింప నీశ్వరుడ కాదా మత్ప్రబంధాధిప

త్యాగణ్యార్హుడు వేఱొకండు గలడే యామాట లేలంచు జే

తోగమ్యుండగు కాళహస్తిపతి నాథుంగా సమర్థించితిన్ " (ధూర్జటి: శ్రీ కాళహస్తి మాహాత్మ్యము, 1-6.)

ధూర్జటి రచించిన రెండు రచనలు కూడా శైవపరమైనవే. ఇతడు శైవుడని తెలుస్తుంది. ఇతడు వైష్ణవ మతాన్ని ఆదరించిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో అష్టదిగ్గజాలలో ఒకడుగా ఉన్నాడని కూడా పేర్కొనడం జరిగింది. కాని కృష్ణదేవరాయలు వైష్ణవుడైనప్పటికీ పరమత సహనం కలిగినవాడని, శైవ మతస్తులను ఆదరించడంతో పాటు శివాలయాలకు కూడా అనేక దానాలు చేశాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అటువంటి అష్టదిగ్గజాల నడుమ ఉన్న ధూర్జటి తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని నిలుపుకొని తన మత పరమైన విధానాలను వదలిపెట్టక శైవమతాన్ని కొనసాగించి, ఆ మతానికి సంబంధించిన రచనలు చేయడమనేది ఇక్కడ చర్చించదగినది. అయితే ధూర్జటి రచించిన రెండు రచనలు కూడా ధూర్జటి మానసిక పరిణామం చెంది, వైరాగ్యదశలో రచించాడని విమర్శకులు తెలిపారు. దానికి గల కారణం ధూర్జటి కృష్ణరాయల ఆస్థానంలో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాడు. రాయల మరణం తరువాత ధూర్జటి ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. పలు రాజాస్థానాలను దర్శించాడు. కాని రాజాస్థానాలలో తగిన గౌరవం లభించక, తిరస్కారానికి గురయ్యాడు. మనస్తాపం చెంది విరక్తుడయ్యాడు. అందుకే రాజులను దూషించాడు. ఆర్థికంగా ఇబ్బందులకు గురయిన ధూర్జటి, కుటుంబసభ్యుల ద్వారా కూడా సమస్యలు చవిచూసినట్టున్నాడు. అందుకే కుటుంబం, బిడ్డలను గురించి కూడా తన పద్యాలలో పేర్కొన్నాడు. ఈ విషయాలు శ్రీకాళహస్తీశ్వర శతకం ద్వారా అవగతమవుతాయి. ఇటువంటి పరిస్థితులలో ధూర్జటి తన రచనలు వెలువరించినట్లు తెలుస్తుంది.

ఇక ఈ రచనను పరిశీలిస్తే ఈ గ్రంథ రచన శ్రీనాథుని విధానాన్ని అనుసరించాడని పరిశోధకులు పేర్కొన్నారు. "ఈ యంశమున నితడు శ్రీనాథుననుకరించును. ఇతని కావ్యరచనా పద్ధతియు భాషాసరనియు శ్రీనాథుని పోకడలకు ప్రతిబింబము లనవచ్చును. శ్రీకాళహస్తిమాహాత్మ్యము భీమేశ్వరపురాణము వంటిది. త్రిలిఙ్గదేశమను నామమున కాధారమయిన దాక్షారామము ప్రశంచించునది భీమేశ్వరపురాణము; శ్రీకాళహస్తిని వర్ణించునది శ్రీకాళహస్తి మాహాత్మ్యము (ధూర్జటి: శ్రీకాళహస్తిమాహాత్మ్యము, పీఠిక, పుట.14.) పైరెండు కూడా క్షేత్రమహాత్మ్యాన్ని వివరించే గ్రంథాలుగానే కనిపిస్తున్నాయి. శైవుడై ఉండి వ్యక్తిగత జీవతంలో వచ్చిన పరిణామం ఆధారంగా చివరి రోజుల్లో శివుడి మీద భక్తిని నిలిపి తన భక్తిని నివేదించే క్రమంలో వెలువడిన రచనలుగా ఈ గ్రంథాలను భావించవచ్చు.

### 3.1.4.7. ఇతర గ్రంథాలు

(వీర) శైవమతప్రభావంతో వచ్చిన గ్రంథాలను శిష్టా రామకృష్ణశాస్త్రిగారు తమ వీరశైవాంధ్ర వాఙ్మయము అనే గ్రంథంలో పేర్కొని ఉన్నారు. అందులో ఉన్న గ్రంథాల, రచయితలను బట్టి అందులో కొన్ని గ్రంథాలు అలభ్యాలని తెలుస్తుంది. ఇందులో చాలా గ్రంథాలను పరిశోధకుడు పేర్కొని ఉన్నారు. వాటిని ఇక్కడ పేర్కొనడం వలన తిరిగిచెప్పడం అవతుంది కాబట్టి వాటిని ఇక్కడ పేర్కోదలుచుకోలేదు. అన్ని గ్రంథాలను చారిత్రకంకా చూడటం అనేది ప్రస్తుతం ఇక్కడ సాధ్యం కాదు. దానికి గల కారణం పలు రచన కూడా ఒకానొక నేపథ్యంతో వెలువడ్డాయి. అయితే ఒక విషయం మాత్రం చెప్పవచ్చు. అది శైవ రచనలుగా పరిగణింపబడుతున్న రచనలన్నీ కూడా (వీర)శైవ మతప్రభావంతో రచించబడ్డాయని చెప్పవచ్చు. ఇక్కడ ఈ రచనలనుబట్టి శైవ సాహిత్యోద్యమం సమాజంపై, తెలుగు సాహిత్యం పై తీవ్రంగానే ప్రభావం చూపిందని భావించవచ్చు.

శైవసాహిత్యోద్యమాన్ని పరిశీలిస్తే మొదట ఇతర ప్రాంతంలో ఉన్న సాహిత్య ప్రభావంతో ప్రారంభమైన శైవ రచనలు క్రమంగా ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారి ఇక్కడ సాహిత్యోద్యమంగా మారింది. కొందరు ఈ ఉద్యమ ప్రభావంతో వీరశైవులుగా మారి శైవసాహిత్యాన్ని ప్రచారం చేయటమే తమ ధ్యేయంగా భావించి రచనలు చేశారు. వీటితోపాటు సాహిత్యం ద్వారా సమాజంలో మార్పును కోరి రచనలు చేశారు. కానీ తర్వాత సమాజంలో పలు మార్పులు రావడంతోపాటు మత పరంగా కూడా మార్పులు వచ్చాయి. సమాజంలో మతఘర్షణలు రావడంతో వీర శైవమతస్తులు క్రమంగా వారి వీరపద్ధతులను వదలి కేవలం శైవ కవులుగా మిగిలిపోయారు. దీని వలన కొంత వీరశైవ సాహిత్యం తగ్గిపోయి శైవ సాహిత్యం కొనసాగింది. కానీ కవులు కూడా శైవ సాహిత్య లక్షణాలను మాత్రం కొనసాగించారు. నాటి కాలంలో రాజులు అప్పుడు ఉన్న పరిస్థితుల దృష్ట్యా శైవ వైష్ణవాలను ఆదరించడంతో కవులు కూడా ఎవరి మతాన్ని వారు అవలంభించడంతో పాటు పరమత సహనాన్ని పాటించారు.

శైవ సాహిత్యంలో కూడా ఒక రకమైన పరిణామ క్రమంతో పాటు సాహిత్యాన్ని తమకు అనుకూలమైన పద్ధతిలో మార్చుకొన్న విధానం కనిపిస్తుంది. శైవ సాహిత్యంలో వచ్చిన పరిణామం శైవసాహిత్యం క్రమంగా వీరశైవ సాహిత్యంగా మారి తిరిగి అదే క్రమంలో శైవ సాహిత్యంగా స్థిరపడింది. కానీ శైవ సాహిత్యంలో వచ్చిన రచనల సంఖ్యను పరిశీలించిన తరువాత ఈ ఉద్యమం శతాబ్దాల తరబడి సాహిత్యాన్నీ, సమాజాన్నీ ప్రభావితం చేసినట్లు భావించవచ్చు. శైవ సాహిత్యాన్ని తమ మతానికి అనుకూలంగా మార్చుకోవడంలో వచ్చిన మార్పు 'చరిత్ర' అనే పదాన్ని ఉపయోగించుకొన్న విధానం. ఎక్కువగా చరిత్ర పేరుతో కూడిన రచనలు కనిపిస్తాయి. పండితారాధ్య చరిత్ర, నవచోళచరిత్ర, నవనాధ చరిత్ర మొదలైన వాటిలో గల చరిత్ర అనే పదం శివభక్తుల జీవితాన్ని, వారి భక్తిని తెలిపే అర్థంలో ఉపయోగించారు. ఇక్కడ చరిత్ర అనే పదాన్ని చరిత్ర పరమైన అర్థాన్ని కాకుండా శైవమతానికి సేవచేసిన

శివభక్తుల జీవితాన్ని తెలియచేసే రచన అనే అర్థంలో వాడినట్లు మనం భావించవచ్చు. ఈ విధానమే తరువాత కూడా కొనసాగింది. శైవమతానికి సంబంధించిన రచనలు పరిశీలిస్తే ముఖ్యంగా శివకవులందరు కూడా శివభక్తుల జీవితాలను రచించడానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పవచ్చు.

# నాల్గవ అధ్యాయం

# వైష్ణవ రచనలు -చారిత్రక విమర్శ

# 4. వైష్ణవ రచనలు - చారిత్రక విమర్శ

వైష్ణవమత ప్రాచీనత గురించి, ఆంధ్రదేశంలో ఆ మత వ్యాప్తిని గురించి కూడా పరిశోధకులు పలు అంశాలు చెప్పారు. ఆంధ్రదేశంలో వైష్ణవమతం అనేది ప్రాచీనకాలం నుంచి ఉన్నట్లు పరిశోధకుల అభిప్రాయం. "వైష్ణవమతము తొలిసారిగా శాతవాహనుల కాలమునందు దక్కనులో ప్రవేశించునట్లగుపడుచున్నది. శాతవాహన రాజులలో చాలా మంది వైదికమతావలంబులైనను భాగవత సంప్రదాయమును గూడా ఆచరించిరి. వారి కాలపు శాసనములలో వాసుదేవ - కేశవ - గోవర్థన - కృష్ణ - గోపాల నామధేయములు కనబడుచున్నది. శాతవాహన రాజ్యములో కృష్ణ గాథలే గాక, కృష్ణపూజ కూడా వ్యాపించినది. ఐనను, క్రీ.శ. ప్రారంభ శతాబ్దములలో ఈ సంప్రదాయము తెలుగు దేశమున బాగుగా వ్యాపించినదని గానీ, ఆనాటి రాజులు దీనినవలంబించిరని గానీ గట్టిగా చెప్పుటకు తగు ఆధారములులేవు" (కళావతి, వి: తెలుగులో వైష్ణవ క్షేత్ర మాహాత్మ్య కావ్యములు, పుట.7.) అని పరిశోధకుడు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ, శాతవాహన రాజులు మాత్రం వైష్ణవమత స్వీకరించినట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. "జైనగాథల ననుసరించి ప్రథమ శాతవాహనుడు జైన మతాభిమాని. జైనమతం ద్వారా శాతవాహనుడు సామాజిక ఉన్నతి సాధించివుంటాడు. అందుచేతనే అతణ్ణి పురాణాలు పేర్కొనలేదు. అతని కుమారులైన శ్రీముఖ, కన్హ(కృష్ణు)లు భాగవతమతం స్వీకరించినట్లు వారి పేర్లు సూచిస్తున్నాయి." (హనుమంతరావు, బి.యస్.యల్: ఆంధ్రులచరిత్ర, పుట.76.) తరువాత శాతవాహనుల్లో కూడా వైష్ణవ, శైవ మతస్తులిద్దరూ ఉన్నారు. కొందరి పరిశోధకుల ప్రకారం శాతవాహన సామ్రాజ్య స్థాపకుడు జైనుడు. కాని మరికొందరు పరిశోధకులు మరొక విధంగా పేర్కొన్నారు. చరిత్ర ప్రకారం శాతవాహన సామ్రాజ్య స్థాపకుడు శ్రీముఖుడు. ఈ శ్రీముఖ అనే పేరులోనే విష్ణువుకు సన్నిహితంగా ఉన్నదనీ, కాబట్టి నాడు వైష్ణవమతం కొనసాగినట్లు పేర్కొనవచ్చని పరిశోధకులు భావించారు.

తరువాత రాజ్యమేలిన ఇక్ష్వాకులలో శ్రీశాంతమూలుడు పరమ వైదికుడు. శాతవాహన యుగాంతంలో చెలరేగిన బ్రహ్మణ మతోద్ధారణకు ఇతడు నాయకత్వం కూడా వహించాడు. అనంతరం రాజ్యాన్ని పాలించిన విష్ణుకుండులలో పలువురు వైష్ణవులే. వారి వంశనామం వైష్ణవం. రాజులపేర్లు, బిరుదులు వైష్ణవం, తమ రాజ్యాన్ని వారు కౌస్తుభంతో పోల్చుకున్నారు. వారి శాసనముద్రలపై లక్ష్మి, శ్రీవత్సలు, నాణేలమీద సింహం, శంఖం కనిపిస్తాయి. ఇక్ష్వాకుల తరువాత రాజ్యమేలిన వారిలో కొందరు రాజులు వైష్ణవాన్ని అనుసరించారు. ఇక్ష్వాకుల తర్వాత పల్లవ వంశస్తులు పరిపాలించారు. పల్లవ "యువరాజైన బుద్ధవర్మ దాళూరులో కూళి మహతరకుడు నిర్మించిన నారాయణుని దేవాలయమునకు భూమిని దానము చేసినట్లు ఒక ప్రాకృత శాసనము గలదు. దక్షిణమున నారాయణుని ఆలయమును గూర్చిన మొట్టమొదటి ప్రస్తావనమిదియే. ఈ శాసనము క్రీ.శ. 4వ శతాబ్దికి సంబంధించినదని పండితుల అభిప్రాయము. కావున ఆ కాలము నాటికి భాగవతమతము తెలుగునాట వ్యాపించుటయేగాక విష్ణ్వాలయ నిర్మాణములు గూడా జరిగినట్లు తెలియుచున్నది. వీరందరునూ భాగవత సంప్రదాయమునవలంబించువారు. వీరి రాజ్యములలో విష్ణ్వాలయములున్నట్లు కూడా వీరి శాసనముల వలన తెలియుచున్నది." (కళావతి, వి: తెలుగులో వైష్ణవ క్షేత్ర మాహాత్మ్య కావ్యములు,పుట.7)

ఇంకా కళింగ దేశంలో కూడా క్రీ.శ. 7వ శతాబ్దానికి పూర్వమే భాగవతమతం ప్రచారంలో ఉన్నట్లు, విష్ణువు ఆలయాలు ఉన్నట్లు చరిత్రద్వారా అవగతమవుతుంది. పల్లవరాజులు పెట్టుకొన్న విష్ణువర్మ, విష్ణుగోప, కుమారవిష్ణు మొదలైన పేర్లను బట్టి క్రీ.శ. 7వ శతాబ్దికి పూర్వమే విష్ణువునకు సంబంధించిన మతం ఆంధ్రదేశంలో స్థిర పడినట్లు పేర్కొనవచ్చు.

తరువాత కాలంలో పలు రాజవంశాలు ఆంధ్రదేశాన్ని పాలించారు. ఒకే వంశంలోని రాజులు, కొందరు ఒక మతాన్ని అభిమానిస్తే, తరువాత రాజ్యం చేసిన రాజు మరొక మతాన్ని అవలంబించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొందరు రాజులు తాను అవలంభించిన మతాన్ని అనుసరించినవారిని ప్రోత్సహించడాలు జరిగాయి. రాజులు అవలంభించిన మతాన్ని అనుసరించేవారు, అదే మతస్తులు వివిధ సందర్భాలలో తమ ప్రదేశాన్ని వదలి తమకు అనుకూలమైన మతం ఉన్న ప్రాంతానికి మారిన సందర్భాలున్నాయి. ఈ చర్యలన్ని కూడా మతప్రచారం నిమిత్తం చేసినవిగా భావించవచ్చు. చాళుక్య చోళయుగ కాలంలో "వీరచోళుడు రెండోమారు రాజప్రతినిధిగా నున్న కాలం ఐదేండ్లలో తమిళ వైష్ణవ బ్రాహ్మణులనేకమంది తీరాంధ్రంలో స్థిరపడినారు. ఇతని పిఠాపురం శాసనం ప్రకారం మాలవెల్లి, పొన్నతొర్ర, ఆల్మి అనే మూడు గ్రామాలను కలిపి వీరచోడ చతుర్విద మంగళమనే అగ్రహారం చేసి 563 బ్రాహ్మణులకు ఇచ్చినాడు. ఈ బ్రాహ్మణులలో చతుర్వేద పండితులు, షడంగ మీమాంసా, వేదాంత వ్యాకరణ విధులునైన వైష్ణవులున్నారు. వీరందరూ ద్రావిడ బ్రాహ్మణులేనని చెప్పవచ్చు. నెల్లూరులోని వైష్ణవాలయానికి కాలేరు గ్రామాన్ని దేవభోగంగా దానం చేసినాడు. ఆంధ్రదేశంలో రామానుజ వైష్ణవం వ్యాప్తికీ చర్యలు సుగమమార్గం కల్పించినాయి."(హనుమంతరావు, బి.యస్.యల్: ఆంధ్రులచరిత్ర, పుట.196.)

తక్కిన ప్రాంతాలలో, ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో జరిగిన సంఘటనలు కూడా ఆంధ్ర దేశంపై ప్రభావం చూపాయి. ఈ ప్రభావం వల్లకూడా ఆంధ్రదేశంలో వైష్ణవ మతం వ్యాప్తి చెందింది. ప్రాచీన కాలం నుంచీ దక్షిణ భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో వైష్ణవం ఉన్నట్లు పేర్కొనవచ్చు. ముఖ్యంగా తమిళ ప్రాంతంలో వైష్ణవమత ప్రభావం అధికంగానే ఉన్నట్లు తెలుస్తుంది. క్రీస్తుశకం ప్రారంభం నుండి పొరుగునున్న తమిళ దేశంలో ఆళ్వారులు భక్తిప్రధానమైన వైష్ణవాన్ని ప్రచారం చేశారు. ఆళ్వారులు క్రీ.శ 500 నుండి 900 వరకు జీవించినట్లు పరిశోధకులు అభిప్రాయపడ్డారు. వీరి తర్వాత

నాథముని, యమునాచార్యులు, రామానుజాచార్యులు మొదలైన వారు వైష్ణవమతానికి అధిక ప్రచారం కల్పించారు. ముఖ్యంగా రామానుజాచార్యుల వారి ప్రభావం వల్ల వైష్ణవమతం ఎక్కువగా వ్యాప్తిలోకి వచ్చిందనేది అందరికి తెలిసిన విషయమే. 11వ శతాబ్దంలో కాంచీపురంలో వీరు అద్వైతమతాన్ని నిరాకరించి విష్ణువే పరమ దైవమని, విష్ణుభక్తుల విషయంలో జాతి, కుల భేదాలు పాటించవలసిన పనిలేదని బోధించారు. రామానుజుడు వైష్ణవమత వ్యాప్తికి అహర్నిశలు శ్రమించాడు. ఇతడు తన జీవితకాలంలో దక్షిణ దేశమంతటా పర్యటించి వైష్ణవమతాన్ని ప్రచారం చేశాడు. ఇతడు ప్రచారం చేసిన మతం విశిష్టాద్వైతం. ఇందులో విష్ణువే ప్రధాన దైవం.

విశిష్టాద్వైతం అంతకు పూర్వం ఎప్పుడో శంకరాచార్యులు స్థాపించిన అద్వైతాన్ని ఖండిస్తుంది. వర్ణాభేదాలను నిరసించి, భక్తి మాత్రమే ప్రధానమని ప్రబోధిస్తుంది. కేవలం జ్ఞానం మాత్రమే ముక్తి సాధనకు మార్గం కాదనేది వైష్ణవమత సారాంశం. రామానుజాచార్యుల వారి అనంతరం వారి శిష్యులు అనేక మంది విశిష్టాద్వైతమత ప్రచారం చేశారు. ఈ వైష్ణవ మతాన్ని రామానుజాచార్యులూ, అతని శిష్యులూ సమిష్టిగా వివిధ రకాలైన  ఆచరింపదగిన ఉత్సవాలు, ఉరేగింపులు, భగవత్సంకీర్తనలూ వంటి కార్యక్రమాలు చేపట్టినట్టినట్టూ, ఈ కార్యక్రమాల మూలంగా అతి తక్కువ కాలంలోనే వైష్ణవమతం వివిధ ప్రాంతాలకు వ్యాప్తిచెందినట్లు తెలుగుస్తుంది. ఈ వైష్ణవ ప్రభావం ఆంధ్రదేశం మీద కూడా అధిక ప్రభావం చూపింది.

ముఖ్యంగా దక్షిణదేశం నుండి రామానుజాచార్యుల వైష్ణవం ఆంధ్రదేశంలో ప్రవేశించి వివిధ ప్రాంతాలకు వ్యాపించింది.  తిరుపతి, శ్రీకాకుళం, సింహాచలం, శ్రీకూర్మం మొదలైన ప్రాంతాలు వైష్ణవ కేంద్రాలుగా మారాయి. పలు వైష్ణవ మతాలు వెలశాయి. దేశంలోని అనేక ప్రదేశాలకు ప్రయాణించి అనేకమందిని శిష్యులుగా చేర్చుకొని, సర్వకులాలకు మోక్షదాయకమైన వైష్ణవాన్ని ప్రసాదించిన ఘనత కూడా రామానుజాచార్యులకు ఉంది. రామానుజాచార్యులు జీవించి ఉన్నకాలం నాడు

ఆంధ్రదేశం తూర్పు చాళుక్యుల పరిపాలన కింద ఉన్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఇక కాకతీయులు శైవాన్ని ఆదరించినప్పటికి వైష్ణవాన్ని నిరాదరించలేదు. ముఖ్యంగా "సువర్ణ కేతనాన్ని గాని, వరాహ లాంఛనాన్ని గాని వారు త్యజించలేదు." (పైదే, పుట.258.) దీనిని బట్టి వారు వైష్ణవాన్ని పూర్తిగా వ్యతిరేకించలేదని పేర్కొనవచ్చు.

సహజంగా మొదటి నుంచి శైవం ఆధిక్యత చూపినప్పటికీ రామానుచార్యుల ప్రచారంతో కలిగిన నూతన ఉత్తేజంతో వైష్ణవం కూడా శైవంతో పోటిపడింది. దీనితో క్రమంగా వైష్ణవం ప్రజలలో కూడా వ్యాపించింది. "శైవం ప్రాబల్యం వహించినప్పటికీ కొన్ని వర్ణాలలో కాకతీయయుగం నుండి వైష్ణవం ప్రచారమయింది. నెల్లూరు, బాపట్ల, మాచర్ల, తిరుపతి, శ్రీకాకుళం, అహోబలం, సర్పవరం, సింహాచలం, శ్రీకూర్మం, వైష్ణవ క్షేత్రాలై భక్తులనాకర్షించాయి. రెడ్డిరాజులు శ్రీశైలంతో పాటు అహోబలం, సింహాచలాలకు దానధర్మాలు చేసినారు. కుమారగిరి, కాటయవేములు వైష్ణవ మతాభిమానులు. దక్షిణదేశం నుండి తిరుమల, కందాడ భట్టార వైష్ణవ కుటుంబాలు దేశంలో సంచరిస్తూ వైష్ణవం ప్రచారం చేసినారు." (పైదే, పుట.317.) పైన పేర్కొన్నట్లు వైష్ణవం ప్రభలంగానే వ్యాప్తి చెందింది.

ఇక రామానుజాచార్యులు చేసిన మరొక మార్పు క్రింది వర్ణాల వారికి కూడా వైష్ణవం ఇవ్వటం. వైష్ణవ మతం కూడా వీరశైవమతంలాగే కుల భేదాలను కాదని కింది కులాల వారిని వైష్ణవ మతంలో చేర్చుకొంది. అయితే రామానుజాచార్యులు కింది వర్ణాలకు వైష్ణవ దీక్ష నిచ్చినప్పటికీ వర్ణ వ్యవస్థను ఖండించినట్లు ఎక్కడా కనపడదు. కాని రామానుజాచార్యులవారి వైష్ణవమతవ్యాప్తి ప్రభావానికి లోనైన పల్నాటి బ్రహ్మనాయుడు మాత్రం బసవేశ్వరుని అనుకరిస్తూ వర్ణ వ్యత్యాసాలను నిరసించి వీరవైష్ణవాన్నే ప్రచారం చేశాడు. అతని ప్రచారం వల్ల ఆంధ్రదేశంలోని పంచములు కూడా వైష్ణవమతం స్వీకరించారు.

“12 వశతాబ్దము నాటికే వైష్ణవము తెలుగునాట ప్రవేశించి, మొదట జైనులతో, తర్వాత శైవము తోడను పోరాడినది. లింగము కట్టిన వారందరిది ఒకే లింగవంతకులమని వీరశైవులన్నట్లు వైష్ణవులు కూడా ముద్రలు వేయించుకొని ఊర్ధ్వపుండ్రధారులైన వారందరును ఒకే కులమువారని, పలనాటి వీరచరిత్ర కాలము నాటి బ్రహ్మ నాయుడు నిరూపించినాడు. అతడు చాపకూడు సిద్ధాంతమును ప్రచారము చేసెను.  కులమత భేదము లేక అందరిని ఒకే బంతిలో కూర్చుండబెట్టి, భోజనము చేయించిన విధానమిది”. (వెంకట రమణమూర్తి, వైష్ణవ: తెలుగు సాహిత్యం కర్నూలు జిల్లా వైష్ణవక్షేత్ర సాహిత్యము, పుట.29.) బ్రహ్మనాయుడు గురించి ఇప్పటికే చరిత్ర ద్వారా అవగమైంది. ఇతడు మాచర్ల హైహయ రాజుకు మంత్రి. పరమ వైష్ణవుడు. ఇతడు రామానుజాచార్యుని మత ప్రభావానికి లోనై కింది వర్ణాలవారితో కలసిమెలసి తిరుగుతూ సహపంక్తి భోజనం చేస్తూ, సభలలో కూడా వారితో కూర్చునేవాడు. ఇతడు కారంపూడి దేవాలయానికి ఒక పంచమ వర్ణ కులస్తుడిని ధర్మకర్తగా చేశాడు. బ్రహ్మనాయుని కొడుకు బాల చంద్రునికి బ్రాహ్మణుడు, మంగలి, చాకలి కులస్తులు మిత్రులు. ఈ విధానం భక్తులలో కులమత భేదాలు లేవని చెబుతూ  వైష్ణవ సిద్ధాంతాన్నిప్రచారం చేసింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వైష్ణవం పలుప్రాంతాలకు వ్యాప్తిచెందింది. ఆంధ్రదేశంలో కూడా పలువురు వైష్ణవ మతానికి ప్రచారం చేశారు. దీనితో అతి తక్కువ కాలంలోని ఎక్కువ ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. దీనితో  ఆంధ్రదేశంలో12 వ శతాబ్ది నాటికి శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మము, విశాఖ జిల్లాలోకి సింహాచలం, గోదావరి జిల్లాలోని సర్పవరం, గుంటూరు జిల్లాలోని బాపట్లలో వైష్ణవక్షేత్రాలు ఏర్పడ్డాయి.

రాజ్యాల పరంగా చూసినప్పుడు విజయనగర సామ్రాజ్యం వైష్ణవమత వ్యాప్తికి ఎక్కువ కృషి చేసినట్లు అందరు చెబుతారు. ముఖ్యంగా కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, దక్షిణ భారతదేశంపై ముస్లిం రాజ్యాలు పలుమార్లు దండయాత్రలు చేసినట్లు పలువురు చరిత్రకారులు చెబుతారు. కాకతీయ సామ్రాజ్య పతనం మీద ఏర్పడిన రాజ్యాలైన రెడ్డి, విజయనగర రాజ్యాలు హైందవ సంస్కృతిని

పరిరక్షించడానికి ప్రయత్నించాయి. ముఖ్యంగా మతపరంగా కొంత కఠినవైఖరిని అవలంబిస్తునే కొన్ని చోట్ల లౌకికంగా కూడా వ్యవహరించాయి. అందుకు గల కారణం ముస్లిం రాజ్యాల దండయాత్రలే. ముఖ్యంగా ముస్లిం సుల్తానులు తమ మతవ్యాప్తికి ప్రయత్నించినప్పుడు, హిందూమత రక్షణకు కంకణం ధరించిన వారు విజయనగర రాజులు.

విజయనగరాన్ని పాలించిన రాజులందరు దైవభక్తి ప్రపూర్ణులేనని చరిత్ర చెప్పుచున్నది. తిరుపతి క్షేత్రాన్ని అభివృద్ధి చేసినవారు విజయనగరరాజులే. సాళువ వంశీయుడైన నరసింహరాయల కాలంలోనే వేంకటేశ్వర పాదపద్మారాధకుడు, సంకీర్తనా కవితాపితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు విజయనగరానికి వచ్చాడు. విజయనగరరాజులలో ఒకరిద్దరు తప్ప తక్కిన వారందరు కూడా వైష్ణవాన్నే స్వీకరించారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, విజయనగర రాజుల కాలంనాటికి శైవమతం ఉన్నప్పటికి దేశంలో ఆ మతం కొంత క్షీణ దశకు చేరుకున్నట్లు కనిపిస్తుంది. దానికి గల కారణం ఆనాడు రాజులు అవలంబించిన విధానాలేనని చెప్పవచ్చు.

తుళువ నరసింహరాయల కాలంలో విజయనగరంలో తిమ్మరుసు మంత్రి ప్రేరణతో రాయలవారు వ్యాస కూటాలను నిర్వహించేవారని చెబుతారు. వ్యాస కూటమంటే తమ సంప్రదాయానికి చెందిన కొందరు పండితులను పిలిపించి వారిని ఒక మాసంగాని లేదా ఒక మండలం గాని ఆకూటమిలో ఉంచి, మంచి భోజన, భజన వసతులు ఏర్పాటుచేసి సిద్ధాంత తత్త్వ రహస్యాలను బోధించేవారట. కూటమి అంటే వ్యక్తుల కలయిక. ఈ విధంగా వ్యాసకూటాలలో శిక్షణ పొందిన పండితులు తిరిగి తమతమ ప్రాంతాలకు వెళ్ళి తమ సిద్ధాంతాలను నూతనోత్సాహంతో ప్రచారం చేయాలని నిర్వాహకులు ఆదేశించేవారట. ఇట్టివి మధ్వ సంప్రదాయానికి చెందిన వైనప్పటికీ వీరు పరదైవం విష్ణువే అని భోధించేవారని, ఇదే విధానాన్ని శ్రీకృష్ణదేవరాయల మొదలైన వారు కొనసాగించారని చెబుతారు. అయితే

విజయనగరంలో ఈ విధానం కొనసాగక పూర్వమే ఇటువంటి విధానం ఉందని పరిశోధకుల అభిప్రాయం. "విజయనగరంలో వ్యాసకూటములు నడవడానికి పూర్వమే అహోబలమఠం వారిచే వైష్ణవ కూటాలు నడిపింపబడేవి అవియే వ్యాసకూటములు ఏర్పరచడానికి ప్రోత్సాహకాలై ఉండవచ్చు. వైష్ణవ కూటములలో పాల్గొనడానికి వచ్చిన పండితులకు భక్తి, శరణాగతి మార్గాల ద్వారా ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగించి తత్త్వాలను బోధించి వైష్ణవ మత సిద్ధాంతాలు తెలిపి తమ ప్రాంతాలలో ప్రచారం చేసేందుకు సిద్ధపరిచేవారు" (వేంకటాచార్య, కె: ఆముక్తమాల్యదలో విశిష్టాద్వైత సిద్ధాంత ప్రకాశం-1, పుట.33.) దీనిని బట్టి ఆనాడు మత వ్యాప్తికి అన్ని రకాలైన పద్ధతులను వినియోగించే వారని అర్థమవుతుంది.

వైష్ణవమత వ్యాప్తిలో భాగంగా విజయనగర రాజులు ఉన్న అవకాశాలను అన్నిటినీ వినియోగించుకొన్నారని చెప్పవచ్చు. అలా వైష్ణవమత వ్యాప్తికోసం విజయనగర రాజులు చేసినటువంటిది విద్యారణ్యుల వారిని వారణాసి నుండి విజయనగరానికి బుక్కరాయలు రప్పించడం. బుక్కరాయల కాలంలోనే వైదిక వాఙ్మయానికి భాష్య రచన ప్రారంభమయిందని, బుక్కరాయలకు 'వైదిక మార్గ ప్రవర్తక' అనే బిరుదు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. తెలుగుకవి నాచన సోమనాథుని రాయలు ఆదరించినాడు. ఇక సాళువ నరసింహుని కాలం నుండి వైష్ణవానికి రాజాస్థానంలో కూడా బలం చేకూరింది. వీరి కాలంలో తిరుపతి, అహోబలాలలో వైష్ణవ మఠాలు ప్రసిద్ధ క్షేత్రాలుగా మారి, వైష్ణవ గురువులు దేశం సంచారం చేస్తూ మత ప్రచారం చేశారు. పలు వైష్ణవాలయాలకు ఎక్కువ దానధర్మాలు చేశారు. ఇక తుళువ నరసనాయకుడు తిరుపతి వేంకటేశ్వర స్వామికి భక్తుడు. ఆ వంశంవారికి స్వామి ఇలవేల్పుగా భావించారు.

ఇంతకు ముందు చెప్పినట్లు రెడ్డి, విజయనగర రాజుల పరిపాలనా కాలంలో విభిన్నమతాలు పోషింపబడినప్పటికి, వారి ప్రధాన లక్ష్యం ఒక్కటే అయి ఉండేది. అదే హైందవ ధర్మ సంరక్షణ. అంతకు పూర్వం మహమ్మదీయుల దురాక్రమణ వలన కలిగిన

దుష్ఫలితాల కారణంగా అస్తవ్యస్తమైపోయిన హైందవ మతాన్ని ఉద్ధరించటం. అంతే కాకుండా ఆ ఆశయం సాధించిన తరువాత ఒకనొక దశలో మహమ్మదీయ మతస్తులను కూడా ఆదరించారు. ఇది మత విషయంలో వారు చూపిన సహనానికి ఉదాహరణ. ఇటువంటి సహన పునాది మీద సామరస్య నిర్మాణంతో సాహిత్యం ఆవిర్భవించింది. ఈ సమయంలో వారు ముస్లింల జీవన విధానాన్ని అనుకరించారు. దీనితో వారికి భోగభాగ్య లాలసత్వం ఏర్పడింది. ఈ భోగలాలసత్వమే శృంగారంగా పరిణమించింది. సామరస్య భావం భక్తిగా పర్యవసించినది. ఈ రెండింటి సమ్మేళనం ఆనాడే సాధ్యమైంది. ఈ భక్తి సాహిత్యంలో కూడా ప్రతిఫలించింది. ముఖ్యంగా భోగలాలసంతో కూడిన భక్తి వైష్ణవ మతంలోనే కనిపిస్తుంది. ఈ వైష్ణవ మతం కూడా మార్పుచెందింది. ఈ వైష్ణవం పౌరాణిక భాగవత సంప్రదాయ మతంగా కాకుండా రామానుజాచార్యులు బోధించిన విశిష్టాద్వైత మత సంప్రదాయాన్ని అనుసరించింది. ఇది ఒక విధంగా తమిళ భాషా సంబంధమైనటువంటిది.

సాహిత్యపరంగా చూసినట్లయితే వైష్ణవ మత ప్రభావంతో వెలువడిన సాహిత్యంలో మూడు రకాలైన రచనలు కనిపిస్తాయి.

(1) భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసిన కవులు.

(2) ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవ సంబంధమైన రచనలు చేసినకవులు.

(3) వైష్ణవమత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు.

## 4.1. భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసిన కవులు

వీరు కేవలం భగవంతుని మీద భక్తితో మాత్రమే రచనలు చేశారు. వీరికి వైష్ణవమతాన్ని వ్యాప్తి చేయాలి అనే ధ్యేయం ఉన్నట్లు కనిపించదు. తాము భగవంతుని భక్తితో పూజించి, భక్తితో రచనలు చేసినట్లు కనిపిస్తుంది. ఇందులో కొందరు తమ మతాన్ని కూడా మార్చుకొని వైష్ణవపరమైన రచనలు చేశారు.

### 4.1.1. ఉత్తర హరివంశం-నాచన సోమనాథుడు

నాచన సోమన విజయనగర రాజుల కాలానికి చెందినవాడని పరిశోధకులు పేర్కొంటున్నారు. "నాచన సోమనాథుడు విజయనగర సామ్రాజ్యమును పాలించిన హరిహర బుక్కరాయల కాలములో పదునాల్గవ శతాబ్దమునకు చెందినవాడు" అని సుబ్రహ్మణ్య శర్మ గారు అభిప్రాయపడ్డారు. (సోమనాథుడు, నాచన: ఉత్తరహరివంశం పీఠిక. xv.)"హరిహరుడు బుక్కరాయలు ఆస్థానమున నాచన సోమనాథకవి యుండెనుటకు శాసనస్థములగు నాధారములు కలవు. నాచన సోమనాథునకును మరియైదుగురు బ్రాహ్మణులకును గుత్తిదుర్గము నందు గల పెంచుకలదిన్నె యను గ్రామమును క్రీ.శ. 1344 వ సంవత్సరమునందు బుక్కరాయలు దానమిచ్చిన సందర్భమున బుట్టినదీ శాసనము." (కామేశ్వరరావు, వేదుల నాచన సోమనాథుడు-కావ్యానుశీలనము, పుట.1.)

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం నాచన సోమనాథుడు క్రీ.శ. 1285 ప్రాంతంలో జన్మించి క్రీ.శ. 1350-55 ప్రాంతం వరకు జీవించి ఉండవచ్చుని పేర్కొన్నారు. ఇతడు క్రీ.శ. 1330-36 మధ్య కాలంలో ఉత్తరహరివంశం రచించినట్లు విమర్శకుల రచనల ద్వారా తెలుస్తుంది. ఇతడు ఉత్తర హరివంశంతో పాటు హరివిలాసము, వసంతవిలాసము, ఆదిపురాణము, హరవిలాసము అనే గ్రంథాలను కూడా రచించినప్పటికీ, కేవలం ఉత్తర హరివంశం మాత్రమే లభిస్తుంది.

తిక్కన శిష్యులలో నాచన సోమన అగ్రగామి అయినవాడని పరిశోధకులు పేర్కొన్నారు. నాచన సోమన గురువైన తిక్కనను అనుసరించి తన ఉత్తర హరివంశంను హరిహరనాథునికే అంకితం చేశాడు. అంటే ఆనాటి సమాజంలో హరిహరనాథుని ప్రభావం ఉంది. విజయనగర సామ్రాజ్య పరిపాలకులగా పేర్కొంటున్న హరిహరరాయలు, బుక్కరాయల పేర్లలో హరిహరరాయల పేరు హరిహరనాథుడికి

చెందినటువంటిదే. నాచన సోమనాథుడు హరిహరనాథుడిని అర్చనారూపమైన ఒక ప్రత్యేక దైవంగా గాక సకల జగత్తును రక్షించే దేవాదిదేవునిగా పూజించాడని తెలుస్తుంది.

నాచన సోమన తన ఉత్తర హరివంశం రచించడానికి గల కారణం ఎర్రన రచించిన హరివంశం అని కొందరి విమర్శకుల పేర్కొంటున్నారు. "సోముడే హరివంశమును జూచి యుండిరి. చూచినాడు కావుననే మరల హరివంశమును సమగ్రముగ నాంధ్రీకరించుటకు వ్యర్థమని సోమన యూహించియుండును. హరివంశము నందలి కొన్ని గాథలను మాత్రము గైకొని తానొక విశిష్ట గ్రంథమును రచించెను. అయ్యది మాత్రాన ఇతర గ్రంథముకంటె శ్రేష్ఠతరమని చూపుటకయి దానికి కుత్తర హరివంశమని భేదించెను." (పైదే, పుట.49-50.) నాచన సోమన కంటే ముందే ఎర్రన హరివంశం రచించాడు కాబట్టి ఎర్రన హరివంశం అయిదు పది సంవత్సరాల వ్యవధి అయినా ఉంటుంది. ఎర్రన హరివంశం క్రీ.శ. 1330-1335 సంవత్సరాల మధ్య అయితే నాచన సోమనాథుడి ఉత్తర హరివంశ రచనా కాలం క్రీ.శ. 1340-1345 మధ్య ఉంటుంది. ఏమైనప్పటికీ ఎర్రన రచించిన హరివంశాన్ని చూసి ఉండటమో లేక చదివి ఉండటమో జరిగి ఉంటుంది. ఫలితంగా ఉత్తర హరివంశ రచన జరిగి ఉంటుందని భావించవచ్చు.

### 4.1.2. ఆంధ్రమహాభాగవతం-పోతన

ఆంధ్రమహాభాగవతాన్ని పోతనతో పాటు ఇతరులు కూడా రచించారని పరిశోధకులు ఇప్పటికే నిర్ణయించి ఉన్నారు. దానికి గల కారణాలను పరిశీలించారు. ఆంధ్ర మహాభాగవతంలో పంచమ, షష్ఠమ స్కందాలు, ఏకాదశ ద్వాదశ స్కందాలు పోతన రచించినవి కావని పండితుల అభిప్రాయం. పంచమ స్కందాన్ని రచించిన కవి బొప్పనమాత్యుని కుమారుడైన గంగయ అని, షష్ఠమస్కంద కర్త ఏర్చూరి కనవయ కుమారుడైన సింగయ అని, ఏకాదశ, ద్వాదశ స్కందాలను రచించింది పోతనామాత్యుని

శిష్యుడైన వెలిగందల నారయ అని పండితులు నిర్ణయించారు.

కానీ ఆంధ్రమహాభాగవతం పేరు చెప్పగానే స్ఫురించే పేరు మాత్రం పోతనదే. ఇక పోతన స్థల, కాలాదులపై ఇప్పటికే చర్చ జరిగింది. కాబట్టి ఆ అంశాలను ఇక్కడ ప్రస్తావించదలచుకోలేదు. పోతన భాగవతాన్ని రచించడానికి గల చారిత్రక నేపథ్యాన్ని మాత్రమే ఇక్కడ వివరించదలుచుకున్నాను. పోతన కాలంలో కవులు రాజుల మెప్పు కోరి, కావ్యాలను రచించి, వారికి అంకితమిచ్చి ఆర్థిక సహాయం పొందేవారని పోతన పద్యం ద్వారా తెలుస్తూ ఉంది.

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి, పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని, సొక్కి శరీరము బాసి, కాలుచే
సమ్మెట వాటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్" (పోతన: శ్రీ మహాభాగవతము, 1-11,)

పోతన భాగవతం రచించేనాటికి తన గ్రంథాన్ని రాజులకు అంకితం ఇవ్వడం నచ్చక, ఆత్మవిశ్వాసం కలవాడయ్యాడు. కవులు తమ కావ్యాలను రాజులకు అంకితమివ్వడం పడుపువృత్తిగా భావించి, అలాంటి పడుపు కూడు తినడం కన్నా అడవిలో కందమూలాలు తినో, వ్యవసాయం చేసో తన భార్యాపిల్లలను పోషించవచ్చని భావించాడు. పోతన తీసుకొన్న ఈ నిర్ణయం వెనుక సరైన కారణం లేకపోలేదు. దానికి గల కారణం పోతన పొందినటువంటి చేదు అనుభవాలు. పోతన కూడా మొదట రాజాశ్రయానికి ప్రయత్నించిన వాడు. అతడు మొదటి రచనగా భావిస్తున్న భోగినీ దండకం రాజుకు అంకితమిచ్చినటువంటిదే. పలువురు విమర్శకులు భోగినీ దండకం పోతన రచించినదేనని పేర్కొన్నారు. అనంతరకాలంలో కూడా రాజాశ్రయానికి ప్రయత్నించి, అందులో పోతన సఫలీకృతుడు కాలేక పోయాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు. తన ప్రతిభా పాండిత్యాలను గుర్తించకుండా, తనను నిరాదరించిన రాజులపై విరక్తి చెందాడు. వారి పట్ల ద్వేషభావంతో తన రచనలను వారికి అంకితమిచ్చి, వారిని యాచించకూడదనుకున్నాడు. తరువాత జీవనాధారం కోసం వ్యవసాయ వృత్తిని

అవలంబించినట్లు తెలుస్తుంది.

పోతన గారు కూడా తన మతాన్ని మార్చుకొని అద్వైతిగా మారారు. ఈ విషయం పోతన రచన ద్వారా తెలుస్తుంది. అతడు తన తల్లిదండ్రులను గురించి వివరిస్తూ

"కౌండిన్యగోత్ర సంకలితుడాపస్తంబ సూత్రుండు పుణ్యుండు సుభగుడైన
భీమనమంత్రికి బ్రియపుత్రుండన్నయ కలకంఠి తా్భార్య గౌరమాంబ
కమలాపు వరమున గనిన సోమనమంత్రి వల్లభ మల్లమ వారి తనయు
డెల్లన, యతనికి నిల్లాలు మాచమ, వారిపుత్రుడు వంశవర్ధనుండు
లలిత మూర్తి బహుకలానిధి కేసన,
దానమాననీతిధనుడు ఘనుడు
దనకు లక్కమాంబ ధర్మగేహిని గాగ
మనియెశైవశాస్త్రమతముగనియె."
"ఆ మానినికుదయించితి,
మేమిరువుర మగ్రజాతుడీశ్వరసేవా
కాముడు తిప్పన; పోతయ
నామవ్యక్తుండ సాధునయయుక్తుండన్" (పైదే, 1-22, 25,)

అని తన పూర్వీకులు తన తల్లిదండ్రులు శైవ మతాన్ని అనుసరిస్తున్నట్లు పేర్కొన్నాడు. పోతన కూడా మొదట శైవమతాన్ని అనుసరించాడని, అతను శైవుడుగా ఉన్నప్పుడు రచించిన రచన భోగినీ దండకమని కొందరు విమర్శకులు అభిప్రాయపడ్డారు. తరువాత అద్వైతమతాన్ని స్వీకరించి ఆంధ్రమహాభాగవతాన్ని రచించినట్లు గ్రంథ పీఠిక ద్వారా తెలుస్తున్నది.

"చేతులారంగ శివుని బూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని
దయయు సత్యంబు లోనుగా తలపడేని

గలుగ నేటికి దల్లుల కడుపు చేటు!" (పైదే, 1-12,) ఇక్కడ శివకేశవులకు అభేదం చెప్పడం ద్వారా పోతన భాగవత రచనకాలం నాటికి అద్వైతి అని చెప్పవచ్చు.

కాని ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పోతన శివుడిని గురించి ప్రార్థిస్తే శ్రీరామచంద్రుల వారు ప్రత్యక్షమవ్వటం. శ్రీమన్నారాయణుడి కథ రాయడానికి శివుడిని ప్రార్థించాడు. "మదీయ పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచ విరచనా కుతూహలుండనై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకంగని సజ్జనాను మతంబున నభ్రంకష శుభ్ర సముత్తుంగభంగ యగు గంగకుం జని క్రుంకులిడి వెడలి, మహనీయ మంజుల పులినతలంబున మహేశ్వర ధ్యానంబు సేయుచు గించుదున్మీలితలోచనుండనై యున్నయెడ," (పైదే, 1-15,) అని ప్రార్థించిన తనకు "ఏను నారాజశేఖరుండేటిచూచి భాషింప యత్నింప సేయునెడ, నతండు దా 'రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబు దెనుంగు సేయుము. నీకు భవబంధములు దెగు' నని యానతిచ్చి తిరోహితుండయిన సమున్మీలితనయుండనై వెఱగు చిత్తంబున," (పైదే,1-17.) అని శ్రీరాముడు పోతనకు చెప్పి అదృశ్యమయ్యాడు. జీవితానికి సార్థకత అయింది భాగవత రచన అని భాగవతాన్ని రచించే కుతూహలంతో పోతన శివున్ని ప్రార్థిస్తే శివుడు కాక శ్రీరాముడు ప్రత్యక్షమయ్యాడు.

'చేతులారంగ శివుని బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడునడేని
దయయు సత్యంబులోనుగా దలపడేని
గలుగ నేటికి దల్లుల కడుపు చేటు' (పైదే,1-12.) అని చాటి చెప్పడం ద్వారా శివుడు, విష్ణువులకు అభేదం చెప్పడం అనేది బహుశా ఈ సంఘటనకు కారణం కావచ్చు. అప్పటికే హరిహరాభేదంతో రచనలు వెలివడి ఉన్నాయి. బహుశ ఆ రచనల ప్రభావాన్ని కూడా గమనించి ఉంటాడు. సమాజంలో వస్తున్న మార్పులను గుర్తించి అందుకు అనుగుణంగా మారి సమాజ శ్రేయస్సుకు తన వంతు కర్తవ్యాన్ని కూడా చేయటానికి పూనుకొని ఉంటాడు. అందుకే శివకేశవులకు అభేదంగానే రచనలో చెప్పాడు.

భాగవతం రచించేనాటికి పోతన ముక్తి సంపదను ఆశించాడు. అందుకే శరీరం శాశ్వతం కాదని, మోహం విడనాడి పరిశుద్ధమైన మనస్సుగల మునితత్త్వం గలవాడుగా కనిపిస్తాడు. కావున "శ్రీకైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్" అని భాగవతారంభంలోనే, భాగవతాన్ని రచించడానికి గల కారణాన్ని తెలిపాడు. అంతేకాకుండా భాగవతాన్ని "పరమార్థ భూతమైనటువంటిదని, అధిక సుఖదమని, (1-34,), వేదకల్పవృక్షం నుండి రాలినదని (1-35,) శ్రీమంతమైనది, ముని శ్రేష్ఠకృతమైనది, సద్భక్తితో వినగోరు వారి విమల చిత్తంలో ఈశుని కనుగొన గలిగిందని (1-34,) భాగవతము కోర్కెలు తీర్చే కల్పవృక్షమని (1-22) పరివిధాలుగా స్తుతించాడు.

పోతన తరువాత కొన్ని భాగాలను పూరించినవెలిగందల నారయ, గంగయ, ఏర్చూరి సింగయలు మాత్రం పూర్తిగా వైష్ణవులు అయినట్లు తెలుస్తుంది. "ఇందు పంచమ షష్ఠ స్కంధములు, ఏకాదశ ద్వాదశ స్కంధములు తప్ప తక్కిన భాగమంతయు బోతన రచనయే. ఈ భాగములందీతడద్వైత దృష్టితోనే రచన సాగించినను నాతని తర్వాత నాయా భాగములకు గ్రమముగా బూరించిన సింగన, గంగనలును, వెలిగందల నారయయును విశిష్టాద్వైత మతమున కనుకూలముగనే రచన సాగించి రనవచ్చును."(ఆనందమూర్తి, వేటూరి: వైష్ణవాంధ్ర వాఙ్మయము, పుట.134.)

ఇక పోతన స్థల, కాలదుల విషయంలో భిన్న అభిప్రాయాలున్నప్పటికీ భాగవతాన్ని పూరించిన తక్కిన కవులు మాత్రం ఓరుగల్లు పరిసర ప్రాంతాలకు చెందిన వారని విమర్శకుల అభిప్రాయం. "భాగవతము నందు గొన్ని స్కందములు రచించినట్టి గాని, గ్రంథపాఠములను బూరించినట్టిగాని కవులందరు నోరుగల్లు చుట్టుపక్కలవారే. పోతరాజు శిష్యుడగు వెలిగందల నారయకవి కరీంనగరము మండలములోని వెలిగందల నివాసి. ఏకాదశ ద్వాదశ స్కందములను దిరిగి రచించిన హరిభట్టారకుడు తెలంగాణము నందలి కంభంమెట్టు నివాసి. దశమస్కంధ భాగమును వెలిగందల నారయకు ముందు ద్విపదగ వ్రాసిన మడికి సింగన యోరుగంటికి నేబదిమైళ్ళలో నున్న రామగిరివాసి."

(శ్రీరామమూర్తి, ధూళిపాళ: శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము, పుట.3-4.) వీరిలో కొందరూ పూర్తిగా విశిష్టాద్వైతాన్ని అనుసరించారని పరిశోధకులు తెలిపారు. "నారపరాజు పోతన గారికి ప్రియశిష్యుడనని చెప్పుకొనియున్నాడు. అతనికి గురుభక్తి మిక్కుటము. అతడు విశిష్టాద్వైతి. విశిష్టాద్వైత సిద్ధాంతము నందు నతనికి మిక్కిలి భక్తి కలదు. ఈ రెండు లక్షణములు నతని పూర్ణ లక్షణములను దీర్చినట్టిరి." (పైదే, పుట.58.) మొదట రాజులను నిరసించి, ఆత్మాభిమానాన్ని నిలుపుకొని, కేవలం భగవద్ భక్తికి మాత్రమే పరిమితమై ప్రారంభించిన భాగవతం ఏకారణం వల్లనో కొన్ని స్కందాలు ఇతరుల చేత పూర్తి చేశారు. అయితే అద్వైతిగా పోతన భాగవతం ప్రారంభించినప్పటికీ భాగవతం మాత్రం విశిష్టాద్వైతులతో పూర్తిచేసినట్లు కనిపిస్తుంది.

### 4.1.3. మొల్ల రామాయణము-మొల్ల

కవులు రచించిన పేరుమీద రామాయణాలున్నట్లు మొల్ల రచించిన రామాయణానికి మొల్ల రామాయణం అనే పేరుతో ప్రసిద్ధిలో ఉంది. మొల్లను గురించిన చర్చ ఇప్పటికే జరిగి ఉంది. మొల్ల తండ్రి ఆతుకూరు కేసనశెట్టి శివభక్తిపరుడని గ్రంథాలలో ఉంది. మొల్ల రచించిన రామాయణం ద్వారా ఆమె రామభక్తురాలు అనే విషయం తెలుస్తుంది. అయితే ఈమె శివభక్తురాలు కూడా అనేది గ్రంథారంభంలో ఆమె కావించిన శ్రీశైల మల్లికార్జున స్తుతి తెలియచేస్తుంది.

"శ్రీనగమందిరుం డమరసేవితు డర్థశశాంకమౌళి స
న్మౌనిమనఃపయోజదిన నాయకుడబ్జభవామరేశ్వర
ధ్యానలసత్ప్రసన్న డతిధన్యుండు శేషవిభూషణుండు వి
ద్యానిధి మల్లికార్జునుండు తానిడు మాకు శుభంబు లొప్పగన్" (మొల్ల, ఆతుకూరి: మొల్ల రామాయణము, 1-2.)

ఈ పద్యం ద్వారా మొల్ల రామాయణాన్ని రచించినప్పటికీ, రామ భక్తురాలైనప్పటికీ పూర్వ కవుల పద్ధతిని అనుసరించినట్లు కనిపిస్తుంది. అంటే మొల్ల

కూడా కూడా హరిహరులందు అభేదా భావం కలదని తెలుస్తుంది. ఈ విధానం అప్పటికే పలువురు కవులు ఈ విధానాన్ని అనుసరించి ఉన్నారు. అప్పటికే పలువురు కవులు రామాయణాన్ని రచించారు. కాని వారు రచించినప్పుడు ఉన్న సామాజిక పరిస్థితులు వేరు. అప్పటి పరిస్థితుల నేపథ్యంతో రామాయణం రచించబడింది. కాని మొల్ల రామాయణాన్ని రచించేనాటికి పరిస్థితులు మారిపోయాయి. అప్పటికే ప్రముఖ కవులు అద్వైతాన్ని అవలంబిస్తున్నట్లు కనిపించడం వల్ల మొల్ల కూడా వారిని అనుసరించి హరిహరుల అభేదాన్ని తెలిపే విధంగా శివున్ని కూడా స్తుతించింది. అందుకే తన రచనలో గోపెవరపు శ్రీకంఠ మల్లేశు వరం చేత కవిత చెప్పడం నేర్చుకొన్నట్లు గ్రంథంలో చెప్పుకొన్నది.

"దేశీయ పదములు దెనుగులు సాంస్కృతుల్
సంధులు ప్రాఙ్జుల శబ్ద వితతి
శయ్యలు రీతులు జాటు ప్రబంధంబు
లాయా సమాసంబు లర్థ దృష్టి
భావార్థములు గావ్య పరిపాకములు రస
భావ చమత్కృతుల్ పలుకు సరవి
బహు వర్ణములును విభక్తులు ధాతుల
లంకృతి చ్ఛందో విలక్షణములు

గావ్య సంపద క్రియలు నిఘంటువులును
గ్రమము లేవియు నెఱుగ, విఖ్యాత గో
పవరపు శ్రీకంఠమల్లేశువరముచేత
నెఱిగవిత్వంబు జెప్పగా నేర్చుదాన" (మొల్ల: మొల్లరామాయణం, 1-12.)

ఈ గోపవరం నెల్లూరు మండలంలోనిదని చరిత్రకారులు రాశారు. ఈమె కాలం గురించి కూడా అనేక చర్చలు జరిగాయి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు మొల్ల కాలాన్ని గూర్చి ఈ క్రింది అభిప్రాయాన్ని పేర్కొన్నారు. "మొల్ల శ్రీనాథుని కాలమునకు

దరువాత నున్నదనుటకు సందేహము లేదు. ఈమె కృష్ణదేవరాయల కాలములోని యల్లసాని పెద్దనాదుల నెవ్వరిని స్తుతియించి యుండక పోవుటచేత మొల్ల యాకాలమునకెంతో తరువాతిది కాదనియు స్పష్టపడుచున్నది." (వీరేశలింగం, కందుకూరి: ఆంధ్ర కవుల చరిత్రము, పుట.89.)

మొల్ల తన రచన చేయడానికి గల కారణాన్ని కూడా పేర్కొని ఉంది. ఆమె రామాయణాన్ని రచన చేసేనాటికే శ్రీరామకథ లోకంలో ప్రసిద్ధి చెంది ఉంది. అయినప్పటికీ తాను మళ్ళీ రామకథనే కావ్య వస్తువుగా స్వీకరించడానికి గల కారణాన్ని వివరిస్తూ

"ఆది రఘురాము చరితము
నాదరముగ విన్న గ్రొత్తయై లక్షణసం
పాదమ్మై పుణ్యస్థితి
వేదమ్మై తోచకున్న వెఱ్ఱినె చెప్పన్.
రాజిత కీర్తియైన రఘురామ చరిత్రము మున్ గవీశ్వరుల్
తేజమెలర్పజెప్పిరని తెల్సియు గ్రమ్మఱ జెప్పనే?లనన్
భూజన కల్పకంబగుచు, భుక్తికి ముక్తికి మూలమంచు,నా
రాజును దైవమైన రఘురామునుతించిన దప్పుగల్గునే." (పైదే. 1- 20, 21)

అని వివరించింది. మొల్ల శ్రీరాముడిని ముక్తి ప్రసాదించు దైవంగా భావించినట్లు ఈమె రచనద్వారా తెలుస్తుంది. రాముని కృపకు చదువులు ముఖ్యం కావని, భక్తే మూలమని తలచి అట్టి శ్రీరాముని కథగాక ఇతరమైన దానిని ఎలా రచిస్తానని తన రచనను సమర్థించుకొన్నది. భక్తి వినయాలే ప్రధానమని ప్రకటించింది.

రచనలో మరొక అంశం భక్తి. ఈమె శివుని వరం వలన కవితనేర్చుకొని రామభక్తి యేర్పడి రామాయణాన్ని రచించి రామునికి అంకితం చేసినట్లు పీఠికలో ఉంది. ఈ విషయాన ఈమె పోతనా మాత్యుని అనుసరించింది. పరమేశ్వర కరుణచేత కవిత

చెప్పిన పోతన రామభక్తుడై భాగవతాన్ని రామాంకితం చేశాడు. "చెప్పుమని రామచంద్రుడు చెప్పించిన పలుకు మీద జెప్పద' నని మొల్ల చెప్పుటం పోతన పద్యానుకరణమే. పోతన కవిత పట్ల మొల్లకు ప్రీతి ఎక్కువగా ఉన్నాట్లుగా ఉంది. ఇక్కడ మరొక విషయం హరిహరాభేద భావన. శివుడి ద్వారా వైష్ణవ రచన చేయటం అనేది హరిహరాభేద భావమే.

## 4.2. ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవ సంబంధమైన రచనలు చేసినకవులు

ఇక్కడ కవి ఇతరుల ప్రమేయంతో వైష్ణవ సంబంధమైన రచన చేసినట్లు కనిపిస్తుంది. ఇందులో అవసరమైతే తన మతాన్ని మార్చుకొని వైష్ణవ సంబంధమైన రచన చేసినట్లు కనిపిస్తుంది. ఇక్కడ ఇటువంటి రచనలు చేయడానికి ప్రధాన కారణం కవులు ఇతరుల నుంచి ప్రయోజనాలను ఆశించడమే.

### 4.2.1. నిర్వచనోత్తర రామాయణము - తిక్కన

ఇతరులకోసం కవి వైష్ణవమత రచన చేసినవాటిలో తిక్కన నిర్వచనోత్తర రామాయణం ఒకటి. శైవుడైన తిక్కన మనుమసిద్ధికి సందేశాన్ని ఇవ్వదలచి నిర్వచనోత్తర రామాయణాన్ని రచించినట్లు పేర్కొంటారు. తిక్కన మొదటి రచన నిర్వచనోత్తర రామాయణం. ఇది మనుమసిద్ధి రాజుకు అంకితం ఇవ్వబడింది. శైవుడైన తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని రచించడానికి గల కారణం తనరాజుకు తనతోగల సన్నిహిత సంబంధం. తిక్కన తాను శైవుడైనప్పటికీ మనుమసిద్ధితో తనకు గల సన్నిహిత సంబంధం వలన విష్ణుసంబంధమైన రచనకు పూనుకొన్నాడు. "నిర్వచనోత్తర రామాయణము రచించేనాటికి తిక్కన తానెంత వైదిక మార్గప్రవర్తకుడైయున్నను శివభక్తిపరాయనుడై యుండెను" (వీరభద్ర రావు, చిలకూరి: తిక్కన సోమయాజి, పుట.95.) ఇతడు నిర్వచనోత్తర రామాయణం రచించేనాటికి శివభక్తుడని నిర్వచనోత్తర

రామాయణములోని ఈ కింది పద్యం ద్వారా తెలుస్తుంది.

"అమలోదాత్తమనీషనే నుభయ కావ్య ప్రౌఢి బాటించుశి

ల్పమునం బారగుడం గళావిదుడ నాపస్తంబసూత్రుండగౌ

తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండన

న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుడదిక్కాంకుండ సన్మాన్యుడన్" (తిక్కన: నిర్వచనోత్తర రామాయణము, 1-13.) నిర్వచనోత్తర రామాయణము రచన వెలువడటానికి ప్రధాన కారణంగా పేర్కొనదగింది మనుమసిద్ధి రాజుకు తిక్కనద్వారా కావ్యాన్ని అంకితం తీసుకోవాలనుకోవడం. తిక్కన మనుమసిద్ధి రాజుకు ఇవ్వదలచిన సందేశాత్మక ఆలోచన ఇవ్వడానికి నిర్వచనోత్తరరామాయణాన్ని రచించినట్లు పేర్కొంటారు. తాను శైవుడయినప్పటికి రామాయణ ఇతివృత్తంతో రచన చేయడానికి గల కారణం ఆనాటి పరిస్థితులు. తిక్కన కాలానికి శైవకవుల ప్రభావం కొనసాగితూనే ఉంది. అదే విధానాన్ని తిక్కన కూడా అనుసరించక రాజుకు సందేశాత్మక ఆలోచన కలిగించడానికి నిర్వచనోత్తర రామాయణం రచించాడు.

తిక్కన నిర్వచనోత్తర రామాయణ రచనకు పూర్వ పరిస్థితుల గురించి పూర్వ అధ్యాయంలో 'తిక్కన భారత రచన' అనే సందర్భంలో పేర్కొనడం జరిగింది. మనుమసిద్ధి కాలం నాటికి రాజ్యంలో సుస్థిరత లోపించి శత్రువుల విజృంభన ఎక్కువైంది. నలువైపుల నుంచి కూడా రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ సమయంలో మనుమసిద్ధి దాయాదులుగా పరిగణింపబడుతున్న అక్కన, బయ్యన అనే వారు మనుమసిద్ధిని పారద్రోలి రాజ్యాన్ని ఆక్రమించారు. మనుమసిద్ధి రాజ్యాన్ని కోల్పోయాడు. ఆనాడు తనకు సన్నిహితుడుగా ఉన్న తిక్కనను కాకతీయుల సహాయార్థం రాయబారం పంపగా, తిక్కన తన పాండిత్య ప్రతిభతో కాకతీయ గణపతి చక్రవర్తిని మెప్పించాడు. కాకతీయ గణపతి చక్రవర్తి తన సైన్యాలను పంపి అక్కన, బయ్యనలను రాజ్యం నుంచి పారద్రోలి, ఆ రాజ్యాన్ని, మరికొంత భాగాన్ని కలిపి మనుమసిద్ధికి అప్పగించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తూ ఉంది. దీని ద్వారా తిక్కన

మనుమసిద్ధి రాజ్యంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తుంది. "తిక్కన చలువ వలన మనుమసిద్ధి సింహాసనమున పునః ప్రతిష్ఠుడైనాడు. సిద్ధేశ్వర చరిత్ర యందలి కళ, సోమదేవరాజీయ కథ అందులకు సాక్షులై నిలుచుచున్నవి. పట్టాభిషేక సమయమున తిక్కన మనుమసిద్ధిని ఆశీర్వదించినాడు. శోకఃశ్లోకత్వ మాగతః యనినటుల, ఆనందాతిరేకముచే ఆనందసాంద్రమైన శ్లోకమే తిక్కన నోటి నుండి వెలివడియుండును" (తిక్కన: నిర్వచనోత్తర రామయణము, పీఠిక-vi.) అని ఉత్పల వేంకట నరసింహాచార్యులు పేర్కొన్నారు.

తిక్కన మనుమసిద్ధిని ఆశీర్వదించిన శ్లోకం

'శ్రీరాస్తాం మనుమక్షి తీశ్వర భుజాస్తమ్భే జగన్మణ్డల

ప్రాసాద స్థిరభారభాజి దధతీసా సాలభఞ్జీశ్రియం

శుణ్డాలోత్తమగణ్డభిత్తుషు మదవ్యాసఙ్గవశ్యాత్మనాం

యాముత్తేజయ తేతారాం మధులిహా మానన్ద సాన్ద్రా స్థితిః" (పైదే i -1 )

ఈ ఆశీర్వచన శ్లోకం మనుమసిద్ధికి ఎప్పటికీ నిలిచే విధంగా తిక్కన పలికాడు. ఇది మనుమసిద్ధికీ ఎప్పటికీ గుర్తుంటుంది. మనుమసిద్ధి తన స్నేహం శాశ్వతంగా నిలుస్తుందని భావించి తన ఆశయ సిద్ధికై తిక్కనతో ఈ కింది విధంగా పలికాడు.

'ఏ నిన్ను మామయని యెడు,

దీనికి దగ నిమ్ము భారతి కన్యక నా

కీ నర్షుడు వగుదనినను,

భూనాయకుపల్కు చిత్తమున కింపగుడున్' (పైదే i -3)

అని మనుమసిద్ధి తిక్కనను అడిగినట్లుగా నిర్వచనోత్తర రామయణంలో ఉంది. మనుమసిద్ధికి తిక్కనకు మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వలన తగిన సమయం కోసం ఎదురు చూస్తున్న మనుమసిద్ధి తిక్కన మంత్రిని చనువుచేత తనను కృతిపతిని చేయవలసిందిగా కోరాడు. అది ఆజ్ఞ కాకున్న, విజ్ఞాపనమైన రాజు కోరిక కాబట్టి తిరస్కరించడానికి వీలులేనిది. దానికితోడు చెలిమికూడా కలిసివుంది. ఇక ఇటువంటి

సమయంలో అతనికి అంకితం ఇవ్వవలసిన రచనను అన్ని విధాలుగా అలోచన చేసి రచించవలసి ఉంటుంది.

అప్పటికే రాజులు సూర్యవంశం వారని, చంద్రవంశం వారని పేర్కొని వారి వంశానికి చెందిన రాజులుగా చెప్పుకోవడం జరుగుతూ ఉంది. ఇటువంటి సమయంలో మనుమసిద్ధి రాజుకు ఆదర్శప్రాయుడైన రాజుకు సంబంధించిన చరిత్ర చెప్పవలసిన అవసరం ఉందని భావించి ఉంటాడు. అందుకు సూర్య వంశ ప్రభువైన శ్రీరాముని చరిత్ర రచించడం సరైందని తలచాడు. ఇక రామాయణ మొత్తం రచించాలంటే చాలా సమయం పడుతుంది. అది ఒక భారీ ప్రణాళికగా తయారవుతుంది. తిక్కన అప్పటికే రాజ్యానికి సంబంధించిన రాజకీయాలలో కీలక పాత్రపోషిస్తున్నాడు. అంటే అప్పటికే మంత్రి, దండనాథ పదవులు కూడా నిర్వహిస్తున్నాడు. మనుమసిద్ధి కూడా కొత్తగా రాజైనాడు. కాబట్టి గ్రంథ రచన తొందర పూర్తవ్వాలి. ఇక తన రచన కూడా మనుమసిద్ధికి ఉపదేశం ఇచ్చేలా ఉండాలి. కాబట్టి కొత్తగా రాజైన మనుమసిద్ధికి ప్రభువైన శ్రీరామచంద్రుని పరిపాలన ఆదర్శంగా నిలపాలి. అందుచేత "శ్రీరాముని ధీరోదాత్తత యొట్టి యుత్సాహశక్తి లక్షణ లక్షితమైనదనియు చూపుటను ప్రధానముగా పెట్టుకొన్న గ్రంథము" (వెంకట రామకోటి శాస్త్రి, కేతవరపు: తిక్కన కావ్యశిల్పము, పుట.46.)గా తిక్కన రచించాలనుకున్నాడు. కాబట్టి శ్రీరామచంద్ర ప్రభువు లక్షణాలన్నీ పరోక్షంగా మనుమసిద్ధికి గుర్తుచేస్తున్నాడు.

ఇక తిక్కన రామాయణంలోని ఉత్తర భాగాన్నే తన రచనకు తీసుకొన్నాడనే విషయలో కూడా పరిశోధకుల మధ్య భిన్నభిప్రాయాలున్నాయి. కొందరు అప్పటికే తిక్కన తాతగారు రామాయణాన్ని రచించారని కూడా పేర్కొన్నారు. కాని అది ప్రస్తుతం అలభ్యం. కేవలం శ్రీరాముని గొప్పదనం తెలిసే భాగాన్ని మాత్రమే రచించాలనుకొన్నాడని మరొక అభిప్రాయం ఉంది. "శ్రీరాముని ఉత్తమ ధరణీ పతిత్వ

ప్రతిపాదికము ఉత్తరకాండ. పూర్వరామాయణములో రాముని రాజ్యపాలనాంశమున కవకాశము లేదు. అతని ఉత్తమ పాలకత్వము ఉత్తర రామాయణము నందే గోచరించును. అందువలననే సీత భూమిలో ప్రవేశించు వరకే కథను స్వీకరించినాడు. పైగా జనహృదయనంద జనకమై నెగడుట ప్రభువునకు ముఖ్యముగా కావలసిన లక్షణము. అది లేని ప్రభువుకు పతనము తప్పదు. శ్రీరాముడన్నచో ప్రజల వాక్యమునకు విలువ నొసగి ప్రాణమునకు ప్రాణమైన అర్థాంగిని అడవులపాలు చేసినాడు. ప్రజల వాక్యమున కాతడొసగిన గౌరవ మంతటిది. ప్రజల కొరకే ప్రభువు కాని భోగములకు కాదని లోకమునకు చాటినవాడు శ్రీరామచంద్రుడు. శ్రీరామచంద్రుని రాజ్యపరిపాలనా విధానమునే మనుమసిద్ధికి ఆదర్శముగ నిలుపదలిచినాడు తిక్కన". (వీరాంజనేయశర్మ, అవంచ: తిక్కన నిర్వచనోత్తర రామాయణ సమాలోచనము, పుట.17-18.)

ఉత్తర రామాయణ రచనకు గల కారణం నిర్వచనోత్తర రామాయణ అవతారికలో కనిపిస్తుంది.

"సకల లోక ప్రదీపకుడగుపద్మనీ, మిత్రవంశమున జన్మించెననియు
జూచిన మగలైన జొక్కెడునట్టిసౌం, దర్యసంపదసొంపుదాల్చెననియు
జనహృదయానంద జనకమైనెగడిన, చతురతకల్మిన ప్రతిముడనియు
మెఱసి యెండొంటికి మిగులు శౌర్యత్యాగ, విఖ్యాతకీర్తులవెలసెననియు

వివిధ విద్యాపరిశ్రమ వేదియనియు
సరస బహుమానవిరచనాశాలియనియు
మత్కృతీశ్వరుడగుచున్నమనుమనృపతి
సుభగు గావించుటకు సముత్సుకుడనైతి" (తిక్కన: నిర్వచనోత్తర రామాయణము, 1-4.)

ఈ పద్యంలో సూర్యవంశంలో జన్మించుట, సౌందర్యాన్ని కలిగి జన

హృదయానందమై  సౌర్యం, త్యాగం ఒక దానితో ఒకటి పోటీపడి ప్రసిద్ధి కలిగినటువంటి లక్షణాలతో పాటు వివిధ విద్యా పరిశ్రమ వేదిత మొదలైన లక్షణాలు మనుమసిద్ధిలో ఉండటం వలన, అవి శ్రీరాముని లక్షణాలలో కొన్ని అని తెలిపి  మనుమసిద్ధిని కృతిపతి చేయటం తిక్కన ఆశయమైనట్లు తెలుస్తోంది. శ్రీరాముని ధర్మపాలన మనుమసిద్ధికి ఆదర్శంగా చూపటానికి తిక్కన ప్రయత్నించి,  ఉత్తర రామాయణాన్ని కావ్యారచనకు కారణంగా భావించడంలో అతిశయోక్తి కనిపించదు. దీనికితోడు నాడు ఉన్న పరిస్థితులకు అనుకూలంగానే ఆనాడు నిర్వచనోత్తర రామాయణం వెలువడినట్లు ఊహించవచ్చు.

సాహిత్య పరంగా చూస్తే నిర్వచనంలో రామాయణాన్ని రాయడం అన్నది ఆనాడు తిక్కన తన ప్రత్యేక శైలిని ప్రదర్శించడానికి నిర్వచనంలో రామాయణాన్ని రాశాడని సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు.  నన్నయ్య చంపూ పద్ధతిని ప్రారంభించగా, శివకవులు ద్విపద ఛందస్సులో రచించారు.  తిక్కన తన ప్రత్యేకతను నిలుపుకోవడానికి ఒక ప్రయోగంగా  నిర్వచనంలో రామాయణాన్ని రచించాడని భావించవచ్చు. ప్రతి రచయిత తనదైన ఉనికిని, శైలిని ఉండాలని కోరుకుంటాడు. అలా ఆ ప్రయత్నంలో భాగంగా వచ్చిందే నిర్వచనోత్తర రామాయణం రచన అని ఊహింపవచ్చు.

### 4.2.2. హరివంశము-ఎర్రన

ఇతరుల కోసం వైష్ణవపరమైన రచన చేసినవారిలో ఎర్రనను కూడా పేర్కోవచ్చు. ఎర్రన హరివంశాన్ని  తన రాజు కోరిక మేరకు నాటి పరిస్థితుల వలన హరివంశాన్ని రచించినట్లు చెప్పవచ్చు. ఎర్రన రామాయణాన్ని రచించాడని, దానిని  వేమారెడ్డికి అంకితమిచ్చాడని పరిశోధకులు పేర్కొన్నారు. హరివంశాన్ని కూడా అతనికే అంకితమిచ్చాడు. ఈ వేమారెడ్డి అద్దంకిని రాజధానిగా చేసికొని రాజ్యాన్ని పరిపాలించినట్లుగా కింది పద్యం వలన తెలుస్తోంది.

"తనకు నద్దంకి తగు రాజధానిగాబ

రాక్రమంబున బహుభూములాక్రమించి

యనుజతనుజబాంధవమిత్రజనులకిచ్చె

నెదురెయెవ్వారు వేమభూవిశ్వరునకు." (ఎఱ్ఱాప్రెగడ: హరివంశము, 1-23)

చారిత్రకంగా కూడా రెడ్డి రాజులు మొదట అద్దంకిని రాజధానిగా చేసుకొని పరిపాలన ప్రారంభించి, అనంతర కాలంలో తమ రాజ్యాన్ని గుంటూరులోని కొండవీడు ప్రాంతానికి మార్చినట్లు ఉంది. ఎర్రన హరివంశ రచనకు కారణం వేమరెడ్డి కోరిక. ఎర్రన హరివంశములో వేమభూపాలుడు ఎర్రనతో

"భారత పరాంశమని యిం

పారగ జెప్పుదురు బుధులు హరివంశమునీ

వా రమ్యకథ దెనుంగుగ

ధీరోత్తమ! నిర్వహించె తెలుపుము మాకున్" - (పైదే, 1- 40) అని అడిగినట్లు ఉంది. ఆనాడు ఎర్రన రాజాశ్రయంలో ఉన్నాడు. కాబట్టి రాజు కోరిక ప్రకారం అతని అభిప్రాయాన్ని అనుసరించి హరివంశాన్ని రచించాలనుకున్నాడు. ఎర్రన ఈశ్వర భక్తుడని, శంభుదాసుడనే బిరుదును కలిగివున్నట్లు కూడా సాహిత్య రచనల ద్వారా తెలుస్తుంది. కాని హరివంశం మాత్రం వైష్ణవ సంబంధమైన రచనగా కనిపిస్తుంది. దానికి గల కారణం ఆనాడు నెలకొని ఉన్న పరిస్థితులే. నాడు సమాజంలో హరివంశం అంటే "భారతీయులనాదిగా నాచరించు సంప్రదాయములకు, ఆచారాలకు, వ్యవహారములకు ప్రతీకగా నిలిచినది భారతము. భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసములను ప్రతిబింబింప జేయునది" (గోదావరీబాయి, సంధ్యావందనం: ఎఱ్ఱయ తీర్చిన హరివంశము, పుట.5.) అనే అభిప్రాయం కలదు. అంతే కాకుండా "హరివంశము నందలి శ్రీకృష్ణుడు విష్ణుని యవతారము. ఇందలి శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహుడు. ఇది యొక ఉత్తమ తత్త్వమును ప్రతిపాదించు నుత్కృష్ట గ్రంథము" (పైదే, పుట-9.)

నాడు దేశంలో నెలకొన్న పరిస్థితులు కూడా హరివంశ రచనకు ప్రధానకారణం. ముస్లింల దండయాత్రల వలన కాకతీయ సామ్రాజ్యం అంతరించింది. కాకతీయ సామ్రాజ్య పతనం తరువాత దేశంలో అస్థిరత చోటు చేసుకొంది. ముస్లిం దండయాత్రలు పెరిగాయి. ప్రజలు అనేక రకాలైన  ఇబ్బందులకు గురయ్యారు. ముస్లింల చేత పీడించబడ్డారు. అప్పటివరకు కొనసాగుతున్న బ్రాహ్మణ సాంప్రదాయ విధానం, అగ్రహారాలు బ్రాహ్మణేతరుల చేత ఆక్రమించబడ్డాయి. దేవతా విగ్రహాలు, దేవాలయాలు కొల్లగొట్టబడ్డాయి. అంతటా భయానక వాతావరణం ఆవహించింది.

ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రదేశంలో చిన్నచిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటి లక్ష్యం ముస్లిం దండయాత్రల నుండి తమను, తమ ప్రజలను రక్షించు కోవడం. అటువంటి సమయంలో తెలుగు నేలను ముస్లింల ఆదిపత్యం నుంచి తప్పించిన వారిలో వేమారెడ్డి కూడా ఒకడని చరిత్రకారులు పేర్కొంటారు. ఇతడు తిరిగి హిందూ ధర్మరక్షణకు పూనుకున్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. దండయాత్రల్లో పాడైపోయిన దేవాలయాలు పునర్నిర్మించి, దేవతల ప్రతిమలు లేక పాడైపోయిన చోట దేవతల ప్రతిమలు పునః ప్రతిష్ఠ చేసాడు. యజ్ఞ యాగాదుల విధానాలు కొనసాగించాడు. ఒక విధంగా ఆ సమయంలో ప్రజలలో తిరిగి ఆస్థిక భావాలను నెలకొల్పవసిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఆస్థిక భావాలను నెలకొల్పడానికి సరైన సాధనం సాహిత్యం. ఆ ఆస్థిక భావాలను నెలకొల్పడానికి ఎర్రన ప్రయత్నించాడని, దానికి సాధనంగా హరివంశ రచనకు పూనుకున్నాడని విమర్శల రచనల ద్వారా తెలుస్తుంది. ఆస్తిక భావాన్ని స్థిరపరిచడానికి హరివంశాన్ని సాధనంగా చేసుకొన్నాడు. ప్రజలకు శాంతిని కలగచేసే గ్రంథంగా హరివంశాన్ని భావించాడు. తాను శివభక్తుడైనప్పటికీ విష్ణు సంబంధింతమైన రచనకు పూనుకొన్నాడు. దానికి గల కారణం అంతకు పూర్వం జరిగినటువంటి సాహిత్య విధానం.

ప్రజలలో నిరాశ కలిగినప్పుడు, నిరాశను తొలగించి భగవంతుడు తప్పక రక్షిస్తాడనే విశ్వాసాన్ని ప్రజలకు కలిగించడం అనేది అప్పటికే సాహిత్యంలో

కొనగాగుతున్న విధానం. నిరాశ తొలగందే మానవుడు ఉత్సాహం కలిగి కర్తవ్యాన్ని కొనసాగించలేడు. ఆనాటి సమాజంలో తిక్కన కాలం వరకు వీరశైవ మతం విజృంభించి అనేక ఘర్షణలకు దారి తీసింది. మతం పేరిట రక్తపాతాలు జరిగాయి. తిక్కన ఈ ఘర్షణల నుంచి సమాజాన్ని సరైన మార్గంలో పెట్టడానికి హరిహరాద్వైతమతాన్ని ప్రజలకు బోధించాడు. ఆంధ్ర మహాభారతాన్ని హరిహరుడుకి అంకితమిచ్చాడు. కాకతీయ సామ్రాజ్యంలో ఉన్న పరిస్థితులు తిరిగి పునఃస్థాపించవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలలో మత సమైక్యతను కల్పించవలసిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఆనాడు ప్రజలలో నాస్తికభావం పెరిగే స్థితి ఏర్పడింది. ప్రజలు ధన, ధాన్య స్త్రీ దేవతా దేవాలయ, దేవప్రతిమల్లో దేనిలో కూడా భక్తిభావం లేక మానసికంగా గొప్ప సంచలనాలకు గురియ్యారు. వారిలో దైవభక్తి ప్రేరేపింపవలసిన పరిస్థితి ఉండేది. ఆ కారణంతోనే ప్రోలయ వేమారెడ్డి ఎఱ్ఱనను హరివంశాన్ని రచించమని ప్రేరేపించినట్లు విమర్శకుల అభిప్రాయం. ఎఱ్ఱన కూడా రాజైన వేమారెడ్డి కోరికను పూర్తి చేయవలసిన కార్యంగా భావించాడు. ఎఱ్ఱన అదే దీక్షతో ప్రజలకు బోధించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ప్రోలయ వేమారెడ్డి శైవుడైనప్పటికీ పరమత సహనం కలవాడుగా చరిత్రద్వారా తెలుస్తుంది. ఈ హరివంశ రచన అనేది ప్రజలలో సమైక్యభావాన్ని కలిగించి ప్రజలను సంఘటిత పరచడానికి పాటుపడింది. హరివంశ రచన అవతారిక పద్యాల్లో కూడా ఆనాడు నెలకొని ఉన్న పరిస్థితులు కూడా కొన్ని అవగతమవుతాయి.

నాడు నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితులలో ముఖ్యమైంది రాజ్య స్థిరత్వం. ఆనాడు ప్రభువులు ముస్లింల దండయాత్రలతో నలిగి రాజ్య సుస్థిరతను కోల్పోయారు. వారికి సుస్థిరమైన రాజ్యం కావలసిన పరిస్థితులున్నాయి. కాబట్టి రాజును అస్థిర ప్రభుత్వం నుండి కాపాడి, సుస్థిరమైన ఐశ్వర్యాన్నిమ్మని శ్రీమహావిష్ణువును ప్రార్థించాడు.

"శ్రీ కిం బ్రేమ పదంబు భూమికి నతిస్నిగ్ధుండు దుగ్ధాబ్ధిశ
య్యాకేళీరతుడాదివేధకు గృహంబై యొప్పునాభిస్థనా

శీకంబుం గలవేల్పు లోకముల బాలింపం బ్రభుండుత్తమ

శ్లోకుండన్నమవేమభూవిభునకిచ్చున్ సుస్థిరైశ్వర్యముల్." (ఎఱ్ఱాప్రెగడ: హరివంశము i -1-1, ) అని హరివంశ రచనా ప్రేరితుడైన వేమారెడ్డికి మహావిష్ణువు సుస్థిరమైన ఐశ్వర్యాన్ని ఇమ్మని వేడుకొన్నాడు.

సృష్టికర్త బ్రహ్మ, ఆ సృష్టిని సుస్థిరంగా రక్షించేవాడు విష్ణువు. లయ కారకుడు శివుడు. సృష్టి స్థితి, లయలకు బ్రహ్మ విష్ణు మహేశులు అధిష్టాన దేవతలు. ఇక్కట సంరక్షకుడు విష్ణువు. అతని అవతారానికి సంబంధించిన చరిత్ర యిది. కనుక శ్రీహరే వేమభూపాలుని రాజ్య సంపదలను సుస్థిర పరచుగాక అని ప్రార్థించాడు. వేమారెడ్డి కోరిక మేరకు హరివంశ రచనకు పూనుకొని ఆ రాజ్య ప్రజలను తిరిగి ఆస్థికత్వం వైపు నడిపించడానికి ప్రయత్నించినవాడు ఎర్రన.

### 4.2.3. భాస్కర రామాయణము

భాస్కరరామాయణం రచన కర్తృత్వ విషయంలో అనేక వాదాలున్నాయి. ఈ వాదాలను ఇప్పటికే పలువురు పరిశోధకులు పరిశోధించారు. కాబట్టి ఇప్పుడు ఇక్కడ కర్తృత్వ విషయాన్ని గురించి చర్చించదలుచుకోలేదు. హుళక్కి భాస్కరుడు, మల్లికార్జునభట్టు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు అనే నలుగురు కలిసి భాస్కర రామాయాణాన్ని రచించినట్లు పరిశోధకులు నిర్ణయించి ఉన్నారు.

భాస్కర రామాయణంలో ఆరుకాండలున్నాయి. అందులో బాల, కిష్కింద, సుందరకాండలను భాస్కరుని పుత్రుడు మల్లికార్జునభట్టు, అయోధ్యాకాండను భాస్కరుని శిష్యుడు కుమారరుద్ర దేవుడు, అరణ్య కాండను, యుద్ధకాండంలో కొంతభాగాన్ని హుళక్కీ భాస్కరుడు యుద్ధకాండ శేషాన్ని భాస్కరుని మిత్రుడైన అయ్యలార్యుడు రచించారని పరిశోధకులు నిర్ణయించారు. అయితే భాస్కరుని ఆధ్వర్యంలో సాగిన రచన కాబట్టి ఈ కావ్యానికి భాస్కర రామాయణమనే పేరు స్థిరపడినట్లు తెలుస్తుంది. ఈ భాస్కర రామాయణాన్ని రచించిన వారు వైష్ణవ భక్తి

సంపన్నులు. "భాస్కరునితో పాటు మల్లికార్జునుడు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు ముగ్గురూ కవితాశిల్పంలో ప్రావీణ్యులే. భాస్కరుడు స్వయంగా వైదికుడు. విష్ణు భక్తి సంపన్నుడు తన రామాయణ రచనను విష్ణుభక్తి ప్రధాన కావ్యంగా తీర్చిదిద్దాడు" (పార్వతీదేవి, దండెబోయిన: భాస్కర రామాయణంలో స్త్రీ పాత్రలు, పుట.37.)

భాస్కర రామాయణానికి సంబంధించి ఒక ప్రాచీన గాథ ఉంది. ఈ గాథననుసరించి భాస్కరుడు, రంగనాథుడు సమకాలికులు. గోన బుద్ధరాజు ఆస్థాన కవి అయిన రంగనాథుడు రామాయణాన్ని ద్విపద కావ్యంగా రాస్తున్నాడని తెలిసిన భాస్కరుడు మిత్రుల సహాయంతో పద్యకావ్యంగా రచించి రాజు వద్దకు తీసుకెల్లగా, ఆ సమయంలోనే రంగనాథుడు తన కావ్యాన్ని రాజు వద్దకు తీసుకురాగా, రాజు రంగనాథుని కావ్యాన్ని కుడిచేత్తోనూ, భాస్కరుడి రచనను ఎడమచేత్తో తీసుకోవడానికి ఉపక్రమించగా, అందుకు కలత చెందిన భాస్కరుడు రాజుతో 'నీవంటి పక్షపాత బుద్ధిగల రాజుకు గ్రంథం అంకితం ఇచ్చుటకంటే ఏ గుర్రపువాడికో అంకితం ఇవ్వడం ఉత్తమం అని పలికి లేచిపోడానికి సిద్ధపడెనట'. అంతలోనే పక్కనే ఉన్న గోనబుద్ధరాజు అశ్వసైన్యాధ్యక్షుడు సాహణి భాస్కరుడి దగ్గరకు వచ్చి ఆ కృతిని తనకు ఇమ్మని వేడుకొనగా, భాస్కరుడు ఆ కృతిని అతనికి అంకితం ఇచ్చాడట. ఈ కథలో ఉన్న నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ నాడు సమాజంలో కొనసాగుతున్న సాహిత్య సంప్రదాయంగా ఈ రచన వెలువడిందని భావించవచ్చు. అంటే రాజుల మెప్పు పొందటం కోసం ప్రయత్నించి భాస్కర రామాయణాన్ని రచించి, అందులో విఫలుడైనాడని చెప్పవచ్చు.

### 4.2.4. జైమినిభారతము-పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి

ఈ రచన పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి రచించింది. ఈ గ్రంథం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సాళువ నరసింహరాయయలకు అంకితం ఇచ్చారు. ఇతడు "తన జైమిని భారతము నాతనికి క్రీ.శ.1485-1490 సంవత్సరములనడుమ కృతియిచ్చి యుండవచ్చునని భావించవచ్చును" (సుబ్రహ్మణ్యం, జి.వి: పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి, పుట.5.) అని అభిప్రాయపడ్డారు. ఈ రచన కూడా రాజైన సాళువ నరసింహరాయల కోరిక మేరకు రచించినటువంటిది. ఈ విషయం జైమినీభారతం అవతారిక ద్వారా తెలుస్తుంది. సాళువ నరసింహరాయలకు జైమినీ భారతం తెలుగులో వెలువడాలనేది ఒక బలమైన కోరిక. ఒక నాడు నిండు కొలువును ఏర్పాటు చేశాడు. అప్పుడు తన మనసులోని మాటను బయటపెట్టాడు. సప్తసంతానాలలో కావ్యం శాశ్వితమైందని భావించి సంస్కృతంలో ప్రసిద్ధమై ఉన్న జైమినిభారతమనే పురాణాన్ని ప్రసిద్ధ ఆంధ్ర కవి చేత అనువదింప చేయాలనే తలంపుతో ఉన్నట్లు పేర్కొన్నాడు. ఈ విషయాన్ని సభాముఖంగా పలికినట్లు అవతారికలోని పద్యాల ద్వారా తెలుస్తుంది.

"ఆదట సప్తసంతతుల యందును నొక్కొక కాలమందు వి
విచ్ఛదము గల్గు నాటిటికి జెప్ప విపర్యయ మేయుగంబునన్
లేదు కవిత్వసంతతికి నిక్కము తత్కవితావిలాసమున్
జాదులు నిష్టదైవము ప్రసాదము నౌ హరికీర్తింనంబునన్

నామాది నిరతము భారత
రామాయణ కథల బ్రేమ రంజిలు నందున్
జైమిని భారత మనగా
భూమినపూర్వము పురాణముల గణియింపన్

ఆపురాణంబుగన దెనుగయ్యేనేని

జెప్పనేర్చిన కవియు బసిద్ధుడేని

దెనుగు నుడికారమున మించు గనియెనేని

గుందనము కమ్మ వలచినచందమగును.” (పినవీరభద్రకవి, పిల్లలమఱ్ఱి: జైమిభారతము, 1-16,17,18) అందరిలాగానే నరసింహరాయలకు కూడా భారత, రామాయణ కథల పట్ల ఇష్టం ఉన్నట్లు తెలుస్తుంది. అప్పటికే బహుశా జైమినీ భారతం ప్రసిద్ధి చెంది ఉంటుంది. జైమినిభారతం పురాణాలలో అపూర్వ మైనదనే పేరు అప్పటికే వ్యాప్తిలో ఉంది. అందువల్లనే జైమిని భారతం మీద అత్యంత అభిమానం కలిగింది. కాబట్టి జైమిని భారతాన్ని తెలుగులో రచిస్తే హరిని కీర్తించిన ఫలితంతో పాటు, ఇష్టదైవాన్ని స్మరించిన పుణ్యం దక్కుతుందనే నమ్మకాన్ని ఏర్పరుచుకున్నాడు. అందుకోసం ప్రసిద్ధుడైన కవి రచిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని సభలో తెలిపాడు.

అంతకు పూర్వమే పిల్లలమర్రి పినవీరభద్రకవి జైమిని భారతాన్ని తెలుగులో రచించడానికి పూనుకొని ఉన్నట్లు, అది ఇతరులకు కూడా తెలిసి ఉన్నట్లు, ఆ విషయం పండితకవులు రాజుకు నివేదించినట్లు కింది పద్యం ద్వారా తెలుస్తుంది.

“ఏరీతి నెఱిగెనో పిన

వీరన దేవరతంపు విఖ్యాతముగా

బేరును బెట్టిదియును దన

పేరుగ రచియింప బూనె బేశలఫనితిన్” (పైదే, 1-20.) అని చెప్పిన ఈ పద్యం ద్వారా పినవీరభద్రుడు మానసికంగా జైమిని భారతాన్ని రచించడానికి సిద్ధపడ్డాడు. పినవీరభద్రుడికి ఇతరుల మనసులోని విషయాలను గ్రహించే ఒక దివ్యశక్తి ఉన్నట్లు ఒక కథ వ్యాప్తిలో ఉంది. ప్రస్తుతం ఈ కథ ఇక్కడ అప్రస్తుతం. ఈ కవి అద్వైతి అని శృంగార శాకుంతలంలో ఉన్న అవతారిక పద్యాల ద్వారా తెలుస్తుంది. కొన్ని పద్యాల్లో శివుని ప్రస్తావన కూడా ఉంది.

"ఆసుకవిచేత శివభజ
నాసక్తునిచేత గశ్యపాన్వయు చేతన్
భాసురనవ కవితాల
క్ష్మీసదనునిచేత వలయుగృతి జెప్పింపన్

అని సాధ్వీమణి నాగమాంబకును విద్యాభారతిజాని గా
దనకుం బుత్రిని వీరభద్ర పదపద్మ ధ్యాన శుద్ధాంతరం
గుని నన్నుం బిలిపించి లోన దన కోర్కుల్సందడింపంగ మ
న్నన దైవాఱగ గారవించి పలికెన్ గంభీర వాక్ప్రౌఢిమన్" (పినవీరభద్రకవి, పిల్లలమఱ్ఱి: శృంగారశాకుంతలము, 1-20, 21.) ఇక్కడ శివభజనాసక్తుడని, వీరభద్ర పద పద్మధ్యాన శుద్ధాంతరంగుడని చెప్పడంలో ఇతడు శివుని పట్ల భక్తిభావాలు ఉన్నవాడుగా కనిపిస్తాడు. కానీ జైమినిభారతము మాత్రం వైష్ణవపరమైన రచన. దీని ద్వారా ఈ కవి కూడా హరిహరాభేదభావం లేనివాడుగా కనిపిస్తాడు. ముఖ్యంగా ఇతడు రచించిన జైమిని భారతంలో పూర్తి వైష్ణవపరమైన అంశాలున్నట్లు విమర్శకులు పేర్కొన్నారు.

"గ్రంథమునందుడెక్కడ జూచినను శ్రీకృష్ణని మాహాత్మ్యమే కానబడుచున్నది. వ్యాసభారతమందు సౌర్యపరాక్రమాది గుణగరిష్టులగు పాండవ వీరాగ్రేసరులందఱు నిందు తమతమ స్వభావ తేజఃపుంజముల నడచుకొని శ్రీకృష్ణునికై స్తోత్రపాఠముల జేయుచు దాసులవలె మెలుగుచున్నారు. శత్రువుల నోడించునపుడు శ్రీకృష్ణునిబలము లేనిదే లేశమాత్రము చేయలేనట్లు వర్తించుటయే కాక దానిని వెల్లడించుటయు గాన్పించుచున్నది. ఇదియంతయు వ్యాస కృతికి విరుద్ధము". (సుబ్రహ్మణ్యం, జి.వి: పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి, పుట.16.) అందుకు గల కారణం ఈ రచనకు ప్రోత్సహించిన సాళువ నరసింహరాయలు. నరసింహరాయలు వైష్ణవ మతాన్ని అనుసరించడం వలన, రాజు కోరిక మేరకు రచన చేయటం వలన సంస్కృత రచన కంటే కూడా ఎక్కువ వైష్ణవపరమైన అంశాలను జోడించి రచించినట్లు భావించవచ్చు. దీనినిబట్టి

జైమినిభారతం నరసింహరాయల కోరిక పినవీరభద్రుడు ప్రయోజనాన్ని ఆశించి రచన చేసినట్లు భావించవచ్చు.

## 4.2.5. పారిజాతాపహరణము-నంది తిమ్మన

వైష్ణవమత ప్రభావానికి లోనై రచనలు చేసినవారిలో నంది తిమ్మన కూడా ఒకరు. ఇతడు కృష్ణదేవరాయల ఆస్థాన కవులలో ఒకడని పండితులు నిర్ణయించారు. కృష్ణదేవరాయలు క్రీ.శ. 1509వ సంవత్సరం నుండి 1530వ సంవత్సరం వరకు రాజ్యాన్ని పాలించినట్టు చరిత్రద్వారా తెలుస్తుంది. కాబట్టి నంది తిమ్మన ఆకాలంలో జీవించి ఉన్నాడని, పారిజాతాపహరణం కావ్యాన్ని 1516- 1520 సంవత్సరాల మధ్య రచించి ఉంటాడని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. నాడు కృష్ణదేవరాయలు అనుసరించిన వైష్ణవమతాన్ని నంది తిమ్మన కూడా పాటించినట్లు తెలుస్తుంది. కాని పారిజాతాపహరణం రచనలో అతని గురించిన సమాచారం కొంత లభిస్తున్నది. ఆ రచన ప్రకారం నంది తిమ్మన నియోగి బ్రాహ్మణుడు, కౌశికగోత్రుడు, ఆపస్థంబ సూత్రుడు, సింగనామాత్యునికి, తిమ్మాంబకు పుత్రుడు. మలయ మారుత కవీంద్రునికి మేనల్లుడు, శివభక్తుడు. ఈ విషయాలన్నీ తిమ్మన తన రచనలో పేర్కొన్నాడు.

“కౌశిక గోత్ర విఖ్యాతు డాపస్తంబ
సూత్రు డార్వేల పవిత్ర కులుడు
నంది సింగామాత్యునకును దిమ్మాంబకు
దనయుండు సకలవిద్యావివేక
చతురుడు మలయ మారుత కవీంద్రునకుమే
నల్లుండు కృష్ణరాయ క్షితీశ
కరుణా సమాలబ్ధ ఘన చతురంతయా
నమహాగ్రహార సన్మాన యుతుడు

తిమ్మయార్యుండు శివపరాధీన మతియ
ఘోర శివగురు శిష్యుండు పారిజాత
హరణమను కావ్య మొనరించె నంధ్ర భాష
నాది వాకరతా రాసుధాకరముగ". (తిమ్మన: పారిజాతాపహరణము, 5- 108.)

పారిజాతాపహరణం రచించడానికి కారణంగా ఒక కథ కూడా వినికిడిలో ఉండటం తెలిసిందే. కృష్ణదేవరాయలు ఒక రాత్రి అంతపురంలో భార్య అయిన తిరుమల దేవితో ఉన్నప్పుడు పొరపాటున రాయల తలవైపున తిరుమలదేవి పాదాలు ఉన్నట్లు, అనంతరం నిద్రలేచి గమనించిన రాయలు కోపోద్రిక్తుడై తిరుమలదేవి మందిరం వైపు వెళ్లటం మానివేశాడని, ఇది తెలిసిన నంది తిమ్మనార్యుడు పారిజాతాపహరణం కావ్యాన్ని రాయలకు వినిపించగా అందులోని ప్రథమాశ్వాసాంతంలో గల "పాటల గంధి ---' 'జజాతాసన ---.' కోపనపదహతి---' నను భవదీయ" అను ఈ పద్యాలను విని కృష్ణరాయలు కోపం విడిచిపెట్టి తన భార్యైన తిరుమల దేవితో సుఖంగా ఉన్నారని చెబుతారు.

నంది తిమ్మన శివభక్తుడైనప్పటికీ కృష్ణుడికి సంబంధించిన ఇతివృత్తాన్ని స్వీకరించి ప్రబంధంగా రచించాడు. అందుకు గల కారణం ఆనాడు ఉన్న మత పరిస్థితులు, సంప్రదాయం కూడా అని పేర్కొనవచ్చు. రాయల ఆస్థానంలో శైవ కవులు కూడా ఉన్నారు. అంతే కాకుండా రాయల పరమత సహనం కలవాడని కూడా చెబుతారు. కాని రాయల ఆస్థానంలో ఉన్న కవులు శైవులు కూడా వైష్ణవ ఇతివృత్తంతో రచనలు చేసినట్లు తెలుస్తుంది. దానికి గల కారణం కవులు రాజాశ్రయాన్ని ఆశించి ఉండటం. అలగే నంది తిమ్మన కూడా శ్రీకృష్ణునికి సంబంధించిన ఇతివృత్తంతో పారిజాతాపహరణం రచించాడు. అప్పటికే అతని పూర్వికులు శైవమతం అనుసరిస్తునే వైష్ణవ ఇతివృత్తంతో రచనలు చేశారని, వారిని నంది తిమ్మన అనుసరించాడని పేర్కొనవచ్చు. "తిమ్మన మేనమామయు, అతని మేనమామయునైన 'జంటకవులు'

కూడా తాము 'ఈశ్వరారాధకులమని చెప్పుకొనియున్నారు. ఈ మువ్వురకును గురువు అఘోర శివాచార్యుడు. అతడు దక్షిణామూర్తి జపపరాయణుడై యుండును. ఐనను వీరి శైవము విష్ణుభక్తికి అడ్డు వచ్చినది కాదు. వైష్ణవగాథలైన వరాహ, భాగవత పురాణములను, పారిజాతాపహరణమును వీరు రచించుటయే ఇందులకు సాక్షి." (తిరుపతిరావు, చన్నాప్రగడ: పారిజాతాపహరణము జగన్నాథ విజయముతో తులనాత్మక పరిశీలన, పుట. 26.)

తిమ్మన రచన కూడా మూల రచనకు మార్పులు చేసి రచించినట్లు, అందులో వైష్ణవ సంప్రదాయ రచనా విధానాన్నే పాటించాడని విమర్శకులు పేర్కొన్నారు. "శ్రీకృష్ణుడు పారిజాతముకై పరమేశుం గూర్చి తపమొనర్చి వరము వడసినట్లు మూలమున గలదు. ఇందట్లు గాక సత్యాసమేతుడై స్వర్గమున కరిగి యుపేంద్రుడింద్ర సమ్మానితుండై యింద్రద్రుమము నపహరించి జన్యమున నింద్రు నోర్చి జయముంగొనెనని యున్నది. జగదీశుండును, బరాత్పరుండును శ్రీమహావిష్ణ్వ వరావతారుండును నగు శ్రీకృష్ణుడింకొక దైవము నారాధించి వరము వడసినట్లు చెప్పిన బరమ వైష్ణవుండగు కృతిపతి కృష్ణరాయలు మది నేమనుకొనునో యనియు, వైష్ణవమతము విజృంభించు నక్కాలమున విష్ణుమతాలంబకులలో నిండియుండు నారాయల నిండుకొలువున నమ్మాటల హృద్యములగుట దన కావ్యమున కుత్కర్ష చెడునేమో యనియు గవి యనుమనించవలసియున్నది. మూలమున నంతగ బుణ్యకవ్రతము వర్ణితము గాకున్నను నిందు విస్తృతిగ బుణ్యక వ్రతవిధి వర్ణితమయ్యెను. ఇట్లు వర్ణించుటకు శ్రీకృష్ణ భగవానుని భక్తి పరాధీనతను నాతని వైభవ సమృద్ధిని బ్రకాశితములం జేయుటయే పరమప్రయోజనమని తలంపవలసియున్నది." (తిమ్మన: పారిజాతాపహరణము, పీఠిక, పుట.12-13) దీనిని బట్టి తిమ్మన శైవుడయినప్పటికీ తాను ఉన్న పరిస్థితులు, సమాజం, రాజాస్థానం అన్నీ కూడా అతనిపై ప్రభావం చూపాయి. అతడు మూలంలో ఉన్న అంశాలను కూడా మార్పు చేసి నాడు రాయల ఆస్థానంలో

పరాకాష్టలో ఉన్న వైష్ణవమతాన్ని అనుసరించి రచించాడు. రాయలు రాజు కాబట్టి పరమత సహనం ప్రదర్శించినప్పటికీ అక్కడ తిమ్మన మాత్రం వైష్ణవ సంప్రదాయాన్ని పాటించి రచన చేశాడు. దానికి నాడు కవులు రాజులను ఆశ్రయించి వారి మెప్పుకోసం తాపత్రయపడటం అనే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది.

## 4.2.6. పాండురంగ మాహాత్మ్యము- తెనాలి రామకృష్ణ కవి

పలువురు పరిశోధకుల అభిప్రాయం ప్రకారం తెనాలి రామకృష్ణ కవి క్రీ.శ. 1495 - 1500 సంవత్సరముల మధ్య కాలంలో జన్మించి క్రీ.శ. 1570- 1575 ల మధ్య కాలంలో సుమారు 70, 75 సంవత్సరముల వయస్సులో కాలధర్మం చేసి ఉండవచ్చని అభిప్రాయం. ఇతని అసలు పేరు గార్లపాటి రామలింగయ్య అని, తెనాలి స్వగ్రామంలో శైవకుటుంబంలో జన్మించినాడని పరిశోధకులు పేర్కొన్నారు. "తెనాలి రామపండితుని పూర్వీకులందరు శైవాచార పరాయణులు. రామయ్యగారు తెనాలి శ్రీరామలింగేశ్వర స్వామిభక్తుడు. ఆ స్వామి కుత్సువ మూర్తులను నిర్మించి యిచ్చినాడు. ఆస్వామి పేరే బహుశ తన పెద్దకుమారునకు పెట్టుకొన్నాడు. ఆ పుత్రుడే రామలింగము." (సుబ్బారావు, కొండా: పాండురంగ మాహాత్మ్యము రచనా సౌందర్యము, పుట.15.) అంతే కాకుండా ఇతడు మొదట శైవ గురువు దగ్గర శిష్యరికం చేసి అక్కడ శివుడి ఇతివృత్తంతో రచన కూడా చేసినట్లు తెలుస్తుంది.

ఇతడి రచనలు కొన్ని రామలింగడి పేరుతోను, మరికొన్ని రామకృష్ణుడి పేరుతోనూ ఉన్నాయని, రామకృష్ణుడు, రామలింగడు ఒకరేనని పరిశోధకులు నిర్ణయించడంతో ఇతడే తెనాలి రామకృష్ణకవి అని నిర్ణయించవచ్చు. ఇతడు మొత్తం ఏడు రచనలు రచించినట్లు విమర్శకుల రచనల వలన తెలుస్తుంది. ఇతడు లింగపురాణము, ఉద్భటారాధ్య చరిత్ర, కందర్పకేతువిలాసము, హరిలీలా విలాసము రచనలు రామలింగ కవి పేరుతో ఉన్నట్లు, పాండురంగ విజయము,

పాండురంగమాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యము రచనలు రామకృష్ణకవి పేరుతో ఉన్నట్లు నిడదవోలు వెంకటరావుగారు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పూర్తిగా లభ్యమయ్యే కావ్యాలు మాత్రం మూడే. అవి ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యములు. రామకృష్ణకవి మొదట లింగధారణ జరిగినప్పుడు చేసిన రచన లింగపురాణమని ఇదే మొదటి కృతి అని పేర్కొనవచ్చు. తరువాత కూడా ఇతడు గురువుల దగ్గర శివదీక్ష తీసుకొని సంపూర్ణ శివభక్తుడుగా ఉన్నాడు. అక్కడ ఉద్భటారాద్య చరిత్ర రచించి శైవుడైన ఊరదేవయ్యకు అంకితమిచ్చినట్లు తెలుస్తుంది. బహుశా ఈ రచనలు చేసే వరకు అతడు శివభక్తుడిగానే ఉన్నాడు. ఈ ఉద్భటారాద్య చరిత్ర కృతిపతి అయిన ఊరదేవయ్య కొండవీడుకు దుర్గాధ్యక్ష్యుడై నాదెండ్ల గోపమంత్రికి మంత్రిగా ఉన్నటువంటి వాడు. ఊరదేవయ్య ఉద్భటారాధ్య చరిత్రను అంకితం తీసుకొన్న తరువాత తన ప్రభువైన గోపమంత్రికి తెనాలి రామకృష్ణ కవిని పరిచయం చేశాడు. దీని ద్వారా తెనాలి రామలింగ కవి ప్రతిభ, పాండిత్యాలు గోపమంత్రి పరిశీలించాడు. రామకృష్ణుని ప్రతిభా పాండిత్యాలు మహారాజుల దగ్గర ఉండవలసినవిగా గుర్తించాడు. గోపమంత్రికి మహామంత్రి తిమ్మరసు స్వయాన మేనమామ. అందువలన గోపమంత్రి రామలింగ కవిని మహామంత్రి తిమ్మరసుకు సిఫారసు చేశాడు. ఫలితంగా రామలింగ కవి రాయల ఆస్థానంలో కవిగా ప్రసిద్ధుడయ్యాడు. అంటే కొండవీటిలో ఈ వృత్తాంతం నడిచిన కాలం వరకు రామలింగకవిగా ప్రసిద్ధుడు.

రాయల ఆస్థానంలో ప్రవేశించాలంటే అందుకు తగిన విధంగా తను సిద్ధం కావాలి. అప్పటికే కృష్ణదేవరాయలు వైష్ణవమతావలంబిగా ప్రసిద్ధి చెంది ఉన్నాడు. అక్కడ తన స్థానం పదిలంగా ఉండాలంటే మతం మార్చుకోవడమొకటే పరిష్కారంగా కనిపించింది. భట్టారు చిక్కాచార్యుల అనే వైష్ణవ గురువు దగ్గర శిష్యునిగా చేరి వైష్ణవ ధర్మాన్ని స్వీకరించి రామకృష్ణుడని పేరు మార్చుకొన్నాడు. రామకృష్ణ కవి తాను రాయల సంస్థానంలోకి అడుగుపెట్టే సమయానికి ఇతర కవులు వైష్ణవ ఇతివృత్తంతో

రచనలు చేస్తున్న విధానాన్ని గమనించాడు. తరువాత ప్రబంధ రచనా సామర్థ్యాన్ని సంపాదించాడు. అనంతరం తాను కూడా వైష్ణవ ఇతివృత్తంతో ప్రబంధాన్ని రచించడానికి పూనుకున్నాడు. అందుకు నాడు విజయనగర సామ్రాజ్యంలో వైభవంగా వెలిగిపోవుతున్న పాండురంగ విఠలుని మహిమలను ఇతివృత్తంగా స్వీకరించి పాండురంగ మాహాత్మ్యాన్ని రచించినట్లు విమర్శకులు పేర్కొన్నారు. ఈ పాండురంగ మాహాత్మ్య రచనను కందాళప్పగారి శిష్యుడు విరూరి గ్రామనివాసియైన వేదాద్రి మంత్రికి అంకితమిచ్చాడు.

అయితే ఈ గ్రంథం కవి తన స్వప్రయోజనం కోసం రచించారని విమర్శకుల భావన. తెనాలి రామకృష్ణ కవి రాజాశ్రయం కోసం శైవమతాన్ని వదలి వైష్ణవాన్ని స్వీకరించడంతో పాటు రామలింగ అనే పేరును రామకృష్ణగా మార్చుకున్నాడని ముందు పేర్కొనడం జరిగింది. దీనితో పాటు ఇతనికి ప్రచారాసక్తి ఎక్కువగా ఉండేదని తెలుస్తుంది. ఈ విధానంలో ఇతడు శ్రీనాథ కవిని అనుసరించాడు. నానా రాజాస్థానాలను దర్శించే స్వభావం కలవాడు. మొదట శైవుడుగా ఉన్నప్పుడు శైవగాధను రచించి శైవాచార పరాయణుడికి అంకితమిచ్చాడు. వారి ద్వారా మొదట కొండవీడు రాజ్యాన్ని చేరినాడు. అంతటితో ఆగక అప్పటికే కవి పండితులతో ప్రసిద్ధి చెందివున్న శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థానం చేరాలనే కోరిక కలిగింది. అందుకోసం కొండవీటి పాలకుడగు నాదెండ్ల గోపమంత్రి ద్వారా సాళువ తిమ్మరుసు దగ్గరకు చేరి వారి ద్వారా విజయనగరాన్ని చేరాడు. కాని అక్కడ వైష్ణవ మతం ప్రభలంగా ఉండటం గమనించి ప్రభుసమ్మతమైన వైష్ణవమతాన్ని స్వీకరించాడు. అయినప్పటికీ తన గుర్తింపు కోసం ఏదైన గ్రంథరచన చేయాలనే ఉద్దేశంతో వైష్ణవమత ఇతివృత్తంతో రచన చేయడానికి పూనుకొన్నాడు. కేవలం అతడు వైష్ణవ మతాన్ని స్వీకరించడం వల్ల ప్రయోజనం లేదని భావించాడు. ఏదైన ఒక వైష్ణవ పరమైన గ్రంథాన్ని ప్రబంధంగా రచిస్తే అన్ని విధాలుగా ప్రయోజనం కలుగుతుందని భావించాడు. తనకు కావలసిన పేరు ప్రఖ్యాతులు, ధనం సమకూరుతాయనుకొని ప్రబంధ రచన చేయటానికి పూనుకొన్నాడు. అందుకు

ఆలోచించి రాజు మనసు గ్రహించి అతనికి ఇష్టమైన దేవుడిని ఒకరిని గ్రహించి రచన చేయాలనుకున్నాడు. "జాతిపరముగా నావశ్యకత, కవి పరముగా ప్రయోజన కాంక్ష. రెండునూ గలిసినవి. ఈ రెంటికి తోడు నాడాప్రబంధము పుట్టుటకు కావలసిన యనుకూల పరిస్థితులు గూడా చక్కగా కుదురుకొనియున్నవి. అప్పటి సాహిత్యమును వైష్ణవేతి వృత్తములలో రామగాథలు, కృష్ణ చరితములు పెక్కు భంగుల ప్రవర్తములైనవి గాని పాండురంగనివృత్తము సరిక్రొత్త. పైగా రాయలవారి యభిమాన దైవములలో వేంకటపతి తరువాత విఠ్ఠలునిదే ద్వితీయస్థానము. ఈ యానుకూల్య వాతావరణము సైతము పాండురంగకృతి ప్రభవించుటకు మరియొక హేతువయ్యెను." (సుబ్బారావు, కొండా: పాండురంగ మాహాత్మ్యము రచనా సౌందర్యము, పుట.9.)

కృష్ణదేవరాయల వైష్ణవ మతానుసరణ వలన రామలింగ కవి రామకృష్ణకవిగా పేరుమార్చుకొని తాను పాండురంగమాహాత్మ్యాన్ని రచించాడు. దీని ద్వారా కవి మనుగడకు, పేరు ప్రఖ్యాతులకు ప్రయత్నించి రచించిన వారిలో తెనాలి రామకృష్ణుకవి కూడా ఒకరని గ్రహించవచ్చు.

## 4.3. వైష్ణవమత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు

ఇందులో కేవలం మతవ్యాప్తిని చేయడమే లక్ష్యంగా చేసుకొని రచనలు చేసినట్లు కనిపిస్తుంది. అంటే మొదట కేవలం భగవంతుని మీద భక్తితో రచనలు చేసినవారు కొందరు కాగా, మరి కొందరు తమ మతంతో పని లేకుండా తమ అవసరం కోసం లేదా రాజుల లేదా ఇతరుల కోరిక మేరకు వైష్ణవ మత రచనలు చేశారు. ఇక మూడవ పద్ధతికి చెందిన వారు వైష్ణవమత ప్రచారానికి రచనలు చేసినవారు. బహుశ వీరిని కూడా శివకవుల లాగా రచనలు చేసినవారని పేర్కొనవచ్చు. వీరు కేవలం వైష్ణవ మతాన్ని వ్యాప్తి చేయటమే తమ రచన లక్ష్యంగా కనిపిస్తుంది.

### 4.3.1. అన్నమయ్య కీర్తనలు-కృతులు

వైష్ణవమత వ్యాప్తికి కృషి చేసినవారిలో అన్నమయ్య కూడా ఒకరు. అన్నమయ్య రచనలుగా పన్నెండు శతకాలు, వేంకటాచలమాహాత్మ్యము, ద్విపద రామాయణము, శృంగారమంజరీ, ఇంకా దాదాపు 32 వేల కీర్తనలు రచించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. ఇంత సుప్రసిద్ధి చెందిన అన్నమయ్యపై కూడా సమకాలీన పరిస్థితుల ప్రభావం చూపాయి. అన్నమయ్యపై ఇప్పటికే పలు పరిశోధనలు వెలువడి ఉన్నాయి. అందులో అన్నమయ్యను గురించి అతని వంశాన్ని గురించి అనేకమంది పరిశోధకులు పేర్కొని ఉన్నారు. "తాళ్ళపాక వారు నందవర వంశీకులు. ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు, భరద్వాజ సగోత్రులు పొత్తపినాటి సీమలోని తాళ్ళపాక గ్రామమున వర్ధిల్లినవారు. దేశమంతయు దిరిగి వైష్ణవ మత ప్రచారము గావించినారు. స్మార్త బ్రాహ్మణులయినప్పటికిని అదివణ్ శఠగోపయతుల శిష్యులై వైష్ణవమతము పుచ్చుకొని వీరు వైష్ణవులైనారు. వైష్ణవ మతమునకును వేంకటాచలం క్షేత్రమునకును ఎనలేని రీతిని కైంకర్య మొనర్చి ధన్యజీవనులయినారు." (అన్నమాచార్యుల వారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు - ద్వితీయ సంపుటం, పుట.iii.)

ఇక ఆనాటి సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులు నాటి సమాజంపై ఎలా ప్రభావం చూపాయి? వాటి వలన అన్నమయ్య ప్రభావితుడైన విధానం గురించి ఇక్కడ చర్చించడం జరిగింది. ఆనాడు పలువురు కవులు వివిధ కారణాల వలన తాము అనుసరిస్తున్న మతాన్ని వదలి వేరొక మతాన్ని అనుసరించారు. ఆనాడు సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితుల వలన మతమార్పిడి చేసుకున్నవారిలో అన్నమయ్య కూడా ఒకరు. "అన్నమయ్య నందవరీక వంశంలో జన్మించినందువల్ల స్మార్తబ్రాహ్మణుడు. కావునా కులానుగతంగా అద్వైతి. అయితే అది తన పుట్టుకతో గట్టి వైష్ణవంగానూరింది." (పరమేశ్వరయ్య, యడవల్లి: పోతన అన్నమయ్య సాహిత్య దృక్పథాలు పుట.20.) ఇతడు వైష్ణవుడిగా మారడానికి ఆనాటి పరిస్థితులు, పెరిగిన వాతావరణం అన్నీ కూడా

దోహదపడ్డాయి. ముఖ్యంగా అన్నమయ్య చిన్నతనంలోనే వివిధ వైష్ణవ గురువుల దగ్గర వైష్ణవ సంబంధమైన రచనలు అధ్యయనం చేశాడు. ఆ ప్రభావం అన్నమయ్య మీద కనిపిస్తుంది. అందువల్ల అన్నమయ్య రచనల్లో వైష్ణవ మత ప్రభావం కనిపిస్తుంది.

అన్నమయ్యకు సంబంధించి పలు కథలు వ్యాప్తిలో ఉన్నాయి. అన్నమయ్య ఆదివణ్ శఠగోప అనే ముని వద్ద సకల వేదాంత రహస్యాలను తెలుసుకొన్నాడని, అంతకు ముందే ఒక వైష్ణవ యతిచేత పంచ సంస్కార దీక్షను కూడా పొందాడని చెబుతారు. ఈ విధంగా అద్వైతి అయిన అన్నమయ్య పూర్తిగా వైష్ణవమతస్తుడుగా మారి వెంకటేశ్వర స్వామి వారి మీద వేలకొద్ది కీర్తనలతో పాటు పలు ప్రక్రియలలో రచనలు చేసినట్లు కనిపిస్తుంది. ఇక అన్నమయ్య మీద కనిపించే మరొకరి ప్రభావం ఆళ్వారులది. అన్నమయ్య రచనలపై ఆళ్వారు రచనల ప్రభావం ఉన్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. అందుకు గల కారణం అన్నమయ్య విశిష్టాద్వైత మతాన్ని, ముఖ్యంగా తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని తన రచనల ద్వారా ప్రచారం చేయటం. దీనితో పాటు భాష పరంగా కూడా ఆళ్వారులనే అనుసరించినట్లు తెలుస్తుంది.

ఆళ్వారులు విశిష్టాద్వైతాన్ని, విష్ణువును ప్రచారం చేశారు. విశిష్టాద్వైతమతాన విష్ణువే పరదైవం. క్రీ.పూ. మొదటి ఏడు శతాబ్దాలలో జైన, బౌద్ధాల వంటి అవైదిక మతాలు తమిళ దేశాన ప్రవేశించాయి. ఇవి ప్రధానంగా వైదిక మతంలోని యజ్ఞ, యాగాది కర్మకలాపాలను, వర్ణవ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నూతన మతాలను రాజులు ఆదరించటంతో అవి ఎక్కవగా వ్యాప్తి పొంది వైదిక మతం నశించిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆ పరిస్థితులలో ఆళ్వారులు అవతరించినట్లు పరిశోధకులు చెబుతారు.

వీరు మతాన్ని సామాన్య ప్రజలకు చేరుటకై ప్రాంతీయ భాషను ఎంచుకొని భక్తి గీతాలాలపించి, ప్రజామోద భాషలో మత ప్రచారం చేశారు. అంతవరకు మత, ధార్మిక

విషయాల ప్రచారానికి ఉపయోగిస్తున్న సంస్కృత భాషని విడిచిపెట్టి, భక్తిని, వేదాంతాన్ని కలిపి తమిళభాషలో విరివిగా పాటలు రాసి ప్రచారం చేసినట్లు వారి రచనల ద్వారా తెలుస్తుంది. ముఖ్యంగా కలియుగాన వైష్ణవ మతానికి ఉన్నతమైన స్థానం కల్పించినవారు ఆళ్వారులు. తమిళ దేశాన వీరు భక్తి గీతాల ద్వారా వైష్ణవ మతవ్యాప్తికి శ్రీకారం చుట్టారు. వారి విధానాన్నే అన్నమయ్య కూడా అనుసరించినట్లు తెలుస్తుంది. "ఆళ్వారులు అన్నమయ్యకు పూర్వులు కావటంవల్లను వైష్ణవుడైన అన్నమయ్యకు ఆళ్వారుల రచనలను అధ్యయనంచేసే అవకాశం ఉండటంవల్లను, ఆళ్వారుల జీవితాలను గురించి తెలుసుకొని ఉండవచ్చు. వాటివల్ల ప్రభావితుడై ఆళ్వారుల జీవిత విధానాలను అనుకరించడానికి ప్రయత్నించి ఉండవచ్చు." (ప్రభాకరశాస్త్రి, వేటూరి: అన్నమాచార్య చరిత్రము, పుట.49.)

విశిష్టా ద్వైతాన్ని చాటిచెప్పిన ఆళ్వారులను, వారి రచనలను అనుసరించిన అన్నమయ్య తన సంకీర్తనల్లో విశిష్టాద్వైతాన్నే అధికంగా చేసి చెప్పడం ద్వారా ఆళ్వారులను అనుసరించాడు. ఆళ్వారుల లాగానే సామాన్య ప్రజలకు చేరటానికి ప్రాంతీయ భాషను ఎన్నుకొని కీర్తనలు ఆలపించి ప్రజల భాషలో మతప్రచారం చేశాడు. ఆళ్వారులు విష్ణుతత్త్వాన్ని, విష్ణులీలల్ని, విశిష్ట కళ్యాణ గుణాల్ని, విభూతుల్ని గానం చేసి వినేవాళ్ళ మనసుల్ని విష్ణువువైపుకు మల్లించే ప్రయత్నం చేసి విజయాన్ని సాధించారు. ఈ విధానాన్ని అనుసరించి తన రచనలను ప్రజల్లో ప్రచారం చేయడంలో అన్నమయ్య సఫలీకృతుడయ్యాడు. అన్నమయ్య కీర్తనలు బహుళప్రచారం చెందడంలో ఆళ్వారుల రచనా విధానం కూడా ముఖ్యమైందే.

అన్నమయ్య కూడా ఆనాటి మత ప్రభావానికి లోనై వాటిని అతన రచనల్లో కూడా చెప్పాడు. ఆనాడు సహజంగానే వీరవైష్ణవులు వైష్ణవేతర దేవతలపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించేవారు. విష్ణువుకు విష్ణుదాసులకు అభేదాన్ని పాటించి, విష్ణుదాసులను

సేవించడం విద్యుక్తధర్మంగా భావించేవారు. అష్టాక్షరిమంత్రం మొదలైన వాటిలో తమిళ వైష్ణవుల ప్రభావం తెలుగు నేల మీద బాగా ఉండేది. నాడు విష్ణువే సర్వోన్నతుడని వైష్ణవులు భావించేవారు. 'తక్కిన దేవతలెవ్వరు అతనికి సాటిరారని అంతా హరి సంకల్పానుసారమే జరుగుతుందని వైష్ణవుల భావన. విష్ణువుకు సంబంధించినవన్నీ పూజనీయమే. శంఖచక్రలాంఛనాలు అన్నిటా పూజ్యాలు. అన్నింటికి విష్ణునామమే గురి. విష్ణుభక్తి లేని ఉన్నత కులస్తునికంటే విష్ణుభక్తి గల హీనకులస్తుడే శ్రేష్ఠుడు...' ఇవి నాటి వైష్ణవుల భావాలు విశ్వాసాలు. హరిసేవకులపట్ల, వైష్ణవుల పట్ల సంఘంలో దైవభావం ఉండేది. అన్నమయ్య కూడా తను హరిని పూజించడం మాత్రమే చేశాడు. అందుకోసమే గానాలాపన చేశాడు. పరోక్షంగా ఇతర దేవతలతో పనిలేదని పేర్కొన్నాడు. "పదకవితా పితామహుడు తన పద్మనాభేతర విముఖతను వెల్లడిస్తూ పలు రచనలు చేశాడు. హరిని కొలువకుండడం అన్యాయమన్నాడు. వేంకటేశ్వరునితో తప్ప పరదైవాలతో తనకు పనిలేదన్నాడు. వైష్ణవ సంప్రదాయాన్ని సమాదరించిన అన్నమయ్య రచనల్లో కూడా నారాయణేతర విముఖత బాగా చోటు చేసుకుని ఉంది." (మునిరత్నం, జె: అన్నమయ్య ఆళ్వారులు తులనాత్మక అధ్యయనం - I, పుట.155.)

అన్నమయ్య తన వైష్ణవమత ప్రచారానికి కీర్తనలను ఎన్నుకొన్నాడు. దానికి గల కారణం కీర్తనలు గాన యోగ్యంగా ఉండటం ఒకటయితే, ప్రచారానికి అనువుగా ఉంటాయి. అప్పటికే అంతకు పూర్వం ఉన్న కీర్తనా పద్ధతిని అనుసరించాడు. అప్పటికే ఆంధ్రదేశంలో విష్ణుదేవుని గూర్చి స్తుతించే వచన సంకీర్తనా పద్ధతి కొనసాగి ఉంది. ఈ పద్ధతి మొదట ఆరంభించినవారు మహాభక్తుడుగా పరిగణించే కృష్ణమాచార్యులు. ఇతడు క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందినవాడు. ఇక కర్ణాటక ప్రాంతంలో నరహరి తీర్థులు, శ్రీపాద రాయరు మొదలైనవారు సంకీర్తనా పద రచనలు చేసి ప్రజలను ఆకర్షించారు. వీరు కూడా భక్తి మార్గాన్ని ప్రబోధించినవారే. ఇక కర్ణాటక ప్రాంతంలో ఒక వైపు శైవ కీర్తనలు మరొక వైపు వైష్ణవకీర్తనలు ఆవిర్భవించాయి. నరహరితీర్థులు అన్నమాచార్యుల కంటే

పూర్వులు. వీరి ప్రభావం కూడా అన్నమయ్యపై పడింది.

### 4.3.2. రంగనాథ రామాయణము- గోనబుద్ధారెడ్డి

తెలుగులో సాహిత్య రచనల విషయంలోనూ, ఆ రచన గ్రంథకర్తల విషయంలో అనేక వాదోపవాదాలు జరిగనట్లే రంగనాథ రామాయణ రచన గ్రంథకర్త విషయంలో కూడా అనేక చర్చలు వాదోపవాదాలు జరిగాయి. అందులో మొదటిది రంగనాథ రామాయణ రచయిత రంగనాథుడని కొందరు పేర్కొనగా, మరికొందరు గోనబుద్ధారెడ్డి అని పలువురు పలు విధాలుగా నిర్ణయించారు. గ్రంథావతారికలో ఈ గ్రంథాన్ని గోనబుద్ధారెడ్డి రచించినట్లు ఉండటం వలన ఈ రచన చేసింది గోన బుద్ధారెడ్డి అని పలువురివాదన. కానీ గ్రంథం రంగనాథ రామాయణమని ప్రసిద్ధిచెందడం వలన, మొల్లరామాయణమనే పేరు మొల్ల రచించడం వల్ల, భాస్కర రామాయణమనే పేరు భాస్కరుడు రచించడం వల్ల ఆయా పేర్లు ఏర్పడ్డాయని, కాబట్టి ఈ రంగనాథ రామాయణాన్ని కూడా రంగనాథుడనే కవి రచించి ఉంటాడని పలువురి పరిశోధకుల అభిప్రాయం. అంతేగాక ఈ రంగనాథుడు, బుద్ధారెడ్డి ఆస్థాన పండితుడై ఉండవచ్చనేది పరిశోధకుల భావన. "ఆంధ్రంబున రామాయణమును వ్రాసిన వారిలో దొల్తటి కవి రంగనాథుడు. ఈ గ్రంథమున నుపోద్ఘాతము నందు గోనబుద్ధరాజు తన జనకుండగు విఠల నృపాలుని యాజ్ఞచే నతని కంకితంబుగ రామాయణము నాంధ్రీకరించెనని యుండుటం బట్టి దీనిని రచించిన కోనబుద్ధరాజుకి యొన్నదగియున్నను దీనికి చిరకాలము నుండి రంగనాథ రామాయణమనియే పేరు కలిగియుండుటచే గోనబుద్ధరాజు నొద్ద నాస్థానకవియగు రంగనాథుడీ గ్రంథమును బుద్ధరాజు పేరుతో వ్రాసి తదీయాజ్ఞోను సారంబుగ విట్టల ధరణీశు పేర నంకితంబు గావించెనో యను సందేహము పొడముచున్నది లేకున్న ఈ గ్రంథమునకు రంగనాథ రామాయణ మనుపేరు కలుగుటకు గారణము కానంబడదు"(రంగనాథుడు: శ్రీరంగనాథ రామాయణము, పీఠిక, పుట.11.) అని కుప్పుస్వామయ్య పేర్కొన్నారు. ఈ సందేహం పలువురు పరిశోధకుల చర్చకు

దారితీసింది. గ్రంథావతారికలో ఉన్న పేరు ఆధారంగా రంగనాథ రామాయణ రచన గోనబుద్ధారెడ్డి రచించాడని అధిక సంఖ్యాక పరిశోధనలు పేర్కొనడం వలన ఈ రచన గ్రంథకర్తగా గోనబుద్ధారెడ్డినే పేర్కొనడం జరిగింది.

ఈ రచన కాలాన్ని గురించి కూడా కొంత చర్చజరిగింది. ఆరుద్రగారి అభిప్రాయం ప్రకారం "క్రీ.శ. 1294 లో వేయించిన రాయచూరు శాసనములో గోన గంగయ రెడ్డి రాజ్య రక్షా మణి విఠలుడే రామాయణ కర్త తండ్రి విఠల భూపతియని 'విసరగండ' బిరుదునాధారముగా కొని ఇతని 25 సంవత్సరముల కాలములోనే శాసనము వేయించినచో రామాయణ రచనా కాలము 1294+30= 1324 అని చెప్పవచ్చును. ఈ కాలమున రాజకీయముగా అల్లరులైనాయి. అవి ప్రతాప రుద్రచక్రవర్తి అస్తమించినను శాంతింపలేవు. ఢిల్లీ సుల్తానుల బెడద తప్పి, కాపయ నాయకుడు శాంతపర్చిన కాలము క్రీ.శ. 1340 ఇదే రామాయణ రచనా కాలము కావచ్చు." (ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యము- 3. పుట.224-225.)

పలు అంశాలు ఈ రచన వెలువడటానికి దోహదం చేశాయి. మొదటిది రంగనాథ రామాయణ కాలం కంటే ముందున్నటువంటి సాహిత్య సంప్రదాయం కూడా ఈ రచన వెలువడటానికి కారణంగా పేర్కొనవచ్చు. శివకవులు కొందరు తమ రచనలను మత ప్రచారానికి ఉపయోగించుకొన్నారు. రంగనాథ రామయణ రచనా కర్త కూడా వారి మార్గాన్ని అనుసరించాడని పరిశోధకుల అభిప్రాయం. గోన బుద్ధారెడ్డి వైష్ణవమత ప్రచారానికి రంగనాథ రామాయణం రచించాడని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇతడు పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు మొదలైనవారు శివభక్తి తత్పరులు శైవమత ప్రచారాన్ని దృష్టిలో ఉంచుకొని రచనలు చేశారు. అదే విధంగా బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని కూడా వైష్ణవ మత వ్యాప్తికి కోసం రచన చేశాడు. ముఖ్యంగా ఇతడు రామానుజాచార్యుని మతస్థుడై ఈ రచన

చేశాడు.

రంగనాథ రామాయణం రచించడానికి రచయిత సమకాలీన సమాజపు పరిస్థితులు కూడా దోహదం చేశాయి. ముఖ్యంగా మత పరిస్థితితులు దోహదం చేసినట్లు పేర్కొనవచ్చు. గోనబుద్ధారెడ్డి రాజవంశానికి చెందినవాడని, అతని వంశస్తులు వైష్ణవమతాన్ని అవలంబించి, ఆ మత వ్యాప్తి కోసం కృషిచేసినట్లు చారిత్రక రచనల ద్వారా కూడా తెలుస్తుంది. "గోన వంశీయులలో కొందరు వైష్ణవ మతావలంబికులు, మరికొందరు పరమ వైష్ణవులు, రాయచూరి శాసనము నందు గోన గంగయ రెడ్డి 'రాజ్య రక్షా మణి' యని చెప్పబడిన విఠలనాథుడు వైష్ణవుడు, విష్ణుభక్తుడు. శ్రీశ్రీమన్నారాయణ దివ్యశ్రీ పాద పద్మారాధకుడు కర్తృ, భర్తవైన, బుద్ధ, విఠలాక్షపాలురు విష్ణుభక్తి తత్పరులనుటకు రామాయణమే సాక్ష్యము. ఆదియందు శ్రీకామినీనాథుడు, అంతమున రంగనాథుడు కీర్తింపబడినారు. ఉత్తరకాండ కర్తలును కులస్వామియగు విష్ణువును గొలిచియే కావ్యమారంభము గావించినారు. వీరు కూడా విష్ణుమూర్తికే యిలవేల్పుగాను, వైష్ణవ సంప్రదాయమునకు రంగనాథునే ప్రధాన దైవముగాను ఆరాధించినారు. గోనవారివంశ ప్రస్థానమున గల శాసనములందు వర్థమాన పురము రాయచూరుకు బూదపురములను గ్రామములో పేర్కొనబడినవి" (యశోదారెడ్డి,పి: ఆంధ్ర సాహిత్య వికాసము, పుట.143.) ఈ రంగనాథ దేవాలయం ప్రస్తుత మహబూబ్ నగర్ జిల్లాలో వున్నట్లు చాగంటి శేషయ్యగారు పేర్కొన్నారు. "వర్థమానపురమే వ్యవహారముబడి వడ్డెమానుగాను, బుద్ధపురము బాద్ పూర్, బూత్ పూర్ గాను వ్యవహరింపబడుతున్నవి. ఈ పేరు గల ఊరు పాలమూరుజిల్లాలో జడ్చర్లకు 12 మైళ్ళ దూరములో గలదు. ఇచ్చటినే నొక కొండ గలదు. ఆ కొండ పై నొక రంగనాథ దేవాలయమున్నది. దీనినే కొందరు గోవిందస్వామి ఆలయమని వ్యవహరించుచున్నారు. దీనిని బుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక భర్త చనిపోయిన పిమ్మట ఒక దేవాలయమును నిర్మించి, తన భర్త గుండయ పేర లింగ ప్రతిష్ట చేసినట్లు శాసనము నందున్నది. కావున వీరి వంశస్తులు రంగనాథునికి ఇలవేల్పుగా భావించిన వైష్ణవులని తెలియనైనది." (శేషయ్య, చాగంటి:

ఆంధ్ర కవి తరంగణి (నాలగవ సంపుటం), - పుట.60.)

గోనబుద్ధారెడ్డి రాజవంశంలో జన్మించడంతో పాటు పూర్వికులు అనుసరించిన వైష్ణవమత విధానం వలన తాను కూడా వైష్ణవమతాన్ని అనుసరించడంతో పాటు, విష్ణు పారమ్య మైన రంగనాథరామాయణాన్ని రచించాడని భావించవచ్చు. తరువాత వచ్చిన రచనలకు ఇది మార్గదర్శకంగా నిలిచింది. ఈ రచనను ఇతడు ద్విపదలో రాయడానికి గల కారణం కూడా శైవకవులేనని చెబుతారు. పద్యకావ్యాలు, ముఖ్యంగా ప్రౌఢ కావ్యాలు అందరికి అర్థం కావని అందరికి అర్థం అయ్యే రీతిలో రాయడానికి ద్విపద ఛందస్సును ఎన్నుకున్నాడని పేర్కొనవచ్చు. అప్పటికే పాల్కురికి సోమనాథుడు రచించిన ద్విపద కావ్యాలు తెలుగు సాహితీ ప్రియులను బాగా ఆకర్షించాయి. బహుశా ఈ విషయాన్ని ప్రత్యక్షంగా గోనబుద్ధారెడ్డి గమనించి ఉంటాడు. తన కావ్యం కూడా తెలుగు సాహిత్యంలో దేశీ పద్ధతిలో శాశ్విత స్థానం పొందాలని భావించి ఉంటాడు. ద్విపద కావ్యాలు గేయభావన్ని కలిగిఉండటం చేత ప్రజలలో ద్విపద కావ్యవ్యాప్తి అప్పటికే ఉంది. ముఖ్యంగా సోమనాథుడు, శివకవులు అనుసరించిన ద్విపద విధానాన్ని గోనబుద్దారెడ్డి కూడా మతవ్యాప్తికి వాడుకున్నాడు. అందువలన రంగనాథ రామాయణం ఆంధ్రలోకంలో వ్యాప్తిలో ఉన్నట్లు పేర్కంటారు.

### 4.3.3. ఆముక్తమాల్యద-శ్రీకృష్ణదేవరాయలు

ఆముక్తమాల్యద రచన ద్వారా కృష్ణదేవరాయలు విష్ణుభక్తిడని, వైష్ణవ మతాన్ని అనుసరించినవాడని తెలుస్తుంది. అతడు విష్ణుభక్తుడైనను, వైష్ణవ మతాన్ని అనుసరించినప్పటికీ, ఇతర దేవతల పట్లగాని ఇతర మతాల వారి పట్లగాని వైషమ్యం లేనివాడై ఉన్నాడని చరిత్రకారులు, సాహితీపరులు అందరూ పేర్కొన్నారు. రాయలవారు విష్ణుదేవాలయాలకు మాత్రమే కాక శివాలయాలకు కూడా భూదానాలు చేశారని చెబుతారు. వైష్ణవమతాభిమానులను మాత్రమే గాక ఇతర మతాల

విద్వాంసులను కూడా ఆదరించి ఉన్నట్లు తెలుస్తుంది. దానికి గల కారణం అతని రాజనీతి. సహజంగా రాజైనవ్యక్తి ప్రజల పట్ల పరమత సహనం ప్రదర్శించాలి. అదే విధానం కృష్ణరాయలు అవలంబించారు.

కానీ సాహిత్యపరంగా పరిశీలించిప్పుడు ఆముక్తమాల్యద రచనలో వైష్ణవమత ప్రచారం కనిపిస్తుందనేది నిర్వివాదాంశం. ఆముక్తమాల్యద కావ్యంలో ఆద్యంతం వైష్ణవమతపరమైన అంశాలున్నట్లుగా కనిపిస్తుంది. గ్రంథనామం దగ్గర నుంచి కావ్య వస్తువు, పాత్రలు అన్ని కూడా వైష్ణవమతానికి సంబంధించినవిగానే కనిపిస్తాయి. రాయలు తన ప్రబంధానికి పెట్టిన పేరు ఆముక్తమాల్యద. ఇది 'శూడిక్కొడుత్త నాచ్చియార్' అనే తమిళ పదానికి అనువాదం అని చెబుతారు. ఈ పదానికి 'సిగయందు ముడిచి విడిచిన పూలదండను స్వామికి అర్పించిన వనిత' అని అర్థం చెబుతారు. ఆ వనితకు తండ్రి పెట్టిన పేరు 'కోదై'. అనగా పూలమాలిక అని అర్థం అనీ, దీనికి సంస్కృతీకరణమే 'గోదా' అనే నామం అని విమర్శకులు వివరించారు. గోదాదేవి పన్నెండుగురు ఆళ్వారుల్లో ఒకరు. ఈ ఆళ్వారులను గురించి రాయలు గ్రంథ ప్రారంభంలో స్తుతించాడు. ఇష్టదేవతా స్తుతికి కావ్యారంభానికి మధ్య వీరిని స్తుతించాడు.

"అలపన్నిద్దఱు సూరులందును సముద్యల్లీలగా పున్నవె
గ్గలపుందాపము బాప నానిజమనఃకంజాత సంజాతపు
ష్కల మాధ్వీకఝరిన్మురారి సొగియంగా జొక్కి ధన్యాత్ములౌ
నిలపన్నిద్దఱు సూరులం దలతు మోక్షేచ్ఛామతిం దివ్యులన్." (శ్రీకృష్ణదేవరాయలు: ఆముక్తమాల్యద, 1-10.) అని పేర్కొన్నాడు. ఈ పన్నెండు మంది ఆళ్వారులలో గొప్పస్థానాన్ని అలంకరించింది గోదాదేవి. మరొక పేర్కొనదగిన వారు విష్ణుచిత్తుడు. ఇతడు పన్నెండుమంది ఆళ్వారులల్లో ఒకడు. ఇతనికి పెరియాళ్వార్ (పెరియ=పెద్ద, ఆళ్వార్=భక్తుడు) అని ద్రావిడ పేరు. గ్రంథ ప్రారంభం కూడా శ్రీ వేంకటేశ్వర స్వామిని స్తుతించడంతోనే ప్రారంభం అవుతుంది.

"శ్రీకమనీయ హార మణి జెన్నుగ దానును గౌస్తుభంబునం
దాకమలావధూటియు నుదారత దోప బరస్పరాత్మలం
దాకలితంబు లైన తమ యాకృతులచ్ఛతబైకి దోపన
స్తోకత నందు దోచెనన శోభిలు వేంకటభర్త గొల్చెదన్" (శ్రీకృష్ణదేవరాయలు: ఆముక్తమాల్యద, 1-1.)

తరువాత కూడా విష్ణువువు సంబంధించిన వాటిని స్తుతించాడు. తరువాత ఆళ్వారులను స్తుతించడం కనిపిస్తుంది. రాయలు ఆళ్వారులును కూడా తాను స్మరించడం జరిగింది. వీరిని సంస్మరించడంలో రాయలవారికి రెండు కోరికలున్నాయి.

1) భగవత్సాక్షాత్కారం పొందిన మహనీయులు తనకు అండగా నిలిచి తనకార్యాన్ని సాధించటంలో సహాయపడతారనే విశ్వాసం

2) ఈ మహానుభావుని కృపవలన తనకు మోక్షం లభించడం.

ఇంకా గ్రంథంలో వస్తువు, పాత్రలను కూడా వివిధ గ్రంథాలను గ్రహించి వాటిని వైష్ణవమతానుగుణంగా మార్చి ఆముక్తమాల్యద రచన చేశాడని విమర్శకులు నిరూపించారు. గోదాదేవి కథ గురుపరంపరా ప్రభావంలో వివరించినదానికి ఆముక్తమాల్యద ప్రబంధంలో ఉన్నదానికి కూడా కొంత భేదమున్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు.

యమునాచార్యచరిత్ర మూలంలో ఉన్నట్లు కాకుండా మార్పు చేసి రచించినట్లు విమర్శకులు తెలిపారు "యమునాచార్యుడు శైవమతస్థుడగు పాండ్యరాజును వైష్ణవునిగా జేయుట; తాను బ్రాహ్మణుడైయుండియు క్షత్రియ జాత్యుత్పన్నురాలగు పాండ్యరాజు సోదరిని వివాహమాడుట; కుమారునికి రాజనీతినుపదేశించుట; క్షత్రధర్మావలంబియై యుద్ధము చేసి పగఱగల్చుట; అను నీయంశములు గురుపరంపరా ప్రభావములో నున్న యామునాచార్య చరిత్ర యందు జెప్పబడలేదు. ఈ యంశములు కవి కల్పితములని నిస్సంశయముగా జెప్పవచ్చును"

(శ్రీకృష్ణదేవరాయలు: ఆముక్తమాలద, ఉపోద్ఘాతము, పుట- XII) అని వేంకట రమణాచార్యులు పేర్కొన్నారు.

ఆముక్తమాల్యదలోని కొన్ని కథలు వివిధ పురాణాలనుంచి గ్రహించినట్లు కూడా తెలుస్తుంది. ఇందులో చండాల బ్రహ్మరాక్షసుని సంవాదం, ఖాండిక్య కేశిధ్వజ సంవాదం రెండు కూడా పురాణాల నుంచి స్వీకరించారని విమర్శకులు నిరూపించారు. అంతేకాకుండా ఇవి ప్రధాన కథతో సంబంధం లేకపోయినప్పటికీ వాటికి ప్రధాన కథతో ఏదో ఒకరకమైన సంబంధాన్ని కల్పించి రచించాడు. "యామునాచార్య చరిత్రమును మాతంగబ్రహ్మరక్షస్సంవాదమును ప్రధాన ప్రతిపాద్యమగు గోదా చరిత్రముతో సంబంధములేకపోయినను సంబంధము కల్పించి యే సంస్కృత మత గ్రంథములయందును గానరాని విశిష్టాద్వైత ద్రావిడమత సంప్రదాయ రహస్యమును బ్రకాశింప యున్నాడు. ఇందువలన నీకవి కీమతమందుగల భక్తి విశేషము, నమ్మకము, శ్రద్ధ, పట్టుదల మొదలగునవి స్పష్టమగుచున్నవి". (పైదే,పుట. XXXII.)

ఆముక్తమాల్యదలో పూర్తిగా వైష్ణవపరమైన అంశాలు కనిపిస్తాయి. అందులో ఆముక్తమాల్యద కర్త కృష్ణదేవరాయలు వైష్ణవమతాభిమాని. కృతిని గ్రహించిన వారు శ్రీవేంకటేశ్వర స్వామివారు. కృతిలోని విషయాలు వైష్ణవ కథాసముదాయం. ఈ విధంగా ఒక గ్రంథంలో అన్ని వైష్ణవ విషయాలు. ఒక విధంగా వైష్ణవమత ప్రచారం చేయాలనే సంకల్పం ఉన్నట్లు కనిపిస్తుంది. ఆముక్తమాల్యద కర్తగా, కవిగా కృష్ణదేవరాయలపై వైష్ణవ మత ప్రభావానికి గల కారణాలు కూడా పేర్కొనడం అవసరమే. ఆముక్తమాల్యద గ్రంథం వెలువడటానికి ఆనాటి పరిస్థితులు ఎలా దోహదం చేశాయో తెలుసుకోవచ్చు.

వైష్ణవమత వ్యాప్తికి తిరుపతి క్షేత్రం ప్రముఖ క్షేత్రంగా ఉండేదని, తిరుపతి క్షేత్రాన్ని అభివృద్ధి చేసినవారు విజయనగర రాజులేనని, వారిలో సంగమ, సాళువ,

తుళువ, ఆరవీటి వంశాలవారున్నారని ఈ అధ్యాయం ప్రారంభంలో పేర్కొనడం జరిగింది. ముఖ్యంగా సాళువ వంశీయుడైన నరసింహరాయల కాలంలోనే వేంకటేశ్వర పాదపద్మారాధకుడు, సంకీర్తనా కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు విజయనగరానికి వచ్చాడని తెలపడం జరిగింది. అన్నమయ్య కీర్తనలు అప్పటికే ప్రముఖ క్షేత్రాల్లో వినిపించసాగాయి. తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు అంటే తాళ్ళపాక చిన్నన్న శ్రీకృష్ణదేవరాయల సమకాలికులని చరిత్రకారులు చెబుతారు. తాళ్ళపాక వంశం వారికి స్వామి ప్రత్యక్షమైనాడనే కీర్తి దేశమంతా వ్యాపించి ఉన్నందువల్ల వీరు చేసే ఆధ్యాత్మిక శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రచారాలకు విశేషమైన జనాధరణ లభించింది. దీనితో వైష్ణవమతానికి కొంత ప్రచారం జరిగింది.

వీటికి తోడు శ్రీకృష్ణదేవరాయలు తండ్రైన నరసనాయకుడు తిరుపతి వేంకటేశ్వర స్వామివారిపై అపారమైన భక్తితోపాటు ఆధ్యాత్మిక చింతన కూడా గొప్పగా ఉన్నట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాజులు కావడం వలన ఆనాటి మంత్రులు, పురోహితులు మొదలైనవారు కుటుంబ సంప్రదాయాచారాలను పోషించే ప్రవృత్తి ఉన్నావారు. కాబట్టి శ్రీకృష్ణదేవరాయలపై బాల్యం నుంచే శ్రీవైష్ణవ సంప్రదాయాభిమానం ఉన్నట్లు పేర్కొనవచ్చు. "తన తల్లిదండ్రులు అనుష్ఠాన దీక్షతో, సంప్రదాయ నిష్ఠతో గృహస్థాశ్రమ విధులు, నిత్య నైమిత్తిక పూజ కార్యక్రమాలు అంతఃపుర దైవ మందిరంలో విశిష్టాద్వైత సిద్ధాంతానుగుణంగా జరిగే ఆరాధనా విధానం బాల్యకౌమార యౌవన దశల్లో రాయల వారి హృదయాన్ని ఆకర్షించింది. అతడు వంశాచారాన్ని అనుసరించి ప్రార్థనాది కర్మలను ఆచరించే వాడని పేయస్ అనే చారిత్రకారుడు పేర్కొన్నాడు." (వేంకటాచార్య, కె. ఆముక్తమాల్యద విశిష్టాద్వైత ప్రకాశం - I, పుట.36.)

ఇంకా పలు కారణాలు రాయల హృదయంపై వైష్ణవ సంప్రదాయ ముద్ర వేశాయి. విజయనగర పాలకుడగు తులువ నరసనాయకుడు తిరుపతి వేంకటేశ్వర

స్వామికి భక్తుడు. ఆ వంశం వారికి వేంకటేశ్వరస్వామివారిని ఇలవేల్పుగా భావించి అక్కడ వైష్ణవాచారాలు చేశారు. రామానుజాచార్యుల వారి తరువాత వైష్ణవంలో ఉత్సవ సంప్రదాయ పద్ధతులు పెరిగాయని పేర్కొనడం జరిగింది. ఈ విధానం వెంకటేశ్వర స్వామి దగ్గర కూడా ప్రారంభమయ్యాయి. ఇంటి దగ్గర కూడా వైష్ణవ సంప్రదాయ ఉత్సవాలు చేయటం అనేది కొనసాగి ఉంటుంది. ఈ సంప్రదాయం కృష్ణదేవరాయల వారికి ఇంటినుంచే సంక్రమించింది. ఇక అప్పటికే దైవ సాక్షాత్కారం పొందినవారుగా ప్రసిద్ధులైన అన్నమాచార్యుల వారి సంకీర్తనలు, వివిధ వైష్ణవాలయాల్లో కొనసాగే నృత్య, గానాలు ప్రజలపై పడటం, వాటికి కూడా రాయలు ఆకర్షితుడు కావడం జరిగి ఉంటుంది. మరొక కారణం రాయలు స్వయంగా తిరుపతి వేంకటేశ్వర స్వామి యెడల భక్తిప్రపత్తులు  ఉన్నవాడు. రాయలకు మిత్రులుగా, సమీప వయసులో ఉన్న పలువురు విశిష్టాదైతమత సంప్రదాయాన్ని పాటించడం మొదలైన విషయాలు రాయలపై ప్రభావం చూపి ఉంటాయి. రాజు కావడం వలన మత సంప్రదాయంలో కొన్ని చోట్ల కొంత పరమత సహనం పాటించినప్పటికీ, వ్యక్తిగతంగా విశిష్టాద్వైతాన్ని తు.చ. తప్పకుండా పాటించాడు. ఈ విధమైన సాంస్కృతిక వాతావరణం ఇంటిలో ఉండటంతో విశిష్టాద్వైతమతం వైపుకు ఆకర్షితుడై ఉంటాడు. ఇటువంటి ఒక వ్యక్తికి సాక్షాత్తు విష్ణువే వచ్చి తనకు సంబంధించిన ఇతివృత్తంతో రచన చేయమనడంతో ఆముక్తమాల్యద రచన వెలువడింది.

### 4.3.4. వాల్మీకి చరిత్రము-రఘునాథ భూపాలుడు

వాల్మీకి చరిత్ర కర్త రఘునాథ భూపాలుడు. ఇతనికి రఘునాథ నాయకుడని కూడా పేర్కొంటారు. ఇతడు తంజావూరును పరిపాలించిన రాజు. ఇతడు వాల్మీకి చరిత్రతో పాటు రామాయణం కూడా రచించాడు. రామాయణం అసమగ్రంగా లభిస్తున్నది. వీటితో పాటు గజేంద్ర మోక్షం; రుక్మిణీ కృష్ణవివాహం అనే యక్షగానాలు జానకీ పరిణయం అనే చాటు కావ్యం రాశాడని తెలుస్తున్నప్పటికీ, ఇవి అలభ్యాలు.

ఇక ఈ రచనలు వెలువడిన నేపథ్యం చూస్తే కూడా ఇవి కూడా వైష్ణవమతాభివృద్ధిలో కొనసాగింపుగానే కొనసాగినట్లు పేర్కొనవచ్చు. దానికి కారణం తంజావూరును పరిపాలించిన రాజులు వైష్ణవమతాన్ని అవలంబించారు. రఘునాథుని పూర్వీకులు కూడా వైష్ణవమతాన్ని, ముఖ్యంగా శ్రీరంగనాథున్ని కొలిచేవారు. రఘునాథనాయకుని తాత పినచెవ్వప్పనాయకుడు శ్రీరంగనాథుని భక్తుడని చెబుతారు. అతడు జీవించి ఉండగానే అచ్యుతనాయునికి రఘునాథనాయకుడు జన్మించాడని తాత అయిన పినచెవ్వప్పనాయకుని దగ్గర పెరిగాడని చరిత్రద్వారా అవగతమవుతుంది. విజయనగరాన్ని పాలించిన అచ్యుతదేవరాయల కాలంలో పినచెవ్వప్పనాయకుడు సామంత రాజునుండి స్వతంత్రుడిగా అవతరించాడు. దానికి గల కారణం విజయనగర రాజులతో గల వైవాహిక సంబంధాలు. పిన చెవ్వప్పనాయకుడు విజయనగరంతో సంబంధం ఉండటం వల్ల, విజయనగర రాజులు అవలంబించిన వైష్ణవమతానే తాను అవలంబించాడని భావించవచ్చు. ఇదే సంప్రదాయం కుటుంబంలో కొనసాగడం వలన రఘునాథ నాయకుడు కూడా వైష్ణవ సంప్రదాయాభిమానిగా కొనసాగాడు. కాని ఇతడు పరమత సహనాన్ని కొనసాగించిన వాడుగా చరిత్రకారులు పేర్కొంటారు. “రఘునాథ నాయకులు శ్రీరామభక్తుడు. హరహరభేదము లేకుండ సమస్తమతముల నొక్కలాగుననే చూచెడివాడు... సేతువునందును గుంభఘోణమునందును, శ్రీరంగమునందును శ్రీరామభద్రుని ప్రతిష్ఠించి మహోన్నత గోపుర విరాజమానలగు మంటపులను గట్టించినాడు. వంచనదేశ్వరునకు, శ్రీధేనునాథునకును, శ్రీవేంకటేశ్వరునకును, శ్రీరంగనాథునకును మహోజ్జ్వలమంటప రాజములను గట్టించినాడు.” (వెంకట రామనరసింహము, కాకర్ల: దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర, పుట.36.) అటువంటి శ్రీరామభక్తుడు వాల్మీకి చరిత్ర, రామాయణాలను రచించాడు. ఈ కృతులు రెండు కూడా శ్రీరామచంద్ర ప్రభువుకు అంకితమయ్యాయి. వాల్మీకి చరిత్రకు మూలం కూడా సంస్కృతం నుండి స్వీకరించినటువంటిదే. “రఘునాథ రాయల వాల్మీకి చరిత్రకు మూలము సంస్కృత ధర్మఖండము నందలి వాల్మీకి చరిత్ర”(పైదే, పుట.43.)

వాల్మీకిచరిత్ర రచన కూడా పూర్వ కవులు అనుసరించిన విధానం కనిపిస్తుంది. స్వప్నంలో శ్రీరాముడు సాక్షాత్కరించి తన కథ రచించిన వాల్మీకి చరిత్రను రచించమని చెప్పినట్లు అవతారికలో కలదు.

"నీ కవితావిలాసము గణింప సుధారసాధారకంటె నిం
పై కనుపించు దాన గృతియైనను మిక్కిలి సొంపు నింపదే
నాకథ దొల్లి యర్థరచనారుచి మించగ జెప్పి తట్టివా
ల్మీకి చరిత్రమున్ నొడువు మెచ్చుగ నీవిపు డచ్యుతాత్మజా.

పావనరమణీయంబగు
నావాల్మీకుల చరిత్ర మది కృతి సేయన్
ఠీవిమెఱయు నీ పుణ్య
ప్రావీణ్యము లచ్యులేంద్రు రఘునాథనృపా" (రఘునాథభూపాలుడు: వాల్మీకి చరిత్రము, 1-21,22) అని స్వప్నంలో శ్రీరామచంద్రుడు పేర్కొనగా, రఘునాథ నాయకుడు వాల్మీకి చరిత్రను ప్రారంభించాడు. ఇటువంటి విషయాన్ని గురించి పూర్వకవులు కొందరు ఇంతకు పూర్వమే పేర్కొని ఉన్నారు. స్వప్నంలో భగవంతడు కనిపించి రచన చేయమని చెప్పడం పూర్వపు కవులు పేర్కొన్నారు. ఇదే విధానం రఘునాథ నాయకుడు కూడా పాటించాడు.

## 4.4. ఇతర వైష్ణవరచనలు

తెలుగులో వైష్ణవమతాన్ని అనుసరిస్తూ అనేక గ్రంథాలు వచ్చాయి. ఇందులో రామయాణం కథా వస్తువుగా రామునికి సంబంధించిన రచనలు వచ్చాయి. అదే విధంగా కృష్ణుడిని కథా వస్తువుగా చేసుకొని కూడా రచనలు వచ్చాయి. వివిధ ప్రక్రియల్లో కూడా విష్ణువుకు సంబంధించి కూడా రచనలు వచ్చాయి. పురాణాలు, కథా కావ్యాలు, క్షేత్రమాహాత్మ్యాలు, ప్రబంధాలు మొదలైన అనేక ప్రక్రియల్లో పలు రచనలు వచ్చాయి.

ఇలా విష్ణువుకు సంబంధించిన రచనలు ఆధునిక కాలంలో కూడా వచ్చాయి. ఇలా వచ్చిన గ్రంథాలన్నింటినీ పరిశీలించడం అనేది కొంతక్లిష్టమైన విషయం. అందువల్ల నా పరిశోధనా వ్యాసానికి అవసరమైన మేరకు మాత్రమే ఇక్కడ పరిశీలించాను.

వైష్ణవ మత సాహిత్యం అనేది మొదట పలు కారణాలతో ప్రారంభమైనప్పటికీ తరువాత అది విస్తృతంగా వివిధ ప్రక్రియల్లో వెలువడటానికి కారణమైంది. అందుకు పలు సామాజిక, రాజకీయ కారణాలు కూడా కారణం అయ్యాయి. రాజుల ఆధరణ అనేది కూడా వైష్ణవ రచనలకు ఒక ప్రధాన కారణం అని చెప్పవచ్చు. ఈ రాజుల ఆధరణ వల్ల కొందరు శివకవులు, అద్వైతులయిన వారు వైష్ణవపరమైన రచనలు చేశారు. ముఖ్యంగా ఇక్కడ పలువురు కవులు తమ కలలో భగవంతుడు కనిపించి రచన చేయమనటం వల్ల రచన చేసినట్లు చెప్పడం అనేది ప్రారంభమైంది. ఈ సంప్రదాయం అనేది వైష్ణవపరమైన రచనల్లోనే కనిపిస్తుంది. ఈ విధానం శతాబ్దాల కాలం కొనసాగింది.

కొన్ని ప్రక్రియలను వైష్ణవమత ప్రచారానికి ప్రత్యేక సాధనంగా కూడా వాడుకోన్నారు. అలా మత ప్రచారానికి వాడుకొన్న ప్రక్రియ యక్షగానం. యక్షగానాల ద్వారా తంజావూరు కవులు వైష్ణవమతాన్ని ప్రచారం చేశారు. వీటికి తోడు మానవునికి ఉన్న భగద్భక్తి కూడా ఒక కారణం. అందువల్లనే ఆధునిక కాలంలో కూడా రామాయణ రచనలు జరిగాయి.

# ఐదవ అధ్యాయం

## ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు-

## పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ

# 5. ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ

ఈ ఉద్యమాలు పాశ్చాత్యుల ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించాయి. కానీ ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారి ఇక్కడ సాహిత్యోద్యమాలుగా మారాయి. అంటే ఇవి పలు కారణాలవల్ల పాశ్చాత్య దేశాల్లో ఉద్యమ రూపంలో ఉన్నాయి. క్రమంగా అవి ఇతర భాషా సాహిత్యాలపై కూడా ప్రభావం చూపాయి. అలా పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల, ఆయా దేశాల్లో వచ్చిన పరిణామాలవల్ల అవి తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. తరువాత ఇక్కడ ఉన్న పరిస్థితులు కూడా ఆ ఉద్యమాలు ఏర్పడ్డానికి కారణం అయ్యాయి. చివరికి సాహిత్యోద్యమంగా మారి సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. అలా ఏర్పడిన ఉద్యమాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

## 5.1. భావకవిత్వోద్యమం

భారతీయ భాషల్లోనూ, తెలుగులోనూ ఆధునిక సాహిత్య లక్షణాలు ప్రారంభమైంది పాశ్చాత్య సాహిత్య పరిచయంతోనే అనేది అందరూ అంగీకరించే విషయం. అలా పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వెలువడిన మొట్టమొదటి సాహిత్యోద్యమంగా పేర్కొదగింది కాల్పనికోద్యమ సాహిత్యం లేదా భావకవిత్వోద్యం. అయితే తెలుగులో కాల్పనిక సాహిత్యారంభం పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్లనే ప్రారంభమయినప్పటికీ, పాశ్చాత్య సమాజంలో వచ్చిన సాహిత్యాల ధ్యేయం, ప్రయోజనంకానీ, పాశ్చాత్య దేశాల్లో ఉన్న సామాజిక అస్థిత్వంకానీ తెలుగు కాల్పనిక సాహిత్యానికి లేదనేది సాహిత్య విమర్శకుల అభిప్రాయం.

ఈ ఉద్యమం పాశ్చాత్య సాహిత్యంలో ఏర్పడిన చాలా కాలం తరువాత తెలుగులో ప్రవేశించింది. పాశ్చాత్య దేశాల్లో ఉన్న పరిస్థితులు నాడు భారతదేశంలోగానీ,

ఆంధ్రదేశంలోగానీ లేవు. కానీ భావకవిత్వంలో ఒక శాఖగా భావించే దేశభక్తి కవిత్వానికి మాత్రం స్థానిక నేపథ్యం ఉంది. నాడు దేశం మొత్తం స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాటం చేస్తున్నారు. ఈ కారణం వల్ల ఇది పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించినప్పటికీ ఇక్కడి పరిస్థితులకు అనుకూలంగా మారి ఉద్యమంగా ఏర్పడింది. ఇక పాశ్చాత్య దేశాల్లో కాల్పనిక వాదం ఏర్పడినప్పుడు ఉన్న పరిస్థితులు ఏమిటి? అవి తెలుగులో ప్రవేశించేనాటికి ఏ విధంగా మార్పుచెందాయి? అనేటువంటి అంశాలను ఇక్కడ పరిశీలించదలుచుకున్నాను.

ఇక పాశ్చాత్య దేశాల్లో రొమాంటిసిజం అనే పేరుతో వ్యవహరిస్తున్న సాహిత్యాన్ని తెలుగులో కాల్పనికోద్యమం అనే పేరుతో వ్యవహరిస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో కాల్పనిక సాహిత్యం వెలువడటానికి వివిధ కారణాలున్నాయి. పాశ్చాత్య దేశాల్లో వెలువడిన కాల్పనికవాద సాహిత్యం పారిశ్రామిక విప్లవం పట్ల లిబరల్ మేధావుల ప్రతిక్రియగా వచ్చిన సాహిత్యంగా కనిపిస్తుంది. ముఖ్యంగా వ్యక్తి స్వేచ్ఛ ప్రధానంగా ఏర్పడినటువంటి సాహిత్యోద్యమం కాల్పనికవాదం. పురుషులు ఈ సాహిత్యాన్ని కొనసాగించారు. “ఫ్రెంచ్ విప్లవం తరువాత శ్రమజీవనులు కాని సంపన్నులంతా స్వేచ్ఛా సమానత్వాలను ఊహాలోకాల్లో సృష్టించుకొని ఆనందించడం మొదలు పెట్టారు. దాన్నే రొమాంటిసిజమ్ అంటారు. అది 19వ శతాబ్దంలో బాగా అభివృద్ధి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా రొమాంటిస్టులంతా పురుషులే కదా! వాళ్ళకు స్వేచ్ఛ అంటే స్త్రీలతో యథేచ్ఛగా ప్రవర్తించడమే. సంప్రదాయంగా వస్తున్నందున రొమాంటిసిజం అనే పేరుతో ఏ స్త్రీనైనా లేక ఎంతమంది స్త్రీలనైనా పురుషుడు ప్రేమించవచ్చు. ఆమె వలన వియోగ దుఃఖాన్ని బాహాటంగా వ్యక్తం చేయవచ్చు. ఆమెను దేవతగా ఆరాధిచవచ్చు- అని భావించారు”. (రామకోటిశాస్త్రి, కేతవరపు: మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు, పుట.39.) తక్కిన దేశాల్లో ప్రారంభమైన కాల్పనిక సాహిత్యాల్లో ఇదే విధానం కనిపిస్తుంది. కవులయిన వారు ఎక్కువగా ఈ కాల్పనిక సాహిత్య ప్రభావానికి లోనయ్యారు.

ఈ కాల్పనికోద్యమ సాహిత్యం భారతీయ భాషల్లో వెలువడటానికి ప్రధానమైన కారణం ఆంగ్ల విద్యావిధానం అని అందరు చెబుతారు. ఆనాడు దేశంలో అమలు జరిపిన పాశ్చాత్య విద్య అనేక మంది విద్యావంతులను తయారు చేసింది. విద్యావంతులైన వారిలో అధిక సంఖ్యాకులు పాశ్చాత్య నాగరికతా ప్రభావానికి లోనయ్యారు. ఆంగ్ల భాషా ప్రభావితులైన యువకులు పాశ్చాత్య రీతులను అధ్యయనం చేయడం అనేది ఒక ప్రాధమిక అంశంగా మారింది. ముఖ్యంగా ఈ ప్రభావం సాహిత్యం పై ఎక్కువగా పడింది. ఆంగ్ల సాహిత్యంలో పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభంలో విజృంభించిన కాల్పనికోద్యమ సాహిత్యాన్ని యిరవయ్యో శతాబ్దపు తొలి భాగంలో భారతీయ సాహిత్యవేత్తలు అనుకరించారు. ఈ కాల్పనిక సాహిత్యాన్ని మొదట బెంగాల్ కవులు ఎక్కువగా తమ బెంగాలి సాహిత్యంలో రచించారు. "మొదట హైందవాంగ్ల కవులైన మైకేల్ మధుసూదన దత్, డెరూజియో, తోరుదత్ మొదలగువారు ఆంగ్లకాల్పనిక కవుల కవితారీతులను అనుసరించిరి." (లలితకుమారి, జి: ఆధునికాంధ్ర కవితాతత్వము, పుట.20.)

తరువాత ఈ కాల్పనికోద్యమం ఇతర భారతీయ భాషల్లోకి ప్రవేశించింది. తెలుగులో కూడా వివిధ శాఖల పేరుతో కాల్పనిక సాహిత్యం వెలువడింది. తెలుగులో వెలువడిన కాల్పనిక సాహిత్యం పై బెంగాలీ కవుల ప్రభావం ఉన్నట్లు సాహిత్య రచనల ద్వారా వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా రవీంద్రనాథ్ ఠాగూర్ తెలుగు కవులను ఎక్కువగా ప్రభావితం చేసినట్లు పలు రచనల ద్వారా తెలుస్తుంది. ప్రముఖ కవులే ఈ విషయాన్ని తెలిపారు. "రాయప్రోలు సుబ్బారావు 'ఉత్కలాశితంబంబులొత్తి హత్తిన ఆంధ్రుల యశోదుకూల సితాచాలములు' చూసిన జాతీయోద్యమంలో ప్రారంభించి, రవీంద్రుని యొద్ద గురుకులావాసం చేసి ఆయన ప్రభావాన్ని ఈయన స్వీకరించాడు" (సుబ్రహ్మణ్యం, జి.వి: సారస్వత వ్యాసములు (ప్రథమ సంపుటం.) పుట.356.) రాయప్రోలు సుబ్బారావే కాకుండా కృష్ణశాస్త్రిగారు కూడా ఠాగూర్ ప్రభావానికి లోనయ్యారు. "ఆంగ్లసాహిత్యంతోనూ, సూఫీ, వంగ సాహిత్యాలతోనూ నాగురుదేవులద్వారానే నాకు కొంచెం పరిచయం" (పైదే) అని కృష్ణశాస్త్రిగారే

స్వయంగా చెప్పారు. ఇలా ప్రారంభమైన కాల్పనిక కవిత్వం తెలుగులో విస్తృతంగా రచనలు రావడానికి కారణమయ్యింది. ఇలా వెలువడిన కాల్పనిక సాహిత్యాన్ని విమర్శకులు వివిధ శాఖలుగా విభజించారు. ప్రకృతి, ప్రణయ, దేశభక్తి మొదలగు పేర్లతో శాఖలగా విభజించారు.

కాల్పనిక సాహిత్యంలో కవి ప్రకృతి, ప్రణయ కవిత్వాలకు ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇచ్చినప్పటికీ, ఆ సాహిత్యం వెలువడిన పరిస్థితుల వల్ల తక్కిన భావకవిత్వ శాఖలు కూడా ప్రాముఖ్యతను వహించాయి. భావకవిత్వంలో వెలువడిన కొన్ని శాఖలకు ఇక్కడ ఎటువంటి సామాజిక అస్థిత్వం లేదు. కేవలం పాశ్చాత్య విధానాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే కవులు సాహిత్యాన్ని వెలువరించారు. కాని కొన్ని శాఖలు ఆయా పరిస్థితులనుంచి పుట్టాయి. ఉదాహరణకు ప్రకృతి, ప్రణయ కవిత్వానికి ఎటువంటి సామాజిక అస్థిత్వం లేదు. ఇది కేవలం పాశ్చాత్యానుకరణ మాత్రమే. అందువలన ఇవి వస్తు రహితంగా కనిపిస్తాయి. కాని నాడు వెలువడిన దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, స్మృతి కవిత్వం మాత్రం నాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఏర్పడినటువంటివి. కాని కవులు మాత్రం వస్తురహితంగా కనిపించే ప్రకృతి, ప్రణయ కవిత్వాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు విమర్శకులు అభిప్రాయపడ్డారు. "భావకవుల కవిత్వంలో రాజకీయ సాంఘిక జీవిత స్పృహ, దేశభక్తి మొదలైన అంశాలు ద్వితీయ స్థానాన్ని మాత్రమే అలంకరించాయి. వారి ఊహలో ప్రథమ స్థానం ప్రేమకే". (శివప్రసాద్, ముదిగొండ: ఉద్యమదర్శనము, పుట.73.) అయినప్పటికీ దేశభక్తి సాహిత్యం ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించింది. దానికి గల కారణం ఆనాటి అవసరం. భారతదేశ స్వాతంత్రేచ్ఛ వల్ల, భారతీయ భాషల్లోనూ, తెలుగులోనూ కవులు స్పందించారు. స్వాతంత్రేచ్ఛ, స్వాతంత్రోద్యమం ఆనాటి సమాజాన్ని అత్యధికంగా ప్రభావితం చేసింది. ఎంతటి కాల్పనిక కవులైనా ఆ ఉద్యమ ప్రభావాన్ని తప్పించుకోలేకపోయారు. దానికి గల కారణం ఆనాడు భారతదేశం స్వాతంత్ర్యం కోసం పోరాడటం. భారతదేశంలోనే కాక తక్కిన దేశాల్లో కూడా స్వాతంత్ర్య పోరాట

సమయంలో ఆయా దేశాల కవులు రచనలు చేయడం అనేది సాధారణ విషయం. ఆయా దేశాల దేశభక్తి సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు కొన్ని సామాన్య అంశాలను పరిశోధకులు గమనించారు. అవి

"1. దేశం మీద అవ్యాజమైన ప్రేమ, భక్తీ.

2. దేశంలోని నదీనదాలు, కొండలు గుట్టలు ఇది అది అని లేకుండా అన్నీ ప్రీతి పాత్రలు కావడం.

3. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, వేషభాషలు సమ్మతింపబడటం.

4. పురాప్రభావాన్ని గుర్తు చేయడం; తన్మూలంగా ఉత్సాహాన్ని కలిగించడం.

5. నాయక ప్రశంస: దేశాన్ని నడిపించే నాయకులు అనేక విధాల స్తుతింపబడవచ్చు.

6. అసలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల తత్త్వాన్ని, స్వరూపాన్ని నిరూపించడం.

7. సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించడం.

8. ప్రపంచశాంతిని ఆకాంక్షించడం. ఇది విశ్వైక దృష్టి గల కవులు చేసే పని." (సుబ్బారెడ్డి, మద్దూరి: తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, పుట.51-52.) వీటిని పరిశోధకుడు గ్రీకు, ఫ్రెంచి, జర్మన్, చైనా, జెకోస్లోవేకియా, ఐర్లాండ్, రష్యా, అమెరికన్, ఆంగ్ల సాహిత్యాల దేశభక్తి కవిత్వాన్ని పరిశీలించి పై అంశాలు సాధారణంగా కనిపించేవిగా పేర్కొన్నారు. పై అంశాలను పరిశీలించినట్లయితే దేశభక్తి కవిత్వంలోనే భావకవిత్వలోని తక్కిన శాఖలకు సంబంధించిన వివిధ లక్షణాలు కనిపిస్తాయి. దేశంలోని నదీనదాలు, కొండలు గుట్టలు ఇది, అది అని లేకుండా అన్నీ ప్రీతి పాత్రలు కావడం అనేది ప్రకృతి కవిత్వంలో కనిపిస్తుంది. ఇక సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించడం అనేది సంఘసంస్కరణ కవిత్వంలో కనిపించే అంశం. పై అంశాలను గమనించినట్లయితే దేశభక్తి కవిత్వంలో తక్కిన శాఖలకు సంబంధించిన లక్షణాలు కొన్ని ఉన్నాయని తెలుస్తుంది. అయితే ఇక్కడ ఒక సందేహం వస్తుంది. కాల్పనిక లేక భావకవిత్వంలో దేశభక్తి కవిత్వం ఒక భాగమా? లేక దేశభక్తి కవిత్వంలో ప్రకృతి, ప్రణయ కవిత్వాలు భాగమా? అనే సందేహం వస్తుంది. నాటి అవసరాల దృష్ట్యా దేశభక్తి కవిత్వం అనేది అత్యంత ప్రాధన్యత ఉన్నటువంటిది కాబట్టి దేశభక్తి కవిత్వమే ముఖ్యమైందని

భావించవచ్చు.

ఇక భావకవిత్వంలో సామాజిక నేపథ్యమున్న శాఖ దేశభక్తి కవిత్వం అని పేర్కొనడం జరిగింది. దేశభక్తి కవిత్వం రావడానికి ప్రధాన కారణం నాడు దేశంలో జరుగుతున్న జాతీయోద్యమం. భావకవిత్వం భారతదేశంలోకి ప్రవేశించక పూర్వమే భారత దేశంలో స్వాతంత్రోద్యమ భావన అనేది ప్రారంభమయినట్లు భావించవచ్చు. ఈ స్వాతంత్రోద్యమ భావన వివిధ దశల్లో కొనసాగింది.

తూర్పుఇండియా సంఘంనుంచీ 1758లో భారతదేశాధికారాన్ని బ్రిటిషు పార్లమెంటు తీసుకుంది. భారతదేశాన్ని ఒక మార్కెట్టుగా చేసే క్రమంలో, భారతదేశంలోని ముడిపదార్థాల వంటి సంపదను కొల్లగొట్టానికి ఆంగ్లేయులు చేసిన ఆధునికీకరణతో దేశంలో జాతీయభావం వ్యాపించడానికి పునాదులేర్పడ్డాయి. ఉద్యోగాలనూ, పారిశ్రామిక సౌకర్యాలనూ, నీటిపారుదల సౌకర్యాలను కల్పించడంలోనూ ఆంగ్లేయులు, తమ ప్రయోజనాలకు అనుకూలమైన పద్ధతులు అవలంభించారు. దీనిని గమనించిన భారతీయ మేధావులకు కనువిప్పు కలిగింది. ఆంగ్లేయుల విధానాల వలన ఎన్నో ప్రాంతాలలో కరువుకాటకాలు సంభవించాయి. సంస్కరణవాదులైన మహారాష్ట్ర, బెంగాలీ మేధావులు దేశానికి జరుగుతున్న అన్యాయాల్ని బహిరంగంగా చెప్పడం ప్రారంభించారు.

మరొక వైపున స్థానికరాజులు తమ మనుగడకోసం, రాజ్యంకోసం ఆంగ్లేయులను ప్రతిఘటించడం జరిగింది. దీనితో అనేక ప్రాంతాలను పాలిస్తున్న ఆంగ్లేయులు అప్పుడప్పుడు స్థానిక రాజుల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కొంటూ వచ్చారు. అలా ప్రారంభమైన ప్రతిఘటనలు చివరకు యుద్ధాల వరకు తీసుకెళ్ళాయి. ఆ విధంగా జరిగినటువంటి యుద్ధాలే మైసూరు రాజు టిప్పుసుల్తానుకు ఆంగ్లేయులకు జరిగిన యుద్ధం. తదనంతరం కూడా అప్పుడప్పుడు యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. అలా

కొనసాగుతున్న నిరాశా, నిస్పృహలు ఒక్కసారిగా 1857లో తిరుగుబాటు రూపంలో బయటపడింది. వివిధ ప్రాంతాలలో బ్రిటిషువారిపై తిరుగుబాటు జరిగింది. కాని ఆ తిరుగుబాటును బ్రిటిషువారు అణిచివేశారు. ఇది పూర్తిగా దేశం కోసం దేశభక్తికి ప్రతీకగా జరిగిన పోరాటం అని పేర్కొనలేం. కేవలం ఆయా ప్రాంతాల రాజులు, వారి మనుగడకోసం చేసిన పోరాటాలుగా భావించవచ్చు. కానీ ఇవి తరువాత కాలంలో ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష ఏర్పడటానికి ఒక ప్రేరణగా నిలిచిందనవచ్చు.

ఈ కాలంలోనే కాలేజీల్లో ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. కాలేజీల్లోని ఆంగ్ల విద్యా విధానం వలన తరువాత కాలంలో ఆంగ్లవిద్యావ్యాప్తి జరిగింది. ఈ ఆంగ్ల విద్యావిధానం భారతీయుల్లో కొత్త ఆలోచనలకు దారితీశింది. ఆంగ్ల విద్యను అభ్యసించిన అనేక మంది భారతీయులు విదేశీయుల చర్యలను పరిశీలించడం, ఇబ్బందికరమైన వాటిని వ్యతిరేకించడం జరుగుతూ వచ్చింది. ఒక విధంగా భారతీయుల్లో స్వాతంత్ర్య బీజారోపణ చేసిందని చెప్పవచ్చు. విద్యావంతులు, మేధావులు ప్రభుత్వ చర్యలను గమనించడం ప్రారంభించారు. ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక చట్టాలను వివిధ రూపాల్లో నిరసించడం, అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రారంభించారు.

ఈ వాతావరణంలో ఎ.ఓ. హ్యూమ్ అనే బ్రిటిష్ ఉద్యోగి ప్రయత్నాలతో ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య సంబంధాలను సమకూర్చే రాజకీయ వేదికగా 1885 లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనే వేదిక స్థాపించబడింది. ఇది బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకమైన వేదిక కాదు. ప్రజల్లో పెరుగుతున్న అశాంతికి రక్షణగోడ గా పని చెయ్యడం కోసం ఈ వేదికను స్థాపించడం జరిగింది. కాని బ్రిటిష్ వారు తమకు అనుకూలమైన చట్టాలను నిర్మించుకోవడం జరుగుతూనే ఉంది. అలా ఆంగ్లేయులు తమ ప్రయోజనాలకు జరిపిన చర్యల్లో బెంగాల్ విభజన ఒకటి. ఈ బెంగాల్ విభజనతో భారతీయుల్లోని అసంతృప్తి ఒక్కసారిగా జాతీయభావన రూపంలో

అంగ్లేయులపై వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పవచ్చు. 1905 తరువాత స్వరాజ్యం భారతీయుల జన్మహక్కు అన్న ధ్యేయంతో వందేమాతరోద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమాన్ని భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపింపచేయడానికి పలువురు భారతీయ మేధావులు, వివిధ భారతీయ నాయకులు వివిధ ప్రాంతాల్లో పర్యటనలు ప్రారంభించారు. అలా పర్యటించడంలో భాగంగా జరిగిందే బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర దేశ పర్యటన. బిపిన్ చంద్రపాల్ కలకత్తా నుండి బయలుదేరి ఆంధ్రలోని వివిధ ప్రాంతాల్లో ప్రసంగించారు. ఈ ఉపన్యాసాలు ఆంధ్రప్రజల్లో ఇంతకు ముందే బీజరూపంలో ఉన్న జాతీయోద్యమ భావనను మరింత రెచ్చగొట్టాయి. ప్రజలు మరింత ఉత్సాహంతో ఉద్యమంలో పాల్గొనడానికి అవకాశాన్ని కల్పించాయి.

1907 ఏప్రియల్ లో బిపిన్ చంద్రపాల్ గారి ఆంధ్ర పర్యటన ప్రారంభమైంది. ఏప్రియల్ 19 నుండి 24 వరకు రాజమండ్రిలో ఉపన్యసించారు. వారి ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారని, ఉపన్యాసాల చివరి రోజు చిలకమర్తివారు ఆశువుగా

'భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి' అనే పద్యం చెప్పారని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే ఈ పద్యం చిలకమర్తివారిది కాదని ఇటీవల కాలంలో పరిశోధకులు పేర్కొటున్నారు. దీనికి సంబంధించిన చర్చ జరిగింది. ప్రస్తుతం ఈ విషయం ఇక్కడ అప్రస్తుతం. కొందరు పరిశోధకులు ఈ 'భరతఖండంబు చక్కని పాడియావు' అనే పద్యం తొలి తెలుగు స్వాతంత్ర్యోద్యమ పద్యం అని పేర్కొన్నారు. "భరతఖండంబు' అన్న పద్యము తెలుగులో భారత జాతీయోద్యమ సంబంధమైన తొలిరచన యని చెప్పవచ్చును." (నారాయణ రెడ్డి, సి: ఆధునికాంధ్రకవిత్వము

సంప్రదాయాలు ప్రయోగాలు, పుట. 378.) కానీ అంతకు ముందు కూడా అంటే "1897-98 మధ్య కాలంలో "సరస్వతి మొదలయిన పత్రికల్లో భారతదేశపు స్థితిగతులను గూర్చి అశేషమైన ఖండికలు వెలువడ్డాయి" అని మొదలి నాగభూషణ శర్మగారు అన్నారు. (నాగభూషణ శర్మ, మొదలి: తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం, పుట.46.) కానీ 1902 లో కృష్ణా పత్రిక పుట్టినప్పటి నుంచీ దేశభక్తి పూరితమైన వ్యాసాలను వెలువరిస్తూ వచ్చిందని విమర్శకులు పేర్కొంటున్నారు.

తరువాత పలువురు రచయితలు కవులు రచనలు చేశారు. ఆంధ్రావళి (రాయప్రోలు సుబ్బారావు), ఆంధ్రప్రశస్తి (విశ్వనాధ సత్యనారాయణ), రాష్ట్రగానము (తుమ్మల సీతారామమూర్తిచౌదరి) హంపీక్షేత్రం (కొడాలి సుబ్బారావు) మొదలైన దేశభక్తి కావ్యాల్లో ప్రస్తుత (ఆనాటి) సామాజిక స్థితిని వర్ణించి ప్రాచీనాంధ్ర వైభవాన్ని గానం చేసి అదే దేశభక్తి అన్నారు. ఈ రకమైన కాల్పనిక కవే భావకవిత్వంలో గతచరిత్ర పునరుద్ధరణను కూడా ఒక అంశంగా చేసింది. ఇలా భావకవిత్వం పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగులోకి ప్రవేశించి, నాటి పరిస్థితులను తనుకు అనుకూలంగా మార్చుకొని అప్పటివరకు వస్తున్న సాహిత్య సంప్రదాయాన్ని మార్చివేసింది.

## 5.2. అభ్యుదయ సాహిత్యోద్యమం

పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించిన సాహిత్యోద్యమాల్లో అభ్యుదయ సాహిత్యోద్యమం కూడా ఒకటి. తరువాత ఇది కూడా ఇక్కడి పరిస్థితులకు అనుకూలంగా మారి ఒక ప్రత్యేక ఉద్యమంగా మారింది. ఒక విధంగా చెప్పాలంటే ప్రపంచ సాహిత్యంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా వచ్చిన ప్రతిస్పందనల్లో భాగంగా వచ్చిన సాహిత్యం అభ్యుదయ సాహిత్యోద్యమం. 20వ శతాబ్దంలో ప్రపంచంలోని అనేక దేశాలను ఆకర్షించిన ఉద్యమం 1917లో వచ్చిన రష్యా విప్లవం. రష్యాలో వచ్చిన ఈ సోషలిస్టు విప్లవ ప్రభావం భారతదేశంపైన ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఆనాడు భారతదేశ

స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న అన్ని రకాల అభిప్రాయాలు కలవారిపైన ఏదో ఒక రూపంలో రష్యన్ విప్లవ ప్రభావం కనిపిస్తుంది. అక్కడ జరుగుతున్న పరిణామాలను నాయకులు ఎంతో ఆసక్తితో పరిశీలించారు. దీనితోపాటు 1913-1918 మధ్య యుద్ధకాలంలో ప్రజల జీవితాలలో అనేక రకాలైన మార్పులు సంభవించాయి. సామాన్య ప్రజలు యుద్ధ సమయంలో కరువులు, వ్యాధుల బారినపడ్డారు. ఈ సమస్యల ఫలితంగా రేగిన అసంతృప్తిని కవులు/రచయితలు ఎవరూ చిత్రించలేదు.

అనంతరకాలంలో ప్రపంచంలోని అనేక దేశాలు ఆర్థికమాంద్య ప్రభావానికి లోనయ్యాయి. ఈ ఆర్థికమాంద్యం కాలంలో పెట్టుబడి దేశాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. కానీ ఈ ఆర్థిక మాంద్య ప్రభావం మాత్రం రష్యాను తాకలేదు. దానికి గల కారణం ఆనాడు రష్యా అనుసరించిన సామ్యవాద భావాలు, ప్రణాలికా బద్ధమైన సోషలిస్టు ఆర్థిక విధానం. ఈ సోషలిస్టు ఆర్థిక విధానం వల్ల ఆదేశంలోని ప్రజలందరి జీవన ప్రమాణం నానాటికీ అభివృద్ధి చెందింది.

రష్యా పరిస్థితి ఇలా ఉంటే భారతదేశ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండింది. పెట్టుబడిదారీ ప్రపంచాన్ని మొత్తంగా ఇబ్బందులకు గురిచేసిన ప్రపంచ ఆర్థికమాంద్యం 1930 తర్వాత ఒక దశాబ్దకాలంపైగా భారతదేశాన్ని ప్రభావితం చేసింది. ఆర్థిక మాంద్యంలో సంభవించే పరిణామాలన్ని కూడా భారతదేశంలో సంభవించాయి. నిరుద్యోగం పెరిగింది. చిన్న చిన్న ఆస్తులు కరిగిపోయాయి. రుణభారం పెరిగింది. రైతాంగం తీవ్ర నష్టాలపాలయ్యారు.

దీనికితోడు ఆనాడు రెండు రకాల ధోరణులు ప్రపంచంలో బయలుదేరాయి. ఒకటి హిట్లరు నాయకత్వాన ప్రారంభమైన ఫాసిస్టు సిద్ధాంతం. ఇది ప్రపంచానికి ప్రమాదంగా మారిన సమయం. రెండవ వైపున సోవియట్ రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం. ఈ ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించాయి. అదేశంలో

ఫ్యూడల్ పెట్టుబడిదారీ వ్యవస్థలను రద్దుచేసి సర్వహక్కులు ప్రజలకు ధారాదత్తం చేసి ఆదర్శ సామ్యవాద సమాజాన్ని నిర్మిస్తూ దినదినాభివృద్ధి పొందుతోంది. అదే సమయంలో ఆ దేశంలో జార్ చక్రవర్తి కాలంలో వలస దేశాలుగా ఉన్న వాటిని స్వాతంత్ర దేశాలుగా ప్రకటించారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ, తమ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాతున్న జాతీయోద్యమకారులకు తోడ్పడుతూవుంది. ఫలితంగా అనేక దేశాలలోని జాతీయోద్యమ నాయకులు, ప్రజలు, మేధావులు, సోషలిస్టు దేశంవైపుకు ఆకర్షించబడ్డారు. చివరకు మనదేశంలో నెహ్రూ వంటి జాతీయ నాయకులు కూడా రష్యా వైపు ఆకర్షితులయ్యారు. రవీంద్రనాథ్ ఠాగూరు లాంటివారు ఎంతో ఉత్తేజాన్ని పొందారు. ఆ సమయంలోనే జరిగిన 1930, 1932 సంవత్సరాల నాటి సత్యాగ్రహోద్యమాలు విఫలమైనట్లు భావించిన కొందరు కాంగ్రెస్ పార్టీని విడిచి మరొక మార్గాన్వేషణలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని నిర్మించారు. ఫలితంగా భారతదేశంలో కూడా సామ్యవాద భావాలు వ్యాపించాయి. మొదట అవి బెంగాల్ లో ప్రారంభమయ్యాయి. బ్రిటిషు పాలానా విధానం, వలసతత్వమే జాతి బానిసత్వానికి మూలకారణమని బెంగాలీలు నమ్మారు. వారు మితవాద అతివాదపక్ష రాజకీయాలతో కూడిన కాంగ్రెస్ వలన లాభం లేదని నిశ్చయించారు. గోఖలే, తిలక్, గాంధీజీ వంటి వారి నాయకత్వం చేత విసుగు చెందారు. యువజాతీయవాదులు సోషలిస్ట్ ఆకర్షణకు లోనయ్యారు.

భారతదేశంలో జరుగుతున్న ఈ పరిణామాలన్నీ ఆంధ్రదేశంపై ప్రభావాన్ని చూపాయి. ఆంధ్రదేశంలో కూడా సామ్యవాద భావాలకు ఆకర్షితులయ్యారు. దీనితో పలువురు ఉద్యమంలోకి ప్రవేశించారు. ఈ ఉద్యమానికి కొందరు నాయకులు కూడా తయారయ్యారు. ముఖ్యంగా ఈ ఉద్యమానికి నాయకులుగా గ్రామాలలో ఉండే ధనిక రైతుకుటుంబాలకు, బూర్జువా వర్గానికి చెందిన కొత్తతరం వారు నాయకులుగా వ్యవహరించారు. ఈ ఉద్యమం ఇంకా పలురూపాల్లో వ్యాప్తి చెందింది 'కూలీ రక్షణ సమితి' రైతు రక్షణ సమితి' 'యువజన సంఘాలవంటి నిర్మాణాల రూపాలతో

పల్లెల్లోనూ పట్టణాలల్లోనూ వ్యాపించసాగింది. అప్పటికింకా తెలుగు బస్తీల్లో ఆధునిక పరిశ్రమలంటూ ఏర్పడలేదు కాబట్టి పారిశ్రామిక కార్మిక వర్గానికి చెందిన కమ్యూనిస్టుపార్టీని నిర్మించడం అసంభవం. కాకుంటే కొత్తగా తలెత్తుతున్న జనపనార మిల్లుల్లోనూ ప్రింటింగ్ ప్రెస్సుల్లోనూ పనిచేసే వారిని జట్టుపనివారినీ సంఘటితపరచడం సాధ్యమైంది. "ఇక గ్రామ సీమకు సంబంధించి, అప్పట్లో రీసెటిల్ మెంట్ వంటి ప్రభుత్వ విధానాలకు జమిందారీ అక్రమాలకు వ్యతిరేకంగా రంగా నాయకత్వాన సాగుతూ వచ్చిన రైతాంగ ఉద్యమంలో ఆంధ్ర కమ్యూనిస్టులు కొంతకాలం సహకరించారు. కూలీరేట్లకు వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు."(రమణా రెడ్డి, కె.వి: అభ్యుదయ కవిత్వమూ - సవిర్శక సమీక్ష, అభ్యుదయ, 1987 మార్చి, పుట.7)

అప్పటికే కొందరు ఆనాటి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వివిధ దేశాల కమ్యూనిస్ట్ మేధావులతో సంబంధాలు కూడా పెట్టుకొన్నారు. ఆనాడు పెద్దపెద్ద నగరాల్లో పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. దీనితో పరిశ్రమల్లో కార్మికవర్గం తలెత్తింది. దీనితో కార్మికులు ఇతర కమ్యునిస్ట్ సంఘాలతో, విదేశీయులతో సంబంధాలు పెట్టుకొన్నారు. "దేశంలో విప్లవకారులు చాలామంది 1919లో వివిధ దేశాల కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తో సంబంధాలు పెట్టువటంతో ఈ దేశంలో కమ్యూనిస్టు చరిత్ర ప్రారంభమవుతుంది. కలకత్తా, బొంబాయి, మద్రాసు, లాహోరులలో కొందరు గ్రూపులుగా కమ్యూనిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసేవారు. 17-10-1920 నాడు భారతీయ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. ఎమ్.ఎన్. రాయ్, అబనీ ముఖర్జీ, మహమ్మద్ అలీ మొదలైనవారు కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులలో వున్నారు." (సుబ్రహ్మణ్యం, జి.వి. (సంపా.): సమాలోచనం, పుట.172.) సమాజంలో జరుగుతున్న ఈ పరిణామాలన్నీ కూడా సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి.

జరుగుతున్న ఈ అంశాల ద్వారా పలువురు కవులు/రచయితలు ప్రభావితులయ్యారు. సాహిత్యంలో కూడా ఈ అంశాలు ప్రతిఫలించాయి. 1930

దశకంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ఆర్థిక, సాంస్కృతిక కల్లోల పరిస్థితుల నుంచి సంస్కృతిని, మానవతనూ రక్షించాలనే ఆకాంక్ష వివిధ దేశాల రచయితలలో ఉద్భవించింది. ఈ పరిస్థితుల్ని చర్చించడానికి 1935 ప్రథమార్థంలో పారిస్ లో ప్రపంచ రచయితల సదస్సు జరిగింది. అప్పుడు లండన్ లో విద్యాభ్యాసం చేస్తున్న భారత విద్యార్థుల ప్రతినిధిగా సజ్జాద్ జహీర్ ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సు అనంతరం లండన్ లోని భారత విద్యార్థులు భారత అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పరచి ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళిక 1936 ఫిబ్రవరిలో అప్పటి లండన్ నుంచి వెలువడే డైలిట్రిబ్యూన్ అనే పత్రికలో కూడా ప్రచురితమయింది. వారు ప్రణాళికలో రూపొందించిన అంశాలు ఇవి. "మన దేశ నవజీవన సాధనకు తోడ్పాడేందుకు అనువుగా దేశ విదేశ వనరులను కూడదీసుకొని సవిమర్శక సృజనాత్మక వ్యవసాయం చేయాలి. ఈనాడు ప్రధానంగా వున్న ఆకలి, దరిద్రం, సాంఘిక అసమానత రాజకీయ పరాధీనత లాంటి సమస్యలమీద మనం కొత్త రచనలు చేయాలి. అప్పుడే మనం సమాజ సమస్యలను అవగతం చేసుకొని కార్యాచరణ దిగగలుగుతాము. ఈ ఆశయ సాధనకు క్రింది తీర్మాణాలు చేస్తున్నాం.

1. భారత దేశంలోని ప్రతిభాషా ప్రాంతానికి మన రచయితల సంఘాల నిర్మాణం, పత్రికలు, కరపత్రాల ప్రచురణ, మహాసభల నిర్వహణ ద్వారా ఈ సంఘాల మధ్య సమన్వయం.

2. మన సంఘ ఆశయాలతో వైరుధ్ధ్యంలేని ఇతర సాహిత్య సంఘాలతో సహకారం.

3. సాంస్కృతిక తిరోగమనాన్ని ఎదుర్కొనడం కోసం ఉదాత్త శిల్పం గల అభ్యుదయ సాహిత్య అనువాదం. తద్వారా భారత స్వాతంత్ర సామాజిక పునరుజ్జీవనాలకు తోడ్పాటు.

4. ఉమ్మడి భాషా (హిందుస్తానీ), ఉమ్మడిలిపి (ఇండోరోమన్) వ్యాప్తికోసం కృషి.

5. రచయితల ప్రయోజనాల రక్షణకు, వారి కృతుల ప్రచురణకు ఆర్థిక సహాయం.

6. భావప్రకటన, అభిప్రాయ ప్రకటన, స్వేచ్ఛల కోసం పోరాటం

ఈ ప్రణాళికలమీద సంతకాలు చేసిన వారు డా. ముల్కరాజ్ ఆనంద్. డా. కె.యస్. భట్,

డా. జె.సి ఘోష్, డా. యస్. సిన్హా, ఎం.డి. తాసీర సయ్యద్, సజ్జాద్ జహీర్". (రమణారెడ్డి, కె.వి: అభ్యుదయ కవిత్వమూ-సవిమర్శక సమీక్ష (వ్యా) అభ్యుదయ, 1987 మార్చి, పుట.9.)

అక్కడ జరిగిన ఆ తీర్మాణంతో భారత దేశంలో కూడా అభ్యుదయ రచయితల సంఘాన్ని స్థాపించాలని నిర్ణయించుకొన్నారు. ఇక్కడ కూడా సాహిత్యం సామ్యవాదోద్యమానికి సాధనం కావలన్న తలంపు ఏర్పడింది. దీనితో 1936 ఏప్రెల్ 10 లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల మొదటి సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షుడు ప్రేమ్ చంద్. ఈ అభ్యుదయ రచయితల సంఘంవారు "తమ మానిఫెస్టోలో ఇట్లు ప్రకటించారు. కవి

"1. మనదేశం సామ్రాజ్యవాద బానిసత్వం నుంచి విముక్తి పొందాలన్నా, జపాను దండయాత్ర నుంచి ఆత్మరక్షణ చేసుకోవాలన్నా జాతీయైక్యత ఎంత అవసరమో ఉద్ఘాటిస్తూ నాటికలు, కథలు, పద్యాలు, గేయాలు, పదాలు వ్రాయడం.

2. ఇతర దేశాల అభ్యుదయ రచనలను ముఖ్యంగా ఈ మధ్య వెలువడ్డ సోవియట్ చైనా సారస్వతాన్ని అనువదించి ప్రచురించడం

3. వివిధ భారతీయ భాషలలోని ప్రముఖ రచనలను సకాలానికి ఇంగ్లీషులో సంపుటాలుగా ప్రకటించడం.

4. పత్రికలను అభ్యుదయ సారస్వత సంపుటాలను వివిధ భారతీయ భాషల్లో ప్రకటించడం.

5. కార్మిక కర్షకులలో సాహిత్య వైజ్ఞాలక గ్రూపుల నేర్పరిచి అభ్యుదయ రచయితల సంఘాన్ని ప్రజాసాహిత్యంతోటి, కళలతోటి సన్నిహిత సంబంధ మేర్పరుచుట.

6. ప్రజానాట్యమండలితో సహకారం చేయడం నాటకాలను వ్రాసి వారి చేతనే ప్రదర్శింపజేసి సహాయపడటం." (శివప్రసాద్, ముదిగొండ: ఉద్యమ దర్శనము, పుట.143-144.) లండన్ లో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం కార్యాచరణ పత్రానికి (మ్యానిఫెస్టో), లక్నోలో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం కార్యాచరణ

పత్రానికి (మ్యానిఫెస్టో) కొంత మార్పు కనిపిస్తుంది. లండన్ లో ఉన్నప్పుడు వారు వెలువరించిన అభిప్రాయాలు ఆ దేశంలో ఉన్నప్పుడు, అక్కడ ఉండి ఆలోచించినవి. అవి ఇక్కడికి వచ్చాక ఇక్కడి పరిస్థితులను గమనించి తమ కార్యాచరణలో చిన్నపాటి మార్పులు చేసుకోన్నారు. ముఖ్యంగా ఇక్కడికి వచ్చాక వారు మొదట స్వేచ్ఛను కాంక్షించడంతోపాటు భారతదేశ స్వాతంత్ర్య ఆవశ్యకతను తేల్చి చెప్పడం, నాడు జపాన్ చేస్తున్న యుద్ధం నుంచి రక్షణ కోసం జాతీయ సమైక్యత సాధించడం ప్రధానాంశంగా భావించారు. లండన్ లోని అభ్యుదయ సదస్సులో తీసుకున్న మరొక నిర్ణయం హిందుస్తానీ భాషలో అభ్యుదయ రచనలును వెలువరించడం. కానీ లక్నో సదస్సులో భారతీయ భాషలన్నిటిలోనూ అభ్యుదయ రచనలు ప్రచురించాలని నిర్ణయించడం.

ఈ ప్రణాళికలో భాగంగా ఏర్పడిందే ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం. అందుకు ఆనాడు ఆంధ్రదేశంలో నెలకొని ఉన్న పరిస్థితులు కుడా దోహదం చేశాయి. ముఖ్యంగా 1930-1940 మధ్యకాలంలో ఆంధ్రదేశంలో దారిద్ర్యం, దురవస్థ అనేవి పెరిగిపోయాయి. ఈపరిస్థితులలో నుంచి బయటపడి, రష్యాలో ఉన్న పరిస్థితులు రావాలని రచయితలు/కవులు ఆశించారు.

ఆ కాలంలో తెలుగులో భావకవిత్వం లేదా కాల్పనిక కవిత్వం కొనసాగుతున్నది. ఎందరో కవులు భావకవిత్వానికి ఆకర్షితులై రచనలు చేశారు. కాలంలో మార్పులు రావటంతో పలువురు కవులు/రచయితలు కాలానికి అనుగుణంగా మారే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ఆకాలంలో, ఆసమయంలో దేశానికి భావకవిత్వం అవసరం లేకపోయింది. కవులకు కూడా భావకవిత్వం స్ఫూర్తినిచ్చె మార్గం కాలేకపోయింది. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా కవులు, రచయితలు కొత్త ప్రపంచానికై ఎదురు చూడసాగారు. ప్రపంచయుద్ధం వలన నలిగిపోయిన మానవాళికి అన్నం, నీరు, శాంతి, సమానత్వము, స్వేచ్ఛలను ప్రసాదించే సాహిత్యం అవసరం ఏర్పడింది. ‘‘దేశములో ఆకలి బాధ

ఎక్కువగావున్నది. దరిద్రదేవత తాండవమాడుచున్నది. దారిద్ర్యము ఆకలి బాధలను నివారించడానికి ఈ కవులు ఏమిచేశారని ఈ కాలములో చాలామంది అడుగుచున్నారు. ఏమిచేయలేదని సమితికవులు నేరం ఒప్పుకొనవల్సిందే.'' (నరసింహశాస్త్రి, నోరి: సారస్వతవ్యాసాలు (ఐదవసంపుటం), పుట.599.) అని రచయితలే తమని తాము ప్రశ్నించుకొనే పరిస్థితి నెలకొనింది.

ఇక అప్పటికే ఆంధ్ర దేశంలో కూడా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ''1928 నాటికే సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత గ్రంథాలు తెలుగులోకి రహస్యంగా దిగుమతి అయ్యాయి. ఆనాడు బనారస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న తెలుగు విద్యార్థులపైన మార్క్సిస్టు భావాల ప్రభావం బాగా పడింది. 1934లో కమ్యూనిస్టు పార్టీని బ్రిటీషు ప్రభుత్వం నిషేదించింది. అందువల్ల కమ్యూనిస్టులు కూలిసంఘాలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాల పేరుతో పనిచేశారు. 1935లో ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేసింది'' (రంగనాథాచార్యులు,కె.కె: తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక, పుట.173.)

ఈ కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రభావం, భారత అభ్యుదయ రచయిల సంఘం ఆంధ్రదేశంలోని కవుల/రచయితలను కూడా ప్రభావితులను చేశాయి. దీని వలన కొందరు అప్పడప్పుడే వ్యాప్తిలోకి వస్తున్న భారత అభ్యుదయ రచయితలను గమినించారు. కొందరు తెలుగు కవులు/రచయితలు కూడా భారత అభ్యుదయ రచయితల సంఘం స్థాపించిన సమయంలో, ఆ సంఘ సమావేశాలకు వెళ్ళారు. అలా అక్కడికి వెళ్ళి ఉన్నవారిలో అబ్బూరి రామకృష్ణారావు పేర్కొనదగిన వాడు. అక్కడ భారత అభ్యుదయ రచయితలతో మాట్లాడి ఆంధ్రప్రాంతానికి తిరిగి వచ్చాక ఇక్కడి రచయితలను కలిసి అభ్యుదయ రచయితల విషయాన్ని చెప్పాడు. ముఖ్యంగా విశాఖపట్నంలో శ్రీశ్రీ వంటి యువ రచయితలను కూడాగట్టాడు. మొదట ఆంధ్రవర్ధమాన లేఖక సంఘం పేరుమీద ఒక ప్రణాళికను తయారు చేయించాడు. ఈ ప్రణాళిక శ్రీశ్రీని

బాగా ఆకర్షించింది. అబ్బూరి, శ్రీశ్రీ మొదలగు వారు తరువాత పలువురు ప్రముఖ రచయితలను/కవులను కలిసి ఈ సమాచారాన్ని విస్తరించారు. దీనితో ఆంధ్రదేశంలో అభ్యుదయ రచయితల సమావేశం ఏర్పడటానికి అవసరమైన పరిస్థితులు నెలకొన్నాయి. కానీ అవి కార్యరూపం దాల్చడానికి చాలా కాలం పట్టింది. దాదాపు భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిన ఏడు సంవత్సరాల తరువాత తాపిధర్మారావు అధ్యక్షతన 1943 ఫిబ్రవరి 13, 14 తేదిల్లో అభ్యుదయ రచయితల సంఘం మొదటి మహాసభ తెనాలిలో జరిగింది. ఇందులో యుద్ధవ్యతరేకత, భావ స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, విద్యార్థుల విజ్ఞానాభివృద్ధి, వయోజనాభివృద్ధి... వీటికి సంబంధించిన తీర్మాణాలు చేశారు.

అనంతరం ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సంఘంలో అభ్యుదయ భావాలుగల రచయితలతో పాటు, సాంప్రదాయ భావాలుగల వారు కూడా సభ్యులుగా చేరారు. ఈ సమావేశాలు అనేక విమర్శలకు దారి తీశాయి. అభ్యుదయ రచయితల సంఘం నాలుగో మహాసభలు జరిగేనాటికి (1947) తెలంగాణా సాయుధ పోరాటం మొదలైంది. ఈ సమయంలో దాశరథి, కాళోజి, అనిశెట్టి, సోమసుందర్, గంగినేని వంటివారు రచనలు చేశారు. వీరు అభ్యుదయ రచయితల సంఘంలో ఉంటూనే తెలంగాణ పోరాటానికి మద్ధతుగా నిలిచారు. తెలంగాణా పోరాటం కమ్యూనిస్ట్ ల ఆధ్వర్యంలో జరగడంతో అభ్యుదయ సాహిత్యం తెలంగాణా పోరాట సాహిత్యంలో భాగంగా కొనసాగిందని చెబుతారు. "తెలంగాణ పోరాట సమయంలో ఎదుట నిలిచి ఉన్న నిజాం నిరంకుశ ప్రభుత్వంతో ప్రత్యక్షంగా సాయుధపోరాటం జరపవలసిన అవసరం తెలంగాణా స్వాతంత్రోద్యమ కవులకు ఏర్పడింది. ఈ కారణాల చేత అభ్యుదయ కవిత్వం తెలంగాణా సాయుధ పోరాటకవిత్వంగా మరింత తీవ్రరూపంలో వాస్తవిక సమాజంలో అల్లుకు పోయింది". (ఆనందారామం, సి: సమాజ సాహిత్యాలు, పుట.58.)

అభ్యుదయ సాహిత్యం తెలంగాణా పోరాటంలో భాగంగా పరిణమించింది. కాబట్టి పరిచయ మాత్రంగా తెలంగాణా పోరాటాన్ని గురించి మట్లాడటం అవసరం. తెలంగాణా పోరాటానికి సంబంధించి అనేక గ్రంథాలు వచ్చాయి. అయినప్పటికీ ఇక్కడ అవసరం మేరకు పోరాట నేపథ్యాన్ని వివరించాలి. "దేశప్రజలంతా స్వాతంత్ర్య సమరదీక్షాబద్ధులై సాగుతున్నవేళ తెలంగాణా సంస్థాన ప్రజలు నైజాం నిరంకుశ ప్రభుత్వ పాదాల కింద నలుగుతున్నారు. అంతా దోపిడే. హక్కు అనేమాటకు అర్థంలేదు. మాతృభాషలో విద్యాబోధన జరగదు. సభలు, సమావేశాలు లేవు. సంఘాలు కూడవు. పుస్తకాలూ, పత్రికలంటే పాలకవర్గానికి కన్నెర్ర. సర్వత్రా నిర్బంధమే, ఆంక్షలే. జమిందార్ల దురాగతాలూ, జాగిర్ దార్ల దోపిడీ నిరంకుశపాలన సంస్థాన ప్రజలకు నిత్యకృత్యమైపోయాయి." (రవీంద్రారెడ్డి, తెలుగు కవిత్వంపై మార్క్సిజం ప్రభావం, పుట.67.) ఈ మాటల ద్వారా నాటి తెలంగాణాలో ఉన్న నిజాం నవాబు పాలనా స్థితి అవగతమవుతుంది. తక్కువ మంది వాడుక భాష అయిన ఉర్దును రాజభాషగా ప్రవేశపెట్టి, నాటి దేశభాష అయిన తెలుగును నశింపచేయటానికు తీవ్రమైన కృషి చేస్తున్నారు. నవాబు దృష్టిలో హిందువులంతా దాసులు. ముస్లింలకు సేవకులు. వారికి కావలసిన పనులు చేసే బానిసలు. దీనికి తోడు మతపరంగా కూడా హిందూ ధార్మిక సంస్థలను, దేవాలయాలను నశింపచేయటానికి ప్రయత్నం చేశారు. అందుకు విదేశీ ముస్లిం సంస్థలకు విరివిగా లక్షలాది విరాళాలివ్వడం కూడా జరిగింది. ఈ స్వభావం నిజం పాలన ప్రారంభం నుండి చివరిదాకా కొనసాగింది. దీనిని ప్రజలు భరించడం సహజమైన విషయంగా పరిగణించే స్థితికి వచ్చింది.

అప్పటికే కొన్ని సంఘాలు, సంఘటనలు కూడా నిజాం చేస్తున్న విషయాలను విద్యావంతులు కొందరు అవగతం చేసుకొంటున్నారు. అటువంటి సమయంలో 1921వ సంవత్సరంలో నవంబరు 11, 12వ తేదీలలో హైదరాబాదులో కార్వే అధ్యక్షతన సంఘసంస్కరణ సమావేశమొకటి జరిగింది. అందులో పలువురు వక్తలు ప్రసంగించారు. కానీ తెలుగులో ఎవరూ మాట్లాడలేదు. రెండవ రోజున ఆలంపల్లి వెంకట రామారావు

అనే అతడు తెలుగులో మాట్లాడటం ప్రారంభించగానే సభలో చప్పట్లు ప్రారంభమయ్యాయి. ఇంగ్లీషు, ఉర్దు, మరాఠీ భాషలకున్న గౌరవం కూడా తెలుగుకు లేకపోయింది కదా అని పలువురు తెలుగు వారు బాధ పడ్డారు. దీనికితోడు నిజాం నవాబు మతపరమైన రాజ్యం సృష్టించాలని ప్రయత్నం చేశాడు. ఇది ప్రజలను మరింత బాధ పెట్టింది. "దక్షణ భారతదేశములోని కోటియేబది లక్షలమంది ముస్లిములు సంస్థానములోనికి దిగుమతి కావలెను. ఇక్కడ వున్న రెండుకోట్ల హిందువులు ఆస్తులు వదలి ఇండియన్ యూనియన్ లో చేరవలెననేది ఈతని వాదము. రజ్వీ నిజాములు దీనినామోదించినారు. అప్పటికప్పుడే 50 లక్షలమందిని సంస్థానము నుండి తరిమివేసి ఏడు లక్షలమందిని నైజాం దిగుమతి చేసుకొనినాడు. ఇంతటితో ఆగక 'ప్రత్యక్షచర్య' జరిపి ఇతేహదుల్ ముస్లీమీస్ స్వతంత్ర రాజ్యము స్థాపింపవలెనని రజ్వీ ఒక ప్రణాళికను సిద్ధపరిచినాడు. హిందువుల ఆస్తులు, ధనాగారములు దోచుకొనుట ఈ చర్యలో భాగము"(శివప్రసాద్, ముదిగొండ: ఉద్యమ దర్శనము, పుట.330.) ఇటువంటి పరిస్థితులు ప్రజలను మరింత బాధ పెట్టాయి. ఇటువంటి అంశాలన్నింటినీ తీసుకొని నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలోని ప్రజాచైతన్య సమీకరణలో విద్యావేత్తలైన కవులు పూనుకొన్నారు. వీరికి  పత్రికలు కూడా ఎంతగానో సహాయపడ్డాయి. చివరికి భారత దేశం స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నిజాం మాత్రం గద్దెదిగటాకు సిద్ధంగా లేడు. చివరికి పోలీసు చర్య ఫలితంగా నిజాం తన అధికారాన్ని వదులుకున్నాడు.

ఇటువంటి పరిస్థితులలో తెలంగాణా సాయుధ పోరాటం ప్రారంభం అయింది. ఈ తెలంగాణా పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలోని ప్రజాచైతన్య సమీకరణంలో విద్యావేత్తలైన కవులు పత్రికలు పోషించిన పాత్ర కీలకమైనది. తెలంగాణా సాయుధ పోరాటం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో కొనసాగింది. నాటికే కొనసాగుతున్న అభ్యుదయ రచయితలు ఈ ఉద్యమాన్ని కొనసాగించడంలో కీలక పాత్ర పోషించారు. కాబట్టే అభ్యుదయ సాహిత్యోద్యమం తెలంగాణా పోరాటంలో భాగమయ్యింది. చివరకు తెలంగాణా పోరాటం విరమించిన తరువాత ఆ ప్రభావం

అభ్యుదయ సాహిత్యంపై కూడా పడింది.

## 5.3. దిగంబర కవిత్వం

తాత్కాలిక ఆవేశంతో ఒక చిన్నపాటి ధోరణిగా కొనసాగి సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నటువంటి ధోరణి దిగంబర కవిత్వం. ఇది కొనసాగింది అతి తక్కువ కాలమైన ఎక్కువ చర్చకు అవకాశమిచ్చింది. ఇక తెలుగు సాహిత్య విమర్శలో కూడా దిగంబర కవిత్వ నేపథ్యాన్ని గురించి వివరిస్తూ దిగంబర కవిత ఒక అకస్మాత్తుగా వచ్చినట్లు పేర్కొన్నారు. "1965 సంవత్సరంలో తెలుగు కవితా లోకంలో 'దిగంబర కవిత' ఒక గాలివాటులా వచ్చింది. సమకాలీనంలో ఇదొక సంచలనాన్ని తెచ్చింది." (గౌరిశంకర్, టి: స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సామాజికస్పృహ, పుట.121.) కాని ఈ అభిప్రాయం సమంజసం అనిపించదు. దానికి గల నేపథ్యం సుధీర్ఘ కాలం నుంచే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ దిగంబర కవిత్వం వెలువడటానికి ఆనాటి పరిస్థితులు, నాటి సమాజంలో కొనసాగుతున్న సాహిత్యపు విధానాలు కూడా ఒక ప్రధాన కారణం అని చెప్పవచ్చు. దిగంబర కవిత్వం వెలువడటానికి పాశ్చాత్య, ప్రాశ్చ సమాజంలో వచ్చిన సాహిత్య ధోరణులు కూడా ఒక కారణమని, ఆ పాశ్చాత్య, ప్రాశ్చ ధోరణులతో ప్రభావితులయిన కొందరు కవులు రచించిన సాహిత్యం దిగంబర కవిత్వమని కొందరు విమర్శకులు పేర్కొన్నారు. దిగంబర కవులు ప్రారంభించిన ఉద్యమం వివిధ దేశాలలో ప్రారంభమైన ఉద్యమాలకు అనుకరణ అని మరి కొందరు విమర్శకులు పేర్కొన్నారు. కానీ దిగంబర కవులలో ఒకడైన నిఖిలేశ్వర్ మాత్రం ఈ విషయాన్ని ఖండించాడు. "...కొంతమంది విమర్శకులు- ఆచార్యులు, 'దిగంబరకవులు' ఉద్యమాన్ని విదేశీ తిరుగుబాటు ఉద్యమాలకు అనుకరణ మాత్రమేనని విమర్శించి తమ అజ్ఞానాన్ని సొంత తెలివితేటల్నీ ప్రదర్శించారు." (నిఖిలేశ్వర్: ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ధోరణులు, పుట.VI). మరికొందరు విమర్శకులు కూడా నిఖిలేశ్వర్ అభిప్రాయాన్ని సమర్థించారు. "దిగంబరకవులు అటు పాశ్చాత్య దేశాల్లో వచ్చిన సాహిత్యోద్యమాలకు

గాని, ఆ ప్రేరణతో వచ్చిన 'ఆకలితరం' కవులకుగానీ ప్రతిరూపాలు మాత్రమేనా? కాదు. నాకు తెలిసినంత వరకు దిగంబరకవులలో ఏ ఒకరిద్దరికోగానీ ఈ ఉద్యమాలను గురించి అంతగా తెలియదుయ కూడా. ఈ ఒకరిద్దరికీ ఉండే పరిచయమే తెలుగుసాహిత్యంలో ఈ ఉద్యమ ప్రారంభానికి ప్రేరణ కలిగి ఉండవచ్చు. కానీ స్వరూపంలో, ప్రయోజనంలో, సార్థకతలో ఈ ఉద్యమాలకూ దిగంబర కవిత్వోద్యమానికి చాలా భేదం ఉంది" (సుబ్రహ్మణ్యం,జి.వి: (సంపా.) సమాలోచనం, పుట.152.) అని రంగనాథాచార్యులుగారు అభిప్రాయపడ్డారు. బహుశా ఈ అభిప్రాయంతో కొంత ఏకీభవించవచ్చు. అందుకు దగిన సమాచారం కూడా రంగనాథాచార్యులగారి అభిప్రాయంతో ఏకీభవించేలా ఉంది. దిగంబర కవులకు సంబంధించిన అంశాలను మొదటనుంచీ పరిశీలిస్తే మరికొన్ని విషయాలు అవగతమవుతాయి. దానితో పాటు దిగంబర కవిత్వం వెలువడటానికి గల నేపథ్యం అవగతమవుతుంది. మొదట దిగంబర కవిత్వం వెలువడేనాటికి ఆంధ్రదేశంలో ఉన్న సాహిత్య, సామాజిక పరిస్థితులను తెలుసుకోవాలి.

1943లో ఆంధ్రదేశంలో స్థాపించబడిన అభ్యుదయ రచయితల సంఘం 1955 నాటికి పట్టు సడలిపోయింది. సంస్థ పూర్తిగా అంతరించిపోలేదు. కాని అందులో చీలికలు ఏర్పడ్డాయి. క్రమంగా అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యులుగా ఉన్న అనేక మంది అభ్యుదయ కవులు దాని నుండి విడిపోవడం జరిగింది. 1955 నాటికి 'తెలంగాణా' వచన కావ్యం ప్రచురించిన కుందుర్తి హైదరాబాదులో యువకులందరిని పోగు చేసి ఫ్రీవర్స్ ఫ్రంట్ నిర్మించాడు. ముఖ్యంగా కుందుర్తి వచన కవితకు ఉద్యమ రూపం ఇచ్చి దాని వ్యాప్తి కోసం కృషి చేశాడు. ఫ్రీవర్స్ ఫ్రంట్ లోని వారందరూ వచన కవితలలోని వివిధ ప్రక్రియలను చేపట్టారు. ఫ్రీవర్స్ ఫ్రంటులో యాదవ రెడ్డి, భాస్కర రెడ్డి, కేశవరావు, కమ్మిసెట్టి వెంకటేశ్వరరావు, మన్ మోహన్ సహాయ్, రాఘవాచారి, మాదిరాజు రంగారావు మొదలైనవారందరు సభ్యులు. వీరు సాహిత్యం గురించి సమాజం గురించి చర్చించేవారు. తరువాత కాలాన వీరిలో కొందరు ఫ్రీవర్స్ ఫ్రంట్ నుండి బయటకు వచ్చి దిగంబర కవిత్వోద్యమాన్ని ప్రారంభించారు.

కేశవరావు దిగంబర కవుల స్థాపనలో ఒకడు. మిక్కినవారందరు కూడా విద్యార్థి స్థాయి నుంచి కూడా పరిచయస్తులు. "బి.ఏ. నిజాం కళాశాలలో కేశవరావు యాదవరెడ్డి సహచరులు. రాఘవాచారి వీరికి జూనియర్. యాదవరెడ్డి భాస్కరరెడ్డి ఒకే హైస్కూల్లో చదివేరు. భాస్కరరెడ్డిని, యాదవరెడ్డిని వచన కవిత్వం రాయమని ప్రోత్సహించాడు. ఒక ఉద్యమ రూపంలో కవిత్వం వస్తే బావుంటుందని కేశవరావు సలహా ఇచ్చాడు. అప్పటికే అతని 'ఉదయించని ఉదయాలు' ఆరుద్ర పీఠికతో అచ్చయింది. కేశవరావు ఉద్యమ రూపం ఎలా ఉండాలో plan వేశాడు." (అనంతం: తెలుగు సాహిత్యంలో కల్లోల క్షీణ దశాబ్దాలు1965-1985, పుట.14.) రంగనాథాచార్యులుగారు చెప్పినట్లు దిగంబర కవులలో ఒకరు చొరవతీసుకొన్నట్లు కనిపిస్తుంది.

తరువాత "1965 ఏప్రెల్ నెలలో సమాజం, సాహిత్యం గురించి ఆలోచించే ఆరుగురు యువకులు (కేశవరావు, యాదవరెడ్డి, రాఘవాచారి, భాస్కరరెడ్డి, మన్ మోహన్ సహాయ్, కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు) ఒకచోట కూర్చొని వారి ఆశయాలను ఆశలను కలబోసుకొన్నారు. కేశవరావు ఇచ్చిన ఉద్యమ స్వరూపం అంగీకరించారు. ఈ ఆరుగురు 'ఫ్రీవర్స్ ఫ్రంట్' నుండి విడిపోయి 'దిగంబర కవులు'గా అవతరించారు. ఇలా ఫ్రీవర్స్ ఫ్రంట్ నుండి విడిపోవడం వాళ్ళకి షాక్. తక్కినవారు వీరితో కలుద్దామనుకున్నా వీరు పిలవలేదు."(పైదే, పుట.14) బహుశా వీరికి గల పరిచయాలు వీరిని మాత్రమే కలుపుకొనేలా చేసి ఉంటాయేమో. అందుకే ఫ్రీవర్స్ ఫ్రంట్ నుంచి తక్కిన వారిని కాదనుకున్నారు. ముందు పేర్కొన్నట్లు వీరిపై ప్రపంచ సాహిత్యోద్యమాల ప్రభావాన్ని కూడా పరిచయాత్మకంగా తెలుసుకోవడం అవసరం.

నిఖిలేశ్వర్ దిగంబర కవిత్వోద్యమంపై ఏ ప్రభావం లేదన్నప్పటికీ విమర్శకులు మాత్రం అంగీకరించకపోవడానికి గల కారణం 20 శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన పలు సాహిత్య ఉద్యమాలు. ఈ ఉద్యమాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో

వీరిపై ప్రభావం చూపాయని విమర్శకులు పేర్కొన్నారు. మరొక ముఖ్యమైన విషయం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన వివిధ ఉద్యమాల్లోని లక్షణాలు దిగంబర కవిత్వోద్యమంలో కూడా కనిపిస్తాయి. నిఖిలేశ్వరే వివిధ దేశాల్లో వచ్చిన సాహిత్యోద్యమాలను పరిచయం చేశాడు. వాటిని క్లుప్తంగా పరిచయం చేయడం వలన దిగంబర కవిత్వోద్యమానికి గల చారిత్రక భూమిక కూడా కొంత వరకు అర్థమవుతుంది.

20 శతాబ్దం అనేక సంఘటనలకు చారిత్రక సాక్షం అయింది. సంచలనాలకు కేంద్రబిందువయింది. అప్పటికే అభివృద్ధి చెందిన దేశాల్లోని పారిశ్రామిక విప్లవం వంటి ఫలితాలు 20 శతాబ్దంలో పేద దేశాలపై ప్రభావాన్ని చూపాయి. కొన్ని పేద దేశాలు వలస పాలనలో ఉంటే, మరికొన్ని దేశాలు వలస పాలన నుంచి విముక్తి పొందాయి. ధనిక దేశాల్లో కూడా సామాన్య ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ నెలకొన్నాయి. దానికి గల కారణం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఆయా దేశాల్లో పలు మార్పులు సంభవించాయి. సాంప్రదాయ భావాలకు, ఆధునిక భావాలకు మధ్య అంతరం, సంఘర్షణ ఏర్పడింది. ఇంకా పలు రకాలైన సమస్యలు ఆయా దేశాల్లో ఈ ఉద్యమాలు బయలుదేరడానికి కారణమయ్యాయి. ఇలాంటి పది ఉద్యమాలను నిఖిలేశ్వర్ పరిచయం చేశాడు. అవి. 1. బీట్ జనరేషన్ 2. గ్రే జెనరేషన్ 3. ఎంగ్రీ యెంగ్ మెన్ 4. హంగరీలో గాయపడిన యువకులు 5. రష్యాలోని - యువకులు 6. హాలెండ్ లోని 'ప్రోవో' ఉద్యమం. 7. ఆకలితరం 8. హిందీలో నయీ కవిత- నయీ కహానీ 9. దిగంబర కవులు 10. అనామా కవిత్వోద్యం అని పేర్కొని ప్రపంచంలోని సాహిత్యోద్యమాల సరసన దిగంబర కవిత్వోద్యమాన్ని పేర్కొన్నాడు. ఆ ప్రపంచ సాహిత్యోద్యమాలను, దిగంబర కవిత్వోద్యమాన్నీ పరిశీలిస్తే ప్రపంచ సాహిత్యోద్యమాలకు దిగంబర కవిత్వోద్యమం అనుకరణ అని పేర్కోవడానికి గల కారణాలు కనిపిస్తాయి. ప్రపంచ సాహిత్యోద్యమాలు కొన్ని దిగంబర కవిత్వోద్యమం కంటే ముందే సంభవించాయి. అంతే కాకుండా ప్రపంచ సాహిత్యోద్యమాలలోని వివిధ లక్షణాలు దిగంబర కవిత్వోద్యమంలో కనిపిస్తాయి. అందువలన దిగంబర కవిత్వోద్యమం ప్రపంచ సాహిత్యోద్యమాలకు

అనుకరణ అని పేర్కొంటారు. వివిధ దేశాలలో ప్రారంభమైన కవితోద్యమాలలో కనిపించిన లక్షణాలు, వాటితో దిగంబర కవిత్వంలో కనిపించే సారూప్య లక్షణాలు పరిశీలించాలి.

1. "బీట్నిక్కుల రచనలకంటే వారి జీవిత విధానం మిగతా ప్రజలను ఆశ్చర్య చకితులను చేసిందని" పేర్కొన్నారు. (నిఖిలేశ్వర్: ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ధోరణులు, పుట.6.) అదే విధానాన్ని దిగంబర కవులు వారి కవితా సంకలనాలను విడుదల చేసే విషయంలో సంచలనాలను సృష్టించారు.

2. గ్రే జెనరేషన్ ఉద్యమం "... వాడుకలో వున్న పదాల నడుం విరగ్గొట్టి, గతంలోని తర్కవాదాలను ధ్వంసం చేయాలని, పాత వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించడానికి 'Creative- Vandalism' అవసరమని ఈ తరం యువకుల నమ్మకం" (పైదే, పుట-VI) దిగంబర కవులు కూడా పాతవ్యవస్థని పాతతరం కవుల పద్ధతులను తీవ్రంగా నిరసించి కొత్త వ్యవస్థను కోరుకొన్నారు.

3. హంగేరీలో గాయపడిన యువకుల ఉద్యమం రావడానికి ప్రధాన కారణాలు ఇవి. "రష్యా పర్యవేక్షణలో జీవిస్తున్న హంగేరీలో ఆశించిన విధంగా మార్పులు రాలేదు. సరైన ఉద్యోగాలు, నివాస గృహాలు లేనందువల్ల ముఖ్యంగా ఆత్మాభివ్యక్తికి కావలసిన స్వేచ్ఛ లేనందున - మనస్సులో దాగిన అసంతోషం క్రమంగా కవిత్వ రూపంలో వెలువడింది". (పైదే, పుట-VI) దిగంబర కవితోద్యమం ఒక విధమైన అసంతృప్తి నుంచి ఉద్భవించింది. విదేశీ పాలన కింద ఉండి స్వాతంత్ర్యం సంపాదించిన 20 సంవత్సరాలు దాటినప్పటికీ ప్రజల జీవితాలలో ఎటువంటి మార్పు రాలేదు. నిరుద్యోగం పెరిగి పోయింది. ప్రజల కనీస అవసరాలు కూడా తీరలేదని దిగంబర కవులు ఆవేదన తెలుస్తుంది.

4. బెంగాల్ లో ప్రారంభమైన 'ఆకలి తరం ఉద్యమం' వీరిపైన ఉన్నట్లు కొంత తెలుస్తుంది. బెంగాల్ ఆకలితరం కవులు 'బీట్ జెనరేషన్' ఉద్యమంతో ప్రభావితులయ్యారు. "బీట్ జెనరేషన్ ఏసుక్రీస్తు ఎలెన్ గిన్స్ బర్గ్ ఇండియాకు వచ్చి

పర్యటిస్తూ కలకత్తాలో ఈ యువకులను (ఆకలితరంకవులను) కలిశాడు. బీట్ జెనరేషన్ జీవిత విధానాన్ని ప్రేరణగా చూపాడు. అక్కడితో బెంగాలీ యువతరంలోని కవులు-రచయితలు ఒక ఔన్నత్యం కోసం అన్వేషణ ప్రారంభించారు."(పైదే, పుట.14.) వీరు ఇంకా "1958 నుండి ఈ యువకులు -రచయితలు కసిగా అన్నింటికీ ఎదురు తిరిగి కేవలం పైపై మెరుగులుగా తయారైన నీతికి, శీలానికి, రాజకీయాలకు, సాహిత్య దర్పాలకు వ్యతిరేకంగా; అవినీతిని, అశ్లీలాన్ని, అరాచకవాదాన్ని సాహిత్య నిర్భయత్వాన్ని ప్రతిబింబిస్తూ కవిత్వం, కథలు, నవలలు రాశారు". (పైదే, పుట.14.) తెలుగులో కూడా దిగంబర కవిత్వోద్యమంలో ఈ లక్షణాలను ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. సాహిత్యంలో నెలకొన్న స్తబ్ధతను విచ్ఛిన్నం చేస్తూ వీరి రచన కనిపిస్తుంది. అశ్లీలాన్ని ఆకలితరం కవులు సమర్థిస్తే, దిగంబర కవులు అశ్లీల పదాలను తమ కవిత్వంలో యధేచ్ఛగా ఉపయోగించారు.

5. ఆకలితరం కవులు 'కాలాన్ని దశాంశ ప్రణాళికలో విభజించి కొత్తనిమిషాలుగా, కొత్త గంటలుగా భావించారు.' దిగంబర కవులు కూడా తమ పేర్లను మార్చుకొన్నారు. ఆ పేర్లతోనే ఆరు సంవత్సరాలుగా భావించారు. ఋతువులను ఆరుగా, వారాలు ఆరుగా పేర్కొన్నారు. తమ కవితా ఖండికలకు దిక్ లని పేరు పెట్టుకొన్నారు.

పై అంశాలను పరిశీలిస్తే దిగంబర కవిత్వోద్యమంపై వివిధ దేశాల సాహిత్యోద్యమాల ప్రభావం ఉన్నట్లుగా తెలుస్తుంది. కాని ఇక్కడ ఆంధ్రదేశంలో నెలకొని ఉన్న పరిస్థితులను కూడా అవగాహన చేసుకొంటే దిగంబర సాహిత్యానికి గల చారిత్రక నేపథ్యం అర్థం అవుతుంది.

స్వాతంత్ర్యం రావటంతో దేశం సుభిక్షమవుతుందని భావించినవారికి నిరాశే ఎదురయ్యింది. భారతదేశంలో భారతీయ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు అనుకొన్నంత మేలు జరగలేదు. ప్రజలకు ముఖ్యమైన తిండి, బట్ట, ఇల్లు అనే సమస్యలు అలాగే మిగిలిపోయాయి. దేశంలోని సంపద అంతా కూడా

కొందరికి మాత్రమే పరిమితమయ్యే స్థితి ఏర్పడింది. పాలకులు ప్రజల అజ్ఞానాన్ని, అశక్తతను ఆసరాగా చేసుకొని దేశాన్ని దోచుకు తినడం ప్రారంభించారు. మరొక వైపు మతం పేరుతో ప్రజల అజ్ఞానాన్ని సొమ్ముచేసుకోవడానికి సన్యాసులు, పీఠాధిపతులు బాబాలు బయలుదేరారు. అప్పటికే ప్రజలు సినీమాయలో పడిపోయారు. సినిమా ప్రజలను ప్రభావితం చేసే స్థితికి చేరుకొంది. ప్రజలు సినిమా నటులను కీర్తించడం, ఆరాధించడం ప్రారంభించారు. సినిమా నటులు ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకొని అవాస్తవిక కథనాలతో ప్రజలను మభ్యపెట్టే సినిమాలు తీయడం జరుగుతూ ఉంది. పత్రికలు కూడా సినిమావాళ్ళను, రాజకీయ నాయకులను ముఖ్యంగా చేసుకొని వార్తలు రాయడం చేస్తున్నారు. ఈ పరిస్థితి దేశమంతా వ్యాపించి ఉంది. ఈ పరిస్థితినుంచి ప్రజలను మార్చడానికి ఒక కొత్తతరహా విధానాన్ని ఎన్నుకొన్న వాళ్ళు దిగంబరకవులు. వీరు అప్పటి వరకు వస్తున్న విధానాల నుంచి మార్పు ఆశించి సాహిత్యోద్యమానికి పూనుకొన్నారు. రాజకీయ నాయకుల్ని ప్రజల అవసరాలేమిటో గుర్తించేలా చేయటం, వారి అవినీతిని సంఘానికి తెలియ చేయటం, యువతరాన్ని చైతన్యవంతం చేయటం, సంఘంలోని మూఢనమ్మకాలను పారద్రోలి ప్రజలను మానసికంగా ఆర్థికంగా ముందుకు నడిచేలా చైతన్యవంతులను చేయటం వంటి కార్యక్రమాలను రూపొందించుకొన్నారు. వీరు ప్రతి విషయంలో సత్యాన్ని యధార్థ రూపంలో సాక్షాత్కరింపచేసుకొని ప్రపంచానికి తెలపడానికి ప్రయత్నిస్తున్నవారుగా కనిపిస్తారు. మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం, కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతులు వీరివి' అని దిగంబర కవుల గురించి తెలిపారు అనంతం గారు.

వీరు సాహిత్యంలో ఒక మార్పు కోసం రచన చేసినట్లు కవులలో కొందరు కొన్ని వ్యాసాల్లో పేర్కొన్నారు. ఆమార్పు గురించి కవి తెల్పిన అంశం "దేశంలోని భూమి, -డబ్బు - ఉత్పత్తి అందరికి చెందాలని, వ్యక్తిగత ఆస్తులను నిర్మూలించాలని, దిక్కులేని చావు చావడానికి వ్యవస్థ మార్గం చూపకూడదని, ప్రతి మనిషి జన్మ, జీవితం, మరణం

సౌఖ్యప్రదం కావడానికి మార్గాలు ప్రశస్తం కావాలని అంటున్నారు. ఈనాటి విద్యావిధానం, ఆధునిక సాహిత్యం- విజ్ఞానం, వర్తమాన జీవిత సమన్వయంతో రూపొందాలని కోరుతున్నారు.'' (పైదే: పుట.14.)

పై విషయాలను పరిశీలిస్తే దిగంబర కవిత్వం ప్రారంభం కావడానికి గల కారణం స్పష్టంగా కనిపిస్తుంది. అది దిగంబర కవులుగా ఉన్న ఆరుగురు కవులు కూడా విద్యార్థి దశ నుంచే పరిచయస్తులుగా ఉండటం ఒకటయితే, సమాజం పట్ల, సమాజంలో వస్తున్న మార్పులపట్ల అవగాహన ఉన్నవారు. అప్పటికి నడుస్తున్న సాహిత్యాన్ని పరిశీలించి అసంతృప్తి చెంది కొత్తదనం కోసం ప్రయత్నిస్తున్నవారు. అందుకోసమే ఫ్రీవర్స్ ఫ్రంట్ నుంచి బయటకు వచ్చి దిగంబరకవులగా తమ కవితలను ప్రచురించారు. వారు విద్యార్థి దశ నుంచి స్నేహితులుగా ఉండటం వలన తాము ఆరుగురు మాత్రమే తమ భావజాలానికి కట్టుబడి ఉండగలమని, ఇతరులు తమలో సభ్యులుగా కొనసాగలేరనే భావన వల్ల కాబోలు ఇతరులను తమలో కలుపుకోవడానికి ఇష్టపడలేదు. ఈ ఆరుగురు పాశ్చాత్య, ప్రాశ్చ్య కవితా ధోరణులను అధ్యయనం చేయకపోయి ఉండవచ్చు. కాని నగ్నముని వంటి వారు ఒకరిద్దరు మాత్రం అప్పటికే పరిచయం ఉన్న ఆంగ్లసాహిత్యం వల్ల ప్రపంచ సాహిత్య ధోరణులను అధ్యయనం చేసి ఉంటారు. వారే మిగతా కవులకు మార్గదర్శకత్వం వహించి తమ కవితా విధానాన్ని రూపొందించి ఉంటారని చెప్పవచ్చు. అలా తమ కవితా ప్రణాళిక రూపొందిన తరువాత మాత్రమే తమ కవితలను ప్రచురించారు. ఈ విధంగా నాటి పాశ్చాత్య ప్రభావంతో, నాటి సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో దిగంబర కవిత్వం ప్రారంభం అయింది.

దిగంబర కవిత్వం అంత తీవ్రంగా కాకుండా సమాజంలో ఉన్న పరిస్థితులను ధూషించి రచనలను రచించే విధానం అనేది ప్రాచీన కాలం నుంచి ఉంది. మనిషి తమకాలాన్ని అంతకు ముందున్న కాలంతో పోల్చుకోవడం లేకపోతే ఇతర ప్రాంతాలలో ఉన్న పరిస్థితులతో పోల్చుకోవడం, తమ కాలంలో ఉన్న పరిస్థితులపై గళమెత్తడం,

కవులైతే తమ కలాలతో  తిరుగుబాటు చేయడం అనేవి సహజం. ప్రాచీన కాలం నుంచి కూడా ఈ సంప్రదాయం కొనసాగుతూ ఉన్నది. పోతన, ధూర్జటి వంటి వారు తమ కాలంలో తమకు లభించని అవకాశాల ఫలితంగా సమాజాన్ని, రాజులను ధూషించారు. ఆధునిక కాలంలోకి వచ్చేటప్పటికీ బ్రిటీషువారు తమని హింసించి దోచుకోవడం చూసి వారిపై తిరుగుబాటు చేయటంతో అక్కడ కూడా జాతీయోద్యమ సాహిత్యం ప్రారంభమైంది. ఇక స్వాతంత్ర్యానంతరం దేశ అభివృద్ధి గురించి ఎన్నో కలల కన్నవారికి తీవ్ర నిరాశ ఎదురైంది. ఆ నిరాశ, నిస్పృహల నుంచి పుట్టినటువంటిది దిగంబర కవిత.

## 5.4. స్త్రీవాద సాహిత్యం

"తెలుగు కవిత్వంలోకి చాలా వేగంగా దూసుకొచ్చిన స్త్రీవాద కవిత్వానికి గొప్ప ఉద్యమ నేపథ్యం లేదు. స్త్రీవాద కవయిత్రులలో ఎవరికీ బలమైన తాత్విక భూమిక వున్నట్టు కనిపించదు." (అప్సర్: ఆధునికత-అత్యాధునికత, ముందుమాట, పుట.V) విమర్శకులు ఇలా పేర్కొనటానికి ప్రధాన కారణం తెలుగులో వెలువడుతున్న సాహిత్యానికి ఇక్కడి స్థానిక నేపథ్యంలో బలమైన సిద్ధాంత భూమిక కనిపించక పోవడమే. అంటే తెలుగులో స్త్రీవాద సాహిత్యం పాశ్చాత్య ప్రభావంతో ప్రారంభమైందనే  విమర్శకుల అభిప్రాయంతో అందరూ అంగీకరిస్తారు. 19వ శతాబ్దం నుంచి రచయితలు/కవులు చేసిన రచనలు స్త్రీల అభివృద్ధికి సంబంధించినవి ఉన్నప్పటికీ, ఇప్పుడున్న స్త్రీవాద భావజాలంతో  సాహిత్యోద్యమంగా తెలుగులో స్థిరపడింది మాత్రం 1980 తరువాతే. అంటే ఈ స్త్రీవాద సాహిత్యం తెలుగులో ఒక నిర్ధిష్ట భావజాలంగా అభివృద్ధి చెందింది 1980 తరువాత అని పేర్కొన్నవచ్చు. ఈ భావజాలం స్థిరపడటానికి దోహదం చేసింది మాత్రం ఆంగ్లసాహిత్యంలో ప్రారంభమైన స్త్రీవాదమే అని చెప్పవచ్చు. ఈ స్త్రీవాద సాహిత్యానికి గల చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించేటప్పుడు రెండు విధాలుగా పేర్కొనాలి. అది ఒకటి పాశ్చాత్య దేశాలలో

స్త్రీవాదానికి గల చారిత్రక నేపథ్యం ఒకటయితే, ఇక్కడి స్థానిక నేపథ్య పరిస్థితులు కూడా స్త్రీవాద సాహిత్య ఉద్యమాన్ని అభివృద్ధి చేయటానికి దోహదపడటం అనేది రెండవది.

ఇక పాశ్చాత్య దేశాలలో వచ్చిన స్త్రీవాదాన్ని పరిశీలించినట్లయితే అక్కడ ఉద్యమాలకు అక్కడ స్థానిక నేపథ్యం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ స్త్రీవాదం మొదట ఒక ఉద్యమ రూపంలో కాక హక్కుల రూపంలో ప్రారంభమైంది. ఈ "స్త్రీవాద ఆలోచనా ధోరణికి 1792లో 'విండికేషన్ ఆఫ్ ది విమెన్' అనే పుస్తకం వ్రాసి మేరీ వోలస్టన్ క్రాఫ్ట్ ప్రారంభం చేసింది." (కాత్యాయనీ విద్మహే: ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాదభూమిక, పుట.4.) తరువాత క్రమంగా ఇది పరిణామం చెంది 19వశతాబ్దంలో ఒక సదస్సుగా మొదట ప్రారంభమైనట్లు తెలుస్తుంది. ఈ సదస్సు "న్యూయార్కులోని సెనికా ఫాల్స్ లోని ఒక చర్చిలో1848 జూలై 19, 20 తేదీలలో జరిగింది స్త్రీల సాంఘిక, పౌర, మత హక్కుల గురించిన సదస్సు." (ఓల్గా: తొలివెలుగులు, పుట.50.) ఈ సదస్సులో ఒక తీర్మానం చేశారు. అందులో "స్త్రీ పురుషులిద్దరూ సృష్టిలో సమానులేనని కనుక యిద్దరికీ సమాన హక్కులుండాలనీ, అట్లాంటి హక్కులు కల్పించని ప్రభుత్వాలను కూలదోసి తమ హక్కులను రక్షించుకోవటానికి కొత్త ఏర్పాట్లను ప్రజలు చేసుకోవాలనీ ప్రకటనలో పేర్కొన్నారు" (పైదే, పుట.52.) ఇలా ప్రారంభమైన స్త్రీవాద ఉద్యమం రెండు రూపాల్లో కనిపిస్తుంది. ఒకటి ధనిక వర్గంవారు వారి సమాన హక్కుల కోసం, ప్రయోజనాల కోసం సాగించిన ఉద్యమం కాగా రెండవది శ్రామిక స్త్రీలు తమ కనీస అవసరాల కోసం, హక్కుల కోసం సాగించిన ఉద్యమం. మొదట ఈ స్త్రీవాద ఉద్యమం ధనిక స్త్రీలకు సంబంధించిన ఉద్యమంగా కనిపిస్తుంది. ఇది ధనిక స్త్రీల ప్రాధమిక హక్కులకోసం ప్రారంభమైనట్లు తెలుస్తుంది. దానికి గల కారణం వివిధ దేశాల్లో ప్రారంభమైన వివిధ రకాల ఉద్యమాలు.

అమెరికా, ఫ్రాన్సు దేశాల్లో మానవ సమాన ధర్మ విప్లవ భావాలు వ్యాపించాయి. అవి మహిళా జనచైతన్యాన్ని కదిలించాయి. ఈ సమాన హక్కులు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అన్ని పురుషులకు మాత్రమే వర్తిస్తున్నట్లుగా మహిళలకు అర్థం కావడం మొదలైంది. ప్రాథమిక హక్కులు కూడా లేని తమకు ఆ హక్కుల కోసం పోరాడాలని నిర్ణయించుకొన్నారు. ఓటు హక్కు కూడా లేని తమకు పురుషులు అన్ని సౌకర్యాలు అనుభవించడం అనేది స్త్రీలను ఆలోచింపచేసింది. అప్పటికే అమెరికాలో నల్లజాతి బానిసత్వానికి వ్యతిరేకంగా పౌర హక్కుల ఉద్యమం బయలు దేరింది. దీనితో స్త్రీ విద్య, స్త్రీల ఆరోగ్యం, స్త్రీల హక్కులు- ఇవన్నీ వారికి కావలసిన కొత్త కోర్కెలుగా రూపొందాయి. ఈ దశలో ఓటుహక్కు ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ ఉద్యమంలో ప్రధానంగా రెండురకాల గ్రూపులుండేవి. అందులో ఒక గ్రూపు తమ కోర్కెల్ని ఓటుహక్కుకే పరిమితం చేశారు. పారిశ్రామిక రంగంలోని స్త్రీలతో వీళ్ళకే మాత్రం సంబంధం లేదు. న్యూయార్కులో ఏర్పడ్డ రెండవ గ్రూపు ఇంకొంత ముందుకుపోయి ఓటుహక్కుతో పాటు వివాహవ్యవస్థ, నీతి, సంప్రదాయం శ్రమనిర్మాణం వంటివాటిని ప్రశ్నించారు.

క్రమంగా ఉద్యమంలో కొంత మార్పు వచ్చింది. ధనిక స్వామ్య స్త్రీలు పలు రకాల డిమాండ్లు చేయటం మొదలు పెట్టారు. "స్త్రీపై పురుషుడిపెత్తనాన్ని, అధికారాన్ని పటాపంచలుచేసే లక్ష్యంతో బూర్జువా మహిళావుద్యమం లేవనెత్తిన ప్రధానమైన డిమాండ్లు ఈ క్రింది విధంగా వున్నాయి. వివాహ విచ్ఛేదనంలో సమాన హక్కులు, సంతానంపై స్త్రీ పురుషులకు సమానహక్కు, లైంగిక విషయాలలో ఒకే రకమైన నీతి; తన ఆస్తిని అమ్ముకోవడంలోనూ, సంపాదనపైన, ఆదాయంపైన స్త్రీకి హక్కు, వృత్తిశిక్షణకు, కార్యకలాపాలకు హామీతో కూడిన స్వాతంత్ర్యం, సామాజిక జీవనంలోని అన్ని రంగాలలోను ఉభయులకు కార్యకలాపాలు సాగించే స్వాతంత్ర్యానికి హక్కు, రాజ్యవ్యవస్థలోనూ, దాని అంగాలలోనూ సంపూర్ణ రాజకీయ సమానత్వం తదితరమైనవి." (క్లారాజెట్కిన్: స్త్రీ విముక్తి ఉద్యమాలు, పుట.10.) ఈ డిమాండ్లన్నీ

కూడా చేసింది ధనిక స్త్రీలు. ఈ ఉద్యమాన్ని చేసిన ధనిక స్త్రీలు కార్మిక స్త్రీల గురించి పట్టించుకోలేదని చెబుతారు. కాని అప్పటికే పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఫ్యాక్టరీలలో కార్మికుల సంఖ్య పెరిగి పోయింది. వివిధ దేశాలలో స్త్రీలు కూడా కార్మికులుగా చేరారు. స్త్రీల సంఖ్య కూడా ఫ్యాక్టరీలలో పెరిగిపోయింది. కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మగవాడి సంపాదనతో పాటు  స్త్రీల, పిల్లల సంపాదన మీద కుటుంబం గడిచే పరిస్థితి ఏర్పడింది. దీనితో స్త్రీలు కుటుంబ పోషణలో కీలకంగా మారారు. కార్మికులుగా పని చేయటం, బయట సమాజంలోకి రావడంతో స్త్రీల ఆలోచనలల్లో కూడా మార్పు వచ్చింది. అమెరికాలో 1830 ప్రాంతాలలో తాము చేస్తున్న పని గంటలకు తక్కువ కూలి ఇవ్వటాన్ని గ్రహించారు. ఫ్రాన్సులో దాదాపు 1840లో నుంచే శ్రామిక స్త్రీలు తాము పనులు చేసే చోట్ల పిల్లల కేంద్రాల గురించి కార్యక్రమాలు తీసుకోవటం జరిగింది. అట్లాగే స్త్రీల ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, శిశు సంరక్షణ - అన్ని కూడా చర్చలలో ప్రధానాంశాలయ్యాయి. విడాకులను సమర్థించటం జరిగింది. ఇలా క్రమంగా వీరు అప్పటికే ధనికి స్త్రీలు చేస్తున్న ఉద్యమాన్ని గమనించారు.  కాని అందులో కార్మిక స్త్రీలు తమకు సంబంధించిన ప్రాథమిక అవసరాలు లేవనే విషయం గ్రహించి మొత్తం స్త్రీలందరికీ ప్రయోజనకరంగా ఉండేలా హక్కులను డిమాండ్ చేశారు. ఒక దశలో ధనికస్త్రీలకు వ్యతిరేకంగా కూడా పోరాడారు. వీరి పోరాటాన్నే ముఖ్యమైనదిగా గుర్తిస్తారు. “బూర్జువా మహిళ ఉద్యమానికి వ్యతిరేకంగా సోషల్ డెమొక్రటిక్ మహిళావుద్యమం కార్మిక యోధుడిలా పోరాటం చేసింది. దీని చరిత్రలో సువర్ణాధ్యాయ మనదగిన కాలమది. ఈ కాలంలో యావత్ స్త్రీ జాతికి సంబంధించి మొత్తం సామాజిక మానవీయ విముక్తి, సమానత్వం కోసం సైద్ధాంతికంగానూ, కార్యాచరణలోనూ అది అగ్రభాగాన నిలిచింది.” (పైదే, పుట.15.) క్రమంగా ఈ ఉద్యమం ప్రగతిని సాధించింది. అయితే ఈ ఉద్యమాన్ని ఒకరకమైన సంఘసంస్కరణోద్యమంగా కూడా కొందరు విమర్శకులు పేర్కొన్నారు. “పశ్చిమ దేశాల బూర్జువా ఆలోచనల నుండి రూపొందిన అస్తిత్వవాదం చట్రవాదం లాంటిదే స్త్రీవాదం కూడా. ఫెమినిజం అనే మాట మహిళల అభ్యుదయాన్ని గురించిన బూర్జువాల జీవిత దృక్పథ పరిమితులలో పుట్టింది.

ఫెమినిజం అనే పేరుతో పాశ్చాత్యదేశాలలో 19వశతాబ్దాలలో బలపడిన ఉద్యమాలన్నీ సంస్కరణోద్యామాలు తప్ప మరేమీ కావు. ఆడవాళ్ళకు చదువుకొనే వసతులు కావాలనీ, పురుషులతో సమానమైన సాంఘిక హోదాకావాలనీ అంతకంటే ముఖ్యంగా, సులభంగా విడాకులు పొందడానికి, ఆస్తిహక్కును పొందడానికి సేవికా వృత్తినుండి బయట పడటానికి మాత్రమే చూశారు.'' (రామకోటిశాస్త్రి, కేతవరపు: మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు, పుట.10.) అయితే పురుషాధిక్యత నుండి సమానత్వం ఆశించడమనేది అప్పటి అవసరంగా కనిపిస్తుంది. కాని పురుషులు మహిళా సమాన హక్కుల ఉద్యమాన్ని అణచివేయటానికి తీవ్రంగానే ప్రయత్నించారని తెలుస్తుంది. ''1920 ప్రాంతాల్లో ఫెమినిస్ట్ ధోరణికి తీవ్ర వ్యతిరేకత మొదలయింది. 1928లో ఉజ్బెకిస్తాన్ లోనే రెండువందలా ముగ్గురు స్త్రీల హత్యలు జరిగాయి. ఈత దుస్తులు వేసుకొన్నదని ఒక అమ్మాయి తండ్రి, అన్నదమ్ములందరు కలసి ఆ అమ్మాయిని హత్య చేశారు. జుట్టుకత్తరించుకున్న వాళ్ళమీద దాడులు ప్రారంభమైనాయి. స్త్రీ తన సెక్సువాలిటిని చంపుకొని బతకడమొక్కటే మార్గంగా తయారయింది.'' (కన్నాబిరాన్ (సంపా.): మాకుగోడలు లేవు, పుట.37.) కాని 20 శతాబ్దంలో పాశ్చాత్య దేశాల్లో పలు మార్పులు సంభవించాయి. ప్రతిదేశంలో జండర్ సంబంధాలలో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. పలు దేశాల్లో జండర్ సంబంధాలపై చర్చలు జరిగాయి. ఈ పునాది మీద 1949లో 'దిసెకండ్ సెక్స్' అనే పుస్తకం వ్రాసి సైమన్ డి బావురే ఆధునిక స్త్రీవాదానికి ఒక స్పష్టమైన రూపాన్నిచ్చింది. దీనితో అప్పటి వరకు వస్తున్నటువంటి స్త్రీల ఉదార భావాల ఉద్యమంలో మార్పు వచ్చింది. ఉదార భావాలకు ప్రాధాన్యత తగ్గి రాడికల్ భావాలకు ప్రాధాన్యత పెరిగింది. దీనితో స్త్రీవాద సిద్ధాంతంలో కూడా మార్పు వచ్చింది. ''ఈ ఉద్యమాల్లో స్త్రీలు నిర్వహించిన పాత్రవల్ల స్త్రీ సమస్యలకు కూడా ఒక సిద్ధాంత రూపం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే 1960-1970లలో ముందుకొచ్చిన ఫెమినిస్ట్ ఉద్యమం స్త్రీ పురుష సంబంధాలలో విప్లవాత్మకమైన మార్పులు కావాలనే విషయాన్ని తేల్చి చెప్పింది.'' (పైదే, పుట.67) దీనితో క్రమంగా

స్త్రీవాదంలోనే వివిధ రకాల విభాగాలు ప్రారంభమైనాయి. రాడికల్ స్త్రీవాదం, సాంఘిక స్త్రీవాదం, నల్లజాతి స్త్రీవాదం, మూడవ ప్రపంచదేశాల స్త్రీవాదం, ఉదారవాద స్త్రీవాదం మొదలగు విభాగాలు స్త్రీవాదంలో ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాలు క్రమంగా ప్రపంచ వ్యాప్తంగా కూడా ప్రభావం చూపాయి. క్రమంగా భారతీయ సాహిత్యంలో  కూడా స్త్రీవాదం ప్రవేశించింది. ప్రస్తుతం తెలుగులో కూడా ఉద్యమ రూపంలో కొనసాగుతుంది. కాని ఆంధ్రదేశంలో ప్రారంభమైన స్త్రీవాదాన్ని తెలుసుకోవాడానికి ఇక్కడి పరిస్థితుల చారిత్రక నేపథ్యాన్ని కూడా పరిశీలించాలి.

మొదట భారతదేశంలో సంఘసంస్కరణ రూపంలో స్త్రీల అభివృద్ధికి కృషి చేశారు. ఈ సంఘ సంస్కరణోద్యమంలో జరిగినవి అప్పటి వరుకు వస్తున్న దురాచారాలను ఖండించి, వాటి నిర్మూలనకు కృషి చేసే రూపంలో కనిపిస్తుంది. ఈ సంఘ సంస్కరణోద్యమం కూడా  బ్రిటీష్ పరిపాలనలో పాశ్చాత్య విద్యా ప్రభావం వలన జరిగిన స్త్రీ సంస్కరణోద్యమాలు అని చెప్పవచ్చు. స్త్రీ విముక్తి ఉద్యమానికి మొట్టమొదట నడుంబిగించిన వ్యక్తి రాజారామమోహన్ రాయ్. ఈ ఉద్యమానికి అతడు పూనుకోవడానికి కారణం అతడికి వ్యక్తిగతంగా జరిగిన కారణం. 1811లో రాజారామ్ మోహన్ రాయ్ అన్న చనిపోయినపుడు ఆయన భార్య అలోక మంజరి, అంటే రాజారామ మోహన్ రాయ్ వదిన సహగమనం చేసింది. ఆమె రాజారామమోహన్ రాయ్ కి వదిన అయినప్పటికీ తల్లిలాగా ఆదరించింది. ఆమె సహగమనం చేసేటప్పుడు రాజారామ్ మొహన్ రాయ్ సహగమనం చేయవద్దని విన్నవించాడు. కాని ఆమె చివరకు సహగమనం చేసింది. తల్లిలాంటి వదిన మరణంతో ఆ దురాచారాన్ని రూపుమాపడానికి పూనుకున్నాడు. చివరికి వారి పోరాట ఫలితంగా అప్పటి బ్రిటీష్ పాలకులు సహగమనాన్ని నిషేదించారు. తరువాత కొందరు వితంతు వివాహాలను ప్రోత్సహించారు. వితంతు సమస్య పరిష్కారానికి పునర్వివాహమే సరైన మార్గమని సంస్కర్తలు గుర్తించారు. కందుకూరి వీరేశలింగం పంతులు దక్షిణభారతదేశంలో ఈ పునర్వివాహోద్యమానికి నాయకత్వం వహించాడు. రఘుపతి వెంకటరత్నం నాయుడు,

కందుకూరి వీరేశలింగం పంతులు గుడిసేవ వెంకట సుబ్బయ్య, మన్నవ బుచ్చయ్య, యామిని పూర్ణ తిలకమ్మ మొదలైన వారు దేవదాసీ, వేశ్యా విధానాలు రద్దుకావాలని, సంస్కరణ అవసరమని పోరాడారు. వేశ్యలను కూడా సంఘంలో ఇతరులలాగా భాగస్వాములను చేయటానికి ప్రయత్నించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గురజాడ మొదలగు వారు స్త్రీలకు సంబంధించిన రచనలు కూడా చేశారు. తరువాత వచ్చిన చలంగారు స్త్రీల లైంగిక స్వేచ్ఛా విషయాలను కూడా తమ రచనల్లో ప్రస్తావించారు. దీనివలన స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు పాల్గొనే పరిస్థితిని సృష్టించాయి. స్రీలు పరదాల చీకట్లను దాటి ఊరేగింపుల్లో రాజకీయ ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు. స్త్రీని పీడన నుండి అణచివేత నుండి ఉద్ధరించటానికి వచ్చిన ఈ ఉద్యమాలన్నీ పురుషులు చైతన్యవంతులై నడిపించినవే. ఇందులో స్త్రీలు ముఖ్యపాత్ర తక్కువగా కనిపిస్తుంది. అయితే అవి స్త్రీల చైతన్యాన్ని పెంచటానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

ఇలా పురుషులతో వివిధ ఉద్యామాల్లో పాల్గొన్న స్త్రీలు తమ సొంత గొంతు వినిపించడం కూడా ప్రారంభమైంది. 19 శతాబ్ది చివరికి పలువురు విద్యావంతులైన స్త్రీలు తమ ఉనికిని చాటుకోవడానికి తమ గొంతు వినిపించడం ప్రారంభమైంది. "... కొందరు స్త్రీలు ఉన్నత విద్య కోసం డిమాండ్ చేశారు. ఇటువంటి డిమాండ్ తో కలకత్తాలో వంగ మహిళా సమాజం ఏర్పాటయింది. రవీంద్రనాధ్ టాగూర్ కుమార్తే స్వర్ణ కుమారి 1882 లో స్త్రీల కోసం ప్రత్యేకంగా ధియోసాఫికల్ సొసైటీని ఏర్పాటు చేసింది." (ఓల్గా: తొలివెలుగులు, పుట.85.)

20 వ శతాబ్దంలో మాత్రం స్త్రీలు పూర్తి స్థాయిలో తమ సమస్యల పరిష్కారానికి నడుంబిగించి వారే నాయకత్వం వహించారు. స్త్రీలే సభలు, సమావేశాలు నిర్వహించారు. వారి సమస్యలపై పోరాడారు. "1901లోనే బండారు అచ్చమాంబ ఆంధ్ర దేశంలో మహిళా సంఘం స్థాపించి నిర్వహించారు. 1913లో ప్రథమాంధ్ర

మహిళా సభ బాపట్లలో జరిగింది. 1917లో భారతస్త్రీ సమాఖ్య అనిబిసెంటు, ధోరొతి, మార్గరెట్ కజిన్స్ వంటి వారిచే స్థాపించబడింది. 1927లో అఖిలభారత మహిళా సంఘం నెలకొల్పబడింది. మేడం కామా, సరోజిని, అనిబిసెంటు మున్నగువారు మహిళా సమస్యలమీద స్వాతంత్రోద్యమంలో స్త్రీపాత్ర గురించి చర్చించారు.” (కృష్ణారావు, వాసిరెడ్డి: మహిళాభ్యుదయోద్యమ వాఙ్మయ పరిచయం; పుట.10.) ఈ సమావేశం ఏర్పడటానికి ప్రేరణ మాత్రం పాశ్చాత్య దేశాల్లో ఏర్పడ్డ స్త్రీ ఉద్యమాలే కారణం అని చెప్పవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్య విద్య, పాశ్చాత్య మహిళలు ఈ ఉద్యమాలు నిర్వహించడానికి తోడ్పడ్డాయి. పాశ్చాత్య దేశాల్లో స్త్రీలు ఓటు హక్కుకోసం పోరాడినట్లు ఇక్కడ పోరాడారు. ముఖ్యంగా 1927లో ఏర్పడిన అఖిల భారత మహిళ సంఘం చాలా ముఖ్యమైన విజయాలను సాధించింది. స్త్రీ విద్యకోసం, ఆరోగ్య సౌకర్యాల కోసం, ఓటుహక్కు కోసం ఈ సంస్థ కృషిచేసింది. సరోజినిదేవి, డా. జోషి, అనిబిసెంటు వంటి మహిళా ఉద్యమ నాయకులు ఓటుహక్కుకై ఉద్యమించారు. 1930 నాటికి అన్ని రాష్ట్రాల్లోనూ అన్ని సంస్థానాల్లోను ఓటుహక్కు లభించింది.

ఈ ప్రభావం ఆంధ్రదేశం మీదికి కూడా ప్రసరించింది. ఇక్కడ కూడా స్త్రీ సంఘాలు ఏర్పడ్డాయి. ఇక్కడి స్త్రీలు వారి సమస్యలకై పోరాడటానికి స్త్రీసంఘాలను ముఖ్య ఆయుధంగా చేసుకొన్నారు. ఈ సంఘాలు స్త్రీ విద్య కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయటం, పఠనాలయాలు, ప్రార్థనామందిరాలు, సేవాసదనలు, స్త్రీల క్లబ్బులు వంటి వాటిని ఏర్పాటు చేశాయి. “నెల్లూరులోని కస్తూర్బా కళాశాల, గుంటూరులో శారదాకేతనం, కాకినాడలో స్త్రీ విద్యార్థి సమాజం మున్నుగునవి ఇటువంటివే. ముప్పదియైదు సంస్థల వరకు ఇటువంటివి వెలసినవి చెప్పవచ్చును.” (సుబ్బమ్మ, మల్లాది: ఆంధ్రప్రదేశ్ లో మహిళోద్యమం, పుట.97.)

ఇలా ప్రారంభమైన మహిళా చైతన్యం క్రమంగా తరువాత కాలంలో స్త్రీలు విప్లవోద్యమాల్లో కూడా పాల్గొనే స్థితి ఏర్పరిచింది. నాడు భారతదేశంలో కమ్యూనిస్టు

పార్టీ అవతరరించడంతో కొందరు స్త్రీలు పోరాటదశవైపు ప్రయాణించారు. ఈ కమ్యూనిస్టు ఉద్యమం స్త్రీల సమాన స్థాయి గురించి ఆలోచింప జేసింది. నైజాం ప్రాంతపు స్త్రీలు తమ మాన ప్రాణ రక్షణకై రజాకార్లను ఎదురొడ్డి నిలిచారు. భూస్వాములతో, పెత్తందార్లతో తెగించి పోరాడారు. తెలంగాణా పోరాటంలో వీరోచితమైన పాత్ర నిర్వహించారు. ముఖ్యంగా తెలంగాణా పోరాటంలో స్త్రీలు చేసిన పోరాటం అత్యంత ప్రాధాన్యత సంతరించుకొంది. కాని పోరాటం తరువాత స్త్రీల పరిస్థితి యధాస్థితికి వచ్చింది. ఆ ఉద్యమాల్లో పాల్గొన్న స్త్రీలకు రకరకాల సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యల వలన స్త్రీలు పలురకాల అనుభవాలను సంపాదించారు. దీనితో తమ సమస్యలను గురించి తామే ఆలోచించడం, ఆ సమస్యలను తామే పరిష్కరించుకోవడానికి సిద్ధపడ్డారు. అప్పటికే పలువురు స్త్రీలు వివిధ సంస్థల్లో సంఘాల్లో పనిచేసినవారు కూడా ఉన్నారు. దీనితో వీరు ప్రత్యేక స్త్రీ సంఘాలను స్థాపించే ప్రయత్నం చేశారు. వీరు ఏర్పాటు చేసుకొన్న సంఘాల ద్వారా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకొన్నారు. అప్పటికే పాశ్చాత్య దేశాల్లో జరిగిన పోరాటాలు వీరిని ప్రభావితం చేశాయి. దీనితో స్త్రీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అన్ని కోణాలనుండి అధ్యయనం చేయడం ప్రారంభించారు. వీటి ద్వారా పలు ఉద్యమాల కారణంగా గృహ హింస, వరకట్న నిషేధం వంటి చట్టాలను తీసుకొచ్చారు.

1970 దశకంలో భారతదేశంలో ముఖ్యంగా నగరాల్లో విద్యావంతులైనా, ఆధిపత్యకులాలకు చెందిన మధ్య తరగతి స్త్రీలు ప్రపంచదేశాల్లో పెట్టుబడిదారి దోపిడి, మతఛాందస వాదులకు వ్యతిరేకంగా నడిచిన పోరాటాలను, వాటిలో స్త్రీల ప్రశ్నలను విస్మరించే పితృస్వామ్య వ్యవస్థను నిరసిస్తూ కొనసాగిన స్త్రీల ఉద్యమాలను అధ్యయనం చేసి, స్త్రీవాదాన్ని పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో నాటి నియంతృత్వ పాలనా విధానాలను నిరసించిన విప్లవ, ప్రజాస్వామిక పోరాటాలలోనూ, విద్యార్థి ఉద్యమాల్లోనూ పాల్గొన్న వారు కూడా కొందరున్నారు. ఇలా పలురకాల ఉద్యమాలతో భావితులైన వారు కొందరు తమని తాము స్త్రీవాదులుగా ప్రకటించుకొన్నారు. ఆ

ఉద్యమాల్లో తమ స్థానం గురించి ఆలోచించడం, పితృస్వామ్య ఆధిపత్య నిర్మాణాలను ప్రశ్నించడం మొదలు పెట్టారు.

ఈ ఆలోచానా ధోరణి విస్తృతం కావడంతో పలు స్త్రీల సంఘాలు బయలుదేరాయి. ఇవి వరకట్నం, జనాభానియంత్రన, సతి, మైనారిటీ హక్కులు మొదలగు అంశాలపై అందోళన చేశాయి. స్థానిక సమస్యల గురించి స్పందిస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏర్పడినటువంటిదే ఆంధ్రదేశంలో 1970 లో ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫార్ విమెన్ (POW). ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫార్ విమెన్ ఏర్పడటంతో స్త్రీవాద ఉద్యమానికి తొలిబీజాలు పడ్డాయి. ఈ సంస్థ పలు కార్యక్రమాలను చేపట్టింది. "1970 లలో POW తను స్వతంత్ర ప్రతిపత్తితో పని చేస్తూ మధ్య తరగతి విద్యార్థినుల జీవితాలకు సంబంధించిన సమస్యలను తీసుకుంది. వరకట్నం, అశ్లీల సినిమాలు, పోస్టర్లు, అధిక ధరలు, విద్యార్థినుల సమస్యలు మొదలైన సమస్యలపై పనిచేసింది." (కల్పన, కన్నాబిరాన్., ఓల్గా, వసంత, కన్నాబిరాన్. (సంపా): సరిహద్దులు లేని సంధ్యలు, పుట-XIII) ఫలితంగా ఇది పలువురు విద్యావంతులైన స్త్రీలను అకర్షించింది. ఈ సమయంలో 1972లో ఓల్గా రాసిన 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' అన్న కవిత స్త్రీవాద సాహిత్యానికి ఒక తొలిమెట్టుగా భావిస్తారు. ఈ పంచాది నిర్మల అనే స్త్రీ శ్రీకాకుళ గిరిజనోద్యమంలో పనిచేసిన స్త్రీ. అప్పటి వరకు స్త్రీ అనే పదానికి ఉన్న స్థానాన్ని కాదని పోరాడే మహిళగా పేర్కొన్నారు. ఈ పరిణామ క్రమంలో 1973లో ఆంధ్రదేశంలోని విద్యావంతులయిన స్త్రీలు కొందరు తమని తాము ఫెమినిస్టులుగా నిర్వచించుకొన్నారు. అయితే వీరందరు కూడా విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులు. వీరు అప్పటికే పాశ్చాత్య దేశాల్లో ఉన్న వివిధ ఫెమినిస్టు ధోరణులను అధ్యయనం చేశారు. స్త్రీలకి సమాన హక్కుల గురించి ఉద్యమించి పెట్టుబడిదారీ విధానంలో సంస్కరణలను ఆశించటమే తప్ప విప్లవాత్మక మార్పును కోరని ఉద్యమాన్ని 'లిబరల్ ఉద్యమం'గా, స్త్రీ పురుషుల మధ్య వైరుధ్యాన్ని ప్రధానం

చేసుకున్న స్త్రీవాదులను రాడికల్ ఉద్యమంగా, స్త్రీల అణచివేతనూ, పురుషస్వామ్యాన్ని, పెట్టుబడిదారీ భూస్వామ్య అణచివేతలలో భాగంగా గుర్తించిన ఉద్యమాన్ని సోషలిస్టు ఉద్యమంగా సూత్రీకరించడం మూలాన వీరు వీటిలో తమకు అనుకూలమైనది సోషలిస్టు ఉద్యమం అని భావించి తమని తాము సోషలిస్టు ఫెమినిస్టులుగా నిర్వచించుకొన్నారు

తరువాత1974లో హైదరాబాదులో జరిగిన సదస్సులో అభ్యుదయ స్త్రీల సంఘం అనే పేరుతో ఒక పూర్తి స్థాయి కార్యవర్గంతో ఒక సంఘం ఏర్పడింది. ఇందులో ప్రధానంగా విద్యార్థినులు, ఇతర స్త్రీలు దాదాపు 500 మంది సభ్యులుగా నమోదయ్యారు. వీరు తమ సంఘం లక్ష్యాలను కూడా నిర్దేషించుకొన్నారు "స్త్రీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, వారి విముక్తి కోసం పోరాడేందుకు అవసరమైన చైతన్యాన్ని పెంపొందించడం, సైంటిఫిక్ సోషలిజం సూత్రాలను ప్రచారం చేయటం, స్త్రీలను అణచివేతకు గురిచేస్తున్న భూస్వామ్య ఆర్థిక విధానం, సంస్కృతికి వ్యతిరేకంగా నిర్దిష్టమైన పోరాటాన్ని నిర్మించటం, విదేశీ ఆధిపత్యం, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల ఉద్యమాలకు అండగా నిలవటం, అవినీతి, నల్లబజారు, గుత్త పారిశ్రామికాధికత్యాన్ని వ్యతిరేకిస్తూ ముందుకొచ్చిన పోరాటానికి ఆసరాకావటం, శాస్త్రీయ విద్యావిధానానికై కృషి చేసే విద్యార్థి సంఘాలన్నింటితో చేయికలపటం, అన్ని రకాల అసమానతలు, సాంఘిక, అణచివేత నిర్భంధాలను ఎదిరించి పోరాడటం" (పైదే, పుట.11.) అనేవి ఆ సంఘ లక్ష్యాలు.

ఇటువంటి సమయంలో ఐక్యరాజ్య సమితి 1975ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది. అంతేగాక దీనిని 1985 వరకు అంతర్జాతీయ మహిళా దశాబ్దిగా కొనసాగించారు. దీని వలన ప్రపంచమంతటా స్త్రీల చైతన్యాన్ని ప్రభావితం చేస్తూ ఈ స్త్రీవాదం బాగా ప్రచారంలోకి వచ్చింది. ఈ క్రమంలో అనేక చిన్నచిన్న సమూహాలతో ఎక్కడికక్కడ స్త్రీల సంఘాలు ఏర్పడ్డాయి. తమ చైతన్య పరిధిలో

కోర్కెల సాధనకు పని చేయసాగాయి. ముఖ్యంగా పట్టణ మధ్య తరగతి స్త్రీలు ఎక్కువగా భాగస్వాములయ్యారు. ఈ సమయంలో "1977లో ఏర్పడిన స్త్రీ శక్తి సంఘటన, ఆ తరువాత పదేళ్ళకు ఏర్పడ్డ ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్ వ్యక్తిగతమంతా రాజకీయమేనన్న స్త్రీవాద దృక్పథానికి ప్రచారం కల్పించటానికి, పునరుత్పత్తి హక్కుల చైతన్యం కలిగించటానికి విశేషంగా కృషి చేశాయి." (కాత్యాయనీ విద్మహే: ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాదభూమిక పుట.40.) దీనితో ఒక కొత్త రకమైన ఆలోచనలతో తెలుగులో స్త్రీవాదం ప్రారంభమైంది. అప్పటి వరకు స్త్రీ అంటే ఒక ఇంటికి పర్యయవాచిగానో, పిల్లలకు తల్లిగానో, ఒక భర్తకు భార్యగానో తప్ప స్త్రీలకు స్వంత ఉనికి స్వీయ స్పృహ లేకుండా పోయింది అనే భావన ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే 1978లో ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్ వారు స్త్రీశక్తి సంఘటన అనే సంస్థను స్థాపించి స్త్రీవాద అవగాహన తరగతులను నిర్వహించి 'మాకు గోడలులేవు, మూడు తరాలు, సవాలక్ష సందేశాలు, మనకు తెలియని మన చరిత్ర, నీలిమేఘాలు వంటి పుస్తకాలను ప్రచురించారు. వీరు వెలువరించిన సాహిత్యం స్త్రీవాదానికి, ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పనిచేసిన స్త్రీలకి గొప్ప బలాన్నిచ్చింది. ఈ 'మూడు తరాలు' నవల ద్వారా తెలుగులో స్త్రీవాద సాహిత్య చర్చ కూడా ప్రారంభమైంది. చర్చతో పాటు స్త్రీవాద సాహిత్య రచన కూడా విస్తృతంగా సాగడం ప్రారంభమైంది. తరువాత పలువురు రచయిత్రులు స్త్రీవాద దృక్పథంతో రచనలు చేయడం మొదలు పెట్టారు. పలు ప్రక్రియలలో రచనలు వెలువడ్డాయి.

## 5.5. ప్రపంచీకరణ సాహిత్యం

పాశ్చాత్యదేశాల్లో ప్రారంభమైన వెంటనే భారత దేశంలోకి ప్రవేశించి పాశ్చాత్య దేశాల్లో జరుగుతున్న ప్రతిస్పందనలను గమనించి ఇక్కడ కూడా అదే రీతిలో ప్రతిస్పందిస్తున్న సాహిత్య ధోరణి ప్రపంచీకరణ సాహిత్యం. ఇక్కడ ప్రపంచీరణ సాహిత్యం తెలుగుపై ప్రభావం చూపిందనటం కంటే ప్రపంచీకరణ మాత్రమే తెలుగు

సాహిత్యంపై ప్రభావం చూపిందని చెప్పాలి. ఈ ప్రపంచీరణపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న రీతిలోనే తెలుగు సాహిత్యంలో కూడా సాహిత్యం వచ్చింది.

ప్రపంచీకరణనే ఆంగ్లంలో "గ్లోబలైజేషన్' (GLOBALIZATION) అని వ్యవహరిస్తున్నారు. ఈ గ్లోబలైజేషన్ అనే పదం ప్రాచీన నిఘంటువులలో లేదు. ఆధునిక కాలంలోనే నిఘంటువులలో చోటు చేసుకుంది. ఈ ప్రపంచీకరణ అనేది అన్ని రంగాలపైన, అందరిపైన ప్రభావం చూపుతున్నది. ప్రపంచీకరణ వలన కలుగుతున్న లాభాలను, నష్టాలను పరిశోధకులు ఇప్పటికే బేరీజు వేస్తున్నారు. కొందరు ఇది ఆర్థికవ్యవస్థకు సంబంధించినదని పేర్కొంటుంటే, మరికొందరు రాజకీయ రంగానికి సంబంధించినదిగా పేర్కొంటున్నారు. ఇంకొందరు ఇది ఆర్థిక, రాజకీయ రంగాలకు సంబంధించినదిగా నిర్వచించారు. కాని ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రవేశించిన ప్రపంచీకరణ మనకు తెలియకుండానే తక్కిన రంగాలలోకి కూడా ప్రవేశించింది. అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్నది. పరిశోధకులు దీనిని వివిధ రకాలుగా నిర్వచించారు. ప్రస్తుతం పరిశోధకుల నిర్వచనాలకు, వారి చర్చను ఇక్కడ ప్రస్తావించ దలుచుకోలేదు. స్థూలంగా ప్రపంచీకరణను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు. "సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ఏకరూపతను కలిగి ఉండడాన్ని ప్రపంచీకరణ" (వెంకటరామయ్య, గంపా: ప్రపంచీకరణ కథలు-విమర్శనాత్మక పరిశీలన, పుట.7.) అని పేర్కొనవచ్చు. ప్రస్తుతం ఉన్న ప్రపంచీకరణ లక్షణాల దృష్ట్యా మరొక్క మాటలో చెప్పాలంటే 'మనిషి ఆలోచనా విధానం వ్యాపారాత్మకంగా మారడాన్ని ప్రపంచీకరణ' అని పేర్కొనవచ్చు. ఈ వ్యాపారాత్మక ఆలోచన అనేది అన్ని రంగాలలోను కనిపిస్తుంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, మత పరమైన ఆలోచనలలో కూడా వ్యాపార దృష్టి ప్రధానంగా కనిపిస్తుంది. అన్ని అంశాలు కూడా వ్యాపారంగా మారడం అనేది ప్రపంచీకరణలో ప్రధానమైన అంశం. ఈ ప్రపంచీకరణ అనేది ప్రపంచ చర్చకు దారితీసింది.

ఈ ప్రపంచీకరణ ఎప్పుడు ప్రారంభమైంది అనే దానికి సంబంధించి కూడా ఇప్పటికే పలువురు పరిశోధకులు పరిశీలించి ఉన్నారు. ప్రపంచీకరణ అనేది ఆధునిక కాలంలో ప్రారంభమయినదిగా పేర్కొంటున్నారు. కానీ అనేకమంది మేధావులు ఇది ప్రాచీన కాలం నుంచే ఉన్నదని అనేక విడతలుగా అమలు జరుగుతున్నదని అభిప్రాయపడుతున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ ఆర్థికవ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. మారిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మాణం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలు ఏర్పడ్డాయి. (కాని ఇవి కేవలం అమెరికా మరియు ఐరోపా దేశాల ప్రయోజనం కోసం మాత్రమే ఏర్పడినవని విమర్శకుల అభిప్రాయం. ప్రస్తుతం ప్రపంచీకరణ విధానాలు అమలు పరచడంలో ఈ రెండు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.) ఇందు కోసం వాణిజ్యాన్ని ప్రధానాంశంగా చేసుకున్నాయి.

వివిధదేశాల మధ్య వాణిజ్య అవరోధాలను తొలగించడానికి 1947లో గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్) అనే అంతర్జాతీయ సంస్థ ఏర్పడింది. దీనికి ముందు 1940 నుంచి అంతర్జాతీయవాణిజ్య సంస్థ (ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్-ఐ.టి.ఓ) ఏర్పడింది. ఇది ఐక్యరాజ్యసమితి రక్షణ కింద ఉండేది. అంతర్జాతీయవాణిజ్యం, ఉద్యోగనియమాలు, వ్యాపార లావాదేవీలు వంటి అంశాలు దీని పరిధిలోకి వచ్చేవి. అయితే అమెరికా వ్యాపార వర్గాలు వత్తిడి తీసుకురావడంతో అమెరికా సెనేట్ అంతర్జాతీయ వాణిజ్యసంస్థను రద్దు చేయించగలిగింది. దాని స్థానంలో గాట్ ఏర్పడడానికి దోహదం చేసింది. క్రమంగా సుధీర్ఘంగా పదకొండు విడతలు చర్చల ఫలితంగా గాట్ స్థానంలో 1995 జనవరి 1న డబ్ల్యు.టి.ఓ. ఏర్పడింది. దీనిలో మొదటి 126 దేశాలు సభ్యత్వం తీసుకున్నాయి. ప్రస్తుతం డబ్ల్యు.టి.ఓ. (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సభ్యత్వం144కు పెరిగింది. అంటే నేడు డబ్ల్యు.టి.ఓ. కిందనే 99శాతం అంతర్జాతీయ

వాణిజ్యం సాగుతున్నది. ఈ ప్రపంచీకరణ రావడానికిగల కారణమేమిటి?అని తెలుసుకొంటే మరిన్ని విషయాలు అవగతమవుతాయి. 1945లో రెండో ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత ప్రపంచం రెండు శిబిరాలుగా చీలిపోయింది. ఒకటి సోషలిస్టు శిబిరం మరొకటి క్యాపిటలిస్టు శిబిరం. మొదటి దానికి సోవియట్ యూనియన్, రెండవ దానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలు నేతృత్వం వహించాయి. క్యాపిటలిస్టు వ్యవస్థ అనేది మార్కెట్ సూత్రాలను అమలు జరుపగా సోషలిస్టు వ్యవస్థ మాత్రం అందుకు భిన్నంగా మార్కెటేతర వ్యవస్థను కొనసాగించింది. కారణాలేవైతేనేం మార్కెటేతర వ్యవస్థ అక్కడి నాయకుల అసమర్థత వల్ల విఫలమైపోయింది.1980లో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సోవియట్ యూనియన్ నేతృత్వంలోని సోషలిస్టు వ్యవస్థ కూలిపోయింది. ప్రపంచంలోని అన్ని దేశాలు మార్కెట్ వ్యవస్థను పాటించిన క్రమంలోనే ప్రపంచీకరణ క్రమం ప్రారంభమయినది. అప్పుడే దానికి బీజాలు పడ్డాయి. ప్రస్తుతం "ప్రపంచీకరణ అనేది గత పది సంవత్సరాలుగా లాటిన్ అమెరికా దేశాల్లో అమలు జరుగుతున్న రాజకీయ ప్రక్రియ" (రాసాని, వి.ఆర్; నరేంద్ర, మధురాంతకం (సంపా): కథావార్షిక; 2002, (కథా చర్చలోనిది) పుట.47.)

ప్రస్తుతం ప్రపంచీకరణ అనేది ఎందుకు ప్రారంభమయినది? అని కూడా తెలుసుకోవాలి. దానిని అమలు చేస్తున్నది ఎవరు? అనేది కూడా ముఖ్యమైన అంశం. 1980వసంవత్సరం నాటికి అమెరికాలో ఆర్థికమాంద్యం, నిరుద్యోగం ప్రబలిపోయింది. ప్రజల జీవనప్రమాణాలు చితికి పోయాయి. దానిఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. అయినప్పటికి కూడా అమెరికా అప్పటికే గాట్ సంస్థ సభ్యుల్లో మిక్కిలి బలీయమైన దేశంగానే కాక ఇతర సభ్యదేశాలకు నాయకత్వం వహించే విధంగా తయారైంది. ఆ ఆర్థిక సంక్షోభంనాటికే అమెరికా శాస్త్ర, సాంకేతికరంగం, వ్యవసాయరంగంలో మరియు సేవా రంగంలో బలీయంగా ఉండేది. వీటిద్వారా తన ఆర్థిక సంక్షోభం నుండి బయట పడటానికి 1982లో జరిగిన గాట్ ఒప్పందం చర్చలకు కావాల్సిన అనేక అంశాలను

అజెండాలో చేర్పించడానికి అమెరికా ప్రయత్నం చేసింది. ఆసూచనలన్నీ తనకు అనుకూలమైనటువంటివే. మొదట అనేక దేశాలు అమెరికా సూచించిన అంశాలను వ్యతిరేకించినప్పటికి తరువాత అమెరికా ఆదేశానికి తలవంచక తప్పలేదు.1982లో అమెరికా సూచించిన అంశాల్ని అజెండాలో చేర్పించడానికి ఆమోదం తెలిపాయి. ఈ అంశాలపై 1986వ సంవత్సరం నుండి డంకెల్ ప్రతిపాదనలపైన చర్చలు జరిగాయి. 1994 సంవత్సరానికి చర్చలు ఫలించాయి. 1994 డిసెంబర్‌లో దాదాపు 120 దేశాలు డంకెల్ ప్రతిపాదన ఒప్పందంపైన సంతకాలు చేశాయి. 1995 జనవరి 1 నుంచి గాట్ స్థానంలో డబ్ల్యు.టి.ఓ. ఏర్పడటంతో ఉదారవాద ఆర్థిక సంస్కరణలు అమలులోకి రావడంతో వివిధ దేశాల మధ్య స్వేచ్ఛావాణిజ్య విధానం తలెత్తింది. దానినే నేడు అందరూ ప్రపంచీకరణగా పేర్కొంటున్నారు. ప్రపంచీకరణ అనేది ఆధునిక కాలంలో ప్రారంభమయినదిగా పేర్కొంటున్న సమయంలోనే అనేకమంది మేధావులు ఇది ప్రాచీన కాలంనుంచే ఉన్నదని అనేక విడతలుగా అమలు జరుగుతున్నదని పేర్కొంటున్నారు. ప్రాచీన కాలంనుంచి అమలు జరుగుతున్న వివిధ విడతల ప్రపంచీకరణ విధానాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలి.

"ప్రపంచ చరిత్రలో ఆహార సేకరణ దశ తాలూకు వలస ప్రస్థానాలు ప్రారంభమైనప్పటినుండి గ్లోబలైజేషన్ చరిత్ర ప్రారంభమైంది. బౌద్ధం ఆహారసేకరణ దశ నుండి స్థిర జీవితానికి పౌరసమాజాన్ని తీర్చిదిద్దడంలో మహోన్నత పాత్రను నిర్వహించింది. ఈ క్రమంలో బహుజనహితాయ బహుజనసుఖాయ దృక్పథంతో ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా వసుధైక కుటుంబ భావనతో గ్లోబలైజేషన్ ను బౌద్ధం సిద్ధాంతీకరించింది. బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి. అనేవి గ్లోబలైజేషన్ మూల సూత్రాలు. వీటితో పాటుగా క్రీస్తు క్రైస్తవం, మహమ్మద్ ప్రవక్త ఇస్లాం కూడా ప్రపంచీకరణగానే పేర్కొన్నారు". (రాములు, బి.యస్: ప్రపంచీకరణ నేపథ్యంలో వేపచెట్టు తెలంగాణకథలు, పుట.21.) ఇది మత

పరమైనటువంటి ప్రపంచీకరణగా పేర్కొంటున్నారు. ఇక్కడ ప్రపంచీకరణ అంటే విశ్వవ్యాప్తీకరణగా పేర్కొంటున్నారు.

అనంతరం క్రీ.శ 15వ శతాబ్దం చివరలో జరిగినటువంటి అంశాలు కూడా ప్రపంచీకరణ విధానాలుగానే పేర్కొన్నారు.1497లో వాస్కోడిగామా ఇండియాకు రావడం, 1492లో క్రిష్టఫర్ కొలంబస్ పశ్చిమ ఇండియా దీవులను కనుగొనడం కూడా ప్రపంచీకరణగానే భావిస్తున్నారు. ""భారతదేశంనుంచి వెళ్తూ వాస్కోడిగామా ఓడల్లో నింపుకుని తీసుకొని పోయిన వ్యాపారవస్తువులు, ఆయన యాత్రకైన ఖర్చుకు అరవైరెట్లు ధనాన్ని సమకూర్చాయి''. వైకుంఠం, యల్లంపల్లి: (సంపా.) ఆధునిక ప్రపంచ చరిత్ర; పుట.126.) ఆనాటి నుండే తక్కువ పెట్టుబడితో ఎక్కువ రెట్లు ఆదాయం పొందడం అలవరుచుకున్నారు.

15, 16వ శతాబ్దాలలో వలసలు ఎక్కువ కావడంతో యూరప్ దేశాలు మిగతా ప్రపంచ దేశాలతో వాణిజ్యం చేయడం, అక్కడి సంపదనంతా దోచుకోవడం ఒకరకమైన ప్రపంచీకరణగా పేర్కొంటున్నారు. అంటే ఇక్కడ స్వేచ్ఛా వాణిజ్యవిధానాన్ని ప్రపంచీకరణగా పేర్కొంటున్నారు. అనంతరం 18 వశతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం మరొక విడత ప్రపంచీకరణకు దారి తీసింది. యూరోప్ దేశాలలో సహజవనరులు, సాంకేతిక పరిజ్ఞానం మిగతా ప్రపంచ దేశాలకంటే ఎక్కువ. తత్ఫలితంగా యూరోప్ దేశాలు మిగిలిన దేశాలపై ఆధిపత్యం చెలాయించాయి. వివిధ దేశాలలో యూరోప్ దేశాలు వలసలను స్థాపించాయి. ఈ వలసలు స్థాపించడం అవి బలపడడం కొద్ది కాలంలోనే జరిగింది. వలసలు బలపడడానికి 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం మరొక ముఖ్యకారణం. పారిశ్రామిక విప్లవం రావడంతో ప్రపంచదేశాలలో రాజకీయ, సామాజిక, సాంస్కృతికంగా ముఖ్యంగా ఆర్థిక పరమైన విషయాలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

పారిశ్రామిక విప్లవంలో మానవ, పశుశక్తులకు బదులు యంత్రాల శక్తిని ఉపయోగించడంతో వస్తూత్పత్తి ఎక్కువగా జరిగింది. ఈ పారిశ్రామిక విప్లవం రావడానికి కొన్ని శతాబ్దాల కాలం పట్టింది. అధికోత్పత్తులు, భారీవ్యాపారానికి, విదేశీ మార్కెట్ల సంపాదనకు దారి తీశాయి. పరిశ్రమలకు కావాల్సిన ముడి సరుకు స్వదేశంలో లభించక పోవడంతో ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకోవాల్సివచ్చింది. ముడి సరుకులు, మార్కెట్లు తమ ఆధీనంలో ఉంటే లాభసాటి అని తలచి పారిశ్రామికంగా ముందడుగు వేసిన దేశాలు వెనుకబడ్డ దేశాలలో వలసలు స్థాపించడానికి పూనుకున్నాయి. ఈ విధంగా వలస విధానం తలెత్తింది.

పారిశ్రామిక విప్లవప్రభావం వల్ల ఎంతో ప్రయోజనం ఉన్నప్పటికీ దాని ద్వారా అనర్థాలు కూడా జరిగాయి. యంత్రాగారాల వల్ల అనాదినుంచి వస్తున్న కుటీర పరిశ్రమలు కూలిపోవడం జరిగాయి. అప్పటి వరకు స్వతంత్ర జీవనాన్ని గడుపుతున్న నిపుణులైన పనివారికి యంత్రాగారాల్లో వేతనాల కోసం మరొకరి చేతికింద మామూలు కార్మికుల మాదిరిగా పని చేయాల్సి వచ్చింది. పరిశ్రమలు స్థాపించిన చోట కార్మికులు పెద్ద సంఖ్యలో చేరారు. కార్మికులు ఎక్కువ కావడం వలన కూలీరేట్లు తగ్గిపోయాయి. యంత్రాలవలన నిరుద్యోగం పెరిగిపోయింది. భారీ పరిశ్రమలలో తయారైన ఉత్పత్తులు భారీ వ్యాపారానికి వలస విధానానికీ దారితీయటం, ఆతరువాత అది సామ్రాజ్యవాదంగా రూపొందడం జరిగింది. (సామ్రాజ్య వాదం అంటే ఒక రాజ్యం సుదూర ప్రాంతంలో వున్న మరొక రాజ్యాన్ని జయించి దానిపై ఆధిపత్యం వహించి పరిపాలనచేయటం. దీన్ని ఇంగ్లీషులో "ఇంపీరియలిజం' అంటున్నాం).

ఉత్పత్తులు ఎక్కువ కావడంతో తమ సరుకులను ఇతరదేశాలకు అమ్ముకోవడానికి 19వ శతాబ్దంలో గ్రేట్ బ్రిటన్ తొలుత స్వేచ్ఛా వాణిజ్య విధానానికి పట్టంకట్టింది. దీన్ని ఆధారం చేసుకొని ఆర్థిక ఉదారవాదం తలెత్తింది. ప్రభుత్వ

ప్రమేయం లేని స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం ఆర్థిక ఉదారవాదానికి ప్రాణం. వస్తువుల ఉత్పత్తి విధానాల్లో ప్రభుత్వజోక్యం ఉండరాదని, వ్యాపారపు ఎగుమతి దిగుమతులపై ప్రభుత్వం పన్నులు విధించరాదని వ్యక్తుల మధ్య స్వేచ్ఛాయుతమైన ఒప్పందాలు ఉండాలని ఈ ఆర్థిక ఉదారవాదులు ప్రచారం చేశారు. ఆర్థికాభివృద్ధికి వ్యక్తిగత శక్తిసామర్థ్యాలు, స్వార్థచింతనలు ఆధారభూతాలని వీరు ప్రచారం చేశారు. స్వేచ్ఛావ్యాపార విధానాలు బ్రిటన్ తో పాటు ఇతర ఐరోపా దేశాలు కూడా అనుసరించాయి.

ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు కూడా పారిశ్రామిక విప్లవకాలంలో బ్రిటన్ అవలంభించిన స్వేచ్ఛావాణిజ్యం, ఆర్థిక ఉదార విధానాలకు దగ్గరగా ఉంది. సాంకేతిక పరిజ్ఞానం వల్ల యంత్రాలు రావడంతో నిరుద్యోగం పెరిగింది. ప్రజల జీవనప్రమాణాలు తగ్గిపోయాయి. వ్యవసాయం దెబ్బతిన్నది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రభుత్వ ప్రమేయం తగ్గిపోయి ప్రైవేటు రంగం విస్తరిస్తున్నది. అనేక ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు ప్రైవేట్ వ్యక్తులచేతుల్లోకి వెళ్ళాయి.

పై అంశాలను బట్టి పారిశ్రామిక విప్లవం తరువాత బ్రిటన్ అనుసరించిన ఉదారవాద ఆర్థిక సంస్కరణలు ఎటువంటి ఫలితాలు చూపాయో నేటి ప్రపంచీకరణ ద్వారా కూడా అటువంటి ఫలితాలే సంభవిస్తున్నాయి. నాడు బ్రిటన్ అవలంభించిన విధానాలను నేడు అమెరికా "ప్రపంచీకరణ"అనే పేరుతో ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు పరుస్తున్నది. నాడు బ్రిటన్‌లో అవలంభించిన విధానాలు నేడు అమెరికా అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల వలన కలిగినటువంటి ఫలితాలు, పరిణామాలు ఒక్కటే. పైఅంశాలను పరిశీలించినట్లయితే ప్రపంచీకరణ అనేది ప్రాచీనకాలంనుంచి వివిధ రూపాలలో వివిధ పేర్లతో పలువిడతలుగా జరిగిందని పేర్కొనవచ్చు పూర్వపు

విధానాల కంటే ప్రస్తుతం ఉన్న ప్రపంచీకరణ ప్రత్యేకమైనది.

## ప్రస్తుత ప్రపంచీకరణ ముఖ్యలక్షణాలు

1. వేగం అన్నది ప్రస్తుత ప్రపంచీకరణకు ముఖ్యలక్షణంగా పేర్కొనవచ్చు. బౌద్ధం, ఇస్లాం, క్రైస్తవం విశ్వవ్యాప్తం కావడానికి కొన్ని శతాబ్దాల కాలం పట్టింది. చివరికి పారిశ్రామిక విప్లవం రావడానికి, అది అమలులోకి వచ్చిన తరువాత విశ్వవ్యాప్తం కావడానికి కూడా కొన్నిశతాబ్దాల కాలం పట్టింది. కాని ప్రస్తుత ప్రపంచీకరణ విధానాలతో సాంకేతిక రంగం ప్రముఖ పాత్ర వహిస్తున్నది. సాంకేతికరంగం అభివృద్ధి చెందడంతో సమాచార ప్రసారసాధనాల్లో సంభవించిన కొత్త కొత్త ఆవిష్కరణల వల్ల వేగం సంభవించింది.

2. ప్రపంచీకరణ ఫలితాలు చౌకగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. 19వ శతాబ్దం చివరకు అభివృద్ధి చెందిన దేశాలు సైతం పొందలేకపోయిన సాంకేతిక పరిజ్ఞానం కంటే నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలలో సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉంది. ప్రజలందరికి కూడా తక్కువ ధరలకే వస్తువులు లభ్యమవుతున్నాయి.

3. భావప్రసారాలు యధార్థంలోకి రావడం ప్రపంచీకరణ ముఖ్యలక్షణంగా పేర్కొనవచ్చు. ప్రసారసాధనాల ద్వారా అతికొద్ది కాలంలోనే ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా ప్రజలందరికి వాస్తవరూపంలో తెలుస్తున్నది.

పై అంశాలతో పాటుగా ఈ క్రింది వాటిని కూడా ప్రపంచీకరణ లక్షణాలుగా పేర్కొనవచ్చు.

1. రాష్ట్ర జాతీయ స్థాయిలలో సాంకేతిక నైపుణ్యం పెరిగినందు వల్ల వ్యాపార సంస్థలలో ఇంతకు ముందెన్నడూ కానరాని ఎదుగుదల లేదా అభివృద్ధి కనిపిస్తుంది. వ్యక్తులు సంస్థలు, దేశాలు, రాష్ట్రాలు, ప్రపంచంలో ఉండే మార్కెట్ పెట్టుబడుల ఫలితాలను త్వరితగతిలో తక్కువ ధరలకే అందుబాటులో ఉంటున్నాయి. FREE MARKET CAPITALISM ప్రపంచంలోని అన్ని దేశాలకూ అందుబాటులో ఉంటున్నాయి.

2. 20వ శతాబ్దంలో అవసరాలు, ఒత్తిడి, ప్రపంచ చైతన్యం తీవ్ర రూపం దాల్చడం వల్ల దేశాలు ఒకదాని మీద మరొకటి పరస్పరం ఆధారపడి ఉండేలా చేసింది.

3. సామాజిక, సాంస్కృతిక అనుక్రమణిక క్రమబద్ధం కావడానికి ప్రపంచీకరణ కారణమైంది. ప్రపంచీకరణ ఒక సామాజిక ప్రక్రియ.

4. చారిత్రక పరిణామం, విలువలు, అభిరుచులు, సాంకేతిక విలువలు, మానవులకు అవసరమైన సరుకులు ప్రపంచ స్థాయిలో పెరగడం అనేది ప్రపంచీకరణ వల్ల ఏర్పడిన మార్పు. ఈ అభిరుచులు మానవ జీవన విధానంపై అమితమైన ప్రభావాన్ని చూపాయి. మానవ చర్యలకు ఒక స్వరూపాన్ని కలిగించాయి.

5. ప్రపంచ కొలమానాన్ని అనుసరించి మార్కెట్ నియమాలకు సమగ్ర రూపాన్ని కలిగించడం.

6. ప్రపంచీకరణ ఒక చారిత్రాత్మక పరిణామం. ఆర్థిక వ్యవస్థలో ప్రజాజీవనంలో రాజకీయంలో సాంస్కృతిక రంగంలో సామూహిక జీవనంలో కొరవడిన విలువలను లక్ష్యసాధనను నేరవేర్చలేకపోవడం.

7. ప్రపంచీకరణ రాజకీయ ప్రతిచర్యగా నిలవడం.

8. ప్రపంచీకరణ జ్ఞాన (నిలయం) కేంద్రం.

ఈ ప్రపంచీకరణ భారత దేశంలోకి ఎప్పుడు ప్రవేశించింది? అందుకు దోహదం చేసిన పరిస్థితులు ఏమిటి? అనేవి తెల్సుకోవాలి. 1990 సంవత్సరం నాటికి భారతదేశం ఆర్థిక పరిస్థితుల్లో మాంద్యం ఏర్పడింది. విదేశి బకాయి బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉంది. నాడు మన దేశం మూడు వారాల పాటు మాత్రమే విదేశాలకు చెల్లించవలసిన బకాయి బిల్లులు చెల్లించగల స్థితిలో ఉంది. ఆపైన చేతులెత్తవలసిందే.1990నాటి ఆర్థికమాంద్యం నుండి తెప్పరిల్లుకోవడానికి మన దేశం కూడా గ్లోబలైజేషన్ను ఆదరించినది. పై రెండు కారణాల వలన మన దేశం ప్రపంచ బ్యాంక్ వద్ద చేయి చాప వలసిన పరిస్థితి ఏర్పడి ప్రపంచీకరణను అమలు చేసింది. ఈ ప్రపంచీకరణ వలన కలుగుతున్న పరిణామాలాను అన్నిటినీ సాహితీవేత్తలు తమ రచనల్లో చిత్రించారు.

ఇందులో కవిత్వం, కథ, నవల, నాటకం వంటి ప్రక్రియల్లో పలు రచనలు వచ్చాయి.

ఈ ఉద్యమాలను పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతుంది. ప్రత్యక్షంగానో పరోక్షంగానో రచయితలు పాశ్చాత్య ప్రభావానికి లోనైయ్యారు. పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేయటం వలన పలు సాహిత్య రచనలతోనూ, సిద్ధాంతాలతోనూ పరిచయం ఏర్పడింది. వీటికి తోడు పాశ్చాత్య దేశాల్లో ఉన్న పరిస్థితులు క్రమంగా విశ్వవ్యాప్తమవుతున్నాయి. ఇవి క్రమంగా అన్ని దేశాలపైన ప్రభావం చూపుతున్నాయి. అయితే ఆధునిక కాలంలో మానవుని జీవన సరళి మారడంతో, సామాజిక పరిస్థితులు మారుతున్నాయి. ఈ పరిస్థితులు అతి తక్కువ కాలంలో మారడం వల్ల ఆ ప్రభావం కూడా సాహిత్యంపై పడుతుంది. అయితే ఈ ఉద్యమాలు సాహిత్యంపై చూపిన ప్రభావాన్ని కూడా పరిశీలించాలి. ఈ సాహిత్యోద్యమాల వలన అప్పటి వరకు వస్తున్న సాహిత్యాన్ని పక్కకు నెట్టి మరొక కొత్త కోణంలో సాహిత్యంలో మానవ జీవితాన్ని చిత్రించడానికి ప్రయత్నించాయి. ఈ లక్షణం ఈ అధ్యాయంలో ఉన్న ఉద్యమాలన్నిటికీ వర్తిస్తుంది. అప్పటి వరకు వస్తున్న సాహిత్య లక్షణాలను పక్కకు నెట్టి ఒక కొత్త పంతాను ఏర్పరిచినటువంటిది భావకవిత్వోద్యమం. భావకవిత్వాన్ని పక్కకు నెట్టి వెలుగులోకి వచ్చినటువంటిది దిగంబర కవిత్వోద్యమం. అప్పటి వరకు స్త్రీల పరిస్థితిని గమనించి తమకు గల అస్థిత్వం కోసం ప్రయత్నించినటువంటిది స్త్రీవాద సాహిత్యం. అప్పటి వరకు వస్తున్న జీవిత చిత్రణకు భిన్నంగా సాహిత్యాన్ని చిత్రిస్తున్నటువంటిది ప్రపంచీకరణ సాహిత్యం. అయితే వీటన్నిటికీ గల కారణం సామాజికంగా వస్తున్న మార్పులే. సమాజంలో వస్తున్న ప్రతి మార్పు ఒక కొత్త సాహిత్యోద్యమానికి కారణం అవుతుంది. వాటికి అనుగుణంగానే ప్రతి కవి/రచయిత స్పందిస్తున్నాడు. సాహిత్యోద్యమంలో భాగమవుతున్నడు.

# ఆరవ అధ్యాయం

# ఆధునిక తెలుగుసాహిత్యోద్యమాలు-

# ప్రాచ్య ప్రభావం - చారిత్రక విమర్శ

# 6. ఆధునిక తెలుగుసాహిత్యోద్యమాలు - ప్రాచ్య ప్రభావం - చారిత్రక విమర్శ

ఈ ఉద్యమాలు కేవలంలో ఇక్కడి స్థానిక నేపథ్య పరిస్థితుల ప్రభావం వల్ల ఏర్పడ్డాయి. ఈ అధ్యాయంలో కొన్ని ఉద్యమాలకు సంబంధించిన భావజాలం పాశ్చాత్య దేశాలకు సంబంధించినప్పటికీ, ఇక్కడి పరిస్థితుల వల్లనే సాహిత్య ఉద్యమాలుగా అవతరించాయి. ఇందులో కొన్ని ఉద్యమాలకు పాశ్చాత్య దేశాల్లో లేనటువంటి ప్రత్యేక కారణాలు భారతదేశంలో కనిపిస్తాయి. ఈ కారణాల వల్ల ఈ నేపథ్యంతో ఏర్పడిన ఆధునిక తెలుగు సాహిత్య ఉద్యమాలను ఈ అధ్యయంలో వివరించాను.

## 6.1. విప్లవసాహిత్యోద్యమం

విప్లవ సాహిత్యపు భావజాలం మార్క్సిజం అనే విషయం అందరికి అవగతమైనటువంటిదే. మార్క్సిజం పాశ్చాత్య భావజాల సిద్ధాంతం. కాబట్టి దీనిని పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించి ఇక్కడి నేపథ్యంతో ఏర్పడిందని చెప్పాలి. కానీ తెలుగులో వచ్చిన విప్లవ సాహిత్య నేపథ్యాన్నీ పరిశీలిస్తే, ఈ విషయం చెప్పడం అసమంజసమనిపిస్తుంది. దానికి కారణం విప్లవ కవిత్వం భావజాలపరంగా కాకుండా, ఏర్పడిన నేపథ్య పరిస్థితులనుంచి పరిశీలించాలి. విప్లవ సాహిత్యం పూర్తిగా ఈ దేశంలో, ఈ ప్రాంతంలో ఉన్న పరిస్థితుల నుంచి పుట్టినటువంటిది. అంతేకాకుండా పాశ్చాత్య దేశాల్లో వచ్చిన సాహిత్య ఉద్యమాలు కూడా దీనిని ప్రభావితం చెయ్యలేదు. ఈ దేశంలో జరిగిన సంఘటనలు మాత్రమే ఈ సాహిత్యోద్యమానికి కారణమయ్యాయి. అందువల్ల ఈ ఉద్యమాన్ని ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

విప్లవ సాహిత్యాన్ని పరిశీలిస్తే విప్లవ సాహిత్య ఆవిర్భావానికి రెండు రకాలైన కారణాలు కనిపిస్తాయి. అందులో ఒకటి ఆనాడు సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులు కాగా రెండవది ఆనాడు కవులు/రచయితలు అస్థిత్వం కోసం చేసే ప్రయత్నం అని చెప్పవచ్చు. ఈ రెండు కారణాల వల్ల విప్లవ సాహిత్యం ఏర్పడింది. ఈ రెండు అంశాలు పరిశీలించినట్లయితే విప్లసాహిత్యోద్యమ చారిత్రక నేపథ్యం అవగాహన అవుతుంది.

మొదట ఈ విప్లవ సాహిత్యోద్యమం కంటే ముందు సమాజంలో నెలకొన్న పరిస్థితులను  పరిశీలించాలి. ఈ విప్లవసాహిత్యోద్యమం పై పరోక్షంగా వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు కారణంగా కనిపిస్తాయి. అందులో మొదట పేర్కోదగింది పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ జిల్లాలోని నక్సల్బరీ ప్రాంతంలో ప్రారంభమైన నక్సల్బరీ ఉద్యమం. ఈ నక్సల్బరీ పోరాటం కేరళ, ఒరిస్సా వంటి మిగిలిన రాష్ట్రాలతో పాటు ఆంధ్రదేశానికి కూడా వ్యాపించింది. ముందుగా పశ్చిమ బెంగాల్ లోని నక్సల్బరీ ప్రాంతంలోని నక్సల్బరీ ఉద్యమాన్ని గురించి తెలుసుకోవడం సముచితం.

1967 భారత కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో కొన్ని రకాలైన విభేదాలు కనిపిస్తాయి. మార్క్సిస్టు పార్టీలో విప్లవ అనుకూల, ప్రతికూల వర్గాలు ఏర్పడ్డాయి. విభేదాలు పొడచూపాయి. విప్లవానికి అనుకూలుమైనవారు ఉద్యమబాట పట్టారు. బెంగాల్ లో ఈ విభజన స్పష్టంగా కనిపిస్తుంది. బెంగాల్ లో రైతుల పరిస్థితి దయనీయ స్థితికి చేరుకొంది. అటువంటి సమయంలో బెంగాల్ రాష్ట్రంలో నక్సల్ బరీ జిల్లా రైతుకూలీలు భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నడిపారు. ఈ పోరాటం కేవలం భూమి గురించి, పంట గురించీ కాకుండా రాజకీయ అధికారానికై పోరాడారు. ఈ పోరాటాన్ని నడిపేందుకు వారు ఇతరులపై ఆధారపడకుండా తమంతతాము నిలబడి తమ వ్యవసాయ పరికరాల్నే ఆయుధాలుగా స్వీకరించి మావో ఆలోచనా విధానంతో భూస్వాములను ఎదుర్కొవడానికి సిద్ధపడ్డారు. బెంగాల్ లో మార్క్సిస్ట్ పార్టీ బలంగా ఉన్నప్పటికీ రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదు. మార్క్సిస్ట్ లు బెంగాల్ ను

పరిపాలించినప్పటికీ ధనిక పేద అంతరాలు ఏమాత్రం తొలగిపోలేదు. దున్నేవాడికే భూమి అనే నినాదం కొనసాగినప్పటికీ దున్నేవాడికి భూమి దక్కలేదు. దీనితో దున్నేవాడికి భూమి దక్కడం కోసం, ధనికుల అరాచకాలను ప్రతిఘటించడం కోసం నక్సల్బరీ రైతులు తిరగబడ్డారు. ఆయుధం చేత పట్టారు. కానీ ఈ నక్సల్బరీ ఉద్యమాన్ని బెంగాల్ మార్క్సిస్టులే అణచడానికి ప్రయత్నించారు.

ఆంధ్రప్రాంతంలోని శ్రీకాకుళం జిల్లా గిరిజన ప్రాంతాల్లో కూడా పైన పేర్కొన్న పరిస్థితులే నెలకొని ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో బీద గిరిజనులు వడ్డీ వ్యాపారుల దారుణమైన ఉచ్చుల్లో చిక్కుకొని, పోడు వ్యవసాయం చేసుకొనే కూలీలుగా మారిపోయారు. పండ్లు, వేర్లు, ఆకులు, కలపవంటి అడవి సరుకులమీద ఎన్నో హక్కులను అనుభవించే గిరిజనులు తినడానికి తిండికి కూడా గతిలేక తక్కువ కూలీకి శ్రమను అమ్ముకునే స్థితికి దిగజారారు. రోజంతా కష్టపడి పనిచేసే గిరిజన కార్మికుడికి తినడానికి తిండే కరువైంది. గిరిజన సాంఘిక జీవనాన్ని అస్తవ్యస్తం చేసి, అటవీ రక్షణ నిబంధనలను కఠినంగా అమలు జరిపారు. దీనితో గిరిజనుల జీవితం దుర్భరంగా మారిపోయింది. ఆ సందర్భంలో వెంపటాపురపు సత్యానారయణ అక్కడి గిరిజన స్త్రీని పెళ్ళాడి అక్కడ స్థిరపడ్డాడు. తరువాత క్రమంగా భూస్వాముల దురాగతాలను గిరిజనులకు వివరించి, భూస్వాముల అక్రమ వసూళ్ళను ఎదిరించి, వారి నుంచి ఎక్కువ కూలి రాబట్టడానికి గిరిజనులను సమీకరించాడు. అతని నాయకత్వంలో గిరిజన కోర్కెల సాధనకు గిరిజన సంఘం స్థాపించబడింది. అతడు చేస్తున్న ఫలితాలను కమ్యూనిస్ట్ పార్టీ గుర్తించింది. తరువాత అతడిని కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడిగా చేసుకొని కమ్యూనిస్ట్ పార్టీ తన కార్యకలాపాలను కొనసాగించింది. తరువాత "1960లో వెంపటాపు సత్యానారాయణకు కమ్యూనిస్టు పార్టి సభ్యత్వం ఇచ్చి జిల్లా కమిటీ సభ్యునిగా తీసుకొంది. 1960 జూన్ లో మొండింఖల్ గ్రామంలో మొట్టమొదటి గిరిజన రైతు మహాసభ జరిగింది. వెంపటాపు సత్యానారాయణ అధ్యక్షుడిగాను, ఆదిభట్ల కైలాసం కార్యదర్శిగాను శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతు సంఘం అవతరించింది." (అనంతం:

తెలుగు సాహిత్యంలో కల్లోల దశాబ్దాలు 1965-1985, పుట.63.) ఈ గిరిజన సంఘం పలు విజయాలను సాధించింది. అధికవడ్డీలు రూపుమాపడం, గిరిజన కార్పోరేషన్ దోపిడీని అంతంచేయడం, కూలిరేట్లు, పాలేర్ల జీతాలు అభివృద్ధి చేయడం, రెవిన్యూ పెత్తందార్ల దోపిడీని అంతం చేయడం వంటి పలు విజయాలను నమోదు చేసుకొంది. గిరిజనులు పలు ప్రయోజనాలు పొందారు. మొదట్లో కూలీ రేటు పెంపుదలకూ, అటవీ అధికారుల పెత్తనాన్ని ఎదరించటానికీ మాత్రమే ఈ ఉద్యమం మొదలైంది. తరువాత కాలంలో ఈ ఉద్యమం బంజారు భూములు సాగుచేసే హక్కును పొందటానికి కూడా గిరిజనులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నం తీవ్ర సంఘర్షణకు దారీ తీసింది. ఈ సంఘర్షణల ఫలితంగా భూస్వాములు 1967 నాటికి గిరిజనుల ఒత్తిడికి తలవంచారు. గిరిజనులు చేసిన పోరాటాల ఫలితంగా కౌలుదార్లు కూడా ప్రయోజనం పొందేస్థితికి వచ్చారు. భూస్వాములు కౌలుదార్లకు మూడువంతుల పంటను కూడా వదులు కోవలసి వచ్చింది. దీనితో భూస్వాములు తమ ఆధిపత్యం కోల్పోతున్నామనే భావన ఏర్పడింది. దీనితో భూస్వాములకు, గిరిజనులకు మధ్య పోరాటం ప్రారంభమైంది. అప్పటికే బెంగాల్ లోని నక్సల్బరీ రైతుల నుంచి స్ఫూర్తి పొందిన శ్రీకాకుళం గిరిజనులు బెంగాల్ రైతులు అవలంభించిన విధానాన్ని అనుసరించారు. ఆయుధం చేపట్టి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో వెంపటాపురపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, పంచాది నిర్మల, సుబ్బారావు పాణిగ్రాహి, చాగంటి భాస్కరరావు, తామాడ గణపతి మొదలైన నాయకులు చనిపోయారు. వీరిలో పలువురు సాహిత్యాన్ని తమ పోరాటానికి ఆయుధంగా వాడుకొని ప్రజలను చైతన్యవంతులను చేశారు. వీరు రచించిన సాహిత్యం, వీరి మరణం నాటి సమకాలీన రచయితలపైన/కవులపైన/ సాహితీవేత్తలపైన అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ రచయితల సంఘం రెండు కూడా కొంత కాలానికి నిశ్శబ్దంగా ఉండిపోయాయి. అభ్యుదయ సాహిత్యంలో స్తబ్దత నెలకొన్నప్పటికీ ఒక ప్రత్యేకతను అప్పటికే ఏర్పరుకొంది. పలువురు కవులు/రచయితలు అభ్యుదయ

సాహిత్యం వైపు పయనించారు. రచనల్లో వాస్తవికత చోటుచేసుకొంది. సాహిత్యంలో ప్రజల పోరాటం చిత్రీకరించబడింది. దాదాపు భావకవిత్వపు ఛాయలన్నీ కూడా కనుమరుగయ్యే స్థితి ఏర్పడింది. అనేకమంది కొత్త కవులు/రచయితలు ఏర్పడి అభ్యుదయం సాహిత్యం వైపు వచ్చారు. ఇలా అభ్యుదయ సాహిత్య సంప్రదాయం విశిష్టంగా తెలుగులో ఏర్పడి, ప్రధానమైన సాహిత్యంగా పరిణమించింది. దీనితో సాహిత్యంలో వచ్చే ప్రతికొత్త ధోరణిని అభ్యుదయ ధోరణి అనే స్థితి ఏర్పడింది. సామ్యవాదులూ, జాతీయవాదులూ, వాస్తవికవాదులు, ఆదర్శవాదులూ, సంప్రదాయపరులూ, అంతర్జాతీయవాదులూ... అందరూ ఎలాంటి విచక్షణా లేకుండా అభ్యుదయ రచయితలమని చెప్పుకోసాగారు. మరికొందరు అభ్యుదయ రచనకు ముఖ్యమైన అంశంగా భావించే మార్క్సిస్టు అవగాహనను పక్కనపెట్టి అభ్యుదయాన్ని విశాలార్థంలో మాత్రమే చెబుతూ నన్నయ, తిక్కన, వేమన్న, కందుకూరి, గురజాడ మొదలైనవారికి కూడా ఈ అభ్యుదయ వాదాన్ని అనుసంధానిస్తూ వ్యాఖ్యానించేవారు తయారయ్యారు.

ఈ లోపల దేశంలో అనేక కొత్త సవాళ్లు ప్రారంభమయ్యాయి. అప్పటికే కొందరు అభ్యుదయ వాదులు ఎన్నికలకు, ఓట్లకోసం పాకులాడి రాజకీయ బేరసారాలకు, శాసనసభా కార్యక్రమాలకు అంకితమైపోయి, ప్రజల అవసరాలను దాటవేస్తూ కేవలం సిద్ధాంతపరమైన అంశాలను మాత్రమే అంటిపెట్టుకొని ఉండిపోయారు. ఇలా ఉండిపోయిన అభ్యుదయవాదులతో ముఖ్యంగా యువకులు విసుగెత్తి పోయారు. ఓపిక తగ్గిపోయింది. ఏదోచేయాలనే ఆరాటం పెరిగింది. అప్పటికే శ్రీకాకుళంలో జరిగిన పోరాటంపై పలువురు యువకులు ఆసక్తి చూపారు. ఆ కాలంలో, ఆ సమయంలో ఉన్నటువంటిదీ, ప్రజాపోరాటమైన గిరిజన ఉద్యమం మీద ఆసక్తి పెరిగింది. ఆ ఉద్యమానికి అండదండలిచ్చే ఉద్దేశంతో వివిధ ప్రాంతాల్లో జరుగ సాగిన దాడులను గురించి సానుభూతి కలిగింది.

ఇక అప్పటికే కొందరు సాహితీ మిత్రులు కలిసి శ్రీశ్రీ షష్టిపూర్తికార్యక్రమాన్ని విశాఖపట్టణంలో చేయటానికి నిర్ణయించుకొన్నారు. ఈ షష్టిపూర్తి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు 1969లో ప్రారంభమై 1970 ఫిబ్రవరిలో జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్యులైన సాహితీవేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. అప్పటికే శ్రీకాకుళంలో జరిగిన గిరిజనపోరాటం విశాఖపట్టణంపై కూడా ప్రసరించిది. గిరిజన పోరాటానికి సానుబూతిపరులైన పలువురు విద్యార్థులు శ్రీశ్రీ షష్టిపూర్తిసభలో కరపత్రాలు పంచారు. శ్రీశ్రీ సన్మాన సభలో పలువురు సాహితీవేత్తలు విద్యార్థుల కరపత్రాలకు స్పందించారు. తరువాత హైదరాబాదులోని సెవెన్ స్టార్ సిండికేటు అనే సాంస్కృతిక సంస్థ తమ పదవ వార్షికోత్సవంలో అభ్యుదయ సాహిత్య సదస్సును నిర్వహించాలనుకొన్నారు. ఈ అభ్యుదయ సాహిత్య సదస్సులోనే శ్రీశ్రీని సన్మానించాలనుకున్నారు. అందుకు వారు శ్రీశ్రీని అహ్వానించగా, అందుకు అనేక తర్జనభర్జనల అనంతరం సెవెన్ స్టార్ సిండికేటు సంస్థ ఆహ్వానాన్ని మన్నించి వచ్చాడు. శ్రీశ్రీ అక్కడికి వచ్చినప్పటికీ అక్కడ ఉన్న విప్లవ భావాలు గల సాహితీ పరుల కోరిక మేరకు రాత్రికి రాత్రే విప్లవ రచయితల సంఘాన్ని స్థాపించడానికి పూనుకొన్నాడు. అలా విప్లవ రచయితల సంఘం ప్రారంభైంది. ఇది ఆనాడు నెలకొని ఉన్న పరిస్థితులు. ముఖ్యంగా శ్రీకాకులాంధ్ర ఉద్యమం పలువురిని కదిలించి విప్లవ రచయితల సంఘం ఏర్పడటానికి కారణం అయింది.

ఈ విప్లవ రచయితల సంఘం ఏర్పడటానిక మరొక ముఖ్య కారణం ఆనాడు కవులు/రచయితలు వారి అస్థిత్వం కోసం చేసిన ప్రయత్నిం. అప్పటికే కొందరు వివిధ ఉద్యమ సాహిత్యాలతో పరిచయం కలిగివున్నారు. తరువాత వారు ఆ ఉద్యమాల నుంచి బయటకు వచ్చారు. వారందరు వివిధ కారణాలతో విప్లవసాహిత్యం ఏర్పడిన సందర్భంలో అందులో భాగంగా కొనసాగారు. విప్లవ రచయితల సంఘం ఏర్పడినపుడు అందులో ఉన్న వారిని క్రమంగా పరిశీలించినట్లయితే వారికి ఇంతకు పూర్వం ఉన్న సాహిత్యోద్యమాల సంబంధం తెలుస్తుంది. అంతేకాకుండా వారు విప్లవరచయితల

సంఘంలో కొనసాగడానికి గల కారణం కూడా తెలుస్తుంది.

విప్లవ సాహిత్యం ఏర్పడటంలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో మొదటగా పేర్కొనదగిన వ్యక్తి శ్రీశ్రీ. విప్లవ రచయితల సంఘం ఏర్పడినపుడు ఆ సంఘానికి అధ్యక్షుడు. శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షునిగా కూడా పనిచేశాడు. కానీ కొంతకాలం తరువాత అభ్యుదయ రచయితల సంఘంలో సంప్రదాయవాదులు కూడా సభ్యులుగా చేరడంతో అభ్యుదయ రచయితల సంఘంలో కొంత అస్పష్టత లోపించినట్లయింది. అనంతరం కూడా అభ్యుదయ సాహిత్యంలో మితవాద వైఖరి కొనసాగింది. ముఖ్యంగా 1948 తర్వాత పరిస్థితి దిగజారుతూ వచ్చింది "1958 నాటికి సంస్థను నిర్వహించడం, పత్రికను కొనసాగించడం ప్రయాసగా పరిణమించింది. అభ్యుదయం పేరే మిగిలింది. అరసం లెటర్ పేడ్ మీదనే నిలిచింది. జీవధాతువు హరించుకు పోయింది. అది చావుబతుకు కానీ సంధిగ్ధ స్థితి. 1948 లోనైతే హఠాత్తుగా స్థంభించింది కానీ 1958 తర్వాత మాత్రం మంచంపట్టి తీసుకోసాగింది." (రమణారెడ్డి, కె.వి: అభ్యుదయ సాహిత్యోద్యమం, అభ్యుదయ, 1988 మార్చి, పుట.18.) పలువురు కవులు/ రచయితలు మద్రాసుకుపోయి సినీరంగంలో కళాకారులుగా స్థిరపడ్డారు. వీరు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. మద్రాసుకు వెళ్ళి అక్కడ సినిమారంగంలో ఉన్నవారిలో శ్రీశ్రీ కూడా ఉన్నారు. తరువాత అభ్యుదయ రచయితల సంఘానికి దూరంగా ఉన్నారు. తరువాత అతడు సాహిత్యంలో పోషించిన పాత్ర కూడా పరిమితంగానే ఉండింది. తరువాత శ్రీశ్రీకి విశాఖపట్టణంలో 1970 ఫిబ్రవరి 2న షష్టిపూర్తి జరిగడం, ఆ సభకు అరసం కవులు, దిగంబరకవులూ, తిరగబడు కవులూ, కొత్తవాళ్ళు, పాతవాళ్ళు అంతా అక్కడికి చేరుకోవడం జరిగింది. అప్పటికే శ్రీకాకుళంలో ఉద్యమం ప్రారంభమైంది. ఆ ప్రభావం విశాఖపట్టణంపై కూడా పడింది. ఆసమయంలో విశాఖ విద్యార్థులు రచయితలారా మీరెటూవైపు అంటూ సవాల్ విసిరారు. కరపత్రం కల్లోలం రేపిందనే చెప్పాలి. ఆ కరపత్రాని సమాధానం అన్నట్లుగా పలువురు సాహితీపరులు మాట్లాడటం జరిగింది.

అనంతరం హైదరాబాదు సిండికేటు సంస్థవారు శ్రీశ్రీని సన్మానించాలనుకోవడం ఆ సభల్లో శ్రీశ్రీ ఇతరులతో కలసి విప్లవ రచయితల సంఘం ఏర్పడటం, ఆ సంఘానికి శ్రీశ్రీ అధ్యక్షునిగా కొనసాగటం జరిగింది. తరువాత పలువురు అభ్యుదయ రచయితలు కూడా తమ అస్థిత్వం కోసం విప్లవ రచయితల సంఘంలో కొనసాగారు. విప్లవ రచయితల సంఘం స్థాపనలో ఉన్నటువంటి కొడవటిగంటి కుటుబరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కె.వి. రమణా రెడ్డిలు పూర్వం అభ్యుదయ రచయితల సంఘంలో కొనసాగిన వారు.

ఇక రెండవ వర్గానికి చెందినవారు దిగంబర కవులు. వీరు తమ రచనల ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక సంచలనం సృష్టించిన తరువాత అదే ఊపును కొనసాగించలేక పోయారు. వీరికి ఒక సిద్ధాంతపరమైన స్పష్టత లేదనేది విమర్శకుల అభిప్రాయం. ఆ అస్పష్టత వలన కాబోలు వారు తరువాత వారి రచనలు అదే పంథాలో కొనసాగించలేక పోయారు. తరువాత శ్రీశ్రీ షష్టి పూర్తి సందర్భంగా విశాఖపట్టణం చేరుకున్న కవులలో వీరు కూడా ఉన్నారు. విశాఖ విద్యార్థుల కరపత్రానికి స్పందించినవారిలో వీరిని కూడా పేర్కొనవచ్చు. తరువాత వీరిలో వీరికి మనస్పర్థలొచ్చాయి. ప్రజాతంత్ర వార పత్రికలో ఇంటర్వ్యూ ఇచ్చినందుకు దిగంబర కవులు మహాస్వప్నకు చార్జిషీటు ఇచ్చారు. దీనితో మహాస్వప్న దిగంబరకవులనుంచి విడిపోతున్నట్లు పేర్కొన్నాడు. భైరవయ్య కూడా విడిపోయినట్లు చెప్పకుండానే దిగంబర కవుల నుంచి పక్కకు తప్పుకున్నాడు. విప్లవ భావాలను సాయుధ పోరాటాన్ని సమర్థించిన వీరు తరువాత విప్లవ రచయితల సంఘం ఏర్పడినపుడు అందులో ముఖ్య పాత్ర పోషించారు. నిఖిలేశ్వర్, నగ్నముని, జ్వాలాముఖి, చెరబండరాజు విప్లవ రచయితల సంఘం ఏర్పడినపుడు అందులో సభ్యులుగా కొనసాగారు.

విశాఖ పట్టణంలో జరిగిన శ్రీశ్రీ షష్టి పూర్తి సందర్భంగా విశాఖ విద్యార్థులు 'రచయితలకు సవాల్' పేరుతో రచయితలలోని స్తబ్దతను తాటస్థ్యాన్ని

సమాధానపడటాన్ని ప్రశ్నిస్తూ పంచిన కరపత్రం తరువాత రాజకీయ విప్లవ సాధన ధ్యేయంగా 1970 పూర్వార్థంలో వరంగల్ కేంద్రంగా పదిమంది యువకవులు వరవరరావు, లోచన్, అశోక్, సంజీవరావు, సుధాకర్, యాదగిరిరావు, కిషన్, ఎక్స్ రే, ఐ - అనే వాళ్ళు నూతన సాధన వ్యవస్థ కోసం, విప్లవ సాధన కోసం 'తిరగబడదాం' అని యువకులకు పిలుపునిస్తూ 'తిరగబడు' కవులుగా బయలుదేరారు.

వీరు ప్రస్తుత వ్యవస్థతో రాజీలేని పోరాటానికి పిలుపునిస్తూ, సమకాలీన సమాజంపై విమర్శలు చేస్తూ, ప్రజలను మందలిస్తూ, ఈ సమాజంలో కుళ్ళును కడగటానికి 'శస్త్రచికిత్స' తప్ప వేరేమార్గం లేదని భావిస్తూ తిరగబడు కవులుగా ప్రారంభమయ్యారు. తరువాత తిరగబడు కవులు దిగంబర కవులతో కలసి విప్లవ రచయితల సంఘం స్థాపనకు కారణం అయ్యారు. వరవరరావు, లోచన్, కిషన్, అశోక్ మొదలగు వారు విప్లవ రచయితల సంఘంలో కార్యనిర్వాహక సభ్యులుగా కొనసాగారు.

దిగంబర కవులకున్న తీవ్రమైన శైలీ, అభివ్యక్తీ, అవగాహన లేకపోయినా 'తిరగబడుకవుల' కున్న నిర్ధిష్ట లక్ష్యం లేకపోయినా, ప్రపంచ సమస్యల కీకారణ్యపు ఘోర నిబడనిశీని చీలుస్తామంటూ స్తబ్దతను పోగొట్టే మరొక ప్రయత్నంలో 1970 జూలైలో విజయవాడ నుంచి బయలుదేరిన కవులు 'పైగంబర కవులు'. సుగన్ బాబు, దేవీప్రియ, కిరణ్ బాబు, ఓల్గా, కమాలాకాంత్ అనే అయిదుగు కవులు తమకవిత్వం సమస్యలకీకారణ్యంలో మానవ తారాపథం చూపించే టార్చిలైటుగా తమది ప్రధానంగా మానవతావాదంగా చెప్పుకొంటూ '..... సమస్యల పరిష్కారాణికి మానవత, సమరస భావం ఎంత అవసరమో కొన్ని వేళల్లో కరకు కత్తిలా వ్యవహరించటం కూడా అంతే అవసరం అని నమ్మిన వాళ్ళం' అని అవసరమైతే తిరుగుబాటు తప్పదంటూ పైగంబర కవులుగా కొందరు కొనసాగారు. కాని వీరు కూడా అనంతర కాలంలో విప్లవ రచయితల సంఘం సభ్యులుగా చేరారు.

పై అంశాలను పరిశీలిస్తే కొన్ని అంశాలను అవగాహన చేసుకోవచ్చు. ఒకటి విప్లవరచయితల సంఘం ఏర్పడక పూర్వం సాహిత్య విమర్శకుల దృష్టిలో వివిధ ధోరణులుగా చెలామణి అయినవి విప్లవ సాహిత్యోద్యమం తరువాత మనుగడ కోల్పోయి విప్లవ సాహిత్యంలో భాగంగా మారాయి. కవులు/రచయితలు కూడా విప్లవ సాహిత్యోద్యమంలో భాగం కావడం జరిగింది. విప్లవ రచయితల సంఘంలో భాగంగా ఏర్పడిన తరువాత భావజాలంలో స్పష్టత ఏర్పడింది. అంతకు పూర్వం అభ్యుదయ రచయితలలో కానీ, దిగబర కవులలో కానీ, పైగంబర కవులలో కానీ భావజాల పరంగా స్పష్టత లేదని విమర్శకులు పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల భావజాలం సామ్యవాదం అయినప్పటికీ అందులోని సభ్యులందరికీ భావజాలంలో ఏకరూపతలేదు. కొందరు సాంప్రదాయవాదులు కూడా అభ్యుదయ రచయితలుగా కొనసాగారు. అదే విధానం దిగంబర కవులలో కూడా ఆవేశ పూరితమైన రచనలు చేసిప్పటికీ చివరికి వారిలో కూడా సిద్ధాంతపరమైన భావజాలం ఏదీ లేదు. పైగంబర కవులది అదే పరిస్థితి. కానీ విప్లవ సాహిత్యోద్యమంలో భాగమైన తరువాత భావజాలంలో స్పష్టత ఏర్పడింది. మార్క్సిస్ట్ భావజాలంతో రచనలు వెలువడ్డాయి.

## 6.2. దళితవాదం

ఇక్కడి స్థానిక నేపథ్యంతో ఏర్పడిన ఉద్యమం దళిత సాహిత్యోద్యమం. తెలుగులో దళిత సాహిత్యం స్వాతంత్రోద్యమ కాలం నుండి ఉన్నప్పటికీ అది ఒక నిర్దిష్ట రూపాన్ని పొంది ప్రత్యేక సాహిత్య ధోరణిగా పరిగణింపబడిందిమాత్రం 1980 తరువాతనే అని చెప్పాలి. కానీ దళిత దృక్పథంతో కాకుండా కులపరమైన అంశంతో కులవ్యవస్థను నిరసిస్తూ రచనలు చేసిన కవులు ప్రాచీన కాలంలోనే కనిపిస్తారు. తెలుగు సాహిత్యంలో కులవ్యవస్థను నిరసిస్తూ రచనలు చేసిన మొదటివారు శివకవులు. వీరు తమ వీరశైవ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే క్రమంలో కులాలకు అతీతంగా మతాన్ని ప్రచారం చేశారు. శైవమతాన్ని స్వీకరించిన వారు ఎవరైనా వారు ఒకే కులంగా

పరిగణించారు. తరువాత వీరవైష్ణవంలో కూడా ఇటువంటి భావనతోనే ప్రారంభమైనప్పటికీ బ్రహ్మణాయుడు వంటివారు మాత్రమే ఈ కులవ్యవస్థను నిరసించాడు. తరువాత వైష్ణవంలో కులవ్యవస్థను అనుసరించినట్లుగా తెలుస్తుంది. అనంతరకాలంలో వేమన, వీరబ్రహ్మంగారు కులవ్యవస్థను నిరసించారు. భక్తి ఉద్యమ కాలంలో ఇతర రాష్ట్రాలలో కూడా ఇటువంటి రచనలు వచ్చాయి. అప్పటివరకూ కేవలం కులవ్యవస్థని నిరసిస్తూ, అగ్రవర్ణాలు పాటిస్తూ వచ్చిన అంటరానితనాన్ని మాత్రమే పేర్కొన్నారు.

తరువాత అస్పృశ్య సమస్య చిత్రణ, దళిత సమస్య చిత్రణ అనేది 20వ శతాబ్దంల ప్రారంభంలో కనిపిస్తుంది. "1909 భాద్రపదమాసపు 'ఆంధ్రభారతి' పత్రికలో మాలవాండ్రపాట' అన్న గేయంలో అస్పృశ్యతా నిరసన కనిపిస్తుంది. తెలుగు సాహిత్యానికి సంబంధించి ఇదే మొదటి నిరసన కనిపిస్తుంది. తెలుగు సాహిత్యానికి సంబంధించి ఇదే మొదటి అస్పృశ్యతా నిరసన రచన అయితే దీని కర్త ఎవరో తెలియదు." (శిఖామణి: సమాంతర ఆధునిక కవిత్వ వ్యాసాలు, పుట.7.) 1910లో గురజాడ అప్పారావు రాసిన 'లవణరాజు' కల గేయంలో అస్పృశ్యతా నిరసన స్పష్టంగా కనిపిస్తుంది. మంగిపూడి వెంకటశర్మగారు 1915లో 'నిరుద్ధభారతం' అనే పద్యకావ్యం రాశారు. ఈ రచనలు అస్పృస్యతకు వ్యతిరేకంగా వచ్చిటువంటివి. ఇవి దళితేతరులు రచించిన రచనలు. కాని దళితుడైన కుసుమ ధర్మన్న 1921లో మాకొద్దీనల్లదొరతనము అనే గేయం ప్రసిద్ధమైంది. ఇతడు దళిత ఉద్యమాన్ని, తిరుగులేని ప్రశ్నలతో ప్రత్యామ్నాయ జాతీయోద్యమాన్ని నడిపాడు. "జాతీయోద్యమంలో కాంగ్రెస్ గాంధేయవాదులు పంచమ సమస్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నాడు. జాతీయసమైక్యత కావాలంటే ముందుగా కులం నిర్మూలించబడాలని. మాల, మాదిగల సంరక్షణ జరగాలి. ఈ సమస్యకు ప్రాధాన్యత లేనంతకాలం దేశానికి స్వరాజ్యం అనవసరమన్నాడు." (శ్యామల, గోగు (సంపా): నల్లపొద్దు, పుట.15.) తరువాత ఉన్నవలక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి వంటి రచనలు దళితులకు

సంబంధించిన ఇతివృత్తపు రచనలుగా కనిపిస్తాయి. అనంతర కాలంలో పలువురు దళితులు, దళితేతరులు దళితుల జీవితాన్ని గురించి రచనలు చేశారు.

కానీ ప్రస్తుతం ఉద్యమ రూపాన్ని సంతరించుకున్న దళిత సాహిత్య ఉద్యమం మాత్రం ఆధునిక కాలంలోనే ప్రారంభమైంది. ఇది ముందు పేర్కొన్న సాహిత్యానికి భిన్నమైంది. ముఖ్యంగా 20వ శతాబ్దంలో సాహిత్యంలో ఒక ప్రధాన ఉద్యమంగా కొనసాగుతున్నది. ఈ దళిత సాహిత్య ఉద్యమ నేపథ్యం గురించి ఇక్కడ వివరించదలుచుకున్నాను.

ఇప్పుడున్న దళిత సాహిత్య ఉద్యమం భారతదేశంలో, భారతీయ భాషా సాహిత్యాల్లో దళితోద్యమం ప్రారంభమైనప్పుడే ఇంచుమించూ అదే కాలంలోనే తెలుగులో కూడా వెలువడింది. కాని తక్కిన భాషల్లో దళిత సాహిత్యం స్థిరపడినంత త్వరగా కానీ, వెలువడినంత సాహిత్యం కానీ తెలుగులో జరగలేదు. అందుకు ఆయా ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు, దళితోద్యమ నాయకులు కారణం కావచ్చు. తెలుగులో 1980 తరువాత దళిత సాహిత్యం ఒక ధోరణిగా ప్రారంభమై అనంతర కాలంలో ఉద్యమ రూపాన్ని సంతరించుకొన్నది. కాని అప్పటికే అంటే 1980ల నాటికి మరాఠిలో దళితసాహిత్యం ఒక ఉద్యమ సాహిత్యంగా స్థిరపడిపోయింది. "మరాఠీలో దళిత సాహిత్యానికి జ్యోతిబాపూలే- అంతకంటే ఎక్కువగా డా॥ భీమ్ రామ్ బాబాసాహేబ్ అంబేద్కర్ ప్రేరణ నిచ్చారు. 1950లలో ప్రారంభమై- మహారాష్ట్ర బుద్ధసాహిత్య పరిషత్తు దోహదంతో విస్తరించిన దళిత సాహిత్యం 1970లలో స్థిరమైన ఉద్యమ రూపాన్ని పొంది, 1980 నాటికి మరాఠీ సాహిత్య స్రవంతిలో భాగమై గుర్తింపు పొంది పాఠ్యగ్రంథాలలోకి కూడా ప్రవేశించింది." (ఆధునిక సాహిత్యం-దళితస్పృహ: పుట.12.) ప్రస్తుతం అయితే తెలుగులో కూడా దళిత సాహిత్యం విస్తృతంగా వెలువడుతూ ఉంది. ఇలా ఈనాడు విస్తృతంగా వెలువడుతున్న దళిత సాహిత్యం

కూడా ఒక ప్రత్యేక నేపథ్యం నుంచి వెలువడినటువంటిదే.

ఆంధ్రదేశం వెలుపల జరిగిన దళిత ఉద్యమాలను మొదట పరిశీలిస్తే వివిధ రాష్ట్రాలలో జరిగిన ఉద్యమాలు అవగతమవుతాయి. ఉద్యమంగా కాక సమాజంలో ఉన్న అంటరానితనాన్ని తొలంచడానికి ప్రయత్నం చేసినవారు క్రైస్తవ మిషనరీలు. హిందూ మతంలో ఉన్న అంటరానితనాన్ని పారద్రోలడానికి వారు అంటరానివారుగా భావింపబడేవారికి క్రైస్తవమతాన్ని ఇచ్చి, వారికి విద్యను అందించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ప్రయత్నం చేశారు. అంటరానివారికోసం ఉద్యమ రూపంలో కృషి చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతీరావుపూలే. శూద్ర, అతిశూద్ర ప్రజల మానవహక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన తొలి వ్యక్తి. హిందూ సంస్కృత పండితుల రాజ్యం, పీశ్వాలు, వర్ణ-కుల వ్యవస్థని పకడ్బందీగా పోషిస్తున్న కాలంలోనే మహారాష్ట్రలో పూలే సామాజికోద్యమం నడిపాడు. సత్యసోధక సమాజం అనే సంస్థను స్థాపించి, దాని ద్వారా బ్రాహ్మణేతర కార్మికోద్యమం, సత్యాశోధక బహుజన రైతుకూలీ ఉద్యమం వంటివాటిని ఆకాలంలోనే నిర్వహించారు. అణగారిన వారికోసం విద్యను అందించే ప్రయత్నం చేశాడు. "బొంబాయి ప్రెసిడెన్సీలో అంటరాని వాళ్ల కోసం ఆయన 1851లోనే ఒక ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. మొత్తం భారతదేశంలోనే అంటరాని వాళ్లకోసం స్థాపించిన మొట్టమొదటి పాఠశాల అదే." (చిన్నారావు, యాగాటి: ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర, పుట.43.) ఇతడు తన భార్య సావిత్రీ భాయి పూలేతో కలిసి పలు పాఠశాలలను స్థాపించాడు.

తరువాత జాతీయోద్యమ కాలంలో పలువురు సంఘసంస్కరణకు పూనుకొన్నారు. ఇందులో భాగంగా దళిత జనోద్ధారణకు పూనుకొన్నారు. హిందూ మతానికి అస్పృశ్యత కళంకమైనదిగా భావించారు. మరి కొంతమంది కులనిర్మూలనను ప్రధాన అంశంగా చూశారు. ఇది దళితేతరులు చేసినటువంటిది. ఆ సమయంలోనే ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానం ద్వారా పలువురు కింది వర్గాల (వర్ణాల) వారు

కూడా విద్యను అభ్యసించడం జరిగింది. దీంతో పలువురు దేశ వ్యాప్తంగా విద్యావంతులుగా తయారయ్యారు. వీరిలో మొదటి తరం వారు తమకు జరుగుతున్న అన్యాయాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న అంటరానితనాన్ని గుర్తించారు. తమ కోసం తామే పోరాడాలని నిర్ణయించుకొన్నారు. దేశవ్యాపితంగా కిందికులాలుగా భావించబడే వారిలో చదువుకొన్న మొదటితరం వ్యక్తులు కొందరు దేశంలో అగ్రవర్ణాల వారిని ఆర్యులుగా భావించి తాము ఆర్యేతరులుగా భావించుకొని అగ్రవర్ణాలపై నిరసన ప్రకటించారు. వీరు తమని ఆదివాసులుగా ఈ దేశ మూలవాసులుగా ప్రకటించుకొన్నారు. ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ, ఆది కర్ణాటక వంటి పేర్లు వాడుకలోకి తెచ్చారు. ఈ "ఆదిజన ఉద్యమాన్ని మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, పంజాబులకు విస్తరింపచేస్తూ ఆదిహిందూ మహాసభలు నిర్వహించారు. ఈ ఉద్యమం రూపొందించిన తీర్మాణాల ఒత్తిడి వల్లనే మద్రాస్ ప్రభుత్వం 25-3-1922 నాడు జీ.వో. నెంబర్ 817 ను విడుదల చేసింది. దక్షిణ భారత దేశంలో అస్పృశ్య కులాలలో 'పంచమ' లేదా 'పరయ' అన్న పదాలను తొలగించి వాటి బదులు తమిళనాడులో దళితులను ఆది ద్రావిడులని తెలుగు జిల్లాల్లోని దళితులను ఆది ఆంధ్రులని ఆనాటి ప్రభుత్వ రికార్డుల్లో రాయడం జరిగింది." (శ్యామల, గోగు(సంపా): నల్లపొద్దు, పుట.10.) ఈ ఉద్యమం1915 నుండి 1930 మధ్యకాలంలో జరిగింది. అలా ఆర్యేతరులుగా ప్రకటించుకొన్నవారిలో "పంజాబ్ రాష్ట్రంలో మంగూరామ్, ఉత్తరప్రదేశ్ లో అచ్యుతానంద, ఆంధ్రప్రదేశ్ లో భాగ్యరెడ్డివర్మ, మహారాష్ట్రలో కిషన్ బాన్సోడేలు ముఖ్యులు." (పైదే, పుట.6.)

ఈ ఉద్యమం కొనసాగుతున్న సమయంలోనే మహారాష్ట్రలో పూలే అందించిన ఉద్యమ వారసత్వాన్ని బలోపేతం చేసి ముందుకు తీసుకువెళ్ళినవారు డా.బి.ఆర్. అంబేద్కర్. అంబేద్కర్ తన రచనల ద్వారా దళితులకు ఒక నిర్దేశం చేశాడు. ఆ సమయంలోనే 1958లో బొంబాయి ప్రప్రథమ దళిత రచయితల మహాసభ జరిగింది. అనంతర కాలంలో 1972లో బొంబాయిలో 'దళితపాంథర్స్' ఆవిర్భవించింది. అంతవరకు దళితులంటే ఎస్సీ, ఎస్టీలు అన్న భావనకు అదనంగా ఎస్.సి., ఎస్.టి.,

బి.సి., మైనార్టీలు, స్త్రీలు అందరూ దళితులు అన్న విశాలార్థాన్ని దళితపాంథర్స్ ఇచ్చారు. కేవలం ఆత్మగౌరవమో, సమానత్వమో కాకుండా దళితుల రాజ్యాధికారం సాగించాలని పాంథర్స్ పిలుపునిచ్చారు. "దళితుల విముక్తి పోరాటం ఒక సమగ్రమైన విప్లవం కోరుకుంటున్నది. పాక్షికంగా అది అసాధ్యం. అది మాకొద్దు. మాకు సమగ్రమైన విప్లవాత్మకమైన మార్పు కావాలి. మొదట మాకు జరుగుతున్న సాంఘిక అన్యాయాలను ఎదిరించడంతో తృప్తిపడినా; తర్వాత ఆర్థిక, రాజకీయ రంగాలలో అధికారాన్ని మేమేచేపట్టాలి. మేము ఇక ఏమాత్రం లొంగి ఉండం. దేశాన్నంతా మేమే పరిపాలించాలి. మాకు వ్యక్తులపై ద్వేషం లేదు. మా కసి అంతా ఈ వ్యవస్థపైనే. హృదయ పరివర్తన, ఉదారమైన విద్యా విధానాలు- అన్యాయాన్ని గానీ, దోపిడీనిగానీ రూపుమాపలేవు. దళిత ప్రజానీకంలో చైతన్యం కలిగించి, వాళ్ళను కూడగడతాం." (ఆధునిక సాహిత్యం-దళిత స్పృహ, పుట.42.) ఈ పిలుపు ద్వారా వివిధ రాష్ట్రాలలో దళిత చైతన్యం కలిగిందని చెప్పవచ్చు. ఇది ఆంధ్రదేశానికి వెలుపల జరిగిన దళిత చైతన్య ఉద్యమం.

ఇక ఆంధ్రదేశంలో దళిత ఉద్యమాన్ని పరిశీలిస్తే 19వ శతాబ్దం నుంచే దళిత సంస్కరణోద్యమం నడిచినట్లు కనిపిస్తుంది. సంఘసంస్కరణ కోసం పోరాడిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు. కందుకూరి వీరేశలింగం పంతులు సంఘసంస్కరణ కోసం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కృషి చేస్తే, వెంకటరత్నం నాయుడుగారు కాకినాడ, మచిలిపట్నం పరిసరప్రాంతాల్లో కృషిచేశారు. వీరితోపాటు కాశీనాథుని నాగేశ్వరరావు, గురజాడ అప్పారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగువారు కులవివక్షతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా కృషిచేశారు. వీరు చేసిన కృషి సంఘ సంస్కరణ రూపంలో కనిపిస్తుంది తప్ప దళిత ఉద్యరూపంలో కనిపించదు. వీరంతా కూడా దళితేతరులు. కాని దళితుల ఉద్యమంగా ఆంధ్రదేశంలో ప్రారంభమైంది హైదరాబాదులో. అది భాగ్యరెడ్డివర్మ ఆద్వర్యంలో. "మొదటగా హైదరాబాదు నిజాం సంస్థానంలో తెలుగు దళిత వుద్యమానికి స్ఫూర్తి, అంకురార్పణ జరిగింది. భాగ్యరెడ్డివర్మ సారధ్యంలో 1906వ సంవత్సరంలో స్థాపించిన

జగన్ మిత్రమండలి తెలంగాణా ప్రాంతంలో దళిత జాగృతికి మేలు కొలుపుకు నాంది పలికింది" (సత్యనారాయణ, అడప: అంధ్రప్రేదేశ్ లో నూరేండ్ల దళిత చరిత్ర, పుట.6.) భాగ్యరెడ్డి వర్మతో పాటు అరిగె రామస్వామి, ఆదయ్య, శ్యాంసుందర్, వెంకట్రావు మొదలగు వారుకూడా దళిత ఉద్యమం కోసం కృషిచేశారు. వీరు అస్పృస్యతను నిరసించి, వర్ణవ్యవస్థను ఖండించి దళితుల సంక్షేమానికి పాటుపడ్డారు. దళితుల్లో కొనసాగుతున్న జోగిని, బసివి వంటి సంప్రదాయాలను ఖండించారు. దళితుల మధ్య ఉన్న అనైక్యతను పోగొట్టి దళితుల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించారు.

వీరు ఆంధ్రదేశంలో జాతీయోద్యమానికి సమాంతరంగా దళితోద్యమాన్ని నడిపారు. కాని 1930-40 దశకంలో వచ్చిన అంబేద్కర్ సిద్ధాంతాలు, కమ్యూనిస్ట్ ఉద్యమాలు దళితులను ఆకర్షించాయి. ఈ సిద్ధాంతాల ప్రభావంతో వారు ఆత్మగౌరవం ముఖ్యమనే భావాన్ని పెంపొందించుకొన్నారు. ఇక్కడ వీరు అంబేద్కర్ ఆలోచనలను అనుసరించారు. అప్పటి వరకు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రధాన కారణం హిందూ మతమని భావించిన అంబేద్కర్ హిందూ మతాన్ని వదలి బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అంబేద్కర్ ద్వారా ప్రభావితమైన పలువురు హిందూ మతంలోని లోపాలను, తమకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి హిందూ మతాన్ని విడిచిపెట్టారు. కానీ వీరు అంబేద్కర్ అనుసరించిన బౌద్ధమతం గాక ఇస్లాం మతాన్ని స్వీకరించారు. కొందరు దళిత నాయకులు అంబేద్కర్ ను అనుసరించారు. "1930-40 దశకాల్లో తెలంగాణా ప్రాంతంలో పెద్ద సంఖ్యలో దళితులు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. దళిత నాయకుల బోధనలతో పాటు, తెలంగాణాలో సాంఘిక ఆర్థిక వ్యవస్థ కూడా అందుకు దోహదం చేసింది." (పైదే, పుట.19.) తరువాత వచ్చిన తెలంగాణా పోరాటం, శ్రీకాకుళాంధ్ర ఉద్యమం దళితులను మరింత చైతన్యవంతులను చేసింది. ఈ పోరాటాలు దళితుల పట్ల అమలవుతున్న దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా దళితులందరిని ఏకం చేసింది. ఈ పరిణామ క్రమంలో పలువురు దళితులు, దళితేతరుల నుండి పలు భౌతిక

దాడులను ఎదుర్కోవలసి వచ్చింది. “కారణాలు ఏవైనా 1983లో చిత్తూరు జిల్లా పదిరికుప్పంలో నలుగురు దళితులను సజీవదహనం చేశారు. 1985 జూలై 17న కారంచేడులో ఆరుగురి దళితులను అగ్రవర్ణాలవారు చంపారు. “1983-91 సంవత్సరాల మధ్య దళితులపై జరిగిన 40 దాడుల్లో (పదిరికుప్పం నుండి చుండూరువరకు) 70 మంది దళితులు మరణించారు” (పైదే, పుట.31.) ఈ భౌతికదాడులు దళితులను కలచివేశాయి. పలువురు దళిత మేధావులు దళిత నాయకులు వీటిపై స్పందించారు. దళితులను వాడవాడలా చైతన్యవంతులను చేశారు. ఈ దాడులపై పోరాటంతో పాటు ప్రత్యామ్నాయమైన కుల నిర్మూలనా సంస్కృతిని ఏర్పాటు చేయడానికి పోరాడారు. అప్పటివరకు విప్లవోద్యమంలోనూ, పలురకాల పోరాటాలలో పాల్గొన్న వారు తమ దృష్టిని వర్గం అనే భావన నుండి కులం అనే భావన మీదకు తీసుకొచ్చారు. అప్పటివరకు అస్పృస్యతే ప్రధానంగా భావించిన దళితులు తమ ప్రస్తుత స్థితినుండి బయటపడటానికి రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం ప్రారంభించారు. ఈ ఉద్యమం పలువురు కవులను రచయితలను కొత్తగా తయారు చేసింది. అప్పటి వరకు వస్తున్న దళిత జీవిత చిత్రణని కొత్త దృష్టితో చిత్రించడం ప్రారంభమైంది. పదిరికుప్పం, కారెంచేడు సంఘటనల తర్వాత దళితుల స్వరం మారింది. పలువురు కొత్తకొత్త కవులు, రచయితలు పుట్టుకొచ్చారు. తమ కులంలో, తమజీవితంలో ఉన్న సమస్యలను, సంఘటనలను తమ సాహిత్యంలో చిత్రించారు.

అయితే ఇటీవల కాలంలో దళిత సాహిత్యంలోనే చీలిక ప్రారంభమై దండోరా సాహిత్యం పేరుతో సాహిత్య రచనలు వస్తున్నాయి. దళితుల్లోనే కొన్ని ఉపకులాలకు చెందిన వారు తమ ప్రత్యేక సంస్కృతిని, అస్థిత్వాన్ని చిత్రిస్తూ, సామాజికంగా తమకు చెందవలసిన హక్కులకోసం ప్రారంభించిన సాహిత్యంగా దండోరా సాహిత్యాన్ని పేర్కొనవచ్చు. దళితుల్లోనే వర్గీకరణ కోరుతూ ప్రారంభమైన ఈ సాహిత్యంలో పలు దళిత ఉపకులాలవారు రచనలు చేస్తున్నారు.

## 6.3. మైనారిటీవాద సాహిత్యం

ఆధునిక కాలంలో అనేక వాదాలు వచ్చాయి/వస్తున్నాయి. ఆవాదాలలో ఇటీవల కాలంలో వస్తున్న మైనారిటీవాదం కూడా ఒకటి. ఇటీవల కాలంలో తెలుగులో వస్తున్న మైనారిటీ వాదాన్ని రెండు విధాలుగా పేర్కొనవచ్చు. ఒకటి ముస్లిం రచయితల/కవుల రచనలుకాగా, రెండవది క్రైస్తవులు మొదలగు రచయితలు/కవులు రచించిన సాహిత్యం. కాని వాడుకలో ముస్లింలు వెలువడిస్తున్న సాహిత్యాన్ని మాత్రమే మైనారిటీ సాహిత్యం అని పేర్కొంటున్నారు.

మైనారిటీ సాహిత్యం గురించి మాట్లాడేముందు మైనారిటీ అనే పదం గురించి కూడా మాట్లాడుకోవాలి. భారతదేశంలో భారత రాజ్యాంగ నిర్మాణ సందర్భంలో సాంస్కృతిక ఐక్యతను సాధించడానికి సమైక్య దేశ నిర్మాణం కోసం నిస్సహాయులైన వారి ప్రయోజనాలను రక్షించే నేపథ్యంలో మెజారిటీ, మైనారిటీ అనే పదాలను ఉపయోగించారు. మైనారిటీ అనే పదానికి నిఘంటువుల్లో అల్పసంఖ్యాక వర్గం అని పేర్కొన్నారు. ఒక భూభాగంలో నివసించే జాతి, మత, భాష వంటి అంశాలలో తక్కువసంఖ్య ఉన్నవారిని మైనారిటీలుగా నిర్ణయించబడుతున్నారు. భారతదేశంలో మైనారిటీ విభజన అనేది మతం, జనాభా భూమికగా చేసుకొని ఏర్పాటు చేయడం జరిగింది. జైనులు, బౌద్ధులు, పారశీకులు, క్రైస్తవులు, ముస్లింలు మొదలైనవారు భారతదేశంలో మైనారిటీలుగా గుర్తించబడ్డారు.

ఇక సాహిత్యపరంగా పరిశీలిస్తే తెలుగులో ముస్లింలు, క్రైస్తవులు రాసిన సాహిత్యాన్ని మైనారిటీసాహిత్యంగా భావిస్తున్నారు. కానీ క్రైస్తవులు రాసిన సాహిత్యం కంటే ముస్లింలు రాసిన సాహిత్యం ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే తెలుగులో మైనారిటీ సాహిత్యం అంటే ముస్లింలు రాసిన దానినే ఎక్కువ పరిగణలోకి తీసుకుంటున్నారు. అందువల్ల ఈ మైనారిటీ సాహిత్యాన్నే కొందరు ముస్లింవాద

సాహిత్యంగాను, ముస్లింమైనారిటీవాదంగా కూడా పేర్కొంటున్నారు. ముస్లిం అనే పదానికి నిఘంటువులలో "ఇస్లాంను అనుసరిస్తున్నవారు' అని అర్థం. ముస్లిం అనే పదం ఒక మత పరమైన భావనను వ్య క్త పరుస్తున్నది. అందుకే మైనారిటీవాద సాహిత్యంలో కొంత మత పరమైన అంశాలు కూడా కనిపిస్తాయి. సాహిత్యంలో మతపరమైన విషయాలు ప్రాచీన కాలం నుంచి వున్నాయి. అదే విధంగా ప్రస్తుతం తెలుగులో వస్తున్న మైనారిటీవాద సాహిత్యంలో కూడా మతపరమైన ప్రస్తావన వుంది.

ఒకమతానికి సంబంధించినవారు రచనలు చేసేన శైవ, వైష్ణవ మతస్తులు వారి మతాన్ని పొగుడుతూనో, ఆమతంలో వున్న విశిష్టతను, గొప్పతనాన్ని వివరిస్తూనో లేక ఇతర మతాలను దూషిస్తూనో, విమర్శిస్తూనో రచనలు చేశారు. స్వమతంలోని లోపాలనుగానీ, స్వమతాన్నిగానీ విమర్శించిన దాఖలాలుచాలా తక్కువ. కానీ ఇప్పుడు తెలుగులో వస్తున్న మైనారిటీవాద సాహిత్యంలో తమ మతంలోవున్న లోపాలను, ఆచార సంప్రదాయాలలోవున్న చాందసవాదాన్ని నిరసించడంతో పాటు వ్యతిరేకించడం కూడా జరుగుతున్నది. ఇదిమైనారిటీవాద సాహిత్యం యొక్క ప్రత్యేకం.

ముస్లిం సాహిత్యం ప్రారంభం కావడానికి అందరు చెప్పే ఒకే మాట 1992 డిసెంబరు 6 న జరిగిన సంఘటన. 1980 తరువాత హిందుత్వశక్తులు బలపడ్డాయని దీనితో ముస్లింల వివక్ష ప్రారంభమైందని చెబుతారు. ఈ క్రమంలోనే 1992 డిసెంబరు 6న బాబ్రీమసీదు కూల్చివేతతో ముస్లింలకు ఒక అభద్రత భావన నెలకొన్నదని తమ అస్థిత్వానికే ప్రశ్న ఏర్పడిందని భావించిన ముస్లింల నుంచి వెలువడుతున్నదే ముస్లిం సాహిత్యంగా భావిస్తున్నారు. ఈ అంశంతోపాటు రాజకీయ,సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాలుకూడా వున్నాయి.

### 6.3.1. రాజకీయకారణాలు

భారతదేశ చరిత్రలో జరిగిన అనేక సంఘటనలు దేశచరిత్రను పలురకాలుగా మలుపులు తిప్పింది. అలా మలుపు తిప్పిన సంఘటనలల్లో ముస్లింలు భారతదేశంలోకి రావడం ఒకటికాగా, మరొకటి ఆంగ్లేయులు రావటం. అంతకు పూర్వమే పలువురు దండెత్తి వచ్చినప్పటికీ ఇక్కడనే స్థిరపడి ఈ దేశంలోనే భాగస్వాములయ్యారు. అలాగే ముస్లింలు కూడా ఈ దేశంపై దండెత్తి వచ్చి, ఈ దేశంలోనే స్థిరపడ్డారు. కాని ఆంగ్లేయులు మాత్రమే ఈ దేశంలోకి వచ్చి ఈ దేశ సంపదను మాత్రమే కాంక్షించి, దేశాన్ని పాలించి, దేశాన్ని విడిచిపెట్టిన వారు. కాని ప్రస్తుతం భారత దేశంలో ఇప్పుడు ఆంగ్లేయులకు సంబంధించిన చర్చ లేదు. కాని ముస్లింలకు సంబంధించిన చర్చ మాత్రం నేటికీ కొనసాగుతూ పలు మార్పులతో కొనసాగుతుంది.

మొదట ముస్లింలు భారత దేశంపైకి దండెత్తి వచ్చి ఇక్కడ స్థిరపడిన తరువాత హిందూ రాజులతో యుద్ధాలతో పాటు, సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. కొందరు ముస్లిం రాజులు మతం పేరుతో ఇతర మతాలను హింసించడం, అందుకు అనుగుణంగా ఇతర మతాల వారు మతమార్పిడి చేసుకోవడం వంటివి కొనసాగాయి. మరొకవైపు రాజపుత్ర రాజులతో పలువురు ముస్లిం రాజులు తమ రాజ్య శ్రేయస్సు కోసం వివాహ సంబంధాలను నెలకొల్పారు. ముఖ్యంగా మొగల్ సామ్రాజ్య రాజులు పలువురు రాజపుత్ర స్త్రీలను వివాహమాడారు. యుద్ధాలు, వివాహ సంబంధాలు అనేవి క్రమంగా కొనసాగుతున్న సమయంలో ఆంగ్లేయుల రాక మరొక రకమైన యుద్ధాలకు దారి తీసింది. బ్రిటీషువారు హిందూ, ముస్లిం మతాల మధ్య ఉన్న అనైక్యత, మతపరమైన బలహీనతలను సొమ్ము చేసుకొని ముస్లిం, హిందువుల మధ్య అనైక్యతను మరింత రెచ్చగొట్టారు. బ్రిటీషువారు హిందూ ముస్లింల మధ్య మతపరమైన విభేదాలను సృష్టించి హిందూ ముస్లింలను విడగొట్టడంలో సఫలమైనారు. భారతప్రజల సమస్యలను బ్రిటీషువారికి విన్నవించడానికి ఏర్పడిన కాంగ్రెస్ ఏర్పడిన అచిరకాలంలోనే ముస్లింలీగ్ కూడా ఏర్పడింది. ముస్లింలీగ్ ఏర్పడిన తరువాత మతప్రాతిపదికగా హిందూ మహాసభ,

తరువాత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంస్థలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలు దేశవిభజన వరకు దారితీశాయి. మతప్రాతిపదికన భారత్, పాక్ దేశాలు ఏర్పడినప్పటికి కొన్ని ప్రత్యేక కారణాలవలన కొందరు ముస్లింలు భారతదేశంలోనూ, కొందరు హిందువులు పాకిస్తాన్ లోనూ ఉండిపోయారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయపార్టీలు తమ స్వప్రయోజనాల కోసం ప్రజల మధ్య తిరిగి మతపరమైన అంశాలను ప్రజల మధ్యకు తీసుకువచ్చి గొడవలను సృష్టించారు. ఆ మతపరమైన గొడవల్లో భాగంగా జరిగిందే 1992 డిసెంబర్ 6న జరిగిన సంఘటణ. 1992 డిసెంబరు కంటే ముందు, స్వాతంత్ర్యానంతరం కూడా భారతదేశంలో అనేక మత ఘర్షనలు జరిగాయి. వందల మంది ప్రాణాలను కోల్పోయారు. దేశ విభజనలో పెద్ద యెత్తున మతపరమైన గొడవలు జరిగాయి. మళ్ళీ ఆ స్థాయిలో గొడవలు జరగడం 1960 తరువాత ప్రారంభమైంది. "1961లో జబ్బర్ పూర్ లో చాలా పెద్ద సంఘర్షణ జరిగింది. దానిని పురస్కరించుకొని రాంచి, మీరట్, శ్రీనగర్, ఔరంగాబాద్ మొదలైన అనేక పట్టణాలలో పెద్దపెద్ద అల్లర్లు, కొట్లాటలు జరిగినాయి. 1969లో అహ్మదాబాదులోనూ, 1970లో భివండి, జలగావ్ లలోను జరిగిన ఘోర కలహాలతో ఈ మతద్వేషం రెండవసారి పరాకాష్టకు చేరింది. కేంద్రహోంశాఖ నుంచి వెలువడీన సమాచారం ప్రకారం 161 నుంచి 1970 వరకు గల మధ్యకాలంలో మొత్తం 7964 మతకలహాలు జరిగాయి. ఎన్నో వేల మంది ప్రజలు మరణించారు. (భట్, ఎస్, ఆర్: హిందూ ముస్లిం ఘర్షణలు వాటి సమస్యలు; పుట.2.)

తరువాత కూడా చీటికిమాటికి చిన్న ఘర్షణలు జరుగుతూ ఉన్నాయి. ఇటువంటి సమయంలోనే మతపరమైన ఘర్షణగా జరిగింది 1992 డిసెంబరు 6 జరిగిన సంఘటన. ఇది అప్పటి వరకు జరిగిన ఘర్షణలకు భిన్నమైనదిగా ముస్లింలు భావించారు. తమ అస్తిత్వానికి సంబంధించినదిగా భావించారు.

### 6.3.2. ఆర్థిక పరిస్థితులు

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషువారు అనుసరించిన విధానాలు ముస్లింలను ఆర్థికంగా బాగా వెనుకబడేలా చేశాయి. బ్రిటీషువారు ముస్లింల మేధస్సును, శక్తిని క్షీణింపచేశారు. ఉద్యోగాలలోనూ, పరిశ్రమలలోనూ, వ్యాపారంలోనూ ముస్లింలకంటే హిందువులకు అధిక అవకాశాలను కల్పించారు. దీనివలన ముస్లింలు ఆర్థికంగా వెనుకబాటుకు గురయ్యారు. స్వాతంత్ర్యానంతరంకూడా ప్రభుత్వాలు ఇదే విధానాలు కొనసాగించాయి. దీనివలన ముస్లింలు ఆర్థికంగా వెనుకబడ్డారు. వారి ఆర్థిక వెనుకబాటుతనం వారి జీవితాలనే ప్రశ్నించే స్థితికి వచ్చింది.

### 6.3.3. సాంఘిక పరిస్థితులు

దేశ విభజన తరువాత పాకిస్తాన్ కు వెళ్లిపోగా భారతదేశంలో మిగిలిపోయిన ముస్లింలు అధిక సంఖ్యాకులు పేదవర్గానికి చెందినవారు, నిరక్షరాశ్యులు. నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే గ్రామీణ ప్రాంతాల్లో కింది వర్గాలకు చెందిన చిన్న చిన్న రైతులు, పేదరైతులు, రైతుకూలీలు, పట్టణ ప్రాంతాల్లో చేతివృత్తులకు చెందినవాళ్ళు, చిన్నచిన్న వ్యాపారస్తులు ఇక్కడే ఉండిపోయారు. స్వతంత్ర భారతదేశంలో వీరు చేతివృత్తుల వాళ్ళుగా, చిన్నచిన్న వ్యాపారస్తులుగా మిగిలారు. రానురాను వీరి పరిస్థితి అత్యంత దయనీయంగా తయారయింది. రెండవ వర్గంవారు హిందూ సమాజంలో అట్టడుగు శూద్రులుగా ఉండి మతమార్పిడి చేసుకొని ముస్లింలుగా మారినవారు. ఈ శూద్రులలో వివిధ వృత్తులపై ఆధారపడ్డ అనేకు జాతులున్నాయి. ఉదాహరణకు జులహాలు (నేతపనివారు), ఖతిక్కులు (కసాయివారు), ధోభీలు (చాకలివారు), రంగ్రేజ్ (అద్దకం పనివారు), పింజారాలు (దూదేకులవారు), మాలీలు(పండ్లు, కూరగాయలు కాయించి అమ్మేవారు), గోర్కన్లు (శవాలకోసం గోతులు తవ్వేవారు), తంబోలీలు (తమలపాకులు, వక్కలు అమ్మేవారు), హజాములు (మంగలివారు) లోహార్లు (కమ్మరివారు), సూతార్లు (వడ్రంగులు, తాపిపనివారు), చమర్లు (చర్మకారులు) మొదలైనవారు ఇస్లాం మతం

స్వీకరించారు. కానీ వారు తమ వృత్తులు మానుకోలేదు.

మొదటనుంచీ కూడా ముస్లింలు ఉర్దూ, అరబ్బీలకు అధికప్రాధాన్యతనిచ్చేవారు. "ముస్లింలు మొదటినుంచి ఆంగ్లవిద్యను వ్యతిరేకిస్తూ వచ్చిన విషయంతెలిసిందే. ఆంగ్లవిద్య ముస్లింలకు ఇస్లాంలో ఉన్న విశ్వాసాన్ని సడలిస్తుందని, ముస్లింలను క్రైస్తవులుగా మార్చివేస్తుందని వారు భావించారు. (కృష్ణారెడ్డి. కె: భారతదేశ చరిత్ర ఆధునిక యుగం, పుట.196.) ముస్లింలు అదే భావాన్ని స్వాతంత్ర్యానంతరంకూడా కొనసాగించారు. దీనితో ప్రభుత్వ ఉద్యోగాలలో ఆంగ్లానికి ప్రాధాన్యత ఉండటంతో ముస్లింలలో చాలా తక్కువమంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలను పొందగలిగారు. నిరుద్యోగం పెరిగిపోయింది.

## 6.3.4. సాంస్కృతిక పరిస్థితులు

మత పరిస్థితులు కూడా ముస్లింలు వెనుకబాటుకు కారణం. తమ మతాచారాలవలన ముస్లింస్త్రీలు స్వేచ్ఛను కోల్పోయారు. ఎటువంటి ప్రాధాన్యతలేని వారిగా మిగిలిపోయారు. అనేక రకాలైన ఇబ్బందులకు గురయ్యారు. ముస్లిం యువకుల మతపరమైన చదువులు వారికి జీవనోపాధిని కల్పించలేకపోయాయి.

ఇలా రాజకీయంగా తమని అణచివేతకుగురిచెయ్యడం, ఆర్థికంగా వెనకబడివుండటం, సాంఘికంగా, సాంస్కృతికంగా ఎదుర్కొంటున్న సమస్యలన్ని కలసి తెలుగులో మైనారిటీవాద సాహిత్యం ప్రారంభం కావడానికి కారణాలైనాయి.

మైనారిటీవాద సాహిత్యంలో కవిత్వం, కథ, నవల మొదలైన ప్రక్రియలలో రచనలు వస్తున్నాయి. మైనారిటీవాద సాహిత్యంలో అధికశాతం ముస్లింలు రచించిన రచనలు వున్నాయి.

## 6.4. ప్రాంతీయవాద సాహిత్యం

తెలుగులో స్వాతంత్య్రం తరువాత ప్రారంభమైన సాహిత్యవాదాలలో పేర్కోదగింది. ప్రాంతీయవాద ఉద్యమం. ఇది ఒక రాజకీయ ఉద్యమంగా ప్రారంభమైనప్పటికీ ఈ ప్రాంతీయవాదాన్ని నేపథ్యంగా చేసుకొని పలు రచనలు వచ్చాయి. కాబట్టి ఇక్కడ ప్రాంతీయవాద సాహిత్యాన్ని కూడా పేర్కొనడం అవసరం. ప్రాంతీయ వాదం అనే పదాన్ని గురించి పరిశీలిస్తే స్థానికత అనే పదం నుండి ప్రాంతీయత, దేశీయత వంటి పదాలు పుట్టుకొచ్చాయని చెబుతారు. స్థూలార్థంలో ఈ ప్రాంతీయత, దేశీయత, స్థానికత అనే పదాలన్నీ కూడా నిర్దిష్టమైన ప్రాంతాన్ని సూచిస్తున్నాయి. సాధారణంగా ప్రాంతీయవాదాన్ని ఒక ప్రత్యేక ప్రాంత ప్రజల అస్థిత్వంగా పేర్కొంటారు. ఒక ప్రాంతంలోని ప్రజలు ఏవో కొన్ని కారణాల రిత్యా తమకంటూ ఒక ప్రత్యేక అస్థిత్వాన్ని, గుర్తింపును కోరుకుంటే అటువంటి ఆకాంక్షను ప్రాంతీయ వాదంగా పేర్కొనవచ్చు. ఈ ప్రాంతీయ వాదం అనేది తమను ఇతరుల నుంచి వేరుగా చూసుకునేటువంటి ధోరణి. ఇందులో ఒక రాష్ట్రంలోగానీ, దేశంలోగానీ, మత సమూహంతో గానీ సమైక్యంగా ఏర్పడి ఒక ప్రత్యేక ప్రతిపత్తిని కోరుకోవడం జరుగుతుంది. ఈ ప్రత్యేక ఆకాంక్షతో తెలుగులో ప్రాంతీయ వాద సాహిత్యధోరణి ప్రారంభమైంది. ఈ ప్రాంతీయవాద సాహిత్యం తెలుగుతో పాటు ఇతర భాషా సాహిత్యాలలో కూడా ఒక ధోరణిగా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. మరాఠీలో ఒక ధోరణిగా కొనసాగింది. తెలుగులో రెండు ప్రాంతీయ వాద ఉద్యమాలు నడిచాయి. ప్రస్తుతం కూడా నడుస్తున్నాయి. ఒకటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంకాగా మరొకటి ప్రత్యేక ఆంధ్ర లేదా జైఆంధ్రా ఉద్యమం. "ఒక ప్రాంతం చారిత్రక ఆర్థిక కారణాల వల్ల అభివృద్ధి సాధించి మరో ప్రాంతం మీద ఆధిపత్యం చలాయించటం కన్పిస్తుంది. అటువంటప్పుడు ఆ ప్రాంతీయులు చైతన్యవంతులై భాష సంస్కృతుల్లో ఉన్న తమ ప్రత్యేకత ఎక్కడ అడుగంటుతుందోనన్న భయంతో ప్రజాస్వామిక పద్ధతుల్లో తమ మీద జరిగే అధికారం అణచివేతలను వివక్షలను ప్రశ్నిస్తూ తమ అస్తిత్వాన్ని సాహిత్యంలో

ప్రకటిస్తున్నారు. ఒక ప్రాంతం తన అతిత్వం అస్మిత ఆత్మగౌరవాలను ప్రక్షించే భావజాలమే ప్రాంతీయ అస్తిత్వవాదంగా లేదా ప్రాంతీయ అస్తిత్వ వేదనా వాదంగా పిలువబడుతున్నది.'' (సుజాతారెడ్డి, ముదిగంటి: ముద్దెర, పుట.13.) కానీ ఈ నిర్వచనం కొంతవరకే సమంజసం అనిపిస్తుంది. ఈ నిర్వచనం ప్రకారం తెలంగాణా ప్రాంతంలో నడిచిన ఉద్యమానికి సరిపోతుంది. దానికి కారణం తెలంగాణా ప్రాంతంపై తక్కిన ప్రాంతంవారు లేదా ఆంధ్రా ప్రాంతం వారు ఆధిపత్యాన్ని వహిస్తున్నారని, తమ వనరులను వారు వినియోగించుకొంటున్నారనీ ప్రారంభమైనటువంటిదీ తెలంగాణ ప్రాంతీయవాద ఉద్యమం. కానీ ఇందుకు భిన్నంగా జైఆంధ్రా ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమం ప్రారంభం కావడానికి గల కారణం ఆనాటి ముల్కీ నిబంధనలు. కాబట్టీ ప్రాంతీయ వాదం అనేదానిని మరొక విధంగా చెప్పొచ్చు. అది 'ఒక ప్రాంతం వలన మరొక ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని భావించి ఆయా ప్రాంతాలలో ప్రారంభమైనటువంటిది ప్రాంతీయవాద ఉద్యమం' అని చెప్పడం సమంజసంగా ఉంటుంది. ఇలా భావించడం వలన తెలంగాణా ప్రాంతం వారు ఆంధ్రా ప్రాంతం వలన తమకు అన్యాయం జరుగుతుంది కాబట్టి తెలంగాణా ప్రాంతీయ వాదాన్ని ప్రారంభించినట్లు, ముల్కీ నిబంధనల వలన తమకు అన్యాయం జరుగుతుందని తెలిసిన ఆంధ్రా ప్రజలు జై ఆంధ్రా ఉద్యమాన్ని ప్రారంభించినట్లు పేర్కొనవచ్చు. ఈ ఉద్యమాలను ఇక్కడ పేర్కొనడానికి గల కారణం ఇవి సాహిత్యంతో సంబంధం కలిగి ఉండటమే. ఈ ఉద్యమాలకు గల నేపథ్యాన్ని ఇక్కడ వివరించడం అనేది ఇక్కడ ఉన్న ప్రధానాంశం.

### 6.4.1. తెలంగాణ ప్రాంతీయవాదం

ప్రస్తుతం సాహిత్యంలో ప్రాంతీయ వాదం పేరు చెప్పగానే తెలంగాణ ప్రాంతీయవాదం అనే పరిస్థితి నెలకొనింది. తక్కిన ప్రాంతాల నుంచి రచనలు ఉన్నప్పటికీ, తెలంగాణా ప్రాంతం నుంచి ఉన్నంత పోరాటం తక్కిన ప్రాంతాలలో లేదు. కాబట్టి ఇక్కడ తెలంగాణ ప్రాంతీయవాద నేపథ్యాన్ని తెలుసుకొనే ముందు ఒక్కసారి

ఆంధ్రదేశపు పరిస్థితులను తెలంగాణా, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఏర్పడిన విధానాన్ని కూడా పరిశీలించాలి.

గుల్బర్గాలోని బహుమనీ రాజ్యం 1500 సంవత్సరం తరువాత విచ్ఛిన్నమై అయిదు స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడింది. వాటిలో అహ్మద్ నగర్, బీజాపూర్, బీదర్, గోల్కొండ రాజ్యాలు ముఖ్యమైనవి. ఇలా ఏర్పడిన గోల్కొండ రాజ్యం ప్రధానమైన తెలుగు ప్రాంతాలను శతాబ్దాల కాలం పాలించారు. ఒక విధంగా విజయనగర సామ్రాజ్యం పతనం తర్వాత ఆంధ్రదేశంలోని ముఖ్య ప్రాంతాలన్నీ ముస్లింపాలన కిందనే కొనసాగాయి. ఈ గోల్కొండను మొదట పాలించిన చక్రవర్తుల వంశం కుతుబ్ షాహీలు. ఇక అప్పటికే ఎన్నో సార్లు దక్షిణభారత దేశంపై దండయాత్ర చేసినవారు ఉత్తర భారతదేశ చక్రవర్తులు. మొగల్ చక్రవర్తుల పాలనలోనూ అదే విధానం కొనసాగింది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు రాజైన తరువాత దక్షణభారత దేశంపై దండయాత్ర చేశారు. ఇతడు గోల్కొండను 1687లో జయించి కుతుబ్ షాహీలను అంతమొందించి తన పాలన కొనసాగించడం కోసం తన ప్రతినిధిగా నిజాం ఉల్ ముల్క్ ఆసఫ్ ను నియమించాడు. కాని కాలక్రమంలో నిజాం తనకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని 1720లో నిజాం స్వతంత్రతను ప్రకటించుకొని ఆసఫ్ జాహి రాజ్యంగా కొనసాగించాడు. తరువాత రెండు శతాబ్దాల కాలం పాటు వీరు హైదరాబాద్ ను పరిపాలించారు. ఇతని తర్వాత రాజ్యంలో 1748లో వారసత్వ గొడవలు మొదలయ్యాయి. అప్పటికే భారత దేశంలోకి వాణిజ్యం కోసం వచ్చిన బ్రిటీషువారు, ఫ్రెంచి వారు ఈ వారసత్వ గొడవల్లో తమ వంతు పాత్ర పోషించారు. ఈ సమయంలో ఫ్రెంచి గవర్నర్ డూప్లే ఈ వార సత్వగొడవల్లో జోక్యం కల్పించుకొని తనకు అనుకూలుడైన నిజాం ఉల్ ముల్క్ మనుమడైన ముజఫర్ జంగ్ ను, అతని మరణాంతరం నిజాం ఉల్ ముల్క్ కొడుకైన సలాబత్ జంగ్ ను రాజుగా చేశాడు. దీనికి ప్రతిఫలంగా సలాబత్ జంగ్ ఉత్తర సర్కారు జిల్లాలను ఫ్రెంచివారికి ఇచ్చాడు. దీనితో అప్పటి వరకూ  ముస్లింపాలనలో కలిసున్న తెలుగు ప్రాంతంలోని ఒక భాగం ముస్లిం

రాజులనుంచి విడిపోయింది. ఇక అప్పటికే ఫ్రెంచి వారికి ఆంగ్లేయులకు మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. దీనికోసం ఫ్రెంచివారికి, ఆంగ్లేయులకు మధ్య యుద్ధాలు కూడా జరిగాయి. దీనిలో ఆంగ్లేయులు విజయం సాధించడంతో సర్కారు జిల్లాలు ఆంగ్లేయులపరమైనాయి. నిజాం రాజు ఆంగ్లేయులవైపు తిరిగాడు. 1799లో వెల్లస్లీ ప్రభువు కొత్తగా సైన్యసహకార పద్ధతిని తీసుకొచ్చాడు. ఈ సైన్య సహకార పద్ధతిలో రాజుకు అవసరమైన సైన్యాన్ని బ్రిటీషువారు సమకూరుస్తారు. సైన్యానికి అవసరమైన ఖర్చును రాజు భరించాలి. అప్పటికే నిజాం రాజుకు మహారాష్ట్రులతో పలురకాలైన ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. దీనితో అతడు బ్రిటీషువారి సైన్యం ఖర్చుల కోసం కడప, కర్నూల్, అనంతపురం, బళ్ళారిలను ఇచ్చాడు. వీటికే దత్తమండలాలని పేరు. దీనితో మరొక ప్రాంతం నిజాం ప్రాంతం నుండి విడిపోయింది. హైదరాబాదు ప్రాంతం మాత్రం నిజాం పరిపాలనలో ఉండిపోయింది. దీనితో 18వ శతాబ్దంలో తెలుగు ప్రాంతం మూడు భాగాలుగా విడిపోయింది. కాల క్రమంలో ఈ మూడు ప్రాంతాలు పరిస్థితులు ఆయా ప్రాంతాలను పాలించిన పాలకులను బట్టి మారుతూ వచ్చాయి. భాషా, జీవన విధానంతో పాటు తక్కిన విషయాలన్నిటిలోనూ మార్పులు వచ్చాయి. ఆంగ్లేయుల పాలన కింద ఉన్న కోస్తాప్రాంతంలో నీటి ప్రాజెక్టులు కట్టడం వలన భూములు సస్యశ్యామలమయ్యాయి. రాయలసీమ ప్రాంతంలో ముఠా కక్ష్యల వలన అభివృద్ధికి నోచుకోలేకపోయింది. తెలంగాణ ప్రాంతం నిజాం నవాబుల నిరంకుశపాలనలో వెనుకబాటు తనానికి లోనైంది.

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే తెలుగు ప్రాంతాల వారిని ఏకం చేయాలనే ప్రతిపాదన తీసుకొచ్చారు పలువురు నాయకులు. పలు కారణాలతో అది కార్య రూపం దాల్చలేదు. కాని స్వాతంత్ర్యం తరువాత పొట్టిశ్రీరాములు గారి ఆత్మత్యాగంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తరువాత ఆంధ్రరాష్ట్రంలోని ముఖ్య నాయకులు హైదరాబాదు రాష్ట్రంలోని ముఖ్య నాయకులు కలసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి కారణం అయ్యారు. ఇంతటి వరకు భాగనే ఉన్నప్పటికీ తరువాత రాజకీయనాయకుల ఆలోచనల

వలన తరువాత కాలంలో ప్రత్యేక ప్రాంతీయ వాదాలు ప్రారంభమైనాయి. ఇలా ప్రారంభమైనమే జై తెలంగాణ (ప్రత్యేక తెలంగాణ), జైఆంధ్ర(ప్రత్యేక ఆంధ్ర) ప్రాంతీయ వాదాలు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడాలనుకున్న వేర్పాటువాదులు అసంతృప్తితో ఉన్నారు. ఒక రాజకీయ నేత ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడలనే ఉద్యమాన్ని లేవనెత్తాడు. దీనికి పలువురు రాజకీయ నాయకులు, ముఖ్యంగా విద్యార్థులు బలాన్ని చేకూర్చారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కువ శాతం తెలంగాణేతరులు నియమింపబడుతున్నారని, తెలంగాణా ప్రాంతంలోని మిగులు తెలంగాణా ప్రాంతంలో వినియోగించబడలేదని, అప్పటికే అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన ఆంధ్రా ప్రాంతం వారు తెలంగాణా ప్రాంతంపై ఆధిపత్యం చెలాయిస్తారని వీరి అభిప్రాయం. 1969లో ప్రారంభమైన ఈ ఉద్యమం పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థులు తరగతులను బహిస్కరించారు. ఉద్యమం హింసాత్మకంగా మారింది. తరువాత రాజకీయ నాయకులు తిరిగి చర్చించి రాజకీయ ఎత్తుగడలు కొనసాగాయి. ఒక నేత నేతృత్వంలో ప్రత్యేక పార్టీ ఏర్పడటం, ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం, తరువాత తన పార్టీని వేరే పార్టీలో కలపడం జరిగింది. దాదాపు రెండు సంవత్సరాలు కొనసాగిన ఈ ఉద్యమం ఎందరో ప్రాణాలను బలి తీసుకొంది. తరువాత మళ్ళీ ఈ దశాబ్దంలో తిరిగి ప్రారంభమైంది. ఇప్పుడు కూడా ఈ ఉద్యమానికి రాజకీయ పార్టీనే కారణమైంది. ఒక పార్టీలో ఉన్న రాజకీయ నేత విడిపోయి ఒక పార్టీని స్థాపించి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని తిరిగి ప్రారంభించారు. ఇప్పుడు కూడా పలువురు విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఉద్యమం హింసాత్మకంగా మారింది.

ఈ ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోరుతూ తెలుగులో పలువురు కవులు/రచయితలు పలు రచనలు చేశారు. 1969లో వచ్చిన ఉద్యమకాలంలో ఎక్కువగా సాహిత్యం కనపడదు. ఇటీవల కాలంలో వచ్చిన ఉద్యమంలో సాహిత్యం వచ్చింది. ఈ

సాహిత్యం రెండు విధాలుగా కనిపిస్తుంది. అవి ఒకటి కవులు/రచయితలు తమ సాహిత్యంలో ప్రాంతీయస్పృహను స్పృశించడం. రెండు కవులు/రచయితలు ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతూ రచనలు చేయటం.

1990 తరువాత సాహిత్యంలో కొందరు కవులు/రచయితల మధ్య ఒక రకమైన వివక్ష అనేభావన నెలకొంది. దానితో కవులు/రచయితలు తమరచనల్లో తమ ప్రాంత సంస్కృతిని, భాషను ఉపయోగిస్తూ రచనలు చేస్తున్నారు. ఒకప్పుడు ప్రాంతీయ స్పృహతో ప్రారంభమైన ఈ సాహిత్యం క్రమంగా ప్రాంతీయ చైతన్యంగా మారింది. ఈ ప్రాంతీయ చైతన్యం ప్రారంభమైన తరువాత ఆప్రాంత భాషలో రాయడం అనేది సాధారణమైపోయింది. ఇది అన్ని ప్రాంతాలకు వ్యాపించింది. వివిధ ప్రాంతాల కవులు/ రచయితలు వారివారి ప్రాంతపు భాషలో రచనలు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ విధానం తెలంగాణా ప్రాంత కవుల/రచయితలలో ఎక్కువ కనిపిస్తుంది. దీనికి కారణంగా విమర్శకులు ఈ క్రింది విధంగా పేర్కొన్నారు. "1. ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో తెలంగాణా ప్రాంతం వివిక్షకు లోనవడం.

2. సకల రంగాల్లో కోస్తా ప్రాంతం వారి ఆధిపత్యం పెరగడం, విభిన్న రంగాలలో తెలంగాణ వారిని లోకువ చేయడం.

3. తెలంగాణాకు వలస వచ్చిన కోస్తా పెత్తందారులు ఆర్థికంగా బలపడి తెలంగాణా వారిని అణిచివేయడం.

4. సాంస్కృతికంగానూ తమ ప్రాంతం గొప్పదన్న భావంతో తెలంగాణా సంస్కృతుల్నీ, జీవణశైలినీ చిన్నచూపుచూడటం.

5. రెండున్నర జిల్లాల భాష వ్యావహారికంగా చెలామణీ కాగా తెలంగాణ భాషని భాషే కాదన్నట్టుగా చూసే ధోరణి పెరగడం.

6. సాహిత్య ప్రమాణాలలో తెలంగాణ సాహిత్యాన్ని తక్కువగా అంచనా వేయటం, తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడం." (పైదే, పుట. 20-21.)

కానీ ఈ విధానం అంటే తమ ప్రాంతీయ భాషలో, తమ ప్రాంతం పేరుతో రచనలు వెలువరించడం అనేది 1960 నుంచే ఉంది. చాగంటి సోమయాజులు 1960లలో కళింగాంధ్ర కథలు అనే పేరుతో కథా సంకలనం తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. తరువాత సీమకథలు కూడా వెలువడ్డాయి. ఇవి తెలంగాణా ప్రాంతం కన్నా ముందే ఇతర ప్రాంతాల నుంచి పుస్తకాలు వెలువడ్డాయి. ఇలా అన్ని ప్రాంతాల వారు తమతమ ప్రాంత జీవన విధానాన్ని వర్ణిస్తూ సాహిత్యం సృష్టించడం ప్రారంభమైంది. ఇందులో కోస్తా, రాయలసీమ, తెలంగాణా, ఉత్తరాంధ్ర ప్రాంతాలనుంచి ఆయా మాండలికాల్లో సాహిత్యం వెలువడుతూ ఉంది.

తెలంగాణా ప్రాంతం నుంచి ప్రాంతీయ చైతన్యాన్ని కలిగి వివిధ కవితా సంకలనాలు కథాసంకలనాలు వెలువడ్డాయి. జూలూరి గౌరి శంకర్ ఆధ్వర్యంలో 'పొక్కిలి' అనే కవితా సంకలనం వచ్చింది. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు సంపాదకత్వంలో 'మత్తడి' కవితా సంకలనం వచ్చింది. శైలీ శిల్పాల పరంగా కూడా మార్పులు వచ్చాయి. తెలంగాణ సామెతలు, పలుకుబడులు, నుడికారం సాహిత్యంలోకి ప్రవేశించింది. పాట, కథ వంటి ప్రక్రియలు కూడా కొనసాగుతున్నాయి.

ఈ అధ్యాయంలో వచ్చిన సాహిత్య ఉద్యమాలు కేవలం దేశీయ పరిస్థితుల కారణంగా ఏర్పడినవనే విషయం స్పష్టమవుతుంది. ఈ అధ్యాయంలో పేర్కొన్న సాహిత్య ఉద్యమాలు తమ సొంత అస్థిత్వం కోసం ప్రారంభమైన సాహిత్యోద్యమాలుగా పేర్కొనవచ్చు. ఇందులో కొన్ని ఉద్యమాలు కొందరికి మాత్రమే పరిమితమైనవిగా చెప్పవచ్చు. అంటే ఇక్కడ ఉన్న సాహిత్యోద్యమాలు పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించి ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారిన ఉద్యమాలు సమాజంలో అందరికీ సంబంధించినవిగా కనిపిస్తాయి. కానీ స్థానిక నేపథ్యంతో ఏర్పడిన ఉద్యమాలు మాత్రం ఒక వర్గప్రజల కోసం లేదా ఒక ప్రాంత ప్రజలకు మాత్రం సంబంధించిన ఉద్యమాలుగా కనిపిస్తాయి.

# ఏడవ అధ్యాయం

# తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు

# 7. తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు

ఈ అధ్యాయంలో ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలను సమీక్షించడం జరిగింది. ఈ రచనలు ప్రత్యేకంగా చారిత్రక విమర్శనా దృక్పథంతో వెలువడినవి కావు. ఈ గ్రంథంలో కొన్ని అధ్యాయాలు మాత్రమే చారిత్రక విమర్శ కనిపిస్తుంది. ఈ విమర్శనా రచనలన్నీ కూడా అలాగే ఉన్నాయి. ఈ రచనలు చేసిన విమర్శకులు కూడా ఎక్కడా వారు చారిత్రక విమర్శనా దృక్పథంతో విమర్శ చేసినట్లు పేర్కొనలేదు. ఇందులో కొన్ని సాంఘిక విమర్శ లక్షణాలున్న గ్రంథాలున్నాయి. వాటిని కేవలం పరిచయం కోసం మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది. దానికి గల కారణం మొదటి అధ్యాయంలో పేర్కొన్నట్లు సాంఘిక విమర్శకు, చారిత్రక విమర్శకు ఆద్యుడు టెయిన్ కావడం వలన, సాంఘిక విమర్శలో కవికి సంబంధించిన సమాచారం తప్ప కవి రచనలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మతపరమైన అంశాలన్నీటినీ వివరించడం జరుగుతుంది. కాబట్టి సాంఘిక విమర్శలో కనిపించే రచనలను కూడా ఇక్కడ పేర్కొనడం జరిగింది. ఇందులో కొన్ని వివిధ విశ్వవిద్యాలయాలకు సమర్పించిన పరిశోధనా గ్రంథాలు కూడా ఉన్నాయి. మరి కొన్ని గ్రంథాలు వారు ప్రసంగించిన అంశాన్ని పుస్తక రూపంలో తీసుకొచ్చినట్లు కనిపిస్తుంది. ఆ గ్రంథాలన్నిటినీ ఇక్కడ సమీక్షించడం జరిగింది. నేను అనుసరించిన అధ్యాయ విభజనను అనుసరించి ఈ గ్రంథాలను పరిశీలించాను.

## 7.1. ఆంధ్రమహాభారత గ్రంథాలు

ఆంధ్రమహాభారతానికి సంబంధించిన గ్రంథాలలో దివాకర్ల వెంకటావధాని గ్రంథం ఆంధ్రవాఙ్మయారంభ దశ, కోరాడ రామకృష్ణయ్య గారి ఆంధ్రభారత కవితా విమర్శనము గ్రంథాలు ఉన్నాయి.

### 7.1.1. ఆంధ్రవాఙ్మయారంభ దశ

ఈ గ్రంథ రచయిత దివాకర్ల వెంకటావధాని. ఈ గ్రంథంలో నన్నయ ఆంధ్ర మహాభారతాన్ని విమర్శనాత్మక దృష్టితో పాటు, చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిశీలించారు. ఇది పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథం రెండు సంపుటాలుగా ముద్రించబడింది. ఇందులోని ప్రథమ భాగంలో భాషా ఛందస్సుకు సంబంధించిన అంశాలు చర్చించబడ్డాయి. చారిత్రకవిమర్శ లక్షణాలు కనిపించే అంశాలు ద్వితీయ సంపుటిలో ఉన్నాయి. ఇందులో పదమూడు, పదనాల్గవ అధ్యాయాలు రెండింటిలో పూర్తిగా చారిత్రకవిమర్శ లక్షణాలు కనిపిస్తాయి. పదమూడవ అధ్యాయం నన్నయ చిత్రించిన రాజరాజు. ఈ అధ్యాయంలో నన్నయ ఆంధ్రమహాభారతంలో రాజరాజును ఏవిధంగా కీర్తించారో వివరించారు. రాజరాజు చారిత్రక వ్యక్తి కావడం, రాజరాజు మహాభారత రచనకు ప్రేరకుడుగా కనిపించడం వలన ఈ అధ్యాయాన్ని ఇక్కడ సమీక్షించడం జరిగింది.

రాజరాజు నన్నయను ఆంధ్రమహాభారతాన్ని రచించమని మాత్రమే అడిగారని, ఆ గ్రంథాన్ని తనకు అంకితంగా ఇవ్వమని అడగలేదని, నన్నయ కూడా ఆంధ్రమహాభారతాన్ని రాజరాజుకు అంకితం ఇవ్వకపోయినప్పటికీ అవతారిక ప్రారంభంలోనూ, ఆశ్వాసాంత గద్యాలలోనూ రాజరాజు గుణగణాలను కీర్తించాడని పేర్కొన్నాడు. "అవతారికారంభమున నతని గుణ గణములను వర్ణించుటయే కాక యాశ్వాసాద్యంతములందర్థవంతములైన యనేక విశేషణములచే నతని సంబోధించి శౌర్య త్యాగ నయక్షమా వివేకాదులగు నతని గుణములకును నిర్మలమైన కీర్తికిని అక్షరరూపమైన మూర్తి తీర్చిదిద్దినాడు." (వెంకటావధాని, దివాకర్ల: ఆంధ్రవాఙ్మయారంభదశ, పుట.980.)

భారత రచనలో నన్నయ చేసిన రాజరాజు వర్ణన కొంత శాసనాలకు దగ్గరగా ఉందని అభిప్రాయపడ్డారు. కాని ఇందులో కవితా దృష్ట్యా అతిశయోక్తి ఉన్నప్పటికీ

వర్ణించిన అన్ని విషయాలు కల్పనలు  కాదని  నన్నయ వర్ణన ద్వారా రాజరాజు నిర్మలమూర్తి అని స్పష్టపడుతుందని వివరించాడు. చారిత్రకంగా కూడా  రాజరాజును వివరించే ప్రయత్నం చేశారు. రాజరాజును పలువిధాలుగా  కీర్తించడానికి గల కారణాలను వివరించారు. " ఆ మహారాజు తాను రాజ్యమును బరిపాలించిన  నాలుగు దశాబ్దాల కాలములో  మూడు నాలుగు సారులైన వైరి వీరుల నిర్జించి నష్టప్రాయమైన సింహాసనమును మరల సంపాదించు కొనవలసివచ్చెను." (పైదే, పుట. 980.)

మొదటి నుంచి కూడా రాజరాజు పశ్చిమ చాళుక్యులతో యుద్ధం చేశాడు. తరువాత అతడు (రాజరాజు) ఆ యుద్ధాన్ని కొనసాగించడం కష్టంగా భావించి  పశ్చిమ చాళుక్య చక్రవర్తి సార్వభౌమత్వాన్ని అంగీకరించడంతో ఆ పశ్చిమ చాళుక్య రాజు ఆ సందర్భంలో తన ప్రధానులలో  ఒకడైన నారాయణభట్టును తన ప్రతినిధిగా రాజరాజు కొలువుకు పంపాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

ఆంధ్రమహా భారత రచన ఆధారంగా రాజరాజు శైవమతాన్ని అవలంభించాడని పేర్కొన్నాడు. 'రాజరాజు పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజా మహోత్సం నందు అధికమైన ప్రీతి కలవాడని వేంగీచాళుక్యులందరి లాగానే రాజరాజుకు కూడా దాక్షారామ భీమేశ్వర దేవుడు కులదైవం అని అందువలన నన్నయ  భీమేశ్వర కృత నిత్య ప్రసాదుడని  రాజరాజును వర్ణించాడని తెలిపారు. వేంగీ చాళుక్యులలో రాజరాజు తండ్రి తప్ప తక్కినవారందరు కూడా శైవమతాన్ని అవలంభించినట్లు ఉంది. రాజరాజు తండ్రి మొదట శైవమతం అవలంబించినప్పటికీ తరువాత మాత్రం జైనమతాన్ని అవలంబించాడు. పరిశోధకుడు రాజరాజు వంశం గురించి చర్చించాడు. ఇందులో రాజరాజు తన వంశాన్ని చంద్రవంశం అని పేర్కొన్నట్లు చెప్పడం, ఈ చంద్రవంశం అనే దానిని వేంగీ చాళుక్యులు  ఎప్పటి నుండీ వాడుకలో ఉన్నదో వివరించాడు. ఈ చంద్రవంశ ప్రస్తావన  ఆంధ్రమహాభారత రచనా  పీఠికలో  రాజరాజు  నన్నయను భారతం ఆంధ్రీకరించమని  కోరే సందర్భంలో  'హిమకరు దొట్టు పూరు భరతేశ కురుప్రభు పాండు భూపతులో క్రమమున వంశకర్తలనగా మహినొప్పి యస్మదీయ

వంశ' మని చెప్పి తమది చంద్రవంశమని సూచించి ఉన్నాడని, ఇదే విషయం విమలాదిత్యుని రణస్థిపూడి శాసనంలో భీమనభట్టు చాళుక్య వంశ క్రమాన్ని చంద్రుని నుండి అని వర్ణించి ఉన్నాడని, దీనిని బట్టి బేతన, నన్నయ భట్టులు కూడా చాళుక్యులను చంద్రవంశ సంభూతులుగానే పేర్కొని ఉన్నారని తెలిపాడు. ఈ విషయాన్ని అతడు మరింత పూర్వానికి వెళ్ళి పరిశీలించాడు. ఇది నన్నయభట్టు, బేతనల పేర్కొన్న చంద్రవంశ వర్ణన అనేది నిజం కాదని ఇతడు తెలిపాడు. "వేంగీదేశమును బాలించిన కుబ్జవిష్ణువర్ధనుడు మొదలు విమలాదిత్యుని వఱకును 26 గురు చాళుక్యరాజులు పరిపాలనము చేసి శాసనములు వ్రాయించినను వానియం దెచ్చటను జాళుక్యవంశము చంద్రవంశాంతర్గతమని చెప్పబడి యుండలేదు. పశ్చిమ చాళుక్యుల శాసనములలో గూడా నీరీతి వంశవర్ణనము కానరాదు. పదునొకండవ శతాబ్దిలో విమలాదిత్యుడు సూర్యవంశీయుడని వ్యవహరింపబడెడి రాజరాజ చోడ మహీపతి కూతురగు కుందవాంబాదేవిని వివాహమాడిన పిమ్మట జాళుక్య వంశము చంద్రవంశాంతర్గతమైనదిగా భీమనభట్టుచే దొలుదొల్త నభి వర్ణింపబడె" (పైదే, పుట.992.) నని పేర్కొన్నారు. దీని గురించి చరిత్రకారులు పలు రకాల చర్చలను ఇప్పటికే చేసి ఉన్నారు. చరిత్రకారులు అసలు చాళుక్యులు క్షత్రియలా?కాదా? అనే సందేహాన్ని కూడా వ్యక్తపరిచారు.

పరిశోధకుడు చాళుక్యుల కాలం నాటి శాసనాలను, భారతావతారిక, ఆశ్వాసాంత్యపద్యాలు, చరిత్రను ఆధారం చేసుకుని ఆనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను వివరించారు. ఆనాటి రాజకీయ పరిస్థితుల గురించి తెలిపారు. చోళులకు, వేంగీ చాళుక్యుల గల మైత్రిని వివాహ సంబంధాలను వివరించారు. అంతేకాకుండా చోళులకు, కర్ణాటక రాజులకు రాజ్యవిస్తరణ విషయంలో నిరంతరం సంఘర్షణ జరుగుతూ ఉండేదని, చోళులతో, వేంగీ చాళుక్యులకున్న మైత్రి కారణంగా కర్ణాటక రాజులకు, చాళుక్యులకు కూడా వైరం ఏర్పడిందని తెలిపారు.

శక్తివర్మ, విమలాదిత్యుడు శత్రువులతో అనేక సంవత్సరాలు పోరాటం చేసి సింహాసనాన్ని పొందారు. తరువాత విమలాదిత్యుడు జైనమతాన్ని అనుసరించి జీవితంపై విరక్తి పెంచుకొని సింహాసనాన్ని రాజరాజుకు అప్పగించాడు. అయినప్పటికీ రాజరాజు శత్రువుల వలన చాలాకాలం తన పట్టాభిషేకం జరుపుకోలేక పోయాడు. తరువాత దాయాదుల సహాయంతో తన పట్టాభిషేకం జరుపుకున్నాడు. దీనికి కారణం వీరికి చోళులతో చిరకాలం నుండి స్నేహం, బంధుత్వం ఉండటం. ఇక చోళులకు కర్ణాటక రాజ్యానికి వైరం ఉండటం వలన వేంగీ చాళుక్యులు కర్ణాటక చాళుక్యులతో వైరం పెంచుకొన్నారని పరిశోధకుడు తెలిపాడు. అంటే ప్రత్యక్షంగా వేంగీ చాళుక్యులకు, కర్ణాటక రాజ్యాధిపతులకు ఎటువంటి వైరం లేదని తెలుస్తుంది. క్రమంగా ఈ రాజకీయ గొడవలు రాజరాజు కాలంలో కూడా కొనసాగడంతో రాజరాజు పలు ఇబ్బందులకు గురయ్యాడు. ఈ గొడవలను ఆసరాగా చేసుకొని రాజరాజు సవతి తమ్ముడు విమలాదిత్యుడు కర్ణాటక వారిని ఆశ్రయించి రాజరాజును మరిన్ని సమస్యల్లోకి నెట్టాడు.

ఈ సమయంలోనే "క్రీ.శ. 1042 లో బశ్చిమ చాళుక్య సార్వభౌముడైన రెండవ జయసింహుడును తరువాత రెండు సంవత్సరములకు జోళచక్రవర్తి రాజేంద్రచోళుడును మరణించిరి. త్రైలోక్యమల్ల, ఆహవ మల్ల సోమేశ్వరుడును రాజాధిరాజు చోళుడును గ్రమముగా గర్ణాటచోళ సింహాసనముల నధిష్ఠించిరి. వారి పట్టాభిషేకముతో సుమారు పదియేండ్లుగా జల్లారియున్న కర్ణాట, చోళ భూపతుల నడిమి వైరానలము మరల మహోజ్జ్వలముగా ప్రజ్జ్వరిల్లెను" (పైదే, పుట.1015.) అని కర్ణాటక వేంగీచాళుక్యులకు గల వైరం తిరిగి ప్రారంభమైన విధానాన్ని తెలిపాడు.

తరువాత జరిగిన యుద్ధాలలో రాజరాజు వేంగీరాజ్యాలలోని భూభాగంలో కొంత కోల్పోయాడని చరిత్రకారులు పేర్కొన్నారు. 1050 తరువాత చోళుల సహాయం అర్థించి విఫలుడైనాడని, అనంతరం పశ్చిమ చాళుక్యుల సార్వభౌమత్వం అంగీకరించాడని, దీనితో పశ్చిమ చాళుక్యరాజు ఆహవమల్లసోమేశ్వరుడు తన

ప్రతినిధిగా నారాయణభట్టును పంపాడని ఆ తరువాతనే నన్నయ భారతాన్ని రచించాడని పేర్కొన్నారు.

సమకాలీన ఇతర ప్రాంతీయ భాషా కవులు వారి వారి భాషలలో వ్యాసభారతం ఆధారంగా చేసుకొని మహాభారత రచన చేయటం కూడా నన్నయ ఆంధ్ర మహాభారతం రచించడానికి గల కారణం అని పేర్కొన్నాడు. తమిళ, కన్నడ భాషలలో అప్పటికే మహాభారతం రచింపబడి ఉందని తెలిపాడు.

సాంఘిక పరిస్థితులలో ఆనాడు సమాజంలో ఉన్న వివిధ వర్గాల వారిని గురించి వివరించారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను గురించి వేశ్యలను గురించి వివరించారు. మతపరిస్థితులను తెలుపుతూ ఆనాడు జైన, బౌద్ధమతము క్షీణదశలో ఉన్నప్పటికీ జైనమతస్తులు మాత్రం స్వధర్మాన్ని ప్రచారం చేస్తూ రాజ్యమంతా జైనమతాన్ని వ్యాప్తి చేయటానికి ప్రయత్నం జరుగుతూ ఉండేదని ఆ జైన మతస్తుని ప్రభావం వలనే విమలాదిత్యుడు జైనమతాన్ని స్వీకరించి రాజ్యాన్ని కూడా వదిలి పెట్టాడని వివరించారు. అంతేకాకుండ జైనయోగులు అనేక మహిమలు గడించి మానవాతీమైన  మహిమలు ప్రదర్శించే వారని, వారి ధర్మోపదేశాల కంటే వారు ప్రదర్శించే మహిమల వల్ల జనులు ఆకర్షితులు అయ్యేవారని వివరించారు. కాని జైనం ఏ రోజు కూడా రాజమతంగా స్వీకరించలేదని ఒక్క విమలాదిత్యుడు తప్ప తక్కిన వారందరు కూడా శైవమతాన్ని అనుసరించారని వివరించారు.

ఒక విధంగా చాళుక్యరాజుల పాలనలో  హిందూ మత పునరద్ధరణ ప్రారంభమయింది. రాజులందరు  వైదికకర్మలను వేదవిప్రులను విశేషంగా పోషించినట్లు తెలుస్తుంది. నన్నయను ఆంధ్రమహాభారతాన్ని రచింపమని రాజరాజు అడగటానికి గల కారణం 'భారత శ్రవణాభిరతి కపిల గోశతదానము వలనను బహు యాగముల నాచరించుట వలనను గల్గు ఫలము' కలుగుతుందని చెప్పడంలో రాజరాజు వైదిక మతాభిమానం వ్య క్తమవుతుందని వివరించాడు.

### 7.1.2. ఆంధ్రభారత కవితా విమర్శనము

ఆంధ్రమహాభారతంపై చారిత్రక విమర్శనా దృక్పథం వచ్చిన మరొక విమర్శనా గ్రంథం ఆంధ్రభారత కవితా విమర్శనము. ఈ గ్రంథాన్ని రచించినవారు కోరాడ రామకృష్ణయ్యగారు. ముందు పేర్కొన్నట్లుగా ఈ రచనలో కూడా కొన్ని అధ్యాయాలు మాత్రమే చారిత్రక విమర్శ లక్షణాలు కనిపిస్తాయి.

ఇందులో పరిశోధకుడు ఆంధ్రమహాభారత రచనకు పూర్వమున్న భాషాస్థితులను ఆంధ్ర మహాభారత రచనకు దోహదం చేసిన సమకాలీన పరిస్థితులను వివరించాడు. తెలుగులో నన్నయ రచనకంటే ముందున్న స్థితిగతులను, నన్నయ భారతమే మొదటి గ్రంథంగా పరిగణించడానికి గల కారణాలను, నన్నయ ఆంధ్రమహభారతాంధ్రీకరణకు గల కారణాలను, తిక్కన తిరిగి పునః ప్రారంభించడానికి గల చారిత్రక కారణాలను వివరణాత్మకంగా తెలిపారు.

వీరి గ్రంథంలో క్రీ.పూ. నుండి క్రీ.శ. పదవశతాబ్ది వరకు ఉన్న రాజకీయ పరిస్థితులను వివరించారు. చాళుక్య రాజులు అంతకు పూర్వమున్న రాష్ట్రకూటులు అనుసరించిన విధానాన్ని అనుసరించారని, రాష్ట్రకూటులు జైనులై కన్నడ వాఙ్మయాన్ని ప్రోత్సహించగా చాళుక్యులు మొదట కన్నడ వాఙ్మయాన్ని తరువాత ఆంధ్ర వాఙ్మయాన్ని కూడా ప్రోత్సహించారని తెలిపాడు. చాళుక్యులలో వేంగీ చాళుక్యులు, కర్ణాటక చాళుక్యులు, బాదామి చాళుక్యులు మొదలైన వారు ఉన్నారు. వీరందరు వివిధ ప్రాంతాలను పరిపాలించారు. కాని వీరందరు కూడా మొదట ఒక ప్రాంతం నుంచి వచ్చినవారుగా, ఒకే వంశానికి చెందినవారుగా చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. ఆ వంశమే చాళుక్యవంశం. వీరిలో కొందరు జైనమతాన్ని, కన్నడ వాఙ్మయాన్ని ప్రోత్సహించారు. తరువాత వీరి వంశం వారు పరిపాలించిన కాలంలోనే ఆంధ్రమహాభారత రచన జరిగింది.

కోరాడ రామకృష్ణయ్యగారు కూడా చాళుక్యులు చంద్రవంశం అని చెప్పుకోవడానికి గల కారణాన్ని తెలిపారు. “వీరు దేశీయుల తెగలలోని వారేయైనను ఆర్యమతవిజ్ఞానముల ప్రభావము వీరిపై విశేషముగ బ్రసరించుటం జేసి, ప్రతిష్ఠ కొరకై సూర్యచంద్ర వంశములలోని వారమని చెప్పుకొనుటకును దమ వంశముల నందు జేర్చుకొని అగ్నిష్టోమాగ్నిచయన వాజపేయాది క్రతువులను జేసి యశ్వమేధావభృథ స్నాన పవిత్రులైనట్లు చెప్పుకొని తమ శాసనములను సంస్కృత భాషయందు బ్రకటించుచు సంస్కృత భాషయందే విశేషాభిమానము కలవారై యున్నను, దేశభాషాభిమానమును మాత్రము వీడక దేశభాషా వాఙ్మయ రచనకు బ్రోత్సాహము కలుగజేసి మునుమార్గ కవిత లోకంబున వెలయగ దేశికవిత ఘటించి తెనుంగున నంధ్ర విషయమున నిలిపిన వారైనారు.” (రామకృష్ణయ్య, కోరాడ: ఆంధ్రభారత కవితా విమర్శనము, పుట.22.)

నన్నయ ఆంధ్రమహాభారతాన్ని చంపూ విధానంలో రాయడానికి గల కారణం కన్నడ కవులని, అప్పటికే కన్నడ కవులు సంస్కృత భాషా విధానాన్ని అనుసరించారని, తత్సమపదాలను వాడుతూ చంపూ విధానాన్ని అనుసరించి రచన చేశారని, వారిని అనుసరించి నన్నయకూడా చంపూ విధానాన్ని రచించాడని కోరాడవారు తెలిపారు. అంతేకాకుండా నన్నయ, అతని సహాధ్యాయుడు నారాయణభట్టు అప్పటికే కన్నడంలో పంపకవి రచించిన విక్రమార్జున విజయాన్ని చదివి ఉంటారని, కాని ఆంధ్రమహభారత రచనలో నన్నయ ఉద్దేశము వేరైందని తెలిపాడు. దానికి కారణం నన్నయ ప్రభువైన రాజరాజు ఆదర్శాలు వేరని పేర్కొన్నాడు. “ఈతడు ధర్మధురంధరుడు, మునుమార్గ వర్తనుడు, సమస్త వర్ణాశ్రమ ధర్మ రక్షణ మహామహిముడు, కావ్యగీతిప్రియుడు. ఇట్టి చాళుక్య కులావతంసునిచే ననేక భాషాపండితుల సమక్షమున బ్రార్థింపబడిన వాడై యా మహారాజు కోరిక దీర్చుటకు గడంగెను. ఇట్లు నన్నయ భారతమును రచించినది యొక మహారాజు కోరిక చెల్లించుటకు బండితుల ప్రీతి కొరకు వైదిక మత వ్యాప్తి కొరకు నైయున్నది.” (పైదే, పుట.49.)

ఆంధ్రమహాభారతం కంటే పూర్వమున్న మత పరిస్థితిని వివరించాడు. నాడు మతమనేది అత్యంత ముఖ్యమైన ప్రచార సాధనంగా ఉండటమే కాక అత్యంత ప్రధానమైన పాత్ర పోషించినట్లు కూడా కనిపిస్తుంది. అందుకు వీరు పేర్కొన్న మాటలే తార్కానం. "ఇక్ష్వాకుల తరువాత నీదేశమును పాలించి పెద్ద సామ్రాజ్యమును స్థాపించిన యాంధ్ర రాజుల కాలములో బౌద్ధ, జైనమతములే గాక, బ్రాహ్మణ మతము కూడ విజృభింప సాగినట్లున్నది. ఆ కాలములో జైనులు, బౌద్ధులు, నెచ్చటెచ్చటికి బోయి మతప్రచారము సలుప మొదలిడిరో ఆయా దేశములకు వారి వెంటనే బ్రహ్మణ మతప్రచారకులు గూడబోయి స్వీయమత ప్రచారమును సలుపుచు వచ్చినట్లుగ పడుచున్నది." (పుట.70)

ఇతడు కూడా పూర్వ పరిశోధకుల లాగే రాజరాజేంద్ర నరేంద్రుడికి భారతాన్ని తెలుగులో వినాలనే కోరిక ఉన్నట్లు, అప్పటికి అతడు కన్నడంలోని భారతకథ పేరుతో ఉన్న అర్జునుడి కథ, భీముని గదాయుద్ధకథలను విని ఉన్నాడని  ఇది సరైన పాండవోత్తముల చరిత్రలు కాదని భావించాడు. తరువాత ఇతనికి చోళులతో గల పరిచయం వలన తమిళ భారతాన్ని కూడా విని ఉంటారని అభిప్రాయపడ్డారు. రాజరాజు భారత కథపై ఆసక్తికి గల కారణం  అతని వైదిక మతాభిమానమేనని తెలుపాడు. ఈ అవతారికలో పలుచోట్ల వైదిక మతమే  కనబడుతున్నదని, నన్నయ తాను రచించిన భాగమంత ఈదృష్టి తోనే రచించాడని, ఎక్కడ చూసినా మూలములో ఉన్నా, లేకున్నా వైదికకర్మలను, వైదికాచార సంపత్తి ఎక్కువగా పొగిడాడని పేర్కొన్నాడు.

ఇందులో నన్నయ తరువాత దాదాపు రెండు శతాబ్దాల కాలం ఆంధ్రమహాభారతం తిరిగి ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను తెలిపాడు. తరువాత తిక్కన గురించి వివరించాడు.

తిక్కన మొదట ఆంధ్రమహాభారతం రచించకపోవడానికి గల కారణాలను కూడా విశ్లేషించాడు. దానికి గల కారణం తిక్కన ప్రభువులైన వారు వైష్ణవమతం అవలంభించడం వలన ఆంధ్రమహాభారతాన్ని రచించలేదని అభిప్రాయపడ్డారు. "మంత్రి

భాస్కరుని కుమారుడగు తిక్క భూపాలుడు వైష్ణవమతావలంబకుడై పాకనాడు, కమ్మనాడు మొదలైన దేశములలో వైష్ణవ మతవ్యాప్తికి తోడ్పడుచు, కాంచీపురము నందలి వరదరాజస్వామియం దత్యంత భక్తికలవాడై యనేక విష్ణ్వాలయములను నెలకొల్పినట్లు తెలియచుండుటచే, తండ్రియగు మంత్రి భాస్కరుడను కొంతవరకు వైష్ణవమతాభిమానము గలవాడై యుండెడి తలంపదగును. ఆ కారణాముచే నీతడు వైదిక మతవ్యాప్తికి దోడ్పడు భారతము విడిచి, వైష్ణవ మతోద్బోధకమగు రామాయణము నాంధ్రీకరింప దొడగి యుండును". (పైదే, పుట.110.)

నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచనాదృష్టికి తిక్కన ఆంధ్రమహాభారత రచనాదృష్టికి భేదం ఉందని తెలిపాడు. దానికి గల కారణం ఆనాటి మతమరిస్థితులని వివరించాడు. తిక్కన కాలం నాటికి శైవ, వైష్ణవాల మధ్య ఘర్షణలు ప్రారంభమైనాయనేది చరిత్ర ద్వారా తెలుస్తూ ఉంది. ఈ మతఘర్షణలు, కొట్లాటలు చూసిన తిక్కనలో అద్వైత భావం మీద ఆసక్తి ఏర్పడిందని, తద్వారా హరిహరనాథుడు ఇష్టదైవంగా భావించాడని తెలిపాడు.

ఇతడు మరొక ముఖ్యమైన విషయం పేర్కొన్నాడు. అది తిక్కన భారతాన్ని రచించేటపుడు నన్నయ రచించిన మూడు పర్వాలను చూడలేదని ఇతని అభిప్రాయం. "భారతమున మూడు పర్వములు ఆంధ్ర కవిత్వ విశారదుండగు నన్నయభట్టు ఆంధ్రభాషలో రచించెను అని మాత్రమే చెప్పినాడు. విద్యాదయితుండు 'మహితాత్ముడు' అనునవి నన్నయను గూర్చిన విశేషణములుగాని యాతని కృతిని గూర్చినవి గావు. ఆకృతి యందు, నా కవిత యందును విశేషాదరమును వ్యక్తపరచుట లేదు" (పైదే, పుట.114-115.) అతడు కేవలం 3 పర్వాలు రచించినట్లుగా మాత్రమే చెప్పాడని పేర్కొన్నాడు.

ఈ భారత రచనకు మరొక కారణం కూడా తెలిపారు. అది తిక్కన అద్వైతిగా పేర్కొడబడినప్పటికీ తిక్కనకు కూడా వైదికమతంపై అభిమానము కలదని అందుకు తిక్కనే తనకు ప్రత్యక్షమైన ఇష్టదేవత చెప్పినట్లుగా చెప్పాడని వివరించాడు. ఇతడు నన్నయ అరణ్యపర్వం రచించాడని అది శిథిలమై పోగా దానిని ఎర్రన పూరించాడని పరిశోధకుడు తెలిపారు. "ఒక పర్వములో చివరి కొద్దిభాగము మాత్రమే కొరవడి యుండుట చేతను, ఆ స్వల్ప భాగము కూడా నన్నయ పేరనే యుండుట యుక్తమని తలంచి యాతని రచననే యనుకరించి పూర్తిచేయుటకు యత్నించి, యట్లే చేసితినని చెప్పుకొనియున్నాడు." (పైదే, పుట.119.) కాని దీనిని పరిశోధకులు తరువాత కాలంలో అంగీకరించలేదు. ఇప్పటికీ పరిశోధకులు అరణ్య పర్వ శేషభాగం ఎర్రన రచించినట్లుగానే భావిస్తున్నారనే విషయం పలు రచనల ద్వారా తెలుస్తూ ఉంది. ఇతడు తర్వాత మిగతా అధ్యాయాలలో మాత్రం ఆలంకారిక విమర్శను ప్రధానంగా చేసి రచన చేశాడు.

## 7.2. శైవ సాహిత్య రచనలపై వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలు

### 7.2.1. నన్నెచోడదేవ కుమార సంభవ పరిశీలనము

ఈ గ్రంథ రచయిత్రి తమ్మారెడ్డి నిర్మల. ఇది కూడా సిద్ధాంత గ్రంథం. ఇందులో కూడా కొన్ని అధ్యాయాలలో చారిత్రక విమర్శ కనిపిస్తుంది. ఇందులో మొదట కుమారసంభవ గ్రంథాన్ని రచించిన కవిని గురించి, కవి కాలాదులను గురించి చర్చించారు. సహజంగానే తెలుగు సాహిత్య చరిత్రలో నన్నెచోడుని గురించి ఎక్కువగా చర్చ జరిగింది. నన్నెచోడునికి సంబంధించిన పూర్వ పరిశోధకుల అభిప్రాయాలను కూలంకషంగా చర్చించారు. ఇందులో కవి కాలాదులను నిర్ణయించటానికి రెండు విధానాలున్నాయని పేర్కొన్నారు. "కవికాల నిర్ణయము నొనర్చుటకుపకరించు సాధనములను రెండు విధములుగా విభాగింపవచ్చును. అందు ముఖ్యముగా మొదటిది

బహిస్సాక్ష్యము. రెండవది అంతస్సాక్ష్యము. వీనినే క్రమముగా బహిరంగాంతరంగ ప్రమాణములు అని వ్యవహరించుటయు గలదు. కృత్యవతారిక యందు గాని, ఆశ్వాసాద్యంత పద్య గద్యముల యందు గాని కల కవి కర్తృ కృతిభర్త్రాది ప్రసంగము చారిత్రకముగా శాసనాదిక ప్రమాణములతో సమన్వయించిన నది బహిస్సాక్ష్యము. కావ్య రచనా విశేషములను బట్టి యనగా శైల్యాదికమును బట్టి సమన్వయించిన నది అంతస్సాక్ష్యము" (నిర్మల, తమ్మారెడ్డి: నన్నెచోడదేవ కుమార సంభవ పరిశీలనము, పుట.1) అని పేర్కొని ఈ విధానాల ద్వారా నన్నెచోడుని కాలాలను వివరించారు. అప్పటివరకు నన్నెచోడునికి సంబంధించి పరిశోధించిన మానవల్లి రామకృష్ణ కవి, బుర్రాశేషగిరి రావు పంతులు, జయంతి రామయ్య పంతులు, వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలగు వారి అభిప్రాయాలను పరిశీలించి చర్చించారు.

కుమారసంభవంలోని కృతి అవతారికను బట్టి నన్నెచోడుని కుల గోత్రాలను కొన్ని తెలుస్తున్నాయని, నన్నెచోడుడు సూర్య వంశ సంజాతుడని, కరికాల చోడుని వంశంలోని వాడని, నన్నెచోడుడు పాకనాటియందు ఇరివది యొక్క వేయిటి కధీశుడైన చోడబల్లికిని, అతని అగ్రపట్టమహిషి అయిన హైహయ వంశజుడైన శ్రీపతికి కుమారుడని తెలిపారు. ఇంకా నన్నెచోడుడు సూర్య వంశ క్షత్రియుడని, కాశ్యప గోత్రుడని ఉభయ కులశుద్ధుడని, టెంకణాదిత్య బిరుదు కలిగినవాడని పేర్కొన్నారు. ఇక కాలానికి సంబంధించి కూడా పరిశోధకుల అభిప్రాయాలను చర్చించి చివరకు నన్నెచోడుడు క్రీ.శ. 1100 సంవత్సరం నుండి 1160 సంవత్సరం వరకు జీవించి ఉండెనని, క్రీ.శ. 1135 సంవత్సరం నుండి క్రీ.శ. 1160 సంవత్సరం వరకు రాజ్యపాలన చేసి ఉండవచ్చునని తెలిపారు.

తర్వాత నన్నెచోడుని మతాన్ని గురించి వివరించారు. మొదట శైవమతం గురించి శైవ మత శాఖలను గురించి పేర్కొన్నారు. ఇంతకు పూర్వం జరిగిన పరిశోధనలను పేర్కొంటూ, నన్నెచోడుని గురువు కాలముఖ శాఖకు చెందినవాడని, కాబట్టి

నన్నెచోడుడు కూడా అదే శాఖకు చెందిన వాడుగా పరిశోధకులు నిర్ణయించారని తెలిపారు. కాని పరిశోధకురాలు మాత్రం ఈ నిర్ణయంతో విభేదించారు. నన్నెచోడుడు మతానికి సంబంధించి పలు పద్యాలను రాశాడని వాటిని పరిశీలించి నన్నెచోడుడు శైవుడు అనే విషయంలో ఎటువంటి భేదాభిప్రాయం లేదని, కాని అతడు ఆగమ శైవ శాఖకు చెందినవాడని పేర్కొన్నారు. కొందరు నన్నెచోడుడు అద్వైతి అని పేర్కొన్నారని కాని అది సరికాదని వివరించారు. నన్నెచోడుడు విష్ణువును స్తుతించడానికి గల కారణాన్ని వివరించారు.

అనంతరం గ్రంథం చివరి అధ్యాయంలో నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులను వివరించారు. అందుకు ఉదాహరణగా పలు పద్యాలను విశదీకరించారు.

ఆకాలంలో  పలు రకాలైన శిక్షలు అమలులో ఉన్నట్లు, ఖలుడికి నాలుక కోసి ఉప్పుతో నింపటం, లోహాన్ని కాచి నోట్లో పోయటం, చర్మాన్ని ఒలచటం, కన్నులు పీకేయటం మొదలగు శిక్షలు అమలులో ఉన్నట్లు నన్నెచోడుని పద్యాల ద్వారా వివరించారు. సైనికులకు జీతంగా జొన్నలు ఇచ్చేవారని, నాడు చతురంగ బలాలలో రథాలకంటే గజబలానికి ప్రాధాన్యం ఉండేదని, యుద్ధం జరుగుతుండగా సాయంత్రమైన తర్వాత ఇరుబలాలు యుద్ధం ఆపి శిబిరాలకు వెళ్ళి క్షతగాత్రులకు మందులు వేసేవారని తెలిపారు. ఇంకా రాజకీయపరమైన పలు రకాల విషయాలను పద్యాల ద్వారా ఉదాహరించారు.

ఆకాలంలో వర్ణవ్యవస్థ అమలులో ఉండేదని అందులో బ్రాహ్మణులకు అధిక గౌరవం ఉండేదని, వారు ఎంతటి పెద్ద తప్పు చేసినప్పటికి బ్రాహ్మణుని వధించకూడదనే నియమం ఉన్నట్లు తెలిపారు. బ్రాహ్మణులను ఎంతగా గౌరవించేవారో మాతంగులంతగా నిరసించబడ్డారని కూడా వివరించారు. సాలేవారు అత్యంత సన్నంగా ఉండే వస్త్రాలను నేసేవారని, కుమ్మరివారు సారెతో  పాత్రలు చేసేవారని తెలిపారు.

ఇంకా నాటి ప్రజల జీవితాన్ని, వారి ఆహారపు అలవాట్లు, మధుపానపు అలవాట్ల, ఆచారాలు, విశ్వాసాలు, వివాహ సంప్రదాయం, లలితకళలు, క్రీడలు- వినోదాలు

మొదలైనవాటిని కుమార సంభవము గ్రంథం అధారంగా ఉదాహరణలతో వివరించారు.

అయితే ఈ గ్రంథంలో మత, రాజకీయ, సాంఘిక విషయాలు పేర్కొన్నపటికీ గ్రంథావిర్భావానికి గల కారణాలను వివరించింటే ఇంకా ఉపయోగ కరంగా ఉండేది. శైవసాహిత్యంలో మొదటి గ్రంథంగా పరిశోధకులు పేర్కొన్నారు. నాటి శైవ మతం కుమారసంభవము రచనకు ఏవిధంగా కారణమైందనే విషయాలపై ఇందులో ఎటువంటి చర్చలేదు.

### 7.2.2. నవనాథచరిత్ర - కావ్యానుశీలనము

ఈ గ్రంథ రచయిత ఓబిరెడ్డి. ఇది విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతగ్రంథం. ఈ గ్రంథంలో నాథ సంప్రదాయం గురించి, నాథ సంప్రదాయం ఇతర ప్రాంతాలలో ఉద్భవించిన విధానం, వివిధ భాషా సాహిత్యాలపై చూపిన ప్రభావం, తెలుగులో నవనాథ చరిత్ర గ్రంథ రచనకు గల కారణాలు, అందుకు దోహదం చేసిన అంశాలను పరిశోధకుడు వివరించారు. ఈ నాథ సంప్రదాయం అనేది మొదట తాంత్రిక విద్య ద్వారా ప్రారంభమైందని చెప్పాడు. "క్రీ.శ. 8వ శతాబ్దిలో బెంగాలు 'పాలరాజు' బౌద్ధమతము నుండి వైదలిగి శైవమతమునకు ఆశ్రయమిచ్చెను. తదనంతరము నేపాలు, టిబెట్టులు తాంత్రిక వాదము వైపు మ్రొగ్గినవి. ఆ కాలమునందే బెంగాలు, మగధ, ఒరిస్సాలలో ప్రజలు తాంత్రిక విద్యలకు ఆకర్షితులైరి. క్రీ.శ. 9-10 శతాబ్దములలో నేపాలులో శైవబౌద్ధమతములు ఏకముకాగా నాథ సంప్రదాయము అవతరించెను. నేపాల మాహాత్మ్యమును అనుసరించి శివుడు బుద్ధుడు ఒకటే అయిరి." (ఓబిరెడ్డి, కె: నవనాథచరిత్ర కావ్యానుశీలనము, పుట.1.) అనంతరం ఇది వజ్రయానం, శైవమార్గం రెండింటి ద్వారా సహజ యానం ఏర్పడిందని జ్ఞానేశ్వర (మహారాష్ట్ర) మహారాజు అనే అతడి ద్వారా నాథ సంప్రదాయం సహజ యాన సంపర్కంతో జనించిందని, తరువాత బౌద్ధంలోని తాంత్రిక విద్యను అభ్యసించే వారి ద్వారా అభివృద్ధి చెందిందని పేర్కొన్నాడు.

ఆంధ్రదేశములో తిక్కన అనంతరం వైదికమతం వ్యాప్తి చెందిందని, ఆ వ్యాప్తిలో నాథ సంప్రదాయం ఎదుగు బొదుగు లేక నశించిపోయి ఉంటుదని అభిప్రాయపడ్డాడు. ఇంకా నాథ సంప్రదాయం ఏయే ప్రాంతంలో ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు.

పరిశోధకుడు నాథ సంప్రదాయము అవతరించడానికి గల సాంఘిక రాజకీయ పరిస్థితులను వివరించాడు. ప్రాచీనకాలము నుంచి భారతదేశానికి వివిధ జాతులవారు వచ్చి ఇక్కడ జాతులతో కలిసిపోయారని, దీనితో సామాజిక వ్యవస్థలో ఒకరకమైన వర్ణ వ్యవస్థ ఏర్పడిందని క్రమంగా ఇది బలపడిందని తెలిపాడు.

"వర్ణవ్యవస్థ వలెనే ఆశ్రమ వ్యవస్థ కూడా మధ్యయుగములో తన కఠోరత్వము వలన జాతుల సంఖ్యను అధికముగావించెను. వర్ణములు మౌళికముగా ఆర్యుల సహజ ప్రవృత్తి పై వారి కర్మల పైన ఆ పిమ్మట జన్మము పైన ఆధారపడియుండెను. ఆశ్రమములకు మూలాధారము సంస్కారము. జైన, బౌద్ధ సంస్కృతులు ఆశ్రమ వ్యవస్థపై తొలిసారిగ దెబ్బకొట్టెను. ఈ సంస్కృతిలో వ్యక్తి ఏవయస్సులోనైనను పరివ్రాజకుడు లేదా శ్రమణుడు అగుచుండెను. అతనికి ఎట్టి సంస్కారము అడ్డురాకుండెను. అపరిపక్వమైన శరీరము అపరిపక్వమైన మనస్సుతో కూడిన బిక్షువులు దేశములో నిండిపోయిరి." (పైదే, పుట.26.) తరువాత కాలంలో శైవ, వైష్ణవాలలో కూడా సాధువులు సన్యాసులు పెరిగిపోయారు. ఇక జైన బౌద్ధాలలో అదే పరిస్థితి కొనసాగింది. హిందూ మతంలో సన్యాసుల సంఖ్య పెరగడాని గల ప్రధాన కారణం హిందూ ధర్మశాస్త్రాలేనని ఇతడు తెలిపాడు. భారత దేశంలో ముస్లిం దండయాత్రలు ప్రారంభం కాకపూర్వం దేశంలో హిందూ మతాలైన శైవ వైష్ణవాలు, జైన బౌద్ధాలు కొనసాగాయి. ఈ సమయంలో హిందూ సమాజం, ప్రజలు మాత్రం బ్రాహ్మణీయ ధర్మాలకు ఆచారాలకు కట్టుబడి నడుచుకొన్నారు. కాని ముస్లింల దండయాత్రల ఫలితంగా హిందూ సమాజంలో మార్పులు చోటు చేసుకొన్నాయి. "ఉత్తర భారతదేశంలో హిందూ సమాజము రెండు వర్గాలుగా విభజింపబడెను. మొదటి వర్గము పై బ్రాహ్మణుల పెత్తనము మనుస్మృత్యాది మతగ్రంథముల పెత్తనముండెను. ఈ వర్గమునకు చెందినవారు తమ జీవితమును నియమములను ఈ గ్రంథము ననుసరించియే

పాటించుచుండిరి. రెండవవర్గము పై మతగ్రంథముల పెత్తనము ఏమియు లేకుండెను. వారిలో అకాల సన్యాసము కూడా చెల్లుబడి అగుచుండెను. ఈ రెండవ వర్గము మోక్షసాధన కొరకు మానవ జీవితమును నియమబద్ధము చేయు వర్ణాశ్రమ వ్యవస్థను ఉపయుక్తమైనదిగా భావింపలేదు స్వీకరింపలేదు. వీరి యోగాది శాస్త్రములను మోక్షరక్షకులుగా లెక్కించిరి". (పైదే, పుట. 28.) ఈ విధానంతో వారు సాధువు, సన్యాస జీవితం మోక్షానికి మార్గంగా భావించారు. సాధువుల సంఖ్య పెరిగిపోయింది.

నాథ సంప్రదాయంలో వివిధ శాఖలున్నాయని అవి గోరక్షకనాథుడు వాటిని ఒకటిగా చేశాడని వివరించాడు. ఆంధ్రదేశంలో నాథసంప్రదాయాన్ని గురించి వివరించాడు. ఆంధ్రదేశంలో ఈ సంప్రదాయం ఎక్కువగా వ్యాప్తిలో ఉన్నట్లు కనిపించదు. అందుకుగల కారణాలను కూడా వివరించాడు. తరువాత నవనాథ చరిత్ర రచించిన కవి గౌరన గురించి, నవనాథ చరిత్ర వెలువడటానికి గల కారణాలను గురించి వివరించాడు. ఇంకా పరిశోధకుడు గౌరన నవనాథచరిత్ర ద్వారా గౌరన జీవిత విషయాలను పేర్కొన్నాడు. గౌరన వర్ణవ్యవస్థను సంపూర్ణంగా అంగీకరించిన వాడని, భిక్షావృత్తిరాయడు కుడా అటువంటి అభిప్రాయం గలవాడని తెలిపాడు. "గౌరన శివాధిక్యమును మన్నించిన వాడైనను వర్ణాశ్రమ వ్యవస్థ యందు దృఢ విశ్వాసము కలవాడని స్పష్టమగును. ముక్తి శాంత భిక్షావృత్తిరాయడు కూడా ఈ వ్యవస్థను బలపరచిన వాడగుటచేత 'కులశీలములు' గల్సిన గౌరనను కావ్యరచనకు ప్రోత్సహించెను. బసవేశ్వరాదులు శివుడు కులగోత్రాతీతుడని నొక్కి వక్కాణించిరి. గౌరన వర్ణవ్యవస్థ యందు విశ్వాసము గల వాడగుటచే తన కులగోత్రములను గూర్చి చెప్పికొనెను." (పైదే, పుట.45.)

పరిశోధకుడు గౌరన రచనల ద్వారా అతని పెదతండ్రి, బంధువులను పేర్కొని వారి కాలాన్ని అంచనా వేసి గౌరన కాలాన్ని పేర్కొన్నారు. ఇంకా ఇతర శాసనాల ఆధారంగా ఇతని కాలాన్ని 1351 నుండి 1425వ సంవత్సరం వరకు అని పేర్కొన్నాడు.

గౌరన కూడా  రాజులంటే విరక్తి భావమున్న కాలంలో శ్రీశైలంలో నవనాథ చరిత్ర రచించాడని, గౌరనకు కూడా రాజులంటే సదభిప్రాయం లేదని పేర్కొన్నాడు. "గౌరన ఏ రాజాశ్రయము కోరినవాడుకాడు. ఇతని పెదతండ్రి పోతరాజు, తండ్రి అయ్యలమంత్రి దేవరకొండ రాజాశ్రయమున నున్నట్లు తోచును. కాని గౌరనకు అట్టి వాంఛ లేవియు లేవు. నవనాథచరిత్రలో వ్యాళిసిద్ధుడు రాజులను గూర్చి చేసిన ప్రసంగమును బట్టి గౌరనకు  రాజుల పట్ల నమ్మక మిసుమంతయు లేదని స్పష్టమగును." (పైదే, పుట.50.)

నవనాథ చరిత్ర రచనకు గల ముఖ్య కారణం గౌరనకు ముక్తి శాంత భిక్షురాయునితో గల పరిచయం అని ఇతని అభిప్రాయం. ఇతడు శ్రీశైలంలో ఉన్నప్పుడు ముక్తిశాంత భిక్షావృత్తి రాయుడి దగ్గరకు పలు ప్రాంతాల నుంచి యోగులు సిద్ధులు అక్కడకు వచ్చే వారని వారి వలన నవనాథుల గురించి తెలుసుకొని తెలుగులో నవనాథ చరిత్ర రచించాడని పేర్కొన్నాడు. అయితే అప్పటికే పలు ప్రాంతాలకు సంబంధించిన గాథలు నవనాథులను గురించి వ్యాప్తిలో ఉన్నాయని వాటినిలో టిబెట్ ప్రాంతానికి చెందిన గాథను తన రచనకు స్వీకరించాడని ఇతడు తెలిపాడు.

ఇంక నవనాథచరిత్ర కాలమునాటి సాంఘిక, రాజకీయ, మత పరిస్థితులు వివరించారు. శ్రీశైల మఠాధిపతి ముక్తిశాంతభిక్షావృత్తిరాయని కాలం నాటికి (నవనాథచరిత్ర రచనా కాలము నాటికి) శైవమతం పట్టు కొంత తగ్గి ఉండటం చేత జన సామాన్యంలో శైవమతాన్ని ప్రచారం చేయటానికై భిక్షావృత్తి రాయుడు గౌరనను ద్విపదలో నవనాథ చరిత్రను రచింపమని ప్రోత్సహించాడు. రాజులు ఆర్థికస్థితి చక్కగా ఉన్నట్లు తెలుస్తుందని పేర్కొన్నాడు. ఇంకా గ్రంథంలో కనిపించే  సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మతవిషయాలను వివరించాడు.

## 7.3. వైష్ణవ సాహిత్య రచనలపై వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలు

### 7.3.1. ఆంధ్ర భాగవత విమర్శ

ఈ గ్రంథ రచయిత ప్రసాదరాయ కులపతి. ఈ గ్రంథం కూడా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథంలోని కొన్ని అధ్యాయాలలో చారిత్రక విమర్శనా దృక్పథం కనిపిస్తుంది. ఇతడు పోతన భాగవత రచనకు గల నేపథ్యాన్ని వివరించాడు. అందుకు గల రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులను వివరించారు.

ఇతడు పోతన రచనలను గురించి వివరిస్తూ పోతన భోగినీ దండకం రావు సింగభూపాలుని కొరకు రచించాడని వివరించాడు. అందుకు సంబంధించిన చర్చను చేశాడు. తరువాత ఆంధ్ర భాగవత రచనకు కారణమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను వివరించాడు. ఓరుగల్లు పతనం తర్వాత చాలా కాలం దక్షణాపథమంతా కూడా అల్లకల్లోలంగా ఉన్నదని, తరువాత కొంత కాలానికి తెలుగు దేశాన్ని విజయనగర ప్రభువులు కొంత, కొండవీటి రెడ్లు కొంత, రాచకొండ వెలమలు కొంత, గజపతులు కొంత పంచుకోవటం వలన ఆంధ్రదేశం రాజకీయంగా నాలుగు ముక్కలైందని, ఈ నలుగురిలోను ఒకరికొకరికి పడక, వీరి మధ్య నిరంతర పోరాటాలు జరిగాయని, ఇదే అదునుగా చేసుకొని బహమనీ రాజ్యం వీలయిన భాగాన్ని దక్కించుకొన్నదని తెలిపాడు. తరువాత ఆయా రాజ్యాల స్థాపన గురించి వాటిని స్థాపించిన వారిని గురించి పరిచయం చేశాడు. "హరిహర బుక్కరాయలను నిద్దరన్నదమ్ములు మహమ్మదీయులచే బలవంతముగా మతాంతీకరము పొందారు. వారికి శృంగేరీ పీఠాధిపతి యగు విద్యాశంకర భారతీస్వామి రక్షించి మరల హిందూత్వ దీక్ష నొసగెను. వారి శిష్యుడును అఖండ ప్రజ్ఞా సమన్వితుడును ప్రథమమున మాధవాచార్య నామము కలవాడును అనంతర కాలమున శృంగేరీ పీఠాధిపతియునైన

విద్యారణ్యస్వామి హరిహర బుక్కరాయలకు చేయూతమయ్యేను. ఆ మహాతపస్వి అనుగ్రహముతో ఆ సోదరులు విజయనగరమున హిందూ సామ్రాజ్యము స్థాపించిరి" (ప్రసాదరాయకులపతి: ఆంధ్ర భాగవత విమర్శ, పుట.26.) అని విజయనగర సామ్రాజ్యం గురించి తెలిపాడు.

ఇక రాచకొండ పాలకులను గురించి వివరిస్తూ "ముమ్మడి సింగమ నాయకుని కాలమున కించుక పూర్వము నుండియే బీదర్ రాజధానిగా పరిపాలించుచుండిన బహ్మనీ సుల్తానులకును రాచకుండ దుర్గాధిపతులకును వైరానలము ప్రజ్వరిల్లినది. అహ్మద్ షా రాజ్యకాలము చివర తెలంగాణముపై మహమ్మదీయులు దండెత్తి రాచకొండ రాజ్యాధిపతుల కోటలను కొన్నింటిని పట్టుకొనిరి. అహ్మద్ షా అనంతరము బహ్మనీ సుల్తానులకును, రాచకొండ రాజ్యాధిపతులకును ఎన్నో యుద్ధములు జరిగినవి. వానితో తెలంగాణము నిప్పులపుంతయైనది." (పైదే, పుట.26.) ఈ సంక్షోభ కాలంలో పోతన ఓరుగల్లులో ఉండి ఉంటాడని చరిత్ర ద్వారా ఊహింపవలసి ఉందని పరిశోధకుడు పేర్కొన్నాడు.

మతపరిస్థితులను గురించి వివరిస్తూ పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు వీరశైవం వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారని, అదే సమయంలో వీర వైష్ణవంను కూడా కొందరు ప్రచారం చేశారని దీనితో మతపరంగా ప్రజలమధ్య తీవ్రమైన ఘర్షణలు ఏర్పడ్డాయని తెలిపాడు. శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ మతస్తులకు నిరంతర వాద ప్రతివాదాలు జరుగుతున్న కాలంలో ఉత్తర భారత దేశం నుండి మహమ్మదీయుల దాడి ప్రారంభమయ్యిందని, వారి విజృంభనకు హైందవుల అనైక్యం తోడు కావడం వల్ల ఉత్తరభారత దేశంలో ఇస్లాం మతం వ్యాప్తి చెందిందని వారి రాజ్య స్థాపనకు మతం ఒక్కటే వేగంగా వ్యాప్తి చేసేదిగా మారిందని వివరించాడు.

పోతనకాలం నాటికి రాజకీయంగా, మతపరంగా గందరగోళంగా ఉందని తెలిపాడు. పోతన అద్వైతి అని అద్వైతులలో చాలావరకు శివపూజాధురంధులు అని పేర్కొన్నాడు. అప్పటికే తిక్కన హరిహరనాథ తత్వం కూడా ప్రజలను అస్పష్టపరిచిందని తెలిపాడు. ఇక నాటి సాహిత్య పరిస్థితులను గురించి కూడా వివరించాడు. హింసాత్మకంగా వీరశైవంతో ఆట్టుడికి పోతున్న దేశానికి తిక్కన ధర్మాద్వైత మార్గాన్ని ప్రసాదించినాడని, కాని అద్వైతజ్ఞానం సామాన్య జనులకు అందరికి అందుబాటులోకి రాలేదని, అందుకై జ్ఞాన భక్తిని కలిగించే మధుర కవిత్వం రచించినట్లయితే అది ప్రజలందరిని స్పందింపజేస్తుందని, ప్రజల లౌకిక జీవితంలో ప్రశాంతి నెలకొనెలా చేస్తుందని వివరించాడు.

పోతనామాత్యుడు శైవ వైష్ణవ పక్షపాత రహితడై అద్వైతమార్గాన్ని అనుసరించి, మహోన్నత భక్తి భావ ప్రేరణతో శ్రీరాముడు భాగవతం నిర్మించమని ఆదేశించటంతో మహాకావ్యాన్ని రచించడానికి పూనుకొనడం జరిగిందని వివరించాడు. పరిశోధకుడు ఆంధ్ర భాగవతము ఆధారంగా పోతన వ్యక్తిత్వాన్ని వివరించాడు. పోతన తల్లితండ్రులు శైవులని, అతని కుటుంబంలోని వారందరు శైవమతాన్ని అనుసరిస్తున్నవారని, శైవమతంతో వారికి అత్యంత సన్నిహిత సంబంధం ఉందని పేర్కొన్నాడు. "ఈ శివారాధనము వారి కుటుంబములో నొక క్రమాగత సంప్రదాయముగా కానవచ్చును. పోతన వంశములోని కేసన మల్లన కవులకు శైవాచార్యుడగు ఇవటూరి పర్వతాలు గురువగుటయు స్మరణీయాంశము. వీరభద్ర విజయము పోతనార్యుని బాల్య రచనముగా నంగీకరించిన ఆతడివటూరి సోమనాథాభ్యుని శిష్యుడగును. ఏదైనను పోతన కుటుంబమునకు శైవముతో సన్నిహిత సంబంధము కలదని అంగీకరించి తీరవలెను." (పైదే, పుట. 351.)

ఇతడు కూడా రాజాశ్రయాన్ని ఆశించి భోగినీ దండకం రచించాడని తరువాత కాలంలో రాజాశ్రయాన్ని వదలి వైష్ణవమతంతో సన్నిహితుడయ్యాడని పేర్కొన్నాడు.

పోతన రాజులను దూషించడానికి గల కారణాలను వివరింపడానికి ప్రయత్నించాడు. ''ఇమ్మను జేశ్వరాధమ' అను పద ప్రయోగాన్ని వాడటానికి కారణం ఆనాటి రాజులు పై సదభిప్రాయం పోతనకు లేదని తెలిపాడు.

పోతన కావ్యంలో ప్రతిఫలించిన సమాజాన్ని వివరించాడు. తమను ఆశ్రయించిన కవులను పలువిధాలుగా సత్కారం చేయటం అనేది మన దేశంలో ఉన్నది. పోతన భాగవతం రచించే నాటికి ఆ సంప్రదాయం ఉన్నత దశలో ఉండేదని, అగ్రహారాలు, వాహనాలు మొదలైనవన్నీ రాజు కవులకు ఇచ్చేవాడని, ఇదంత కూడా కవులు తమకు ఇచ్చిన కావ్యాలకు ప్రతిఫలమని పేర్కొన్నాడు.

ఆనాడు ప్రజలను ఇబ్బంది పెట్టినవాటిని వివరిస్తూ 'నిరంతర యుద్ధ భయమునకు తోడుగా దొంగల భయమొకటి నాడు విపరీతముగా నుండెడిది' అని వివరించాడు. ఇంకా భాగవతంలోని పలుపద్యాలను ఉదాహరణలుగా వివరిస్తూ నాడు సమాజంలో కనిపించే అంశాలను వివరించారు.

### 7.3.2. శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము

గ్రంథ రచయిత శ్రీధూళిపాళ శ్రీరామమూర్తి. ఇది కూడా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఇందులో కొన్ని అధ్యాయాలలో చారిత్రక విమర్శ కనిపిస్తుంది. ఇందులో పరిశోధకుడు బమ్మెర పోతన నివాసాన్ని గురించి చర్చించారు. పూర్వ పరిశోధకుల అభిప్రాయాలను చర్చించాడు. ఇతడు పోతన తెలంగాణ ప్రాంతంలోని ఓరుగల్లుకు సమీపాన గల బమ్మెర ప్రాంతంవాడని పేర్కొన్నాడు.

పోతన భోగినీ దండకాన్ని రాజాశ్రయం కోరి యౌవనదశలో రచించాడని అభిప్రాయపడ్డాడు. తరువాత పోతన భాగవతంలోని కొన్ని భాగాలు లభించక పోవడానికి గల కారణాలను వివరిస్తూ పోతన భాగవతం అంతా రచించాడని, అప్పటికీ ఆ భాగవతానికి ప్రతులు ఏమీ రాయలేదని, ఆ సమయంలోనే కొంత భాగం శిథిలమైతే వాటిని తక్కిన వారు పూరించారని అభిప్రాయపడ్డారు.

అయితే పోతనగారి భాగవతంలోని కొన్ని భాగాలు పూరించిన నారపరాజు పోతనకు ప్రియ శిష్యుడని, ఇతడు విశిష్టాద్వైతి అని తెలిపాడు. "నారపరాజు పోతనగారికి బ్రియశిష్యుడనని చెప్పుకొనియున్నాడు. అతనికి గురుభక్తి మిక్కుటము అతడు విశిష్టాద్వైతి. విశిష్టాద్వైత సిద్ధాంతము నందు నతనికి మిక్కిలి భక్తి కలదు." (శ్రీరామమూర్తి, ధూళిపాల: శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము, పుట.58.) ఇతడు పోతన వ్యక్తిగత జీవితాన్ని, మతాన్ని వివరించాడు. అయితే పోతన ఇతర రచనలను వదలి కేవలం భాగవతాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని పోతన జీవితం గూర్చి తెలిపాడు. దానికి గల కారణం పోతన ఇతర రచనలుగా పేర్కొంటున్న వీరభద్రవిజయం పోతన రచన కాదని ఇతని అభిప్రాయం. అందుకు గల కారణాలను వివరించారు. అందువలన పోతన మతాన్ని గూర్చి వివరించేటప్పుడు కూడా కేవలం భాగవతాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకున్నాడు. "పోతనగారు భాగవతము నందు తన తండ్రిని గూర్చి తనకు లక్కమాంబ ధర్మగేహిని గాగమనియే శైవశాస్త్రమతము గనియే అని వ్రాసెను. తల్లిని గూర్చి, సదాశివ పాద, యుగార్చనానుకంపానయ వాగ్భవానికిని-నని వ్రాసెను. అగ్రజాతు దేశ్వర సేవాకాముడు తిప్పన - యని యన్నగారిని గూర్చి వ్రాసెను. తన్ను గురించి మహనీయ మంజుల పులిన తలంబున మహేశ్వర ధ్యానంబు సేయుచుగించి దున్మీలిత లోచనుడనై యున్న యెడననియు స్కంధాంత గద్యలందు నిది శ్రీపరమేశ్వర కరుణా కవితా విచిత్రయనియు వ్రాసికొనియున్నాడు. ఈ మాటలన్నియు బోతనగారి యొక్కయు, నాయన వంశము యొక్కయు శివాభిమానమును నిరూపించుచున్నవనుట సత్యము." (పైదే, పుట.72-73.)

కానీ పోతన శైవుడైనప్పటికీ వీరశైవుడు కాడని స్మార్థ శైవుడని ఇతడు వివరించాడు. దానికి గల కారణాలను వివరించాడు. పరిశోధకుడు పోతనగారి జీవితాన్ని రెండు దశలుగా విభజించాడు. భాగవత రచనకు పూర్వం ఉన్న జీవితాన్ని వివరిస్తూ పూర్వ జీవితంలో రాజాశ్రయానికి ప్రయత్నించి, అందులో విఫలమై, రాజాశ్రయం మీద

విరక్తి పుట్టి హాలికవృత్తి అవలంభించాడని, తదనంతర కాలంలో భాగవత రచన చేశాడని తెలిపారు. పోతన భాగవత రచన కంటే పూర్వమే కవిగా ప్రసిద్ధిచెంది ఉంటాడని, అందు వలననే అప్పటికే పలువురు శిష్యులు పోతన దగ్గరకు వచ్చారని, దానికి నిదర్శనం పోతన భాగవతంలో శిథిలభాగాలను పూరించడం అని పేర్కొన్నాడు. ఇతడు భాగవతం అవతరించడానికి గల నేపథ్యాన్ని మాత్రమే వివరించాడు. మిగతా అధ్యాయాలలో ఆలంకారిక విమర్శనే అనుసరించాడు.

### 7.3.3. పాండురంగ మాహాత్మ్యము-రచనా సౌందర్యము

ఈ గ్రంథ రచయిత కొండా సుబ్బారావు. నాడు నెలకొని ఉన్న పరిస్థితులు రచనకు ఎలా దోహదం చేశాయో వివరించాడు. మొదట కాల పరిస్థితులు అనే పేరుతో నాటి రాజకీయ పరిస్థితులను వివరించాడు. నాడు ఎవరికి ఎక్కడ స్థాన బలం ఉంటే అక్కడ వారు చిన్నచిన్న రాజ్యాలను స్థాపించుకొని స్వతంత్రపాలన చేయడం ప్రారంభించారని, అలా ప్రారంభమైన వాటిలో అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1325లో రెడ్డి రాజ్యం స్థాపించాడని, తర్వాత కాలంలో ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలలో సింగమనీడు వెలమ సామ్రాజ్యాన్ని స్థాపించాడని, వీటితో పాటు 1336లో విజయనగర సామ్రాజ్యం స్థాపించగా, వీటికి తోడు ముస్లిం రాజ్యాం గుల్బర్గాలో నల్లావుద్దిన్ హసన్ గంగు 1347లో స్థాపించడం జరిగిందని వివరించాడు. ఇదంతా కూడా కాకతీయ సామ్రాజ్యం గతించిన తర్వాతనే జరిగింది. అప్పటిదాకా కాకతీయుల కాలంలో ఏక పాలన కింద ఉన్న రాజ్యం తక్కువ కాలంలోనే దక్షణ భారతం నాలుగు ప్రముఖ రాజ్యాలు స్థాపించబడ్డాయి.

కాని తరువాత కాలంలో శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన కాలంలో ప్రముఖ ప్రాంతాలను జయించి రాజ్యంలో సుస్థిరతను, శాంతిని స్థాపించినట్లు ఉంది. ఈ సుస్థిరత, ప్రశాంత పరిస్థితులు మత, సాహిత్య, కళారంగాలను ప్రభావితం చేశాయి. తక్కిన రాజ్యాలలో కూడా ఈ ప్రభావం చూపింది. అద్దంకిలో

ఎర్రాప్రగడ, కొండవీడు, రాజమహేంద్రవరంలో శ్రీనాథుడు ప్రముఖ కవులుగా ప్రసిద్ధి చెందారు. ఇక కృష్ణదేవరాయల కాలం తరువాత విజయనగర సామ్రాజ్యంలో పరిస్థితులు మారాయని, శ్రీకృష్ణదేవరాయలు "జైత్రయాత్రల వలన నాంధ్ర, కర్ణాట భూములపై శత్రువుల యెద్దడి తొలగి రాజకీయ యార్థిక సుస్థిరతలు చేకూరినవి. పాలక పాలిత వర్గము అందొకానొక నిశ్చిత యేర్పడినది. బ్రతుకున తమకెట్టి యెడుదుడుకులిక లేవను నొక ప్రశాంతి వారి మనసులలో గాఢముగా పాదుకొనెను. అన్ని వర్గముల వారికి, కూడు, గూడు, గుడ్డ సమృద్ధిగా లభించెను." (సుబ్బారావు, కొండా: పాండురంగ మాహాత్మ్యము రచనా సౌందర్యము, పుట.7.) దీనితో అక్కడి ప్రజలలో సుఖజీవనం పెరిగిపోయింది. తిండి లేకపోయినా రెండు, మూడు రోజులు సహించగలరు గాని, పువ్వులు లేకపోయితే ఆ నగర ప్రజలు ఒక్క క్షణమైన ఉండలేరని, ఈ విషయాన్ని విజయనగర పౌరుల గురించి ప్రత్యక్షంగా చూసిన పాశ్చాత్యుల రచనల ద్వారా తెలుస్తున్నాయని విమర్శకులు పేర్కొని ఉన్నారు.

సంఘంలో పెరిగిన భోగలాలసతను అదుపు చేసి ధర్మాన్ని, భక్తినీ, నీతినీ, ప్రకాశింప చేయవలసిన సమయం వచ్చిందని ఇంతకు పూర్వం భాగవతాది గ్రంథాలు చేయవలసిన పనిని భక్తి ప్రబోధక కావ్యం చేయవలసిన సమయం ఆసన్నమైనదని, ప్రజలను తిరిగి నీతి, ధర్మ, ఆధ్యాత్మికం వైపు మళ్ళించవలసిన ఆవశ్యకత ఆనాటి కాలానికి ఏర్పడింది. ఆ సమయంలో పాండురంగ మాహాత్మ్యం రచింపబడి, ఆలోటు తీర్చిందని పరిశోధకుడు అభిప్రాయపడ్డారు.

ఈ గ్రంథం మాత్రం వ్యక్తిగత ప్రయోజనం కోసం కవి రచించాడని పేర్కొన్నాడు. దానికి గల కారణాలను వివరించారు. గ్రంథాన్ని రచించిన తెనాలి రామలింగ కవి శ్రీనాథుడిలాగా ప్రచారాసక్తి గల మనస్తత్వం ఉన్నవాడని, రాజాస్థానాలకు తిరిగే స్వభావం కలిగినవాడని పేర్కొన్నాడు. "అఖిల భూమీ పాలకా స్థాన కమలాకరోదయ తరుణ సూర్యోదయడు గదా! తొలుత శైవుడుగా శైవగాథను రచించి శైవాచార

పరాయణున కంకితమిచ్చి కొండవీటికి జేరినాడు. అంతటితో తృప్తాస్మియని యనుకొనలేదు. కొట్టిన యేనుగు కుంభస్థలమునే కొట్టవలెను. రాయలవారి యాస్థానము పైననే కన్నుపడినది. కొండవీటి పాలకుడగు నాదెండ్ల గోపమంత్రి ద్వారా సాళువ తిమ్మరుసును పట్టి విజయనగరము జేరియుండవలెను, కాని పరంపరి గతమైన తన శైవమే తన మనోరథ సిద్ధికడ్డుగా నిల్చెనేమో! ప్రభుసమ్మతమైన వైష్ణవమును స్వీకరించినాడు. మత స్వీకార మాత్రమున పని జరిగినట్లు లేదు. ఏదేని యొక ప్రముఖ వైష్ణవ ప్రబంధమున పూర్వముగా నిర్మించిన బోతన ప్రయోజనము నెరవేరునేమో? ఐహికాముష్మికములు రెండును గలసివచ్చును. తీర్థస్వార్థముల మేలుకలయికగా భావించి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యకృతిని నిర్మించెను.'' (పైదే, పుట.9.)

ఇక అప్పటికి నెల కొన్న పరిస్థితులు కూడా ఆ గ్రంథం వెలువడటానికి కారణమైనవని తెలిపాడు. రామకృష్ణుని జీవితాన్ని గురించి ప్రస్తావిస్తూ రామకృష్ణుడు క్రీ.శ 1495 - 1500 నడుమ జన్మించి ఉంటాడని తెలిపాడు. దీనికి అతడు పలువురి విమర్శకుల రచనలను ఆధారంగా తెలిపాడు. ఇక పాండురంగ మాహాత్మ్యము క్రీ.శ. 1550 ప్రాంతములో రచింపబడి ఉంటుందని తెలిపాడు. అనంతరం రామకృష్ణ కవి ఇంటిపేరు, బంధువులను గురించి కూడా వివరించాడు. అయితే ఇతడు రామకృష్ణకవి అసలుపేరు 'రామలింగ'డని తెలిపాడు. 'తెనాలి రామపండితుని పూర్వీకులందరు శైవాచార పరాయణులని, రామకృష్ణ కవి తండ్రి రామయ్యగారు తెనాలి రామలింగేశ్వర స్వామి భక్తుడని, ఆస్వామికి ఉత్సవ మూర్తులను నిర్మించి యిచ్చాడని, ఆ స్వామి పేరే బహుశః తన పెద్దకుమారునికి పెట్టుకొన్నాడని ఆ పుత్రుడే రామలింగం అని తెలిపాడు. ఇతడు (రామలింగయ్య) పాలగుమ్మి యేలేశ్వరుని దగ్గర శిష్యరికం చేసి తరువాత కొంతకాలం వరకు శివభక్తుడుగానే ఉన్నాడని తరువాత ఉద్భటుని గాథను కావ్యంగా రచించి శైవాచారపరుడైన ఊరదేశయ్యకు అంకితమిచ్చాడని తెలిపాడు.

తర్వాత రామలింగడు భక్తితోనే రచన చేసి పలు కారణాలవలన ఈ గ్రంథాన్ని ఇతరుకు అంకితం చేశాడని తెలిపాడు. కాని అప్పటికే విజయనగరం కవులకు ప్రసిద్ధిగా ఉండటం గమనించి అక్కడికి ప్రవేశించడానికి అతడు తన మతాన్ని మార్చుకున్నాడని తెలిపాడు. కొందరు విమర్శకులు రామలింగడు, రామకృష్ణుడు విభిన్న వ్యక్తులని అభిప్రాయాలను పరిశోధకుడు తోసిపుచ్చాడు. ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మహాత్మ్య గ్రంథాలను రచించిన వ్యక్తి ఒక్కడే అని, అతడు రామకృష్ణ కవి అని తెలిపాడు. అతడి కుటుంబం వారందరు కూడా శైవమతాన్ని అనుసరించారని రామకృష్ణ కవి కూడా మొదట శైవపరాయునుడుగా ఉన్నాడని పేర్కొన్నాడు.

రామకృష్ణుని రచనలను గురించి ఆశ్రయదాతలు గురించి క్లుప్తంగా వివరించాడు. గ్రంథంలో కనిపించే సామాజిక పరిస్థితులను ఉదాహరణలతో వివరించాడు. సంఘంలో తండ్రి సంపాదించిన ఆస్తిపాస్తులు ఊరక కరిగించుకుంటు చెడు నడతల నడిచే నిగమశర్మ వంటి వ్యక్తులెందరో ఉన్నారని పేర్కొన్నాడు. కపటవేషంతో ప్రజలను మభ్యపెట్టే దొంగ సన్యాసులు ఉన్నట్లు, పాండురంగ మాహాత్మ్యంలోని విషయాలను తెలిపాడు. గ్రంథంలో కనిపించే పలు అంశాలను ఆనాటి సాంఘిక పరిస్థితులను ఏవిధంగా తెలియచేస్తున్నాయో వివరించాడు. ఇక ఆర్థిక సంబంధమైన విషయాలను కూడా వివిధ పద్యాలను ఉదాహరిస్తూ వివరించారు. ఇంకా విద్యావిషయాలు, ఆచారవ్యవహారాలు, అలవాట్లు, మొదలైన సాంస్కృతిక అంశాలను తెలిపాడు.

### 7.3.4. విజయ విలాసానుశీలనము

ఈ గ్రంథ రచయిత కలిదిండి వెంకట రామరాజు. ఇతడు చేమకూర వేంకటకవిని గురించి, అతని రచన విజయవిలాసం గురించి ఇందులో వివరించాడు. గ్రంథ రచనకు గల కారణాలను, చారిత్రక నేపథ్యాన్ని చర్చించాడు. చేమకూర వేంకటకవికి వేంకటరాజు, వేంకటప్ప, వెంకన్న అనే వ్యావహారిక నామాలు కూడా కనిపిస్తున్నాయని తెలిపాడు. ఇతడి కాలం గురించి క్రీ.శ. 1614- 1633 సంవత్సరాల నడుమ తంజావూరు రాజ్యాన్ని

పరిపాలించిన రఘునాథ నాయకుని ఆస్థానకవి అని తెలిపాడు.

ఇతడు "విజయ విలాసాశ్వాసాంత పద్యములలో చేమకూర లక్ష్మణామాత్య తనయ --- " అని చెప్పికొనుటను బట్టి యతడు లక్ష్మణామాత్యుని కుమారుడని తెలిస్తుందని, తన గ్రంథంలో ఎచ్చట కూడా తన కులగోత్రాదులను గురించి ముచ్చటించ లేదని పేర్కొన్నాడు. కాని ఇతడు మాత్రం శూద్ర కులస్తుడని పేర్కొన్నాడు. అందుకు చేమకూరి వేంకటకవి రచన నుండి ఉదాహరించారు. చేమకూర వేంకటకవి రఘునాథుని సేనా నాయకులలో ఒకడై శౌర్య ధైర్యాలతో ఆ రాజు జైత్రయాత్రలలో పాల్గొనేవాడని, తన ప్రబంధాన్ని ఆ రాజుకు అంకితం కావించాడని పేర్కొన్నాడు.

పరిశోధకుడు చేమకూర వేంకటకవి గురించి, అతని కులం గురించిన చర్చకు సంబంధించి పలువురి పరిశోధకుల అభిప్రాయాలను తన పరిశోధనలో ఉట్టంకించి చర్చించాడు. చేమకూర వేంకటకవి రఘునాథనాయకుని ఆస్థానంలో ఉన్న ఆంధ్రదేశీయుడని, విశిష్టాద్వైత మతాభిమాని అని పేర్కొన్నాడు. దానికి గల కారాణాలు "వాసవి త్రిదండి వేసము వేసి' అని యర్జునుని సన్యాసి వేషమును విశిష్టాద్వైత మత సంప్రదాయానుగుణముగ వర్ణించుటను బట్టి యా కవీంద్రునకు గల విశిష్టాద్వైత మతాభిమానము వెల్లడియగుచున్నది. రఘునాథభూపాలునకు కూడ నా మతము నందట్టి ప్రత్యేకాభిమానము కలదు." (వెంకటరామరాజు, కలిసిండి: విజయ విలాసానుశీలనము, పుట.7.)

తన విజయవిలాస కావ్యాన్ని క్రీ.శ. 1620 ప్రాంతాన రఘునాథనాయకుడికి అంకితంచేసి ఉండవచ్చని, ఆ కృతిని సమర్పించే కాలానికి అతని తమ్ములు, సుతులు హితులు రాజోద్యోగాలు చేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఆ విషయం 'తమ్ములు సుతుల్ హితులు గూడ మమ్ము గొలిచి' అని రఘునాథనాయకుని నోటినుండి వెలువడ్డ వాక్యాన్ని బట్టి తెలుస్తుందని పేర్కొన్నాడు. అనంతరం కృతిపతి వంశచరిత్రను వివరించాడు. తంజావూరి నాయక రాజులు విజయనగర ప్రభువులను అన్ని విధాలా అనుకరించే ప్రయత్నిం చేశారని, విజయనగర సామంతరాజులలో తంజావూరు

నాయక రాజులు అగ్రగణ్యులని, వీరు బహుభాషా కోవిదులు, కవులు, కవిపండిత పోషకులు, భక్తి హృదయులై ఉన్నారని, వీరు చతుర్థ కులస్తులై ఉన్నట్లు నాటి శాసనాల ద్వారా, ప్రబంధాల ద్వారా తెలుస్తున్నదని పేర్కొన్నాడు.

చోలగుడు అనే వ్యక్తి కొల్లెడ (కొలరు) సంగమ స్థానాన ఉన్న ఒక ద్వీపానికి రాజుగా ఉండేవాడని, ఇది ఇప్పటి దేవికోటకు సమీపంగా ఉందని, ఈ రాజు పరమ దుర్మార్గుడై ప్రజలను అనేక విధాలుగా భాధించేవాడని, అతడిని అరికట్టడానికి రఘునాథనాయకుడు చాలా ప్రయాసపడి చివరికి అతడిని శిక్షించి ప్రజలను రక్షించాడని తెలిపాడు. తరువాత వంశపారంపర్యంగా వస్తున్న విజయనగర సింహాసనానికి అడ్డు తగిలిన జగ్గరాజు అనే రాజును తోపూరు యుద్ధంలో సంహరించాడట. ఈ విజయాలకు చిహ్నంగా రఘునాథ నాయకుడు తంజావూరులో విజయ విలాసము అనే ఒక సుందర భవన రాజ్యాన్ని నిర్మించాడని, దానికి ప్రతీకగా వేంకటకవి విజయవిలాస ప్రబంధ నిర్మాణాన్ని చేసినట్లు తోస్తుందని పరిశోధకుడు తెలిపాడు.

విజయ విలాస గ్రంథంలో కూడా ఆనాటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు చిత్రించబడ్డాయని తెలిపాడు. ఈ విజయవిలాస కావ్యములో “నాటి యాంధ్రుల యాచార వ్యవహారములు, వేషభాషలు, నుత్సవములు, నాటపాటలు, సంగీత నాట్యాది కళాప్రతిభలు, ప్రభువుల పరిపాలనారీతులు, దానధర్మములు, వివిధ వాద్య విశేషములు, వైవాహిక వైభవములు, వియ్యాలవారి మర్యాదలు, వారి సయ్యాటలు, పడకటింటి ముచ్చట్లు, విలాస వస్తువులు, నాయుధ విశేషములు, పుణ్య తీర్థములు మున్నగునవి సందర్భోచిత పద్ధతులలో మనోహరముగా సూచింపబడినవి” అని పేర్కొన్నాడు. (పైదే, పుట.356.)

తంజావూరు తమిళదేశంలో ఉన్నప్పటికీ, చేమకూర వేంకటకవి ఆంధ్రుడైనందు వలన స్వజాతీయాభిమానంచేత స్వజాతీయ సంస్కృతిని విజయవిలాసంలో చిత్రించాడని పేర్కొన్నాడు. ఇక ఆనాడు నెలకొనియున్న మతపరిస్థితులును వివరించాడు. తంజావూరు నాయకరాజులైన చెవ్వప్ప యచ్యుతప్ప, రఘునాథ, విజయ రాఘవనాయకులు వైష్ణవ మతాభిమానులుగా వాసికెక్కారు.

తల్లికోట యుద్ధం తర్వాత విజయం సాధించిన ముస్లింలు దక్షిణ హిందూ దేశాన్ని పరివిధాలుగా ఇబ్బందులకు గురిచేశారు. వారికి స్వమతంపై అత్యంత్య అభిమానం, పరమతంపై విపరీతమైన ద్వేషం ఉండేవని, అటువంటి మతద్వేషంతో ఆ ముస్లింలు హిందూ దేవాలయాలను బడగొట్టి, విగ్రహాలను పగలగొట్టి తరతరాల నుండి కొనసాగుతూ వస్తున్న పురాతన భారతీయ సంస్కృతిని నాశనం చేయటానికి ప్రయత్నించారని, హిందువులు పవిత్రంగా పూజించే గోవులను వధించారని, వారి దుష్కార్యాలను కొన్నిటిని చేమకూర వేంకటకవి ప్రత్యక్షంగా చూసి మరికొన్నిటిని విని ఉన్న కారణంతో వాటిని సందర్భానుగుణంగా తన పద్యాలలో ధ్వనింపచేశాడని పరిశోధకుడు వివరించాడు.

ఆనాడు వైష్ణవ మతంతో పాటు శైవమతం కూడ కొంత వ్యాప్తిలో ఉన్నట్లు, వీటితో పాటు ఇంకా మహమ్మదీయ, క్రైస్తవ మతాలు కూడా కొంత వ్యాప్తి చెందాయని, తంజావూరి నాయకరాజులు మాత్రం వైదికమతం పై అభిమానం కలవారై కృష్ణా గోదావరీ ప్రాంతాల నుండి వేదపండితులను రప్పించి వారిచేత యజ్ఞయాగాదులను చేయించారని పేర్కొన్నాడు. ఆనాటి ప్రజల వేషములను రాజులు ధరించెడి వస్త్రధారణను, స్త్రీ వస్త్రధారణ మొదలగు అంశాలను వివరించారు. తంజావూరి రాజులు కూడా ప్రాచీన సంప్రదాయబద్ధమైన సంస్కృతి ధర్మాన్ని కాపాడారని పేర్కొన్నాడు. నాయక రాజుల పరిపాలనా సమయంలో సకళ కళలు వర్ధిల్లినవని, సంగీత సాహిత్యాది లలితకళలు వృద్ధిపొందాయని, రాజులు కవులను పండితులను

పోషించడమే కాక వారు కూడా కవులై అనేక గ్రంథాలను రచించి శాశ్వత కీర్తిని పొందారని తెలిపాడు. రఘునాథనాయకుడు నాటకశాలలను నిర్మించి ఘనత వహించినట్లు వేంకటకవి వర్ణించాడని తెలిపాడు. నాడు వ్యాప్తిలో ఉన్న క్రీడలను వేంకటకవి విజయవిలాసములో వర్ణించిన తీరును పేర్కొన్నారు. రాజకీయ పరిస్థితులను వివరిస్తూ తంజావూరు నాయకరాజులు విజయనగర సామ్రాజ్య పాలనా పద్ధతులను అవలంభించారని తెలిపాడు.

## 7.4. శైవవైష్ణవేతర రచనలపై వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలు

కొన్ని రచనలు శైవ, వైష్ణవ రచనలకు సంబంధంలేనివి ఉన్నాయి. ప్రాచీన సాహిత్యంలో కూడా కొందరు కవులు మతానికి వ్యతిరేకంగా సంఘంలో ఉన్న దురాచారాల కోసం పాటుబడ్డారు. అలా మతానికి, సంఘ సంస్కరణకు పాటుబడ్డ వారు వేమన. అటువంటి వారిపై చారిత్రక విమర్శతో రచనలు వచ్చాయి.

### 7.4.1. వేమన

ఈ గ్రంథ రచయిత రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ. ఈ గ్రంథంలో వేమన దేశకాలాలను, వేమన సంసార స్థితిగతులను, మత పరిస్థితులను వేమన పద్యాల ద్వారా వివరించారు. వేమన పద్యాలు శతకాలైనప్పటికీ సంఖ్యా నియమాన్ని పాటించలేదు. పద్యాల సంఖ్య కూడా పెరగడానికి గల కారణాన్ని వివరించారు. "వేమన యొక్క శతకము, సహస్రము అను సంఖ్యా నియమమునకు లోపడక స్వతంత్రముగా నవకాశము వచ్చినప్పుడెల్ల పద్యములు చెప్పిన వాడనియు వానిని విన్న వారిలో నభిమానము గల వారప్పుడప్పుడు గుర్తుచేయుచు వచ్చిరనియు, ఆతనికి తరువాత గొందరు గురుభక్తితో నతని పద్యములన్నియు జేర్చి కూర్ప బ్రయత్నించిరనియు నమ్ముట క్షేమము" (అనంతకృష్ణశర్మ, రాళ్లపల్లి, వేమన, పుట.8.) అని పేర్కొన్నారు.

వేమన సాహిత్య నియమాలను పాటింపదగినంత చదువు చదవలేదని అనంతకృష్ణ శర్మగారి అభిప్రాయం. దానికి గల కారణం వేమన పద్యాలేనని పేర్కొన్నాడు. వేమన కాలాన్ని గురించి, నివసించిన ప్రాంతం గురించి వివరించారు. ఇందుకోసం పలువురు పరిశోధకులు చేసిన పరిశోధనలు ఆధారంగా చేసుకొని చర్చించారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, వంగూరి సుబ్బారావుగారు, సి.పి. బ్రౌను, క్యాంబెల్ మొదలైన వారి పరిశోధనలను చర్చించారు. చివరగా వేమన '17 వ శతాబ్దియాదియందు వేమన్న యుండినని యూహించుటకు అనుకూలముగా దోచుచున్నద'ని పేర్కొన్నారు. ఇక వేమన ప్రాంతం గురించి వివరిస్తూ "దత్తమండలముల వాడనుట న్యాయమని వ్రాసియుంటిని దత్తమండలములనగా కదిరి తాలూకా యిప్పుడ నంతపురమునకు జేరుటజేత ఈ జిల్లాకును కొంత వేమన ప్రసాదము దొరికిన శాస్త్రమైనదే కాని యంతకుముందు అనంతపురము బళ్ళారి జిల్లాలకితని సంబంధము కానరాదు. కావున నితడు కడప, కర్నూలు జిల్లాల వాడని బ్రౌను, కాంబెల్ మొదలగు వారివలె నేనును తలచితిని" (పైదే, పుట.40.)అని పేర్కొన్నారు.

వేమన ప్రాంతాన్ని నిర్ణయించడానికి వేమన పద్యాలలోని పదాలును ఉదాహరణలుగా పేర్కొన్నాడు. మంకు, తారాడు, సంబళము, సొడ్డు వంటి పదాలు దత్తమండలాల్లో ఎక్కువగా వాడతారని వివరించాడు. వేమన దాదాపు దక్షిణ దేశమంతా కూడా సంచరించాడని, తమిళనాడులో కూడా వేమనమఠాలు ఉన్నట్లుగా కూడా పరిశోధకుడు విన్నాడని వివరించారు. ఇతడు కాపులలోని రెడ్డికులానికి చెందినవాడని పేర్కొన్నాడు. వేమన మతాన్ని గురించి వివరించాడు. వేమన అన్ని మతాల లోపాలను తన పద్యాలలో పేర్కొన్నాడు. కాని మొదట వేమన శైవమతాన్ని అనుసరించాడని తెలిపాడు.

ప్రజలలో పలు రకాలైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా బసివిరాండ్రు అనే ఒక కొత్త వర్గం ప్రారంభమైందని దానికి గల కారణాలను పేర్కొన్నారు. బసివిరాండ్ర వలన సమాజంలో వ్యభిచారం పెరిగి ఏకపత్నీవ్రతం పురుషలక్షణమే కాదనుకొనే పరిస్థితి ఏర్పడిందని, వ్యభిచారం చిన్నవారికే దోషం కాని పెద్దవారికి అదంత దోషం కాదనే పరిస్థితి నెలకొనిందని, వేమన ఇటువంటి పరిస్థితుల పెరిగినవాడని, యౌవన వయసులో వేశ్యాలోలుడయ్యాడని వివరించారు. తరువాత ఇతని కుటుంబంవారు వేమనను సరైన మార్గంలో పెట్టడానికి వివాహం చేశారని, వేమన వివాహం కూడా సుఖంగా కొనసాగలేదని మధ్యలోనే ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. బిడ్డల వలన కూడా ఆనందం పొందినట్లు కనిపించలేదని తెలిపాడు.

కొంతకాలానికి వేమన దగ్గర ఉన్న ధనమంతా ఖర్చయిపోయి పేదవాడుగా మారాడని, అటువంటి సమయంలో వేమన చౌక లోహాలను వెండి బంగారాలుగా మార్చు రసవాద విద్యపై మనసు పోయిందని తెలిపాడు. దీనికోసమే కంసాలి గురువును సంప్రదించాడు. కాని ఈ రసవాదవిద్య రహస్యమైనది కావడం వలన కంసాలి గురువు కూడా వేమనకు ఆ విద్యను పూర్తిగా భోధించినట్లుగా భావించరాదని తెలిపాడు. కాలములో పలుమార్పులు రావడంతో మతపరంగా కూడా మార్పులు వచ్చాయని తెలిపాడు. "బ్రహ్మణులు నిజముగా మేము భూలోక దేవతలమనియే తలంచిరి. జంగాలు తాము సాక్షాత్తు జంగమ పరమశివులనియే నమ్మిరి. కాని బట్టలు గట్టిన మాత్రమున అందరును తమ్ము పూజింపవలయుననియు లేకున్నవారు పతితులగుదరియు, ఇంచుమించు ప్రతిసన్యాసియు విశ్వసించెను. (పైదే, పుట.77.)

చివరకు వేమన సంసార ప్రపంచం బైరాగుల ప్రపంచంలో ప్రవేశించాడ తెలిపాడు.

### 7.4.2. ప్రజాకవి వేమన

ఈ గ్రంథ రచయిత గోపి. ఈ గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఇందులో కూడా పరిశోధకుడు వేమన సాహిత్యాన్ని చారిత్రక నేపథ్యంతో విశ్లేషించాడు. వేమన పేరుతో ఉన్న పద్యాలన్నింటినీ సేకరించి వాటిలో ఏయే పద్యాలు వేమన రచించాడో పేర్కొన్నాడు. బ్రౌను సేకరించిన పద్యాలు ఇంకా పలుచోట్ల లభించిన పద్యాలను తన పరిశోధనకు స్వీకరించినట్లు తెలిపాడు. బ్రౌన్ 38 తాళ పత్ర ప్రతులను సేకరించి ఆ పద్యాలన్నింటిని రాతగాండ్ల చేతకాగితాల మీద కాపీ చేయించి భద్రపరిచాడు. ఆవిధంగా 16 కాగితపు ప్రతులుగా ఏర్పడ్డాయని వాటినే తన పరిశోధనకు స్వీకరించాడని తెలిపాడు.

వేమన గురించి వాడుకలో ఉన్న కథలను తన మాటల్లో క్లుప్తంగా వివరించాడు. అందులో కోమటి వేమన్న కథ, గొల్లడు, గోసాయికథ, వేమన్న వేశ్యాలోలత్వం, అభిరామయ్య కథ, వేమన మహిమలు మొదలగు కథలను గురించి పేర్కొన్నాడు. వేమన్న చూపిన మహిమల గురించి వివరిస్తూ, కాశీకి బోయినా కాసు రాగిగానే మిగిలిందని, అట్లే పుచ్చకాయ పొలంలో పుత్తడిపంట పండిచ్చాడని, వేమన చేసిన అల్లరిపనికి కూడా అంతరార్థం ఉందని, వేమన్న వింత స్నానం చేశాడని... ఇటువంటి మహిమలు పేర్కొన్నాడు. ఇవన్ని అప్పటికి జనవ్యవహారంలో ఉన్నాయని తెలిపాడు. గోపిగారు కూడా వేమన కాల నిర్ణయాన్ని గూర్చి చర్చించారు. వీరు అందుకోసం రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వంగూరి సుబ్బారావు, కాంబెల్, వేటూరి ప్రభాకరశాస్త్రి మొదలైన వారి వాదనలను చర్చించారు. ఇతర కవులు తమ అవతారికల్లో 'వేమన' గురించి చర్చించిన విషయాలను కూడా కొంత పరిశోధించాడు. మ్యాక్ డొనాల్డ్ అనే పరిశోధకుడు వేమన క్రీ.శ. 1652 వ సంవత్సరానికి చెందినవాడని పేర్కొన్నాడని, ఈ కాలాన్ని పలువురు పరిశోధకులు అంగీకరించినట్లు తెలిపాడు. కాని ఈ కాలానికి సంబంధించిన విషయాన్ని చర్చించినపుడు పరిశోధకుడు ఎక్కువగా పూర్వ పరిశోధకుల అభిప్రాయాలను పేర్కొని తన అభిప్రాయాన్ని స్పష్టంగా పేర్కొనలేదు. ఇక వేమన

ప్రాంతాన్ని కూడా చర్చించారు. అందులో ఇతడు పూర్వీకుల పరిశోధనలను పరిశీలిస్తూ పూర్వ పరిశోధకులు తెలిపిన అంశాన్ని అంగీకరించాడు. ఇతడు "వేమన తన పద్యాల్లో వాడిన పదజాలం వల్ల బసివిరాంధ్ర ప్రసక్తివల్ల, స్థలనామాల వల్ల రాయలసీమ వాడనే నిర్ణయం ప్రస్తుతానికి చెయ్యవచ్చు" (గోపి, ఎన్, ప్రజాకవి వేమన, పుట.145.) అని వివరించారు.

వేమన పద్యాల నేపథ్యాన్ని వివరించాడు. దాదాపు పదహారవ శతాబ్దపు చరిత్ర, పదిహేడవ శతాబ్దపు చరిత్రను వివరించారు. పదహారవ శతాబ్దంలో జరిగిన వివిధ రాజకీయ సంఘటనలను వివరించాడు. క్రీ.శ. 1565 సంవత్సరంలో జరిగిన తల్లికోట యుద్ధం ఆంధ్రదేశంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. దీనితో విజయనగర సామ్రాజ్యం చావుదెబ్బ తిన్నదని, తరువాత వంద సంవత్సరాలు నామమాత్రంగా కొనసాగినట్లు తెలిపాడు. తల్లికోట యుద్ధానికి పూర్వం ముస్లిం రాజులు రాజ్యకాంక్షతో రాజ్యవిస్తరణకు యుద్ధాలు చేశారని, కాని తల్లికోట యుద్ధసమయానికి ముస్లిం రాజులు మతప్రాతిపదిక మీద ఏకమై అళియరామరాయలను ఉమ్మడిగా ఎదుర్కొన్నారని తెలిపాడు. అనంతరం 1570లో తిరుమల రాయలు సింహాసనాన్ని అధిష్టించి పాలనా సౌకర్యం కోసం మూడు భాగాలుగా విభజించాడని తెలిపారు. తరువాత 17 వ శతాబ్దంలో దక్షిణ దేశాన ఉన్న తంజావూరు మధుర రాజ్యాలను గురించి వివరించాడు. అనంతరం నాటి గోలకొండ రాజ్యాన్ని ముస్లిం రాజులను గురించి వివరించాడు. ఈ రాజకీయ పరిస్థితులన్నీ కూడా నాటి వేమన్న కవిత్వం పై ప్రభావం చూపాయని ఉదాహరణ పూర్వకంగా వివరించాడు. ఆ కాలంలో కొందరు రాజులు కవుల సొమ్మును ఎగువేసే మనస్తత్వం వారు కూడా ఉన్నారని తెలిపాడు.

"గండమైన దొంగకవుల సొమ్మెగవేసి,
కండ కావరాన కదియ బలసి
గండుకుక్క వలెను కాటుక దిరుగును."

అనే పద్యాన్ని రాజుల కవులకు ధనాన్ని ఎగవేసే విధానాన్ని తెలిపాడు. వేమన

పద్యాలలో రాజులను, వారి స్వభావాన్ని బట్టి మూడు రకాలుగా వర్గీకరించాడు. 1. పిరికిపందలు 2 దుర్మార్గులు 3 అజ్ఞానులు నాడు పరిపాలించిన రాజులు ప్రజలకు కనీస రక్షణ అందించలేని అసమర్థులని తెలిపారు. వేమన పద్యాల ద్వారా వేమన కాలం నాటి మతపరిస్థితులను వివరించారు.

వేమన కాలానికి "గురువు" అనే పదానికి యజమాని అన్న అర్థం వచ్చి చేరింది. రాజ్యానికి రాజే గురువు అనే వాడుక పుట్టింది. ఆధ్యాత్మిక విలువల వలన కాకుండ సంఘంలో హోదా సంపత్తులు గలవారు కూడా గురువులుగా పరిగణనలోనికి వచ్చారని తెలిపారు. ఈ గురువులు "గురు దక్షణ పేరుతో ప్రజల నుండి అనేక రకాలైన పేర్లతో పన్నులు వసూలు చేసేవారు. ప్రజలు భక్తితో ఇచ్చే కానుకలతో వీరెప్పుడూ తృప్తి పడేవారుగారు. కట్టుబాట్లు తప్పిన వారి నుండి వీరు ధనం వసూలుచేసే పద్ధతి నిర్దయగా ఉండేది. ఇవ్వలేని వాని ముఖాన పేడనీరు చల్లి అవమానించేవారు. అప్పటికీ వాడు చెల్లించ లేకపోతే వారి పిల్లల్ని లాక్కునేవారు. ధనం ముట్టేదాకా వారితో వెట్టిచాకిరి చేయించుకునేవారు. ఒకప్పుడు ధనానికి బదులుగా వాడి భార్యను లాక్కుపోయిన సంఘటనలు కూడా ఉండేవి". (పైదే, పుట.175.) మతం పేరుతో మతగురువులు చేసిన వికృత విధానాన్ని వివరించారు. మతపరిస్థితులను వివరిస్తూ శైవుల దృష్టిలో విష్ణువు చేసినవన్నీ అకారాదిలే. వాటిని వైష్ణవులు కూడా సమర్థించుకోలేరు. కావున శివుడే సకలారాధ్యుడు. లింగధారణం అసహ్యాకరమని వైష్ణవులు భావిస్తే నామ ధారులాయన వైష్ణవులు నరకంలో అదే ఆకారంలో ఉన్న శూలాలతో గుచ్చాడతారని శైవులు ప్రచారం చేసేవారు. వీరి పరస్పర దూషణలు తరచుగా హింసాత్మకమైన కలహాలతో ముగిసేవి. ఒక గుంపు మరో గుంపును రెచ్చగొట్టడంతో కలహాలు ప్రారంభమయ్యేవి. ఒక గుంపు తమ దైవ పానమ్యాన్ని ఉద్ఘాటిస్తూ పరదైవ దూషణకు పాల్పడేది. వెంటనే పరస్పర దైవదూషణలతో, శాపనార్థాలతో ముష్టి ఘాతాలకు దిగేవారు. రక్తపాతం కూడా జరిగేది. ఒకరి తలపాగాను మరొకరు లాగివేయడం, బట్టలు చింపు కోవడాలతోనే ఇదెక్కువగా ముగిసేదని నాటి కాలంలో ఉన్న మత పరిస్థితులను

వివరించారు. ఇంకా బసవని పేరు మీద వదలిన వారిని బసివిరాండ్రనీ, వైష్ణవాలయాలకు సమర్పించబడిన వారికి దేవదాసీలని పిలిచేవారని, 'బసవి' అనే పదాన్ని వేమన్న పలుసార్లు పేర్కొనడం నిజం కాదని సంత బసవి అనే మాటతో వేమన్నవి రెండే పద్యాలున్నాయని తెలిపాడు.

దక్షణదేశంలో ఇస్లాం మతం ప్రవేశించే నాటికి హిందూమతం శక్తిహీనమై కొట్టూమిట్టాడుతున్నది. అటువంటి పరిస్థితులలో ఇస్లాం సుడిగాలి వలె వీచింది. ఈ దేశంలో అది సరికొత్త గాలి అని దీనితో హిందూమతంలోని బాధితులు, దీనజనులు ఈ మార్పును అనుకూల దృష్టితో చూశారు. అటువంటి సమయంలో హిందూమతంలోని లోపాలను ఎత్తిచూపి వాటిని పరిష్కరించడానికి కొందరు భావకులైనవారు తత్త్వాన్వేషణకు పూనుకున్నారని వారిలో వేమన యోగి, పోతులూరి వీరబ్రహ్మంగారు మొదలగు వారు ఉన్నారని వివరించారు.

వేమన పద్యాలలో కనిపించే గ్రామవ్యవస్థను వివరించారు. ఆర్థిక జీవితాన్ని వివరిస్తూ నాటి ఆర్థిక వ్యవహారాలు వస్తురూపం పోయి ధనరూపేణా చెలామణి మొదలయ్యిందని అనేక రకాల నాణాలు చలామణీలో ఉండేవని, ఇవి ప్రతిరాజ్యానికి వేరువేరుగా ఉండేవని రాజులు మారినప్పుడు కొన్ని కొత్త నాణాలు ప్రవేశపెట్టడమే కాకుండా పూర్వకాలం నుండి వస్తున్నవి కూడ వ్యాప్తిలో ఉండేవని తెలిపారు.మన పద్యాలలో కాసు, వీసం, దమ్మిడే, తారము, రూక మొదలైన నాణాలను పేర్కొనడం వలన అవి నాడు వాడుకలో ఉన్నాయని తెలిపాడు. సమాజంలో ఉన్న వివిధ వర్గాలను విభజించి వారి ఆర్థిక పరిస్థితులను తెలిపాడు. వేమన్న సంపన్న కుటుంబానికి చెందినవాడైనప్పటికీ వేమన దృష్టి మాత్రం పేదవర్గాలపై ఉండేదని వివరించాడు. ప్రజలలో అట్టడుగు వర్గంవారు తరచుగా రుణబాధలలో చిక్కుకొనేవారని, ఈ రుణం అనేది కొంత కాలానికి రుణగ్రస్తులను బానిసలుగా తయారుచేసేదని కూడా తెలిపాడు.

సాంఘిక పరిస్థితులను వివరిస్తూ అప్పటి వైవాహిక సంబంధాలలో మేనరికం ప్రాధాన్యం వహించి ఉండేదని, ఇది సంపన్నులలోనే కాకుండా పేదవారిలో కూడా ఈ ఆచారం అమలులో ఉండేదని తెలిపారు. వేమన పద్యాల ద్వారా వేమన గురించి వివరించాడు. అతడు కాపుకులస్థుడై ఉంటాడని ఊహించాడు. యుక్త వయస్సు రాగానే వ్యభిచార జీవితంలో పడిపోయి ఉంటాడని తెలిపారు. తరువాత వేమన వివాహం, కొంత కాలానికి సంసార జీవితం వదలివేయడం వంటి అంశాలను వివరించాడు. పరిశోధకుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చెప్పిన అంశాలను పేర్కొన్నారు. అదనంగా మరికొన్ని అంశాలను వేమన పద్యాల అధారంగా వేమన గురించి తెలిపాడు.

## 7.5. ఆధునిక సాహిత్య రచనలపై వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలు

ప్రాచీన సాహిత్యంపై వచ్చిన చారిత్రక విమర్శ గ్రంథాలలాగానే ఆధునిక సాహిత్య గ్రంథాలపై చారిత్రక విమర్శ గ్రంథాలు వచ్చాయి. ప్రాచీన సాహిత్యాన్ని చారిత్రక విమర్శ చేసేటప్పుడు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అవి రచయిత/కవిపరంగా కూడా ఉంటాయి. కాని ఆధునిక సాహిత్య రచనలపై చారిత్రక విమర్శ చేసేటప్పుడు ఇటువంటి సమస్యలు తక్కువగా ఉంటాయి. అందుకు గల కారణం నేటి కవుల/రచయితల కాలం లభించడంతో పాటు వారికి సంబంధించిన సమాచారం లభిస్తుంది. కాబట్టి ఆధునిక సాహిత్య రచనలను చారిత్రక విమర్శతో సరిగా పరిశీలించడానికి అవకాశం ఉంది. ఆలా ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్య రచనలను చారిత్రక విమర్శతో వచ్చిన రచనలు కొన్ని ఉన్నాయి.

### 7.5.1. వేయిపడగలు - విశ్లేషణాత్మక విమర్శ

ఈ గ్రంథాన్ని రచించిన వారు ఎస్. గంగప్ప. ఇది విశ్వనాథ సాహిత్య పీఠం వారి బహుమతి పొందిన గ్రంథం. బహుశ విశ్వనాథ సాహిత్య పీఠం వారు నిర్వహించిన గ్రంథ పోటీల కోసం రాసిన గ్రంథంగా పేర్కొనవచ్చు. ఇందులో విశ్వనాథ

సత్యనారాయణ గారి 'వేయిపడగలు' రచన గురించి విశ్లేషించారు. కొన్ని అధ్యాయాలలో చారిత్రక విమర్శక లక్షణాలు కనిపిస్తాయి.

ఇందులో మొదట విశ్వనాథగారిని గురించి వివరించారు. విశ్వనాథ అనేది ఇంటిపేరు ఎలా వచ్చిందో పేర్కొన్నారు. "వారి పూర్వులలో ఒకరు ఎప్పుడో కాశీకి వెళ్ళి, అక్కడ నుండి శివలింగము తెచ్చి కృష్ణానదీ తీరములో, హంసలదీవికి పై భాగములోని ఒక గ్రామంలో ప్రతిష్ఠించడం వల్ల ఆ పల్లె విశ్వనాథపల్లె అయిందనీ అదేవారి ఇంటిపేరు అయిందనీ అంటారు." (గంగప్ప, ఎస్: వేయిపడగలు - విశ్లేషణాత్మక విమర్శ, పుట.3.) ఈ 'వేయిపడగలు' నవల 1934లో రచించి అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' నవలతో పాటు ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారి బహుమతిని అందుకొన్నదని తెలిపారు. విశ్వనాథ వారు వేయిపడగలు రచించడానికి గల నేపథ్యాన్ని వివరించారు. "విశ్వనాథ వారికి మన పూర్వా పరాలను నాడు మన పెద్దలు నియమించిన సంఘవ్యవస్థ అన్నా ఎంతో మక్కువని, కొన్ని వేల సంవత్సరాల నుంచి భారతీయ సంస్కృతికి, సంఘవ్యవస్థకు వివాహ వ్యవస్థ కేంద్రమై ఉన్నదని, పాశ్చాత్య వ్యామోహంతో పైపైలలో కనిపిస్తున్న నిరాదరణ ఆయనను ప్రతిక్షణం బాధపెట్టిందని, ఈ వేదనకు పర్యవసానమే 'వేయిపడగలు' రచనని వివరించారు.

ఇందులో కొంత కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ కనిపిస్తుంది. కావ్యంలోని నాయకున్ని రచయితకు అన్వయించి కూడా పరిశోధకుడు విమర్శ చేశారు. "వేయిపడగలుకు కేంద్రబిందువు ధర్మారావు. ధర్మారావు ఆత్మకథ వేయిపడగలు. విశ్వనాథ సత్యనారాయణగారే ధర్మారావు. అంటే ధర్మారావు పేర విశ్వనాథవారు ఆత్మకథను వివరించారు. అరుంధతీ, చిన్న అరుంధతీ రెండు వివాహాలు - విశ్వనాథవారి సతీమణులు వరలక్ష్మీ తరువాత వివాహమాడిన ఆవిడ పేరేమిటో గాని, వరలక్ష్మియే. వారు తమ తండ్రితో పాటు పొలాల వెంబడి వెళ్ళి చూచిన సర్వ విషయాలు తిరిగిన అరణ్యాలు, వేటలు మొదలైనవన్నీ వర్ణించారు. పొలాల్లోని పాములు, తేళ్లు, ఎండ్రకాయలు, వారి జీవిత విశేషాలు అన్నీ ఇందులో వర్ణించాడు." (పైదే, పుట-40)

రామేశ్వరశాస్త్రిగారు ఉదార స్వభావంతో ఉన్న ఆస్తిని నాస్తి చేసుకొన్నట్లే వీరి తండ్రి శోభనాద్రిగారు సైతం చివరి దశలో ఔదార్యం వల్ల ఆస్తిని పోగొట్టుకొని పేదరికం బాధలను భరించినవారేనని, చివరికి సుబ్బన్నపేట నిర్మాణం, కాశీ నుంచి శివలింగం తీసుకొని రావడం, విశ్వనాథవారి పూర్వీకులు చేసినవే నవలలోకి ఎక్కాయని పరిశోధకుడు పేర్కొన్నాడు.

ఆనాటి అనేకాంశాలు జాతీయ కళాశాల క్రైస్తవుల కాలేజీలు, కేషబ్జీమతం, దివ్యజ్ఞాన సమాజం, మొదలైనవన్నీ విశ్వనాథ వారికి తెలిసినవని ఆనాటి పరిస్థితులన్నింటినీ నవలారూపంలో ఏకరువు పెట్టడం గమనించవచ్చని తెలిపాడు. శతాబ్దంలోని మొదటి, రెండు, మూడు, దశాబ్దాల్లో తెలుగువారి జీవన గతుల్లో వచ్చిన మార్పును విశ్వనాథవారు ఇందులో చిత్రించారని ఈ రెండు మూడూ దశాబ్దాల జాతీయోద్యమ భావాన్ని, ఆ ఉద్యమ స్థితిగతులను పేర్కొన్నారని తెలిపారు. వేయిపడగలులో కనీసం ముగ్గురు పాత్రలు జాతీయోద్యమంలో మునిగి తేలినవారున్నారని, సుబ్బన్నపేటలో జాతీయ కళాశాలను స్థాపించిన కేశవరావు, ధర్మారావు స్నేహితుడు రాఘవరావు ఆ ఉద్యమం వల్ల ప్రత్యక్షంగా ప్రభావితులైనవారని, ఇక ధర్మారావు ఆ ఉద్యమం అంటే అభినివేశం ఉండి ఆర్థికమైన కారణాల వల్ల దానిలో పాల్గొనలేక దాని సిద్ధాంతాలను ఆమోదించినవాడని పేర్కొన్నాడు.

కేశవరావుగారు జాతీయభావాలకు ఆలవాలమై ఉండే కళాశాల స్థాపనకు మదన పడటం, దానికోసం నిర్వహించడానికి పడినపాట్లు ఆనాటి విద్యావిధానాన్ని తెలియజెబుతాయని, రాఘవరావుగారు మద్యపానం నిషేధం వంటి దురాచారాలను మాన్పడానికి పడినశ్రమ, ఆ జాతీయోద్యమ కార్యకర్తలకు తగినదేనని, తుదకు రాఘవరావు తన సర్వస్వాన్నీ, చివరకు తన దేహదారుఢ్యాన్నీ కూడా ఆ జాతీయోద్యమానికే ధార పోయడం చూస్తే నిస్వార్థకాములై ఆనాడు ధనమాన

ప్రాణాలను కూడ లెక్కించక జాతీయోద్యమంలోకి దూకిన ఎందరో యోధులు జ్ఞాపకం వస్తారని వివరించారు. కళల పరంగా "కూచిపూడి వేషాలు, కూచిపూడి ప్రహ్లాదనాటకం, కూచిపూడి సంప్రదాయం పురాణాల గొప్పదనం, గోప్రాధాన్యత మన పూర్వ హస్తకళలు మొదలైనవన్నీ నశించి పోయాయంటాడు ధర్మారావు. వీటికి సంబంధించిన సర్వవిషయాలు సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్వనాథవారు చిత్రించారు". (పైదే, పుట.75.)

ఆనాడు పాశ్చాత్య ప్రభావం వల్ల కలిగిన మార్పులను నవలలో చిత్రించాడని పేర్కొన్నాడు. పాశ్చాత్య నాగరికత మూలంగా అనేక పరిణామాలు దేశమంతటా వచ్చాయని, ఈ పరిణామాలు సుబ్బన్నపేటలోను కలిగాయని పేర్కొన్నారు. అయినప్పటికీ పాశ్చాత్య నాగరికతా ప్రభావం ముప్పై ఏళ్లలో ఏవిధంగా తెలుగువారి జీవనవిధానంలో ఒడిదుడుకులకు, అవకతవకలకు, హేతువైందో విపులంగా విమర్శనా దృష్టితో వర్ణింపబడటం, కావ్యాన్ని అపురూపమైనదిగా జేస్తుందని తెలిపారు. ఇంకా రైలుమార్గం ఏర్పాటు కావడం, మునిసిపాలిటీ, జాతీయకళాశాల, క్రైస్తవుల కాలేజి, సినిమా తాలుకా బోర్డు, నాటక సమాజాలు, నిర్బంధ ప్రాథమిక విద్య, కొళాయిలు, ఎలక్ట్రిసిటి, మహిళా సమాజం, ఆర్థికవ్యవస్థలో మార్పులు మొదలగు అంశాలు ఈ నవలలో విశ్వనాథ వారు చిత్రించాడని వివరించారు.

ఆర్థిక పరిస్థితుల గురించి వివరిస్తూ, సుబ్బన్నపేటలో వచ్చిన మార్పుల మూలంగా రైతుల పై పన్నుల భారం అధికమైందని, మెట్ట చేలన్నీ మాగాణం కావటంతో ఇది సంభవించిందని, ఈ ఆర్థికమైన బాధలు జనాన్ని పీడించాయని అభిప్రాయపడ్డాడు. మత పరిస్థితులను వివరిస్తూ నవలలోని హైందవమత సిద్ధాంతాలన్నీ ఆ వ్యవస్థాపరమైన వాటిని సముద్ధరించడం కోసమే అన్నట్లు భారతదేశ పురావైభవమంతా వర్ణించబడిందని, ధర్మారావు పాత్ర అందుకు సృష్టించబడిందని, మిషనరీల మూలంగా హైందవ మతానికేర్పడిన ధర్మచ్యుతిని వివరించారు. పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతో జమిందార్లు మొదలు మామూలు వ్యక్తులు దాకా మారిపోయారని

పేర్కొన్నాడు.

### 7.5.2. చివరకు మిగిలేది నవల మానసిక సామాజిక జీవనస్రవంతి నవలా విమర్శ

ఈ గ్రంథ రచయిత్రి కాత్యాయని విద్మహే. ఈ గ్రంథం కూడా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథంలో కూడా కొన్ని అధ్యాయాలలో చారిత్రక విమర్శ కనిపిస్తుంది.

ఈ నవలను బుచ్చిబాబు గారు 'నవోదయ' పత్రికలో వారం వారంగా ప్రచురించారని దీనిని సాహిత్య విమర్శకులు 1946లో ప్రచురింపబడిందని రాశారని కాని నిజానికి ఈ రచన 1947 ఏప్రిల్ 20 నాటి సంచిక నుండి ధారావాహికగా ప్రచురించబడిందని పేర్కొన్నారు. ఈ నవల "ఆంధ్రపత్రిక ఉగాది సంచికలోని సర్వధారి సాహిత్య సమీక్షలో ఈ నవల అయేటి మేటి నవలల్లో ముఖ్యమైనదిగా గుర్తించబడింది" (కాత్యాయనీ విద్మహే: చివరకు మిగిలేది నవల మానసిక సామాజిక జీవనస్రవంతి నవలా విమర్శ, పుట.4.)

ఈ నవలలో వర్ణితమైన ప్రాంతాన్ని పరిశోధకురాలు వివరించారు. ఇందులో వర్ణించిన ప్రధాన పాత్రదారి దయానిధి సంచరించిన ప్రదేశాలు బుచ్చిబాబు సంచరించిన ప్రదేశాలకు దగ్గరగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక నవలలో వర్ణితమైన కాలాన్ని కూడా వివరించారు. బుచ్చిబాబుగారు సమర్పణలో నవల కాలం గురించి 'రెండు మహా సంగ్రామాల మధ్య కాలంలో తెలుగునాట కొందరి యువతీ యువకుల జీవితం చిత్రితమైంది ఈ నవలలో' అని చెప్పుకొన్నాడని దీనిని బట్టి ఈ నవల మొదటి ప్రపంచ యుద్ధం నుంచి రెండవ ప్రపంచం వరకు దాదాపు ముప్పై సంవత్సరాల కాలం మీద కథ నడిచినట్లు పేర్కొన్నారు.

నవల రచనకు దారి తీసిన పరిస్థితులను వివరిస్తూ "ఈ రెండు మహా సంగ్రామాల మధ్యకాలం మీద మొదటి ప్రపంచయుద్ధ ప్రభావముంది. రెండో ప్రపంచ

యుద్ధానికి దారితీసే లక్షణాల అభివృద్ధి వుంటుంది. ఈ అభివృద్ధివల్ల సామాజిక జీవితంలో ప్రజలు పొందే కష్ట సుఖాల మొత్తం స్వరూపంగా రచయితలు, కళాకారులైన మేధావుల ప్రాపంచిక దృక్పథముంటుంది. బుచ్చిబాబు ఆ నిర్దిష్ట కాలంలో సామాజిక జీవితం విలక్షణమైన అపూర్వ మైన ప్రభావాలకులోనై పరిణమించటాన్ని తన్మయీభవన సామర్థ్యంతో దర్శించి' దాన్ని ఒక కాల్పనిక భావోద్వేగంతో అనుభూతిని పొంది నవలగా రచించాడు'' (పైదే, పుట-8) అని వివరించారు. ఈ రచనకు ప్రేరణ కూడా రెండు ప్రపంచాల మధ్య జరిగిన పరిణామాలని తెలిపారు. ''రెండు మహా సంగ్రామాల మధ్య కాలం అన్న సూచన వల్ల ఆ మహా సంగ్రామాలు ప్రపంచ యుద్ధాలుగా ప్రసిద్ధాలు కాబట్టి ఆ కాలంలో ప్రపంచ దేశాల పరిణామాలన్నీ పరిగణలోకి వస్తాయి. రెండు మహా సంగ్రామాల వల్ల వ్యాపించిన అంతర్జాతీయ చైతన్యంలో, ఆ యుద్ధాల మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన జీవితాన్ని అర్థం చేసుకోవాలన్న జిజ్ఞాసను, పాశ్చాత్య భాషా సాహిత్యాలలో వచ్చిన నూతన ధోరణులను అధ్యయనం చేయడం వల్ల అవగాహన వల్ల తనదిగా చేసుకోవటం బుచ్చిబాబు ఈ నవల వ్రాయటానికి ఒక ప్రేరణ.'' (పైదే, పుట.9-10.)

ఇక బుచ్చిబాబు కూడా ఈ రెండు ప్రపంచ యుద్ధాల మధ్య జాతీయ, అంతర్జాతీయ ప్రభావానికి లోనుకావటం జరిగిందని, మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా జరిగిన మారణ హోమం వలన ఈ జీవితానికి అర్థం ఏమిటి? అనే ప్రశ్న పలువురులో బయలుదేరిందని పేర్కొన్నారు. తరువాత కచ్చితమైన నవలా కాలాన్ని విశ్లేషించారు. వివిధ అంశాలను తారీఖులను పరిశీలించి చివరకు 1934 వేసవిలో ప్రారంభమై 1939 వేసవిదాకా అయిదు సంవత్సరాలుగా పేర్కొన్నారు. అనంతరం నవలా కాలం నాటి ఆంధ్రదేశ పరిస్థితులను, అవి బుచ్చిబాబుపై ప్రభావం చూపిన విధానాన్ని వివరించారు. సంఘంలో ఉన్న మూఢాచారాలను తొలగించడానికి సంఘ సంస్క ర్తలు చేసిన కృషిని, స్వాతంత్రోద్యమ కాలంలో జరిగిన సంఘటనలు, అందులో ఆంధ్రులు పోషించిన పాత్రను, ఆంధ్రులను ఏకం చేయటానికి జరిగిన ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు ప్రయత్నాలు

మొదలగు అంశాలను వివరించి ఈ కాలంలో బుచ్చిబాబు జీవించాడని, తాను జీవించిన పరిసరాలు, ప్రకృతి ఆంగ్లసాహిత్యాన్ని అధ్యయనం చేయటం, అప్పటికే జిడ్డుకృష్ణమూర్తి, దివ్యజ్ఞాన సమాజం నుంచి విడిపోయి తన బోధనలను ప్రచారం చేయటం, ఆ బోధనల పట్ల బుచ్చిబాబు ఆకర్షితుడవ్వటం, ఇవన్నీ కూడా ఆయనపై ప్రభావం చూపాయని పేర్కొన్నారు.

బుచ్చిబాబు నవలకు రాసుకొన్న సమర్పణలో 'వ్యక్తిగత విముక్తి ఈ నవలకు ప్రేరణ' అని చెప్పుకొన్నాడని, దేని నుండి విముక్తినాశించి రచయిత ఈ నవల రాశారో వివరించారు. ఈ నవలపై ఆంగ్ల రచయితలైన సోమర్ సెట్ మామ్ ప్రభావం ఉందని పేర్కొన్నారు. మానసిక వ్యధను, తపనను అనుభవించడంలో తనకు సన్నిహితుడుగా కనిపించి, తనను వెంటాడుతున్న సమస్యలనన్నింటిని కలిపి నవలగా రాసి, శాంతిని పొందుదామని ప్రయత్నించిన మామ్ ను గురువుగా స్వీకరించి తాను కూడా వ్యక్తగత విముక్తి కోసం బుచ్చిబాబు నవల వ్రాశాడని పేర్కొన్నారు. రచయిత ఈ వ్యక్తిగత విముక్తి కోసం చేసిన అన్వేషణలో తన అనుభవాలనన్నింటిని దయానిధిలో నింపి తన ప్రతినిధిగా నిలిపినట్లుగా భావించవచ్చునని వివరించారు.

ఈ పరిశోధనా గ్రంథంలో చారిత్రక విమర్శకు కావాల్సిన సామాగ్రిని వినియోగించుకొని చారిత్రక విమర్శ చేసినట్లు పేర్కొనవచ్చు. పరిశోధకురాలు రచయితకు సంబంధించిన ఇతర రచనలను, రచయితతో పరిచయం ఉన్న వ్యక్తులను, గ్రంథాలను ఉపయోగించుకొని రచన వెలువడటానికి గల కారణాలను, అందుకు దోహదం చేసిన ఆనాటి, సాంఘిక, రాజకీయ పరిస్థితులను వివరణాత్మకంగా చర్చించారు.

## 7.6. సాంఘిక విమర్శనా గ్రంథాలు

ఇక్కడ కొన్ని సాంఘిక విమర్శలో వచ్చిన గ్రంథాలు కూడా ఉన్నాయి. వాటిని వివరించడానికి గల ప్రధాన కారణం సాంఘిక విమర్శ చారిత్రక విమర్శలో ఒక భాగంగా ఉంటుందని మొదటి అధ్యాయంలోనే పేర్కొనడం జరిగింది. చారిత్రక విమర్శకు, సాంఘిక విమర్శకు గల ప్రధాన భేదం చారిత్రక విమర్శలో రచయిత/కవి గురించి, అతడి రచనను గురించి, ఆరచనకు గల కారణం, రచయిత/కవిపై ప్రభావం చూపిన అంశాలు, ఆ రచనలో కనిపిస్తున్న రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు మొదలైన అంశాలన్ని వివరించడం జరిగుతుంది. కాని సాంఘిక విమర్శలో రచయిత గురించిన పరిచయం, అతని జీవితానికి సంబంధించిన సమాచారం ఉండదు. ఈ విమర్శలో ఆ రచనలో కనిపించే రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు మొదలైన అంశాలను వివరించడంతో పాటు ఆ కాలంలో ఆ సాహిత్యం ఏర్పడటానికి దారి తీసిన పరిస్థితులను వివరించడం జరుగుతుంది. సాంఘిక విమర్శలో ఎక్కువగా ఒక కాలానికి సంబంధించినవిగా ఉన్నాయి. అంటే ఒక పరిమిత కాలానికి సంబంధించి రచనలలో కనిపించే రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు మొదలైన అంశాలను వివరించడం జరిగింది. అలా సాంఘిక విమర్శ లక్షణాలు కనిపించే గ్రంథాలు తెలుగులో కొన్ని ఉన్నాయి. వాటిని గురించి పరిచయం చేయటం జరిగింది.

### 7.6.1. శివకవుల రచనలు సమాజం

గ్రంథ రచయిత నడుపల్లి శ్రీరామరాజు.ఇందులో పరిశోధకుడు శివకవులను గురించి, శివ కవుల రచనలను గురించిన వివరాలను, ఇంతకు పూర్వం పేర్కొన్న రచయితల అభిప్రాయాలను పేర్కొని చివరకు శివకవులు అంటే ఎవరు, వారికి ఆపేరు రావడానికి గల కారణాన్ని లక్షణాలను వివరించారు. శైవసాహిత్యాన్ని రచించిన వారిలో పలువురిని శివకవులుగా పరిశోధకులు పేర్కొన్నారు. కాని ఇక్కడ ఈ గ్రంథ రచయత శివకవులుగా ఎవరిని పరిగనించాలి? ఎందుకు పరిగనించాలి? వారి లక్షణాలు ఏమిటి?

అనే అంశాలను పరిగనలోకి తీసుకొని గ్రంథంలో వివరించారు.

మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు మాత్రమే శివకవులని పేర్కొన్నాడు. దానికి గల కారణం వీరివురి కాలానికి సమకాలీనంగా కర్ణాటకలో బసవేశ్వరుడి ప్రభావంతో ఆంధ్రదేశంలో కూడా వీరశైవమత ప్రభావం ప్రసరించిందని, ఈ ఉద్యమ ప్రభావంతో ఆంధ్రదేశంలో కూడా రచనలు చేసినవారు ఆకాలంలో కనిపిస్తారని, వీరిలో మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు ఇటువంటి నేపథ్యంతో రచనలు చేయడం చేత వీరిద్దరూ శివకవులని, వీరి రచనలు శైవవాఙ్మయం అని పేర్కొన్నారు. వీరి వాఙ్మయానికి కాలగతమైన ఉద్యమ ప్రభావమూ, ప్రచార లక్ష్యమూ అనే రెండు లక్షణాలున్నాయని, దీనికి వారి జీవితమూ, వారి రచనలూ సాక్ష్యమని వివరించారు.

వీరి అధ్యయణం కూడా పూర్వపు పరిశోధకుల విధానాన్ని అనుసరించింది. పూర్వపు పరిశోధకులు అవలంభించిన ఆస్థాన, ఆస్థానేతర సాహిత్య విభజన అనే పద్ధతిని అనుసరించి రచనను కొనసాగించారు. ఇందులో రచయిత కాకతీయుల కాలం నాటి సామాజిక వ్యవస్థను పేర్కొనడానికి ముందు కాకతీయులకు పూర్వం పరిపాలించిన రాజవంశాల చరిత్ర, రాజకీయ పరిస్థితులు, సామంత రాజ్యాలు ఏర్పడడానికి దోహదం చేసిన పరిస్థితులు, కాకతీయులు సామంతులుగా ఉండి స్వతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన తీరు వివరించారు. శాతవాహనుల కాలంనాడు వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండి ఉత్పత్తి పెరుగుదలకు దోహదం చేయడంతోపాటు వాణిజ్యాన్ని కూడా అభివృద్ధి పరిచారని, దీనితో ఉత్పత్తి, పంపిణీ సమతూకంగా ఉన్నాయని తరువాత కాలంలో క్రమంగా ఫ్యూడల్ వ్యవస్థ బలపడే విధంగా తయారైందని వివరించారు.

శైవంలో యోగతాంత్రిక విద్యల ప్రభావంతో పాశుపతం, కాలముఖం, కాపాలికం మొదలైన వర్గాలు పుట్టాయని, తాంత్రిక విద్యల మూలంగానే శైవ వైష్ణవ ఆగమ

విద్యలు పుట్టాయని, అన్ని మతాలలోనూ తాంత్రిక విద్య ప్రభావంగా నరబలులు, రక్తతర్పణం, భగపూజ వంటి భయంకరమైన హేయమైన ఆచారాలు వచ్చాయని దీనికి అనేక ఉదాహరణలు శైవవాఙ్మయంలో దొరుకుతాయని వివరించారు. తరువాత కాలంలో తాంత్రిక విద్యలను పక్కనపెట్టి జ్ఞాన కర్మ మార్గాలు ప్రాతిపదికగా మారి ఆంధ్రదేశంపై ప్రభావం చూపాయి. 12 వ శతాబ్దంలో ఆంధ్రలో మల్లికర్జున పండితుడు, కర్ణాటకలో బసవేశ్వరుడు శైవ మార్గాన్ని సంస్కరించి వాటికి నూతనోత్తేజాన్ని కలిగించారు. ఆంధ్రదేశంలో మార్గ దేశి మిశ్ర రూపంలో నూతనంగా శైవ వాఙ్మయం అనే ప్రక్రియగా వికసించింది. కాని శివకవుల రచనల్లో మాత్రం కన్నడ దేశంలో వచ్చిన శైవ భక్తి ఉద్యమ ప్రభావం కనపడుతుందని పేర్కొన్నారు.

శైవ వాఙ్మయంలో సామాజికాంశాలు ముఖ్యంగా ఆర్థిక పరమైనవి, మతపరమైనవి, కులపరమైనవి సంస్కృతి పరమైనవని, వీటిలో కనిపించే కళలు, విశ్వాసాలు, ఆచారాల వంటివి సంస్కృతికి చెందినవి అని విభజించారు. శివకవుల రచనలలో కనిపించే అనేక సామాజిక అంశాలను వివరించారు. ఇందులో గురుభక్తి, మిండజంగములు మొదలగు అంశాలను పేర్కొన్నారు. తరువాత ఆర్థిక విధానాన్ని వివరిస్తూ, ఆకాలం నాటి ఆర్థిక సంబంధం ఫలితంగా భూస్వాములు కూలీలు అనే భేధాలు స్థిరపడి పోయాయని, భూస్వామ్య వ్యవస్థ నెలకొందని ప్రజలు భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించారని తెలిపాడు. తరువాత సామాజికాంశాలను, మతాన్ని వివరించారు. తమిళ కన్నడ దేశాలలో జరిగిన మత కల్లోలాలు వంటివి ఆంధ్రదేశంలో జరగలేదని, శైవ వైష్ణవాల మధ్య మనస్పర్థలు కలవని అవి కేవలం బ్రాహ్మణుల మధ్య ఉన్నవిగా మాత్రమే ఊహించాలని పేర్కొన్నారు. ఆంధ్రదేశంలో నిజంగా వీరశైవ మతం విస్తృత పరిధిలో వ్యాపించలేదని, ఆమతం కొద్దిగా తన ప్రభావాన్ని చూపింది. మతోద్యమ రూపంలో వచ్చిన వీరశైవం హరిహర తారతమ్యాన్ని చూపుతూ శివుని ఆధిక్యాన్ని ప్రచారం చేసి శివుడు, విష్ణువు భిన్నులనే సిద్ధాంతాన్ని తర్కసహంగా నిరూపించే ప్రయత్నం చేశారని వివరించారు

ఇక్కడ తిక్కనకు సంబంధించిన అంశం కూడా ప్రస్తావన ఉంది. దానికి గల కారణం తిక్కన కూడా కాకతీయుల కాలం నాటి రాజులకు సమకాలీకుడు కావడం, మరొకటి తిక్కన కు సంబంధించిన మత విషయమైన హరిహరనాథతత్త్వం అని పేర్కొన్నారు. ఈ హరిహరతత్వం అనేది తిక్కన కంటే ప్రాచీన కాలం నుంచి ఉందని ఇంతకు పూర్వమే చర్చించడం జరిగింది. “ఇదే కాలనికి చెందిన తిక్కన మతోద్యమ ప్రభావానికి గురికాలేదు. వర్గ సంఘర్షణకు లోనుకాలేదు. అతడు అనుస్యూతంగా వస్తున్న స్మా ర్త శైవానికిచెందిన వాడు. అంటే వ్యవస్థాపరంగా పాలక వర్గ భావాలే కలవాడు. అందుచేతనే ‘విష్ణురూపాయ నమశ్శివాయ’ అని అంటూ హరహర భేధాన్ని ప్రకటించారు. సమకాలీనంగా శైవశాఖలు ద్వైత భావాన్ని ప్రచారం చేస్తున్నాయి. కాబట్టి తిక్కన తన మతానికి అనుకూలంగా అద్వైతాన్ని చెప్పాడు. అలాగే తిక్కన శైవ, వైష్ణవ సఖ్యతకోసం హరిహర భేదాన్ని చెప్పాడని అనుకోనక్కర లేదు.” (శ్రీరామరాజు, నడుపల్లి: శివకవులు సమాజం, పుట. 57.)

కాని 12, 13, శతాబ్దాల్లో ఆంధ్ర దేశంలో శైవ వైష్ణవ భేదాలు తలెత్తి సమాజం కల్లోలిత మైందని దానిని నివారించడం కోసం తిక్కన హరిహరాద్వైతాన్ని ప్రబోధించాడని సాహిత్య చరిత్రల్లో చూస్తాము. పలువురు పరిశోధకులు కూడా ఈ అభిప్రాయాన్నే వ్య క్తం చేశారు. తిక్కన సంఘంలో ఉన్నటువంటి సంఘర్షణను తొలగించటానికి కాక హరిహరాద్వైతం తిక్కన జీవన విధానం అని పేర్కొంటూ “ఆనాటి హిందూమత లక్షణం అద్వైతమే. తిక్కన యాజ్ఞికుడు, సోమయాజి. అందుచేత అతడు తన జీవిత విధానానికి అనుగుణంగా ప్రకటించారని” (పైదే, పుట.58.) తెలిపారు. ఇంకా ఇందులో కులవ్యవస్థ, వేదవిద్యను వీరశైవులు ప్రశ్నించడం మొదలగు అంశాలు కనిపిస్తాయి.

### 7.6.2. రాయలనాటి రసికత

ఈ గ్రంథ రచయిత పుట్టపర్తి నారాయణాచార్యులు. ఇందులో విజయనగర సామ్రాజ్యం నాటి, ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి పరిస్థితులను సాహిత్యం ఆధారంగా చేసుకొని వివరించారు. ఇందులో ఏ ఒక్క కవిని గురించి ప్రత్యేకంగా వివరించకుండా ఆ కవుల రచనలో కనిపించే అంశాల ఆధారంగా చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, మత పరిస్థితులను పేర్కొన్నారు.

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మొదటి వంశం 'సంగములు' శైవమతాన్ని అనుసరించారని తరువాత పాలించిన రాజులందరు వైష్ణవమతాన్ని అనుసరించారని కాని మిగిలిన మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగించిన వారు కాదని వివరించారు. అయితే నాటి సమాజంలో ఇంకా జైన మతం వ్యాప్తిలో ఉన్నట్లు, జైనులకు, వైష్ణవులకు కూడా వివాదాలు జరిగినట్లు పేర్కొన్నారు. బుక్కరాయల కాలాన 'శ్రావణ బెళగొళలో వైష్ణవులకు, జైనులకు పెద్ద వివాదమేర్పడింది. దాని కొమ్మలు, రెమ్మలు ఆనెగొంది హోసపట్టణం, పెనుగొండ, కలెహ మొదలైన ఊళ్లకు వ్యాపించాయి. అప్పుడు జైనులు, వైష్ణవులు తమకన్యాయం చేశారని, రాయలకు  పిర్యాదు చేయగా, రాయలు శ్రావణ బెళగొళలో, బ్రహ్మాండమైన సభలు ఏర్పాటుచేసి ఆ సమస్యను తరువాత  పరిష్కరించారని పేర్కొన్నారు. బుక్క రాయలు ఇంకా ముస్లింలను కూడా చేరదీసి వారికి ఊర్లు కట్టించి మసీదులు సైతం కూడా ఏర్పాటు చేశారని, తరువాత రాజులు కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించారని వివరించారు. దీనిని బట్టి బుక్కరాయలు కాలం నాటికి మతపరంగా ప్రజల మధ్య కొంత సయోధ్య ఉన్నట్లు తెలుస్తుంది.

సమాజంలో భోగం వారి స్థితిగతులు బాగున్నాయని వారు సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని కలిగి, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ''సమాజమునందు భోగమువారు దూష్యముగాదు. వారికి సమాజమున

గౌరవముండెను. దేవరాయల నాటికే యఋవది వేలకు పైగా వారుండిరని వారి వృత్తివలన రాచవారికి వచ్చెడి పన్నుతో బన్నెండు వేలమంది 'దలారులు' నిర్వహింపబడుచుండిరి.'' (నారాయణాచార్యులు, పుట్టపర్తి: రాయలనాటి రసికత, పుట.21.) ఆనాడు రాజులు తమ వెంట దేవదాసీలను యుద్ధ సమయంలో కూడా తీసుకవెళ్ళేవారని, దేవదాసీలను వీరశైవులు, వైష్ణవులు కూడా ఆదరించారని, యుద్ధ సమయంలో యుద్ధబటులకు శౌర్యాన్ని నూరిపోయటానికి కూడా వీరిని ఉపయోగించుకున్నారని తెలిపాడు.

ప్రజలలో ధనిక, పేదరికపు భేదాల అంతరం ఉన్నప్పటికీ పేదవారు కనీస అవసరాలకు లోటులేకుండా బ్రతికారని తెలిపారు. కాని రాజుల ధనాగారాలు ధనరశులతో నిండిపోయాయని పేర్కొన్నాడు. ''విద్యారణ్య బొక్కసములో 99 కోట్లు 56 లక్షలున్నవి. ఈ వరకు రాజుల సెలవు సేద్యాలుపోను, మిగులు 19 కోట్ల 56 లక్షలు. కర్ణాటక రాజ్యం పదికోట్ల 84 లక్షలు. దేవదాయ బ్రహ్మాదాయ సర్వమాన్య మఠాదులకు 60 లక్షలు పోగా మిగులు 10 కోట్ల 24 లక్షలు.'' (పైదే, పుట.29.)

అయితే విజయ నగర రాజుల కాలంలో రాజుల జీవితంలో లాలసత్వం ఎక్కువైనదని దానికి గల కారణం వారి మీద కొంత ముస్లిం సంస్కృతి కూడా ప్రభావం చూపిందని పేర్కొన్నారు. దీనితో వారు స్త్రీలను భోగవస్తువుగా చేసుకొన్నరని, అందువలన బహుభార్యత్వం నాటి సమాజంలో ఎక్కువ వ్యాప్తిలో ఉన్నట్లు వివరించాడు. ఆనాడు స్త్రీలతోపాటు పురుషులకు కూడా లలితకళలపై ఎక్కువ ఆసక్తి ఉన్నదని పేర్కొన్నాడు.

ఈ గ్రంథం యొక్క ముఖ్యోద్దేశం రాయల కాల నాటి జీవతాన్ని వివరించడం. కాబట్టి ఇక్కడ కేవలం సాహిత్యంలో కనిపించే జీవన విధానాలను మాత్రమే వివరించాడు. కాని ఎక్కువగా రాయల కాలంలో ఉన్న సుఖ జీవితాన్ని మాత్రమే

వర్ణించడం జరిగింది. అంటే సాంఘిక పరిస్థితులను, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు అన్నీ కూడా ఒక వర్గ ప్రజల జీవితాన్ని దృష్టిలో ఉంచుకొని రాసినట్లు కనిపిస్తుంది. పుస్తకం యొక్క శీర్షికలోనే ఈ విషయం స్పష్టమవుతుంది.

### 7.6.3. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం

ఇది కూడా సిద్ధాంత గ్రంథం. రచయిత కె ముత్యం. ఇది ఒక కాలంలో ముఖ్యంగా శ్రీకాకుళోద్యమ కాలంలో వెలువడిన సాహిత్యం గురించి వివరిస్తుంది. ఆ సాహిత్యం వెలువడటానికి గల కారణాలను, సాహిత్యాన్ని వివరించారు. అందుకుగాను శ్రీకాకుళం జిల్లా పరిస్థితులను వివరించారు. ఆంగ్లేయుల పాలనా కాలంనుంచి కూడా రైతులకు మొదట ఆంగ్లేయుల ద్వారా తరువాత జమిందార్ల వలన అన్యాయం జరుగుతుండేదని వివరించారు. మొదట ఆంగ్లేయుల వలన రైతులు నష్టపోయారని అది "శిస్తుల పేరిట అధిక పీడన ఒకటైతే, భూమిపై రైతుకున్న హక్కు తీసివేసి జమిందారుకు కట్టబెట్టడం రెండవది" (ముత్యం, కె: శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం, పుట.5.) అని తెలిపారు.

తరువాత జమిందార్లు క్రమంగా తమ దృష్టిని గిరిజనులపైకి మరల్చారని, క్రమంగా గిరిజనుల భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ ప్రయత్నంలో కొందరు గిరిజనులు తమ భూములను కోల్పోయారని, వీరిలో చాలా మంది గిరిజనులు కూలీలుగా, కట్టుబానిసలుగా మారిపోయారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా గిరిజనులను నిరాశపరిచిందని వివరించారు. అక్కడున్న భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు గిరిజనులకు ఎక్కువ రేటుకు వడ్డీకి డబ్బులిచ్చి, ఆ అప్పులు తీర్చలేని వారి భూములను కాజేసి, చివరికి వారిని పాలేర్లుగా మార్చారని, భూస్వాములకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను గ్రామాధికారులైన మునసబు, కరణాలు, పోలీసులు మొదలగు వారందరు కూడా సహాయపడేవారని వివరించారు. "స్వాతంత్ర్యం వచ్చిన

తరువాత భూస్వాములు, వారితోపాటు ప్రభుత్వశాఖల సిబ్బంది, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి సారవంతమైన పంటపొలాల్నీ, ఆస్తుల్నీ, సంపదల్నీ సొంతం చేసుకొని, చివరకు తినడానికి, కట్టాడానికి బట్టసైతం లేకుండా చేశారు. ప్రజలు ఆకలిమంటలతో జబ్బులతో కుంగిపోయేవారు. వేలాది మంది చనిపోయేవారు'' (పైదే, పుట.14.) అని గిరిజనుల దుస్థిని వివరించారు. ఈ సమయంలో తెలంగాణా విమోచనోద్యమం శ్రీకాకులంలోని గిరిజనులకు ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు. నాటి తెలంగాణా పోరాట ఫలితంగా తెలంగాణ ప్రజలు ''భూస్వాములు అప్పుల పేరుతో, తప్పుడు లెక్కల పేరుతో ప్రజల నుండి దౌర్జన్యంగా ఆక్రమించుకొన్న భూమితోపాటు, మొత్తం 10 లక్షల ఎకరాల భూమిని ప్రజలు పంచుకొన్నారు. 3000 గ్రామాల్లో ప్రజలు తమ అధికారాన్ని స్థాపించుకొన్నారు. భూస్వాములు పెత్తనం, వెట్టిచాకిరి లాంటి అనేక రకాల నిర్బంధాల నుండి విముక్తులై స్వేచ్ఛా స్వాతంత్రాలను అనుభవించారు.'' (పైదే, పుట.15.)

ఇటువంటి నేపథ్యంలోనే జమిందార్లకు వ్యతిరేకంగా చేసిన నాయకత్వం కమ్యూనిస్టు నాయకత్వంలోనే 1951లో జిల్లా కమిటి ఏర్పాటు చేశారని వీరు తరువాత రైతుకూలి సంఘాలను యువజన సంఘాలను సంఘటితపరిచారని, ఈ ఉద్యమం క్రమంగా 1960 నుండి 1966 వరకు అత్యున్నతమైన విజయాలు సాధించిందని అవి అధిక వడ్డీలను రూపుమాపుట, ఫారెస్టు, పోలీసు, ప్రొహిబిషన్ దోపిడీని అంతం చేయటం, కూలీరేట్లు, పాలేర్ల జీతాలలో అభివృద్ధి, రెవిన్యూ దోపిడిని అంతం చేయటం మొదలగు విషయాలను తెలిపారు. అయితే ఈ సమయంలో 1967లో పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరి గ్రామంలో భూమిలేని రైతులు భూమికోసం భూస్వాములపై ఆయుధాలతో తిరగబడటం జరిగి, అది శ్రీకాకుళాంధ్ర ఉద్యమంపై ప్రభావం చూపిందని వివరించాడు. అప్పటికే అభివృద్ధి చెందిన గిరిజన రైతులు 1967 అక్టోబరు 31న జరిగిన గిరిజన సదస్సుకు బయలుదేరిన వారిపై భూస్వాములు కాల్పులు జరపడంతో ఇద్దరు గిరిజనులు చనిపోయారని దీనితో గిరిజనులకు,

భూస్వాములకు మధ్య ఘర్షణలు తలెత్తి, చివరకు ప్రభుత్వం కల్పించుకొని పోలీసులను గిరిజన గ్రామాల్లోకి పంపడంతో పోలీసులు ప్రజలను చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. తర్వాత గిరిజనులు సాయుధులై పోలీసు, భూస్వాములపై తిరగబడి గెరిల్లా యుద్ధం చేశారని, ఈ గెరిల్లా యుద్ధంలో పలువురు గిరిజనులు ప్రాణాలను కోల్పోయారని పేర్కొన్నారు.

ఈ ఉద్యమాన్ని ఆధారంగా చేసుకొని పలువురు రచయితలు/కవులు పలు సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారని పేర్కొన్నారు. అయితే ఆ రచనలు సాంస్కృతిక రంగంతో కలిసి వచ్చినవి కూడా కొన్ని ఉన్నాయని అందులో పాణిగ్రాహి హరికథ ప్రక్రియగా  మూడున్నర వజ్రాలు, మార్కండేయ, బుర్రకథలుగా సలాది హాస్యం, మస్తాన్ రాజకీయాలు, పినిసెట్టి రచించిన 'అన్నాచెల్లెల్లు', లంకెబిందెలు, పడచు, ఇంకా ప్లీడరుగారి అబ్బాయి, ఏది సత్యం మొదలగు నాటకాలు, నాటికలు వంటి ప్రక్రియలను రచించారని పేర్కొన్నారు. ఇంకా నాజర్, వెంపటాపురపు సత్యనారాయణ, కోనకళ్ళ వెంకటరత్నం  మొదలైన వారందరు రచనలు చేశారని తెలిపారు. సాహిత్య ప్రక్రియల్లో ఎక్కువగా పాట ప్రముఖంగా నిలిచిందని, తెలంగాణా విమోచనోద్యమ పోరాటంలో అవలంబించిన పాటల శైలిని ఇక్కడ కూడా ఉపయోగించారని పేర్కొన్నాడు. పాణిగ్రాహి, వెంపటాపురపు సత్యనారాయణ ఎక్కువ పాటలు రచించారని వీరికితోడు సోములు, ఇంకా ఇతర గిరిజనులు కూడా పాటలు రాశారని వివరించాడు.  ఆయా పాటల్లో ఆనాటి గిరిజనుల పరిస్థితి, భూస్వాముల దోపిడి, గెరిల్లా విధానం మొదలగు అనేక అంశాలను వివరించాడు.

### 7.7. సాహిత్య వ్యాసాల్లో కనిపించే చారిత్రక విమర్శ

కొన్ని సాహిత్య వ్యాసాలలో కూడా చారిత్రక విమర్శ కనిపిస్తుంది. అయితే ఈ వ్యాసాలలో చారిత్రక విమర్శ కంటే సాంఘిక విమర్శనే ఎక్కువ కనిపిస్తుంది.

ముఖ్యంగా ఇక్కడ వ్యాసకర్తలు వారి వ్యాసాల్లో ఒక నిర్ణిత కాలాన్ని తీసుకొని ఆ కాలంలో వచ్చిన సాహిత్యంలో ప్రతిబింబించే సమాజాన్ని విశ్లేషించారు. ఈ వ్యాసాలు కొన్ని ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల సంపాదకత్వంలో వచ్చిన తెలుగు సాహిత్యం మరో చూపు, డా. డి. చంద్రశేఖర్ రెడ్డి సంపాదకత్వంలో వచ్చిన తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం అనే గ్రంథాలలో వచ్చాయి. మొదట తెలుగు సాహిత్యం మరోచూపు గ్రంథంలోని వ్యాసాలను క్లుప్తంగా పేర్కొంటాను.

### 7.7.1. పాల్కూరికి సోమన - నిబద్ధత - నిమగ్నత

ఈ వ్యాస కర్త ముదిగొండ వీరభద్ర శాస్త్రి. ఆంధ్రదేశంలో ఆరాధ్య శైవం- లేదా శాంభవ దీక్ష ప్రచారంలోకి వచ్చిందని, పండితయ్య అనుష్ఠించింది ద్వైతాద్వైత మార్గం అని దీనినే శివాద్వైతం అనికూడా వ్యవహరిస్తారని దీనికి సంబంధించిన తాత్విక చింతన ఉత్తరదేశం నుండి లబ్ధమైందని పేర్కొన్నారు. అయితే దక్షణ దేశంలో శివభక్తి, వ్రతదీక్ష సుప్రసిద్ధమైనదని వీరినే పురాతన భక్తులనే పేరుతో పాల్కురికి సోమన బసవ పురాణ, పండితారాధ్య చరిత్రలలో వారిగాధలను తెలియజేశారని వివరించారు.

పండితయ్య ఉపనయన, పాశుపత లేదా శాంభవ దీక్షలు రెండింటిని విధిగా ఎన్నుకొన్నాడని, బసవేశ్వరుడు మాత్రం పాశుపత దీక్ష ఒక్కదానినే ఆదరించి ఉపనయన దీక్షను నిరసించాడని తెలిపారు. ఇంకా బసవేశ్వరుడు ప్రజలను ఒక్క మతంలోనికి తేవడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాల వల్ల అనైకమత్యం తొలగటానికి అవకాశం కలిగింది. 'శివునికి శివభక్తునికి తేడా లేదు. శివప్రీతికి ఏమిచేసిన తప్పులేదని, కన్నడిగినా, కాలడిగినా, కంఠమడిగినా ఉత్తరించుకోవటమే' ముఖ్యమని ఈ విధమైన ఉద్రేకంతో తమ ధన, మాన, ప్రాణాదులతో నాటి శైవమతం జాతిని చైతన్యవంతం చేసిందని ఈ శక్తి తెలుగునాట కాకతీయ సామ్రాజ్యానికి కొంతకాలం రక్షనిచ్చిందని అభిప్రాయపడ్డారు.

### 7.7.2. ఉభయ కవి తిక్కన గారి సమన్వీత సాహిత్య వ్యక్తిత్వం

ఈ వ్యాస రచయిత కోవెల సంపత్కుమారాచార్య. ఇందులో తిక్కన రచించిన నిర్వచనోత్తర రామయణం, మహాభారతం రచనలు ఇతిహాసాలు. తిక్కన ఇతిహాసాల రచన చేయడానికి గల కారణాలను ఆయన జీవించి ఉన్న కాలాన్ని, ఆ కాలంలో ఉన్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, వాతారణ పరిస్థితులను అధారంగా చేసుకొని వివరించారు. కాల పరంగా తిక్కన కాకతీయుల కాలానికి చెందినవాడు. తిక్కన కాలంనాడు రాజకీయంగా కొంతవరకు ప్రశాంతంగా ఉందని, దానికి కారణం నాడు ఓరుగల్లు నేలిన కాకతీయులు మిగిలిన వారితో సత్సంబంధాలు కొనసాగించారని వివరించారు. అందులో మనుమసిద్ధితో కూడా సత్సంబంధాలు కొనసాగించారు. వాటితో పాటు తెలుగు దేశంలో విడిపోయిన వివిధ రాజ్యాల పునరేకీకరణకు యుద్ధాలు జరిగాయి. కాని ఆయుద్ధాలవల్ల ప్రజల శాంతిభద్రతలకుగానీ, సంక్షేమానికి గానీ ఎటువంటి ఆటంకం కలగలేదని, దీనికి సాక్ష్యం ఆనాడు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలేనని వివరించారు. ఆనాడు రాజకీయంగా ప్రశాంతంగానే ఉందికానీ మతపరంగా ప్రశాంతతలేదని అందులకు గల కారణాలను వివరించారు.

తిక్కన రచనల ప్రయోజనాన్ని వివరించారు. సమకాలీనంగా సంఘర్షించుకుంటున్న భిన్న మతాల మధ్య వైషమ్యాలను తొలగించి సామరస్యాన్ని పెంపొందించడం ద్వారా భావ సమన్వయాన్ని సాధించడం మొదటి ప్రయోజనంకాగా, రెండవ ప్రయోజనం సమాజాన్ని జ్ఞానవంతం చేయడం ద్వారా జాగృత పరుస్తూ ఎప్పటి కప్పుడు దాన్ని నిలువరించుకునేందుకు వీలుకలిగించడం. తిక్కనగారు రామాయణం భారతాలను తెలుగులో చేపట్టి నిర్వహించడం ప్రధానంగా దీనికి సంబంధించిదేనని వివరించారు.

మొదట రచనాపరంగా తిక్కన రచించింది రామాయణం యొక్క ఉత్తరభాగమని, అది రాముడు రాజుకావడానికి ముందరి జీవితమంతా ఒక విధంగా ఆయన వైయుక్తికం,

కౌటుంబికమని రాజైన తరువాతదంతా సమాజ పరమైన జీవితమని వీరి అభిప్రాయం. అదువలననే తిక్కన నిర్వచనోత్తర రామాయణం ద్వారా రాజు యొక్క ఉదాత్తతను కర్తవ్యాన్ని వివరించాలనుకున్నాడని, రాజుకు వ్యక్తిగత జీవితం కంటే ప్రజాజీవితం ముఖ్యమని వివరించడానికి తిక్కన రచన చేశారని తెలిపారు. నిర్వచనోత్తర రామాయణము, మహాభారత రచనకుగల కారణాలను వివరించారు. నిర్వచనోత్తర రామాయణ రచనకు కారణం వ్యక్తిగత జీవితంకంటే ప్రజాజీవితం ముఖ్యమని తలంచిన రాముని జీవితం ఇతర రాజులకు ఆదర్శప్రాయంగా ఉండాలని ఉద్బోధించిన తరువాత ప్రజలకు హితబోధ కలిగించే భారత రచనకు పూనుకున్నాడని వివరించారు. భారత రచనను ఎన్నుకోవటానికి గల మరొక కారణాన్ని కూడా వివరించారు. అంతకు పూర్వం నుంచి ఎవరు రాజ్యపాలన చేస్తే వారు క్షత్రియులన్న భావన ప్రచారంలోకి వచ్చిందని, అధికారం సంపాధించిన వారు కామక్రోధాదులవల్ల, అలసత్వంవల్ల కర్తవ్యాన్ని మరిచిపోవడతో సామాజిక జీవితం కలుషితం అయ్యిందని పేర్కొన్నారు. దీనితో ఏది ధర్మమో ఏది అధర్మమో తెలియని పరిస్థితులు నెలకొన్న సందర్భంలో ఎవరి అధికార భేదాలు లేకుండా అందరికి వారి వారి ధర్మాలను వివరించడానికి నన్నయ తరువాత అటువంటి పరిస్థితులు తిక్కనకు వచ్చాయని ఆ  అవసరాలను తీర్చగలవని తలంచి తిక్కన మహాభారత రచనకు పూనుకున్నాడని వివరించాడు.

### 7.7.3. ప్రబంధాలు- సామాజిక, మత రాజకీయ భూమిక

ఈ వ్యాస రచయిత ఎస్.వి. రామారావు. విజయనగర రాజులు మొదట శైవమతాలను అభిమానించారని, తరువాత రాయలకాలంలో వైష్ణవమతం బాగా వ్యాప్తి చెందిందని ప్రబంధ కవులు కూడా ఆ మార్గాన్ని అవలంభించారని  రామారావు గారు తెలిపారు. అయితే రాయలకు  పరమత సహనం కూడా కలదని శైవులైన మల్లనతో పాటు ధూర్జటి కూడా  రాయలను ఆశ్రయించారని అది రాయల  పరమత సహనానికి నిదర్శనమని తెలిపారు. రాయలకాలంనూ రాయలకు పూర్వం కూడా రాజ్యం సస్యశ్యామలమై ప్రజలు సుఖవంతమైన  జీవితం గడిపినట్లు పలువురు చరిత్రకారులు

అభిప్రాయ పడుతున్నారు. అంతేకాకుండా పట్టణ నాగరికతకూడా అభివృద్ధి జరిగినట్లు పేర్కొన్నారు.

ఆనాటి వినోద క్రీడల్లో వేట కూడా ముఖ్యమైనదని మనుచరిత్రలో స్వరిచివేట, ధూర్జటి ఆటవికులైన చెంచుల వేట వారి ఆచారాలను వివరించారని నాటి క్రీడా వినోదాలను గురించి తెలిపారు. ప్రబంధాలలో సంపన్నుల జీవితాలు, పట్టణ నాగరికతనే కాకుండా సామాన్యుడి జీవితం, గ్రామీణ నేపథ్యం కూడా కనిపిస్తాయని రాయలు వర్ణించిన కొన్నింటిని ఉదాహరణలుగా చూపించారు. వీటితోపాటు పాండురంగ మాహత్మ్యంలోని నిగమశర్మ కథ భోగ లాలసులై చెడిపోయిన పండిత పుత్రుల గురించి, పేదరికానికిగురై చితికిపోయిన బ్రాహ్మణ కుటుంబాల పరిస్థితిని ఉదహరించారు. రాజరిక వ్యవస్థను ప్రత్యక్షంగా చూసిన ధూర్జటి రాజరికం మీద నిరసన ప్రకటించాడని తెలిపారు.

### 7.7.4. నిరసన కవి ధూర్జటి

ధూర్జటి రచనలను తీసుకొని ఆ రచనల ఆధారంగా ఆ కవి వ్యక్తిత్వం , ఆ రచనలో కనిపించే సాంఘిక ఆర్థిక మత పరిస్థితులను వివరించే వ్యాసం మోతుకురి నరహరిగారి 'నిరసన కవి ధూర్జటి'. కృష్ణ రాయల కాలానికి పూర్వం శైవం, వీరశైవం ఉన్నప్పటికి కృష్ణ రాయల కాలంలో వైష్ణవం నిలదొక్కుందని పేర్కొన్నారు. వీటితో పాటు భూస్వామ్య రాచరిక వ్యవస్థ గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా వేళ్ళూనుకుందని తెలిపారు.

దక్షిణ భారత సాహిత్యంలో కన్నడంలో దాస సాహిత్యం కుల నిరసన ప్రదర్శించిందని తెలిపారు. కాని ఇదే కాలంలో విజయనగర సామ్రాజ్యంలో వైష్ణవం ప్రబలంగా ఉందని దానికి నిదర్శనంగా కృష్ణరాయలు ఆముక్తమాల్యద గ్రంథాన్ని ఉదాహరించి అందులోని వస్తువు వైష్ణవ సంబంధి అని పేర్కొన్నాడు. అయితే

ఇటువంటి రాచరిక వ్యవస్థలో ధూర్జటి శైవమతాన్ని అనుసరించడమే కాక రాచరిక వ్యవస్థను నిరసించడం ఒక ప్రత్యేకమైన అంశంగా నరహరిగారు వివరించారు. అంతేకాకుండా రాయల యొక్క మత సహనాన్ని వివరించారు.

రాయలకు ధూర్జటి రాసిన కాలహస్తీశ్వర మాహాత్మ్యాన్ని అంకితం ఇవ్వకుండా "తన కృతిరత్నానికి వరుడెవ్వడని పరికించడం'లో కాళహస్తీశ్వరునికే అంకితం ఇవ్వడానికి ముందు ఊగిసలాట కొంత ఉండేదని అభిప్రాయ పడడానికి కారణం ధూర్జటి యవ్వనం అపరిపక్వతయే అయివుంటాయి" అని అభిప్రాయపడ్డాడు." (రంగనాథాచార్యులు, కె.కె: తెలుగు సాహిత్యం మరోచూపు, పుట -136.) ధూర్జటి ఆశ్వాసాంత గద్యాల్లో తల్లిదండ్రుల పేర్లు తప్ప స్వీయ వంశాదులను వర్ణించని కారణంగా, గురు ప్రశంస చేసి ఆయన  పేరును చెప్పకపోవడంలో ధూర్జటి నిరాడంబరత, భవపరాఙ్ముఖత తెలియజేస్తాయని, ఈ లక్షణాలు ఆకాలపు కవులలో ధూర్జటిని విశిష్ట వ్యక్తిగా నిలబెడతాయని తెలిపాడు. నాడు ధూర్జటి రాజులని విమర్శించినప్పటికీ, రాజరిక వ్యవస్థను నిరశించినప్పటికీ  రాజరిక వ్యవస్థకు ప్రత్యామ్నాయం చూపలేక పోయాడు. దానికోసమే 'మంచిరాజు'నిమ్మని శివుని ప్రార్థించాడని తెలిపాడు.

### 7.7.5. అచ్చ తెలుగు కావ్యాల అవతరణ చారిత్రక భూమిక

ఈ వ్యాస రచయిత బూదరాజు రాధాకృష్ణ. అచ్చ తెలుగు సాహిత్యం ఏర్పడటానికి గల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. రంగనాథ రామాయణాదుల్తో పోలిస్తే వీరశైవుల కృతులు ప్రజామోదం అంతగా పొందక పోవటానికి వారుపయోగించిన భాష కుడా కారణమై ఉంటుందని రాధాకృష్ణగారు అభిప్రాయపడ్డారు. మరి ఇతర కారణాలు కూడా ఉంటాయని మొత్తం మీద ఆ ఉద్యమం ఫలించలేదని అభిప్రాయ పడ్డారు. అప్పటినుంచి 16 వ శతాబ్దం వరకు  రచనలన్నీ కూడా మామూలు ధోరణిలోనే నడిచాయని పదహారో శతాబ్దికి  కుతుబ్ షా ప్రభుత్వం

వచ్చిన తరువాత తెలుగుదేశం విచ్ఛిన్నమవటంతో కవిపండిత పోషణ చక్రవర్తుల పనిగాక సామంతుల కర్తవ్యమయిందని, ఈ సమయంలో ప్రవాసాంధ్రులు దక్షిణ దేశంలో మహాకావ్య రచన కన్నా వచన కవితా, యక్షగానాదుల మీదా నిఘంటు నిర్మాణం మీదా దృష్టి సారించారని తెలిపారు.

భారత భాగవత రామాయణాది సంస్కృత కథలే కావ్య వస్తువులుగా బతికిన వాళ్ళు నూతనత్వం ప్రదర్శించలేని కారణంగా, ప్రదర్శించి మెప్పించలేని దుస్థితికి రావడంతో కొత్తదనం చూపటానికి, ఆకర్షించటానికి, ఆశ్చర్య చకితుల్ని చేయటానికి మిగిలిన బంధకవిత్వం, నియమ కవిత్వం లేవదీశారని, అయినా సరిపోలేదని ఈ సమయంలో అచ్చతెలుగొకటి సృష్టించారని పేర్కొన్నారు. అదీచాలక అందులోనే తక్కిన కావ్యలక్షణ ధ్వంసక గుణాలన్నిటినీ ఏకత్ర పరిచారని, సహజంగా వాడుతున్న భాషా విశేషాన్ని వదలి పైపెచ్చు శుభ లక్షణాలన్నీ చేర్చటం వల్లనే అచ్చ తెలుగు రచనలకు ఆదర గౌరవాలు కలుగలేదని పేర్కొన్నారు.

### 7.7.6. దక్షిణ దేశీయాంధ్ర సాహిత్యం - చారిత్రక, సామాజిక నేపథ్యం

ఈ వ్యాస రచయిత్రి ఎన్. కోటేశ్వరి. భిన్నపరిస్థితులలో ఏకకాలంలో వచ్చిన తెలుగు సాహిత్యం స్వభావ స్వరూపాల్లో భేదాలున్నాయి. ఆభేదాలకు గల కారణం ఆయా ప్రాంత సామాజిక, రాజకీయ పరిస్థితులు కూడా కొంత కారణం అని పేర్కొని ఆ పరిస్థితులను ఈ వ్యాసంలో వివరించారు. తంజావూరు రాజ్యంలో కూడా వారసత్వ యుద్ధాలు జరిగినట్లు తెలిపారు. "తెలుగుచరిత్రల్లో సాధారణంగా ఈ రాజుల గుణగణాలను పొగడ్డమే గాని వారసత్వ యుద్ధాలు, తండ్రి కొడుకులు, అన్నదమ్ములు మధ్య జరిగిన రక్తపాతాలు కనిపించవు. విజయనగర, తంజవూరు రాజుల చరిత్ర చూస్తే రాజ్యాధికారం కోసం జరిగిన మారణకాండ స్పష్టంగా కనిపిస్తుంది. రఘునాథనాయకునికి అచ్చుతప్ప అనే అన్న ఉన్నాడు. ఈ విషయాన్ని సమకాలీనులైన విదేశీయులు చెప్పారు. తండ్రి ఇతన్ని చెరసాలలో పెట్టినట్లు, రఘునాథ నాయకుడు

రాజ్యానికి  వచ్చిన తరువాత అన్నను చంపించినట్లు కూడా వీళ్ళు పేర్కొన్నారు. అయితే రఘునాథ నాయకుడిని గూర్చి రాసిన సమకాలీన కావ్యాల్లో ఎక్కడ ఈ ప్రసక్తి లేదు.'' (పైదే, పుట- 176-177)

నాయక రాజుల బహుభార్యత్వం శ్రుతిమించిదని అచ్యుతప్ప నాయకుడు చనిపోయినప్పుడు బతికి ఉన్న 370 మంది భార్యలతో అతని శవాన్ని చందనంల కాష్ఠం మీద ఉంచి దహనం చేశారని, ఈ విషయం విదేశీయుల రాతల ద్వారా తెలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇంకా విజయరాఘవ నాయకునికి 700 మంది భార్యలు 3500 మంది ఉంపుడుకత్తెల వివరాలు తెలుస్తున్నాయని, నాటి కాలంలో ఉన్న సాంఘిక పరిస్థితులను తెలిపారు. తంజావూరంతటా వైష్ణవమే ప్రచారంలో ఉందని విజయరాఘవుని వైష్ణవం కొంచెం ముదిరిన వైష్ణవమని మత పరిస్థితులను తెలిపారు.

కానీ అనాటి ప్రజల పరిస్థితి మాత్రం చాలా హీన స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది. పాలెగాళ్ళ బాధ భరించలేక, పెరుగుతూ ఉన్న పన్నుల్ని భరించలేక కరువు కాటకాలకు తట్టుకోలేక శత్రు సైన్యాల దోపిడిని, హింసనూ భరించలేక తంజావూరు నుంచి ప్రజలు మధుర, శాంతోమ్ లకు వలసపోయారని, డచ్చివాళ్ళు అన్నార్తులైన ఈ నిర్భాగ్యులకు అన్నం పెడ్తున్నట్లు నటించి బానిసలుగా ఇతర దేశాలకు ఎగుమతి చేశారని వివరించారు. విజయ రాఘవ నాయకుడు మాత్రం తన ప్రజలు కూటికి గతి లేక అష్టకష్టాలు పడి అమ్ముడుపోతుంటే శృంగార పదాలు చెప్పుకుంటూ ఆనందించాడని వివరించారు.

తెలుగు సాహిత్యం - చారిత్రక నేపథ్యం అనే గ్రంథంలోని కొన్ని వ్యాసాల్లో కూడా సాంఘిక విమర్శ కనిపిస్తుంది. ఈ వ్యాసాలను ఇక్కడ సమీక్షించాను. తెలుగు సాహిత్యం - చారిత్రక నేపథ్యం గ్రంథ సంకలన కర్త డి. చంద్రశేఖర్ రెడ్డి.

### 7.7.7. పదమూడవ శతాబ్దంలో తెలుగు సాహిత్యమూ-చారిత్రకత

ఈ వ్యాస రచయిత కోవెల సంపత్కుమారాచార్య. వీరు పదమూడవ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన రచనల చారిత్రక నేపథ్యాన్ని రచనల్లో కనిపించే సాంఘిక పరిస్థితులను వివరించారు.

శైవవైష్ణవాలు ఘోరంగా వీధుల్లోపడి యుద్ధాలు చేసి ఒకరినొకరు చంపుకోవటం, జైనాదులను నాశనం చేయటం వంటి అంశాలకు వట్టి ప్రచారమే తప్ప చారిత్రకమయిన ఆధారాలు కనిపించవని అభిప్రాయపడ్డారు. పదమూడవ శతాబ్దంలో తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణం, విరాట పర్వాదిగా చివరిదాకా మహాభారతం ఈ శతాబ్దపు చెప్పుకోదగిన రచనలని, తిక్కన శిష్యుడైన మారన మార్కండేయ పురాణం, ఇంకా రంగనాథరామాయణం, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశతకం, కేతన దశకుమార చరిత్ర మొదలగు రచనలు వెలువడ్డాయని వీటిని పరిశీలిస్తే ఒక్క సర్వేశ్వరశతకం తప్ప మిగిలిన ఏ రచనలు కూడా భక్తి ప్రబోధకమయినవి కావని పేర్కొన్నాడు.

### 7.7.8. శ్రీనాథ సాహిత్యం- ఆర్థిక తాత్విక భూమిక

శ్రీనాథుడి గురించి ఉన్న వ్యాసం ఇది చారిత్రక విమర్శ వ్యాసాలని చెప్పలేం కాని అదే విధానాన్ని  ఉద్దేశించి రచించినటువంటిది. వ్యాసాన్ని రచించిన వారు పి. సుమతి నరేంద్ర. శ్రీనాథుడు రాజస ప్రవృత్తి కలిగినవాడిగా, భోగజీవనం కాంక్షించినవాడుగా కనిపిస్తాడు. ఆ భోగ జీవితం కోసమే కావ్యరచనను ఆధారం చేసుకొన్నవాడు అని శ్రీనాథుడిని గురించి పేర్కొన్నారు.  రెడ్డిరాజుల ఉత్థానపతనాలు అనుసరించి శ్రీనాథుని జీవితం కొనసాగిందని తెలిపారు. కాకతీయ రాజ్యం పతనం తరువాత ఏర్పడిన వెలమ, రెడ్డి రాజ్యాల మధ్య అనేక యుద్ధాలు జరిగాయని, ఆయుద్ధాలు ఆర్థిక అస్థిరతకు దారితీయగా, రాజాశ్రితులు మాత్రం భోగలాలసులయ్యారని, ఇటువంటి అనిశ్చితి వాతావరణంలో పెరిగిన శ్రీనాథుడు కూడా రాజాశ్రయంకోసం పట్టుదలతో ప్రయత్నించి సఫలుడయ్యాడని పేర్కొన్నారు.

శ్రీనాథుడు తనకు ఆశ్రయమిచ్చి, విద్యాధికారి పదవినిచ్చిన రెడ్డిరాజుల ఆధిక్యతను సారస్వత కళారంగాల్లో చూపడానికై విజయనగర రాజ్యాల పండితులను ఓడించాడని, అక్కడ సంస్కృత పండితులతో ఏర్పడిన స్పర్థ కారణంగా తన పాండిత్య ప్రతిభ చూపడానికి శృంగారనైషధం, కాశీఖండం రచనలను ప్రౌఢంగా రచించాడని వివరించారు. శ్రీనాథుడి భోగలాలస జీవితం వలన అతడిని శృంగారి అని పేర్కొన్నారు. కాని ఇతడు నివసించిన కాలం ఆర్థింగా సంధికాలమని, రాజులు భోగలాలసులైనప్పటికీ, సామాన్య ప్రజలు చాలా దుర్భర జీవితాన్ని అనుభవించినట్లు శ్రీనాథుని చాటువులు తెలియచేస్తున్నాయి. చరమ దశలో సామాన్య ప్రజలు కూడా శ్రీనాథుడి దుర్భరజీవితం నుంచి ఆదుకోలేక పోయారంటే నాటి సామన్య ప్రజల జీవిత దుర్భరం తెలుస్తుందని వివరించారు.

తరువాత శ్రీనాథుని కాలం నాటి సాంఘిక, మత జీవితాన్ని వివరించారు. ఈ కాలం నాటికి వచ్చిన మార్పులను వ్యాస రచయిత వివరించారు. నాటికి బ్రాహ్మణుల జీవితంలో సైతం మార్పువచ్చిందని "బ్రాహ్మణులలో సైతం మద్యపానం, మాంసాహార భోజనం, మగువ పొందు సర్వ సాధారణమై పోయాయి. సుకుమారుడు, గుణనిధి, రామలింగని నిగమ శర్మకు అగ్రజులే. వీరు నాటి సమాజంలో నుంచి నడచి వచ్చిన సజీవ పాత్రలే."(చంద్రశేఖర్ రెడ్డి, డి (సంపా.): తెలుగు సాహిత్యం-చారిత్రక నేపథ్యం, పుట.65.) నాటి మతాన్ని గురించి వివరిస్తూ రెడ్డి రాజులు శైవమతాన్ని అనుసరించారని అన్యమత ధూషణ ఎక్కడా కనిపించదని అందుకు ఆనాటి వ్యసస్థ కూడా కారణం అని తెలిపారు.

ఇది వ్యాసం కావడం వలన ఇక్కడ కేవలం శ్రీనాథుడి కాలానికి సంబంధించిన జీవిత పరిచయం సాంఘిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యాన్ని పరిచయం చేశారు.

### 7.7.9. ప్రబంధ సాహిత్యాన్ని సృష్టించిన సమాజ స్వరూపం

ఈ వ్యాస రచయిత హెచ్. ఎస్. బ్రహ్మానంద. ఈయుగంలో కవి సమాజం నుంచి ప్రేరణ పొందింది తక్కువని పేర్కొన్నారు. సమాజాన్ని చూసీ చూడక కూడా నడిచిపోయారని ప్రజల కష్టనష్టాలకు, వారి నిరసనకు తమ కవిత్వాన్ని దూరంగా ఉంచారని వీరు పేర్కొన్నారు. ప్రబంధ సాహిత్యం పుట్టడానికి ఆనాటి రాజుల ప్రేరణ, కవి పండితుల సదస్సులు కారణంగా తెలిపారు. వీరు ఆనాటి సమాజాన్ని పరిశీలించి ఆ ప్రబంధాలు అలా పుట్టడానికి, జీవితాన్ని అలా వర్ణించడానికి గల నేపథ్యాన్ని వివరించారు.

### 7.7.10. పదిహేనవ శతాబ్ది తెలుగు సాహిత్యం రాజకీయ భూమిక

ఈ వ్యాస రచయిత జయరాములు. ఇందులో పదిహేనవ శతాబ్ది సాహిత్య నేపథ్యాన్ని పరిచయం చేశారు. కాకతీయ సామ్రాజ్య పతనంతో ఆంధ్రదేశం రాజకీయ సంక్షోభానికి గురైందని తరువాత కొండవీటీ రెడ్లు కొంత, రాచకొండ వెలమలు కొంత, విజయనగర రాజులు కొంత, కటకపు గజపతులు మరికొంత తెలుగు నేలను పంచుకొని పరిపాలన సాగించారని, అయితే వీరి కలహాల వలన బహమని రాజులు కూడా కొంత తెలుగు నేలను ఆక్రమించుకొన్నారని వివరించారు. ఆనాటిరాజులలో కొందరు స్వయంగా కవులైన వారు ఉన్నారని తెలిపారు. "ప్రోలయవేమారెడ్డి, అనపోతారెడ్డి, అనవేమారెడ్డి రాజమహేంద్రవరపు వీరభద్రారెడ్డి కూడా గొప్ప పండితులు స్వయంగా విద్వాంసులైన రాజులు కావడం చేత పైవారంతా పండితులను, కవులను పోషించారు. పండితులు రాజ సన్మానాలను పొందారు." (పైదే, పుట -46) ఆ కాలంలో వేశ్యా వృత్తి చట్టబద్ధంగా ఉండేదని, కొందరు వేశ్యలు సమాజంలోని ఇతర స్త్రీల కంటె గొప్పహోదా కలిగి ఉండడం సాధారణమైన విషయమని ఈ విషయం కూడా నాటి సాహిత్యంలో ప్రతిఫలించిందని, రాజులకు 'రాయవేశ్యా భుజంగుడు' అనే బిరుదు ఉండటం, దేవాలయాలలో, ఆయా ఉత్సవాలలో దేవదాసీలు నృత్యం చేయడం అనేవి నాటి సాహిత్యంలో కనిపిస్తున్న అంశాలగా వివరించారు (పైదే. పుట.53.)

### 7.7.11. 17, 18 శతాబ్దాల సాహిత్యం- సామాజిక రాజకీయ భూమిక

ఈ వ్యాస రచయిత పి.వి. చలపతిరావు. ఇతడు 17, 18 శతాబ్దాలలో వచ్చిన సాహిత్యం ఆధారంగా నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను వివరించాడు. ఇందుకోసం దక్షిణాంధ్ర యుగం, కుతుబ్ షాహిల పాలనలో వచ్చిన సాహిత్యానికి గల నేపథ్యాన్ని వివరించాడు. నాయక రాజుల కాలంలోని ప్రజల జీవన విధానాన్ని తెలిపాడు. నాయక రాజుల కాలం నాటి మతపరిస్థితులను, పరమత సహనాన్ని వివరించాడు. వీరు పునరుద్ధరించిన ఆలయాలను తెలిపాడు. కుతుబ్ షాహిల కాలంలో వచ్చిన అచ్చతెనుగు కావ్యాల అవతరణ గురించి వివరించారు. రాజుల ఆశ్రయాన్ని పొందకుండా ఉన్న కవులైన వేమన, బ్రహ్మంగారి గురించి, వారి రచన గురించి చెప్పారు. ఈ వ్యాసంలో కొత్తగా చెప్పిన అంశాలు ఏమీ కనపడవు. అంటే తక్కిన చరిత్ర పుస్తకాలలో కనిపించే సాంఘికపరమైన అంశాలయిన వర్ణవ్యవస్థ అంశాలు, మత పరంగా నాయకరాజులు అవలంభించిన పరమత సహనం వంటి వాటిని ఇతడు తిరిగి చెప్పారు. నాటి సమాజంలో ఆ సాహిత్యం అప్పుడు ఎందుకు అలా వచ్చిందో, సాంఘిక రాజకీయ పరిస్థితులు ఆ సాహిత్యం రావడానికి గల కారణాలు ఏమిటో వివరించింటే బాగుండేది. రచనలలోని అంశాలనే ఇతడు తిరిగి చెప్పాడు.

ఈ వ్యాసాలన్నీ కూడా కేవలం ఆయా కాలాలకు సంబంధించిన సాహిత్యానికి గల నేపథ్యాన్ని వివరించడంతో పాటు ఆయా సాహిత్యాలలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులను వివరించాయి. ఇవి సాహిత్యాన్ని ఒక కొత్త దృష్టితో చూసే ప్రయత్నం చేశాయి. అయితే ఇవి కేవలం వ్యాసాలు కావడం వలన అన్నీ విషయాలను చర్చించడానికి అవకాశం లేకపోయింది. అయినప్పటికీ తెలుగు సాహిత్యాన్ని అంతా కూడా మరొక దృష్టితో పరిశీలించడానికి అవకాశం కల్పించాయని చెప్పవచ్చు.

## 7.8. సాహిత్యచరిత్రల్లో కనిపించే చారిత్రక విమర్శ

కొందరు విమర్శకులు సాహిత్య చరితల్లో కూడా చారిత్రక విమర్శ కనిపిస్తుందని పేర్కొంటున్నారు. దానికి గల కారణం రచయితల జీవితాన్ని సాహిత్యంతో ముడి పెట్టడం జరిగింది. తెలుగులో దాదాపు 20 సాహిత్య చరిత్ర గ్రంథాలు ఉన్నట్లు తెలుస్తుంది. సాహిత్య చరిత్రల్లో కనిపించేది చారిత్రక విమర్శ అని చెప్పలేం. అందులో కవుల కాలనిర్ణయంలోనూ, కవులకు సంబంధించిన రచనల నిర్ణయంలో మాత్రమే చారిత్రక విమర్శ లక్షణం కనిపిస్తుంది. అలా కేవలం కవులకు సంబంధించిన కాలనిర్ణయాన్ని, ఏ రచనలు ఏ కవులవో నిర్ణయించినంత మాత్రాన వాటిలో చారిత్రక విమర్శ లక్షణాలున్నాయని చెప్పలేం. కాబట్టి వీటిని చారిత్రక విమర్శ కనిపించే రచనలుగా పేర్కొనలేం. అయితే కొన్ని సాహిత్య చరిత్ర గ్రంథాల్లో కొంత వరకు చారిత్రక విమర్శ లక్షణం కనిపిస్తుంది.

అలా కొంత చారిత్రక విమర్శానా పద్ధతిని అనుసరించి వెలువడిన సాహిత్య చరిత్రలు కల్లూరి వెంకట నారాయణ రావుగారి ఆంధ్ర వాఙ్మయచరిత్ర సంగ్రహము, చాగంటి శేషయ్యగారి ఆంధ్రకవితరంగిణి, ముదిగంటి సుజాతా రెడ్డిగారి చారిత్రక, సామాజిక, నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలను పేర్కొనవచ్చు. వీరు చరిత్రకు, సాహిత్యానికి, ఆ సాహిత్యం వెలువడటానికి గల కారణాలను విశ్లేషిస్తూ గ్రంథాలను రచించారని చెప్పవచ్చు. తక్కిన సాహిత్య చరిత్రలకు వీటికి గల భేదం ఇదే. అలాగనీ పూర్తి చారిత్రక విమర్శ లక్షణాలున్న గ్రంథాలుగా చెప్పలేం.

ఈ అధ్యాయంలో ఇప్పటి వరకు వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలను, సాంఘిక విమర్శనా గ్రంథాలను, వ్యాసాలను పరిశీలించిన తరువాత కొన్ని విషయాలు అవగతమవుతాయి. అందులో మొదట చెప్పుకోవాల్సినటువంటిది విమర్శకులు లేదా పరిశోధకులు సాహిత్యాన్ని చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిశీలించడం. గ్రంథం

మొత్తాన్ని చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిశీలించకపోయినప్పటికీ కొన్ని భాగాలు లేదా అధ్యాయాలు మాత్రం చారిత్రక విమర్శనా దృక్పథంతో విశ్లేషించినట్లుగానే కనిపిస్తుంది. కానీ, దివాకర్ల వెంకటావధాని గారి ఆంధ్రవాఙ్మయారంభదశ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి వేమన, కాత్యాయనీ విద్మహేగారి  చివరకు మిగిలేది నవల మానసిక సామాజిక జీవనస్రవంతి నవలా విమర్శ మొదలైన గ్రంథాలు మాత్రం చారిత్రక విమర్శనా పద్ధతిని ఉపయోగించి సాహిత్య రచనలను అనుశీలించారు.

రెండవ అంశంగా చెప్పదగినటువంటిది తెలుగు సాహిత్యం మొత్తంలో అక్కడక్కడ కొన్ని కొన్ని సాహిత్య రచనలను చారిత్రక విమర్శనా పద్ధతిలో పరిశీలించడం వలన సాహిత్య చరిత్రలో వచ్చిన పరిణామంతో పాటు ఆంధ్రుల చరిత్రను కూడా తెలుసుకోవడానికి అవకాశం కలిగింది. ఈ విధానంతో తెలుగు సాహిత్యాన్ని వివిధ కాలాల పరంగా, కవుల పరంగా పరిశీలిస్తే సాహిత్య చరిత్రలో వచ్చిన మార్పులు స్పష్టంగా, సరిగా అంచనా వేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

# సింహావలోకనం

# సింహావలోకనం

తెలుగు సాహిత్యం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సాహిత్యాన్ని పరిశీలిస్తే రెండు వర్గాలకు చెందిన కవులు/రచయితలు కనిపిస్తారు. ఒక వర్గం వారు సాహిత్యాన్ని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకొన్నట్లు కనిపిస్తుంది. అంటే కొందరు కవులు తమ ప్రయోజనం కోసం సాహిత్యాన్ని ఉపయోగించుకొని వ్యక్తిగతంగా లబ్ది పొందారు. రెండవ వర్గంవారు సమాజంకోసం సాహిత్యాన్ని సాధనంగా ఉపయోగించుకొన్నారు. ఆ క్రమంలో సమాజంలో పలురకాలైన మార్పులు వచ్చాయి. అలా సమాజంలో వచ్చిన మార్పులు సాహిత్యంపై కూడా ప్రభావం చూపాయి. ఆ మార్పులకు అనుగుణంగా కవులు కూడా తమ దృక్పథాన్ని మార్చుకొని రచనలు చేశారనే విషయం ఈ పరిశోధనా గ్రంథం ద్వారా అవగతమైంది. ఇప్పటి వరకు ఈ గ్రంథంలో తెలుగు సాహిత్యాన్ని చారిత్రక విమర్శనా పద్ధతిలో పరిశీలించడంతో పాటు తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శనా గ్రంథాలను సమీక్షించడం జరిగింది. సింహావలోకనంలో ఈ గ్రంథంలో చర్చించిన విషయాలను క్లుప్తంగా పరిచయం చేసే ముందు జరగవలసిన పరిశోధన గురించి వివరిస్తాను.

## జరగవలసిన పరిశోధన

ఇప్పటి వరకు ఈ సిద్ధాంత గ్రంథంలో తెలుగు సాహిత్యాన్ని చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిచయాత్మకంగా వివరించడం జరిగింది. అలా కాకుండా ఏ రచయితకు ఆ రచయితను ప్రత్యేకంగా చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిశీలించవచ్చు. ఉదాహరణకు దివాకర్ల వెంకటావధానిగారు నన్నయ భారతాన్ని తీసుకొని చారిత్రక విమర్శనా దృక్పథంతో వివరించారు. అలాగే తక్కిన కవులందరినీ పరిశీలించవచ్చు. అలా కాకుండా కేవలం ఆంధ్రమహాభారత కవులను మాత్రమే తీసుకొని కూడా పరిశీలించవచ్చు. ఆంధ్రమహాభారతం- చారిత్రక విమర్శ అనీ, శివకవులు-చారిత్రక

విమర్శ అనీ, శ్రీనాథ కవి-చారిత్రక విమర్శ, ప్రబంధ కవులు-చారిత్రక విమర్శ, దక్షిణాంధ్ర యుగ కవులు- చారిత్రక విమర్శ అనీ ఇలా పలు అంశాలను తీసుకొని చారిత్రక విమర్శనా దృక్పథంతో పరిశీలించవచ్చు. వీటితో పాటు ఆధునిక సాహిత్యాన్ని ఉద్యమ నేపథ్యంలోనూ, ఆయా ఉద్యమాల్లో ముఖ్యమైన కవి/రచయిత రచనలను ప్రత్యేకంగా పరిశీలించవచ్చు. ఉదాహరణకు అభ్యుదయ కవులు-చారిత్రక విమర్శ, విప్లవ కవులు- చారిత్రక విమర్శ వంటి అంశాలతో ఆధునిక సాహిత్యాన్ని పరిశీలించవచ్చు. వీటితోపాటు ప్రతి కవి/రచయితను చారిత్రక విమర్శనా దృక్పథంతో కూడా పరిశీలించవచ్చు. ఉదాహరణకు విశ్వనాథ సత్యనారాయణ రచనలు-చారిత్రక విమర్శ, శ్రీశ్రీ రచనలు-చారిత్రక విమర్శ, జాషువా రచనలు-చారిత్రక విమర్శ వంటి అంశాలతో సాహిత్యాన్ని పరిశీలించవచ్చు.

ఇలా పరిశీలించడం వల్ల సాహిత్యంలో వస్తున్న పరిణామాలు, ఆ పరిణామాలకు సమాజానికి గల సంబంధం, సమాజంలో వస్తున్న మార్పులకు రచయిత స్పందించిన తీరు వంటి అంశాలను అన్నింటినీ పరిశీలించవచ్చు. ఇక్కడ రచయిత+సమాజం=రచన అనే ఒక అంశం కూడా కనిపిస్తుంది. ప్రతి దశలోనూ ఏదో ఒక అంశానికి స్పందించి రచయిత రచన చేసినట్లుగా కనిపిస్తుంది. ఉదాహరణకు ఆధునిక సాహిత్యోద్యమాల్లో మొదటగా చెప్పే భావకవిత్వం పాశ్చాత్య దేశాల్లో వెలువడిన శతాబ్దాల కాలం తరువాత తెలుగులో వెలువడింది. కానీ ప్రస్తుతం ప్రపంచీకరణ అనేది పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన కాలంలోనే తెలుగులోనూ ప్రారంభమైంది. ప్రపంచీకరణపై పాశ్చాత్య దేశాల్లో వచ్చిన సాహిత్యాన్ని పరిశీలించకుండానే తెలుగులో ప్రపంచీకరణకు సంబంధించిన రచనలు వచ్చాయి. అన్నిచోట్ల ఏకకాలంలో ప్రపంచీకరణ సాహిత్యం వచ్చింది. ఇదంతా కూడా సమాజంలో వస్తున్న మార్పుల ఫలితంగా సాహిత్యంలో వచ్చిన మార్పు. ఇలా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించడం వలన ఒక కొత్త దృక్పథంతో సాహిత్యాన్ని అనుశీలించడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఈ సింహావలోకనంలో ఇప్పటివరకు సిద్ధాంత వ్యాసంలో చర్చించిన అంశాలను ఇక్కడ తిరిగి క్లుప్తంగా వివరిస్తాను.

## పరిశోధనావశ్యకత

ప్రస్తుతం ఇప్పటి వరకు వచ్చిన సాహిత్య విమర్శలో ఎక్కువగా ఒకటి రెండు పద్ధతులను మాత్రమే ఉపయోగించారు. ముఖ్యంగా ఒక సాహిత్య రచనను తీసుకొని అందులో ఆ రచనలో ఉండే గుణదోషాలను, అలంకారాలను, భాషాశైలిని విశ్లేషిస్తూ రచనలు చేశారు. ఈ విధానం వలన ఆ రచన యొక్క ఔన్నత్యాన్ని లేదా దోషాన్ని తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. సహజంగా సాహిత్యపరమైన అంశాల్లో మూడు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. అవి 1. రచన 2. రచయిత 3. పాఠకుడు. ఒక రచన వెలువడిందంటే అందుకు కారణం రచయిత/కవి. రచయిత మూలంగానే రచన పాఠకుడికి చేరుతుంది. పాఠకుడు ఒక రచనను చదివి ఆనందించిన లేదా ఆ రచనను తిరస్కరించినా ఆ గుణదోషాలు రచనతో పాటు పరోక్షంగా రచయితను కూడా తాకుతాయి. కాబట్టి ఆ రచనను విమర్శించదలుచుకున్నప్పుడు ఆ రచనను రచించిన రచయితను కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. కాని మనకు ఉన్న విమర్శనా పద్ధతుల ద్వారా రచయితను గురించి వివరించిన గ్రంథాలు చాలా తక్కువనే చెప్పాలి. పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన విమర్శనా పద్ధతుల ద్వారా రచనను, రచయితను, ఆ రచన వెలువడటానికి గల కారణాలను తెలుసుకొని, ఆ రచనను అవగాహన చేసుకొనే వెసులుబాటు కలిగింది. అలా రచయితను, రచనను, రచన రచించడానికిగల కారణాలను విశ్లేషించే పద్ధతి చారిత్రక విమర్శనా పద్ధతి.

ప్రస్తుతం ఈ పరిశోధనా గ్రంథంలో 'సాహిత్యాన్ని సాహిత్యేతర అంశాల ఆధారంగా పరిశీలించడం జరిగింది. దీని వలన రచనతో పాటు రచయితను గురించి, రచనలో కనిపించే సమాజం గురించి అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన విమర్శలో రచనకు సంబంధించిన విమర్శ ప్రధానంగా ఉండటంతో ఒక విధంగా రచయితను అప్రధానం చేసినట్లయింది. దానితో పాటు ముఖ్యంగా చరిత్ర ఆధారంగా సాహిత్యాన్ని అధ్యయనం చేయటం చారిత్రక విమర్శ ముఖ్య లక్షణం కాబట్టి చరిత్ర ఆధారంగా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించడం వలన సాహిత్యాన్ని విభిన్న పద్ధతిలో అధ్యయనం చేయటానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటి వరకు పరిశోధకులకు సాహిత్యాన్ని విభిన్న రకాలుగా ఆలోచించడానికి, ఆయా కాలంలో వచ్చిన మార్పుల ఫలితంగా సాహిత్యంలో వచ్చిన మార్పులు, రచయిత సమాజంలో పోషించిన పాత్ర మొదలైన విషయాలన్నీ తెలుసుకోవడానికి వీలవుతుంది.

ముఖ్యంగా ఇప్పటి వరకు, నా అవగాహన మేరకు చారిత్రక విమర్శ పద్ధతికి సంబంధించి కొన్ని వ్యాసాలు మాత్రమే వచ్చాయి. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరిగినట్లు కనిపించదు. ఈ విమర్శనా పద్ధతిలో పరిశోధన చేయటం వలన సాహిత్యాన్ని మరొక కోణంలో చూడటానికి అవకాశం కలిగిందనే అభిప్రాయంతో ఈ అంశం మీద పరిశోధన చేయటానికి నిశ్చయించుకొన్నాను.

## పరిశోధనా పరిమితి

పరిశోధనా పరిమితిని చెప్పాలంటే 'తెలుగు సాహిత్యం-చారిత్రక విమర్శ' అనే ఈ పరిశోధనా గ్రంథంలో ఉద్యమ రూపంగా కనిపించిన సాహిత్యం యొక్క చారిత్రక నేపథ్యాన్ని వివరించదలుచుకున్నాను. అందుకోసం ఆ ఉద్యమ ధోరణిలో కొనసాగిన వస్తువు ఉన్న రచనలను తీసుకొన్నాను. ఇది ప్రాచీన సాహిత్యానికి పరిమితం చేసుకొన్నాను. ఇక ఆధునిక సాహిత్యానికి వచ్చేటప్పటికీ ఆయా సాహిత్య ధోరణులు ప్రారంభం కావటానికి గల చారిత్రక నేపథ్యాన్ని మాత్రమే తీసుకొన్నాను. అందువలన ఈ గ్రంథంలో 'సాహిత్యపరమైన చర్చ తక్కువ ఉండి, రచయితకు సంబంధించిన చర్చ, ఆ రచన ఆ కాలంలో అలా వెలువడటానికి గల కారణాలకు సంబంధించిన చర్చ ఎక్కువగా కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యానికి వచ్చేటప్పటికీ ఆయా సాహిత్య

ఉద్యమాల నేపథ్యాన్ని వివరించాను.

ఇక్కడ అధ్యాయాల విభజన గురించి ఒక ముఖ్య విషయం చెప్పాలి. పరిశోధనాంశంలో ముఖ్య విషయం అధ్యాయాల విభజన. ఈ విభజనలో కవి రచించిన రచనా కాలాన్ని బట్టికాక రచనా వస్తువును బట్టి అధ్యాయాల్ని విభజించాను. దీని వల్ల కొన్ని చిక్కులున్నప్పటికీ పరిశోధనా సౌలభ్యం కోసం ఇలా చేయక తప్పలేదు. అందువల్ల కొన్నిచోట్ల కొందరు కవులు పునరావృతమైనారు. వారి రచనలు కూడా కాలక్రమానుగుణంగా లేవు. ఉదాహరణకు భారత రచన చారిత్రక నేపథ్యాన్ని వివరించేటపుడు తిక్కన గురించి చర్చించాను. అట్లే మరొక అధ్యాయంలో వైష్ణవసాహిత్యంలో కూడా నిర్వచనోత్తర రామాయణాన్ని గురించిన చర్చ వచ్చింది. ఆ సందర్భంలో తిక్కన గురించి మరోసారి చర్చించవలసి వచ్చింది. కాలక్రమం ప్రకారం నిర్వచనోత్తర రామాయణం ముందువచ్చి, ఆంధ్రమహాభారతం తర్వాత రావాలి. ఇది సాహిత్య చరిత్ర పరంగా సరైంది. కాని ఇక్కడ అధ్యాయాల విభజనలో నా పరిశోధనా సౌలభ్యం కోసం మార్పులు చేసుకొన్నాను. ఒక అధ్యాయంలో తిక్కన భారతాన్ని చర్చించి మరో అధ్యాయంలో నిర్వచనోత్తర రామాయణాన్ని చర్చించాను. దీనికి కారణం ఆంధ్ర మహాభారతాన్ని చర్చించేటప్పుడు కవిత్రయం రచించిన భారతాన్ని ఒక చోట చేర్చి విశ్లేషించాను. కాబట్టి అక్కడ నన్నయ భారతాన్ని గురించి చెప్పిన తర్వాత కొనసాగింపుగా తిక్కన గురించి, అతను రచించిన ఆంధ్రమహాభారతాన్ని గురించిన చర్చ వచ్చింది. ఇదే విధానాన్ని ఎర్రనకు పాటించాను. కవుల పేరు పునరావృతమైనప్పటికీ రచనా కాలానికి, వారి రచనా వస్తువుకు గల చారిత్రక నేపథ్యం మారుతూ ఉంటుంది. తర్వాత అధ్యాయాల విభజన కూడా అలాగే కొనసాగింది. భారత వస్తువును తీసికొని నన్నయ ప్రారంభించిన తర్వాత వెలువడిన సాహిత్య వస్తువు శైవ సాహిత్యం. తరువాత ప్రారంభమైంది వైష్ణవేతివృత్తాలు. ఇక్కడ కేవలం అధ్యాయ విభజన సౌలభ్యం కోసం మాత్రమే ఇలా చేశాను. అదే విధంగా ఆధునిక సాహిత్య ఉద్యమాలు కూడా ఉద్యమ నేపథ్య తీరును/విధానాన్ని బట్టి అధ్యాయ విభజన చేశాను.

కాలక్రమానుగుణంగా ఏర్పడిన సాహిత్య ఉద్యమాలను నా అధ్యయన సౌలభ్యం కోసం రెండు విధాలుగా విభజించాను. అవి ఒకటి పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించి స్థానిక పరిస్థితులకు అనుకూలంగా మారిన ఉద్యమ సాహిత్యం కాగా, కేవలం దేశీయ పరిస్థితుల ప్రభావంతో సాహిత్య ఉద్యమాలుగా రూపొందిన సాహిత్యం మరొకటి.

ఇక అధ్యాయాల పరంగా చూస్తే సిద్ధాంత గ్రంథాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించాను. **మొదటి అధ్యాయం విమర్శ - చారిత్రక విమర్శ - పరిచయం.** ఇందులో విమర్శకు సంబంధించిన పరిచయాన్ని, పలు విమర్శనా పద్ధతులను విశదం చేశాను. ఇంకా చారిత్రక విమర్శ, దాని లక్షణాలు, చారిత్రక విమర్శకుడి బాధ్యతలు, ఆ విమర్శ ప్రయోజనం మొదలైనవాటిని గురించి చెప్పాను. అలాగే చారిత్రక విమర్శకు ఇతర విమర్శనా పద్ధతులతో ఉన్న సంబంధాన్ని కూడా పేర్కొన్నాను.

**రెండో అధ్యాయం ఆంధ్రమహాభారతం - చారిత్రక విమర్శ.** ఈ అధ్యాయంలో కవిత్రయం గురించి వివరించి, వారు ఆయా కాలాల్లో ఆంధ్రమహాభారతం రచించడానికి దోహదం చేసిన పరిస్థితులను వివరించాను. ఇందులో కవిత్రయ ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి ప్రేరేపించిన కారణాలు కొన్ని ఆ రచనలోనే కనిపిస్తాయి. అయితే సాహిత్యానికి వెలుపల కూడా వివిధ కారణాలు కనిపిస్తున్నాయి. వాటన్నింటినీ ఇక్కడ విశ్లేషించాను. తరువాత నన్నయ, తిక్కన, ఎర్రనలు భారతాన్ని రచించే సమయంలో కనిపించే పలు సామ్యాలను వివరించాను. ఈ సామ్యాలను, రచనల నేపథ్యాన్ని అంతటినీ కూడా సాహిత్య ఆధారాలతోపాటు సాహిత్యేతర ఆధారాలతో కూడా విశ్లేషించాను.

**శైవసాహిత్యం-చారిత్రక విమర్శ** అనే **మూడో అధ్యాయం**లో శైవపరమైన అంశాలను పరిశీలించాను. ఇందులో బసవేశ్వరుడు వీరశైవ మతం స్థాపించడానికి గల సాహిత్యపరమైన కారణాలతో పాటు సాహిత్యేతర ఆధారాలతో వీరశైవ మత స్థాపన

గురించి చర్చించాను. ఇందులో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు... మొదలైన శైవకవుల రచనలు, వారు ఆయా కాలాల్లో, ఆయా రచనలను ఆ విధంగా రచించడానికి ప్రేరేపించిన సామాజిక పరిస్థితులను వివరించాను.

**వైష్ణవ సాహిత్యం - చారిత్రక విమర్శ** అనే **నాల్గో అధ్యాయం**లో వైష్ణవమత సంబంధమైన రచనలను మూడు విభాగాలుగా విభజించాను. (1) భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసిన కవులు. (2) ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవమత పరమైన రచనలు చేసిన కవులు. (3) వైష్ణవ మత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు అని మూడు విభాగాలుగా విభజించాను. ఆయా భాగాలలో ఆయా సంబంధిత రచనలు చేసిన కవులను చారిత్రక విమర్శనా పద్ధతిలో పరిశీలించాను

**ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ** అనే **ఐదో అధ్యాయం**లో పాశ్చాత్య ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి స్థానిక నేపథ్యం ఏర్పరుచుకొన్న ఉద్యమాలను గురించిన చర్చ ఉంటుంది. అంటే పాశ్చాత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించి ఇక్కడి పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకొని సాహిత్య ఉద్యమాలుగా మారిన భావకవిత్వోద్యమం, అభ్యుదయ సాహిత్యోద్యమం, దిగంబర కవిత్వోద్యమం, స్త్రీవాద సాహిత్యోద్యమం, ప్రపంచీకరణ సాహిత్యోద్యమాల నేపథ్యాన్ని గురించి వివరించాను.

**ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రాచ్య ప్రభావం- చారిత్రక విమర్శ** అనే **ఆరో అధ్యాయం**లో కేవలం దేశీయ పరిస్థితుల ప్రభావంతో సాహిత్య ఉద్యమాలుగా మారినవాటిని ఇక్కడ వివరించాను. ఇందులో విప్లవసాహిత్యం, దళితవాద సాహిత్యం, ప్రాంతీయవాద సాహిత్యం, మైనారిటీవాద సాహిత్య ఉద్యమాలను గురించి విశ్లేషించాను.

**తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు అనే ఏడో అధ్యాయం**లో ఇప్పటి వరకు వచ్చిన చారిత్రక విమర్శ గ్రంథాలను, వ్యాసాలను సమీక్షించాను. ఇందులో చారిత్రక విమర్శనా గ్రంథాలతోపాటు, సాంఘిక విమర్శనా గ్రంథాలను కూడా పేర్కొన్నాను. వీటితో పాటు కొన్ని గ్రంథాల్లో వచ్చిన చారిత్రక విమర్శనా వ్యాసాలను కూడా పరిశీలించాను.

## ముగింపు

చారిత్రక విమర్శనా పద్ధతి ద్వారా తెలుగు సాహిత్యాన్ని మరొక కోణంలో పరిశీలించడానికి అవకాశం కలిగింది. సహజంగా ఇప్పటి వరకు వచ్చిన సాహిత్య చరిత్ర గ్రంథాల్లో కవుల/రచయితల పేర్లు, వారి రచనల క్రమాన్ని, ఆ రచనల్లో కనిపించి కవితా లక్షణాలను పరిశీలించారు. చాలా సాహిత్య గ్రంథాల్లో ఇదే విధానం కనిపిస్తుంది. సాహిత్య విమర్శనా గ్రంథాల్లో కూడా రచన గుణదోషాలను పరిశీలించడం ఎక్కువగా కనిపిస్తుంది. కానీ చారిత్రక విమర్శ వల్ల ఆ రచన రచించడానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి వీలవుతున్నది. ఒక కవి/రచయిత రచనలు, ఆ రచన సమయంలో అతని మానసిక స్థితి తెలుసుకోవడానికి వీలవుతుంది. వీటితో పాటు ఆ రచనలో వర్ణితమైన సమాజాన్ని తెలుసుకోవచ్చు. ఫలితంగా ఇప్పటి సమాజంలో వచ్చిన మార్పులు, ప్రజల స్థితిగతులు తెలుస్తాయి.

చారిత్రక విమర్శ ద్వారా సాహిత్యానికి, సమాజానికి ఒక ప్రత్యేక ప్రయోజనం ఉంది. సహజంగా చరిత్రకారులు చరిత్ర రచించేటప్పుడు సాహిత్యాన్ని కూడా సాధనంగా వాడుకొంటారనే విషయం తెలిసిందే. కొందరు చరిత్రకారులు సాహిత్యంలో వాచ్యంగా చెప్పిన అంశాల ద్వారా కూడా చరిత్ర నిర్మాణానికి ప్రయత్నిస్తారు. కొన్ని సందర్భాల్లో కవి/రచయిత సమాజంలోని స్థితులను ధ్వన్యాత్మకంగా కూడా చెప్పే అవకాశం ఉంది. అన్ని సందర్భాల్లో చరిత్రకారుడు సాహిత్యంలో చెప్పిన ధ్వన్యాత్మక

విషయాన్ని గ్రహించలేకపోవచ్చు. కానీ చారిత్రక విమర్శకుడు సాహిత్యంతోనూ, విమర్శతోనూ సంపూర్ణ పరిచయాన్ని కలిగి ఉంటాడు కాబట్టి కవి/రచయిత చెప్పిన విషయాలను అవగాహన చేసుకొని సరైన చరిత్ర రచనకు సహాయపడగలడు. సాహితీవేత్తలకు సరైన సాహిత్య చరిత్రను అందివ్వగలడు. కాబట్టి తెలుగు సాహిత్యాన్ని చారిత్రక విమర్శతో పునఃపరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ఉపయుక్త గ్రంథాలు

# ఉపయుక్త గ్రంథాలు


1. అనంతకృష్ణశర్మ, రాళ్లపల్లి. వేమన. వైజాగ్: ఆంధ్ర విశ్వకళాపరిషత్, ఆంధ్ర యూనివర్సిటి, 1945.
2. అనంతం. తెలుగు సాహిత్యంలో కల్లోల క్షీణ దశాబ్దాలు 1965-1985. విశాఖపట్నం: వికాసిని ప్రచురణలు, 1988.
3. అన్నమాచార్యుల వారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు. (ద్వితీయ సంపుటం) (పురుషోత్తం, వాడ్రేవు. (సంపా.)) తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణ, 1980.
4. అప్సర్. ఆధునికత-అత్యాధునికత. తెనాలి: తెనాలి పోయట్రీ ఫోరమ్, 1993.
5. ఆధునిక సాహిత్యం-దళితస్పృహ. హైదరాబాదు: యువభారతి, 1993.
6. ఆనందమూర్తి, వేటూరి. వైష్ణవాంధ్ర వాఙ్మయము. హైదరాబాదు: ప్రభాకర ప్రచురణలు, 1986.
7. ఆనందారామం, సి. సమాజ సాహిత్యాలు. సికింద్రాబాదు: శేషాచలం అండ్ కంపెనీ, 1987.
8. ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యము-3. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్, 1990.
9. ఎఱ్ఱాప్రెగడ. హరివంశము. (శివరామశాస్త్రి, వేలూరి (సంపా.)) చెన్నపురి: వావిళ్ల రామస్వామి అండ్ సన్స్, 1967.
10. ఓబిరెడ్డి, కె. నవనాథచరిత్ర కావ్యానుశీలనము. అనంతపురం: _____, 1991.
11. ఓల్గా. తొలివెలుగులు. హైదరాబాదు: స్వేచ్ఛా ప్రచురణలు, 2003.
12. కన్నాబిరాన్ (సంపా.) మాకుగోడలు లేవు. హైదరాబాదు: స్వేచ్ఛా ప్రచురణలు, 1995.
13. కల్పన కన్నాబిరాన్., ఓల్గా, వసంత, కన్నాబిరాన్. (సంపా). సరిహద్దులు లేని

సంధ్యలు. హైదరాబాదు: స్వేచ్ఛా ప్రచురణలు, 1995.

14. కళావతి, వి. తెలుగులో వైష్ణవ క్షేత్ర మాహాత్మ్య కావ్యములు. తిరుపతి: శ్యామలా పబ్లికేషన్స్, 1988.

15. కాత్యాయనీ విద్మహే. ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాదభూమిక. వరంగల్: స్త్రీజనాభ్యుదయ సంస్థ, 2006.

16. __________. చివరకు మిగిలేది నవల మానసిక సామాజిక జీవన ప్రవంతి నవలా విమర్శ. వరంగల్: _____, 1987.

17. కామేశ్వరరావు, వేదుల. నాచన సోమనాథుడు-కావ్యానుశీలనము. పెద్దాపురం: లక్ష్మీపతి పబ్లికేషన్స్, 1986.

18. క్లారాజెట్కిన్. (ఫాతిమా (అను.)) స్త్రీ విముక్తి ఉద్యమాలు, హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్, 1997.

19. కృష్ణారావు, వాసిరెడ్డి. మహిళాభ్యుదయోద్యమ వాఙ్మయ పరిచయం. హన్మకొండ: చరణ్ పబ్లికేషన్స్, 1989.

20. కృష్ణారెడ్డి, కె. భారతదేశ చరిత్ర ఆధునిక యుగం. హైదరాబాదు: ఓరియంటల్ లాఙ్మన్, 1994.

21. కోటయ్య, నూతికట్టు. బసవేశ్వరచరిత్రము. కాకినాడ: శైవసేవాసమితి, 1975.

22. కోదండరామయ్య, తిమ్మావజ్ఝల. పాల్కురికి సోమనాథుడు- వీరశైవసిద్ధాంతము (రెండు సంపుటాలు). తిరుపతి: _____, 2001

23. కోదండరామిరెడ్డి, మరుపూరు (సంపా.). తిక్కన భారతము కర్ణపర్వము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1972.

24. గంగప్ప, ఎస్. వేయిపడగలు - విశ్లేషణాత్మక విమర్శ. గుంటూరు: శశీప్రచురణలు, 1987.

25. గోదావరీబాయి, సంధ్యావందనం. ఎఱ్ఱయ తీర్చిన హరివంశము. అనంతపురం: _____, 1985.

26. గోపి, ఎన్. ప్రజాకవి వేమన. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000. (2005)

27. గౌరన. నవనాథచరిత్ర. (రామకృష్ణయ్య,కోరాడ.(సంపా.)) మద్రాసు: మద్రాసు విశ్వవిద్యాలయాంధ్ర గ్రంథమాల, 1937.

28. గౌరిశంకర్, టి. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సామాజికస్పృహ. హైదరాబాదు: స్వీయప్రచురణ, 1987.

29. చంద్రశేఖర్ రెడ్డి, డి. తెలుగు సాహిత్యం-చారిత్రక నేపథ్యం. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్, 1994.

30. చిన్నారావు, యాగాటి. ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్, 2008.

31. జయకృష్ణ బాపూజి, జంధ్యాల. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము. గుంటూరు: _____, 1977.

32. జోగారావు, యస్వీ. సాహిత్యవల్లి. విజయవాడ: భువన విజయం పబ్లికేషన్స్, 1990.

33. తిక్కన. నిర్వచనోత్తరరామాయణము. (రామస్వామి, వావిళ్ల (సంపా.)) మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, 1916.

34. ______. ఆంధ్రమహాభారతము (విరాటపర్వము). (పూర్ణప్రజ్ఞాచార్య, పళ్ళె (సంపా.)). గుంటూరు: ఆంధ్ర గ్రంథమాల ప్రచురణ, 1934.

35. తిమ్మన. పారిజాతాపహరణము. చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, 1960.

36. తిరుపతిరావు, చన్నాప్రగడ. పారిజాతాపహరణము జగన్నాథ విజయముతో తులనాత్మక పరిశీలన. బెంగుళూరు:_____, 2000.

37. దక్షిణ భారత సాహిత్యములు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1962. (1979)

38. ధూర్జటి. శ్రీకాలహస్తి మాహాత్మ్యము. (లక్ష్మీనారాయణ శాస్త్రి, వేదము. (సంపా.)) మద్రాసు: వావిళ్ల రామస్వామి అండ్ సన్స్, 1966.

39. నన్నయ. ఆంధ్రమహాభారతము. (ఆది, సభా పర్వాలు) (లక్ష్మీరంజనం, కె., వెంకటావధాని, డి. (సంపా.)) హైదరాబాదు: తెలుగు డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్సిటి, 1968.

40. నన్నెచోడుడు. కుమార సంభవము. (మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. (వ్యాఖ్యాత.)) హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, 1994.

41. నరసింహశాస్త్రి, నోరి. సారస్వత వ్యాసాలు (ఐదవ సంపుటం). హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1979.

42. నాగభూషణ శర్మ, మొదలి. తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం. హైదరాబాదు: _____, 1970.

43. నారాయణాచార్యులు, పుట్టపర్తి. రాయలనాటి రసికత. కడప: విద్యోదయ పబ్లికేషన్స్, 1955. (1957)

44. నారాయణ రెడ్డి, సి.  ఆధునికాంధ్రకవిత్వము సంప్రదాయాలు ప్రయోగాలు. హైదరాబాదు: విశాలంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1965. (1999, 3 ముద్రణ.)

45. నిఖిలేశ్వర్. ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ధోరణులు. హైదరాబాదు: విశాలంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.

46. నిర్మల, తమ్మారెడ్డి. నన్నెచోడదేవ కుమార సంభవ పరిశీలనము. విజయవాడ: సత్యసూర్య ప్రచురణలు, 1989.

47. పరమేశ్వరయ్య, యడవల్లి. పోతన అన్నమయ్య సాహిత్య దృక్పథాలు. తిరుపతి: _____, 2008.

48. ప్రతాపరెడ్డి, సురవరం. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. హైదరాబాదు: సాహితీవైజయంతీ ప్రచురణ, 1949. (1982).

49. ప్రభాకరశాస్త్రి, వేటూరి. అన్నమాచార్య చరిత్రము. తిరుపతి: తిరుమల తిరుపతి

దేవస్థానమ్ ప్రెస్, 1949.

50. ప్రసాదరాయకులపతి. ఆంధ్ర భాగవత విమర్శ. గుంటూరు: _____, _____.

51. పార్వతీదేవి, దండెబోయిన. భాస్కర రామాయణంలో స్త్రీ పాత్రలు- సమీక్ష. కర్నూలు: శారదా పబ్లికేషన్స్, 2008.

52. పురుషోత్తం, బొడ్డుపల్లి. కాలిదాస కవిత. గుంటూరు: శ్రీగిరిజ ప్రచురణలు, 1978.

53. పురుషోత్తం, వావ్రేవు (సంపా.). అన్నమాచార్యుల వారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు - ద్వితీయ సంపుటం. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణ, 1980.

54. పోతన. శ్రీమహాభాగవతము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1983.

55. బలరామమూర్తి, ఏటుకూరి. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1953. (1985)

56. భట్, ఎస్, ఆర్. (శ్రీకంఠమూర్తి, జె.ఎన్. (అను.)) హిందూ ముస్లిం ఘర్షణలు వాటి సమస్యలు. హైదరాబాదు: విశాలంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1990.

57. మందేశ్వర రావు, వడలి. పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1994.

58. మల్లికార్జున పండితుడు. శివతత్వసారము. (వెంకటరావు, నిడదవోలు (సంపా.)). చెన్నపురి: ఆంధ్ర సాహిత్య పరిషత్తు, 1922.

59. మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక పరిచయం. న్యూఢిల్లీ: న్యూ విస్టా పబ్లికేషన్స్, 2002.

60. ముత్యం, కె. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం. హైదరాబాదు: _____, 1993.

61. మునిరత్నం, జె. అన్నమయ్య ఆళ్వారులు తులనాత్మక అధ్యయనం - I. తిరుపతి: కల్పనా పబ్లికేషన్స్, 1992.

62. మొల్ల, ఆతుకూరి. మొల్ల రామాయణము. (శ్రీనివాసాచార్యులు, బొమ్మకంటి (వ్యాఖ్యాత)) విజయవాడ: ఎమెస్కో, 2008.

63. యశోదారెడ్డి,పి. ఆంధ్ర సాహిత్య వికాసము. హైదరాబాదు: సుధర్మ పబ్లికేషన్స్, 1974.

64. రఘునాథనాయకుడు. వాల్మీకి చరిత్రము. (రామరాజు,బి.(పరిష్క ర్త)) హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1968.

65. రత్నమోహిని,వి. తెలుగుసాహిత్యము శైవమత ప్రభావము. (రెండు సంపుటాలు) హైదరాబాదు:_____, 1992.

66. రమాపతి రావు, అక్కిరాజు(సంపా.). నేటి తెలుగు సాహిత్య విమర్శ. హైదరాబాదు: సుపథ ప్రచురణ, 2004.

67. రంగనాథాచార్యులు, కె.కె. తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1990.

68. __________ (సంపా.)తెలుగు సాహిత్యం - మరోచూపు. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1990.

69. రవీంద్రారెడ్డి, ఎం. తెలుగు కవిత్వం పై మార్క్సిజం ప్రభావం. హైదరాబాదు: ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, 1984.

70. రాజేశ్వరశర్మ, అమరేశం. నన్నెచోడుని కవిత్వము. సికింద్రాబాదు: _____, 1958.

71. రాములు, బి.యస్. ప్రపంచీకరణ నేపథ్యంలో వేపచెట్టు తెలంగాణ కథలు. కరీంనగర్: విశాల సాహిత్య అకాడమి, 2003.

72. రాసాని, వి.ఆర్., నరేంద్ర, మధురాంతకం(సంపా). కథావార్షిక-2002. తిరుపతి: మధురాంతకం రాజారాం సాహితీసంస్థ, 2002.

73. రామకృష్ణమాచార్య, నండూరి. కవిత్రయము. భీమవరము: కవితా ప్రభాస ప్రచురణ, 1955.

74. రామకృష్ణయ్య, కోరాడ. ఆంధ్రభారత కవితావిమర్శనము. మద్రాసు: ఆంధ్ర పత్రిక ప్రెస్, 1929.

75. రామకృష్ణశాస్త్రి, శిష్టా. వీరశైవాంధ్రవాఙ్మయము. తిరుపతి: తిరుమల తిరుపతి ముద్రాక్షరశాల, 1952.

76. రామకోటిశాస్త్రి, కేతవరపు. మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు. హైదరాబాదు: నవోదయ. 1995.

77. రామచంద్ర, వి. ఎర్రాప్రెగడ. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1988.

78. రామబ్రహ్మం, బేతవోలు., సూర్యభాస్కరరావు, గొల్లకోట (సంపా.). నన్నయ భారతి (ప్రథమ సంపుటం). హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1993.

79. రామారావు, యస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ. సికింద్రాబాదు: పసిడి ప్రచురణలు, 1998.

80. లలితకుమారి, జి. ఆధునికాంధ్ర కవితాతత్వము. విశాఖపట్నం: వైజాగ్ ఇండస్ట్రియల్ ప్రింటింగ్, 1993.

81. లక్ష్మణచక్రవర్తి, సిహెచ్., వారిజారాణి,పి., విజయకుమారి,జి. (సంపా). ఆధునిక సాహిత్య విమర్శ రీతులు. హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ పి.జి. తెలుగు డిపార్ట్‌మెంట్, 2005.

82. లక్ష్మీకాంతం, పింగళి. సాహిత్య శిల్పసమీక్ష. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.

83. __________. ఆంధ్రసాహిత్య చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1974.

84. లక్ష్మీనారాయణరావు, భూపతి. భారతము - తిక్కన రచన. రాజమండ్రి: అద్దెపల్లి&కొ, 1949.

85. లింగన, పోశెట్టి. నవచోళ చరిత్ర. (ఆదినారాయణశాస్త్రి, పంచాగ్నుల.(సంపా.)) చెన్నపురి: ఆంధ్రపత్రికా కార్యాలయము, 1923.

86. వసంత కన్నాబిరాన్ (సంపా.). మాకుగోడలు లేవు. హైదరాబాదు: ఫెమినిస్టు స్టడీ సర్కిల్, 1989.

87. వీరభద్రయ్య, ముదిగొండ. విమర్శ మౌలిక లక్షణాలు. హైదరాబాదు: తెలుగు అకాడమి, 1990.

88. వీరభద్రరావు, చిలకూరి. ఆంధ్రుల చరిత్రము పార్ట్ -2, చెన్నపురి: విజ్ఞాన చంద్రికా మండలి, 1912.

89. ________. ఆంధ్రుల చరిత్రము పార్ట్ -3. రాజమహేంద్రపురము: మనోరమ ముద్రాక్షరశాల, 1916.

90. ________. తిక్కన సోమయాజి, మద్రాస్: శారదా పబ్లిషింగ్ కంపెనీ, 1917.

91. ________. కాకతీయాంధ్రరాజయుగ చరిత్రము. రాజమహేంద్రవరము: సుజనరంజనీ ముద్రణాలయం, 1936.

92. వీరాంజనేయశర్మ, అవంచ. తిక్కన నిర్వచనోత్తరరామాయణ సమాలోచనము. అనంతపురం: _____, 1988.

93. వీరేశలింగం పంతులు, కందుకూరి. స్వీయచరిత్రము. చెన్నపురి: పియర్ లెస్ ముద్రాక్షరశాల, 1911.

94. ________. ఆంధ్ర కవుల చరిత్రము. (ప్రథమభాగము) రాజమహేంద్రవరము: హితకారిణీ సమాజము, 1978.

95. వెంకట నారాయణ రావు, కె. ఆంధ్రవాఙ్మయ సంగ్రహము. మద్రాసు: వి. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1936.

96. వెంకట రమణమూర్తి, వైష్ణవ. తెలుగు సాహిత్యం కర్నూలు జిల్లా వైష్ణవక్షేత్ర సాహిత్యము. కర్నూలు: _____, 2002.

97. వెంకట రామకోటి శాస్త్రి, కేతవరపు. తిక్కన కావ్యశిల్పము. వరంగల్: వైఖరీ ప్రకాశనము, 1973.

98. వెంకట రామనరసింహం, కాకర్ల. సాహిత్య దర్శనము. విజయవాడ: గంగాధర

పబ్లికేషన్స్, 1985.

99. వెంకట రామనరసింహము, కాకర్ల. దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర. వాల్తేరు: _____, 1955.

100. వెంకటరావు, యన్. తెనుగు కవుల చరిత్ర. మద్రాసు: మద్రాసు విశ్వవిద్యాలయాంధ్ర గ్రంథమాల, 1953.

101. వెంకట రామయ్య, గంపా. ప్రపంచీకరణ కథలు-విమర్శనాత్మక పరిశీలన. హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం, 2005.

102. వెంకట రామరాజు, కలిసిండి. విజయవిలాసానుశీలనము. గుంటూరు: _____, 2002.

103. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. వల్లంపాటి సాహిత్య వ్యాసాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.

104. వెంకటావధాని, దివాకర్ల, ఆంధ్రవాఙ్మయారంభదశ. హైదరాబాదు: _____, 1960.

105. __________. సాహిత్య సోపానాలు. హైదరాబాదు: ఆంధ్రసారస్వత పరిషత్, 2003.

106. వేంకటాచార్య, కె. ఆముక్తమాల్యదలో విశిష్టాద్వైత సిద్ధాంత ప్రకాశం. (ప్రథమ సంపుటం) సికింద్రాబాదు: _____, 2004.

107. వైకుంఠం, యల్లంపల్లి (సంపా.). ఆధునిక ప్రపంచ చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి, 1992.

108. వైదేహి, అల్లాడి. ఆంధ్రుల సాంఘిక ఆర్థిక చరిత్ర. హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్, 2003.

19. శ్యామల, గోగు (సంపా). నల్లపొద్దు. హైదరాబాదు బుక్ ట్రస్ట్, 2003.

110. శిఖామణి. సమాంతర ఆధునిక కవిత్వ వ్యాసాలు. హైదరాబాదు: నందిని ప్రచురణలు, 2006.

111. శివప్రసాద్, ముదిగొండ. ఉద్యమదర్శనము. హైదరాబాదు: రసగంగోత్రి

ప్రచురణలు, 1990.

112. శేషయ్య, చాగంటి. ఆంధ్ర కవితరంగిణి. (నాలగవ సంపుటం) తూర్పుగోదావరి: హిందూ ధర్మశాస్త్ర గ్రంథ నిలయం, 1960.

113. శ్రీకృష్ణదేవరాయలు. ఆముక్తమాల్యద. (రామస్వామి, వావిళ్ల(వ్యాఖాత)). చెన్నపురి: వావిళ్లరామస్వామి అండ్ సన్స్, 1914.

114. శ్రీనాథుడు. శివరాత్రిమాహాత్మము. (సాంబమూర్తిశాస్త్రి, కజ్జా(సంపా.)) కాకినాడ: ఆంధ్రసాహిత్య పరిషత్, 1930.

115. శ్రీరామమూర్తి, కొర్లపాటి. శ్రీనాథుడు. గుంటూరు: కళాభారతి, 1980.

116. శ్రీరామమూర్తి, ధూళిపాళ. శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము. నల్గొండ: _____, _____.

117. శ్రీరామరాజు, నడుపల్లి, శివకవుల రచనలు సమాజం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1991.

118. సంజీవమ్మ, పి. సాహిత్య విమర్శ వ్యాసాలు. కడప: _____, 2004.

119. సత్యనారాయణ, అడప. అంధ్రప్రేదేశ్ లో నూరేండ్ల దళిత చరిత్ర. హైదరాబాదు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2009.

120. సింగన, మడికి. సకలనీతిసమ్మతము. (వెంకటరావు, నిడదవోలు,. శ్రీరామఅప్పారావు, పోణంగి. (సంపా.)) హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, _____.

121. సుజాతా రెడ్డి, ముదిగంటి: శ్రీనాథుని కవితాసౌందర్యం. హైదరాబాదు: _____, 1980.

122. __________ ( సంపా.). ముద్దెర. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2005.

123. సుబ్బమ్మ, మల్లాది. ఆంధ్రప్రదేశ్ లో మహిళోద్యమం: మహిళా సంఘాలు. హైదరాబాదు: ప్రజాస్వామ్య ప్రచురణ. 1985.

124. సుబ్బారావు, కొండా. పాండురంగ మాహాత్మ్యము రచనా సౌందర్యము.

గుంటూరు:1994 _____, 1994.

125. సుబ్బారెడ్డి, మద్దూరి. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం. తిరుపతి: రాగసుధ ప్రచురణలు, 1982.

126. సుబ్రహ్మణ్యం, జి,వి. ఆంధ్ర సాహిత్య విమర్శ పై ఆంగ్ల ప్రభావం. సికిందరాబాదు: యువభారతి, 1983.

127. _________. పురాణ వాఙ్మయము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1975.

128. _________. పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి. హైదరాబాద్: మాధవీ బుక్ సెంటర్, 1973.

129. _________. (సంపా.) సమాలోచనం. హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, 1980.

130. _________(సంపా). కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతము, ఆది పర్వము. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానము, 2003.

131. సోమనాథుడు, నాచన. ఉత్తరహరివంశము (సుబ్రహ్మణ్య శర్మ, వి. వి (సంపా.)). చెన్నపురి: 132. వావిళ్లరామస్వామి అండ్ సన్స్, 1937.

132. హనుమంతరావు, బి.యస్.యల్. ఆంధ్రుల చరిత్ర. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2003.

## English Books


1. Abrams, MH. A glossary of literary terms. Madras: Macmillan books, 1971.
2. Cuddon, John Anthony. A Dictionary of literary terms and literary theory. UK: Black well publishers Ltd, 1998.
3. Eliot, T.S: Selected prose T.S. Eliot. London: Faber & Faber, 1975.
4. Handy j William& Max West Brook ( Ed.). Twentieth century criticism: the major statements. New Delhi: Light & Life Publishers, 1974.
5. Jackson, J.R.de.J: Historical Criticism and Meaning of the Text. London: Rout ledge, 1989.
6. Joseph, P. Pickett (Ed.). The American Heritage Dictionary. United States of America: Houghton Mifflin Company, 2000.
7. Krishna murthy, Salva: A History of Telugu Literature Madras: Institute of Asian Studies, 1994.
8. Philip, Hobs Baum. Essentials Of Literary criticism. London: Thames and Hudson, 1983
9. Richards. I.A, principles of literary criticism London: New Delhi, Universal book, 1990.
10. Scott, s. Wilbur: Five Approaches of literary Criticism New York: Collier Books, 1962.
11. Shipley T.T: (Ed) A Dictionary of world literature. New Delhi: Cosmo Publications, 2008.

## నిఘంటువులు

తెలుగు - తెలుగు నిఘంటువు. హైదరాబాదు: తెలుగు అకాడమి, 2006. (రాధాకృష్ణ, బూదరాజు (సంపా.))

బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు. 1990

సూర్యనారాయాంధ్ర నిఘంటువు. సంపుటం-7. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1982.

## పత్రికలు

అభ్యుదయ

సృజన

# తెలుగు సాహిత్యం - చారిత్రక విమర్శ

పరిశోధన

**వెంకట రామయ్య గంపా**

(05HTPH04)

పర్యవేక్షణ

**ఆచార్య జి. అరుణ కుమారి**

పిహెచ్.డి. పట్టా కోసం
హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖకు
సమర్పించిన పరిశోధనా సార సంగ్రహం

**తెలుగుశాఖ**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు**

**2011**

# Telugu Sāhityaṃ-Cāritraka Vimarśa

A Thesis Submitted in Partial Fulfilment of the
Requirements for the Award of the Degree of

**DOCTOR OF PHILOSOPHY**
**IN**
**TELUGU**

By
**VENKATA RAMAIAH GAMPA**
(05HTPH04)

Research Supervisor
**Prof. G. ARUNA KUMARI**

## SYNOPSIS OF THE Ph.D. THESIS

**DEPARTMENT OF TELUGU**
**UNIVERSITY OF HYDERABAD**
**HYDERABAD**
**2011**

# తెలుగు సాహిత్యం - చారిత్రక విమర్శ

విశ్వవిద్యాలయాల్లో విమర్శ మీద ఇప్పటికే చాలా పరిశోధనలు జరిగాయి. అయినప్పటికీ చేయవలసిన కృషి ఇంకా మిగిలే ఉంది. సాహిత్య విమర్శలో కూడా వివిధ రకాల విమర్శనా పద్ధతులను ఉపయోగించి పరిశోధన చేసినప్పటికీ, కొన్ని విమర్శనా పద్ధతుల ద్వారా సాహిత్యాన్ని పరిశీలించినట్లు ఎక్కడా కనిపించదు. ముఖ్యంగా ఆంగ్ల సాహిత్య విమర్శలోని పలు పద్ధతులు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. కానీ ఇప్పటికీ విమర్శకులు స్పృశించని విమర్శనా పద్ధతులు చాలా ఉన్నాయి. అలా ఉన్న విమర్శనా పద్ధతుల్లో చారిత్రక విమర్శనా పద్ధతి కూడా ఒకటి. ఈ సిద్ధాంత గ్రంథంలో ఈ చారిత్రక విమర్శనా పద్ధతిని ఉపయోగించి తెలుగు సాహిత్యాన్ని పరిశీలించటానికి ప్రయత్నం చేశాను. అందుకోసం నా పరిశోధనకు తీసుకొన్న అంశం పేరు *'తెలుగు సాహిత్యం- చారిత్రక విమర్శ'.*

## పరిశోధనావశ్యకత

ప్రాచ్య పాశ్చాత్య విమర్శనా పద్ధతులను పరిశీలిస్తే దాదాపు నలభైకి పైగానే విమర్శనా పద్ధతులున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పలు పాశ్చాత్య సాహిత్య విమర్శనా పద్ధతులు వ్యాప్తిలో ఉన్నాయి. వారు ఆ పద్ధతులన్నింటినీ ఉపయోగించి విమర్శ చేసినట్లు కనిపిస్తుంది. విమర్శనా పద్ధతులన్నిటినీ ఉపయోగించి సాహిత్యాన్ని పరిశీలించడం వల్ల సాహిత్యాన్ని వివిధ కోణాల నుంచి పరిశీలించవచ్చు.

ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన సాహిత్య విమర్శలో ఎక్కువగా ఒకటి రెండు పద్ధతులను మాత్రమే ఉపయోగించారు. ముఖ్యంగా ఒక సాహిత్య రచనను తీసికొని ఆ రచనలోని గుణదోషాలను, అలంకారాలను, భాషాశైలిని విశ్లేషిస్తూ రచనలు చేశారు. ఈ విధానం వలన ఆ రచన యొక్క ఔన్నత్యాన్ని లేదా దోషాన్ని తెలుసుకోవడానికి వీలు

కలుగుతుంది. సహజంగా సాహిత్యపరమైన అంశాల్లో మూడు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. అవి 1. రచన 2. రచయిత 3. పాఠకుడు. ఒక రచన వెలువడిందంటే అందుకు కారణం రచయిత/కవి. రచయిత మూలంగానే రచన పాఠకుడికి చేరుతుంది. పాఠకుడు ఒక రచనను చదివి ఆనందించినా లేదా ఆ రచనను తిరస్కరించినా ఆ గుణదోషాలు రచనతో పాటు పరోక్షంగా రచయితను కూడా తాకుతాయి. కాబట్టి ఆ రచనను విమర్శించదలుచుకున్నప్పుడు ఆ రచనను రచించిన రచయితను కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. కాని మనకు ఉన్న విమర్శనా పద్ధతుల ద్వారా రచయితను గురించి వివరించిన గ్రంథాలు చాలా తక్కువనే చెప్పాలి. పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన విమర్శనా పద్ధతుల ద్వారా రచనను, రచయితను, ఆ రచన వెలువడటానికి గల కారణాలను తెలుసుకొని, ఆ రచనను అవగాహన చేసుకొనే వెసులుబాటు కలుగుతుంది. అలా రచయితను, రచనను, దాన్ని రచించడానికిగల కారణాలను విశ్లేషించే పద్ధతి చారిత్రక విమర్శనా పద్ధతి అనవచ్చు.

సాధారణంగా సాహిత్యం ద్వారా పలు అంశాలను అర్థం చేసుకొని, వాటిని అధ్యయనం చేయటం జరుగుతున్నది. కాని చారిత్రక విమర్శలో సాహిత్యేతర అంశాల ద్వారా సాహిత్యాన్ని అధ్యయనం చేయటం జరుగుతుంది. చరిత్ర ఆధారంగా చేసుకొని సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అనేది చారిత్రక విమర్శలో ముఖ్యమైన అంశం. సహజంగా చరిత్ర రచనకు సాహిత్యంతో పాటు, నాణేలు, శాసనాలు మొదలైనవి ఆధారం అనేది అందరికి తెలిసిన విషయం. కాబట్టి సాహిత్యాన్ని చరిత్ర ఆధారం చేసుకొని పరిశీలించడం వల్ల రచనలో ఉన్న సమాజాన్ని, ఆ రచనను రచించిన రచయితను బాగా అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన విమర్శలో రచనకు సంబంధించిన విమర్శ ప్రధానంగా ఉండటంతో ఒక విధంగా రచయితను అప్రధానం చేసినట్లయింది. దానితో పాటు

చరిత్ర ఆధారంగా సాహిత్యాన్ని అధ్యయనం చేయటం చారిత్రక విమర్శ ముఖ్య లక్షణం. కాబట్టి, చరిత్ర ఆధారంగా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించడం వల్ల సాహిత్యాన్ని విభిన్న పద్ధతిలో అధ్యయనం చేయటానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటి వరకు పరిశోధకులకు సాహిత్యాన్ని అనేక రకాలుగా ఆలోచించడానికి, ఆయా కాలంలో వచ్చిన మార్పుల ఫలితంగా సాహిత్యంలో వచ్చిన మార్పులు, రచయిత సమాజంలో పోషించిన పాత్ర మొదలైన విషయాలన్నీ తెలుసుకోవడానికి వీలవుతుంది.

ఇప్పటి వరకు, నా అవగాహన మేరకు చారిత్రక విమర్శ పద్ధతికి సంబంధించి కొన్ని వ్యాసాలు మాత్రమే వచ్చాయి. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరిగినట్లు కనిపించదు. ఈ విమర్శనా పద్ధతిలో పరిశోధన చేయటం వలన సాహిత్యాన్ని మరొక కోణంలో చూడటానికి అవకాశం కలుగుతుందనే అభిప్రాయంతో ఈ అంశం మీద పరిశోధన చేయటానికి నిశ్చయించుకొన్నాను.

## పరిశోధనా పరిమితి

ఈ పరిశోధన అనేది తెలుగు సాహిత్యాన్నంతటినీ పరిశీలించటం కాబట్టి కొన్ని పరిమితులను విధించుకొన్నాను. అందులో ప్రాచీన సాహిత్యాన్ని వివరించేటప్పుడు అవతారికలకు మాత్రమే పరిమితం చేసుకొన్నాను. అలాగే ఆధునిక సాహిత్యానికి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు సాహిత్య ఉద్యమ నేపథ్యాన్ని మాత్రమే పరిశీలించాను. పరిశోధనా పరిమితిని ఈ విధంగా విధించుకోవటానికి గల కారణాలను సిద్ధాంత గ్రంథంలో వివరించాను.

## పరిశోధనా ప్రణాళిక

పరిశోధనను ఏడు అధ్యాయాలుగా విభజించుకొన్నాను

1. విమర్శ - చారిత్రక విమర్శ- పరిచయం

2. ఆంధ్రమహాభారతం - చారిత్రక విమర్శ

3. శైవసాహిత్యం - చారిత్రక విమర్శ

4. వైష్ణవ సాహిత్యం - చారిత్రక విమర్శ

5. ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ

6. ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రాచ్య ప్రభావం - చారిత్రక విమర్శ

7. తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు

సింహావలోకనం

ఉపయుక్త గ్రంథసూచిక

## 1. విమర్శ - చారిత్రక విమర్శ - పరిచయం

ఈ అధ్యాయంలో విమర్శకు సంబంధించిన పరిచయాన్ని, పలు రకాల విమర్శనా పద్ధతులను పరిచయం చేశాను. ఇంకా చారిత్రక విమర్శను గురించి, చారిత్రక విమర్శ లక్షణాలు, చారిత్రక విమర్శకుడి బాధ్యతలు, చారిత్రక విమర్శకుడి ముందున్న సమస్యలు, చారిత్రక విమర్శ ప్రయోజనం మొదలైన అంశాల గురించి వివరించాను. ఇంకా చారిత్రక విమర్శకు ఇతర విమర్శలతో ఉన్న సంబంధంలో చారిత్రక విమర్శ-గ్రంథ పరిష్కరణ విమర్శ, చారిత్రక విమర్శ-కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ, చారిత్రక విమర్శ-మనోవైజ్ఞానిక విమర్శ, చారిత్రక విమర్శ-సాంఘిక విమర్శ, చారిత్రక విమర్శ-మార్క్సిస్టు విమర్శల మధ్య గల సంబంధాన్ని వివరించాను.

## 2. ఆంధ్రమహాభారతం - చారిత్రక విమర్శ

రెండవ అధ్యాయంలో ఆంధ్రమహాభారత కవులైన నన్నయ, తిక్కన, ఎర్రనల గురించి వివరించి వారు ఆయా కాలాల్లో ఆంధ్రమహాభారతాన్ని రచించడానికిగల కారణాలను, అందుకు దోహదం చేసిన పరిస్థితులను పేర్కొన్నాను. ఇందులో నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించడానికి కనిపించే కారణాలు కొన్ని ఆ రచనలోనే కనిపిస్తాయి.

అయితే సాహిత్యానికి వెలుపల కూడా పలుకారణాలున్నాయి. వాటన్నిటినీ ఇక్కడ పరిశీలించాను. కవిత్రయం మహాభారతాన్ని రచించడానికి గల కారణాలను చారిత్రక విమర్శనా దృక్పథంతో విశ్లేషించాను. తరువాత నన్నయ, తిక్కన, ఎర్రనలు భారతాన్ని రచించే సమయంలో కనిపించే సామ్యాలను వివరించాను. ఈ సామ్యాలను, రచనల నేపథ్యాన్ని అంతటినీ కూడా సాహిత్య ఆధారాలతోపాటు సాహిత్యేతర ఆధారాలతో విశ్లేషించాను.

### 3. శైవసాహిత్యం - చారిత్రక విమర్శ

మూడవ అధ్యాయంలో శైవపరమైన రచనలను పరిశీలించాను. ఇందులో బసవేశ్వరుడు వీరశైవ మతం స్థాపించడానికి గల సాహిత్య కారణాలతో పాటు సాహిత్యేతర అంశాల్లో లభిస్తున్న ఆధారాలతో వీరశైవ మత స్థాపన గురించి చర్చించాను. ఇందులో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, యథావాక్కుల అన్నమయ్య, కాసే సర్వప్ప, గౌరన, శ్రీనాథుడు, పోశెట్టి లింగన, ధూర్జటి కవుల శైవ రచనలను, వారు ఆయా కాలాల్లో, ఆయా రచనలను ఆ విధంగా రచించడానికి గల కారణాలను, నాటి సామాజిక పరిస్థితులను వివరించాను.

### 4. వైష్ణవ సాహిత్యం - చారిత్రక విమర్శ

ఈ అధ్యాయంలో వైష్ణవమత సంబంధమైన రచనలను మూడు విభాగాలుగా విభజించాను.

(1) భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసినకవులు.

(2) ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవ మతపరమైన రచనలు చేసిన కవులు

(3) వైష్ణవ మత వ్యాప్తి కోసం రచనలు చేసిన కవులు అని మూడు విభాగాలుగా విభజించాను. భక్తితో వైష్ణవ సంబంధమైన రచనలు చేసినవారు అనే విభాగం కింద ఉత్తర హరివంశము, ఆంధ్రమహాభాగవతము, మొల్ల రామాయణ గ్రంథాలను చారిత్రక విమర్శనా

దృక్పథంతో చర్చించాను. ఇతరుల కోసం, స్వప్రయోజనం కోసం వైష్ణవమత పరమైన రచనలు చేసిన కవులు అనే విభాగంలో నిర్వచనోత్తర రామాయణము, హరివంశము, భాస్కర రామాయణము, జైమినిభారతము, పారిజాతాపహరణము, పాండురంగ మాహాత్మ్యము గ్రంథాలను విశ్లేషించాను. వైష్ణవ మత వ్యాప్తికోసం రచనలు చేసిన కవులు అనే మూడవ భాగంలో అన్నమయ్య కీర్తనలు - కృతుల నేపథ్యాన్ని, రంగనాథ రామాయణము, ఆముక్తమాల్యద, వాల్మీకి చరిత్రము గ్రంథాలను పరిశీలించాను

## 5. ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - పాశ్చాత్య ప్రభావం - చారిత్రక విమర్శ

ఈ అధ్యాయంలో పాశ్చాత్య ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి స్థానిక నేపథ్యం ఏర్పరుచుకొన్న ఉద్యమాలను చర్చించాను. అంటే పాశ్చాత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించి ఇక్కడి పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకొని సాహిత్య ఉద్యమాలుగా మారిన భావకవిత్వోద్యమం, అభ్యుదయ కవిత్వోద్యమం, దిగంబర కవిత్వోద్యమం, స్త్రీవాద సాహిత్యోద్యమం, ప్రపంచీకరణ సాహిత్యోద్యమాల నేపథ్యాన్ని వివరించాను.

## 6. ఆధునిక తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రాచ్య ప్రభావం - చారిత్రక విమర్శ

అధ్యాయంలో కేవలం ఇక్కడి దేశీయ పరిస్థితుల ప్రభావంతో సాహిత్య ఉద్యమాలుగా మారినటువంటి సాహిత్య ఉద్యమాలు/ధోరణులను ఇక్కడ వివరించడం జరిగింది. అందులో విప్లవసాహిత్యం, దళితవాద సాహిత్యం, ప్రాంతీయవాద సాహిత్యం, మైనారిటీవాద సాహిత్య ఉద్యమాలను గురించి పేర్కొన్నాను.

## 7. తెలుగులో వచ్చిన చారిత్రక విమర్శ రచనలు

ఈ అధ్యాయంలో ఇప్పటి వరకు వచ్చిన చారిత్రక విమర్శ గ్రంథాలను, వ్యాసాలను సమీక్షించాను. ఇందులో చారిత్రక విమర్శనా గ్రంథాలతోపాటు, సాంఘిక విమర్శ

గ్రంథాలను కూడా పేర్కొన్నాను. వీటితో పాటు కొన్ని గ్రంథాలలో వచ్చిన చారిత్రక విమర్శనా వ్యాసాలను కూడా పరిశీలించాను. ఇందులో పరిశీలించిన గ్రంథాలు ఆంధ్రవాఙ్మయారంభ దశ, ఆంధ్రభారత కవితా విమర్శనము, నన్నెచోడదేవ కుమార సంభవ పరిశీలనము, నవనాథచరిత్ర- కావ్యానుశీలనము, ఆంధ్ర భాగవత విమర్శ, శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము పాండురంగ మాహాత్మ్యము రచన సౌందర్యము, విజయ విలాసానుశీలనము, వేమన... మొదలైన గ్రంథాలను ఈ అధ్యాయంలో వివరించాను

ఉపసంహారంలో ఇంకా ఈ విమర్శనా విధానంతో సాహిత్యంలో జరగవలసిన పరిశోధన గురించి వివరించాను. దీనితో పాటు ఈ పరిశోధనా సారాంశాన్ని వివరించాను.